కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణము

తృతీయకాండము - ప్రథమ భాగము

ఏకాదశ సంపుటము

వేదార్థదీపికాసహితము - (ప్రతిపదార్థ & తాత్పర్యములు)

బ్రహ్మశ్రీ రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి

సంపాదకులు

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు, తి.తి.దే.,

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

2025

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణము

తృతీయ కాండము

ప్రథమ భాగము

ఏకాదశ సంపుటము

వేదార్థదీపికాసహితము - (ప్రతిపదార్థ & తాత్పర్యములు)

బ్రహ్మశ్రీ రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి

సంపాదకులు

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ

ఎమ్.ఎ. (సంస్కృతం), ఎమ్.ఎ. (తెలుగు), పిహెచ్.డి.,

ప్రత్యేకాధికారి

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2025

Krishna Yajurvediya Taittiriya Brahmanamu

with Telugu Commentary Vedarthadeepikasahithamu

Third Canto (Part-1) Eleventh Volume

Vedarthadeepikasahithamu commentary by

Brahmasri Ramavarapu Krishnamurthy Sastry

Editor:

Dr. Akella Vibhishana Sarma

M.A.(Sanskrit) M.A.(Telugu) Ph.D.,

Special Officer, Purana Itihasa Project

T.T.Devasthanams, Tirupati.

T.T.D. Religious Publications Series No.1384

© All Rights Reserved

First Edition : 2025

Copies:

Published by:

J.Syamala Rao, I.A.S.,

Executive Officer,

Tirumala Tirupati Devasthanams,

Tirupati -517501

Cover Design & D.T.P. Type Setting:

Office of the Special Officer, Purana Itihasa Project,

TTD,Tirupati.

Printed at:

Tirumala Tirupati Devasthanams Press

Tirupati - 517 507.



శ్రీపద్మావతిఅమ్మవారు

శ్రీవేంకటేశ్వరస్వామివారు

అంకితము

వేదార్థ జ్ఞాన సులభో యోగి మానస గోచరః ।
వేదార్థ దీపికా మేతాం స్వీకరోతు శ్రియఃపతిః ॥
శ్రీదయితుడు శ్రిత సులభుడు
వేదమయుఁడు వేదవేత్త వేంకటపతికీ
వేదార్థ దీపికా కృతి
మోదమ్మున నొసఁగి శ్రేయమును గడియింతున్.

-బ్రహ్మశ్రీ రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణము వేదార్థ దీపికా సహితము

విషయానుక్రమణిక

		విషయం	పుటసంఖ్య
తొలిపలుకు			1
నివేదన			2
ప్రథమ ప్రపాఠకము	–	**నక్షత్రేష్ట్యాదికమైన కర్మ**	1
ప్రథమానువాకము	–	దేవ నక్షత్ర యాజ్యాపురోనువాక్యలు	1
ద్వితీయానువాకము	–	యమ నక్షత్ర యాజ్యాపురోనువాక్యలు	14
తృతీయానువాకము	–	చాంద్రమసాదీష్టి యాజ్యాపురోనువాక్యాలు	27
చతుర్థానువాకము	–	దేవ నక్షత్రేష్టులు	31
పంచమానువాకము	–	యమ నక్షత్రేష్టులు	45
షష్ఠానువాకము	–	చంద్రమః ప్రభృతీష్టులు	57
ద్వితీయ ప్రపాఠకము	–	**నక్షత్రేష్ట్యాదికమైన కర్మ**	64
ప్రథమానువాకము	–	వత్సాపకరణార్థ మంత్రములు	64
ద్వితీయానువాకము	–	బర్హిరాహరణార్థ బ్రాహ్మణము	72
తృతీయానువాకము	–	దోహన మంత్ర బ్రాహ్మణము	84
చతుర్థానువాకము	–	హవిర్నిర్వాప మంత్ర బ్రాహ్మణము	100
పంచమానువాకము	–	వ్రీహ్యవఘాత మంత్ర బ్రాహ్మణము	110
షష్ఠానువాకము	–	తండులప్రేషణ మంత్ర బ్రాహ్మణము	124
సప్తమానువాకము	–	కపాలోపధానార్థ మంత్ర బ్రాహ్మణము	129
అష్టమానువాకము	–	పురోడాశ నిష్పాదనార్థ మంత్ర బ్రాహ్మణము	136
నవమానువాకము	–	వేదికరణార్థ మంత్ర బ్రాహ్మణము	148
దశమానువాకము	–	వేదికరణార్థ మంత్ర బ్రాహ్మణము	164
తృతీయ ప్రపాఠకము	–	**నక్షత్రేష్ట్యాదికమైన కర్మ**	168
ప్రథమానువాకము	–	అజ్యాది హవిర్గ్రహణార్థ మంత్ర బ్రాహ్మణము	168
ద్వితీయానువాకము	–	అజ్యాది హవిర్గ్రహణార్థ మంత్ర బ్రాహ్మణము	174
తృతీయానువాకము	–	అజ్యాది హవిర్గ్రహణార్థ మంత్ర బ్రాహ్మణము	180
చతుర్థానువాకము	–	అజ్యాది హవిర్గ్రహణార్థ మంత్ర బ్రాహ్మణము	186
పంచమానువాకము	–	అజ్యాది హవిర్గ్రహణార్థ మంత్ర బ్రాహ్మణము	193
షష్ఠానువాకము	–	ఇధ్మసన్నహనాద్యర్థ మంత్ర బ్రాహ్మణము	198
సప్తమానువాకము	–	అఘారార్థ మంత్ర బ్రాహ్మణము	209
అష్టమానువాకము	–	స్రుగ్వ్యూహనాది మంత్ర బ్రాహ్మణము	221
నవమానువాకము	–	స్రుగ్వ్యూహనాది మంత్ర బ్రాహ్మణము	232

దశమానువాకము	–	స్రుగ్వ్యూహనాది మంత్ర బ్రాహ్మణము.....244
ఏకాదశానువాకము	–	స్రుగ్వ్యూహనాది మంత్ర బ్రాహ్మణము.....249
చతుర్థ ప్రపాఠకము	**–**	**పురుష మేధము**.....254
పంచమ ప్రపాఠకము	**–**	**హోతృ జపమంత్రము**.....274
ప్రథమానువాకము	–	సామిధేనీ మంత్రములు.....274
ద్వితీయానువాకము	–	సామిధేనీ మంత్రములు.....275
తృతీయానువాకము	–	సామిధేనీ మంత్రములు.....279
చతుర్థానువాకము	–	స్రుగాదాపన మంత్రములు.....280
పంచమానువాకము	–	ప్రయాజ మంత్రములు.....282
షష్ఠానువాకము	–	ఆజ్యభాగ దేవత మంత్రములు.....284
సప్తమానువాకము	–	యాజ్యానువాక్యా మంత్రములు.....286
అష్టమానువాకము	–	ఇడోపాహ్వాన విధి మంత్రములు.....294
నవమానువాకము	–	అనూయాజ మంత్రములు 297
దశమానువాకము	–	అనూయాజ సూక్తవాకాభిధానము.....299
ఏకాదశానువాకము	–	శంయువాక మంత్రాభిధానము.....303
ద్వాదశానువాకము	–	పత్నీసంయాజ యాజ్యానువాక్యాభిధానము 304
త్రయోదశానువాకము	–	ఇడోపాహ్వానవిధి మంత్రములు.....307
షష్ఠ ప్రపాఠకము	**–**	**హౌత్రపాశుకము**.....309
ప్రథమానువాకము	–	యూప సంస్కారములు.....309
ద్వితీయానువాకము	–	ప్రయాజవిషయ ప్రైష మంత్రములు.....314
తృతీయానువాకము	–	ఆప్రీ సంజ్ఞక ప్రయాజ యాజ్యలు.....321
చతుర్థానువాకము	–	పర్యగ్నికరణీయ ఋక్కులు.....327
పంచమానువాకము	–	మైత్రావరుణ ప్రైష మంత్రము.....329
షష్ఠానువాకము	–	అధ్రిగు ప్రైష మంత్రము.....330
సప్తమానువాకము	–	స్తోకవిషయ మైత్రావరుణానువచనము.....333
అష్టమానువాకము	–	వపాపురోడాశ స్విష్టకృత్పురోనువాక్యా ప్రైష మంత్రములు.....336
నవమానువాకము	–	వపాపురోడాశ స్విష్టకృద్యాజ్యలు.....339
దశమానువాకము	–	మనోతా సూక్తము.....341
ఏకాదశానువాకము	–	హవిర్వనస్పతి స్విష్టకృత్తులకు పురోనువాక్యలు, ప్రైషలు.....348
ద్వాదశానువాకము	–	హవిర్వనస్పతి స్విష్టకృత్తులకు యాజ్యలు.....353
త్రయోదశానువాకము	–	అనూయాజ దేవతలకు మైత్రావరుణ ప్రైషలు.....356
చతుర్దశానువాకము	–	అనూయాజ దేవతలకు యాజ్యలు.....364
పంచదశానువాకము	–	సూక్తవాకవిషయ మైత్రావరుణ ప్రైష 367

తొలిపలుకు

"ఓం నమో వేంకటేశాయ"

శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

ప్రపంచంలోని భాషలలో సంస్కృతం అతిప్రాచీనమనడంలో సందేహం లేదు. అలాంటి సంస్కృత సాహిత్యంలో వేదాలు అతిప్రాచీనమనడాన్ని పాశ్చాత్యవిద్వాంసులు కూడా ముక్తకంఠంతో అంగీకరించినవారే. భారతీయ సంస్కృతికి, తత్త్వజ్ఞానానికి పరంపరగా వస్తున్న అఖండధర్మవాహినికి మూలధనం వేదాలు. ఈ వేదాన్ని వేదవ్యాసమహర్షి సుదూరదృష్టితో ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదమని నాలుగు భాగాలుగా వర్గీకరించాడు. ఈ నాలుగింటికే గాక మంత్ర, బ్రాహ్మణాలు రెంటినీ వేదమనే వ్యవహరిస్తున్నారు. మంత్రభాగానికి సంహితలని ఒక పేరయితే వాటిని వివరిస్తూ యజ్ఞయాగాలలో ఆయా మంత్రాల వినియోగాన్ని నిరూపిస్తూ వాటిని వ్యాఖ్యానించే గ్రంథరాశికి బ్రాహ్మణాలని పేరు ఏర్పడింది.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు వేదభారతికి అనేక విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నది. అలాగే వైదికవాఙ్మయప్రచురణకు కూడా నడుము బిగించింది. కేవలం సంస్కృతభాషలోని గ్రంథాలను యథాతథంగా ప్రచురించడమే గాక తెలుగు అనువాదంతో ప్రసిద్ధపండితుల చేత వివరణలు, వ్యాఖ్యానాలతో జిజ్ఞాస కలవారికి అమూల్యగ్రంథాలను అందిస్తున్నది. ఈ కోవలోనే ప్రస్తుతం వెలువడుతున్న గ్రంథరాజం. ఈ కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునకు – వేదార్థదీపికసహితము – తృతీయకాండము – ప్రథమభాగము – ఏకాదశసంపుటము. ప్రస్తుత కాండలలో మొదటి ప్రపాఠకానికి సంబంధించింది. నక్షత్రాలు రెండు రకాలని దేవనక్షత్రాలు, యమనక్షత్రాలనే విభాగాలతో దేవనక్షత్రాలకాలంలో చేయదగ్గ యాగాలు ఇష్టుల గురించిన వివరణ ఈ సంపుటంలో ఉన్నాయి.

ఈ కృష్ణయజుర్వేద ఆంధ్రానువాదాన్ని అందించినవారు సుప్రసిద్ధ పండితులు, తర్క, వ్యాకరణ పూర్వోత్తర మీమాంసవిశారదులు కీ॥శే॥ బ్రహ్మశ్రీ రామవరపు కృష్ణమూర్తి శాస్త్రిగారు. తెలుగులో ప్రతిపదార్థ, తాత్పర్యం, మంత్రవినియోగ, విశేషాంశాలతో విపులమయిన వేదార్థదీపికావ్యాఖ్యానాన్ని సమకూర్చారు. వారికి శతాధికవందనాలు, ఈ గ్రంథాన్ని వెలుగులోకి తేవడానికి కృషి చేసిన పురాణ ఇతిహాస ప్రాజెక్టు, ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి నా శుభాభినందనలు. పాఠకులు అద్వితీయమైన ప్రాచీన భారతీయసంస్కృతికి సంబంధించిన వేదవిజ్ఞానం గ్రహించి, వేదప్రబోధాన్ని ఆచరించి, శ్రీనివాసుని అనుగ్రహానికి పాత్రులు కాగలరని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో....

జె శ్యామలరావు

జె. శ్యామలరావు, ఐ.ఏ.ఎస్
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

నివేదన

'విద్' అనే ధాతువు నుండి పుట్టిన వేదశబ్దానికి జ్ఞానమని అర్థం. వేదాధ్యయనం చేతనే మానవులు పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ మోక్షాల జ్ఞానాన్ని పొందుతున్నారు. అనంతంగా ఉన్న వేదరాశిని వినియోగదృష్టితో, అధ్యయనదృష్టితో వ్యాసమహర్షి – ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం అని నాలుగు వేదాలుగా విభాగం చేశాడు. ఈ వేద మంత్రాలకే సంహితలు అని కొందరు వ్యవహరిస్తున్నారు. కానీ యజ్ఞసంబంధ మంత్రాలే బ్రాహ్మణాలు. సంహితలలో నిగూఢంగా, సాంకేతికంగా ఉన్న విశేషాలను విశ్లేషిస్తూ చక్కని ఉపాఖ్యానాల ద్వారా బ్రాహ్మణాలు వైదికధర్మాన్ని వివరించాయి. భారతీయ మతధర్మాల చరిత్ర బ్రాహ్మణవాఙ్మయంలోనే ప్రప్రథమంగా రూపుదిద్దుకొన్నది.

యాగాన్ని నిర్వహించేవానికి 'బ్రహ్మ' అని పేరు. చతుర్వేదాలను అధ్యయనం చేసి యజ్ఞస్వరూపాన్ని బాగా అర్థం చేసుకొని నడిపించగలవాడే బ్రహ్మ. బ్రహ్మచేత శాస్త్రీయంగా ప్రతిపాదింపబడిన యాగవిధానమే బ్రాహ్మణం అని ఒక నిర్వచనం. ఇంక కొందరు బ్రహ్మశబ్దానికి సంహితాభాగమని పేరుందని అంటారు. ఋక్ యజుస్సామ అథర్వ సంహితలలోని మంత్రభాగానికి వినియోగాన్ని విధిస్తూ వ్యాఖ్యానరూపంలో వెలువడ్డది బ్రాహ్మణమని కొందరు నిర్వచించారు. వేదాలలోని మంత్రాలు ఆయా యజ్ఞాలలో ఎలా వినియోగించాలో నిరూపిస్తూ, వాటిని సరియైన పద్ధతిలో అవసరమయిన చోట వ్యాఖ్యానించే గ్రంథభాగానికే బ్రాహ్మణాలని అందరూ అంగీకరిస్తారు.

వేదాలలో భిత్తిస్థానీయమైనది యజుర్వేదం. ఈ యజుర్వేదంలో ప్రధానశాఖలు, రెండు. కృష్ణయజుర్వేదం, శుక్లయజుర్వేదం. వీటిలో కృష్ణయజుర్వేదానికి అనేక శాఖలుండేవి. వాటిలో చాలా నష్టమయ్యాయి. ప్రస్తుతం లభ్యమయ్యేవి నాలుగు మాత్రమే. ఆ నాలుగింటిలో ప్రధానమయినది తైత్తిరీయశాఖ. ఆ శాఖకు సంబంధించిన బ్రాహ్మణమే తైత్తిరీయ బ్రాహ్మణం. దీనిని వైదికులు 'పరాయతం' అని కూడా వ్యవహరిస్తారు.

తైత్తిరీయం

వైశంపాయనుని శిష్యుడు పైంగియాస్కుడు. అతని శిష్యుడు తిత్తిరి. ఆ తిత్తిరి శిష్యుడే ఉఖమహర్షి. ఆ తిత్తిరి ప్రశిష్యుడు ఆత్రేయుడు. ఈ తిత్తిరి తైత్తిరీయ శాఖ ప్రవర్తకుల మధ్యమణిలాంటివాడు. ఇతని రచనా సంకలనమే తైత్తిరీయ బ్రాహ్మణం.

తైత్తిరీయ బ్రాహ్మణం మూడు కాండాలుగా విభక్తం. మొదటికాండకు 'పారక్షుద్ర' అనిపేరు. రెండోకాండకు 'అగ్నిహోత్ర' మనిపేరు. మూడవ కాండలోని విభాగాలకు ఒకపేరుగాక విడివిడి పేర్లున్నాయి. ప్రస్తుత గ్రంథం 'తృతీయకాండం'. ఈ మూడవకాండలో 12 ప్రపాఠకాలున్నాయి. ఈ ప్రపాఠకాలను భట్టభాస్కరుడు 'ప్రశ్నలని' వ్యవహరించాడు. మొదటి ప్రపాఠకంలో ఆరు అనువాకాలున్నాయి. ఇందులో ప్రథమం దేవనక్షత్ర ఇష్టుల యాజ్యాపురోనువాక్యమంత్రాలు.

నక్షత్రాలు రెండురకాలు. దేవనక్షత్రాలు, యమనక్షత్రాలని. నేటికాలంలో అశ్విని భరణి అని అని గణనం. కానీ బ్రాహ్మణ కాలం నాటికి కృత్తిక మొదటిది. కృత్తిక నుండి విశాఖ వరకు గల 14 నక్షత్రాలు దేవనక్షత్రాలు. అనురాధ నుండి భరణి వరకు గల నక్షత్రాలు 13 యమనక్షత్రాలు. ఈ నక్షత్రాల స్వరూప స్వభావాలు, అధిష్ఠాన దేవతలు, ఫలాలను మొదటి ప్రపాఠకంలో వివరించబడ్డాయి.

మచ్చుకు – రోహిణీ నక్షత్రం. 3వ మంత్రం.

ప్రజాపతే రోహిణీ వేతు పత్నీ
విశ్వరూపా బృహతీ చిత్రభానుః
సానో యజ్ఞస్య సువితే దధాతు
యథా జీవేషు శరదః సవీరాః ఇతి..

ఈ మంత్రానికి అర్థం : ప్రజాపతికి పత్నిరోహిణి. బహురూపాలతో కూడింది. విచిత్ర దీప్తి కలది. గొప్పది అలాంటి రోహిణి మమ్ము పుత్రపౌత్రలవంతుమై బహు సంవత్సరాల కాలం జీవించే విధంగా చేయుగాక.

ఈ విధంగా 30 మంత్రాలు, రూపాదులు వివరించబడ్డాయి.

రెండవ ప్రపాఠకంలో 10 అనువాకాలున్నాయి. ఋక్కుల యొక్కగాని యజుస్సుల యొక్క సముదాయం అనువాకాలు. ఈ భాగంలో అనురాధా నక్షత్రం నుండి భరణి నక్షత్రం దాకా 13 నక్షత్రాల స్వరూప స్వభావాలు చెప్పబడ్డాయి. ఇవి యమ నక్షత్రాలు.

మచ్చుకు అశ్వినీ నక్షత్రం గురించి 26వ మంత్రం

"యౌ దేవానాం భిషజౌ హవ్యవాహౌ" ఇందుకు వివరణగా రామవరపువారు 'అశ్వినీ దేవతలు సుష్ఠుగ నియమించుటకు శక్యములయిన అశ్వములతో అతిశయముగా పోయేవారు. మధురవంతములైన హవిస్సులతో కూడినవారు....దేవభిషక్కులు. గుణవశిష్ఠులు. ఉభయులు, స్వకీయ క్షేత్రంలో సేవించువారై యజ్ఞకర్మలకు వత్తురుగాక! అశ్వినీ దేవతలకు అశ్వయజ్ఞ నేత్ర శరీరాలకు నమస్కరిస్తున్నాను' అని వ్యాఖ్యాత వివరణ ఇచ్చారు.

తృతీయ అనువాకంలో చాంద్రమసాదిష్టులకు సంబంధించిన వివరణలున్నాయి. ఈ అనువాకంలో 'నవోనవో భవతి జాయమానో' అన్న ప్రధానమంత్రం ఈ ప్రకరణంలోనే. అహోరాత్ర దేవతల ఐరూపత్వాది గుణవిశిష్ఠుల స్వభావాలు వర్ణితాలు. తాయమానమయిన యజ్ఞమును గాని సంవత్సరాన్ని గాని విస్తరింపచేసేవారు. ఈ అహోరాత్ర దేవతలయిన మీరు ఒకానొక నక్షత్రవిశేషంతో కూడిన అనుష్ఠానదినంలో మా యజ్ఞానికి రండనే స్వాగతం చెప్పబడింది. ఈ భాగంలో 13 మంత్రాలున్నాయి.

చతుర్థ అనువాకంలో దేవనక్షత్రాలకు ఇష్టులు చెప్పబడ్డాయి. ఈ అనువాకంలో 19 మంత్రాలున్నాయి. ఈ భాగంలో అగ్ని గురించిన విశేష వివరణలున్నాయి. సర్వ ప్రాణులకు దాహ, పాక, ప్రకాశమిచ్చే– అగ్ని పూర్వకల్పంలో మనుష్యుడిగానే ఉండేవాడు. అతడే దేవత్వపద ప్రాపకమయిన కర్మను అనుసరించి, ఈ కల్పంలో అగ్నిజన్మను పొందాడు. అతడే సర్వాధికారి. తాను దేవతలలో చిన్నవాడయ్యాడు. అగ్నిదేవుడు తాను విష్ణువును సర్వభక్షకుడయిన అగ్నిదేవతగా కావలెనని కోరినట్లు వివరణలున్నాయి. 'అగ్నయే స్వాహా' మంత్రం చేత హోమం చేయడం విధి. అగ్ని సర్వదేవతలకు హవిస్సులు అందించగల శక్తిగలవాడు. కృత్తిక ఏకనక్షత్రం కాదు. ఏడు నక్షత్రమూర్తులకు సాధారణనామం. దుంబ, దుల, వితతి, భ్రయంతి, మేఘయంతి, వర్షయంతి చుపణీక–అనేవి విశేష నామములు వ్యాఖ్యాత ఈ భాగంలో విశదీకరించారు.

ఇలాగే రోహిణ్యాది నక్షత్రాలకు తగిన 'అదిత్యై స్వాహా' మంత్రాలు చెప్పబడ్డాయి. ప్రియవస్తుభోగం రోహిణి ఇష్టి వలన సంప్రాప్తమవుతుందని వివరణ. అలాగే భూమి ఓషధులతో, వనస్పతులతో పుట్టడాని కోసం పునర్వసు నక్షత్రమూర్తులను హోమమంత్రం చెప్పబడింది. చివరగా 'పౌర్ణమాస్యై స్వాహా' తో హోమం చేయాలనే నిర్దేశం సూచితం.

పంచమానువాకంలో యమనక్షత్రాలకు ఇష్టులు 15 మంత్రాలు చెప్పబడ్డాయి. అనురాధ మొదలు భరణాదుల వరకు తగిన మంత్రాలు వరుసగా 'మిత్రాయ స్వాహా', ఇన్ద్రాయ స్వాహా, ప్రజాపతయే స్వాహా, అద్భ్యః స్వాహా, విశ్వేభ్యః దేవేభ్యః స్వాహా బ్రాహ్మణే స్వాహా, విష్ణవే స్వాహా, వసుభ్యః స్వాహా, వరుణాయ స్వాహా, అజాయైకపదే స్వాహా, అహయే బుధ్నియయ స్వాహా, పశుభ్యః స్వాహా, అశ్విభ్యాం స్వాహా, యమాయ స్వాహా మంత్రాలతో హోమాలు చేయాలని వివరణ కనిపిస్తుంది. యమునకు పితృరాజ్య ప్రాప్తికలిగినట్లు ఇతర యజమానులను గూడా స్వపమానులలో రాజ్యప్రాప్తి కలుగుతుందని ఫలితం చెప్పబడింది.

ఆరవ అనువాకంలో 'చంద్రమసిష్టి' హోమ విధానాలున్నాయి. ఈ అనువాకంలోని మంత్రాలు 7. ఈ భాగంలో అహోరాత్ర దేవతేష్టి, ఉషోదేవతేష్టి, అదితేష్టి క్రమవిధానం మంత్ర సమన్వితంగా వివరింపబడ్డాయి.

తరువాతి భాగం ద్వితీయ ప్రపాఠకం. ఈ ప్రపాఠకంలో 10 అనువాకాలున్నాయి. మొదటి అనువాకంలో 20 మంత్రాలు వత్స అపకరణార్థ మంత్రాలు. ఈ భాగంలో సోమలతావిశేషాలు చెప్పబడ్డాయి. మోదుగుచెట్టు ఎలా పుట్టిందనడాన్ని గురించిన వివరణ ఈ భాగంలోనే కనిపిస్తుంది. భూమికిపైన మూడవ లోకంలో ఉండే సోమాన్ని గాయత్రీదేవి బలాత్కారంగా తీసికెళ్ళిందని, అపుడు సోమరక్షకులకు, గాయత్రికి జరిగిన యుద్ధంలో సోమలత యొక్క ఆకు ఒకటి నేలబడిందని దానినుంచి పలాశ మోదుగ పుట్టిందనే వివరణ 3.2.1.లో కనిపిస్తుంది. దేవతలు పరస్పరము బ్రహ్మతత్త్వాన్ని నిరూపించుకొనే వేళ పలాశవృక్షం బ్రహ్మతత్త్వాన్ని విన్నదట. ఇదియే పలాశానికి బ్రహ్మ సంబంధాన్ని తెలియజేస్తున్నది. ఇంతేగాక ఆవులను పలాశ పర్ణశాఖచే అదలించాలని నియమం. పలాశ శాఖను ఛేదించేవేళ 'ఇషేత్వోర్జేత్వేత్వాహా' మంత్రం పఠించాలని నియమము. ఈ మంత్రపఠనం వల్ల యజమాని భోజనానికి అన్నం, బలానికి రసం అందుతుంది. ఈ అనువాకంలోనే గోరక్షణ గురించిన 'మా వః స్తేన ఈశతమాఽఘశగ్ం ఇత్యాహగుపై' మంత్రముంది.

ద్వితీయ అనువాకం బర్హిరాకరణార్థానికి సంబంధించినది. ఈ అనువాకంలో 32 మంత్రాలున్నాయి. యాగనిర్వహణకు వస్తుసంభారాలు సమకూర్చడంలో ఓషధులు ముఖ్యం. ఈ ఓషధులను గ్రహించడానికి అశ్వము యొక్క ఎముకను తనతో తీసుకొని వెళ్ళవలెనని అనుశాసనం. కారణం "అశ్వం ప్రాజపత్యం". ప్రజాపతి ఓషధుల గురించి తెలిసినవాడు. కనుక ఇది హింసకాదని వివరణ అంతేగాక అశ్వపర్ష్ణువు యజ్ఞానికి ధనము వంటిది".

ఈ అనువాకంలోనే దర్భలను కూర్చేది ధనం సమగ్రంగా తెలియజేయబడింది. అలాగే యజమానపత్నికి దర్భల తటిని ముడివేసే విధానం కూడా ఈ సందర్భంలోనే చెప్పబడింది. దర్భ సముదాయాన్ని శిరసుపైకి ఉంచుకువెళ్ళే అధర్వవు బృహస్పతి సమానుడు. దేవతలకు బృహస్పతి బ్రహ్మయే.

మొత్తముపై ఈ రెండవ ప్రపాఠకంలో 1,2 అనువాకాలు అమావాస్యనాటి పగటి వేళ చేయదగిన పనులను మంత్రాలతో సూచించినదనవచ్చును.

మూడవ అనువాకం దోహనమంత్ర సంబంధి అమవాస్యనాటి రాత్రివేళల్లో పాలుపితకడానికి సంబంధించిన మంత్రాలను విశదం చేస్తుంది. ఈ అనువాకంలోని మంత్రాల సంఖ్య 35. పాలుపితికే వ్యక్తి మౌనం వహించాలని ఒక నియమం. పాలకుంభం తాకకుండా మూడుగోవులకంటె అధికమయిన గోవులపాలు పితకవలెనని ఇంకొక నియమం. అలాగే దారుపాత్ర పనికిరాదని నిషేధం. అలాగే పితికే పాత్రకు సంబంధించిన నియమాలు వాటికి తగిన మంత్రాలు కూడా ఈ అనువాకంలో చెప్పబడ్డాయి. అన్నిటికంటె గోవులు అధికంగా క్షీరం స్రవించడాని కోసం 'సా విశ్వాయుః సా విశ్వవ్యచాః సా విశ్వకర్మేత్సాహి' మంత్రం పఠించాలనే సూచన కూడ ఈ అనువాకంలో ఉంది.

నాల్గవ అనువాకం హవిర్నిర్వాపమంత్రానికి సంబంధించింది. ఈ అనువాకంలో 25 మంత్రాలున్నాయి. మొదటి మూడు అనువాకాలు పర్వదిన కర్తవ్యం నిర్దేశించగా ఈ నాలుగవ అనువాకం నుండి మిగిలిన పది అనువాకాలలో ప్రతిపత్తున (పాడ్యమి) చేయదగినవని చెప్పబడుతాయి. వీటిలో తృణ విస్తరణ, పవిత్రంతో కదిలించడం, శూర్ప ఆవాహనీయం, శకటశుద్ధి, వ్రీహిసమూహం, హవిర్ధాన శుద్ధికి సంబంధించిన కార్యనిర్వహణ అందుకు తగిన మంత్రాలు చెప్పబడ్డాయి.

ఐదవ అనువాకం వ్రీహి అవఘాతం (ధాన్యాన్ని దంచడం) అందుకు సంబంధించిన కార్యకలాపాలు, వాటికి తగిన మంత్రాలు చెప్పబడ్డాయి. ఈ అనువాకంలో వృత్రాసుర వృత్తాంతముంది.

ఇంద్రుడు వృత్రాసురుని సంహరించాడు. అతడు ఉదకాలలో దైవాంశాలు పోయాయి. అన్ని దర్భలయినాయి. ఆ దర్భలతో ఉత్పవనం (పవిత్రం) చేయగా పవిత్రతనందుకున్నాయి. పవిత్రత కొన్ని వేళల (ప్రోక్షణంతో), మరికొన్నివేళల స్నానాదులతో పోతుంది. ఇలా మిగిలినదే దర్భ అని వివరణ. ఉదక శుద్ధితో బాటు ధాన్యశుద్ధికి, పాత్రశుద్ధికి, కృష్ణాజిన శుద్ధిని, రోకటి శుద్ధికి తగిన మంత్రాలు చెప్పబడ్డాయి.

ఈ అనువాకంలో రాక్షసులకోసం భాగం ఇవ్వడం ప్రస్తావితం. మధ్యమ పురోడాశ కపాలంలో పొట్టును ఉంచి 'రక్షసాం భాగోస్సి' అని ఇవ్వడంతో వారిని యజ్ఞాల నుండి తొలగించడమవుతుందని వివరణ. తండులాలు కూడా మూడుమారులు ఫలీకర్తవ్యములు కావాలని సూచన.

ఈ అనువాకంలో కొన్ని ఉపాఖ్యానాల ప్రస్తావనలున్నాయి. మొదటిది యజ్ఞపురుషుడు ఏదో ఒక నిమిత్తం దేవతలనుండి విముఖుడయి వెళ్ళిపోయాడు. తన ఆచూకి తెలియకుండా ఉండటం కోసం కృష్ణమృగరూపమయ్యాడట. కనుక కృష్ణాజినం పూజనీయమైంది. అలాగే కృష్ణాజినరూపమయిన భూమిచర్మం నీవే అని ఒక మంత్రం. కనుక మేడి పరమ పవిత్రమయింది. అలాగే చేటను వర్షవృద్ధగా పరిగణించడం వెదురు వర్షం కారణంగా పెరుగుతుంది. కనుక పరమపవిత్రం.

తరువాతది ఆరవ అనువాకం. అవహతములయిన తండులములను పిండిచేయుటకు పూర్వం కపాల ఉపధానం నిష్ప్రయోజనం కనుక తద్ ఉపధానం కోసం 'తండుల పేషణ మంత్రం ఈ అనువాకంలో ప్రధానంగా 9 మంత్రాలతో చెప్పబడింది.

ఆపైది 7వ అనువాకం. ఈ అనువాకంలో మంత్రాలు 17. యాగంలో పురోడాశం వండాలి. అద్దానికి ఉపయుక్తం కపాలం. ఆ కపాలశుద్ధి గురించి ఈ అనువాకం చర్చించింది. ఈ శుద్ధికి భృగు, అంగీరసులు తపోరూప అగ్ని కారణమనే విశేష వివరణ.

తదనంతరం 8వ అనువాకం. ఈ అనువాకంలోని మంత్రాలు 28. పురోడాశార్థం సంగ్రహించిన పిండిని ఉదకములతో కలపడానికి వీలుగా ఆ సమయాల్లో చెప్పే మంత్రాలు ఈ అనువాకంలో చెప్పబడ్డాయి. అలాగే పశుమంత్ర సంస్కార్యం. మంత్రసంపర్కం లేకపోతే యజమానుని పశువులు మరణిస్తాయని సూచన.

ఆపైది నవమోనువాకం. హవిస్సును వేదిలో ఆసాదనం చేయడం గురించిన అనువాకం. ఈ అనువాకంలోని మంత్రాలు 36. యజ్ఞవిఘాతం కొరకు 'అరరు' అనే రాక్షసుడు పొంచివుంటాడు. కనుక ఆ రాక్షసుని దేవతలలాగే మంత్రోచ్చారణ పూర్వకంగా వదలించుకోవాలనే సూచన 10వ మంత్రంలో చెప్పబడింది.

అలాగే అసురవిజయం కారణంగా పృథివివారికి సొంతమయింది. దేవతలకు భయంలేదు. అయిన ఏ దేవత ఎక్కడ కూర్చుండి ఎంతమేర చూడగలుగుతాడో అంతమాత్రం భూమి వారి ఆధీనంలో ఉండేది. అపుడు సురులు ఆ అసురులను యాచిస్తే వారు కొంతభాగం ఇచ్చారు. వారు ప్రాగ్దిక్కులో ఆ హవనీయ అగ్నిని, దక్షిణాది దిక్కులలో వస్పాదులుంచారు. అగ్న్యాదుల వలన దేవతలకు విజయం చేకూరింది.

వేదిక నిర్మాణం గురించి విస్తృతంగా చర్చించిన అనువాకమిదే.

చివరిది వేదికరణార్థమంత్ర బ్రాహ్మణం. యాగం చేసేవాడు ఎలా కూర్చోవాలి 'స్యూప్యం' ఎలా ధరించాలనడం గురించి చర్చించే అనువాకం. ఈ అనువాకంలోని మంత్రాలు 6.

చతుర్థ ప్రపాఠకం పురుషమేధానికి సంబంధించింది. ఇందులో 19 అనువాకాలున్నాయి. ఈ పురుషమేధాన్ని బ్రాహ్మణుడుకాని రాజు గాని చేయాలని సూచన ఇద్దానయజ్ఞకర్త ఓజస్సును, వీర్యమును పొందుతాడు. జ్యోతిష్టోమయలంచు పుశువు ఆలంబనగా చేసేవిధంగా పురుషమేధంలో పురుషుని చేయాలి. ఈ పురుషమేధానుష్ఠాన విధానాన్ని ఆపస్తంబసూత్రం విపులంగా చెప్పబడింది.

మనుష్యపశువిధి సూతాదితక్షాన్త, పశువిధికౌలాలాదిశ్వనితాంతపశువిధి. జారాద్యనూరుధాన్తవిధి పౌంజిష్టాది కంటకకారాన్తపశువిధి కుబ్జాది ప్రశ్న వివకాన్తపశువిధి స్తేన హృదయాది రజయిత్ర్యన్త పశువిధి దార్వాహారాది పరివేష్టన్తపశు విధి, హస్తపాద్యనుక్షత్రన్తవిధి, అయస్తా పాద్యస్వన్తపశువిధి, ఋతులాది చర్మమ్నాన్తపుశువిధి, పౌలసాది ప్రచ్ఛిదాన్తపశు విధి, పూశ్చల్వాది కలవాన్తపశువిధి, కితవాది గోలి కర్తన కర్తన్త పశువిధి, పురుషాది పురుషాన్త పశువిధి. అతిహ్రస్వాది కుమార్యన్త పశువిధి ఈ పందొమ్మిది అనువాకాలలో వివరించబడ్డాయి. ఈ ప్రకరణంలో సమాజంలోని అన్నిరకాల వారున్నారు. జిజ్ఞాస కలవారు ఏఏ దేవతలను ఎవరెవరిని పురుషమేధం చేయాలో తెలుసుకోవచ్చు. నేటికాలానికి ఈ పురుషమేధం ప్రోత్సహించదగింది కాదు. ఈ భాగంలో రకరకాల దేవతలు ప్రస్తావింపబడ్డారు. శ్రమానునిమానదేవత, వ్యాపారాభిమానదేవత, బలాభిమాన దేవత, నదీదేవత, యోద్ధదేవత కార్యవినాశ అభిమాన దేవత, శాస్త్రార్థ వ్యవస్థాభిమాన దేవత, వీరహత్యాభిమాన దేవతలు వారికి ఎలాంటి వారిని పురుషమేధగా సమర్పించాలో అన్ని అంశాలు చెప్పబడ్డాయి.

అయిదో ప్రపాఠకంలో 13 అనువాకాలున్నాయి. ఇందులో సామిధేని మంత్రాలు, ఋక్ సంబంధి నివిత్, వాక్యలు, ఇడాహ్వానం, అనుసూక్తవాకం, శంయువాకం, పత్ని సంయాజులు విశదీకరించబడ్డాయి.

మచ్చుకు

అగ్నిని ప్రజ్వలింపచేసే ఋక్కు సామిధేనిథయ్యలు. సమిధలను బెట్టించునది సామిధేని. దీనిచేత సమిత్తు ధరింపబడుతుంది కనుక థాయ్య. ఇవి అగ్ని ప్రజ్వలనం చేసే ఋక్కులు ఈ సామిధేని మంత్రాలు 11.

ఆరవ ప్రపాఠకం పాశుక హౌత్రాన్ని ప్రతిపాదించేది. ఇందులో పదిహేను అనువాకాలున్నాయి. యూప సంస్కారం ప్రయాజలకు సంబంధించిన మైత్రావరుణ ప్రైషలు పర్యగ్నీ కరణీయ ఋక్కులు, హోతను గురించిన మైత్రావరుణ ప్రైష, వరుణుడు చెప్పిన పురోనువాక్యలు వపాపురోడాశస్విష్టకృత్తుల యాజ్యాలు మనోతానూక్తం. మొదలయిన విషయాలిందున్నాయి.

మచ్చుకు–

మనోతాసూక్తుంలో 11 రకాల దేవతల ప్రస్తావనలున్నాయి. వారిలో దేవీర్ద్వారః దేవీ ఊర్జాహుతీ, దేవీస్త్రీగుఃు, స్త్రీఃు దేవతలను ఆహ్వానిస్తూ ఆజ్యమును త్రాగుదురు గాక. అని కోరడం అనువాకంలోని సామాన్య అంశం.

ఊర్జాహుతీ శబ్దవాచ్యులయిన దేవతలు ఇద్దరు స్త్రీమూర్తులు. వారిరువురిలో ఒకదేవత అన్నాన్ని క్షీరాదిరసాన్ని తీసుకవస్తుంది. మరో దేవత సహభోజనాన్ని సహపానాన్ని అందజేస్తుంది. ఈ ఇద్దరి దేవతల అనుగ్రహం వలన కొత్త ధాన్యముతో బాటు పాతధాన్యాన్ని రక్షిస్తూ, ధాన్యపు గాదెలలో నిల్వచేస్తూ ఉండెదము గాక. అలాగే పాతధాన్యముతో కొత్త ధాన్యాన్ని రక్షిస్తూ ఉందుము గాక అని 5వ మంత్రం బోధిస్తుంది.

ఇంతటి విశిష్టతగల తైత్తిరీయ సంహితకు తైత్తిరీయ బ్రాహ్మణానికి ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రమే పుట్టినిల్లని విమర్శకుల అభిప్రాయం. విమర్శకులు నిర్ణయం మేరకు క్రీ.పూ. 8వ శతాబ్దంలో బ్రాహ్మణకాలం మొదలయింది.

మహార్ణవం అనే గ్రంథంలో ఆంధ్రప్రాంతంలోని వారిలో అలాగే నర్మదానదికి తూర్పు, దక్షిణ భాగాలలో గోదావరీ తీరంలో తైత్తరీయశాఖ మరి అందుకు సంబంధించిన వాఙ్మయం బాగా ప్రచారంలో ఉందనే ఉల్లేఖం కనిపిస్తూంది.

ఈ వైదిక గ్రంథాన్ని స్వరసహితంగా సవ్యాఖ్యానంగా శ్రీవారికి సమర్పించిన మహనీయులు బ్రహ్మశ్రీ రామవరపు కృష్ణమూర్తి శాస్త్రిగారికి శతాధికవందనములు. ఈ గ్రంథాన్ని రూపకల్పన చేసిన తరువాత ప్రూఫులను చక్కగా సరిచూసిన డా॥ తులసి సావిత్రి, డా॥ భారతి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి గార్లకు సాదరధన్యవాదములు.

– డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే

ప్రథమో ఽనువాకః

1. మంత్రము : **అగ్నిర్ర్నః పాతు కృత్తికాః ।నక్షత్రం దేవమిన్ద్రియమ్ । ఇదమాసాం విచక్షణమ్। హవిరాసం జుహోతన, ఇతి।**

అవతారిక : ద్వితీయకాండమునందు అగ్నిహోత్రాదికమైన కర్మ చెప్పబడినది. ఈ తృతీయకాండమునందు నక్షత్రేష్ట్యాదికమైన కర్మ చెప్పబడుచున్నది. అందు ప్రథమప్రపాఠకమునందలి యీ ప్రథమానువాకము నందు దేవనక్షత్రములకు యాజ్యానువాక్యలు చెప్పబడుచున్నవి. తద్విభాగము బ్రాహ్మణమునందు **(కా.1, ప్ర.5, అను. 2.)** సమామ్నాతమైనది. అందు దేవనక్షత్రములందు ప్రథమమునకు ఇది పురోనువాక్య.

అర్థము : అగ్నిః=కృత్తికానక్షత్రమునకు దేవతారూపుడైన యగ్ని, నః=మమ్ము, పాతు=రక్షించుగాక. కృత్తికాః=అంబా దులేత్యాది రూపమును,దేవమ్=ద్యోతమానమును, ఇన్ద్రియమ్=ఇంద్రియప్రదమునైన, నక్షత్రమ్=నక్షత్రము, నః=మమ్ము, పాతు=రక్షించుగాక. ఆసామ్=ఈ కృత్తికా నక్షత్రములయొక్క, తదుపలక్షితుడైన యగ్నియొక్కయు, ఆసమ్=ముఖమునందు వివిధప్రకాశసాధనమైన, ఇదం హవిః=ఈ హవిస్సును,హే ఋత్విగ్యజమానాః!=ఓ ఋత్విగ్యజమానులారా!, జుహోతన=హోమము చేయుడు.

తాత్పర్యము : కృత్తికానక్షత్రమునకు దేవతారూపుడైన యగ్నియు, అంబా దులేత్యాదిరూపమును, ద్యోతమానమును, ఇంద్రియప్రదమునగు నక్షత్రమును మమ్ము రక్షించుగాక. ఓఋత్విగ్యజమానులారా! ఈ హవిస్సును హోమము చేయుడు. ఈ హవిస్సు ఈ కృత్తికానక్షత్రముల ముఖమునందును, తదుపలక్షితుడైన యగ్నియొక్క ముఖమునందును వివిధప్రకాశసాధనమైనది.

2. మంత్రము : **యస్య భాన్తి రశ్మయో యస్య కేతవః । యస్యేమా విశ్వా భువనాని సర్వా । స కృత్తికాభి రభిసంవసానః। అగ్నిర్నో దేవః సువితే దధాతు, ఇతి**

అర్థము : యస్య=ఏ యగ్నియొక్క, రశ్మయః=జ్వాలలు, భాన్తి=ప్రకాశించుచున్నవో, యస్య=ఏ యగ్నియొక్క, కేతవః=ధ్వజస్థానీయములైన ధూమములు, సర్వా(ణి)=దేవతిర్యగాది సర్వప్రకారోపేతములును, విశ్వా(ని)= నిరవశేషములునగు, ఇమా(ని) భువనాని=ఈ లోకములు, యస్య=ఏ యగ్నికి, అధీనాని= అధీనములో, సః అగ్నిః దేవః=ఆ యగ్నిదేవుడు, కృత్తికాభిః=సప్తకృత్తికలచే, అభిసంవిదానః= అంతటను తనను ఆచ్ఛాదించుకొనుచు, నః=మమ్ము, సువితే=సుష్ఠుగ ప్రాప్తమైన కర్మఫల మందు, దధాతు=స్థాపించుగాక.

తాత్పర్యము : ఆ యగ్నిదేవుడు కృత్తికలచే తనను అంతట నాచ్ఛాదించుకొనుచు మమ్ము సుష్ఠుగ ప్రాప్తమైన కర్మఫలమునందు స్థాపించుగాక. ఆ యగ్నియొక్క జ్వాలలు ప్రకాశించుచుండును. ఆ యగ్నియొక్క

ధూమములు ధ్వజస్థానీయములుగ ప్రకాశించుచున్నవి. దేవతిర్యగాది సర్వప్రకారోపేతములగు నీ సర్వభువనములు నిశ్శేషముగ ఆ యగ్నికి స్వాధీనము లైనవి. ఇది యాజ్య.

3. మంత్రము : **ప్రజాపతే రోహిణీ వేతు పత్నీ। విశ్వరూపా బృహతీ చిత్రభానుః (1)। సా నో యజ్ఞస్య సువితే దధాతు। యథా జీవేమ శరదః సవీరాః, ఇతి।**

అర్థము : ప్రజాపతేః=ప్రజాపతికి, పత్నీ=పాలయిత్రియైన, రోహిణీ=రోహిణి(నక్షత్రము), విశ్వరూపా=తనచే నుత్పాద్యములైన బహురూపములతోc గూడినదియు, బృహతీ=గొప్పదియు, చిత్రభానుః=విచిత్రదీప్తి కలదియునైనది. సా=ఆ రోహిణి(నక్షత్రము), నః=మమ్ము, యజ్ఞస్య=ఈ యజ్ఞమునకు సంబంధించిన, సువితే=సుష్ఠగ ప్రాప్తమైన కర్మఫలమునందు, దధాతు=స్థాపించుcగాక. సవీరాః=పుత్రపౌత్రోపేతులమైన, వయమ్=మేము, శరదః=బహుసంవత్సరములు, యథా జీవేమ=ఏ విధముగ జీవింతుమో, తథా కరోతు=ఆ విధముగc జేయుcగాక.

తాత్పర్యము : ప్రజాపతికి పాలయిత్రియైన రోహిణీదేవి మమ్ము ఈ యజ్ఞముయొక్క కర్మఫలమునందు స్థాపించుcగాక. ఆ రోహిణీదేవి స్వోత్పాద్యములైన బహురూపములతోc గూడినది. పరివృఢ. విచిత్రదీప్తి కలది. మేము పుత్రపౌత్రోపేతులమై బహుసంవత్సరములు జీవించునట్లుగ నా రోహిణీదేవి చేయుcగాక. ఇది ద్వితీయ నక్షత్రదేవునకు పురోనువాక్య.

4. మంత్రము : **రోహిణీ దేవ్యుదగాత్పురస్తాత్। విశ్వా రూపాణి ప్రతిమోదమానా। ప్రజాపతిగ్ం హవిషా వర్ధయన్తీ। ప్రియా దేవానాముపయాతు యజ్ఞమ్, ఇతి।**

అర్థము : సా రోహిణీ దేవీ=ఆ రోహిణీదేవి, విశ్వా రూపాణి=రూపాణి=రూపవంతములైన సర్వభువనములను, ప్రతిమోదమానా=ప్రత్యేకముగ సంతోషింపcజేయుచున్నదియు, ప్రజాపతిమ్=ప్రజాపతిని, హవిషా=హవిస్సుచే, వృద్ధినొందింపcజేయుచును(పోషింపcజేయుచును), పురస్తాత్=తూర్పుదిక్కునందు, ఉదగాత్=ఉదయించెను. సా=ఆ రోహిణీదేవి, దేవానాం ప్రియా=దేవతలకు ప్రీతిని కలుగcజేయుచున్నదై, యజ్ఞమ్=మా యజ్ఞమును, ఉపయాతు=సమీపించుcగాక.

తాత్పర్యము : యథోక్తవిశేషణ విశిష్టయైన రోహిణీదేవి ప్రాగ్దిశయందు ఉదయించెను. ఆమె దేవతలకు ప్రీతిని కలుగc జేయునదై మా యజ్ఞమునకు వచ్చుcగాక. ఇది ఆ ద్వితీయ నక్షత్రదేవునకే యాజ్య.

5. మంత్రము : **సోమో రాజా మృగశీర్షేణ ఆగన్। శివం నక్షత్రం ప్రియమస్య ధామ। ఆప్యాయమానో బహుధా జనేషు। రేతః ప్రజాం యజమానే దధాతు (2), ఇతి।**

అర్థము : సోమఃరాజా=సోమరాజు, మృగశీర్షేణ=మృగశీర్షనక్షత్రముతోc గూడ, ఆగన్=వచ్చుcగాక. యత్ శివం నక్షత్రమ్=కల్యాణతరమైన యే మృగశీర్షనక్షత్రము, అస్య=ఈ సోమనకు, ప్రియం ధామ=ప్రియమైన స్థానమో, సఃఆ సోముcడు, జనేషు=యజమానులందు, బహుధా=బహుప్రకారములచే, ఆప్యాయమానఃఅతివృద్ధిని సంపాదించుచు,రేతఃకారణమైన రేతస్సును, ప్రజామ్=కార్యమైన ప్రజను, యజమానే= యజమానునియందు, దధాతు=స్థాపించుcగాక.

తాత్పర్యము : సోమరాజు మృగశీర్షనక్షత్రముతోc గూడ వచ్చుcగాక. కల్యాణతరమైన మృగశీర్షనక్షత్ర మీ సోమరాజునకు ప్రియమైన ధామము. ఆ సోముcడు యజమానులందు బహువిధములుగ నతివృద్ధిని సంపాదించుచు కారణరూపమైన రేతస్సును, కార్యరూపమైన ప్రజను యజమానునియందు స్థాపించుcగాక. ఇది తృతీయ నక్షత్రదేవునకు పురోనువాక్య.

6. మంత్రము : యత్తే నక్షత్రం మృగశీర్షమస్తి। ప్రియగ్ం రాజన్ప్రియతమం ప్రియాణామ్। తస్మై తే సోమ హవిషా విధేమ। శం న ఏధి ద్విపదే శం చతుష్పదే, ఇతి।

అర్థము : హే రాజన్! సోమ!=ఓ సోమరాజా!,తే=త్వత్సంబంధియగు, ప్రియమ్=ప్రీతిహేతువైన, యత్ నక్షత్రమ్=ఏ నక్షత్రము, అస్తి=కలదో, తత్=అది, ప్రియాణాం ప్రియతమమ్=ప్రియవస్తువులలో నత్యంత ప్రియహేతువు. హే సోమ!=ఓ సోముcడా!, తస్మై=ఆ నక్షత్రముకొఱకు, తే=నీకొఱకును, హవిషా=హవిస్సుచే, విధేమ=పరిచర్యచేయుదుము.నఃమాయొక్క, ద్విపదే=మనుష్యునికొఱకు, శమ్=సుఖహేతువు, ఏధి=కమ్ము. చతుష్పదే=పశువుకొఱకును, శమ్=సుఖహేతువు, ఏధి=అగుము. ఏధి. 'అస=భువి' అను ధాతువునకు ఇది లోడంతరూపము. 'ఏధి=భవ' అని విద్యారణ్యము.

తాత్పర్యము : ఓసోమరాజా! ప్రీతిహేతువును, త్వత్సంబంధియునగు మృగశీర్షనక్షత్రము ప్రియములైన వస్తువులలో నత్యంతప్రియహేతు వైనది. ఓ సోమరాజా! ఆ నక్షత్రమునకు, నీకును హవిస్సుచే పరిచర్య చేయుదుము. మా మనుష్యునకు, పశువునకును సుఖహేతు వగుము. ఇది ఆ తృతీయ నక్షత్రదేవునకే యాజ్య.

7. మంత్రము : ఆర్ద్రయా రుద్రఃప్రథమాన ఏతి। శ్రేష్ఠో దేవానాం పతిరఘ్న్యానామ్। నక్షత్రమస్య హవిషా విధేమ। మా నఃప్రజాగ్ం రీరిషన్మోత వీరాన్, ఇతి।

అర్థము : దేవానామ్=దేవతలలో, శ్రేష్ఠఃశ్రేష్ఠుcడును, అఘ్న్యానామ్=గోవులకు, పతిఃస్వామియునగు, రుద్రఃరుద్రదేవుcడు, ఆర్ద్రయా=ఆర్ద్రానక్షత్రముతోc గూడ, ప్రథమానఃప్రసిద్ధుcడగుచు, ఏతి=మా యజ్ఞమును పొందుcగాక. అస్య=ఈ రుద్రునకు సంబంధించినదైన, నక్షత్రమ్=ఆర్ద్రానక్షత్రమును, హవిషా= హవిస్సుచే, విధేమ=పరిచరింతుము. సఃఆ రుద్రుcడు, నఃమాయొక్క, ప్రజామ్=పుత్రాదిప్రజను, మా రీరిషత్=హింసింపకుండుcగాక. ఉత=మఱియు, వీరాన్=శూరులైన భృత్యులను గూడ, మా రీరిషత్=హింసింపకుండుcగాక.

తాత్పర్యము : దేవతలలో శ్రేష్ఠుడును, గోస్వామియునగు రుద్రదేవుడు ఆర్ద్రానక్షత్రముతోc గూడ ప్రసిద్ధుడగుచు మా యజ్ఞమునకు వచ్చుcగాక. మేము ఈ రుద్రసంబంధియైన యార్ద్రానక్షత్రమునకు హవిస్సుచే పరిచర్య చేయుదుము. ఆ రుద్రుడు మా సంతానమును, శూరులైన భృత్యులను గూడ హింసింపకుండుcగాక. ఇది చతుర్థ నక్షత్రదేవునకు పురోనువాక్య.

8. మంత్రము : **హేతీ రుద్రస్య పరి ణో వృణక్తు । ఆర్ద్రా నక్షత్రం జుషతాగ్ం హవిర్నః (3)। ప్రముఞ్చమానౌ దురితాని విశ్వా । అపాఘశగ్ంసం నుదతామరాతిమ్, ఇతి ।**

అర్థము : రుద్రస్య=రుద్రునియొక్క, హేతిః=ఆయుధము, నః=మమ్ము, పరివృణక్తు=అంతటను విడుచుcగాక. (తదీయమ్=ఆ రుద్రునిదైన,) ఆర్ద్రా నక్షత్రమ్=ఆర్ద్రానక్షత్రము, నః=మాయొక్క, హవిః=హవిస్సును, జుషతామ్=సేవించుcగాక(భుజించుcగాక). (అథ=పిమ్మట, తౌ=ఆ రుద్రుడు, ఆర్ద్రానక్షత్రము,) నః=మాయొక్క, విశ్వా దురితాని=సర్వపాపములను, ప్రముఞ్చమానౌ=విశేషముగ నశింపcజేయుచున్నవారై, అఘశంసమ్=మా పాపమును నిందించునట్టి, అరాతిమ్=శత్రువును, అపనుదతామ్=నిరాకరింతురు గాక.

తాత్పర్యము : రుద్రునియాయుధము మమ్ము విడుచుcగాక. రుద్రసంబంధియైన యార్ద్రానక్షత్రము మా హవిస్సు భుజించుcగాక. ఆ రుద్రుడు, ఆర్ద్రానక్షత్రము, ఉభయులును సమస్తములైన మా పాపములను విశేషముగ నశింపcజేయుచున్నవారై, మా పాపమును నిందించునట్టి శత్రువును నిరాకరింతురు గాక. ఇది ఆ చతుర్థ నక్షత్రదేవునకే యాజ్య.

9. మంత్రము : **పునర్నో దేవ్యదితిః స్పృణోతు । పునర్వసూ నః పునరేతాం యజ్ఞమ్ । పునర్నో దేవా అభియన్తు సర్వే ।**

పునః పునర్వో హవిషా యజామః, ఇతి ।

అర్థము : అదితిః దేవీ=అదితిదేవి, నః=మమ్ము, పునః=మాటిమాటికి, స్పృణోతు=సంతోషపఱుచుcగాక. పునర్వసూ=పునర్వసునామకములైన తదీయ నక్షత్రదేహములు రెండు, నః=మాయొక్క, యజ్ఞమ్=యజ్ఞమునుc గూర్చి, పునః పునః=మాటిమాటికి, ఏతామ్=వచ్చుcగాక. దేవాః సర్వే=దేవత లందఱు, నః అభి=మమ్ము అభిలక్షించి, పునః పునః=మాటిమాటికి, యన్తు=పొందుదురు గాక. వః=అదితిప్రభృతులైన మిమ్ము, వయమ్=మేము, పునః పునః=మాటిమాటికి, హవిషా=హవిస్సుచేత, యజామః=యజించుచున్నాము.

తాత్పర్యము : అదితిదేవి మమ్ము మాటిమాటికి సంతోషపఱుచుcగాక. పునర్వసునామకములైన తదీయ నక్షత్రదేహములు రెండు మా యజ్ఞమునకు వచ్చుcగాక. దేవత లందఱు మమ్ము మాటిమాటికి పొందుదురు గాక. అదితి ప్రభృతులైన మిమ్ము మేము హవిస్సుచే మాటిమాటికి యజింతుము. ఈ ఋక్కు పంచమ నక్షత్రదేవునకు పురోనువాక్య.

10. మంత్రము :**ఏవా న దేవ్యదితిరనర్వా । విశ్వస్య భర్త్రీ జగతః ప్రతిష్ఠా । పునర్వసూ హవిషా వర్ధయన్తీ । ప్రియం దేవానామప్యేతు పాథః (4), ఇతి ।**

అర్థము : ఏవా=ఆగమనశీలయు, అనర్వా=అర్వాచీన పాప రహితయు, విశ్వస్య భర్త్రీ=విశ్వమునకు పోషయిత్రియు, జగతః=జగుత్తునకు, ప్రతిష్ఠా=ఆధారభూతయునగు, అదితిః దేవీ=అదితిదేవి, అనేన హవిషా=ఈ హవిస్సుచే, పునర్వసూ=పునర్వసునక్షత్రదేహములను, వర్ధయన్తీ=వృద్ధినొందించుచున్నదై, దేవానామ్=దేవతలకు, ప్రియమ్=ఇష్టమైన, పాథః=పాథస్సును (ఈ హవిస్సును), పునర్వసుభ్యాం న=పునర్వసు నక్షత్ర దేహములతోc గూడ, అప్యేతు=పొందుcగాక.

తాత్పర్యము : ఏవాత్వాది గుణవిశిష్టయైన యదితిదేవి యీ హవిస్సుచే పునర్వసునక్షత్రముల దేహములను వృద్ధినొందించుచున్నదై దేవతలకు ప్రీతికరమైన యీ హవిస్సును పునర్వసునక్షత్రదేహములతోc గూడ పొందుcగాక. ఇది పంచమ నక్షత్రదేవునకే యాజ్య.

11. మంత్రము :**బృహస్పతిః ప్రథమం జాయమానః । తిష్యం నక్షత్ర మభిసంబభూవ । శ్రేష్ఠో దేవానాం పృతనాసు జిష్ణుః । దిశోఽను సర్వా అభయం నో అస్తు, ఇతి ।**

అర్థము : దేవానామ్=దేవతలలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుcడును, పృతనాసు=పరకీయసేనలందు, జిష్ణుః=జయశీలుcడునునగు, బృహస్పతిః=బృహస్పతి, జాయమానః=పుట్టుచునే, ప్రథమమ్=ఆదియందు, తిష్యం నక్షత్రమ్=పుష్యమినక్షత్రమును, అభిసంబభూవ=అభిలక్షించి ప్రీతియుక్తుcడగుచు నుత్పన్నుc డాయెను. (తస్య ప్రసాదాత్=ఆ బృహస్పతియొక్క యనుగ్రహమువలన,) సర్వాః దిశః అను=సర్వదిక్కులందు, నః=మాకు, అభయమ్=అభయము, అస్తు=అగుcగాక.

తాత్పర్యము : దేవతలలో శ్రేష్ఠుcడును, పరకీయసేనలందు జయశీలుcడునగు బృహస్పతి పుట్టుచునే ఆదియందు పుష్యమినక్షత్రమునభిలక్షించి ప్రీతియుక్తుc డగుచు పుట్టెను. ఆ బృహస్పతియనుగ్రహమువలన మాకభయమగుcగాక. ఈ ఋక్కు షష్ఠ నక్షత్రదేవునకు పురోనువాక్య.

12. మంత్రము :**తిష్యః పురస్తాదుత మధ్యతో నః । బృహస్పతిర్నః పరిపాతు పశ్చాత్। బాధేతాం ద్వేషో అభయం కృణుతామ్ । సువీర్యస్య పతయః స్యామ, ఇతి ।**

అర్థము : తిష్యః=పుష్యమినక్షత్రము, నః=మమ్ము, పురస్తాత్=బాల్యమునందు,ఉత=మఱియు, మధ్యతః=యౌవనమునందును, పరిపాతు=అంతటను పాలించుcగాక. బృహస్పతిః=బృహస్పతి, నః=మమ్ము, పశ్చాత్=అంతమునందు(వార్ధకమునందు), పరిపాతు=అంతటను పాలించుcగాక. కించ=మఱియు, తౌ=ఆ తిష్యబృహస్పతులు, ద్వేషః=ద్వేషించునట్టి శత్రువులను, బాధేతామ్=బాధింతురు గాక.

అస్మాకమ్=మాకు, అభయమ్=అభయమును, కృణుతామ్=చేయుదురు గాక. (తయోః ప్రసాదాత్=వారియొక్క యనుగ్రహమువలన, వయమ్=మేము,) సువీర్యస్య=శోభనసామర్థ్యమునకు, పతయః=పాలకులము, స్యామ=అగుదుము గాక.

తాత్పర్యము : పుష్యమి నక్షత్రము మమ్ము బాల్య యౌవనములందు పరిపాలించుఁగాక. బృహస్పతి మమ్ము వార్ధకమునందు పరిపాలించుఁగాక. ఆ తిష్యబృహస్పతులు ద్వేషించునట్టి శత్రువులను బాధింతురుగాక. మఱియు మా కభయమును చేయుదురు గాక. వారి యనుగ్రహమువలన మేము శోభన సామర్థ్యమునకు పాలకుల మగుదుము గాక. ఈ ఋక్కు ఆ షష్ఠ నక్షత్రదేవునకే యాజ్య.

13. మంత్రము :**ఇదగ్ం సర్వేభ్యో హవిరస్తు జుష్టమ్। ఆశ్రేషా యేషామనుయన్తి చేతః (5)। యే అన్తరిక్షం పృథివీం క్షియన్తి। తే నః సర్పాసో హవమాగమిష్ఠాః, ఇతి।**

అర్థము : సర్వేభ్యః=నక్షత్రదేవతలకొఱకు, ఇదం హవిః అస్మదీయ హవిస్సు, జుష్టమ్ అస్తు=ప్రియ మగుఁగాక. యేషామ్=ఏ సర్పదేవతలకు, చేతః ఆశ్రేషాః=నక్షత్రదేహములు, అనుయన్తి=అనుసరించి యుంటున్నవో, యే=ఏ నక్షత్రదేవతలు, అన్తరిక్షమ్=అంతరిక్షమును, పృథివీమ్=పృథివిని, క్షియన్తి=ఆశ్రయించి యుంటున్నారో, తే సర్పాసః=సర్పనామకులైన యా నక్షత్రదేవతలు, నః హవమ్=మా యజ్ఞమును గూర్చి, ఆగమిష్ఠాః=అతిశయముగ నాగంతు లగుదురు గాక.

తాత్పర్యము : నక్షత్రదేవతలకు ఈ మా హవిస్సు ప్రియ మగుఁగాక. ఏ దేవతలకు నక్షత్రదేహము లనువర్తించుచున్నవో, ఏ దేవతలు పృథివ్యంతరిక్షముల నధివసించియుంటున్నారో, సర్పనామకులైన యా దేవతలు మా యజ్ఞమున కతిశయముగ వత్తురు గాక. ఈ ఋక్కు సప్తమ నక్షత్రదేవునకు పురోనువాక్య.

14. మంత్రము :**యే రోచనే సూర్యస్యాపి సర్పాః। యే దివం దేవీమనుసంచరన్తి। యేషామాశ్రేషా అనుయన్తి కామమ్। తేభ్యః సర్పేభ్యో మధుమజ్జుహోమి, ఇతి।**

అర్థము : యే అపి=ఏ యితర సర్పదేవతలు కూడ, సూర్యస్య రోచనే=సూర్యునియొక్క మండలమునందు, వర్తన్తే=ఉంటున్నారో, యే=ఏ సర్పదేవతలు, దివం దేవీమ్=ద్యులోకరూప దేవతను, అనుచరన్తి= అనుసరించుచున్నారో, ఆశ్రేషాః=నక్షత్రదేహములు, యేషామ్=ఏ సర్పదేవతలయొక్క, కామమ్=ఇచ్ఛను, అనుయన్తి=అనుసరించి యుంటున్నవో, తేభ్యః సర్పేభ్యః=ఆ యాశ్లేషాదేవతకొఱకు, మధుమత్=మధురమైన హవిస్సును, జుహోమి=హోమము చేయుచున్నాను. ఆశ్రేషా అనునది వైదికపాఠము. ఆశ్లేషా అనునది భాష్యకారానురోధియైన పాఠము.

తాత్పర్యము : ఇతర సర్పదేవతలు కూడ కొందఱు సూర్యమండమునం దుంటున్నారు. మఱికొందఱు ద్యులోకరూప దేవత ననుసరించి యుంటున్నారు. ఆశ్లేషానక్షత్రదేహములు సర్పదేవతలయొక్క యిచ్ఛ ననుసరించుచున్నవి.

అట్టి సర్పనామకులైన యాశ్లేషానక్షత్రదేవతలకొఱకు మధురమైన హవిస్సును హోమము చేయుచున్నాను. ఈ ఋక్కు ఆ సప్తమ నక్షత్రదేవునకే యాజ్య.

15. మంత్రము :**ఉపహూతాఃపితరోయేమఘాసు।మనోజవసఃసుకృతఃసుకృత్యాఃతేనోనక్షత్రేహవమాగమిష్ఠాఃస్వధాభిర్యజ్ఞంప్రయతంజుషన్తామ్ (6), ఇతి।**

అర్థము : మనోజవసఃమనోవేగము కలవారును, సుకృతఃసుష్ఠుగచేయుటకు సమర్థులును, సుకృత్యాఃశోభనమైన కృత్యముతోఁ గూడినవారునగు, యేఏ పితృదేవతలు, మఘాసునక్షత్రతనువులందు, ఉపహూతాఃఅనుజ్ఞాతులో, తేఆ పితృదేవతలు, నక్షత్రేనిమిత్తభూతే సతిమఘానక్షత్రము నిమిత్త మగుచుండఁగా, నఃమాయొక్క, హవమ్యజ్ఞమును గూర్చి, ఆగమిష్ఠాఃఅతిశయముగ వచ్చువారు, భవన్తుఅగుదురు గాక. తేఆ పితృదేవతలు, స్వధాభిఃఅన్నములచేత, ప్రయతమ్శుద్ధముగ సంస్కృతమైన, యజ్ఞమ్యజ్ఞమును, జుషన్తామ్సేవింతురు గాక.

తాత్పర్యము : పితృదేవతలు మనోవేగము కలవారు. బాగుగఁ జేయుటకై సమర్థులు. మంచిదైన కృత్యము కలవారు. అట్టి పితృదేవతలు నక్షత్రతనువులందు అనుజ్ఞాతులైరి. వారు మఘానక్షత్రనిమిత్తమున మా యజ్ఞమున కతిశయముగ వత్తురు గాక. వారు ఇచట సమావిష్టులై అన్నములచే శుద్ధముగ సంస్కరించఁబడిన యజ్ఞమును సేవింతురు గాక. ఈ ఋక్కు అష్టమ నక్షత్రదేవునకు పురోనువాక్య.

16. మంత్రము :**యేఅగ్నిదగ్ధాయేకనగ్నిదగ్ధాఃయేకముంలోకంపితరఃక్షియన్తి।యాగ్ంశ్చవిద్మయాగ్ంఉచనప్రవిద్మ।మఘాసుయజ్ఞగ్ంసుకృతంజుషన్తామ్, ఇతి।**

అర్థము : యే పితరఃఏ పితరులు, అగ్నిదగ్ధాఃశాస్త్రోక్తముగ సంస్కృతమైన యగ్నిచే దగ్ధులో, యేఏ పితరులు, అనగ్నిదగ్ధాఃశాస్త్రోక్తాగ్నిదగ్ధులు కానివారో, యేఏ పితరులు, అముం లోకమ్స్వర్గలోకమును, క్షియన్తిఅధివసించుచున్నారో, యాన్చఏ పితరులను, విద్మతెలిసికొంటిమో, యాన్ఉచఏ యితర పితరులను గూడ, నప్రవిద్మబాగుగ తెలిసికొనలేదో, తే సర్వేఆ పితరు లందఱు, మఘాసు నిమిత్త భూతాసుమఘానక్షత్రదేహములు నిమిత్తము లగుచుండఁగా, సుకృతమ్సంస్కృతమైన, యజ్ఞమ్యజ్ఞమును, జుషన్తామ్సేవింతురు గాక.

తాత్పర్యము : కొందఱు పితరులు ఇహలోకమున మరణించఁగానే శాస్త్రోక్తవిధముగ సంస్కరించఁబడిన యగ్నిచే దగ్ధులై పిత్రలోకమునకుఁ బోవుదురు. కొందఱు తద్విపరీతులైయుందురు. కొందఱు స్వర్గలోకమునధివసించియుందురు. కొందఱిని మనము తెలిసికొనియున్నాము. కొందఱిని తెలిసికొనలేనివారమై యున్నాము. ఆ సర్వపితృదేవతలు మఘానక్షత్రదేహ నిమిత్తముగ సంస్కృతమైన యా యజ్ఞమును సేవింతురు గాక. ఆ యష్టమ నక్షత్రదేవునకే యిది యాజ్య.

17. మంత్రము : **గవాం పతిః ఫల్గునీనామసి త్వమ్ । తదర్యమన్వరుణ మిత్ర చారు । తం త్వా వయగ్ం సనితారగ్ం సనీనామ్ । జీవా జీవన్త ముపసంవిశేమ, ఇతి ।**

అర్థము : వరుణ!=దురితనివారకుఁడవును, మిత్ర!=సర్వులకు హితకారివియు, చారుః=సమీచీనుఁడవునగు, హే అర్యమన్!=ఓ అర్యమదేవా! (సూర్యదేవా!), త్వమ్=నీవు, గవామ్=గోవులకు, పతిః=పాలకుఁడవు, అసి= అగుచున్నావు. తథా=ఆ విధముగ, ఫల్గునీనామ్=నక్షత్రదేహములకు, పతిః=పాలకుఁడవు, అసి= అగుచున్నావు. తత్=ఆ కారణమువలన, సనీనామ్=దాతవ్యములైన ధనములకు, సనితారమ్=దాతవును, జీవన్తమ్=సమీచీన జీవనోపేతుఁడవునగు, తం త్వామ్=అటువంటి నిన్ను, వయమ్=మేము, జీవాః= జీవనార్థులమై, ఉపసంవిశేమ=బాగుగ పొందుదుము.

తాత్పర్యము : ఓ అర్యమా! నీవు దురితనివారకుఁడవు. సర్వులకు హితమును చేయువాఁడవు. కనుకనే సమీచీనుఁడవు. అట్టి నీవు గోవులకు, నక్షత్రదేహములకును పాలకుఁడ వగుచున్నావు. ఆ కారణమువలన అటువంటి నిన్నుమేము జీవనార్థులమై బాగుగ పొందుదుము. నీవు దాతవ్యములైన ధనముల నొసఁగువాఁడవు. కనుకనే సమీచీన జీవనోపేతుఁడవు. ఈ ఋక్కు నవమ నక్షత్రదేవునకు పురోనువాక్య.

18. మంత్రము : **యేనేమా విశ్వా భువనాని సంజితా । యస్య దేవా అనుసంయన్తి చేతః (7) । అర్యమా రాజా కజరస్తు విష్కాన్ । ఫల్గునీనామృషభో రోరవీతి, ఇతి ।**

అర్థము : యేన=ఏ యర్యమునిచేత, అమా విశ్వా భువనాని=ఈ సమస్తభూతజాతములు, సంజితా(ని)=బాగుగ జయింపఁబడినవో (వశీకృతములో), దేవాః సర్వే=దేవతలందఱు, యస్య=ఏ యర్యమునియొక్క, చేతః=మనస్సును, అనుసంయన్తి=అనుసరించి వర్తించుచున్నారో, రాజా=దీప్తిమంతుఁడును, అజరః=జరా రహితుఁడును, తువిష్కాన్=బుద్ధిమంతుఁడును, ఫల్గునీనామ్ ఋషభః=గో సదృశములైన పూర్వఫల్గునీనక్షత్ర దేహములకు ఋషభసదృశుఁడునగు, అర్యమా=అర్యముఁడు (సూర్యుఁడు), రోరవీతి=(మమ్ము అనుగ్రహించుటకై దేవలోకమునందు) ధ్వనిచేయుచున్నాఁడు.

తాత్పర్యము : ఈ సమస్తభూతజాతము లర్యమునకు స్వాధీనములై యున్నవి. దేవత లందఱు అర్యమునిమనస్సు ననుసరించి వర్తించుచున్నారు. ఆ యర్యముఁడు దీప్తిమంతుఁడు. జరారహితుఁడు. బుద్ధిమంతుఁడు. గో సదృశములైన ఫల్గునీనక్షత్రదేహములకు వృషభసదృశుఁడు. అట్టి యర్యముఁడు మమ్ము ననుగ్రహించుటకై దేవలోకమునందు ఘోషించుచున్నాఁడు (ధ్వనిచేయుచున్నాఁడు). ఈ ఋక్కు ఆ నవమనక్షత్రదేవునకే యాజ్య.

19. మంత్రము : **శ్రేష్ఠో దేవానాం భగవో భగాసి । తత్త్వా విదుః ఫల్గునీస్తస్య విత్తాత్ । అస్మభ్యం క్షత్ర మజరగ్ం సువీర్యమ్ । గోమదశ్వవదుప సంనుదేహ, ఇతి ।**

అర్థము : హే భగవః!=ఓ జ్ఞానవైరాగ్యాది షడ్గుణయుక్తుఁడా!, హే భగ!=ఓ భగాఖ్యదేవా!, త్వమ్=దేవతలలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుఁడవు, అసి=అగుచున్నావు. తత్=ఆ కారణమువలన, ఫల్గునీః=ఉత్తరఫల్గునీ నామకములైన నక్షత్రదేహములు, త్వామ్=నిన్ను, విదుః=స్వామినిగా పొందినవి. తస్య=అటువంటినీయొక్క, (మాహాత్మ్యమ్=మాహాత్మ్యమును, త్వమేవ=నీవే,) విత్తాత్=తెలిసికొనుము. ఇహ=ఈ కర్మయందు, అస్మభ్యమ్=మాకొఱకు, అజరమ్=శైథిల్యరహితమును, సువీర్యమ్=శోభనవీర్యములతో (పుత్రాదులతో) కూడినదియు, గోమత్=బహుగోయుక్తమును, అశ్వవత్=ప్రశస్తాశ్వోపేతమునగు, క్షత్రమ్=బలమును, ఉప=సమీపమున, సంనుద=బాగుగ ప్రేరణచేయుము.

తాత్పర్యము : జ్ఞానవైరాగ్యాది షడ్గుణ యుక్తుఁడైన యో భగదేవా! (సూర్యదేవా!) నీవు దేవతలలో శ్రేష్ఠుఁడవు. ఆ కారణమువలన ఉత్తరఫల్గునీనక్షత్రదేహములు నిన్ను స్వామినిగా పొందినవి. అట్టి నీయొక్క మాహాత్మ్యమును నీవే తెలిసికొనుము. ఈ కర్మయందు మాకొఱకు అజరత్వాది గుణయుక్తమైన బలమును మా విషయమున ప్రేరణచేయుము. ఈ ఋక్కు దశమనక్షత్రదేవునకు పురోనువాక్య.

20. మంత్రము :భగో హ దాతా భగ ఇత్ప్రదాతా । భగో దేవీః ఫల్గునీరావివేశ । భగస్యేత్తం ప్రసవం గమేమ । యత్ర దేవైః సధమాదం మదేమ (8), ఇతి ।

అర్థము : భగః హ=భగదేవుఁడే, దాతా=ధనధాన్యాదుల నొసఁగువాఁడు. కించ=మఱియు, భగః ఇత్=భగదేవుఁడే, ప్రదాతా=ప్రకృష్టములైన మణిముక్తాదుల నొసఁగువాఁడు. సః భగః=ఆ భగదేవుఁడు, దేవీః=ప్రకాశించుచున్న, ఫల్గునీః=నక్షత్రరూపములైన ఉత్తరఫల్గునులను, ఆవివేశ=స్వామిగా నావేశించెను (ప్రవేశించెను). యత్ర=ఏ యనుజ్ఞ యుండఁగా, దేవైః సదమాదమ్=దేవతలతోఁ గూడ హర్షమును, మదేమ=పొందుదుమో, తస్య భగస్య ఇత్=ఆ భగదేవునియొక్కయే, ప్రసవమ్=అనుజ్ఞను, గమేమ=పొందెదము.

తాత్పర్యము : 'ఇనో భగో దావనిధిః' అని అమరనిఘంటువు. భగుఁడునఁగా సూర్యుఁడని యర్థము. ద్వాదశాదిత్యులలో నొకఁడనియుఁ జెప్పవచ్చును. ఆ భగదేవుఁడే ధనధాన్యాదులను, ప్రకృష్టములైన మణిముక్తాదులను ఒసఁగువాఁడు. అట్టి భగదేవుఁడు ద్యోతమానములైన యుత్తరఫల్గునీనక్షత్రదేహములను స్వామిగాఁ బ్రవేశించెను. కావున ఆ భగదేవునియొక్కయే యనుజ్ఞను పొందెదము. ఆ యనుజ్ఞ యుండఁగా దేవతలతోఁ గూడ హర్షమును పొందెదము. ఇది దశమనక్షత్రదేవునకే యాజ్య.

21. మంత్రము :ఆయాతు దేవః సవితోపయాతు । హిరణ్యయేన సువృతా రథేన । వహన్నస్తగ్ం సుభగం విద్మనాపసమ్। ప్రయచ్ఛన్తం పపురిం పుణ్యమచ్ఛ, ఇతి ।

అర్థము : సవితా దేవః=సవితృదేవుఁడు, హిరణ్యయేన=సువర్ణనిర్మితమును, సమ్యతా=శోభనవృత్తి కలదియునగు, రథేన=రథముచేత, సుభగమ్=సౌభాగ్యయుక్తమును, విద్మనాపసమ్=విదితమైన కర్మతోఁ గూడినదియు, ప్రయచ్ఛన్తమ్=అభిమతఫలముల నొసఁగుచున్నదియు, పపురిమ్=కామములను పూరించునదియు,

పుణ్యమ్=పావనమును, అచ్ఛ=అభిముఖముగ నుంటున్నదియునగు, హస్తమ్=హస్తనామక నక్షత్రమును, వహన్=వహించుచు, ఆయాతు=ఈ కర్మయందు వచ్చుcగాక. కించ=మఱియు, ఉపయాతు=ఉపగమించుcగాక. ఉపగమన మనcగా - స్నేహాతిశయముతో సమీపప్రాప్తి.

తాత్పర్యము : సవితృదేవుcడు సువర్ణనిర్మితమును, శోభనవృత్తికమునగు రథముచే సుభగత్వాది గుణవిశిష్టమైన హస్త నక్షత్రమును వహించుచు ఈ కర్మయందు వచ్చుcగాక. సామాన్యముగ వచ్చుటయే కాదు. స్నేహాతిశయముతో వచ్చుcగాక. ఈ ఋక్కు ఏకాదశ నక్షత్రదేవునకు పురోనువాక్య.

22. మంత్రము :**హస్తః ప్రయచ్ఛత్వమృతం వసీయః । దక్షిణేన ప్రతిగృభ్ణీమ ఏనత్ । దాతారమద్య సవితా విదేయ ।**

యో నో హస్తాయ ప్రసువాతి యజ్ఞమ్, ఇతి ।

అర్థము : హస్తః=హస్తనక్షత్రము, అమృతమ్=వినాశరహితమును, వసీయః=అతిశ్రేష్ఠమునైన ధనమును, ప్రయచ్ఛతు=ఇచ్చుcగాక. వయమపి=మేము కూడ, ఏనత్=ఈ ధనమును, దక్షిణేన=దక్షిణ (పూజితమైన) హస్తముతో, ప్రతిగృభ్ణీమః=ప్రతిగ్రహింతుము గాక. యః సవితా=ఏ సవిత, హస్తాయ= హస్తనక్షత్రముకొఱకు, నః యజ్ఞమ్=మాయొక్క యజ్ఞమును, ప్రసువాతి=అనుమతింపcజేయుచున్నాcడో, దాతారమ్=ధనదాతయైన, తమ్=ఆ సవితను, అద్య=ఈ కర్మయందు, విదేయ=పొందెదను.

తాత్పర్యము : ఈ హస్తనక్షత్రము వినాశరహితమైన అతిశ్రేష్ఠధనము నొసcగుcగాక. మేమును ఈ ధనమును పూజితమైన దక్షిణహస్తముతో ప్రతిగ్రహింతుము (తీసికొందుము). హస్తనక్షత్రమునకై మా యజ్ఞము ననుమతింపcజేయునట్టి దాతయగు సవితను పొందెదను. ఇది ఆ యేకాదశనక్షత్రదేవునకే యాజ్య.

23. మంత్రము :**త్వష్టా నక్షత్రమభ్యేతి చిత్రామ్ । సుభగ్ంససం యువతిగ్ం రోచమానామ్ (9) । నివేశయన్నమృతా**

న్మర్త్యగ్ంశ్చ । రూపాణి పిగ్ంశన్భువనాని విశ్వా, ఇతి ।

అర్థము : త్వష్టా=త్వష్టృదేవుcడు, సుభంససమ్=శోభనమైన జఘనప్రదేశముతోc గూడినదియు, యువతిమ్=యౌవనవతియు, రోచమానామ్=దీపించుచున్నదియునగు, చిత్రాం నక్షత్రమ్=చిత్రాఖ్యమైన నక్షత్రమును, అమృతాన్=దేవతలను, మర్త్యాన్ చ=మనుష్యులను గూడ, నివేశయన్=సోచితరూపమునందు స్థాపించుచు, తథా=ఆ విధముగ, రూపాణి=నిరూపణీయములైన, విశ్వా భువనాని=సమస్త భూత జాతములను, పింశన్= నిరూపించుచు, అభ్యేతి=అభిముగc బోవుచున్నాcడు (ఏకీభవించుచున్నాcడు).

తాత్పర్యము : త్వష్టృదేవుcడు సుభంసస్త్వాది గుణవిశిష్టమైన చిత్రాఖ్యనక్షత్రమున కభిముఖముగc బోవుచున్నాcడు (చిత్రానక్షత్రముతో నేకీభవించుచున్నాcడు). అప్పు డతcడు దేవతలను, మనుష్యులను గూడ స్వస్వోచితరూపమునందు స్థాపించుచును, నిరూపింపcదగిన సర్వభూతసమూహములను నిరూపించుచు చిత్రకభిముఖముగc బోవుచున్నాcడు. ఈ ఋక్కు ద్వాదశ నక్షత్రదేవునకు పురోనువాక్య. ''త్వష్టా రూపాణి కుర్వన్'' అని చెప్పcబడినవిధముగ త్వష్టృదేవుcడు గర్భస్థపిండమునకు విశేషాకారముగ రూపమును చేయువాడని అనేక శ్రుతివాక్యములు చెప్పుచున్నవి.

24. మంత్రము :**తన్నస్త్వష్టా తదు చిత్రా విచష్టామ్ । తన్నక్షత్రం భూరిదా అస్తు మహ్యామ్ । తన్నః ప్రజాం వీరవతీగ్ం సనోతు । గోభిర్నో అశ్వైః సమనక్తు యజ్ఞమ్, ఇతి ।**

అర్థము : త్వష్టా=త్వష్టృదేవుఁడు, నః=మాయొక్క, తత్=ఆ ధనమును, విచష్టామ్=విశేషముగఁ జూచుఁగాక (అనుగ్రహించుఁగాక). తథా=ఆ విధముగ, చిత్రా=చిత్రాఖ్యనక్షత్ర తనువు, తదు=ఆ ధనమునే, విచష్టామ్= విశేషముగ ననుగ్రహించుఁగాక. కించ=మఱియు, తత్=ఆ చిత్రాఖ్యమైన నక్షత్రము, మహ్యామ్= యజమానుఁడనైన నాకొఱకు, భూరిదా=అధికధనప్రదము, అస్తు=అగుఁగాక. అపిచ=ఇంకను, తత్=ఆ నక్షత్రము, నః=మా కొఱకు, వీరవతీమ్=శూరభట యుక్తమైన, ప్రజామ్=పుత్రాదిరూప ప్రజను, సనోతు=ఇచ్చుఁగాక. కించ=మఱియు, నః=మాయొక్క, యజ్ఞమ్=యజ్ఞమును, గోభిః=గోవులచేతను, అశ్వైఃఅశ్వములచేతను, సమనక్తు=సమృద్ధము జేయుఁగాక.

తాత్పర్యము : తాత్పర్యము స్పష్టము. ఈ ఋక్కు ఆ ద్వాదశ నక్షత్రదేవునకే యాజ్య.

25. మంత్రము :**వాయుర్నక్షత్రమభ్యేతి నిష్ట్యామ్ । తిగ్మశృఙ్గో వృషభో రోరువాణః। సమీరయన్భువనా మాతరిశ్వా ।

అపద్వేషాగ్ంసి నుదతామరాతీః (10), ఇతి ।

అర్థము : తిగ్మశృఙ్గఃతీక్ష్ణమైన తేజము కలవాఁడును, వృషభఃకామములను వర్షించువాఁడును, రోరువాణఃధ్వనిచేయుచున్నవాఁడనగు, వాయుఃవాయుదేవుఁడు, నిష్ట్యం నక్షత్రమ్=స్వాతీనక్షత్రమును, అభ్యేతి=అభిముఖముగ పొందుచున్నాఁడు. సఃఅయం మాతరిశ్వా=ఆ యీ వాయుదేవుఁడు, భువనా=భూత జాతములను, సమీరయన్=బాగుగ ప్రేరణచేయుచు, ద్వేషాంసి=ద్వేష్యులైన, అరాతీఃశత్రువులను, అపనుదతామ్=తొలఁగించుఁగాక.

తాత్పర్యము : వాయుదేవుఁడు తీక్ష్ణతేజుఁడు. కామములను వర్షించువాఁడు. ధ్వనిచేయుచున్నవాఁడు. అట్టి వాయుదేవుఁడు స్వాతీనక్షత్రము నభిముఖముగ పొందుచున్నాఁడు. అట్టి వాయుదేవుఁడు ప్రాణిసమూహములను ప్రేరించుచు ద్వేష్యులైన శత్రువులను, దాతవ్యమైన ధనమును దానముచేయనివారినిఁగూడ తొలఁగించుఁగాక. ఆ త్రయోదశ నక్షత్రదేవునకు యిది పురోనువాక్య.

26. మంత్రము :**తన్నో వాయుస్తదు నిష్ట్యా శృణోతు। తన్నక్షత్రం భూరిదా అస్తు మహ్యామ్। తన్నో దేవాసో అనుజానన్తు

కామమ్ ।యథా తరేమ దురితాని విశ్వా, ఇతి ।

అర్థము : నఃమాయొక్క, తత్=ఆ విన్నపమును, వాయుఃవాయుదేవుడు, శృణోతు=వినుగాక. నిష్ట్యా=స్వాతీ నక్షత్రముకూడ, తదు=అదే విన్నపమును, శృణోతు=వినుగాక. తత్ నక్షత్రమ్=ఆ స్వాతీ నక్షత్రము, మహ్యామ్=మాకొఱకు, భూరిదా=బహుధనమునిచ్చునది, అస్తు=అగుగాక. దేవాసఃదేవతలందరు,

నః=మాకు, తం కామమ్=కోరినదానిని, అనుజానన్తు=అనుగ్రహింతురుగాక. విశ్వా దురితాని=పాపములన్నింటిని, యథా=ఏవిధముగ, తరేమ=తరించుదుమో, (తథా=ఆవిధముగ), అనుజానన్తు=అనుగ్రహింతురుగాక.

తాత్పర్యము : వాయుదేవుడు, స్వాతీనక్షత్రము కూడ మా ఈ విన్నపమును వినుగాక. ఆ స్వాతీ నక్షత్రము మాకు బహుధనమునిచ్చునది అగుగాక. దేవతలందరు మాకు కోరినదానిని అనుగ్రహింతురుగాక. మేము పాపములన్నింటిని తరించునట్లు వారు అనుగ్రహింతురుగాక. ఆ త్రయోదశ నక్షత్రదేవునకే యిది యాజ్య.

27. మంత్రము :దూరమస్మచ్ఛత్రవో యన్తు భీతాः । తదిన్ద్రాగ్నీ కృణుతాం తద్విశాఖే । తన్నో దేవా అనుమదన్తు యజ్ఞమ్। పశ్చాత్పురస్తాదభయం నో అస్తు, ఇతి ।

అర్థము : అస్మత్=మావలన, భీతాः=భయపడిన, శత్రవः=శత్రువులు, దూరమ్=దూరముగ, యన్తు=వెళ్లుదురు గాక. తత్=ఆ దూరగమనమును, ఇన్ద్రాగ్నీ=ఇంద్రాగ్నిదేవతలు, కృణుతామ్=చేయుదురు గాక. తత్=ఆ దూరగమనమును, విశాఖే చ=విశాఖనక్షత్రదేహములు రెండును, కృణుతామ్=చేయుఁగాక. నః=మాయొక్క, యజ్ఞమ్=యజ్ఞమును, దేవాः=దేవత లందఱు, అనుమదన్తు=అంగీకరింతురు గాక. నః=మాకు, పశ్చాత్=వెనుకను, పురస్తాత్=ఎదుటను, అభయమ్=అభయము(భయము లేకుండుట), అస్తు=అగుఁగాక.

తాత్పర్యము : మావలన భయపడిన శత్రువులు దూరముగ పోవుదురు గాక. ఆ దూరగమనమును ఇంద్రాగ్నులు, విశాఖ నక్షత్రదేవములు రెండును చేయుదురు గాక. మా యాజ్ఞమును దేవత లందఱు అంగీకరింతురు గాక. మాకు వెనుకను, ఎదుటను భయము లేకుండుఁగాక. ఈ ఋక్కు చతుర్దశ నక్షత్రదేవునకు పురోనువాక్య.

28. మంత్రము :నక్షత్రాణామధిపత్నీ విశాఖే । శ్రేష్ఠావిన్ద్రాగ్నీ భువనస్య గోపౌ (11) । విషూచः శత్రూనపబాధమానౌ । అపక్షుధం నుదతామరాతిమ్, ఇతి ।

అర్థము : నక్షత్రాణామ్=నక్షత్రములలో, విశాఖే=రెండు విశాఖలు, అధిపత్నీ=అధికముగ పాలయిత్రులు. ఇన్ద్రాగ్నీ=తద్దేవులైన యింద్రాగ్నులు, శ్రేష్ఠౌ=ప్రశస్తులు. భువనస్య=భువనమునకు, గోపౌ=పాలకులైన ఉభయులు, శత్రూన్=మా శత్రువులను, విషూచः=విభ్నిగతులు కలవారినిగా, కృత్వా=చేసి, అపబాధమానౌ=పీడించుచున్నవారై, క్షుధమ్=మా యాఁకలిని, అరాతిమ్=శత్రువును, అపనుదతామ్=నిరాకరింతురు గాక.

తాత్పర్యము : నక్షత్రములలో నుభయవిశాఖ లధికముగ పాలించువారు. తద్దేవులైన యింద్రాగ్ను లుభయులు ప్రశస్తులు. భువనపాలకులైన యా యింద్రాగ్ను లుభయులు మా శత్రువులను విభిన్నగతులనుగాఁ జేసి పీడించుచున్నవారై మా యాఁకలిని, శత్రువును నిరాకరింతురు గాక. ఇది ఆ చతుర్దశ నక్షత్రదేవునకే యాజ్య.

29. మంత్రము :**పూర్ణా పశ్చాదుత పూర్ణా పురస్తాత్ । ఉన్మధ్యతః పౌర్ణమాసీ జిగాయ । తస్యాం దేవా అధిసంవసన్తః ।**

ఉత్తమే నాక ఇహ మాదయన్తామ్, ఇతి ।

అర్థము : పూర్ణా=పౌర్ణమాసిదేవత, పశ్చాత్=మాకు వెనుకవైపున, విరోధినః=విరోధులను, ఉజ్జిగామ=పోఁదోలెను. ఉత=మఱియు, పురస్తాత్=పురోభాగమున, విరోధినః, ఉజ్జిగామ. తథా=ఆ విధముగ, ఇయం పౌర్ణమాసీ=ఈ పౌర్ణమాసిదేవత, మధ్యతః=మధ్యభాగమునందు, విరోధినః, ఉజ్జిగామ. దేవాః=దేవతలు, తస్యామ్=ఆ పౌర్ణమాసియందు, అధిసంవసన్తః=అధిష్ఠించి బాగుగ నుంటున్నవారై, ఉత్తమే నాకే=స్వర్గలోకమునందు, ఇహ=ఈ కర్మయందును, మాదయన్తామ్=మమ్ము సంతోషపఱుచుదురు గాక.

తాత్పర్యము : ఇంతవఱకు కృత్తికనుండి విశాఖవఱకుc గల నక్షత్రములకు యాజ్యాపురోనువాక్య లభిహితము లైనవి. ఇcక పౌర్ణమాసిదేవత కిచటి పురోనువాక్య చెప్పcబడుచున్నది. పౌర్ణమాసిదేవత మాకు పూర్వపశ్చిమ మధ్యమ దిగ్భాగములందుc గల విరోధులను పోఁదోలెను. దేవతలందఱు అట్టిపౌర్ణమాసియందు బాగుగ నధివసించిన వారై స్వర్గలోకమునందు, ఈ కర్మయందును మమ్ము సంతోషపఱుచుదురు గాక.

30. మంత్రము :**పృథ్వీ సువర్చా యువతిః సజోషాః । పౌర్ణమాస్యదగాచ్ఛోభమానా । ఆప్యాయయన్తీ దురితాని విశ్వా ।**

ఉరుం దుహాం యజమానాయ యజ్ఞమ్, ఇతి ॥

చిత్రభానుర్యజమానే దధాతు హవిర్నః పాథశ్చేతో జుషన్తాం చేతో మదేమ రోచమానా మరాతీర్ఘ్నీ

యజ్ఞమ్ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమ ప్రపాఠకే ప్రథమోఽనువాకః ॥౧ ॥

అర్థము : పృథ్వీ=విస్తీర్ణయు, సువర్చాః=శోభనదీప్తి కలదియు, యువతిః=నిత్యతరుణియు, సజోషా=మాతో సమానప్రీతి కలదియు, శోభమానా=రమణీయయు, విశ్వా(ని)దురితాని=సమస్తములైన దుర్గతితోc గూడియున్న భూతజాతములను, ఆప్యాయయన్తీ=దుర్గతిపరిహారముచే వృద్ధినొందించుచున్నదియునగు, ఇయం పౌర్ణమాసీ=ఈ పౌర్ణమాసిదేవత, ఉదగాత్=ఉదయించెను. తాదృశీ=అటువంటి పౌర్ణమాసిదేవత, యజమానాయ=యజమానునికొఱకు, ఉరుమ్=విస్తీర్ణమైన, యజ్ఞమ్=యజ్ఞమును, దుహామ్=ఫలములను పితుకుదానినిగా సంపాదించుఁగాక.

తాత్పర్యము : పృథ్వీత్వాది గుణవిశిష్టయైన యీ పౌర్ణమాసిదేవత ఉదయమును పొందెను (ఉదయించెను). అట్టి పౌర్ణమాసిదేవత యజమానునికొఱకు విస్తీర్ణమైన యజ్ఞమును ఫలప్రదమునుగాc జేయుఁగాక. ఈ ఋక్కు ఆ పౌర్ణమాసిదేవతకే యాజ్య.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ప్రథమ ప్రపాఠకమునందు ప్రథమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే

ద్వితీయోఽనువాకః

1. మంత్రము : **ఋధ్యాస్మ హవైర్నమసోపసద్య । మిత్రం దేవం మిత్రధేయం నో అస్తు । అనూరాధాస్తవిషా వర్ధయన్తః।**

శతం జీవేమ శరదః సవీరాः, ఇతి ।

అవతారిక: ప్రథమానువాకమునందు దేవనక్షత్రములకు ఇష్టులందు యాజ్యాపురోనువాక్య లభిహితములైనవి. ఈ ద్వితీయానువాకమునందు యమనక్షత్రములకు ఇష్టులందు యాజ్యాపురోనువాక్యలు చెప్పcబడుచున్నవి. అందు ప్రథమమైన అనూరాధానక్షత్రమున కిచట పురోనువాక్య చెప్పcబడుచున్నది.

అర్థము : మిత్రం దేవమ్=మిత్రనామకుcడైన దేవుని, నమసా=నమస్కారముచేతను, హవ్యైఃహవిస్సులచేతను, ఉపసద్య=సేవించి, ఋధ్యాస్మ=మేము సమృద్ధుల మగుదుము గాక. మిత్రధేయమ్=మిత్రదేవునిచే సంపాద్యమైన శ్రేయస్సు, నఃమాకు, అస్తు=ఉండుcగాక. వయమపి=మేము కూడ, అనూరాధాన్=అనూరాధానక్షత్రవిగ్రహములను, హవిషా=హవిస్సుచే, వర్ధయన్తఃవృద్ధినొందించుచున్నవారమై, సవీరాఃవీరులైన పుత్రాదులతో సహితులమై, శతం శరదఃశతసంవత్సరములు, జీవేమ=జీవింతుము గాక.

తాత్పర్యము : మేము మిత్రదేవుని నమస్కారముచేతను, హవిస్సుచేతను సేవించి సమృద్ధుల మగుదుము గాక. మిత్రదేవ సంపాద్యమైన శ్రేయస్సు మాకు కలుగుcగాక. మేము అనూరాధానక్షత్రవిగ్రహములను (దేహములను) ఈ హవిస్సుచే వృద్ధినొందించుచు, వీరులైన పుత్రాదులతో సహితులమై శతసంవత్సరములు జీవింతుము గాక.

2. మంత్రము : **చిత్రం నక్షత్రముదగాత్పురస్తాత్ । అనూరాధాస ఇతి యద్వదన్తి । తన్మిత్ర ఏతి పథిభి ర్దేవయానైः ।**

హిరణ్యయైర్వితతైరన్తరిక్షే, ఇతి ।

అర్థము : చిత్రమ్=ఆశ్చర్యకరమైన, ఇదమ్=ఈ నక్షత్రము, పురస్తాత్=తూర్పుదిక్కునందు, ఉదగాత్=ఉదయించెను. యత్=ఏ నక్షత్రమును, అనూరాధాసఃఇతి=అనూరాధయని, సర్వే జనాఃసర్వజనులు, వదన్తి=చెప్పుచున్నారో, తత్=ఆ నక్షత్రమును గూర్చి, మిత్రఃమిత్రదేవుcడు, అన్తరిక్షే=అంతరిక్షమునందు, అవస్థితైఃఉన్నవియు, హిరణ్యయైఃహిరణ్యనిర్మితములును, దేవయానైఃదేవతలకు గమనయోగ్యములును, వితతైఃవిస్తీర్ణములునైన, పథిభిఃమార్గములచే, ఏతివెళ్లుచున్నాcడు.

తాత్పర్యము : లోకమున జనులందఱు అనూరాధ యని చెప్పుచున్న ఆశ్చర్యకరమైన యీ నక్షత్రము తూర్పుదిక్కున నుదయించిన దాయెను. ఆ యనూరాధనక్షత్రమును గూర్చి యీ మిత్రదేవుcడు అంతరిక్షమునందుc గల వితత్వాది గుణవిశిష్టములైన మార్గములచేత పోవుచున్నాcడు. ఈ ఋక్కు ఆ ప్రథమ యమనక్షత్రదేవునకే యాజ్య.

3. మంత్రము : **ఇన్ద్రో జ్యేష్ఠామను నక్షత్రమేతి । యస్మిన్వ్రత్రం వ్రత్రతూర్యే తతార (1) । తస్మిన్వయ మమృతం దుహానాः । క్షుధం తరేమ దురితిం దురిష్టిమ్, ఇతి ।**

అర్థము : ఇన్ద్రः=ఇంద్రుcడు, జ్యేష్ఠామ్=జ్యేష్ఠానక్షత్రమును, అనుగచ్ఛతి=అనుసరించి పోవుచున్నాcడు. వ్రత్రతూర్యే=నిమిత్తేసతి=వ్రత్రవధ నిమిత్త మగుచుండcగా, యస్మిన్=ఏ జ్యేష్ఠానక్షత్రమునందు, వ్రత్రమ్=వ్రత్రాఖ్యుడైన యసురుని, తతార=ఇంద్రుcడు తరించెనో (వధించెనో), తస్మిన్ నిమిత్తభూతే సతి=ఆ జ్యేష్ఠానక్షత్రము నిమిత్త మగుచుండcగా, అమృతమ్=వినశ్వరము కానిదియగు హవిస్సును, దుహానాः=సంపాదించుచున్నవారమై, వయమ్=మేము, దురితిమ్=దుర్గతియుక్తమును, దురిష్టిమ్=దుర్యాగఫల భూతమునగు, క్షుధమ్=ఆcకలిని, తరేమ=తరింతుము (నశింపcజేయుదుము).

తాత్పర్యము : ఇంద్రుcడు జ్యేష్ఠానక్షత్రము ననుసరించుచున్నాcడు. వ్రత్రవధ నిమిత్తము కాcగా నింద్రుcడు వ్రత్రాసురుని జ్యేష్ఠానక్షత్రమునందు వధించెను. ఆ జ్యేష్ఠానక్షత్రము నిమిత్తము కాcగా వినశ్వరముకాని హవిస్సును సంపాదించుచున్నవారమై మేము దురితత్వాది గుణయుక్తమైన ఆcకలిని నశింపcజేయుదుము. ఇది ద్వితీయ యమనక్షత్రదేవునకు పురోనువాక్య.

'' వాసుదేవ జరా కష్టం కష్టం ధనవిపర్యయः ।
పుత్రశోకస్తతः కష్టం కష్టాత్కష్టతరా క్షుధా ॥''

'ఓ వాసుదేవా! ముసలితనము, ధనవిపర్యయము (దారిద్ర్యము), పుత్రశోకము కష్టములైనవి. ఆcకలి కష్టముకంటె నతికష్టమైనదని మహాభారతమునందు చెప్పcబడినది. ధనవిపర్యయము=కొంతకాలము ధనము ఉండి, అది నశించినతరువాత ఏర్పడిన దారిద్ర్యము.

4. మంత్రము : **పురందరాయ వృషభాయ ధృష్ణవే । అషాఢాయ సహమానాయ మీఢుషే । ఇన్ద్రాయ జ్యేష్ఠా మధు మద్దుహానా । ఉరుం కృణోతు యజమానాయ లోకమ్, ఇతి ।**

అర్థము : జ్యేష్ఠా=నక్షత్రరూపమైన జ్యేష్ఠ, పురందరాయ=అసురపురములను నశింపcజేసినవాcడును, వృషభాయ=కామములను (కోరికలను) వర్షించువాcడును, ధృష్ణవే=దిట్టతనము కలవాcడును, అషాఢాయ=పరిభవింపcబడనివాcడును, సహమానాయ=వైరులను తిరస్కరించువాcడును, మీఢుషే=వర్షముచే తడుపువాcడునునగు, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, మధమత్=మధురమైన హవిస్సును, దుహానా=సంపాదించుచున్నదై, యజమానాయ=యజమానునికొఱకు, ఉరుమ్=విస్తీర్ణమైన, లోకమ్=లోకమును, కృణోతు=చేయుcగాక.

తాత్పర్యము : ఈ నక్షత్రరూపమైన జ్యేష్ఠ పురందరత్వాది గుణయుక్తుడైన యింద్రునికై మధురహవిస్సును సంపాదించుచు యజమానునికొఱకు విస్తీర్ణమైన లోకమును చేయుcగాక. ఈ ఋక్కు ఆ ద్వితీయ నక్షత్రదేవునకే యాజ్య.

5. మంత్రము : **మూలం ప్రజాం వీరవతీం విదేయ । పరాచ్యేతు నిర్ఋతిః పరాచా । గోభిర్నక్షత్రం పశుభిః సమక్తమ్।**

అహర్భాయాద్యజమానాయ మహ్యమ్ (2), ఇతి ।

అర్థము : మూలమ్=మూలఖ్యమైన నక్షత్రమును, (సేవిత్వా=సేవించి,) వీరవతీమ్=శూరభటయుక్తమైన, పుత్రామ్=పుత్రాదికమైన ప్రజను, విదేయ=పొందెదను. నిర్ఋతిః=నిర్ఋతి యనెడి ఒకానొక రాక్షసదేవత, పరాచీ=పరాఙ్ముఖియై, పరాచా=పునరావృత్తిరహితమైన మార్గముచేత, ఏతు=ఇటు వెళ్లుగాక. మహ్యం యజమానాయ= యజమానుడనైన నాకొఱకు, ఇదం నక్షత్రమ్=ఈ మూలాఖ్యమైన నక్షత్రము, గోభిః పశుభిః=గవాది పశువులతో, సమక్తమ్=సంబద్ధమై, అహర్భూయాత్=అహస్సువలె ప్రకాశిత మగుగాక.

తాత్పర్యము : నేను మూలాఖ్యమైన నక్షత్రమును సేవించి శూరభటయుక్తమైన పుత్రాదిప్రజను పొందెదను గాక. నిర్ఋతి యను ఒకొనొక రాక్షసదేవత పరాఙ్ముఖియై పునరావృత్తిరహితమైన మార్గముచే నిటు పోవుగాక. యజమానుడనైన నాకొఱకు ఈ మూలాఖ్యమైన నక్షత్రము గవాదిపశువులతో సంబద్ధమై దివసమువలె ప్రకాశిత మగుగాక. ఈ ఋక్కు తృతీయ నక్షత్రదేవునకు పురోనువాక్య.

6. మంత్రము : **అహర్నో అద్య సువితే దధాతు ।మూలం నక్షత్రమితి యద్వదన్తి ।పరాచీం వాచా నిర్ఋతిం నుదామి।**

శివం ప్రజాయై శివమస్తు మహ్యమ్, ఇతి ।

అర్థము : (సర్వే లోకాః=సర్వజనులు,) యత్=ఏ నక్షత్రమును, మూలం నక్షత్రమితి=మూలనక్షత్రమని, వదన్తి=చెప్పుచున్నారో, తత్=ఆ నక్షత్రము, అద్య=ఈ కర్మయందు, అహః=దినమువలె (పగటివలె, ప్రకాశకం భూత్వా=ప్రకాశకమైన,) నః=మమ్ము, సువితే=సుష్ఠుగ బొందదగిన ఫలమునందు, దధాతు=స్థాపించుగాక. అహం తు=నేను మాత్రము, త్వత్ప్రసాదాత్=నీ యనుగ్రహము వలన, పరాచీమ్=పరాఙ్ముఖియైన,నిర్ఋతిమ్=నిర్ఋతిని, వాచా=వాఙ్మాత్రముచే, నుదామి=నిరాకరించుచున్నాను. ప్రజాయై=నా ప్రజకొఱకు, శివమ్=శ్రేయస్సు, అస్తు=అగుగాక. మహ్యం చ=నాకొఱకును, శివమ్, అస్తు.

తాత్పర్యము : లోకమునందు సర్వజనులు మూలనక్షత్రమని చెప్పుచున్న నక్షత్ర మీ కర్మయందు పగటివలె ప్రకాశకమై మమ్ము సుష్ఠుగ పొందదగిన ఫలమునందు స్థాపించుగాక. నేను మాత్రము ఓ మూలనక్షత్రమా! నీ యనుగ్రహమువలన పరాఙ్ముఖియైన నిర్ఋతిని వాఙ్మాత్రముచే నిరాకరింతును. నా ప్రజకు, నాకును శ్రేయ మగుగాక. ఇది యా తృతీయ నక్షత్రదేవునకే యాజ్య.

7. మంత్రము : **యా దివ్యా ఆపః పయసా సంబభూవుః । యా అన్తరిక్ష ఉతపార్థివీర్యాః । యాసామషాఢా అనుయన్తి కామమ్ । తా న ఆపః శగ్ం స్యోనా భవన్తు, ఇతి।**

అర్థము : దివ్యాఃదివియందు పుట్టినవియగు, యాఃఆపఃఏ యుదకములు, పయసాపేయత్వహేతువుచే, సంబభూవుఃసముత్పన్నములో, యాఃఏ యుదకములు, అన్తరిక్షేఅంతరిక్షమునందు, వర్తన్తేఉంటున్నవో, ఉతమఱియు, యాఃఉదకములు, పార్థివీఃపృథివియందు పుట్టినవో, యాసామ్ఏ అబ్దేవతలయొక్క, కామమ్ఇచ్ఛను, అషాఢాఃపూర్వాషాఢా నక్షత్రవిగ్రహములు, అనుయన్తిఅనుసరించివర్తించుచున్నవో, తాఃఆ యుదకములు, నఃమాకు, శం భవన్తుఅనిష్ట శాంతి హేతువులగుఁగాక. సోన్యాఃసుఖహేతువులును, భవన్తుఅగుఁగాక.

తాత్పర్యము : దివియందు ఉదకములు త్రాగుటకై పుట్టినవి. అవిగాక, యంతరిక్షమునందు, పృథివియందును పుట్టిన యుదకములు కలవు. పూర్వాషాఢానక్షత్రవిగ్రహములా యబ్దేవతల యిచ్ఛ ననుసరించి వర్తించుచున్నవి. అట్టి యుదకములు మాకు అనిష్టశాంతిహేతువులు, సుఖహేతువులు నగుఁగాక. ఈ ఋక్కు చతుర్థ నక్షత్రదేవునకు పురోనువాక్య.

8. మంత్రము : యాశ్చ కూప్యా యాశ్చ నాద్యాఃసముద్రియాఃయాశ్చ వైశన్తీరుత ప్రాసచీర్యాఃయాసామషాఢా మధు భక్షయన్తి తా న ఆపఃశగ్ం స్యోనా భవన్తు, ఇతి ।

అర్థము : యాశ్చ ఆపఃఏ యుదకములును, కూప్యాఃకూపమునందుపుట్టినవో, యాశ్చఏ యుదకములును, నాద్యాఃనదియందు పుట్టినవో, సముద్రియాఃసముద్రమునందు పుట్టినవో, యాఃఏ యుదకములు, వైశన్తీఃపల్వములందు (గుంటలందు) పుట్టినవో, ఉతమఱియు, యాఃఏ యుదకములు, ప్రాసచీఃప్రకర్షముగ నిటునటు వచ్చునట్టివో, యాసామ్ఏ యుదకములయొక్క, స్వాదువైన రసమును, అషాఢాఃపూర్వాషాఢానక్షత్రదేవతలు, భక్షయన్తిభక్షించుచున్నారో, తాఃఆ యుదకములు, నఃమాకు, శమ్అనిష్టశాంతిహేతువులు, సోన్యాఃసుఖహేతువులును, భవన్తుఅగుఁగాక.

తాత్పర్యము : నూయి, నది, సముద్రము, పల్వలము మొదలగువానియందు వివిధములైన యుదకములు కలవు. కొన్ని యుదకము లిటునటు వచ్చుచుండును. ఆ సర్వవిధములైన యుదకములందుఁ గల స్వాదురసమును పూర్వాషాఢానక్షత్రదేవతలు భక్షించుచుందురు. అట్టి యుదకములు మాకు అనిష్టశాంతిహేతువులు, సుఖహేతువులు నగుఁగాక. ఈ ఋక్కు ఆ చతుర్థనక్షత్రదేవునకే యాజ్య.

9. మంత్రము : తన్నో విశ్వే ఉపశృణ్వన్తు దేవాఃతదషాఢా అభిసంయన్తు యజ్ఞమ్ । తన్నక్షత్రం ప్రథతాం పశుభ్యఃకృషిర్వృష్టిర్యజమానాయ కల్పతామ్, ఇతి ।

అర్థము : విశ్వే దేవాఃసర్వదేవతలు, నఃమాయొక్క, తత్ఆ విజ్ఞాపనమును, ఉపశృణ్వన్తుఁవిందురు గాక. తత్అప్పుడు, అషాఢాఃఉత్తరాషాఢానక్షత్రవిగ్రహములు, యజ్ఞమ్మా యజ్ఞమును, అభిసంయన్తుఅంతటను బాగుగ పొందుఁగాక. తత్నక్షత్రమ్ఆ యుత్తరాషాఢానక్షత్రము, పశుభ్యఃపశువులకొఱకు, ప్రథతామ్ప్రఖ్యాత మగుఁగాక. తతఃఆ ప్రఖ్యాతివలన, యజమానాయయజమానునికొఱకు, కృషిఃసేద్యము, వృష్టిఃవృష్టియు, కల్పతామ్సంపన్నము లగుఁగాక.

తాత్పర్యము : సర్వదేవతలు మా విజ్ఞాపనమును విందురు గాక. అప్పుడు ఉత్తరాషాఢానక్షత్రవిగ్రహములు మా యజ్ఞమును పొందుcగాక. ఆ యుత్తరాషాఢానక్షత్రము పశువులకొఱకు ప్రఖ్యాత మగుcగాక. ఆ ప్రఖ్యాతివలన యజమానునకు కృషి, వృష్టియు సంపన్నము లగుcగాక. ఈ ఋక్కు పంచమ నక్షత్రదేవునకు పురోనువాక్య.

10. మంత్రము :శుభ్రాః కన్యా యువతయః సుపేశసః । కర్మకృతః సుకృతో వీర్యావతీః । విశ్వాన్దేవాన్హవిషా వర్ధయన్తీः।

అషాఢాः కామముపయాన్తు యజ్ఞమ్ (4), ఇతి ।

అర్థము : శుభ్రాः=నిర్మలులును, కన్యాः=కాంతియుక్తులును, యువతయः=నిత్యతరుణులును, సుపేశసः=సురూపులును, కర్మకృతः=కర్మకరణకుశలురును, సుకృతः=బాగుగcజేయువారును, వీర్యావతీः= ప్రసవసామర్థ్యవతులును, విశ్వాన్దేవాన్=స్వకీయస్వాములను, హవిషా=అస్మదీయ హవిస్సుచే, వర్ధయన్తీः=పరితోషింపcజేయుచున్నవారునునగు, అషాఢాः=ఉత్తరాషాఢానక్షత్రదేవతలు, కామమ్=కామ్యమాన మగు (కోరcబడుచున్న) యజ్ఞమ్=మా యజ్ఞమును, ఉపయాన్తు=పొందుదురు గాక.

తాత్పర్యము : శుభ్రత్వాది గుణవిశిష్టులైన ఉత్తరాషాఢానక్షత్రదేవతలు మా యజ్ఞమునకు వత్తురు గాక. ఈ ఋక్కు ఆ పంచమ నక్షత్రదేవునకే యాజ్య.

11. మంత్రము :యస్మిన్బ్రహ్మ క్షత్రమభ్యజయత్సర్వమేతత్ । అముం చ లోకమిదమూ చ సర్వమ్ । తన్మే నక్షత్రమభిజిద్విజిత్యै। శ్రియం దధాత్వహృణీయమానమ్, ఇతి ।

అర్థము : యస్మిన్=ఏ నక్షత్రమునందు, బ్రహ్మ=ప్రజాపతి, అముం లోకం చ=స్వర్గలోకమును, ఇదమూ చ=ఈ భూలోకాదికమును, సర్వమ్=సమస్తమును, అభ్యజయత్=అంతటను జయించెనో, తత్=ఆ జయసాధనమైన, అభిజిత్ నక్షత్రమ్=అభిజిన్నామకమైన నక్షత్రము, నः=మాకొఱకు, శ్రియమ్=వైరిసంబంధినియగు సంపదను, విజిత్య=జయించి, అహృణీయమానమ్=ఆ వైరులచే నపహరింప నశక్యమునుగా, కృత్వా=చేసి, దధాతు=మాయందు స్థాపించుcగాక.

తాత్పర్యము : ప్రజాపతి అభిజిన్నక్షత్రమునందు స్వర్గలోకమును, భూరాదికమైన సర్వమును జయించెను. జయసాధనమైన ఆ యభిజిన్నామకనక్షత్రము వైరిసంబంధినియైన సంపదను జయించి, ఆ సంపదను వైరులచే నపహరింప శక్యము కానిదానినిగాc జేసి మాయందు స్థాపించుcగాక. ఈ ఋక్కు షష్ఠనక్షత్రదేవునకు పురోనువాక్య.

12. మంత్రము :ఉభౌ లోకౌ బ్రహ్మణా సంజితేమౌ । తన్మే నక్షత్ర మభిజిద్విచష్టామ్ । తస్మిన్వయం పృతనాः సంజయేమ।

తం నో దేవాసో అనుజానన్తు కామమ్, ఇతి ।

అర్థము : ఇమౌ ఉభౌ లోకౌ=భువి, దివి అను ఈ యుభయలోకములు, (అభిజిన్నామ్ని నక్షత్రే=అభిజిన్నామక నక్షత్రమునందు,) బ్రహ్మణా=ప్రజాపతిచే, సంజితా (తౌ)=బాగుగ జయింపcబడినవి. తత్=అభిజిత్

నక్షత్రమ్=ఆ యభిజిన్నక్షత్రము, నః=మమ్ము, (దేవేషు=దేవతలందు,)విచష్టామ్=విశేషముగ ఖ్యాపనము చేయుఁగాక(తెలియపఱుచుఁగాక). తస్మిన్=ఆ యభిజిన్నక్షత్రమునందు, కర్మానుష్ఠాయినఃకర్మ ననుష్ఠించునట్టి, వయమ్=మేము, పృతనాఃపరకీయసేనలను, సంజయేమ=బాగుగ జయింతుముగాక. దేవాసఃదేవత లందఱు, నఃమాయొక్క, తం కామమ్=ఆ కోరికను, అనుజానన్తు=అంగీకరింతురుగాక.

తాత్పర్యము : ప్రజాపతి భువిని, దివిని అభిజిన్నక్షత్రమునందు జయించెను. ఆ యభిజిన్నక్షత్రము మమ్ము దేవతలకుఁ దెలియపఱుచుఁగాక. ఆ నక్షత్రమునందు కర్మానుష్ఠానము చేయుచున్న మేము పరకీయసేనలను బాగుగ జయింతుము గాక. పరకయసేనలను జయించవలెననెడి మా కోరికను దేవతలంద ఱంగీకరింతురు గాక. ఈ ఋక్కు ఆ షష్ఠనక్షత్రదేవునకే యాజ్య.

13. మంత్రము :**శ్రుణ్వన్తి శ్రోణామమృతస్య గోపామ్। పుణ్యామస్యా ఉపశృణోమి వాచమ్ (5)। మహీం దేవీం విష్ణు పత్నీమజూర్యామ్। ప్రతీచీమేనాగ్ం హవిషా యజామః, ఇతి।**

అర్థము : అమృతస్య=కర్మఫలమునకు, గోపామ్=రక్షకమగు, శ్రోణామ్=శ్రవణనక్షత్రరూపతనువును, శృణ్వన్తి=వినుచున్నారు. (అహమపి=నేను గూడ,)అస్యాఃఈ శ్రోణయొక్క, పుణ్యాం వాచమ్=కీర్తిరూప వాక్కును, ఉపశృణోమి=వినుచున్నాను. మహీమ్=గొప్పదియు (గుణాధికయు), దేవీమ్=ప్రకాశించు చున్నదియు, విష్ణుపత్నీమ్=విష్ణువునకు పాలయిత్రియు, అజూర్యామ్=సంతాపరహితయు, ప్రతీచీమ్=అభిముఖయునగు, ఏనామ్=ఈ శ్రోణను, వయమ్=మేము, హవిషా=హవిస్సుచే, యజామఃయజించు చున్నాము (పూజించుచున్నాము).

తాత్పర్యము : కర్మఫలమునకు రక్షకమగు శ్రవణనక్షత్రతనువును సర్వజనులు వినుచున్నారు. నేనుఁ గూడ శ్రోణయొక్క కీర్తిరూపవాక్కును వినుచున్నాను. మహీత్వాది గుణవిశిష్టమైన యీ శ్రోణను మేము హవిస్సుచే పూజించు చున్నాము. ఇది సప్తమ నక్షత్రదేవునకు పురోనువాక్య.

14. మంత్రము :**త్రేధా విష్ణురురుగాయో విచక్రమే। మహీం దివం పృథివీమన్తరిక్షమ్। తచ్ఛ్రోణైతి శ్రవ ఇచ్ఛమానా। పుణ్యగ్ం శ్లోకం యజమానాయ కృణ్వతీ, ఇతి।**

అర్థము : ఉరుగాయఃగొప్పగా వేదములందు గానము చేయఁబడుచున్న (వినఁబడుచున్న), విష్ణుఃవిష్ణువు, మహీం దివమ్=గొప్పదైన ద్యులోకమును, పృథివీమ్=పృథివిని, అన్తరిక్షమ్=అంతరిక్షమును, ఉద్దిశ్య=ఉద్దేశించి, త్రేధా=మూఁడువిధములుగ, విచక్రమే=వివిధమైన క్రమణమును చేసెను(పాదత్రయముచే లోకత్రయమును వ్యాపించెను). తత్=ఆ త్రివిక్రమరూపమును, శ్రవఃఇచ్ఛమానా=కీర్తి నపేక్షించుచున్నదియు, యజమానాయ=యజమానునికొఱకు, పుణ్యం శ్లోకమ్=ఉత్తమమైన కీర్తిని, కృణ్వతీ=చేయుచున్నదియు నగు, శ్రోణా=నక్షత్రరూప శ్రోణ, ఏతి=పొందుచున్నది.

తాత్పర్యము : వేదములందు గొప్పఁగా గానము చేయఁబడుచున్న విష్ణువు పాదత్రయముచే లోకత్రయమును వ్యాపించెను. ఆ త్రివిక్రమరూపమును నక్షత్రరూపయైన శ్రోణ పొందుచున్నది. ఆ శ్రోణ కీర్తి నపేక్షించుచున్నది. యజమానునుకు ఉత్తమకీర్తిని చేయుచున్నట్టిది. ఇది ఆ సప్తమ నక్షత్రదేవునకే యాజ్య.

15. మంత్రము :**అష్టా దేవా వసవః సోమ్యాసః । చతస్రో దేవీరజరాः శ్రవిష్ఠాः । తే యజ్ఞం పాన్తు రజసः పరస్తాత్ ।**

సంవత్సరీణమమృతగ్ం స్వస్తి (6), ఇతి ।

అర్థము : సోమ్యాసః=రమణీయ మూర్తులును, వసవః=వసు నామకులునగు, దేవాः=దేవతలు, అష్టౌ=అష్ట సంఖ్యాకులు. శ్రవిష్ఠాः=ధనిష్ఠానక్షత్రమూర్తులు, చతస్రః=చతుస్సంఖ్యాకములు, దేవీः=ద్యోతమానములు, అజరాः=జరారహితములును. తే సర్వే=వా రందఱు, యజ్ఞమ్=మా యజ్ఞమును, పాన్తు=రక్షింతురు గాక. రజసः పరస్తాత్=రజోగుణయుక్తమైన మనుష్యలోకముకంటె పరభాగమున, వర్తమానమ్=ఉంటున్నదియు, సంవత్సరీణమ్=సంవత్సరదేవతాసంబంధమును, అమృతమ్=అవినాశియునగు స్వర్గలోకమును, స్వస్తి=క్షేమముగ, (ప్రాప్నుయామ్=పొందుదును గాక).

తాత్పర్యము : రమణీయమూర్తులైన యష్ట వసుదేవతలు, ప్రకాశించుచున్న నాలుగు ధనిష్ఠానక్షత్రమూర్తులును మా యజ్ఞమును రక్షింతురు గాక. సంవత్సరీణమును, రజోగుణయుక్తమైన మనుష్యలోకముకంటె పరభాగమున నున్నట్టి యనశ్వరమైన స్వర్గలోకమును పొందుదును గాక. ఈ ఋక్కు అష్టమ నక్షత్రదేవునకు పురోనువాక్య.

16. మంత్రము :**యజ్ఞం నః పాన్తు వసవः పురస్తాత్ । దక్షిణతో ऽభియన్తు శ్రవిష్ఠాः । పుణ్యం నక్షత్రమభిసంవిశామ ।**

మా నో అరాతి రఘుశగ్ంసా ऽగన్, ఇతి ।

అర్థము : వసవః=అష్టవసువులు, నః=మాయొక్క, యజ్ఞమ్=యజ్ఞమును, పురస్తాత్=తూర్పుదిక్కునందు, పాన్తు=రక్షింతురు గాక. శ్రవిష్ఠాः=శ్రవిష్ఠానక్షత్రమూర్తులు, దక్షిణతः=దక్షిణదిక్కునందు, అభియన్తు=అభిముఖముగ పొందుదురు గాక. వయమపి=మేము కూడ, పుణ్యం నక్షత్రమ్=ధనిష్ఠయనెడి పుణ్యనక్షత్రమును, అభిసంవిశామ=అభిముఖముగ బాగుగ ప్రవేశింతుము (సేవింతుము)గాక. అఘుశంసా=మా పాపమును చెప్పునట్టి, అరాతిः=శత్రువు, నः=మమ్మఁగూర్చి, మా అగన్=రాకుండుఁగాక.

తాత్పర్యము : అష్టవసువులు మా యజ్ఞమును తూర్పుదిక్కునందు రక్షింతురు గాక. ధనష్ఠానక్షత్రమూర్తులు దక్షిణదిక్కునందు మా యజ్ఞము నభిముఖముగ పొందుదురు గాక. మేము కూడ ధనిష్ఠ యనెడి పుణ్యనక్షత్రమును సేవింతుము గాక. మా పాపమును చెప్పునట్టి శత్రువు మా దగ్గఱకు రాకుండుఁగాక. ఇది ఆ యష్టమనక్షత్రదేవునకే యాజ్య.

17. మంత్రము :**క్షత్రస్య రాజా వరుణో ऽధిరాజः । నక్షత్రాణాగ్ం శతభిషగ్వసిష్ఠः । తౌ దేవేభ్యः కృణుతో దీర్ఘమాయుः ।**

శతగ్ం సహస్రా భేషజాని ధత్తः, ఇతి ।

అర్థము : వరుణః=వరుణుఁడు, క్షత్రస్య=క్షత్రియజాతికి, రాజా=రాజు. అతః ఏవ=కనుకనే, అధిరాజః ఇతి=అధికుఁడగుటవలన రాజని, (ఉచ్యతే=చెప్పఁబడుచున్నాఁడు). నక్షత్రాణామ్=నక్షత్రములలో, శతభిషక్=శతభిషగనెడి నక్షత్రవిశేషము, వసిష్ఠః=అతిశయముగ నివాసహేతువు. తౌ=ఆ వరుణ శతభిషక్కులు, దేవేభ్యః=దేవతల కొఱకు, (యజమానస్య=యజమానునకు,) దీర్ఘమ్ ఆయుః=దీర్ఘమైన ఆయువును, కృణుతః=చేయుచున్నారు. (తత్సిద్ధ్యర్థమ్=ఆ దీర్ఘాయువు సిద్ధించుటకై,) శతమ్=శతసంఖ్యాకములును, సహస్రా(ణి)=సహస్రసంఖ్యాకములునగు, భేషజాని=ఔషధములను, ధత్తః=సంపాదించుచున్నారు.

తాత్పర్యము : వరుణదేవుఁడు సర్వక్షత్రియజాతికిఁ గూడ రాజు. కనుకనే యధికుఁడగుటవలన రాజని చెప్పఁబడుచున్నాఁడు. నక్షత్రములలో 'శతభిషక్' అనెడి నక్షత్రవిశేషము అతిశయముగ నివాసహేతువు. ఆ వరుణ శతభిషక్కులు దేవతలకై యజమానునకు దీర్ఘాయువును చేయుచున్నారు. ఆ దీర్ఘాయువు సిద్ధించుటకై శతసంఖ్యాకములు, సహస్రసంఖ్యాకములునైన యౌషధములను చేయుచున్నారు. ఈ ఋక్కు నవమ నక్షత్రదేవునకు పురోనువాక్య.

18. మంత్రము :**యజ్ఞం నో రాజా వరుణ ఉపయాతు । తం నో విశ్వే అభిసంయన్తు దేవాః (7) । తన్నో నక్షత్రగ్ం శతభిషగ్జుషాణమ్ । దీర్ఘమాయుః ప్రతిరద్భేషజాని, ఇతి ।**

అర్థము : వరుణః రాజా=వరుణరాజు, నః=మాయొక్క, యజ్ఞమ్=యజ్ఞమును, ఉపయాతు=పొందుఁగాక. నః=మాయొక్క, తమ్=ఆ యజ్ఞమును, విశ్వే దేవాః=సర్వదేవతలు, అభియన్తు=అభిముఖముగ బాగుగ పొందుదురు గాక. జుషాణమ్=ప్రీతియుక్తమైన, శతభిషక్ తత్ నక్షత్రమ్='శతభిషక్'అను ఆ నక్షత్రము, నః=మాకొఱకు, దీర్ఘమ్ ఆయుః=చిరకాలాయుష్యమును, భేషజాని=ఔషధములను, ప్రతిరత్=ప్రకర్షముగ నొసఁగుఁగాక.

తాత్పర్యము : వరుణరాజు మా యజ్ఞమునకు వచ్చుఁగాక. ఆ మా యజ్ఞమునకు సర్వదేవత లభిముఖముగ బాగుగ వత్తురు గాక. ప్రీతియుక్తమైన యా శతభిషన్నక్షత్రము మాకు దీర్ఘాయుష్యమును, ఔషధములను ప్రకర్షముగ నొసఁగుఁగాక. ఈ ఋక్కు ఆ నవమ నక్షత్రదేవునకే యాజ్య.

19. మంత్రము :**అజ ఏకపాదుదగాత్పురస్తాత్ । విశ్వా భూతాని ప్రతిమోదమానః । తస్య దేవాః ప్రసవం యన్తి సర్వే । ప్రోష్ఠపదాసో అమృతస్య గోపాః, ఇతి ।**

అర్థము : అజః=జన్మరహితుఁడును, ఏకపాత్=ఒకపాదముచేతనే దేవతలను రక్షించువాఁడునగు నొకానొక యగ్ని, (ఆదిత్యరూపం ధృత్వా=ఆదిత్యరూపమును ధరించి,) పురస్తాత్=తూర్పుదిక్కునందు, ఉదగాత్=ఉదయించుచున్నాఁడు.(వర్తమానార్థమున భూతకాలిక లఙ్ప్రత్యయము.) విశ్వా భూతాని=సర్వప్రాణులను, ప్రతిమోదమానః=ప్రత్యేకముగ సంతోషఱచుచు, వర్తతే=ఉంటున్నాఁడు. తస్య=ఆ సూర్యరూపుఁడైన అగ్నియొక్క, ప్రసవమ్=ప్రేరణమును, సర్వే దేవాః=సర్వదేవతలు, యన్తి= పొందు

చున్నారు. ప్రోష్ఠపదాసః = పూర్వపదాఖ్య నక్షత్రవిశేషములు, అమృతస్య = అవినాశియైన కర్మఫలమునకు, గోపాః = రక్షకములు.

తాత్పర్యము : 'అజుఁడు', 'ఏకపాత్తు' అనునవి ఒకొనొక యగ్నియొక్క నామధేయములు. అట్టి యగ్ని ఆదిత్య రూపమును ధరించి తూర్పుదిక్కునందు ఉదయించుచున్నాఁడు. ఆ సూర్యరూపుఁడైన యగ్నియొక్క ప్రేరణమును సర్వదేవతలు పొందుచున్నారు. పూర్వభాద్ర నక్షత్రవిశేషములు వినాశరహితమైన కర్మఫలమును రక్షించునవి. ఈ ఋక్కు దశమ నక్షత్రదేవునకు పురోనువాక్య.

20. మంత్రము : **విభ్రాజమానః సమిధాన ఉగ్రః । అన్తరిక్షమరుహదగం ద్యామ్ । తగ్ం సూర్యం దేవమజమేకపాదమ్ ।**
ప్రోష్ఠపదాసో అనుయన్తి సర్వే (8), ఇతి ।

అర్థము : విభ్రాజమానః = విశేషముగ దీపించుచున్నవాఁడును, సమిధానః = సమస్తములను బాగుగ ప్రకాశింపఁ జేయుచున్నవాఁడును, ఉగ్రః = తీక్ష్ణతేజుఁడునగు సూర్యరూపాగ్ని, అన్తరిక్షమ్ = అంతరిక్షమును. అరుహత్ = ఆరోహించెను. తతః = అనంతరము, ద్యామ్ = ద్యులోకమును, అగన్ = పొందెను. అజమ్ = (జన్మరహితుఁడు) అజుఁడును, ఏకపాదమ్ = ఏకపాదుఁడునగు, తం సూర్యం దేవమ్ = ఆ సూర్యదేవుని, ప్రోష్ఠపదాసః = పూర్వభాద్రపదాఖ్యా నక్షత్రవిశేషములు, సర్వే = అన్నియు, అనుయన్తి = అనువర్తించుచున్నవి.

తాత్పర్యము : విభ్రాజమానత్వాది గుణవిశిష్టఁడైన సూర్యరూపాగ్ని అంతరిక్షము నారోహించి యనంతరము ద్యులోకమును పొందెను. అజుఁడు, ఏకపాదుఁడునగు ఆ సూర్యదేవుని పూర్వపదాఖ్య నక్షత్రవిశేషములన్నియు ననువర్తించుచున్నవి. ఈ ఋక్కు ఆ దశమ నక్షత్రదేవునకే యాజ్య.

21. మంత్రము : **అహిర్బుధ్నియః ప్రథమాన ఏతి । శ్రేష్ఠో దేవానాముత మానుషాణామ్ । తం బ్రాహ్మణాః సోమపాః**
సోమ్యాసః । ప్రోష్ఠపదాసో అభిరక్షన్తి సర్వే, ఇతి ।

అర్థము : దేవానామ్ = దేవతలలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుఁడును, ఉత = మఱియు, మనుష్యాణామ్ = మనుష్యులలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుఁడునగు, అహిర్బుధ్నియః = రుద్రుఁడు, ప్రథమానః = విశ్వమును వ్యాపించుచున్నవాఁడై, ఏతి = పోవుచున్నాఁడు. తమ్ = అటువంటి రుద్రుని, సోమపాః = సోమమును త్రాగువారును, సోమ్యాసః = రమణీయదేహులునగు, బ్రాహ్మణాః = బ్రాహ్మణులు, ప్రోష్ఠపదాసః = ఉత్తరభాద్రపదాఖ్య నక్షత్రవిశేషములును, సర్వే = అందఱు, అభిరక్షన్తి = అంతటను సేవించుచున్నారు.

తాత్పర్యము : దేవతలలోను, మనుష్యులలోను శ్రేష్ఠుఁడగు రుద్రుఁడు విశ్వమును వ్యాపించుచు పోవుచున్నాఁడు. సోమపీథులు, రమణీయదేహులునగు బ్రాహ్మణులు, ఉత్తరభాద్రపదాఖ్య నక్షత్రవిశేషములును, అందఱు అటువంటి రుద్రు నంతటను సేవించుచున్నారు. న హీయతే ఇతి అహిః = ఒకప్పుడును హీనుఁడు కానివాఁడు. బుధ్నే = మూలే జగదాదౌ భవః బుధ్నియః = జగదాదియందు ఉన్నవాఁడు. ఈ పదద్వయము కలసి రుద్రవిశేషమునకు నామధేయము. ఈ ఋక్కు ఏకాదశ నక్షత్రదేవునకు పురోనువాక్య.

22. మంత్రము :**చత్వార ఏకమభికర్మ దేవాః । ప్రోష్ఠపదాస ఇతి యాన్వదన్తి । తే బుధ్నియం పరిషద్యగ్ం స్తువన్తః ।**

అహిగ్ం రక్షన్తి నమసోపసద్య, ఇతి ।

అర్థము : చత్వారః=చతుస్సంఖ్యాక నక్షత్రమూర్తిరూప దేవతలు, ఏకమ్=ఈ కర్మను, అభిరక్షన్తి=అంతటను సేవించుచున్నారు. యాన్=ఏ దేవతలను నలుగురిని, ప్రోష్ఠపదాసః ఇతి='ఉత్తరభాద్రపద'అను నామముతో, వదన్తి=సర్వజనులు వ్యవహరించుచున్నారో, తే=ఆ నలుగురు దేవతలు, పరిషద్యమ్=సభాయోగ్యcడగు, అహింబుధ్నియమ్=అహిర్బుధ్నియ నామక దేవుని, నమసా=నమస్కారముచే, ఉపసద్య=సేవించి, స్తువన్తః= స్తుతించుచున్నవారై, రక్షన్తి=సమీపమున నుంటున్నారు.

తాత్పర్యము : నక్షత్రమూర్తిరూప దేవతలు ఈ కర్మను సేవించుచున్నారు. ఆ దేవతలను నలుగురిని 'ఉత్తరభాద్రపద' అని సర్వజనులు వ్యవహరించుచున్నారు. ఆ నలుగురు దేవతలు సభాయోగ్యcడును, అహిర్బుధ్నియ నామకుcడు నగు రుద్రుని నమస్కారముచే సేవించి స్తుతించుచున్నవారై సమీపమున ఉంటున్నారు. ఇది ఆ యేకాదశ నక్షత్రదేవునకే యాజ్య.

23. మంత్రము :**పూషా రేవత్యన్వేతి పన్థామ్ । పుష్టిపతీ పశుపా వాజవస్త్యా (9) । ఇమాని హవ్యా ప్రయతా జుషాణా**

సుగైర్నో యానైరుపయాతాం యజ్ఞమ్, ఇతి ।

అర్థము : పూషా=పూష నామక దేవుcడు, పన్థామ్=మా యజ్ఞమార్గమును, అన్వేతి=అనుసరించి పోవుచున్నాcడు. రేవతీ=రేవతి, పన్థామ్, అన్వేతి. పుష్టిపతీ=పుష్టికి పాలకులును, పశుపా=పశువులకు పాలకులును, వాజవస్త్యా=అన్నముచేc గలిగిన బలమునకు యోగ్యులనగు, తౌ=ఆ యుభయులు, ప్రయతా(ని)=శుద్ధములైన, ఇమాని హవ్యా(ని)=ఈ హవిస్సులను, జుషాణా=సేవించుచున్నవారై, సుగైః=సుష్ఠగవెళ్లుటకు శక్యములైన, యానైః=మార్గములచేత, యజ్ఞమ్=యజ్ఞమును, ఉపయాతామ్=పొందుcగాక.

తాత్పర్యము : పూషదేవుcడు, రేవతి (నక్షత్రము) మా యజ్ఞము ననుసరించి పోవుచున్నారు. పుష్టిపతిత్వాది గుణ విశిష్టులైన ఆ యుభయులు శుద్ధములైన యీ హవిస్సులను సేవించుచున్నవారై సుష్ఠగ పోవుటకు శక్యములైన మార్గములచే యజ్ఞమును పొందుదురు గాక. ఈ ఋక్కు ద్వాదశనక్షత్రదేవునకు పురోనువాక్య.

24. మంత్రము :**క్షుద్రాన్పశూన్రక్షతు రేవతీ నః । గావో నో అశ్వాగ్ం అన్వేతు పూషా । అన్నగ్ం రక్షన్తౌ బహుధా**

విరూపమ్। వాజగ్ం సనుతాం యజమానాయ యజ్ఞమ్, ఇతి ।

అర్థము : రేవతీ=నక్షత్రరూప రేవతి, నః=మాయొక్క, క్షుద్రాన్ పశూన్=వత్సరూపములైన పశువులను, రక్షతు=రక్షించుగాక. పూషా=పూషదేవుcడు, నః=మాయొక్క, గావః(గాః)=గోవులను, అశ్వాన్=అశ్వములను, రక్షతు=రక్షించుcగాక. తౌ=ఆ యుభయులు, అన్నమ్=అన్నమును, రక్షన్తౌ=రక్షించుచున్నవారై, బహుధా=

వ్రీహి యవ ముద్గ గోధూమాదికములైన బహుప్రకారములచే, విరూపమ్=విలక్షణమైన, వాజమ్=యజ్ఞమును, తత్సాధనభూతమ్=తత్సాధనమైన, యజ్ఞమ్=యజ్ఞమును, యజమానాయ=యజమానుని కొఱకు, సనుతామ్= ఇత్తురుగాక.

తాత్పర్యము : నక్షత్రరూప రేవతి మాయొక్క వత్సరూప పశువులను రక్షించుగాక. పూషదేవుడు మా గోవులను, అశ్వములను రక్షించుగాక. ఆ యుభయులు అన్నమును రక్షించుచున్నవారై వ్రీహి యవ ముద్గ గోధూమాదికములైన బహుప్రకారములచే విలక్షణమైన యన్నమును, తత్సాధనమైన యజ్ఞమును యజమానున కొసగుదురు గాక. ఇది యా ద్వాదశనక్షత్రదేవునకే యాజ్య.

25. మంత్రము :**తదశ్వినావశ్వయుజోపయాతామ్ । శుభం గమిష్మా సుయమేభిరశ్వైః । స్వం నక్షత్రగ్ం హవిషా యజన్తౌ।**

మధ్వా సంపృక్తౌ యజుషా సమక్తౌ (1 0), ఇతి ।

అర్థము : సుయమేభిః=సుష్ఠగ నియమించుటకు శక్యములైన, అశ్వైః=అశ్వములచే, శుభం గమిష్మా=అతిశయముగ శుభముగ పోవువారును, స్వం నక్షత్రమ్=స్వకీయమైన అశ్వయుగాఖ్య నక్షత్రమును, హవిషా=మా హవిస్సుచే, యజన్తౌ=పూజించుచున్నవారును, మధ్వా=మధురరసమైన, హవిషా=హవిస్సుతో, సంపృక్తౌ=సంబద్ధులును, యజుషా=మంత్రముచే, సమక్తౌ=బాగుగ ప్రకాశింపబడినవారునగు, అశ్వినౌ=అశ్వినీదేవతలు, అశ్వయుజా=అశ్వయుజ్నామకమైన నక్షత్రముతోగూడ, తత్=ఆ మా యజ్ఞకర్మను, ఉపయాతామ్=పొందుదురు గాక.

తాత్పర్యము : అశ్వినీదేవతలు అశ్వయుజ్నామకమైన నక్షత్రముతోగూడ మా యజ్ఞకర్మకు వత్తురు గాక. ఆ యశ్వినీ దేవతలు సుష్ఠగ నియమించుటకు శక్యములైన యశ్వములచే నతిశయముగ శుభముగ బోవువారు. స్వకీయమైన అశ్వయుగాఖ్యమైన నక్షత్రమును మా హవిస్సుచే పూజించువారు. మధురరసవంతమైన హవిస్సుతోగూడియున్నవారు. మంత్రముచే బాగుగ ప్రకాశితులు. ఈ ఋక్కు త్రయోదశ నక్షత్రదేవునకు పురోనువాక్య.

26. మంత్రము :**యౌ దేవానాం భిషజౌ హవ్యవాహౌ, విశ్వస్య దూతావమృతస్య గోపౌ । తౌ నక్షత్రం జుజుషాణోపయాతామ్।**

నమో కశ్విభ్యాం కృణుమో కశ్వయుగ్భ్యామ్, ఇతి ।

అర్థము : యౌ=ఏ యశ్వినీదేవతలు, దేవానామ్=దేవతలకు, భిషజౌ=చికిత్సకులో, హవ్యవాహౌ=హవిస్సును వహించువారో, విశ్వస్య=సర్వజగత్తునకు, దూతౌ=దూతలవలె హితకారులో, అమృతస్య=కర్మఫలమునకు, గోపౌ=రక్షకులో, తౌ=ఆ యుభయులు, నక్షత్రమ్=స్వకీయమైన అశ్వయుగాఖ్య నక్షత్రమును, జుజుషాణౌ =సేవించుచున్నవారై, ఉపయాతామ్=మా యజ్ఞమును పొందుదురు గాక. అశ్విభ్యామ్=అశ్వినీదేవతల కొఱకు, అశ్వయుగ్భ్యామ్=నక్షత్రశరీములకొఱకును, నమఃకృణుమఃకృణుమః=నమస్కారమును, కృణుమఃకృణుమః=చేయుచున్నాము.

తాత్పర్యము : దేవభిషక్త్వాది గుణవిశిష్టులైన అశ్వినీదేవత లుభయులు అశ్వయుగాఖ్యమైన స్వకీయ నక్షత్రమును సేవించుచున్నవారై మా యజ్ఞకర్మకు వత్తురు గాక. మేము అశ్వినీదేవతలకును, అశ్వయుగ్నక్షత్ర శరీరములకును నమస్కారమును చేయుచున్నాము. ఇది యా త్రయోదశ నక్షత్రదేవునకే యాజ్య.

27. మంత్రము :**అప॑ ప్రా॒ప్మానం॑ భర॑ణీర్భరన్తు । తద్య॒మో రా॒జా॒ భగ॑వాన్వి॒చష్టా॑మ్ । లో॒కస్య॑ రా॒జా॒ మహ॑తో॒ మహో॒ర్ని ।**

సు॒గం న॒ः పన్థా॑మ॒భయం॑ కృణోతు, ఇతి ।

అర్థము : భరణీః=భరణ్యాఖ్య నక్షత్రవిగ్రహములు, ప్రాప్మానమ్=మా పాపమును, అపభరన్తు=నశింపఁజేయుఁగాక. తత్=ఆ భరణీనక్షత్రమును, భగవాన్=ఐశ్వర్యాదిగుణ యుక్తుఁడైన, యమః రాజా=యమధర్మరాజు, విచష్టామ్= విశేషముగఁ జూచుఁగాక (అనుగ్రహించుఁగాక). హి=ఏ కారణమువలన, అయమ్=ఈ యముఁడు, లోకస్య= లోకమునకు, మహోర్ రాజా=గొప్ప రాజో, తత్=ఆ కారణమువలన, నః=మాకు, సుగమ్=సుగమమైన, పన్థామ్(పన్థానమ్)=మార్గమును, అభయమ్=భయరహితమునుగ, కృణోతు= చేయుఁగాక.

తాత్పర్యము : భరణీ నామకములైన నక్షత్రవిగ్రహములు మా పాపమును నశింపఁజేయుఁగాక. ఆ భరణీనక్షత్రమును ఐశ్వర్యాదిగుణోపేతుఁడైన యమధర్మరాజు విశేషముగఁజూచుఁగాక. (అనుగ్రహించుఁగాక). ఈ యముఁడు లోకమునకు మహారాజు కనుక మాకు సుగమమైన మార్గమును భయరహితమునుగఁ జేయుఁగాక. ఈ ఋక్కు చతుర్దశ నక్షత్రదేవునకు పురోనువాక్య.

28. మంత్రము :**యస్మి॒న్నక్ష॒త్రే॑ యమ ఏతి రా॒జా॑ । యస్మి॒న్నేన॑ మభ్యషి॒ఞ్చన్త॒ దే॒వాः । తద॑స్య చి॒త్రగ్ం హ॒విషా॑ యజామ ।**

అప॑ ప్రా॒ప్మానం॑ భర॑ణీర్భరన్తు, ఇతి ।

అర్థము : యస్మిన్=ఏ భరణీ నక్షత్రమునందు, యమః రాజా=యమధర్మరాజు, ఏతి=వెళ్లుచున్నాఁడో, దేవాః= దేవతలు, యస్మిన్=ఏ భరణీనక్షత్రమునందు, ఏనమ్=ఈ యమును, అభ్యషిఞ్చన్త=అభిషేకించిరో, అస్య= ఈ యముని యొక్క, చిత్రమ్=ఆశ్చర్యకరమైన, తత్=ఆ భరణీనక్షత్రమును, హవిషా=హవిస్సుచే, యజామ=పూజింతుము. భరణీః, ప్రాప్మానమ్, అపభరన్తు. (ఈ వాక్యార్థమును **27** మంత్రవ్యాఖ్యానమునఁ జూడుఁడు.)

తాత్పర్యము : యమధర్మరాజు భరణీనక్షత్రమునందు వెళ్లుచున్నాఁడు. దేవత లందఱు యముని భరణీనక్షత్రమునం దభిషిక్తునిఁ జేసిరి. ఈ యమునిసంబంధియు, నాశ్చర్యకరమునైన యా భరణీనక్షత్రమును హవిస్సుచే పూజింతుము. భరణ్యాఖ్యనక్షత్రవిగ్రహములు మా పాపమును నశింపఁజేయుఁగాక. ఇది యా చతుర్దశ నక్షత్రదేవునకే యాజ్య.

29. మంత్రము :**నివే॑శనీ॒ యత్తే॑ దే॒వా అద॑ధుः (1 1), ఇతి ।**

తతార మహ్యం వాసవీర్యా యాన్తు యజ్ఞం వాచగ్ం స్వస్తి దేవా అనుయన్తి సర్వే వాజవస్త్యా సమక్తా దేవాస్త్రీణి చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే ద్వితీయోఽనువాకః ॥ ౨ ॥

వివరణము: ''నిపేశనీ సంగమతీ వసూనామ్'' అనునది పురోనువాక్య. ''యత్తే దేవా అదధుర్భాగధేయమ్'' అనునది యాజ్య. ఈ యుభయము ''పూర్ణా పశ్చాత్'' అను అనువాకమునందు వ్యాఖ్యానించబడినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ప్రథమ ప్రపాఠకమునందు ద్వితీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే

తృతీయోఽనువాకః

1. మంత్రము : **నవో నవో భవతి జాయమానో యమాదిత్యా అగ్ంశు మాప్యాయయన్తి, ఇతి ।**

అవతారిక: ద్వితీయానువాకమునందు యమనక్షత్రేష్టలకు యాజ్యాపురోనువాక్య లభిహితము లైనవి. ఇక ఈ తృతీయా నువాకమునందు చాంద్రమసాదీష్టలకు యాజ్యాపురోనువాక్యలు చెప్పcబడుచున్నవి.

వివరణము: ''నవో నవో భవతి జాయమానః'' అనునది పురోనువాక్య. ''యమాదిత్యా అగ్ంశు మాప్యాయయన్తి'' అనునది యాజ్య. ఈ యుభయము ''నవోనవో భవతి'' అను అనువాకమునందు వ్యాఖ్యానించc బడినది.

2. మంత్రము : **యే విరూపే సమనసా సంవ్యయన్తి ।సమానం తన్తుం పరితాతనాతే ।విభూ ప్రభూ అనుభూ విశ్వతో హువే ।తే నో నక్షత్రే హవమాగమేతమ్, ఇతి ।**

అర్థము : యే=ఏ అహోరాత్రదేవతలు, విరూపే=శుక్లకృష్ణ వర్ణ భేదముచే పరస్పరవిలక్షణములు, సమనసా=సమానమనస్కములును, సంవ్యయన్తి=అంతట నాచ్ఛాదించుచున్నవియు, సమానం తన్తుమ్=ఏకరూపమైన తంతువును, పరితాతనాతే=అంతటను విస్తరింపcజేయుచున్నవియు, విభూ=వ్యాప్తిమతులును, ప్రభూ=శక్తిమతులును, అనుభూ=అనుభవయోగ్యములునో, (తాదృశ్యౌ దేవతే=అటువంటి దేవతలను, అహమ్=నేను,) విశ్వతః=అంతటను, హువే=ఆహ్వానించుచున్నాను. తే యువామ్=అటువంటి మీరు, నక్షత్రే=ఒకానొక నక్షత్రయుక్తమైన యనుష్ఠాన దినమునందు, నః=మాయొక్క, హవమ్=యజ్ఞమును గూర్చి, ఆగమేతమ్= రండు.

తాత్పర్యము : అహోరాత్రదేవతలు విరూపత్వాది గుణవిశిష్టలు. తాయమానమైన యజ్ఞమును గాని, సంవత్సరమును గాని విస్తరింపcజేయువారు. అటువంటి అహోరాత్రదేవతలను నేను అంతట నాహ్వానించుచున్నాను. ఆ యహోరాత్రదేవతలైన మీరు ఒకానొక నక్షత్రవిశేషముతోc గూడియున్న అనుష్ఠానదినమునందు మా యజ్ఞమునకు రండు. ఈ ఋక్కు అహోరాత్రేష్టియందు పురోనువాక్య.

3. మంత్రము : **వయం దేవీ బ్రహ్మణా సంవిదానాః ।సురత్నాసో దేవవీతిం దధానాః ।అహోరాత్రే హవిషా వర్ధయన్తః । అతి పాప్మాన మతిముక్త్యా గమేమ, ఇతి ।**

అర్థము : వయమ్=యజమానులమైన మేము, బ్రహ్మణా=మంత్రముచే, సంవిదానాః=ఐకమత్యమును పొందిన వారమును, సురత్నాసః=శోభనరత్న సదృశమైన హవిస్సుతోc గూడినవారమును, దేవవీతిమ్=దేవతలకు

అశనమును (అన్నమును), దధానాః=సంపాదించుచున్నవారమును, అహోరాత్రే = అహోరాత్ర దేవతలను, వర్ధయన్తః= హవిస్సుచే వృద్ధినొందించుచున్నవారమునై, పాప్మానమ్=మా పాపమును, అతిముక్తా య=అత్యంత మోచన సమర్థమైన కర్మచే, అతిగమేమ=అతిక్రమించి పోవుదుము.

తాత్పర్యము : 'బ్రహ్మణా సంవిదానాః' ఇత్యాది విశేషణ విశిష్టులమైనమేము (యజమానులము) మా పాపమును నత్యంత మోచన సమర్థమైన కర్మచే నతిక్రమించి పోవుదుము. ఇది ఆ యిష్టియందే యాజ్య.

4. మంత్రము : ప్రత్యవదృశ్యాయతీ (1)। వ్యుచ్ఛన్తీ దుహితా దివః। అపో మహీ వృణుతే చక్షుషా, ఇతి।

అర్థము : ప్రత్యాయతీ=ప్రతిదినము వచ్చుచున్నదియు, వ్యుచ్ఛన్తీ=ప్రాతఃకాలమును చేయుచున్నదియు, దివః=ద్యులోకమునకు, దుహితా=దుహితృస్థానీయయు, మహీ=సర్వప్రజోపకారముచే గొప్పదియునగు, ఇయమ్ ఉషాః=ఈ ఉషాదేవి, అదృశి ఉ=కనబడుచునేయున్నది. (సా ఇయమ్=అటువంటి యీ ఉషాదేవి, ఏతాదృశీ సతీ=ఇటువంటి దగుచు,)చక్షుషా = ప్రకాశముచే, అపః=అనుష్ఠించబడుచున్న కర్మను, వృణుతే= ప్రకాశింపజేయుచున్నది. (ఉషా శబ్దము ఆకారాంతము. పుంలిగము, ఉషశ్శబ్దము సకారాంతము. నపుంసకలింగము. రెండు శబ్దములకు ప్రాతఃకాల మనియే యర్థము. ప్రతి, ఉ, అదృశి, ఆయతీ అని పదవిభాగము.)

తాత్పర్యము : ప్రత్యాయతీత్యాది గుణవిశిష్టయైన ఉషాదేవి ప్రకాశముచే అనుష్ఠించబడుచున్న కర్మను ప్రకాశింపజేయు చున్నది. ఈ ఋక్కు ఉషోదేవతాక యాగమునందు పురోనువాక్య.

5. మంత్రము : తమో జ్యోతిష్కృణోతి సూనరీ। ఉదుస్రియాః సచతే సూర్యః। సచా ఉద్యన్నక్షత్రమర్చిమత్। తవేదుషో వ్యుషి సూర్యస్య చ, ఇతి।

అర్థము : సూనరీ=సుష్ఠగ వ్యవహారములకు నేత్రియగు, ఇయమ్ ఈ యుషోదేవి, తమః=తమస్సుచే వ్యాప్తమైన జగత్తును, జ్యోతిః కృణోతి=ప్రకాశముచే వ్యాప్తమైనదానినిగఁ జేయుచున్నది. (తదానీమ్=అప్పుడు,) సూర్యః=సూర్యుఁడు, ఉస్రియాః=రశ్మిలను, సచతే=ఉద్ధృతముగ సంబద్ధములనుగఁ జేయుచున్నాఁడు. (ప్రసరింపఁజేయుచున్నాఁడు). హే ఉషః! ఏ=ఓ ఉషోదేవీ!, తవేత్=నీకును, సూర్యస్య చ=సూర్యునకును, సచా=ఒక్కసారిగా (కూడనే), వ్యుషి సతి=ప్రాదుర్భావము కలుగుచుండఁగా, ఉద్యత్ నక్షత్రమ్= ఉదయించిన నక్షత్రముతో సమానమైన దినము, అర్చిమత్=ప్రకాశోపేతము, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఉషఃకాలమున నందఱు మేల్కాంచి వ్యవహరించుచుందురు కనుక ఉషోదేవి సుష్ఠ వ్యవహారనేత్రి యగు చున్నది. అట్టి యుషస్సు చీఁకటితోఁ గూడిన జగత్తును తన ప్రకాశముచే ప్రకాశింపఁజేయుచున్నది (కనఁబడఁజేయుచున్నది). అప్పుడు సూర్యుఁడు కిరణములను ఉద్ధృతముగ ప్రసరింపఁజేయుచున్నాఁడు. ఓ యుషోదేవీ! నీవును, సూర్యుఁడును ఒక్కమారే ప్రాదుర్భవించఁగా నుదయించిన నక్షత్రముతో సమానమైన దినము ప్రకాశవంత మగుచున్నది. ఆ యుషోదేవతాక యాగమునందే యీ ఋక్కు యాజ్య.

6. మంత్రము : **సం భక్తేన గమేమహి। తన్నో నక్షత్ర మర్చిమత్ । భానుమత్తేజ ఉచ్చరత్ ।**

ఉప యజ్ఞమిహా ऽऽగమత్ (2), ఇతి ।

అర్థము : భక్తేన=హవిర్లక్షణమైన అన్నముతో, సంగమేమహి=సంగతుల మగుదుము గాక(కర్మ ననుష్ఠింతుము గాక). నః=మాయొక్క, తత్=అస్మత్కర్మానుష్ఠానమునకై యుద్దేశింపcబడిన యా నక్షత్రము, అర్చిమత్=అర్చనయుక్తమును, భానుమత్=రశ్మియుక్తమును, తేజః=తేజస్వంతము (శరీరకాంతియుక్తము)నైనది. (తథావిధమ్=అటువంటి నక్షత్రము,)ఉచ్చరత్=ఉదయమును పొందుచున్నదై, ఇహ=ఈ దేవయజనదేశమునందు, ఉపాగమత్=వచ్చినది.

తాత్పర్యము : మేము హవిర్లక్షణమైన యన్నము కలవార మగుదుము గాక. కర్మ ననుష్ఠింతుము గాక. అర్చిమత్త్వాది గుణ యుక్తమైనదియు, అస్మత్కర్మానుష్ఠానమున కుద్దేశింపcబడినదియునగు నక్షత్రము ఉదయించుచు ఈ దేవయజనదేశమునందు వచ్చినది. ఈ ఋక్కు నక్షత్రచరువు (హవిస్సు)నకు పురోనువాక్య.

7. మంత్రము : **ప్ర నక్షత్రాయ దేవాయ । ఇన్ద్రాయేన్దుగ్ం హవామహే। స నః సవితా సువత్సనిమ్ ।**

పుష్టిదాం వీరవత్తమమ్, ఇతి ।

అర్థము : ఇన్ద్రాయ=పరమైశ్వర్యయుక్తుడైన, నక్షత్రాయ దేవాయ=నక్షత్రాఖ్య దేవునికొఱకు, ఇన్దుమ్=అమృత సమానమైన హవిస్సును, హవామహే=హోమము చేయుచున్నాము. సః=ఆ నక్షత్రదేవుcడు, సవితా=కర్మయందు ప్రేరకుc డగుచు, పుష్టిదామ్=పుష్టిప్రదమును, వీరవత్తమమ్=వీరులైన పుత్రులతోc గూడినదియునగు, సనిమ్=దాతవ్యమైన ధనమును, నః=మాకొఱకు, సువత్=ప్రేరణచేయుcగాక (ఇచ్చుcగాక).

తాత్పర్యము : పరమైశ్వర్యయుక్తుడైన నక్షత్రదేవునికొఱకు అమృతసమానమైన హవిస్సును హోమముచేయుచున్నాను. ఆ నక్షత్రదేవుcడు కర్మయందు మమ్ము ప్రేరణచేయుచు పుష్టిప్రదత్వాది గుణ విశిష్టమైన ధనము నొసcగుcగాక. ఇది యా నక్షత్రచరువునకే యాజ్య.

8. మంత్రము : **ఉదు త్యం చిత్రమ్, ఇతి ।**

వివరణము: ''ఉదు త్యం జాతవేదసమ్'' అనునది పురోనువాక్య. ''చిత్రం దేవానామ్'' అనునది యాజ్య. ఈ రెండును సౌర్యచరువునందు యాజ్యాపురోనువాక్యలు. ఈ యుభయము ''ఉదు త్యం జాతవేదసమ్'' అను అనువాకమునందు వ్యాఖ్యానించcబడినది.

9. మంత్రము : **అదితిర్న ఉరు ష్యతు మహీమూరు షుమాతరమ్, ఇతి ।**

వివరణము: ''అదితిర్నః'' ఇత్యాదికము ఆదిత్యచరువునందు పురోనువాక్య. ''మహీమూ షుమాతరమ్'' అనునది ఆదిత్యచరువునందు యాజ్య. ఈ యుభయము ''వైశ్వానరో న ఊత్యా'' అనుచోట వ్యాఖ్యానించc బడినది.

10. మంత్రము :**ఇదం విష్ణుః ప్ర తద్విష్ణుః, ఇతి ।**

వివరణము: ''ఇదం విష్ణుర్విచక్రమే'' అనునది వైష్ణవచరువునందు పురోనువాక్య. ఇది ''యుఞ్జతీ మనః'' అనుచోట వ్యాఖ్యానించబడినది. ''ప్ర తద్విష్ణుః'' అనునది వైష్ణవచరువునందు యాజ్య. ఇది ''జుష్టీ నరః'' అనుచోట వ్యాఖ్యానించబడినది.

11. మంత్రము :**అగ్నిర్మూర్ధా భువః, ఇతి ।**

వివరణము: ''అగ్నిర్మూర్ధా దివః కకుత్'' ఇది శాఖాంతరోక్తమైన ఆగ్నేయచరువునకు పురోనువాక్య. ''భువో యజ్ఞస్య రజసశ్చ'' అనునది శాఖాంతరోక్తమైన ఆగ్నేయచరువునకు యాజ్య. ఈ యుభయము అగ్నికాండమునందు వ్యాఖ్యానించబడినది.

12. మంత్రము :**అను నోఽద్యానుమతి రన్విదనుమతే త్వమ్, ఇతి ।**

వివరణము: ''అను నోఽద్య'' ఇత్యాదికము శాఖాంతరోక్తమైన అనుమతిచరువునందు పురోనువాక్య. ''అన్విత్'' ఇత్యాదికము శాఖాంతరోక్తమైన అనుమతిచరువునందు యాజ్య. ఈ యుభయము ''ఇదం వామారభే హవిః'' అనుచోట వ్యాఖ్యానించబడినది. శాఖాంతరీయమైన యీ యిష్టిద్వయము సర్వనక్షత్రేష్టులందు సంచరించుచున్నది. ఈ విషయము ''ఆగ్నేయమష్టాకపాలమ్'' అను బోధాయన సూత్రమునందు వివరించబడినది.

13. మంత్రము :**హవ్యవాహగ్ం స్విష్టమ్, ఇతి ।**

ఆయత్యగమత్స్విష్టమ్ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమ ప్రపాఠకే తృతీయోఽనువాకః ॥౩॥

వివరణము: ''హవ్యవాహమభిమాతిషాహమ్'' అనునది సూర్యసూక్తములందలి యిష్టులందు స్విష్టకృదగ్నికి పురోనువాక్య. ''స్విష్టమగ్నే అభి తత్పృణాహి'' అనునది ఆ స్విష్టకృదగ్నికే యాజ్య. ఈ యుభయము ''జుష్టో దమూనాః'' అనుచోట వ్యాఖాయనించబడినది. ఉదు త్యమిత్యాదు లన్నియు నా యా యాజ్యా పురోనువాక్యలకు ప్రతీకములని గ్రహించవలెను.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ప్రథమ ప్రపాఠకమునందు
తృతీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే

చతుర్థో ఽనువాకః

1. మంత్రము : **అగ్నిర్వా అకామయత । అన్నాదో దేవానాగ్ం స్యామితి । స ఏతమగ్నయే కృత్తికాభ్యః**

పురోడాశమష్టాకపాలం నిరవపత్ । తతో వై సో ఽన్నాదో దేవానామభవత్ ।

అగ్నిర్వై దేవానామన్నాదః, ఇతి ।

అవతారిక: తృతీయానువాకమునందు చాంద్రమసేష్ట్యాదులకు యాజ్యాపురోనువాక్యలు చెప్పఁబడినవి. ఈ చతుర్థానువాకమునందు దేవనక్షత్రములకు ఇష్టులు చెప్పఁబడుచున్నవి. అందు ప్రథమనక్షత్రమునకు ఇష్టిని విధించుటకై యిచట తత్ప్రస్తుతి చేయఁబడుచున్నది.

అర్థము : అగ్నిః=ఈ కల్పమందు అగ్నిసంజ్ఞను పొందఁబోవు పూర్వకల్పమునందలి మనుష్యుఁడు, 'దేవానామ్=దేవతలలో, అన్నాదః=అన్నభక్షకుఁడైన యగ్నిగా, స్యామ్ ఇతి=అగుదును గాక' యని, అకామయత వై=కోరెనట! సః=అగ్నినగుదును గాక యని కోరుకొనిన యా మనుష్యుఁడు, అగ్నయే=అగ్నికొఱకు, కృత్తికాభ్యః=కృత్తికానక్షత్రదేవతలకొఱకును, అష్టాకపాలమ్=అష్టాకపాల సంస్కృతమైన, ఏతం పురోడాశమ్=ఈ పురోడాశమును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ నిర్వాపమువలననే, సః=పురోడాశ నిర్వాపము చేసినయతఁడు, దేవానామ్=దేవతలలో, అన్నాదః=అన్నభక్షకుఁడైన, యగ్ని, అభవత్=ఆయెను. అగ్నిః వై=అగ్నియే, దేవానామ్=దేవతలలో, అన్నాదః=అన్నభక్షకుఁడు.

తాత్పర్యము : ఈ కల్పమందు సర్వప్రాణులకు దాహ పాక ప్రకాశకారియైన యగ్ని పూర్వకల్పమందు మనుష్యుఁడుగా నుండి దేవత్వపద ప్రాపకమైన కర్మ ననుష్ఠించి యీ కల్పమందు ఈ యగ్నిజన్మను పొందెను. అందువలన పూర్వకల్పమం దా మనుష్యుఁడు భావిసంజ్ఞ నాశ్రయించి యగ్నియని వ్యపదేశించఁబడు చున్నాఁడు. 'మట్టిని కుండనుగాఁ జేయుము, తంతువులను వస్త్రమునుగాఁ జేయుము' ఇత్యాదులందు భావిసంజ్ఞ నాశ్రయించి వ్యవహరించిన విధముగనే అగ్నిశబ్దముచే వ్యవహరించఁబడుచున్న యా మనుష్యుఁడు కర్మాధికారి యగుచు, తాను దేవతలలో నన్నభక్షకుఁడైన యగ్నిగాఁ గావలెనని కోరెను.

'నేను జన్మాంతరమందు దేవతలలో బహ్వన్నభక్షకుఁడ నగుదును గాక' యని కోరుచున్నవాఁడై యా మనుష్యుఁడా పూర్వకల్పమందు ఉంటున్న నక్షత్రస్వామియగు నగ్నికొఱకు, కృత్తికానక్షత్రము కొఱకును కలసి యష్టాకపాలసంస్కృతమైన యీ పురోడాశమును నిర్వాపము చేసెను. నక్షత్రస్వామియైన యా వహ్నియు ఆ కల్పమునకు పూర్వపుదైన కల్పమునందు మనుష్యుఁడుగానే యుండి విశిష్టమైన కర్మ ననుష్ఠించి తదుత్తరకల్పమందు నక్షత్రస్వామిరూపమైన వహిత్వమును పొందినవాఁడే. ఈ విధముగ సమన్వయ మగుచుండఁగా 'అగ్నిరగ్నయే' - 'అగ్ని యగ్నికొఱకు' అని చెప్పుటలో అనుపపత్తి యేదియు లేదు. ఈ న్యాయముచేతనే వక్ష్యమాణములైన యిష్టులందుఁ గూడ యజమాన దేవతలకు ఏకవిధమైన నామ ధేయము కల్పభేదముచే వ్యవస్థాపించఁదగినది. ఆ నిర్వాపమువలననే యజమానరూపుఁడైన యగ్ని

కల్పాంతరమందు దేవతల మధ్యమున బహ్వాన్నభక్షకుc డాయెను. అగ్నియే సర్వాన్నభక్షకుcడని లోకమునందు ప్రసిద్ధి కలదు.

2. మంత్రము : **యథా హ వా అగ్నిర్దేవానామన్నాదః । ఏవగ్ం హ వా ఏష మనుష్యాణాం భవతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద, ఇతి ।**

అర్థము : యః=ఏ యజమానుcడు, ఏతేన హవిషా=ఈ యగ్ని కృత్తికాదేవతాకమైన హవిస్సుచే, యజతే=యాగమును, చేయుచున్నాcడో, (యాగము చేయవలెనని విధి.) యథా=ఏ విధముగ, అగ్నిః=అగ్ని, దేవానామ్=దేవతలలో, అన్నాదః హ వై=అన్నభక్షకుcడే, భవతి=అగుచున్నాcడో, ఏషః=ఈ యజమానుcడు, మనుష్యాణామ్=మనుష్యులలో, అన్నాదః భవతి వై హ=అన్నభక్షకుcడే యగుచున్నాcడు కదా!, ఉ చ=మఱియు, యః=ఏ పురుషుcడు, ఏనత్=ఈ కర్మను, ఏవమ్=ఉక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాcడో, (సోఽపి=అతcడు కూడ, అన్నాదః, భవతీత్యర్థః).

తాత్పర్యము : అగ్నిదేవతలమధ్యమున బహ్వాన్నభక్షకుcడైనవిధముగ ఈ యగ్ని కృత్తికాదేవతాకమైన హవిస్సుచే యాగమును చేసినవాcడును, ఈ కర్మను ఉక్తప్రకారముగc తెలిసికొనినవాcడును బహ్వాన్నభక్షకు లగుదురు. ఇచట ఇష్టి విధించcబడినది.

3. మంత్రము : **సోకత్ర జుహోతి । అగ్నయే స్వాహా కృత్తికాభ్యః స్వాహా । అమ్బాయై స్వాహా దులాయై స్వాహా । నితత్యై స్వాహా భ్రయన్త్యై స్వాహా । మేఘయన్త్యై స్వాహా వర్షయన్త్యై స్వాహా । చుపుణీకాయై స్వాహేతి (1), ఇతి ।**

అర్థము : సః=పూర్వోక్తహవిస్సుచే యాగము చేయునతcడు, అత్ర=ఈ కర్మయందు, జుహోతి='అగ్నయే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అగ్నయే=అగ్నికొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుత మగుcగాక (లేదా-అర్పించcబడినది). కృత్తికాభ్యః=కృత్తికానక్షత్రదేవతలకొఱకు, స్వాహా. అమ్బాయై=అంబ యను కృత్తికానక్షత్రదేవతకొఱకు, స్వాహా. దులాయై, స్వాహా. నితత్యై, స్వాహా. భ్రయన్త్యై, స్వాహా. మేఘయన్త్యై, స్వాహా. వర్షయన్త్యై, స్వాహా. చుపిణీకాయై, స్వాహా.

తాత్పర్యము : పూర్వోక్తహవిస్సుచే యాగము చేయునతcడు 'అగ్నయే స్వాహా' ఇత్యాదులైన యష్టమంత్రములచేతను హవిస్సును హోమముచేయవలెను. అగ్ని నక్షత్రస్వామి. కృత్తిక యనునది ఏడునక్షత్రమూర్తులకు సాధారణనామము. దుంబ, దుల, నితతి, భ్రయంతి, మేఘయంతి, వర్షయంతి, చుపుణీక అనునవి విశేషనామములు. ప్రధానహోమానంతరము ఉపహోమము లిచట విధించcబడినవి. ఇది ప్రథమ నక్షత్రేష్టి.

4. మంత్రము : **ప్రజాపతిః ప్రజా అసృజత । తా అస్మాత్సృష్టాః పరాచీరాయన్ । తాసాగ్ం రోహిణీ మభ్యధ్యాయత్ । సోకామయత । ఉప మా వర్తేత । సమేనయా గచ్ఛేయేతి । స ఏతం ప్రజాపతయే రోహిణ్యై చరుం నిరవపత్ । తతో వై సా తముపావర్తత । సమేనయా కగచ్ఛత, ఇతి ।**

అర్థము : ప్రజాపతిః=ప్రజాపతి, ప్రజాఃr=ప్రజలను, అసృజత=సృజించెను. సృష్టాఃr=సృజింపcబడిన, తాఃr=ఆ ప్రజలు, పరాచీఃr=పరాఙ్ముఖులు, ఆయన్=అయిరి. తాసామ్=ఆ ప్రజలలో, రోహిణీమ్=రోహిణీ నక్షత్రతనువును, అభ్యధ్యాయత్=అభిలక్షించి ధ్యానము చేసెను. సః=ఆ ప్రజాపతి, అకామయత=కోరుకొనెను. 'ఇయం రోహిణీ=ఈ రోహిణి, మా=నన్నుcగూర్చి, ఉపవర్తేత=తిరిగివచ్చుcగాక. ఏనయా=ఈ రోహిణితో, అహమ్=నేను, సంగచ్ఛేయ=కలసికొందునుగాక, ఇతి=అని', (కోరుకొనెను.) సః=ఆ ప్రజాపతి, ప్రజాపతయే=అతీతకల్ప గతుcడైన ప్రజాపతికొఱకు, రోహిణ్యై=అతీతకల్పగత రోహిణికొఱకును, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ నిర్వాపమువలననే, సా=ఆ ప్రజ, తమ్=ఆ ప్రజాపతినిcగూర్చి, ఉపావర్తత=సమీపించెను (తిరిగివచ్చెను). ఏనయా=ఈ రోహిణితో, సః=ఆ ప్రజాపతి, సంగచ్ఛత=సంగతుc డాయెను.

తాత్పర్యము : ఇచట ప్రజాపతి యనునది భావిసంజ్ఞ కాదు. 'సృష్టించెను' అని చెప్పుటవలన వర్తమాన ప్రజాపతి యనియే యర్థము. ప్రజాపతి ప్రజలను సృష్టించెను. అతనిచే సృజించcబడిన ప్రజలు పరాఙ్ముఖులే యైరి. ఆ ప్రజలమధ్యమున రోహిణీనక్షత్ర తనువు నభిలక్షించి ప్రజాపతి నిరంతరము ధ్యానముచేసెను. ఆ ప్రజాపతి ఒక సమయమున ఈ విధముగ కోరుకొనెను- 'ఈ రోహిణి నాయొద్దకు తిరిగి వచ్చుcగాక. నేనును ఈ రోహిణితో కలసికొందును' అని తలcచెను. ఈ విధముగ కోరుకొనుచున్నవాcడై యా ప్రజాపతి అతీతకల్పగతుcడైన ప్రజాపతికొఱకు, అతీతకల్పగత రోహిణి కొఱకును ఈ చరుహవిస్సును నిర్వాపము చేసెను. అతీతకల్పగత ప్రజాపతియు, అతీతకల్పగత రోహిణియు నిప్పుడు లేకున్నను వారి నుద్దేశించి చేయcబడుచున్న కర్మ ఫలసమర్థ మగును. ఈ విషయమున నాశ్చర్యపడ నవసరము లేదు. సర్వవస్తు ప్రదాయియైన అంతర్యామి యుండెను కనుక, తత్కర్మసామర్థ్యమువలననే యా రోహిణి ఆ ప్రజాపతి యొద్దకు తిరిగివచ్చెను. ఆ ప్రజాపతియు ఆ రోహిణితో కలసినవాc డాయెను. ద్వితీయనక్షత్రేష్టిని విధించుటకై యిచట శ్రుతి ప్రస్తుతించినది.

5. మంత్రము : **ఉప॑ హ॒వా ఏ॑నం ప్రి॒యమా॑వర్తతే । సం ప్రి॒యేణ॑ గచ్ఛతే । య ఏ॒తేన॑ హ॒విషా॒ యజ॑తే । య ఉ॑ చై॒న దే॒వం వే॑ద, ఇతి ।**

అర్థము : యఃr=ఏ యజమానుcడు, ఏతేన హవిషా=ప్రజాపతిదేవతాకమును, రోహిణీదేవతాకమునునగు చరుహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాcడో, చ=మఱియు, యఃr ఉ=ఏపురుషుcడును, ఏనత్=ఈ కర్మను, ఏవమ్=ఉక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాcడో, ఏనమ్=ఈ యజమానుని, ప్రియమ్=ప్రియమైన వస్తువు, ఉపావర్తతే హ వై=నిశ్చయముగ పొందును. ప్రియేణ=ప్రియమైన వస్తువుతో, సంగచ్ఛతే=కలసికొనును. ప్రియవస్తుభోగము కలుగునని యర్థము.

తాత్పర్యము : ప్రజాపతిదేవతాకమును, రోహిణీదేవతాకమునగు చరుహవిస్సుతో యాగము చేసిన యజమానుcనకు నిశ్చయముగ ప్రియవస్తు భోగము కలుగును. ఉక్తప్రకారముగ నీ కర్మను తెలిసికొనినవానికిc గూడ ప్రియవస్తుభోగము తప్పక కలుగును. ఇచట ఇష్టిచేయవలెనని యిష్టివిధి చెప్పcబడినది. ప్రియవస్తువుయొక్క

ఉపావర్తన మనఁగా ప్రాప్తి యని యర్థము. సంగమః=తద్భోగః, యజనవేదనములకు ఈ ఫలమని గ్రహించవలెను.

6. మంత్రము : **సోఽత్ర జుహోతి । ప్రజాపతయే స్వాహా రోహిణ్యై స్వాహా । రోచమానాయై స్వాహా ప్రజాభ్యః స్వాహేతి (2), ఇతి ।**

అర్థము : సః=ప్రజాపతి దేవతాకమును, రోహిణీదేవతాకమునునగు చరుహవిస్సుతో యాగము చేయునతఁడు, అత్ర=ఈ కర్మయందు, జుహోతి=ప్రజాపతయే స్వాహా ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. ప్రజాపతయే, స్వాహా. రోహిణ్యై, స్వాహా. (అర్థము స్పష్టము.) రోచమానాయై=ప్రకాశించుచున్న రోహిణికొఱకు స్వాహా. ప్రజాభ్యః, స్వాహా.

తాత్పర్యము : ప్రజాపతిదేవతాకమును, రోహిణీదేవతాకమునునగు చరుహవిస్సుతో యాగము చేయునతఁడు 'ప్రజాపతయే స్వాహా' ఇత్యాది మంత్రముల నుచ్చరించుచు ఈ కర్మయందు హోమము చేయవలెను. శేషము స్పష్టార్థము. ఇది ద్వితీయ నక్షత్రేష్టి. ఇవి ఉపహోమములు.

7. మంత్రము : **సోమో వా అకామయత । ఓషధీనాగ్ం రాజ్యమభిజయేయమితి । స ఏతగ్ం సోమాయ మృగశీర్షాయ శ్యామాకం చరుం పయసి నిరవపత్ । తతో వై స ఓషధీనాగ్ం రాజ్యమభ్యజయత్ । సమానానాగ్ం హ వై రాజ్యమభిజయతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సోఽత్ర జుహోతి । సోమాయ స్వాహా మృగశీర్షాయ స్వాహా । ఇన్వకాభ్యః స్వాహౌషధీభ్యః స్వాహా । రాజ్యాయ స్వాహాఽభిజిత్యై స్వాహేతి (3), ఇతి ।**

అర్థము : సోమః=సోముఁడు, ఓషధీనామ్=ఓషధులయొక్క, రాజ్యమ్=రాజ్యమును, అభిజయేయమ్ ఇతి=అంతటను జయించవలెనని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=కోరుకొనిన యా సోముఁడు, సోమాయ=సోమదేవునికొఱకు, మృగశీర్షాయ=మృగశీర్ష నక్షత్రమూర్తిసమూహముకొఱకును, ఏతం శ్యామాకం చరుమ్=శ్యామాకనామక తృణధాన్య నిష్పన్నమైన యా చరుహవిస్సును, పయసి=పాలయందు నిష్పన్నమైనదానిని, నిరవపత్=నిర్వాపముచేసెను. తతః వై=ఆ నిర్వాపమువలననే, సః=ఆ సోముఁడు, ఓషధీనాం రాజ్యమ్=ఓషధుల యొక్క రాజ్యమును, అభ్యజయత్=అంతటను జయించెను. యః=ఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఈ శ్యామాకచరుహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ కర్మను, ఏవమ్=యథోక్త ప్రకారముగ, వేద=తెలిసికొనెనో, సః=అతఁడు, సమానానాం హ వై=సమానులయొక్కయే, రాజ్యమ్=రాజ్యమును, అభిజయతి=అంతటను జయించుచున్నాఁడు.

సః=సోమదేవతాకమును, మృగశీర్షనక్షత్రమూర్తిదేవతాకమునగు శ్యామాక చరుహవిస్సుతో యాగము చేసినయతఁడు, అత్ర=ఈ కర్మయందు, జుహోతి=''సోమాయ స్వాహా'' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. సోమాయ, స్వాహా. మృగశీర్షాయ=మృగశీర్షనక్షత్రమూర్తిసమూహముకొఱకు, స్వాహా. ఇన్వకాభ్యః=మృగశీర్షమూర్తివిశేషములకొఱకు, స్వాహా. ఓషధీభ్యః=ఓషధిదేవతలకొఱకు, స్వాహా. రాజ్ఞ్యాభిమాని దేవతకొఱకు, స్వాహా. అభిజిత్యై=అభిజిత్యభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : ఇచట సోమశబ్దమును భావిసంజ్ఞచేఁ గాని, వర్తమానసంజ్ఞచేఁ గాని సమన్వయము చేయవచ్చును. ఇఁక ముందుఁ గూడ తత్తద్యోగ్యమైన నమన్వయము చేయవచ్చును. 'మృగశీర్షమ్' అనునది నక్షత్రమూర్తి సమూహనామము. ఇన్వక యనునది మృగశీర్షనక్షత్రమూర్తివిశేషముల నామము. ఓషధి రాజ్ఞ్యభిజితి శబ్దములు తత్తదభిమానిదేవతా వాచకములు. తాత్పర్యము పూర్వమువలెనే గ్రాహ్యము. ఇది తృతీయనక్షత్రేష్టి విధాయకము.

8. మంత్రము : రుద్రో వా అకామయత । పశుమాన్థ్స్యామితి । స ఏతగ్ం రుద్రాయా ऽऽర్ద్రాయై పైయంగవం చరుం పయసి నిరవపత్ । తతో వై స పశుమా నభవత్ । పశుమాన్థ్స వై భవతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ऽత్ర జుహోతి । రుద్రాయ స్వాహా ऽऽర్ద్రాయై స్వాహా పిన్వమానాయై స్వాహా పశుభ్యః స్వాహేతి (4), ఇతి ।

అర్థము : రుద్రః=రుద్రుఁడు, పశుమాన్=పశుమంతుఁడను, స్యామ్ ఇతి=అగుదును గాన యని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతఁడు, రుద్రాయ=రుద్రునికొఱకు, ఆర్ద్రాయై=ఆర్ద్రానక్షత్రమూర్తి కొఱకును, పయసి=క్షీరమునందు నిష్పన్నమైన, పైయంగవం చరుమ్=కొఱ్ఱలపిండికి సంబంధించిన చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ నిర్వాపమువలననే, సః=ఆ రుద్రుఁడు, పశుమాన్=పశుమంతుఁడు, అభవత్=ఆయెను. యః=ఏ యజమానుఁడు, ఏతేన హవిషా=రుద్ర దేవతాకమును, ఆర్ద్రానక్షత్రమూర్తి దేవతాకమునైన పైయంగవ చరుహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ కర్మను, ఏవమ్=యథోక్త ప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, పశుమాన్ హ=పశుమంతుఁడుగానే, భవత వై=నిశ్చయముగ నగుచున్నాఁడు.

సః=ఈ యాగము చేయునతఁడు, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='రుద్రాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. రుద్రాయ, స్వాహా. ఆర్ద్రాయై=ఆర్ద్రానక్షత్రమూర్తియొక్క ప్రాణములను తృప్తిపఱచునట్టి మూర్తికొఱకు, స్వాహా. పశుభ్యః=పశ్వభిమానిదేవతకొఱకు, స్వాహా. ఇచట రుద్రాయేత్యాది పదముల కర్థము స్పష్టము. తాత్పర్యము పూర్వమువలెనే గ్రహించఁదగినది. రుద్రశబ్దమునకు పూర్వోక్తమైన అగ్నిశబ్దమునకువలెనే అర్థసమన్వయము చేయవలెను. ఇది చతుర్థనక్షత్రేష్టివిధి. ఉపహోమములు కూడ నీ మంత్రమునందే విహితము లైనవి.

9 . మంత్రము : ఋక్షా వా ఇయమలోమకా ఽకసీత్ । సా ఽకామయత । ఓషధీభిర్వనస్పతిభిః ప్రజాయేయేతి ।

సైతమదితై పునర్వసుభ్యాం చరుం నిరవపత్ । తతో వా ఇయమోషధీభిర్వనస్పతిభిః ప్రాజాయత ।

ప్రజాయతే హ వై ప్రజయా పశుభిః । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ఽత్ర

జుహోతి । అదితై స్వాహా పునర్వసుభ్యామ్ । స్వాహా భూతై స్వాహా ప్రజాత్యై స్వాహేతి (5), ఇతి ।

అర్థము : ఇయమ్=ఈ పృథివి, (పూర్వమ్=పూర్వము,) అలోమకా=ఓషధ్యాదిలోమ రహితయు, ఋక్షా=మార్దవరహితయునై, ఆసీత్ వై=ఉండెనఁట! సా=ఆ పృథివి, 'ఓషధీభిః=ఓషధులతోను, వనస్పతిభిః=వనస్పతులతోను, ప్రాజాయేయ=పుట్టెదను,' ఇతి=అని, అకామయత=కోరుకొనెను. సా=ఆ విధముగ కోరుకొనిన యా పృథివి, అదిత్యై=పూర్వకల్పగత భూదేవతకొఱకు, పునర్వసుభ్యామ్=పునర్వసునక్షత్ర మూర్తులకొఱకును, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ చరునిర్వాపమువలననే, ఇయమ్=ఏతత్కల్పగతయైన భూమి, ఓషధీభిః=ఓషధులతోను, వనస్పతిభిః=వనస్పతులతోను, ప్రాజాయత=ప్రకర్షముగ నుద్భవించెను. యః=ఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఈ చరుహవిస్సుతో, యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ యాగకర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, ప్రజయా=సంతానముతోను, పశుభిః=పశువులతోను, ప్రజాయతే హ వై=నిశ్చయముగ పుట్టుచున్నాఁడు.

సః=పూర్వోక్త చరుహవిస్సుతో యాగము చేయునతఁడు, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='అదిత్యై స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అదిత్యై=భూదేవతకొఱకు, స్వాహా. పునర్వసుభ్యామ్=పునర్వసునక్షత్రమూర్తులకొఱకు, స్వాహా. ఆభూత్యై=బహుభవనసమర్థమైన అదితిమూర్తికొఱకు, స్వాహా. ప్రజాపత్యై=ఉత్పాదనసమర్థమైన మూర్తికొఱకు, స్వాహా. వనస్పతి=పూవక కాచెడుచెట్టు అనియు నర్థము.

తాత్పర్యము : ఈ భూమి పూర్వము ఓషధ్యాది లోమరహితయు మార్దవరహితయునై యుండెను. అట్టి భూమి ఓషధులతోను, వనస్పతులతోను పుట్టెదనని తలఁచి పూర్వకల్పసిద్ధయైన భూమిదేవతకొఱకును, పునర్వసునక్షత్రమూర్తులకొఱకును చరుహవిస్సును నిర్వాపము చేసెను. శేషము పూర్వమువలె గ్రాహ్యము. ఇచట పంచమనక్షత్రేష్టి విధించఁబడినది. ఉపహోమములు కూడ విధించఁబడినవి.

10. మంత్రము :బృహస్పతిర్వా అకామయత । బ్రహ్మవర్చసీ స్యామితి । స ఏతం బృహస్పతయే తిష్యాయ నైవారం

చరుం పయసి నిరవపత్ । తతో వై స బ్రహ్మవర్చస్యభవత్ । బ్రహ్మవర్చసీ హవై భవతి । య ఏతేన

హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ఽత్ర జుహోతి । బృహస్పతయే స్వాహా తిష్యాయ స్వాహా।

బ్రహ్మవర్చసాయ స్వాహేతి (6), ఇతి ।

అర్థము : బృహస్పతిః=బృహస్పతి, 'బ్రహ్మవర్చసీ=బ్రహ్మవర్చసము కలవాఁడను, స్వామ్=అగుదును గాక,' ఇతి=అని, అకామయత=కోరుకొనెను. సః=ఆ బృహస్పతి (పూర్వకల్పమున బృహస్పతిత్వమును కోరుకొనిన మనుష్యఁడు), బృహస్పతయే=బృహస్పతికొఱకు, తిష్యాయ=పుష్యమినక్షత్రమూర్తి కొఱకును, పయసి=పాలయందు నిష్పన్నమైన, ఏతం నైవారం చరుమ్=నివ్వరిధాన్యసంబంధియైన యీ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ చరునిర్వాపమువలననే, సః=భావిబృహస్పతి సంజ్ఞావంతుఁడైన యీ మనుష్యఁడు, బ్రహ్మవర్చసీ=బ్రహ్మవర్చసము కలవాఁడు, అభవత్=ఆయెను. యః=ఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఈ నైవారచరుహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ బృహస్పతిత్వపద ప్రాపకమైన కర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, బ్రహ్మవర్చసీ హ వై=నిశ్చయముగ బ్రహ్మవర్చసియే, భవతి=అగుచున్నాఁడు.

సః=బృహస్పతిత్వ పదప్రాపకమైన కర్మను చేయునతఁడు, అత్ర=ఈ కర్మయందు, జుహోతి='బృహస్పతయే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. బృహస్పతయే=బృహస్పతికొఱకు, స్వాహా. తిష్యాయ=పుష్యమినక్షత్రమూర్తికొఱకు, స్వాహా. బ్రహ్మవర్చసాయ=బ్రహ్మవర్చసాభిమానిదేవతకొఱకు, స్వాహా. బ్రహ్మవర్చసము=సదాచారాధ్యయన సమృద్ధి. ఇచట షష్ఠనక్షత్రేష్టి, ఉపహోమములును చెప్పఁబడినవి.

11. మంత్రము :**దేవాసురాః సంయత్తా ఆసన్ । తే దేవాః సర్వేభ్య ఆశ్రేషాభ్య ఆజ్యే కరమ్భం నిరవపన్ । తానేతాభిరేవ దేవతాభి రుపానయన్ । ఏతాభిర్వ వై దేవతాభి ర్ద్విషన్తం భ్రాతృవ్య ముపనయతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ఽత్ర జుహోతి । సర్వేభ్యః స్వాహా ఽఽశ్రేషాభ్యః స్వాహా । దన్దశూకేభ్యః స్వాహేతి (7), ఇతి ।**

అర్థము : దేవాసురాః=దేవతలు, అసురులు, సంయత్తాః=యుద్ధోద్యుక్తులు, ఆసన్=అయిరి. తే దేవాః=ఆ దేవతలు, (అసురాణాం వశీకరణాయ=అసురులను వశీకరింపఁజేసికొనుటకై,) సర్వేభ్యః=సర్పదేవతలకొఱకు, ఆశ్రేషాభ్యః=ఆశ్రేషానక్షత్రమూర్తులకొఱకును, ఆజ్యే=నేతియందు నిష్పన్నమైన, కరమ్భమ్=దధిమిశ్రయవసక్తు రూపమైన కరంభమును, నిరవపన్=నిర్వాపము చేసిరి. తాన్=ఆ యసురులను, ఏతాభిః దేవతాభిః దేవతాభిః ఏవ=ఈ సర్పదేవతలచేతను, ఆశ్రేషానక్షత్రదేవతలచేతనే, ఉపానయన్=తమ సమీపమునకు పొందించిరి. యః=ఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఈ కరంభహవిస్సుచే,

యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యఃఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ యజ్ఞకర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, ద్విషన్తం భ్రాతృవ్యమ్=ద్వేషించుచున్న శత్రువును, ఏతాభిఃదేవతాభిఃహ వై=ఈ దేవతలచేతనే, ఉపనయతి=సమీపమునకు పొందించుచున్నాఁడు (వశపఱుచుకొనుచున్నాఁడు).

సః=యాగము చేయునతఁడు, అత్ర=ఈ యజ్ఞకర్మయందు, జుహోతి='సర్పేభ్యఃస్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. సర్పేభ్యఃసర్పదేవతలకొఱకు, స్వాహా. ఆశ్రేషాభ్యఃఆశ్రేషానక్షత్ర మూర్తులకొఱకు, స్వాహా. దన్దశూకేభ్యఃదంశనశీలములైన సర్పదేవతలకొఱకు, స్వాహా. దంశనము=కాటు.

తాత్పర్యము : అసురులతోఁ గూడ యుద్ధోద్యుక్తులైన దేవత లసురులను వశపఱుచుకొనుటకై దధిమిశ్రయవసక్తురూపమైన కరంభశబ్దాభిధేయమైన హవిస్సును నిర్వాపము చేసి కరంభతుష్టులైన యీ సర్వదేవతలచేతను, ఆశ్రేషానక్షత్రదేవతలచేతను ఆ యసురులను వశపఱుకొనిరి. ఈ కరంభహవిస్సుచే యాగము చేయు యజమానుఁడు, ఈ యాగకర్మను యథోక్త ప్రకారముగతెలిసికొనినయతఁడును ద్వేషించుచున్న శత్రువును ఈ దేవతలచేతనే వశపఱుచుకొనును. శేషము సుగమము. కరంభము=పెరుగుతో కలిపిన పేలపిండి. ఇది సప్తమ నక్షత్రేష్టి. ఇచట ఉపహోమములు కూడ చెప్పఁబడినవి.

12. మంత్రము :పితరో వా అకామయన్త । పితృలోక ఋధ్నుయామేతి । త ఏతం పితృభ్యో మఘాభ్యఃపురోడాశఁ్ం షట్కపాలం నిరవపన్ । తతో వై తే పితృలోక ఆర్ధ్నువన్ । పితృలోకే హ వా ఋధ్నోతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద సోఽత్ర జుహోతి । పితృభ్యఃస్వాహా మఘాభ్యఃస్వాహాఽనఘాభ్యఃస్వాహా గదాభ్యఃస్వాహాఽరున్ధతీభ్యఃస్వాహేతి (8), ఇతి ।

అర్థము : పితరఃభావిపితృదేవతాసంజ్ఞను పొందనున్నపితరులు, 'పితృలోకే=పితృలోకమునందు, ఋధ్నుయామ=వృద్ధినొందుము గాక', ఇతి=అని, అకామయన్త వై=నిశ్చయముగ కోరుకొనిరి. తే=వారు, పితృభ్యఃకల్పాంతరమందలి పితృదేవతలకొఱకు, మఘాభ్యఃమఘానక్షత్రదేవతామూర్తులకొఱకును, ఏతం షట్కపాలం పురోడాశమ్=ఈ షట్కపాల సంస్కృతపురోడాశమును, నిరవపన్=నిర్వాపము చేసిరి. తతఃవై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, తే=ఆ పితృదేవతలు, పితృలోకే=పితృలోకమునందు, ఆర్ధ్నువన్=వృద్ధి నొందిరి. యఃఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఈ పురోడాశహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాడో, చ=మఱియు, యఃఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ యాగకర్మను, ఏవమ్=యథోక్త ప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, పితృలోకే=పితృలోకమునందు, ఋధ్నోతి హ వై=నిశ్చయముగ వృద్ధినొందుచున్నాఁడు.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='పితృభ్యఃస్వాహా' ఇత్యాదిమంత్రములచే హోమము చేయవలెను. పితృభ్యఃపితృదేవతలకొఱకు, స్వాహా. మఘాభ్యఃమఘానక్షత్ర

దేవతామూర్తులకొఱకు, స్వాహా. అనఘాభ్యః=మఘానక్షత్రముయొక్క నిష్పాపమూర్తులకొఱకు, స్వాహా. అగదాభ్యః=రోగరహితమూర్త్యభిమాని దేవతలకొఱకు, స్వాహా. అరున్ధతీభ్యః=అరుంధతీ సమాన మూర్తులకొఱకును, స్వాహా.

తాత్పర్యము : తాత్పర్యము పూర్వమువలెనే గ్రహించఁదగినది. ఇచట అష్టమ నక్షత్రేష్టి, ఉపహోమములు విధించఁబడినవి.

13. మంత్రము :**అర్యమా వా అకామయత । పశుమాన్త్స్యామితి స ఏతమర్యమ్ణే ఫల్గునీభ్యాం చరుం నిరవపత్ । తతో వై స పశుమా నభవత్ । పశుమాన్హ వై భవతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సోకత్ర జుహోతి । అర్యమ్ణే స్వాహా ఫల్గునీభ్యాగ్ం స్వాహా । పశుభ్యః స్వాహేతి (9), ఇతి ।**

అర్థము : అర్యమా=ఈ కల్పమందు భావినియైన అర్యమ సంజ్ఞనుపొందఁబోవు మనుష్యుఁడు, 'పశుమాన్=పశుమంతుఁడను, స్యామ్=అగుదును గాక', ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=పశువుమత్త్వమును కోరుకొనిన యతఁడు, అర్యమ్ణే=అర్యముని(సూర్యుని) కొఱకు, ఫల్గునీభ్యామ్=ఫల్గునీనక్షత్రదేవతలకొఱకును, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. సః=చరునిర్వాపము చేసినయతఁడు, పశుమాన్=పశుమంతుఁడు, అభవత్=ఆయెను. యః=ఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఈ చరుహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ కర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, పశుమాన్ హ=పశుమంతుఁడే, భవతి వై=తప్పకయగును.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='అర్యమ్ణే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అర్యమ్ణే=అర్యమదేవునికొఱకు, స్వాహా. ఫల్గునీభ్యామ్=ఫల్గునీనక్షత్రమూర్తి దేవతలకొఱకు, స్వాహా. పశుభ్యః=పశ్వభిమాని దేవతలకొఱకు, స్వాహా.

తాత్పర్యము : తాత్పర్యము పూర్వమువలెనే గ్రాహ్యము. ఇచట నవమనక్షత్రేష్టి, ఉపహోమములు విధింపఁబడినవి. ఇది పూర్వఫల్గునీనక్షత్రవిషయకము. పూర్వఫల్గునీ=పుబ్బ.

14. మంత్రము :**భగో వా అకామయత । భగీ శ్రేష్ఠీ దేవానాగ్ం స్యామితి । స ఏతం భగాయ ఫల్గునీభ్యాం చరుం నిరవపత్ । తతో వై స భగీ శ్రేష్ఠీ దేవానామభవత్ । భగీ హవై శ్రేష్ఠీ సమానానాం భవతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సోకత్ర జుహోతి । భగాయ స్వాహా ఫల్గునీభ్యాగ్ం స్వాహా । శ్రైష్ఠ్యాయ స్వాహేతి (10), ఇతి ।**

అర్థము : భగః=ఈ కల్పమందు భగ సంజ్ఞను పొందcగోరునట్టి పూర్వకమునందలి మనుష్యcడు, దేవానామ్=దేవతలలో, 'భగీ=ఐశ్వర్యాది షడ్గుణవంతుcడను, శ్రేష్ఠీ=అతిశయముగ ప్రశస్తుcడను, స్యామ్=అగుదును గాక' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=భగిత్వ శ్రేష్ఠిత్వములను కోరుకొనిన యతcడు, భగాయ=భగదేవుని (సూర్యుని) కొఱకు, ఫల్గునీభ్యామ్=ఫల్గునీ నక్షత్రమూర్తిదేవతల కొఱకును, చరుమ్=చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ చరునిర్వాపమువలననే, సః=అతcడు, దేవానామ్=దేవతలలో, భగీ=ఐశ్వర్యాది షడ్గుణవంతుcడును, శ్రేష్ఠీ=అతిశయముగ ప్రశస్తుcడును, అభవత్=ఆయెను.

యః=ఏ యజమానుcడు, ఏతేన హవిషా=ఈ చరుహవిస్సుచే, యజతే=యాగము చేయు చున్నాcడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుcడును, ఏనత్=ఈ కర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొను చున్నాcడో, సః=అతcడు, సమానానామ్=సమానులలో (సజాతీయులలో - లేదా - సాటివారిలో), భగీ=ఐశ్వర్యాది షడ్గుణవంతుcడును, శ్రేష్ఠీ=అతిశయముగ ప్రశస్తుcడును, భవతి=అగుచున్నాcడు. సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='భగాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. భగాయ=భగదేవునికొఱకు, స్వాహా. ఫల్గునీభ్యామ్=ఫల్గునీనక్షత్రమూర్తిదేవతలకొఱకు, స్వాహా. శ్రైష్ట్యాయ=శ్రైష్ట్యాభిమానిదేవతలకొఱకు, స్వాహా.

తాత్పర్యము : తాత్పర్యము పూర్వవత్తు. ఇచట దశమ నక్షత్రేష్టి, ఉపహోమములును విధించcబడినవి. ఇది ఉత్తరఫల్గునీనక్షత్రవిషయకము. ఉత్తరఫల్గునీ=ఉత్తర.

15. మంత్రము :సవితా వా అకామయత । శ్రైష్ఠ్యే దేవా దధీరన్ । సవితా స్వామితి । స ఏతగ్ం సవిత్రే హస్తాయ

పురోడాశం ద్వాదశకపాలం నిరవపదాశూనాం వ్రీహీణామ్ । తతో వై తస్మై శ్రద్దేవా అదధత ।

సవితాకభవత్ । శ్రద్ధ వా అస్మై మనుష్యా దధతే । సవితా సమానానాం భవతి ।

య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సోకత్ర జుహోతి । సవిత్రే స్వాహా హస్తాయ ।

స్వాహా దదతే స్వాహా పృణతే । స్వాహా ప్రయచ్ఛతే స్వాహా ప్రతిగృభ్ణతే స్వాహేతి (11), ఇతి ।

అర్థము : సవితా=ఈ కల్పమందు సవిత్ర సంజ్ఞను పొందగోరునట్టి పూర్వకల్పమందలి మనుష్యcడు,' మే=నా కొఱకు, దేవాః=దేవతలు, శ్రత్=విశ్వాసమును, దధీరన్=వహింతురు గాక. (అహమ్=నేను, సర్వకార్యాణామ్=సర్వకార్యములకు,) సవితా=ప్రేరకుcడను, స్యామ్=అగుదును గాక' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=భావిసవిత్రసంజ్ఞను కోరుకొనిన యతcడు, సవిత్రే=సవిత్రదేవునికొఱకు, హస్తాయ=హస్త నక్షత్రమూర్తిదేవతలకొఱకును, ఆహూనామ్=అఱువది దినములలో శీఘ్రముగపక్వస్థితిని పొందునట్టి, వ్రీహీణామ్=వ్రీహులసంబంధియైన, ద్వాదశకపాలమ్=ద్వాదశకపాల

సంస్కృత మైన, ఏతం పురోడాశమ్=ఈ పురోడాశమును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, తస్మై=పురోడాశ నిర్వాపము చేసినయతనికొఱకు, దేవాః=దేవతలు, శ్రత్=విశ్వాసమును, అదధత్=వహించిరి. సః=అతఁడు, సవితా=సర్వకార్యములకు ప్రేరకుఁడు, అభవత్=ఆయెను.

యః=ఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఈ పురోడాశహవిస్సుచేత, యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ యజ్ఞకర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, తస్మై=అతనికొఱకు, మనుష్యాః=మనుష్యులు, శ్రత్=విశ్వాసమును, దధతే హ వై=నిశ్చయముగవహింతురు. సమానానామ్=సమానులలో, సవితా=ప్రేరకుఁడు, భవతి=అగుచున్నాఁడు.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='సవిత్రే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. సవిత్రే=ప్రేరకుఁడైనదేవునికొఱకు (సూర్యునికొఱకు), స్వాహా. హస్తాయ=హస్తనక్షత్రమూర్తిదేవతకొఱకు, స్వాహా. దదతే=ఫలము నొసఁగుటచే సంపాదించునట్టి దేవునికొఱకు, స్వాహా. పృణతే=న్యూనమైన ఫలమును పూర్తిచేయుటయందు హేతువైన దేవునికొఱకు, స్వాహా. ప్రయచ్ఛతే=ఫలము నొసఁగు దేవునికొఱకు, స్వాహా. ప్రతిగృభ్ణతే=ఇతరు లొసఁగినదానిని గ్రహించునట్టి దేవునికొఱకు, స్వాహా.

తాత్పర్యము : తాత్పర్యము పూర్వవత్తు. 'దదతే, పృణతే, ప్రయచ్ఛతే, ప్రతిగృభ్ణతే' ఈ శబ్దములచేఁ జెప్పఁబడిన దేవతలు హస్తనక్షత్రముయొక్క మూర్తివిశేషములు. ఇచట ఏకాదశనక్షత్రేష్టి, ఉపహోమములును విధించఁబడినవి.

16. మంత్రము :త్వష్టా వా అకామయత । చిత్రం ప్రజాం విన్దేయేతి । స ఏతం త్వష్ట్రే చిత్రాయై పురోడాశమష్టాకపాలం నిరవపత్ । తతో వై స చిత్రం ప్రజామవిన్దత । చిత్రగ్ం హవై ప్రజాం విన్దతే । య ఏతేన హవిషా యజతే య ఉ చైనదేవం వేద । సోకత్ర జుహోతి । త్వష్ట్రే స్వాహా చిత్రాయై స్వాహా । చైత్రాయ స్వాహా ప్రజాయై స్వాహేతి (12), ఇతి ।

అర్థము : త్వష్టా=ఈ కల్పమందు త్వష్టృసంజ్ఞను పొందఁగోరునట్టి పూర్వకల్పమందలి మనుష్యుఁడు, 'చిత్రమ్=పుత్రపౌత్రాది రూపమున నానావిధత్వమును, ప్రజామ్=ప్రజను, విన్దేయ=పొందెదనుగాక', ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగకోరుకొనెను. సః=అతఁడు, త్వష్ట్రే=త్వష్టృదేవునికొఱకు, చిత్రాయై=చిత్రానక్షత్రమూర్తిదేవతకొఱకు, అష్టాకపాలమ్ ఏతం పురోడాశమ్=అష్టాకపాలసంస్కృతమైన యీ పురోడాశమును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, సః=అతఁడు, చిత్రమ్=పుత్రపౌత్రాదిరూపమున నానావిధత్వమును, ప్రజామ్=ప్రజను, అవిన్దత=పొందెను. యః=ఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఈ పురోడాశహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=

మఱియు, యః ఉ=ఏ పురుషుcడును, ఏనత్=ఈ యాగకర్మను, ఏవమ్=యథోక్త ప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాcడో, సః=అతcడు, చిత్రమ్=పుత్రపౌత్రాదిరూపమున నానావిధత్వమును, ప్రజామ్=ప్రజను, విన్దతే హ వై=నిశ్చయముగ పొందుచున్నాcడు.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='త్వష్ట్రే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. త్వష్ట్రే=త్వష్టృదేవునికొఱకు, స్వాహా. చిత్రాయై=చిత్రానక్షత్రమూర్తి దేవతకొఱకు, స్వాహా. చైత్రాయ=చిత్రానక్షత్రముయొక్క వైచిత్ర్యాపాదకమైన సామర్థ్యముకొఱకు, స్వాహా. ప్రజాయై=ప్రజకొఱకు, స్వాహా. ఇతి=అని హోమము చేయవలెనని పూర్వమున నన్వయము.

తాత్పర్యము : తాత్పర్యము పూర్వవత్తు. ఇచట ద్వాదశనక్షత్రేష్టి, ఉపహోమములు విధించcబడినవి.

17. మంత్రము :వాయుర్వా అకామయత । కామచారమేషు లోకేష్వభిజయేయమితి । స ఏతద్వాయవే నిష్ట్యాయై గృష్ట్యై దుగ్ధం పయో నిరవపత్ । తతో వై స కామచారమేషు లోకేష్వభ్యజయత్ । కామచారగ్ం హవా ఏషు లోకేష్వభిజయతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సోకత్ర జుహోతి । వాయవే స్వాహా నిష్ట్యాయై స్వాహా, కామచారాయ స్వాహాకభిజిత్యై స్వాహేతి (13), ఇతి ।

అర్థము : వాయుః=ఈ కల్పమందు వాయుసంజ్ఞను పొందcగోరునట్టి పూర్వకల్పమందలి మనుష్యుcడు, 'ఏషు లోకేషు=ఈ పృథివ్యాది లోకములందు, కామచారమ్=స్వేచ్ఛాసంచారమును, అభిజయేయమ్=పొందెదను గాక' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగకోరుకొనెను. సః=అతcడు, గృష్ట్యై=సకృత్ప్రసూతయైన ధేనువునుండి, దుగ్ధమ్ ఏతత్ పయః=పితుకcబడిన యీ క్షీరమును, వాయవే=వాయుదేవునికొఱకు, నిష్ట్యాయై=స్వాతీనక్షత్రదేవతకొఱకును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ పయోనిర్వాపము వలననే, సః=అతcడు, ఏషు లోకేషు=ఈ పృథివ్యాది లోకములందు, కామచారమ్=స్వేచ్ఛాసంచారమును, అభ్యజయత్=అంతటను జయించెను. యః=ఏ యజమానుcడు ఏతేన హవిషా=ఈ పయోహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాcడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుcడును, ఏనత్=ఈ యాగకర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాcడో, సః=అతcడు, ఏషు లోకేషు=ఈ పృథివ్యాది లోకములందు, కామచారమ్=స్వేచ్ఛాసంచారమును, అభిజయతి హ వై=నిశ్చయముగ నంతటను పొందుచున్నాcడు.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='వాయవే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. వాయవే=వాయుదేవునికొఱకు, స్వాహా. నిష్ట్యాయై=స్వాతీనక్షత్ర దేవతకొఱకు, స్వాహా. కామచారాయ=కామచారాభిమానిదేవతకొఱకు, స్వాహా. అభిజిత్యై=అభిజయాభిమాని దేవత కొఱకు, స్వాహా.

తాత్పర్యము : తాత్పర్యము పూర్వవత్తు. కామచారః=స్వేచ్ఛగా సంచరించుట. గృష్టిః-ఒకమారు ఈనిన యావు (ప్రసవించిన ధేనువు). ఇచట త్రయోదశ నక్షత్రేష్టి, ఉపహోమములు విధించఁబడినవి.

18. మంత్రము :ఇన్ద్రాగ్నీ వా అకామయేతామ్ । శ్రైష్ఠ్యం దేవానామభిజయేవేతి । తావేతామిన్ద్రాగ్నిభ్యాం విశాఖాభ్యాం పురోడాశమేకాదశకపాలం నిరవపతామ్ । తతో వై తౌ శ్రైష్ఠ్యం దేవానా మభ్యజయతామ్ । శ్రైష్ఠ్యగ్ం హ వై సమానానా మభిజయతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ఽత్ర జుహోతి । ఇన్ద్రాగ్నిభ్యాగ్ం స్వాహా విశాఖాభ్యాగ్ం స్వాహా । శ్రైష్ఠ్యాయ స్వాహా ఽభిజిత్యై స్వాహేతి (14), ఇతి ।

అర్థము : ఇన్ద్రాగ్నీ=ఈ కల్పమందు ఇంద్రాగ్నుల సంజ్ఞలను పొందఁగోరునట్టిపూర్వకల్పమందలి మనుష్యులు, 'దేవానామ్=దేవతలలో, శ్రైష్ఠ్యమ్ ప్రశస్తత్వమును, అభిజయేవ=అంతటను పొందుదుము గాక' ఇతి=అని, అకామయేతాం వై=నిశ్చయముగ కోరుకొనిరి. తౌ=ఆ యుభయులు, ఇన్ద్రాగ్నిభ్యామ్=కల్పాంతరగతులైన యింద్రాగ్ని దేవతలకొఱకును, విశాఖాభ్యామ్=విశాఖానక్షత్రమూర్తులకొఱకును,ఏతమ్ ఏకాదశకపాలం పురోడాశమ్=ఈ యేకాదశకపాలసంస్కృత పురోడాశమును, నిరవపతామ్=నిర్వాపము చేసిరి. తతః వై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, తౌ=ఆ యుభయులు, దేవానామ్=దేవతలలో, శ్రైష్ఠ్యమ్=ప్రశస్తత్వమును, అభ్యజయతాం వై=నిశ్చయముగ నంతటను పొందిరి. యఃఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఈ యేకాదశకపాల పురోడాశ హవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యఃఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ యాగకర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సఃఅతఁడు, సమానానామ్=సమానులలో, శ్రైష్ఠ్యమ్=శ్రేష్ఠత్వమును, అభిజయతి హ వై=నిశ్చయముగ నంతటను పొందుచున్నాఁడు.

సఃఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='ఇన్ద్రాగ్నిభ్యాం స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. ఇన్ద్రాగ్నిభ్యామ్=ఇంద్రాగ్నులకొఱకు, స్వాహా. విశాఖాభ్యామ్=విశాఖానక్షత్రమూర్తులకొఱకు, స్వాహా. శ్రైష్ఠ్యాయ=శ్రేష్ఠత్వాభిమానిదేవతలకొఱకు, స్వాహా. అభిజిత్యై=అభిజయాభిమాని దేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : తాత్పర్యము పూర్వవత్తు. ఇచట చతుర్దశ నక్షత్రేష్టి, ఉపహోమములు విహితము లైనవి.

19. మంత్రము :అథైతత్పౌర్ణమాస్యా అజ్యం నిర్వపతి । కామో వై పౌర్ణమాసీ । కామ అజ్యమ్ । కామేనైవ కామగ్ం సమర్ధయతి । క్షిప్రమేనగ్ం స కామ ఉపనమతి । యేన కామేన యజతే । సో ఽత్ర జుహోతి । పౌర్ణమాస్యై స్వాహా కామాయ స్వాహా ఽగత్యై స్వాహేతి, ఇతి ।

అగ్నిః పఞ్చదశ ప్రజాపతిః షోడశ సోమ ఏకాదశ రుద్రో దశర్క్కైకాదశ బృహస్పతిర్దశ దేవాసురా

నవ పితర ఏకాదశార్యమా భగో దశ దశ సవితా చతుర్దశ త్వష్టా వాయురిన్ద్రాగ్నీ

దశ దశాథైతత్పౌర్ణమాస్యా అష్టా పఞ్చదశ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమ ప్రపాఠకే చతుర్థోऽనువాకః ॥౪॥

అర్థము : అథ=దేవనక్షత్రేష్ట్యనంతరము, పౌర్ణమాస్యై=తిథ్యభిమానినియైన పౌర్ణమాసి దేవతకొఱకు, ఏతత్ ఆజ్యమ్=ఈ యాజ్యమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. పౌర్ణమాసీ=పౌర్ణమాసి, కామఃవై=కామస్వరూపమే. ఆజ్యమ్=నేయి, కామఃకామస్వరూపము. సఃపౌర్ణమాసిదేవతకై ఆజ్యమును నిర్వాపము చేసిన యాయజమానుఁడు, కామేనైవకామరూపమైన ఆజ్యముచేతనే, కామమ్=కామరూప పౌర్ణమాసి దేవతను, సమర్ధయతి=సంతోషపఱచినవాఁడగుచున్నాఁడు. యజమానఃయజమానుఁడు, యేన కామేన=నిమిత్తభూతమైన యే కామముచే, యజతే=యాగము చేయుచున్నాఁడో, సఃకామఃఆ కామము, క్షిప్రమ్=శీఘ్రముగ, ఏనమ్=ఈ యజమానుని, ఉపనమతి=పొందుచున్నది.

సఃఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='పౌర్ణమాస్యై స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. పౌర్ణమాస్యై=పౌర్ణమాసిదేవతకొఱకు, స్వాహా. కామాయ=కామాభిమాని దేవతకొఱకు, స్వాహా. అగత్యై=అవినాశాభిమానిదేవతకొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుత మగుఁగాక.

తాత్పర్యము : అథ అను శబ్దము నక్షత్రవైలక్షణ్య ద్యోతకము. పౌర్ణమాసి తిథ్యభిమానిదేవత. నక్షత్రాభిమానిదేవత కాదు. ఆ పౌర్ణమాసితిథియందు కర్మానుష్ఠానముచేత సర్వకామములు పొందుచుటచే పౌర్ణమాసికి కామరూపత్వము ఉపచరింపఁబడినది. ఆజ్యము నందఱు కోరుదురు కనుక ఆజ్యమునకు కామరూపత్వము చెప్పఁబడినది. ఈ కారణమువలన కామరూపమైన ఆజ్యముచేతనే కామరూప పౌర్ణమాసిదేవతను సంతోషపఱచినవాఁడగును. శేషము సుగమము. దేవనక్షత్రేష్టులను విధించినయనంతర మిచట పౌర్ణమాసిదేవతయొక్క యిష్టి, ఉపహోమములును విహితము లైనవి.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ప్రథమ ప్రపాఠకమునందు
చతుర్థానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే

పఞ్చమో ఽనువాకః

1. మంత్రము : **మిత్రో వా అకామయత । మిత్రధేయమేషు లోకేష్వభిజయేయమితి । స ఏతం మిత్రాయానూరాధే భ్యశ్చరుం నిరవపత్ । తతో వై స మిత్రధేయమేషు లోకేష్వభ్యజయత్ । మిత్రధేయగ్ం హ వా ఏషు లోకేష్వభిజయతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ఽత్ర జుహోతి । మిత్రాయ స్వాహా ఽనూరాధేభ్యః స్వాహా । మిత్రధేయాయ స్వాహా ఽభిజిత్యై స్వాహేతి (1), ఇతి ।**

అవతారిక: చతుర్థానువాకమునందు దేవనక్షత్రేష్టులు విహితము లైనవి. ఇcక ఈ పంచమానువాకమునందు యమనక్షత్రములకు ఇష్టులు విధించcబడుచున్నవి.

అర్థము : మిత్రః=ఈ కల్పమందు మిత్ర సంజ్ఞను పొందబోవునట్టి పూర్వకల్పీయ మనుష్యcడు, మిత్రధేయమ్=ఆప్తపురుషునిచే సంపాదనీయమైన ధనమును, ఏషు లోకేషు=ఈ భూరాది లోకములందు, అభిజయేయమ్=అంతటను జయింతును గాక', ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతcడు, మిత్రాయ =మిత్రదేవునికొఱకు, అనూరాధేభ్యః=అనూరాధ నక్షత్రమూర్తులకొఱకు, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ చరుహవిర్నిర్వాపము వలననే, సః=అతడు, ఏషు లోకేషు=ఈ భూరాది లోకములందు, మిత్రధేయమ్=ఆప్తపురుషునిచే సంపాదనీయమైన ధనమును, అభ్యజయత్=అంతటను జయించెను. యః=ఏ యజమానుcడు, ఏతేన హవిషా=ఈ చరుహవిస్సుచే, యజేత=యాగము చేయునో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషcడును, ఏనత్=ఈ యాగకర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాcడో, సః=అతcడు, మిత్రధేయమ్=ఆప్తపురుషునిచే సంపాదనీయమైన ధనమును, ఏషు లోకేషు=ఈ భూరాది లోకములందు, అభిజయతి హ వై=నిశ్చయముగ పొందుచున్నాcడు.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='మిత్రాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. మిత్రాయ=మిత్రదేవునికొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుత మగుcగాక. అనూరాధేభ్యః=అనూరాధనక్షత్రమూర్తులకొఱకు, స్వాహా. మిత్రధేయాయ=మిత్రధేయాభిమాని దేవతకొఱకు, స్వాహా. అభిజిత్యై=అభిజయాభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : దేవనక్షత్రేష్టిమంత్రముల తాత్పర్యమువలెనే యీ మంత్రముయొక్క తాత్పర్యమును గ్రహించవలెను. ఇచట ప్రథమనక్షత్రేష్టి, ఉపహోమములు విహితము లైనవి.

2. మంత్రము : **ఇన్ద్రో వా అకామయత । జ్యైష్ఠ్యం దేవానామభిజయేయమితి । స ఏతమిన్ద్రాయ జ్యేష్ఠాయై పురోడాశమేకాదశకపాలం నిరవపన్మహావ్రీహీణామ్ । తతో వై స జ్యైష్ఠ్యం దేవానా మభ్యజయత్ । జ్యైష్ఠ్యగ్ం హ వై సమానానా మభిజయతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో కత్ర జుహోతి। ఇన్ద్రాయ స్వాహా జ్యేష్ఠాయై స్వాహా । జ్యైష్ఠ్యాయ స్వాహా కభిజిత్యై స్వాహేతి (2), ఇతి ।**

అర్థము : ఇన్ద్రః=ఈ కల్పమున ఇంద్ర సంజ్ఞను పొందcగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యcడు, 'దేవానామ్=దేవతలలో, జ్యైష్ఠ్యమ్=అతిశయముగ ప్రశస్తత్వమును, వృద్ధత్వమును, అభిజయేయమ్=అంతటును పొందుదును గాక' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతcడు, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, జ్యేష్ఠాయై=జ్యేష్ఠానక్షత్రమూర్తికొఱకును, మహావ్రీహీణామ్=మహావ్రీహి సంబంధియైన, ఏతమ్ ఏకాదశకపాలం పురోడాశమ్=ఈ ఏకాదశకపాలసంస్కృతమైన పురోడాశమును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, సః=అతcడు, దేవానామ్=దేవతలలో, జ్యైష్ఠ్యమ్=అతిశయముగ ప్రశస్తత్వమును, అభ్యజయత్=అంతటును పొందెను. యః=ఏ యజమానుcడు, ఏతేన హవిషా=ఈ మహావ్రీహి పురోడాశహవిస్సుచేత, యజతే=యాగము చేయుచున్నాcడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుcడును, ఏనత్=ఈ యాగకర్మను, ఏవమ్=యథోక్త ప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాcడో, సః=అతcడు, సమానానామ్=సమానులలో, జ్యైష్ఠ్యమ్=అతిశయముగ ప్రశస్తత్వమును, అభిజయతి హ వై=నిశ్చయముగ నంతటును పొందుచున్నాcడు. మహావ్రీహయః=స్థూలవ్రీహులు, (లావుగానుండు వడ్లు).

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='ఇన్ద్రాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, స్వాహా. జ్యేష్ఠాయై=జ్యేష్ఠానక్షత్రమూర్తి కొఱకు, స్వాహా. జ్యైష్ఠ్యాయ=జ్యైష్ఠ్యాభిమానిదేవతకొఱకు, స్వాహా. అభిజిత్యై=అభిజయాభిమాని దేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : తాత్పర్యము పూర్వవత్తు. ఇచట ద్వితీయ నక్షత్రేష్టి, ఉపహోమములు విహితము లైనవి.

3. మంత్రము : **ప్రజాపతిర్వా అకామయత । మూలం ప్రజాం విన్దేయేతి । స ఏతం ప్రజాపతయే మూలాయ చరుం నిరవపత్ । తతో వై స మూలం ప్రజామవిన్దత । మూలగ్ం హవై ప్రజాం విన్దతే । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో కత్ర జుహోతి । ప్రజాపతయే స్వాహా మూలాయ స్వాహా । ప్రజాయై స్వాహేతి (3), ఇతి ।**

అర్థము : ప్రజాపతిః=ఈ కల్పమున నిర్ఋతిసంజ్ఞను పొందcగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యcడు, 'మూలమ్=మూలనక్షత్రమూర్తిదేవతను, ప్రజామ్=కులాచార నిర్వాహిక పుత్రాదిరూప ప్రజను, విన్దేయ=పొందెదను గాక' ఇతి=అని, అకామయత=కోరుకొనెను. సః=అతcడు, ప్రజాపతయే=నిర్ఋతిదేవతకొఱకు, మూలాయ=కులాచారనిర్వాహికయగు పుత్రాదిరూప ప్రజాభిమానిదేవత కొఱకును, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ నిర్వాపమువలననే, సః=అతcడు, మూలమ్=మూలనక్షత్రమూర్తిదేవతను, ప్రజామ్=కులాచారనిర్వాహికయగు పుత్రాదిరూప ప్రజను, అవిన్దత=పొందెను. యః=ఏ పురుషcడు, ఏతేన హవిషా=ఈ చరుహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాcడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషcడును, ఏనత్=ఈ యజ్ఞకర్మను, ఏవమ్=యథోక్త ప్రకారముగ, విన్దతే=తెలిసికొనుచున్నాcడో, సః=అతcడు, మూలమ్=మూలనక్షత్రమూర్తిదేవతను, ప్రజామ్=కులాచార నిర్వాహికయగు పుత్రాదిరూప ప్రజను, విన్దతే హ వై=నిశ్చయముగ పొందుచున్నాcడు.

సః=అతcడు, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='ప్రజాపతయే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. ప్రజాపతయే=నిర్ఋతిదేవతకొఱకు, స్వాహా. మూలాయ=మూలనక్షత్రమూర్తి దేవతకొఱకు, స్వాహా. ప్రజాయై=కులాచార నిర్వాహికయగు పుత్రాదిరూప ప్రజాభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : ఇచట ప్రజాపతిశబ్దముచే నిర్ఋతిదేవత వివక్ష చేయcబడుచున్నది. ఈ నిర్ఋతి ఉగ్రదేవతయైనను హవిస్సుచే సంతుష్టయగుచు బాధించదు. మఱియు ననిష్టమును నివారణముచే పాలించుచున్నది. కనుక నిర్ఋతికి ప్రజాపతిత్వ ముపపన్న మగుచున్నది. కులాచార నిర్వాహికయగు ప్రజ ప్రజాశబ్దముచే చెప్పcబడుచున్నది. స్వభృత్యులందు ఆప్తప్రజ మూలమని లోకులచే వ్యవహరించcబడుచున్నది. అటువంటి యుభయవిధప్రజను పొందెదనని నిర్ఋతియొక్క కామన. శేషము పూర్వమువలెనే గ్రాహ్యము. ఇచట తృతీయ నక్షత్రేష్టి, ఉపహోమములు విధించcబడినవి.

4. మంత్రము : **ఆపో వా అకామయన్త । సముద్రం కామమభిజయేమేతి । తా ఏత మద్భ్యోఽషాఢాభ్యశ్చరుం నిరవపన్।**

తతో వై తాః సముద్రం కామమభ్యజయన్ । సముద్రగ్ం హ వై కామమభిజయతి । య ఏతేన హవిషా

యజతే । య ఉ చైనదేవం వేద । సోఽత్ర జుహోతి । అద్భ్యః స్వాహాఽషాఢాభ్యః స్వాహా । సముద్రాయ

స్వాహా । కామాయ స్వాహా । అభిజిత్యై స్వాహేతి (4) ఇతి

అర్థము : ఆపః=అబ్దేవతలు, 'సముద్రమ్=జలరాశిరూపమైన సముద్రమును, కామమ్ అభిజయేమ=స్వేచ్ఛగా జయింతుము గాక', ఇతి=అని, అకామయన్త వై=నిశ్చయముగ కోరుకొనిరి. తాః=ఆ యబ్దేవతలు, అద్భ్యః=అబ్దేవతలకొఱకు, అషాఢాభ్యః=అషాఢానక్షత్రదేవతామూర్తులకొఱకును, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపన్=నిర్వాపము చేసిరి. తతః వై=ఆ చరుహవిర్నిర్వాపమువలననే, తాః=ఆ యబ్దేవతలు, సముద్రమ్=జలరాశిరూప సముద్రమును, కామమ్=స్వేచ్ఛగా, అభ్యజయన్=అంతటను

జయించిరి. యః=ఏ పురుషుఁడు, ఏతేన హవిషా=ఈ చరుహవిస్సుచే యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యః ఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ యజ్ఞకర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, సముద్రమ్=సముద్రసదృశమైన, కామమ్ అభిజయతి హ వై=నిశ్చయముగ నభిలషితార్థము నంతటను పొందుచున్నాఁడు.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='అద్భ్యః స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అద్భ్యః=అబ్దేవతలకొఱకు, స్వాహా. అషాఢాభ్యః=అషాఢానక్షత్ర దేవతామూర్తులకొఱకు, స్వాహా. సముద్రాయ=జలరాశిరూప సముద్రాభిమానిదేవతకొఱకు, స్వాహా. కామాయ=అభిలషితార్థాభిమానిదేవతకొఱకు, స్వాహా. అభిజిత్యై=అభిజయాభిమానిదేవతకొఱకు, స్వాహా. ఆపః=ఈ కల్పమున అబ్దేవతా సంజ్ఞను పొందగోరునట్టి పూర్వకల్పీయులు. అభిజితిః=అభితః వశీకరణము.

తాత్పర్యము : జలరాశిరూప సముద్రమును స్వేచ్ఛగా వశీకరించుకొనవలెనని అబ్దేవతల కామన. యజమానుఁడు మాత్రము సముద్రము అతిప్రభూత మగుటచే సముద్రసదృశమైన యభిలషితార్థమును పొందుచున్నాఁడని యర్థము. శేషము పూర్వవత్తు. ఇచట చతుర్థనక్షత్రేష్టి, ఉపహోమములును విధించఁబడినవి. ఇది పూర్వాషాఢానక్షత్ర సంబంధి.

5. మంత్రము : విశ్వే వై దేవా అకామయన్త। అనపజయ్యం జయేమేతి। త ఏతం విశ్వేభ్యో దేవేభ్యో కషాఢాభ్యశ్చరుం నిరవపన్। తతో వై తే కనపజయ్య మజయన్। అనపజయ్యగ్ం హ వై జయతి। య ఏతేన హవిషా యజతే। య ఉ చైనదేవం వేద। సో కత్ర జుహోతి। విశ్వేభ్యో దేవేభ్యః స్వాహా.షాఢాభ్యః స్వాహా। అనపజయ్యాయ స్వాహా జిత్యై స్వాహేతి (5), ఇతి।

అర్థము : విశ్వే దేవాః=విశ్వదేవదేవతలు, 'అనపజయ్యమ్=జయింప సాధ్యముకాని శత్రువును, జయేమ=జయింతుము గాక', ఇతి=అని, అకామయన్త వై=నిశ్చయముగ కోరుకొనిరి. తే=ఆ విశ్వేదేవదేవతలు, విశ్వేభ్యః=విశ్వదేవతలకొఱకు, అషాఢాభ్యః=అషాఢానక్షత్రమూర్తిదేవతలకొఱకును, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపన్=నిర్వాపము చేసిరి. తతః వై=ఆ చరుహవిర్నిర్వాపమువలననే, తే=ఆ విశ్వేదేవదేవతలు, అనపజయ్యమ్=జయింపసాధ్యముకాని శత్రువును, అజయన్=జయించిరి. యః=ఏ పురుషుఁడు, ఏతేన హవిషా=ఈ చరుహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాఁడో, చ=మఱియు, యః ఉ=ఏ పుషుఁడును, ఏనత్=ఈ యాగకర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, అనపజయ్యమ్=జయింప సాధ్యముకాని శత్రువును, జయతి హ వై=నిశ్చయముగ జయించుచున్నాఁడు.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='విశ్వేభ్యః దేవేభ్యః స్వాహా' అను మంత్రములచే హోమము చేయవలెను. విశ్వేభ్యః దేవేభ్యః=విశ్వేదేవదేవతలకొఱకు, స్వాహా. అషాఢాభ్యః=అషాఢానక్షత్రమూర్తిదేవతలకొఱకు. స్వాహా. అనపజయ్యాయ=జయింప శక్యముకాని శత్రువు నభిమానించుదేవునికొఱకు, స్వాహా. జిత్యై=జయాభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : ఈ కల్పమందు విశ్వేదేవసంజ్ఞను పొందఁగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యులని 'విశ్వేదేవాః' అను పదముల కర్థము. అనపజయ్యశత్రువును జయింపవలెనని విశ్వేదేవదేవతాత్వమును కోరునట్టివారి కామన. అనపజయ్యశత్రభిమాని దేవుఁడు కూడ అనపజయ్యుఁడే. జయాభిమానిదేవుఁడు జితి. శేషము పూర్వవత్తు. ఇచట పంచమ నక్షత్రేష్టి, ఉపహోమములు విధించఁబడినవి. ఇది ఉత్తరాషాఢానక్షత్రసంబంధి.

6. మంత్రము : బ్రహ్మ వా అకామయత । బ్రహ్మలోకమభిజయేయమితి । తదేతం బ్రహ్మణే ఽభిజితే చరుం నిరవపత్।

తతో వై తద్బ్రహ్మలోక మభ్యజయత్ । బ్రహ్మలోకగ్ం హ వా అభిజయతి । య ఏతేన హవిషా యజతే।

య ఉ చైనదేవం వేద । సో ఽత్ర జుహోతి । బ్రహ్మణే స్వాహా ఽభిజితే స్వాహా । బ్రహ్మలోకాయ

స్వాహా ఽభిజిత్యై స్వాహేతి (6), ఇతి ।

అర్థము : బ్రహ్మ=ఈ కల్పమందు బ్రహ్మపదవి పొందఁగోరునట్టి పూర్వకల్పీయ బ్రాహ్మణుఁడు, 'బ్రహ్మలోకమ్=సత్యలోకమును, అభిజయేయమ్=అంతటను పొందుదును గాక', ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. తత్=ఆ బ్రహ్మ (బ్రాహ్మణత్వజాతియుక్తపురుషుఁడు), బ్రహ్మణే=సత్యలోక స్వామియైన బ్రహ్మకొఱకు, అభిజితే='అభిజిత్' అను నక్షత్రమూర్తిదేవతకొఱకు, ఏతం చరుమ్ =ఈ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపముచేసెను. తతఃవై=ఆ చరుహవిర్నిర్వాపమువలననే, తత్=ఆ బ్రహ్మ (బ్రాహ్మణత్వజాతియుక్త పురుషుఁడు), బ్రహ్మలోకమ్=సత్యలోకమును, అభ్యజయత్=అంతటను జయించెను. యఃఏపురుషుఁడు, ఏతేన హవిషా, యజతే, చ, యఃఉ, ఏనత్, ఏవమ్, వేద, (ఈ పదముల కర్థము చెప్పఁబడినది.) సః=ఆపురుషుఁడు, బ్రహ్మలోకం హ వై=సత్యలోకమునే, అభిజయతి=అంతటను జయించుచున్నాఁడు.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='బ్రహ్మణే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. బ్రహ్మణే=బ్రహ్మకొఱకు, స్వాహా. అభిజితే=అభిజిన్నామక నక్షత్రాభిమానిదేవత కొఱకు, స్వాహా. బ్రహ్మలోకాయ, స్వాహా. అభిజిత్యై, స్వాహా. (ఈ పదముల కర్థము చెప్పఁబడినది.)

తాత్పర్యము : సత్యలోకస్వామిత్వమును కోరుచున్న బ్రాహ్మణత్వజాతియుక్తుఁడైన పూర్వకల్పీయ పురుషుఁడు బ్రహ్మశబ్దముచే వివక్షితుఁడు. అభిజిత్సంజ్ఞకము ఉత్తరాషాఢా శ్రవణముల మధ్యవర్తియైన నక్షత్రము. తదభిమానిదేవునకుఁ గూడ బ్రహ్మ అను నామధేయమే. శేషము స్పష్టము. ఇచట షష్ఠనక్షత్రేష్టి, ఉపహోమములును విధింపఁబడినవి.

7. మంత్రము : **విష్ణుర్వా అకామయత । పుణ్యగ్ం శ్లోకగ్ం శృణ్వీయ । న మా పాపీ కీర్తి రాగచ్ఛేదితి । స ఏతం విష్ణవే శ్రోణాయై పురోడాశం త్రికపాలం నిరవపత్ । తతో వై స పుణ్యగ్ం శ్లోకమశృణుత । నైనం పాపీ కీర్తిరాగచ్ఛత్ । పుణ్యగ్ం హ వై శ్లోకగ్ం శృణుతే । నైనం పాపీ కీర్తిరాగచ్ఛతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో కత్ర జుహోతి । విష్ణవే స్వాహా శ్రోణాయై స్వాహా । శ్లోకాయ స్వాహా శ్రుతాయ స్వాహేతి (7), ఇతి ।**

అర్థము : విష్ణుః=ఈ కల్పమందు విష్ణు సంజ్ఞను పొందcగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యcడు, 'పుణ్యం శ్లోకమ్=స్తుతిని, శృణ్వీయ=వినుమని గాక. మా=నన్ను, పాపీ కీర్తిః=నింద, న ఆగచ్ఛేత్=పొందకుcడుcగాక' ఇతి=అని, అకామయత=కోరుకొనెను. సః=ఆ మనుష్యcడు, విష్ణవే=విష్ణువుకొఱకు, శ్రోణాయై=శ్రవణనక్షత్రమూర్తికొఱకును, ఏతం త్రికపాలం పురోడాశమ్=మూcడు కపాలములందు సంస్కృతమైన యీ పురోడాశమును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, సః=ఆ నిర్వాపకర్త, పుణ్యం శ్లోకం వై=స్తుతినే, అశృణుత=వినెను. ఏనమ్=ఇతనిని, పాపీ కీర్తిః=నింద, నాగచ్ఛత్=పొందలేదు.

యః, ఏతేన హవిషా, యజతే; చ, యః ఉ, ఏనత్, ఏవమ్, వేద; (అర్థము పూర్వవత్తు.) సః=ఆ పురుషుcడు, పుణ్యం శ్లోకం హ వై=స్తుతినే, శృణుతే=విను(చున్నాcడు)ను. ఏనమ్=ఇతనిని, పాపీ కీర్తిః=నింద, నాగచ్ఛతి=పొందదు. సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='విష్ణవే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. విష్ణవే=విష్ణుదేవునికొఱకు, స్వాహా. శ్రోణాయై=శ్రవణ నక్షత్రమూర్తి కొఱకు, స్వాహా. శ్లోకాయ=స్తుత్యభిమానిదేవతకొఱకు, స్వాహా. శ్రుతాయ=శ్రవణనక్షత్రాభిమానిదేవుని కొఱకు, స్వాహా.

తాత్పర్యము : పుణ్యశ్లోక మనcగా కీర్తి. పాపకీర్తి యనcగా నింద. శ్రోణ యనcగా శ్రవణనక్షత్రము. శేషము స్పష్టము. ఇచట సప్తమ నక్షత్రేష్టి, ఉపహోమములు విధించcబడినవి.

8. మంత్రము : **వసవో వా అకామయన్త । అగ్రం దేవతానాం పరీయామేతి । త ఏతం వసుభ్యః శ్రవిష్ఠాభ్యః పురోడాశమష్టకపాలం నిరవపన్ । తతో వై తే కగ్రం దేవతానాం పర్యాయన్ । అగ్రగ్ం హ వై సమానానాం పర్యేతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో కత్ర జుహోతి । వసుభ్యః స్వాహా శ్రవిష్ఠాభ్యః స్వాహా । అగ్రాయ స్వాహా పరీత్యై స్వాహేతి (8), ఇతి ।**

అర్థము : వసవః=ఈ కల్పమందు వసు సంజ్ఞను పొందఁగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యులు, 'దేవానామ్=దేవతలలో, అగ్రమ్=ముఖ్యత్వమును, పరీయామ=తటను పొందుదుము గాక' ఇతి=అని, అకామయన్త=కోరుకొనిరి. తే=వారు, వసుభ్యః=వసుదేవతలకొఱకు, శ్రవిష్ఠాభ్యః=ధనిష్ఠానక్షత్రమూర్తులకొఱకును, ఏతమ్ అష్టాకపాలం పురోడాశమ్=ఈ యష్టాకపాల సంస్కృత పురోడాశమును, నిరవపన్=నిర్వాపము చేసిరి. తతః వై=ఆ యష్టాకపాల పురోడాశ నిర్వాపమువలననే, దేవతానామ్=దేవతలలో, అగ్రమ్=ముఖ్యత్వమును, పర్యాయన్=పొందిరి.

యః=ఏ మనుష్యఁడు, ఏతేన హవిషా, యజతే; చ, యః ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః=అతఁడు, సమానానామ్=సమానులలో, అగ్రం హ వై=ముఖ్యత్వమునే, పర్యేతి=పొందును. సః, అత్ర, జుహోతి='వసుభ్యః స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. వసుభ్యః=వసుదేవతలకొఱకు, స్వాహా. శ్రవిష్ఠాభ్యః=ధనిష్ఠానక్షత్రమూర్తులకొఱకు, స్వాహా. అగ్రాయ=శ్రైష్ఠ్యాభిమానిదేవునికొఱకు, స్వాహా. పరీత్యై=ముఖ్యత్వ (శ్రైష్ఠ్య) ప్రాప్త్యభిమానిదేవునికొఱకు, స్వాహా.

తాత్పర్యము : శేషము స్పష్టము. ఇచట అష్టమ నక్షత్రేష్టి, ఉపహోమములు విధించబడినవి.

9. మంత్రము : ఇన్ద్రో వా అకామయత । దృఢో ఽశిథిలః స్యామితి । స ఏతం వరుణాయ శతభిషజే భేషజేభ్యః పురోడాశ దశకపాలం నిరవపత్కృష్ణానాం వ్రీహీణామ్ । తతో వై స దృఢో ఽశిథిలో ఽభవత్ । దృఢో హ వా అశిథిలో భవతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ఽత్ర జుహోతి । వరుణాయ స్వాహా శతభిషజే స్వాహా । భేషజేభ్యః స్వాహేతి (9), ఇతి ।

అర్థము : ఇన్ద్రుః=ఈ కల్పమందు పరమైశ్వర్యయుక్త వరుణ సంజ్ఞను పొందఁగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యఁడు, 'దృఢః=దృఢుఁడను, అశిథిలః=అశిథిలుఁడను, స్యామ్=అగుదును గాక' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతఁడు, వరుణాయ=వరుణదేవునికొఱకు, శతభిషజే='శతభిషక్' అను నక్షత్రమూర్తికొఱకును, భేషజేభ్యః=ఔషధాభిమాని దేవతాశరీరములకొఱకును, కృష్ణానాం వ్రీహీణామ్=నల్లని వ్రీహులకు సంబంధించిన, ఏతం దశకపాలం పురోడాశమ్=ఈ దశకపాల సంస్కృత పురోడాశమును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, సః=ఆ పురోడాశ నిర్వాపకర్త, దృఢః=దృఢుఁడు, అశిథిలః=అశిథిలుఁడును, అభవత్=ఆయెను.

యః, ఏతేన హవిషా, యజతే; చ, యః ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః, దృఢః, అశిథిలః హ వై=దృఢుఁడుగాను, అశిథిలుఁడునుగానే, భవతి=అగును. సః=అతఁడు, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='వరుణాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. వరుణాయ=వరుణ దేవునికొఱకు, స్వాహా. శతభిషజే=శతభిషన్నక్షత్రమూర్తికొఱకు, స్వాహా. భేషజేభ్యః=ఔషధాభిమాని దేవతాశరీరములకొఱకు, స్వాహా.

తాత్పర్యము : ఇచట ఇన్ద్ర శబ్దముచే పరమైశ్వర్యయోగమువలన వరుణుఁడు చెప్పఁబడుచున్నాఁడు. ''ఇది-పరమాశ్వర్యే'' అను ధాతువునుండి ఇన్ద్ర శబ్దము పుట్టినది. దార్ఢ్యమ్=స్వస్య కార్యక్షమత్వమ్. తనయొక్క కార్యక్షమత్వమనియర్థము. అశైథిల్యమ్=పరైరభిభవాభావః. ఇతరులచే పరిభవము కలుగకుండుట యని యర్థము. శతభిషక్ అనునది నక్షత్రము. భేషజము లనఁగా ఔషధాభిమాని దేవతా శరీరములు. వరుణ నక్షత్ర భేషజ దేవతకొఱకు కృష్ణవ్రీహుల సంబంధియగు పురోడాశమును నిర్వాపము చేసి దార్ఢ్యమును, అశైథిల్యమును పొందెను. శేషము స్పష్టము. ఇచట నవమ నక్షత్రేష్టి, ఉపహోమములు విధించఁబడినవి.

10. మంత్రము :**అజో వా ఏకపాదకామయత । తేజస్వీ బ్రహ్మవర్చసీ స్యామితి । స ఏత మజాయైకపదే ప్రోష్ఠపదేభ్యశ్చరుం నిరవపత్ । తతో వై స తేజస్వీ బ్రహ్మవర్చస్యభవత్ । తేజస్వీ హ వై బ్రహ్మవర్చసీ భవతి । య ఏతేన హవిషా యజతే య ఉ చైనదేవం వేద । సో Kత్ర జుహోతి । అజాయైకపదే స్వాహా ప్రోష్ఠపదేభ్యః స్వాహా। తేజసే స్వాహా బ్రహ్మవర్చసాయ స్వాహేతి (10), ఇతి ।**

అర్థము : అజః ఏకపాత్=ఈ కల్పమందు అజుఁడు, ఏకపాదుఁడు అను సంజ్ఞలను పొందఁగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యుఁడు, 'తేజస్వీ=తేజస్వంతుఁడను, బ్రహ్మవర్చసీ=బ్రహ్మవర్చసము కలవాఁడను, స్యామ్=అగుదును గాక', ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతఁడు, అజాయ=అజుఁడైన, ఏకపదే=ఏకపద్దేవునికొఱకు, ప్రోష్ఠపదేభ్యః=ప్రోష్ఠపద (పూర్వాభాద్ర) నక్షత్రమూర్తులకొఱకును, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ చరునిర్వాపమువలననే, సః=ఆ చరునిర్వాపకర్త, తేజస్వీ=తేజస్వంతుఁడు, బ్రహ్మవర్చసీ=బ్రహ్మవర్చసవంతుఁడును, అభవత్=ఆయెను.

యః ఏతేన హవిషా, యజతే; చ, యః, ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః, తేజస్వీ, బ్రహ్మవర్చసీ హ వై=తేజస్వంతుఁడు, బ్రహ్మవర్చసవంతుఁడుగానే, భవతి=అగును. సః, అత్ర, జుహోతి='అజాయైకపదే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అజాయ=గమనశీలుఁడును, ఏకపదే=జగదుపకారకమైన పాదము కలవాఁడునగు దేవునికొఱకు, స్వాహా. తేజసే=శరీరకాంత్యభిమాని దేవునికొఱకు, స్వాహా. బ్రహ్మవర్చసాయ=బ్రహ్మవర్చసాభిమాని దేవునికొఱకు, స్వాహా.

తాత్పర్యము : అజః=గమనశీలుఁడు. లేదా-ఇదానీంతన జన్మరహితుఁడు. ఏకః=జగదుపకారకః పాదః యస్యాసౌ ఏకపాత్=జగదుపకారకమైన పాదము కలవాఁడు. లేదా- ఏకః ఏవ పద్యతే-గచ్ఛతీతి ఏకపాత్. ఒక్కఁడే పయనించువాఁడని యర్థము. అట్టిదేవుఁడు సూర్యుఁడు. ''సూర్య ఏకాకీ చరతి'' అను శ్రుతి యీ యర్థమునే చెప్పుచున్నది. తేజస్వీ=శరీరకాంతి యుక్తుఁడు. బ్రహ్మవర్చసీ=వేదశాస్త్రాద్యధ్యయనాదిజన్య కాంతియుక్తుఁడు. తాత్పర్యము స్పష్టము. ఇచట దశమ నక్షత్రేష్టి, ఉపహోమములు విహితము లైనవి.

11. మంత్రము :**అహిర్వై బుధ్నియో Kకామయత । ఇమాం ప్రతిష్ఠాం విన్దేయేతి । స ఏతమహయే బుధ్నియాయ ప్రోష్ఠపదేభ్యః పురోడాశం భూమికపాలం నిరవపత్ । తతో వై స ఇమాం ప్రతిష్ఠా మవిన్దత । ఇమాగ్ం హ**

వై ప్రతిష్ఠాం విన్దతే । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ఽక్షత్ర జుహోతి । అహయే

బుధ్నియాయ స్వాహా ప్రోష్ఠపదేభ్యః స్వాహా । ప్రతిష్ఠాయై స్వాహేతి (11), ఇతి ।

అర్థము : అహిర్బుధ్నియః=ఈ కల్పమందు అహిర్బుధ్నియ సంజ్ఞను పొందఁగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యఁడు, 'ఇమాం ప్రతిష్ఠామ్=ఈ భూమిని స్వనివాసమునకై ప్రతిష్ఠితమునుగా, విన్దేయ=పొందెదను గాక' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతఁడు, అహయే=క్షీణించనివాఁడును, బుధ్నియాయ=సృష్ట్యాదియందు ఉన్నవాఁడునగు దేవునికొఱకు, ప్రోష్ఠపదేభ్యః=ప్రోష్ఠపద నక్షత్రమూర్తులకొఱకును, ఏతమ్=ఈ, భూమికపాలమ్=కపాలమాత్ర భూమియందు సంస్కరించఁబడిన, పురోడాశమ్=పురోడాశమును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, సః=ఆ నిర్వాపకర్త, ఇమామ్=ఈ భూమిని, ప్రతిష్ఠామ్=స్వ నివాసమునకై ప్రతిష్ఠితమునుగా, అవిన్దత=పొందెను.

యః, ఏతేన హవిషా, యజతే; చ, యః ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః, ఇమామ్= ఈ భూమిని, ప్రతిష్ఠాం హ వై=స్వ నివాసమునకై ప్రతిష్ఠితమునుగానే, విన్దతే=పొందును. సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='అహయే బుధ్నియాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అహయే=క్షీణించనివాఁడును, బుధ్నియాయ =సృష్ట్యాదియందు ఉన్నవాఁడునగు దేవునికొఱకు, స్వాహా. ప్రోష్ఠపదేభ్యః=ఉత్తరభాద్రానక్షత్రమూర్తులకొఱకు, స్వాహా. ప్రతిష్ఠాయై= ప్రతిష్ఠాభిమానిదేవతలకొఱకు, స్వాహా.

తాత్పర్యము : న హీయతే ఇతి అహిః-క్షీణించనివాఁడు. బుధ్నే-మూలే సృష్ట్యాదౌ భవః బుధ్నియః=సృష్ట్యాదియందు ఉన్నవాఁడు. ''కపాలమాత్రం భూమిం పరిలిఖ్యాఙ్గార మధివర్తయతి తస్యైకకపాలవత్సంస్కారః'' అని బౌధాయనమహర్షి భూమికపాల స్వరూపమును నిర్వచించెను. అనఁగా కపాలమాత్ర పరిమితికల భూమిని చుట్టు గీతగీచి యచట అందు అంగారమునుంచినచో దానికి ఏకకపాలమువలె సంస్కారమగునని యర్థము. ఏకకపాల సంస్కృత పురోడాశమువంటిదే యీ భూమికపాల సంస్కృత పురోడాశము కూడ. అటువంటి భూమికపాలోపేత పురోడాశమును నిర్వాపము చేసి స్వాపేక్షిత ఫలమును పొందెనని యర్థము. శేషము స్పష్టము. ఇచట ఏకాదశ నక్షత్రేష్టి, ఉపహోమములు విహితము లైనవి.

12. మంత్రము :పూషా వా అకామయత । పశుమాన్త్స్యమితి । స ఏతం పూష్ణే రేవత్యై చరుం నిరవపత్ । తతో వై స

పశుమానభవత్ । పశుమాన్హ వై భవతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైవదేవం వేద । సో ఽక్షత్ర

జుహోతి । పూష్ణే స్వాహా రేవత్యై స్వాహా । పశుభ్యః స్వాహేతి (12), ఇతి ।

అర్థము : పూషా=ఈ కల్పమందు పూష సంజ్ఞను పొందఁగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యుఁడు, 'పశుమాన్=పశుమంతుఁడను, స్యామ్ అగుదును గాక' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతఁడు, పూష్ణే=పూషదేవునికొఱకు, రేవత్యై=రేవతీనక్షత్రమూర్తికొఱకు, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ చరునిర్వాపమువలననే, సః=ఆ చరు నిర్వాపకర్త, పశుమాన్=పశుమంతుఁడు, అభవత్=ఆయెను. యః, ఏతేన హవిషా, యజతే; చ, యః, ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః, పశుమాన్ హ వై=పశుమంతుఁడే, భవతి=అగును. సః, అత్ర, జుహోతి='పూష్ణే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. పూష్ణే, స్వాహా. రేవత్యై=రేవతీనక్షత్రమూర్తికొఱకు, స్వాహా. పశుభ్యః=పశ్వభిమాని దేవతలకొఱకు, స్వాహా. (ఇందు పదము లన్నియు స్పష్టార్థములే.)

తాత్పర్యము : తాత్పర్యము స్పష్టము. ఇచట ద్వాదశ నక్షత్రేష్టి, ఉపహోమములు విహితము లైనవి.

13. మంత్రము :**అశ్వినౌ వా అకామయేతామ్ । శ్రోత్రస్యానవబధిరౌ స్యావేతి । తావేత మశ్విభ్యా మశ్వయుగ్భ్యాం పురోడాశం ద్వికపాలం నిరవపతామ్ । తతో వై తౌ శ్రోత్రస్యానవబధిరా వభవతామ్ । శ్రోత్రస్వీ హ వా అబధిరో భవతి ।య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ఽత్ర జుహోతి । అశ్విభ్యాగ్ం స్వాహా ఽశ్వయుగ్భ్యాగ్ం స్వాహా । శ్రోత్రాయ స్వాహా శ్రుత్యై స్వాహేతి (13), ఇతి ।**

అర్థము : అశ్వినౌ=ఈ కల్పమందు అశ్వి సంజ్ఞను పొందఁగోరునట్టి పూర్వకల్పీయ మనుష్య లిద్దఱు, 'శ్రోత్రస్యినౌ=యోజనాది వ్యవహితవార్తను వినుటకై సామర్థ్యము కలవారము, అబధిరౌ=వార్ధకమందుఁగూడ బాధిర్యరహితులమును, స్యావ=అగుదుము గాక' ఇతి=అని, అకామయేతాం వై=నిశ్చయముగ కోరుకొనిరి. తౌ=ఆ యుభయులు, అశ్విభ్యామ్=అశ్వినీదేవతలకొఱకు, అశ్వయుగ్భ్యామ్=అశ్వినినక్షత్ర మూర్తులకొఱకును, ద్వికపాలమ్=ద్వికపాలసంస్కృతమైన, ఏతం పురోడాశమ్=ఈ పురోడాశహవిస్సును, నిరవపతామ్=నిర్వాపము చేసిరి. తతః వై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, తౌ=ఆ నిర్వాపకర్తలుభయులు, శ్రోత్రస్యినౌ=యోజనాది వ్యవహిత వార్తాశ్రవణ సమర్థులును, అబధిరౌ=వార్ధకమందుఁగూడ బాధిర్య రహితులును, అభవతామ్=అయిరి.

యః, ఏతేన హవిషా, యజతే; చ, యః ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః, శ్రోత్రస్వీ=యోజనాది వ్యవహిత వార్తాశ్రవణ సమర్థుఁడు, అబధిరః=వార్ధకమందుఁగూడ బాధిర్య రహితుఁడును, భవతి హ వై=నిశ్చయముగ నగును. సః, అత్ర, జుహోతి='అశ్విభ్యాం స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అశ్విభ్యామ్=అశ్వినీదేవతలకొఱకు, స్వాహా. అశ్వయుగ్భ్యామ్=అశ్వినినక్షత్రమూర్తుల కొఱకును, స్వాహా. శ్రోత్రాయ=దూరవార్తాశ్రవణ సామర్థ్యప్రదుఁడగు దేవునికొఱకు, స్వాహా. శ్రుత్యై=బాధిర్యనివారక దేవవిశేషముకొఱకు, స్వాహా.

తాత్పర్యము : తాత్పర్యము స్పష్టము. ఇచట త్రయోదశ నక్షత్రేష్టి, ఉపహోమములును విహితము లైనవి.

14. మంత్రము :**యమో వా అకామయత । పితృణాగ్ం రాజ్యమభిజయేయమితి । స ఏతం యమాయాపభరణీభ్యశ్చరుం నిరవపత్ । తతో వై స పితృణాగ్ం రాజ్యమభ్యజయత్ । సమానానాగ్ం హ వై రాజ్యమభిజయతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సోకత్ర జుహోతి । యమాయ స్వాహాకపభరణీభ్యః స్వాహా । రాజ్యాయ స్వాహాకభిజిత్యై స్వాహేతి (14), ఇతి ।**

అర్థము : యమః=ఈ కల్పమందు యమసంజ్ఞను పొందcగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యcడు, 'పితృణామ్=పితృదేవతలయొక్క, రాజ్యమ్=రాజ్యమును, అభిజయేయమ్=అంతటును పొందుదును (జయింతును) గాక' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతcడు, యమాయ=యమునికొఱకు, అపభరణీభ్యః=అపభరణీనక్షత్రమూర్తులకొఱకును, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ చరుహవిర్నిర్వాపమువలననే, సః=ఆ చరునిర్వాపకర్త, పితృణాం రాజ్యం హ వై=పితృదేవతలయొక్క రాజ్యమునే, అభ్యజయత్=అంతటును జయించెను (పొందెను).

యః, ఏతేన హవిషా, యజతే; చ, యః ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః, సమానానామ్=స్వ సమానులలో, రాజ్యమ్=రాజ్యమును, అభిజయతి హ వై=నిశ్చయముగ పొందును. సః, అత్ర, జుహోతి='యమాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. యమాయ, స్వాహా. అపభరణీభ్యః= అపభరణీనక్షత్రమూర్తులకొఱకును, స్వాహా. రాజ్యాయ=రాజ్యాభిమానిదేవునికొఱకు, స్వాహా. అభిజిత్యై=అభిజయాభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : యమునకు పితృరాజ్యప్రాప్తి కలిగినవిధముగనే యితర యజమానునకుc గూడ స్వ సమానులలో రాజ్యప్రాప్తి కలుగునని యర్థము. శేషము స్పష్టము. ఇచట చతుర్దశ నక్షత్రేష్టి, ఉపహోమములును విహితము లైనవి.

15. మంత్రము :**అథైతదమావాస్యాయా ఆజ్యం నిర్వపతి। కామో వా అమావాస్యా । కామ ఆజ్యమ్ । కామేనైవ కామగ్ం సమర్ధయతి । క్షిప్రమేనగ్ం స కామ ఉపనమతి। యేన కామేన యజతే । సోకత్ర జుహోతి । అమావాస్యాయై స్వాహా కామాయ స్వాహాకగత్యై స్వాహేతి (15), ఇతి ।**

మిత్ర ఇన్ద్ర ప్రజాపతిర్దశ దశాకప ఏకాదశ విశ్వే బ్రహ్మ దశ దశ విష్ణుస్త్రయోదశ వసవ ఇన్ద్రోకజోకహిర్వై బుధ్నియాః పూషాకశ్వినౌ యమో దశ దశామావాస్యాయా అష్టౌ పఞ్చదశ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమ ప్రపాఠకే పఞ్చమోకనువాకః ॥౫॥

అర్థము : అథ=యమనక్షత్రేష్ట్యనంతరము, అమావాస్యాయై=తిథ్యభిమానినియైన అమావాస్యదేవతకొఱకు, ఏతత్ ఆజ్యమ్=ఈ యాజ్యమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. అమావాస్యా=అమావాస్య, కామఃవై=కామస్వరూపమే. ఆజ్యమ్=ఆజ్యము, కామఃకామస్వరూపము. సఃఅమావాస్యదేవతకై యాజ్యమును నిర్వాపము చేసిన యా యజమానుఁడు, కామేనైవ=కామరూపమైన యాజ్యముచేతనే, కామమ్=కామరూపమైన అమావాస్యదేవతను, సమర్ధయతి=సంతోషపఱచినవాఁ డగుచున్నాఁడు. యజమానఃయజమానుఁడు, యేన కామేన=నిమిత్తభూతమైన యే కామముచే, యజతే=యాగము చేయుచున్నాఁడో, సఃకామఃఆ కామము, క్షిప్రమ్=శీఘ్రముగ, ఏనమ్=ఈ యజమానుని, ఉపనమతి= పొందుచున్నది.

సఃఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='అమావాస్యాయై స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అమావాస్యాయై=అమావాస్యదేవతకొఱకు, స్వాహా. కామాయ=కామాభిమానిదేవతకొఱకు, స్వాహా. అగత్యై=అవినాశాభిమానిదేవతకొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుత మగుఁగాక.

తాత్పర్యము : అథ అను శబ్దము నక్షత్రవైలక్షణ్య ద్యోతకము. అమావాస్య తిథ్యభిమానిదేవత. నక్షత్రాభిమానిదేవత కాదు. ఆ యమావాస్యతిథియందు కర్మానుష్ఠానముచే సర్వకామములు ప్రాప్తించుటచే అమావాస్యక కామరూపత్వము ఉపచరింపఁబడినది. ఆజ్యము నందఱు కోరుదురు కనుక ఆజ్యమునకు కామరూపత్వము చెప్పఁబడినది. ఈ కారణమువలన యాగకర్త కామరూపమైన యాజ్యముచేతనే కామరూపిణియైన యమావాస్యదేవతను సంతోషపఱచినవాఁ డగును. శేషము స్పష్టము. యమనక్షత్రేష్టులను విధించినయనంతర మిచట అమావాస్యదేవతయొక్క యిష్టి, ఉపహోమములును విహితము లైనవి.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ప్రథమ ప్రపాఠకమునందు పంచమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమప్రపాఠకే
షష్ఠో ఽనువాకః

1. మంత్రము : చన్ద్రమా వా అకామయత । అహోరాత్రా నర్ధమాసాన్మాసా నృతూన్త్సంవత్సరమాప్నుా । చన్ద్రమసః సాయుజ్యగ్ం సలోకతా మాప్నుయామితి । స ఏతం చన్ద్రమసే ప్రతీదృశ్యాయై పురోడాశం పఞ్చదశకపాలం నిరవపత్ । తతో వై సో ఽహోరాత్రా నర్ధమాసాన్మాసా నృతూన్త్సంవత్సరమాప్నుా । చన్ద్రమసః సాయుజ్యగ్ం సలోకతా మాప్నోత్ । అహోరాత్రాన్వ వా అర్ధమాసాన్మాసా నృతూన్త్సంవత్సరమాప్నుా । చన్ద్రమసః సాయుజ్యగ్ం సలోకతా మాప్నోతి । య ఏతేన హవిషా యజతే। య ఉ చైనదేవం వేద । సో ఽత్ర జుహోతి । చన్ద్రమసే స్వాహా ప్రతీదృశ్యాయై స్వాహా । అహోరాత్రేభ్యః స్వాహా ఽర్ధమాసేభ్యః స్వాహా । మాసేభ్యః స్వాహర్తుభ్యః స్వాహా । సంవత్సరాయ స్వాహేతి (1), ఇతి ।

అవతారిక: పంచమానువాకమునందు యమనక్షత్రేష్టులు చెప్పబడినవి. ఈ షష్ఠానువాకమునందు చంద్రమఃప్రభృతీష్టులు విధించబడుచున్నవి. అందు ప్రథమమున నిచట చంద్రమసిష్టి విధించబడుచున్నది.

అర్థము : చన్ద్రమాఃఈ కల్పమందు భావిచంద్రమస్సంజ్ఞను పొందగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యుడు, 'అహోరాత్రాన్=అహోరాత్రదేవతలను, అర్ధమాసాన్=అర్ధమాసదేవతలను, మాసాన్=మాసదేవతలను, ఋతూన్=ఋతుదేవతలను, సంవత్సరమ్=సంవత్సరదేవతను, ఆప్నుా=పొంది, చన్ద్రమసః సాయుజ్యమ్=చంద్రసాయుజ్యమును (చంద్రునితో గూడ నొకగృహమందు నివాసమును, సలోకతామ్=చంద్రసాలోక్యమును చంద్రులోక నివాసమును), ఆప్నుయామ్=పొందుదును గాక,' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతడు, చన్ద్రమసే=చంద్రునికొఱకు, ప్రతీ దృశ్యాయై=జలాదికమునందు చంద్రప్రతిబింబముగా గనబడుచున్న చంద్రునికొఱకును, పఞ్చదశకపాలమ్=పదునైదు కపాలములందు సంస్కృతమైన, ఏతం పురోడాశమ్=ఈ పురోడాశమును, నిరవపత్=నిర్వాపము చేసెను.

తతః వై=ఆ పురోడాశ నిర్వాపమువలననే, సః=ఆ పురోడాశ నిర్వాపకర్త, అహోరాత్రాన్=అహోరాత్రదేవతలను, అర్ధమాసాన్=అర్ధమాసదేవతలను, మాసాన్=మాసదేవతను, ఋతూన్= ఋతుదేవతలను, సంవత్సరమ్=సంవత్సరదేవతను, ఆప్నుా=పొంది, చన్ద్రమసః సాయుజ్యమ్=చంద్రసాయుజ్యమును, సలోకతామ్=చంద్రసాలోక్యమును, ఆప్నోత్=పొందెను. యఃఏ యజమానుడు, ఏతేన హవిషా=ఈ పంచదశకపాల పురోడాశహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాడో, యఃఉ=ఏ పురుషుడును, ఏనత్=ఈ కర్మను, ఏవమ్=యథోక్తప్రకారముగ, వేద=తెలిసి

కొనుచున్నాడో, సః=అతడు, అహోరాత్రాన్ అర్ధమాసాన్ మాసాన్ ఋతూన్ సంవత్సరమ్= అహోరాత్రార్ధమాస మాసర్తు సంవత్సరదేవతలను, ఆప్త్వా=పొంది, చన్ద్రమసః సాయుజ్యమ్= చంద్రసాయుజ్యమును, సలోకతామ్=చంద్రసాలోక్యమును, ఆప్నోతి హ వై=నిశ్చయముగ పొందును.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='చన్ద్రమసే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. చన్ద్రమసే=చంద్రునికొఱకు, స్వాహా. ఈ హవిస్సు హుతమగుటగాక. ప్రతి ద్యశ్యాయై=జలాదికమందు చంద్రప్రతిబింబముగ కనబడుచున్న చంద్రునికొఱకు, స్వాహా. అహోరాత్రేభ్యః=అహోరాత్రదేవతలకొఱకు, స్వాహా. అర్ధమాసేభ్యః=అర్ధమాసదేవతలకొఱకు, స్వాహా. మాసేభ్యః=మాసదేవతలకొఱకు, స్వాహా. ఋతుభ్యః=ఋతుదేవతలకొఱకు స్వాహా. సంవత్సరాయ=సంవత్సరదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : ఈ కల్పమందు చంద్రసంజ్ఞను పొందుటగోరునట్టి పూర్వకల్పమునందలి మనుష్యుడు అహోరాత్రార్ధమాస మాసర్తు సంవత్సరదేవతల లోకములను పొంది తద్ద్వారా క్రమముగ చంద్రసాయుజ్యమును, చంద్రసాలోక్యమును పొందుటగోరినవాడై ఆ యహోరాత్రాది దేవతలకు పంచదశకపాల సంస్కృత పురోడాశమును నిర్వాపము చేసి ఆ విధముగ చంద్రసాయుజ్యమును, సాలోక్యమును పొందెను. ఈ విధముగ నితరయజమానుడు, తద్వేత్తయు ఆ సర్వమును పొందును. చంద్రసాయుజ్యము=తనకు చంద్రునితోడగూడ నొకగృహమందు నివాసము. చంద్రసాలోక్యము=చంద్రలోకమునందే తనకుడగూడ నివాసము.

2. మంత్రము : అహోరాత్రే వా అకామయేతామ్। అత్యహోరాత్రే ముచ్యేవహి। న నావహోరాత్రే ఆప్నుయాతామితి। తే ఏతమహోరాత్రాభ్యాం చరుం నిరవపతామ్। ద్వయానాం వ్రీహీణామ్। శుక్లానాం చ కృషణానాం చ। సవాత్యోర్ద్ధే। శ్వేతాయై చ కృష్ణాయై చ। తతో వై తే అత్యహోరాత్రే అముచ్యేతే। నైనే అహోరాత్రే ఆప్నుతామ్। అతి హ వా అహోరాత్రే ముచ్యతే। నైనమహోరాత్రే ఆప్నుతః। య ఏతేన హవిషా యజతే। య ఉ చైనదేవం వేద। సోऽత్ర జుహోతి। అహ్నే స్వాహా రాత్రియై స్వాహా। అతిముక్త్యై స్వాహేతి (2), ఇతి।

అర్థము : అహోరాత్రే=ఈ కల్పమందు అహోరాత్ర సంజ్ఞను పొందుటగోరునట్టి పూర్వకల్పీయులైన పురుషులిద్దఱు, 'అహోరాత్రే=వర్తమానులైన ఇద్దఱు అహోరాత్రదేవతలను, అతిముచ్యేవహి=అతిక్రమించి వారి పారతంత్ర్యమునుండి మే ముభయులము విడిపింపబడుదుము గాక. అహోరాత్రే=వర్తమానులైన యహోరాత్రదేవతలు, నౌ=మా యుభయులను, న ఆప్నుయాతామ్=పొందకుందురుగాక', ఇతి=అని, అకామయేతాం వై=నిశ్చయముగ కోరుకొనిరి. తే=వారు, అహోరాత్రాభ్యామ్=అహోరాత్ర దేవతలకొఱకు, శుక్లానాం చ=తెల్లనివియు, కృష్ణానాం చ=నల్లనివియునగు, ద్వయానాం వ్రీహీణాం=

రెండువిధములైన వ్రీహులయొక్క, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, శ్వేతాయై చ=తెల్లనిదియు, కృష్ణాయై చ=నల్లనిదియునగు, సవాత్యాఃఒకతల్లినుండి పుట్టిన రెండు ధేనువులయొక్క, దుగ్ధే=క్షీరము నందు, నిరవపతామ్=నిర్వాపము చేసిరి. తతఃవై=ఆ చరునిర్వాపమువలననే, తే=వారు, అహోరాత్రే=అహోరాత్రదేవతలను, అత్యముచ్యేతే=అతిక్రమించి విడిపించcబడిరి. ఏనే=వీరిని, అహోరాత్రే=అహోరాత్రదేవతలు, న ఆప్నుతామ్=పొందలేదు.

యఃఏ యజమానుఁడు, ఏతేన హవిషా=ఇటువంటి చరుహవిస్సుచే, యజతే=యాగము చేయుచున్నాcడో, చ=మఱియు, యఃఉ=ఏ పురుషుఁడును, ఏనత్=ఈ యాగకర్మను, వేద=తెలిసికొను చున్నాcడో, సఃఅతఁడు, అహోరాత్రే=అహోరాత్రదేవతలను, అతిముచ్యతే హ వై= అతిక్రమించి విడిపించcబడు చున్నాఁడు. సఃఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='అహ్నే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అహ్నే=అహర్దేవతకొఱకు, స్వాహా. రాత్రియై=రాత్రిదేవతకొఱకు, స్వాహా. అతిముక్త్యై=అతిముక్త్యభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : లోకమునందు సర్వప్రాణులు అహోరాత్రదేవతలకు వశ్యులై యుంటున్నారు. ఆ యహోరాత్రదేవతలు మాటిమాటికి ఆవర్తించు (మరలు) చున్నవారై ప్రాణుల యాయువును శీఘ్రముగ క్షీణింపఁజేసి వారిని చంపుచున్నారు. ఇది యిట్లుండఁగా భావివృత్తి నాశ్రయించి యహోరాత్రనామకులైన యిద్దఱు పురుషులీ విధముగ కోరుకొనిరి. -'ఇప్పుడు ఉంటున్న అహోరాత్రదేవతల నిద్దఱి నతిక్రమించి వారి పారతంత్ర్యమునుండి మే ముభయులము విడిపింపcబడుదుము గాక. ఈ యహోరాత్రదేవతలు మా యుభయులను పొందకుందురు గాక (మా యాయువును క్షీణింపcజేయ సమర్థులు కాకుందురు గాక)' యని.

భావియైన యహోరాత్రదేవతాత్వమును పొందcబోవునట్టి యుభయులు వర్తమానులైన యహోరాత్ర దేవతలకొఱకు శుక్లకృష్ణ వ్రీహిద్వయ చరుహవిస్సును క్షీరమునందు నిర్వాపము చేసిరి. ఆ క్షీరము శ్వేత కృష్ణ వర్ణములైన రెండు ధేనువుల సంబంధి. ఏకమాతృజన్యములైన రెండు ధేనువులు సవాత్యములనcబడును. ఆ ధేనువులలో నొకటి శుక్లవర్ణము కలది. మఱియొకటి కృష్ణవర్ణము కలది. అటువంటి ధేనువుల క్షీరమునందు చరువును నిర్వాపము చేసి యథోక్త ఫలమును పొందిరి. ఈ విధముగc జేసిన యితర యజమానుఁడు కూడ యథోక్త ఫలమును పొందును. శేషము స్పష్టము. ఇచట అహోరాత్రదేవతేష్టి, ఉపహోమములు విధించcబడినవి.

3. మంత్రము : **ఉషా వా అకామయత । ప్రియా ఽఽదిత్యస్య సుభగా స్యామితి । సైతముషసే చరుం నిరవపత్ ।**

తతో వై సా ప్రియా ఽఽదిత్యస్య సుభగా ఽభవత్ । ప్రియో హ వై సమానానాగ్ం సుభగో భవతి ।

య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సో ఽత్ర జుహోతి । ఉషసే స్వాహా వ్యుష్యై స్వాహా।

వ్యుష్టాయై స్వాహా వ్యుచ్ఛన్త్యై స్వాహా । వ్యుష్టాయై స్వాహేతి (3), ఇతి ।

అర్థము : ఉషా=ఉషాదేవి, 'ఆదిత్యస్య=ఆదిత్యునకు, ప్రియా=ప్రియురాలును, సుభగా=సౌభాగ్యవతిగాను, స్యామ్=అగుదును గాక' ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సా=ఆ యుషాదేవి, ఉషసే=పూర్వకల్ప సంబంధియైన ఉషోదేవతకొఱకు, చరుమ్=చరుహవిస్సును, నిరవపత్=నిర్వాపము చేసెను. తతః వై=ఆ చరుహవిర్నిర్వాపమువలననే, సా=ఆ యుషాదేవి, ఆదిత్యస్య=ఆదిత్యునకు, ప్రియా=ప్రియయు, సుభగా=సౌభాగ్యయుక్తయు, అభవత్=ఆయెను. యః, ఏతేన హవిషా, యజతే; చ, యః ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః, సమానానామ్=స్వసమానులలో, ప్రియః=ప్రియుఁడును, సుభగః=సౌభాగ్యయుక్తుఁడును, భవతి=అగును.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='ఉషసే స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. ఉషసే=ఉషోదేవతకొఱకు, స్వాహా. వ్యుష్ట్యై=వ్యుష్ట్యభిమాని దేవతకొఱకు, స్వాహా. వ్యూషుష్యై=భవిష్యద్వ్యుష్ట్యభిమానిదేవతకొఱకు, స్వాహా. వ్యుచ్ఛన్త్యై=వర్తమాన వ్యుష్ట్యభిమాని దేవతకొఱకు, స్వాహా. వ్యుష్టాయై=అతీతవ్యుష్ట్యభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : ఇప్పటి ఉషాదేవి ఆదిత్యప్రీతిని, సౌభాగ్యమును కోరుకొనుచున్నదై పూర్వకల్ప సంబంధినయైన యుషోదేవతకొఱకు చరువును నిర్వాపము చేసి స్వాభీష్టమును పొందినది. ఈ విధముగ నితర యజమానుఁడు కూడ ఆ చరుహవిర్నిర్వాపముచే స్వసమాను లందఱికి ప్రియుఁడు, సౌభాగ్యయుక్తుఁడు నగును. ఉషాః-తత్కాలదేవత. వ్యుష్టిః=ఆయుషోదేవతాకార్యమైన ప్రభాతత్వము. ఆ ప్రభాతత్వము భవిష్యద్వర్తమానాతీతత్వభేదములచే మూఁడు విధములైనది. కనుక తత్ప్రభాతత్వాభిమానిదేవతలకుఁ గూడ నుపహోమములు చెప్పఁబడినవి. ఇచట ఉషోదేవతేష్టి, ఉపహోమములు విధించఁబడినవి.

4. మంత్రము : అథైతస్మై నక్షత్రాయ చరుం నిర్వపతి। యథా త్వం దేవానామసి। ఏవమహం మనుష్యాణాం భూయాసమితి। యథా హ వా ఏతద్దేవానామ్। ఏవగ్ం హ వా ఏష మనుష్యాణాం భవతి। య ఏతేన హవిషా యజతే। య ఉ చైనదేవం వేద సోఽత్ర జుహోతి। నక్షత్రాయ స్వాహోదేష్యతే స్వాహా। ఉద్యతే స్వాహోదితాయ స్వాహా। హరసే స్వాహా భరసే స్వాహా। భాజసే స్వాహా తేజసే స్వాహా। తపసే స్వాహా బహ్మవర్చసాయ స్వాహేతి (4), ఇతి।

అర్థము : అథ=చాంద్రమసేష్ట్యాదుల యనంతరము, ఏతస్మై నక్షత్రాయ=ఈ నక్షత్రసామాన్యాభిమానియైన దేవునికొఱకు, ''యథా త్వం దేవానామసి, ఏవమహం మనుష్యాణాం భూయాసమ్'' ఇతి='ఓ నక్షత్రదేవా! ఏ విధంగా నీవు దేవతలలో నుత్తముఁడ వగుచున్నావో, ఈ విధముగ నేను మనుష్యులలో నుత్తముఁడ నగుదును గాక' అను మంత్రముచే, చరుమ్=చరుహవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. యః, ఏతేన హవిషా, యజతే; చ, యః ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః=ఆ యాగకర్త, దేవానామ్=దేవతలలో, ఏతత్=ఈ నక్షత్రము, యథా హ వై=ఏ విధముగ ఉత్తమమే యగుచున్నదో, ఏవమ్=ఈ విధముగ, మనుష్యాణామ్=మనుష్యులలో, భవతి హ వై=నిశ్చయముగ నుత్తముఁ డగును.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='నక్షత్రాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. నక్షత్రాయ=నక్షత్రసామాన్య దేవునికొఱకు, స్వాహా. ఉదేష్యతే=ఉదయించఁబోవు నక్షత్రదేవునికొఱకు, స్వాహా. ఉద్యతే=ఉదయించుచున్న నక్షత్రదేవునికొఱకు, స్వాహా. ఉదితాయ= ఉదయించిన నక్షత్రదేవునికొఱకు, స్వాహా. హరసే=నక్షత్రదేవునకుఁగల అనిష్ట హరణశక్త్యభిమాని దేవతకొఱకు, స్వాహా. భరసే=నక్షత్రదేవునకుఁగల ఇష్టసంపాదనశక్త్యభిమాని దేవతకొఱకు, స్వాహా. భ్రాజసే=నక్షత్రగత రశ్మిరూప ప్రకాశాభిమానిదేవతకొఱకు, స్వాహా. తేజసే=నక్షత్రదేవశరీరకాంత్యభిమాని దేవతకొఱకు, స్వాహా. బ్రహ్మవర్చసాయ=నక్షత్రదేవ ప్రసాదలభ్య తపోఽభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : నక్షత్రసామాన్యాభిమానిదేవునికొఱకు చరుహవిస్సును ''యధా త్వం దేవానామసి. ఏవమహం మనుష్యాణాం భూయాసమ్'' అను మంత్రము నుచ్చరించుచు నిర్వాపము చేయవలెను. ఈ నిర్వాపమంత్రోక్తమైన ఫలమును కోరునతఁడే యధికారి. కనుక యజమానుఁడు నక్షత్రదేవునివలె నుత్కృష్టుఁడగును. శేషము స్పష్టము. ఇచట నక్షత్రదేవతేష్టి, ఉపహోమములు విధించఁబడినవి.

5. మంత్రము : సూర్యో వా అకామయత । నక్షత్రాణాం ప్రతిష్ఠా స్యామితి । స ఏతగ్ం సూర్యాయ నక్షత్రేభ్యశ్చరుం నిరవపత్ । తతో వై స నక్షత్రాణాం ప్రతిష్ఠాఽభవత్ । ప్రతిష్ఠా హ వై సమానానాం భవతి । య ఏతేన హవిషా యజతే । య ఉ చైనదేవం వేద । సోఽత్ర జుహోతి । సూర్యాయ స్వాహా నక్షత్రేభ్యః స్వాహా । ప్రతిష్ఠాయై స్వాహేతి (5), ఇతి ।

అర్థము : సూర్యః=ఈ కల్పమందు సూర్యసంజ్ఞను పొందఁగోరునట్టి పూర్వకల్పీయ మనుష్యుఁడు, 'నక్షత్రాణామ్=నక్షత్రాది జ్యోతిస్సుల కన్నింటికి, ప్రతిష్ఠా=అధిపతిని స్యామ్=అగుదును గాక', ఇతి=అని, అకామయత వై=నిశ్చయముగ కోరుకొనెను. సః=అతఁడు, సూర్యాయ=పూర్వకల్పగత సూర్యునికొఱకు, నక్షత్రేభ్యః=నక్షత్రదేవతలకొఱకును, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిరవపత్=హోమము చేసెను. తతః వై=ఆ చరుహవిర్నిర్వాపమువలననే, సః=అతఁడు, నక్షత్రాణామ్=నక్షత్రజ్యోతిస్సులకు, ప్రతిష్ఠా=అధిపతి, అభవత్=ఆయెను. యః, ఏతేన హవిషా, యజతే; చ, యః ఉ, ఏనత్, ఏవమ్, వేద; సః, సమానానామ్=సమానులలో, ప్రతిష్ఠా=అధిపతి, భవతి హ వై=నిశ్చయముగ నగును.

సః=ఆ యాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='సూర్యాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. సూర్యాయ=సూర్యునికొఱకు, స్వాహా. నక్షత్రేభ్యః=నక్షత్రాది జ్యోతిస్సులకొఱకు, స్వాహా. ప్రతిష్ఠాయై=ప్రతిష్ఠాభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : నక్షత్రాది జ్యోతిస్సుల కన్నింటికి అధిపతిని కావలెనని కోరుకొనుచున్న సూర్యసంజ్ఞను గోరునట్టి పూర్వకల్పీయ మనుష్యుఁడు పూర్వకల్పసిద్ధ సూర్యునికొఱకు చరువిస్సును నిర్వాపము చేసి జ్యోతిస్సుల

కధిపతి యాయెను. ఈ విధముగ యజమానుడు కూడ సమానులలో నధిపతి యగును. ఇచట సూర్యేష్టి, ఉపహోమములు విహితము లైనవి.

6. మంత్రము : **అథైతమదిత్యై చరుం నిర్వపతి । ఇయం వా అదితిః । అస్యామేవ ప్రతితిష్ఠతి । సోకత్ర జుహోతి ।**

అదిత్యై స్వాహా ప్రతిష్ఠాయై స్వాహేతి (6), ఇతి ।

అర్థము : అథ=సూర్యేష్ట్యనంతరము, అదిత్యై=అదితి (భూ) దేవతకొఱకు, చరుమ్=చరుహవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. ఇయం వై=ఈ భూమియే, అదితిః=అదితిశబ్దవాచ్య. అస్యామేవ=ఈ భూమియందే, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుడగును. సః=ఆ చరునిర్వాపకర్త, అత్ర=ఈ అదితీష్టియందు, జుహోతి='అదిత్యై స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. అదిత్యై=భూదేవతకొఱకు, స్వాహా. ప్రతిష్ఠాయై=ప్రతిష్ఠాభిమానిదేవతకొఱకు, స్వాహా.

తాత్పర్యము : ఈ భూమియే యదితి. ఆ భూదేవతకొఱకు హవిర్నిర్వాపము చేయవలెను. అతడు భూమియందే ప్రతిష్ఠితుడగును. ఇచట అదితీష్టి, ఉపహోమములు విహితము లైనవి.

7. మంత్రము : **అథైతం విష్ణవే చరుం నిర్వపతి । యజ్ఞో వై విష్ణుః । యజ్ఞ ఏవాన్తతః ప్రతితిష్ఠతి । సోకత్ర జుహోతి ।**

విష్ణవే స్వాహా యజ్ఞాయ స్వాహా । ప్రతిష్ఠాయై స్వాహేతి (7), ఇతి ।

చన్ద్రమాః పఞ్చదశాహోరాత్రే సప్తదశోషా ఏకాదశాథైతస్మై నక్షత్రాయ త్రయోదశసూర్యో దశాథైత మదిత్యై పఞ్చాథైతం విష్ణవే షట్సప్త ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ప్రథమ ప్రపాఠకే షష్ఠోకనువాకః ॥౬ ॥

అర్థము : అథ=అదితీష్ట్యనంతరము, విష్ణవే=సర్వాంగవ్యాపియజ్ఞ స్వరూపుడైన విష్ణువుకొఱకు, ఏతం చరుమ్=ఈ చరుహవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. విష్ణుః=విష్ణువు, యజ్ఞః వై=యజ్ఞస్వరూపుడే, సః=ఆ చరుహవిర్నిర్వాపకర్త, అన్తతః=సమాప్తిపర్యంతము, యజ్ఞే ఏవ=యజ్ఞమునందే, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుడగును. సః=ఆ విష్ణుయాగకర్త, అత్ర=ఈ యాగకర్మయందు, జుహోతి='విష్ణవే, స్వాహా' ఇత్యాది మంత్రములచే హోమము చేయవలెను. విష్ణవే, స్వాహా. యజ్ఞాయ=యజ్ఞపురుషునికొఱకు, స్వాహా. ప్రతిష్ఠాయై, స్వాహా.

తాత్పర్యము : విష్ణుశబ్దముచే సర్వాంగవ్యాపియైన యజ్ఞము వివక్షింపబడుటవలన విష్ణువునకు హవిర్నిర్వాపము చేయుచు యజమానుడు సమాప్తిపర్యంతము యజ్ఞమునందు ప్రతిష్ఠితుడగును. శేషము స్పష్టము. ఇచట విష్ణుయజ్ఞము, ఉపహోమములు విహితము లైనవి. ''అగ్నిర్వా అకామయత'' అను మంత్రమునుండి (కా. **3**. ప్ర. **1**. అ.**4**.) ఈ విష్ణుచరుపర్యంతము నక్షత్రసత్రరూపమైన కర్మ యొక్కటే. ఆ విధముగ బోధాయనమహర్షి ''అథాతో నక్షత్రేష్టిం వ్యాఖ్యాస్యామః.'' అని యుపక్రమించి సవిస్తరముగ వ్యాఖ్యానించి ''నక్షత్రసత్రేణ

జ్యోతిరానన్త్యాయ జ్యోతిషా యజేమ । తేనేష్ట్వా పాపం నిర్ణుద్యాప పునర్మృత్యుం జయతీతి హ స్మాఽఽహ బోధాయనః'' అని స్పష్టముగ నుదాహరించెను.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ప్రథమ ప్రపాఠకమునందు షష్ఠానువాకము సమాప్తము.

సవితా కశూనాం వ్రీహీణామిన్ద్రో మహావ్రీహీణామిన్ద్రః కృష్ణానాం వ్రీహీణా మహోరాత్రే ద్వయానాం వ్రీహీణామ్ । పితరః షట్కపాలః సవితా ద్వాదశకపాలమిన్ద్రాగ్నీ ఏకాదశకపాలమిన్ద్ర ఏకాదశ కపాలం విష్ణుస్త్రికపాలమిన్ద్రో దశకపాలమహి ర్బుధ్నిమకపాలమశ్వినౌ ద్వికపాలం చన్ద్రమాः పఞ్చదశకపాల మన్యత్రాష్టకపాలమ్ । రుద్రో కర్యమా పూషా పశుమాన్ । సోమో రుద్రో బృహస్పతిः పయసి । వాయుः పయः సోమో వాయురిన్ద్రాగ్నీ మిత్ర ఇన్ద్ర ఆపో బ్రహ్మ యమో కభిజిత్యై । త్వష్టా ప్రజాపతిः ప్రజాయై। పౌర్ణమాస్యా అమావాస్యాయా ఆగత్యై । విశ్వే జిత్యై । అశ్వినౌ శ్రుత్యై । బ్రహ్మ తదేతమ్ । వాయుः స ఏతత్ । సోమో యమः సమానానామ్ । పితర ఆపో విశ్వే వసవో కామయన్త మేతి త ఏతం నిరవపన్ । ఇన్ద్రాగ్నీ అశ్వినావకామయేతాం వేతి తావేతం నిరవపతామ్ । అహోరాత్రే అకామయేతాం తామితి తే ఏతం నిరవపతామ్ । అన్యత్రాకామయత స్యామితి స ఏతం నిరవపత్ । ఇన్ద్రాగ్నీ శ్రైష్ఠ్యమిన్ద్రో జ్యేష్ఠ్యమిన్ద్రో దృఢः । అహోరాత్రే అతిముక్త్యై అహిः సూర్యో కదిత్యై విష్ణవే ప్రతిష్ఠాయై । అగ్నిర్నో రీరిషన్ అన్యత్ర రీరిషः ॥

అగ్నిర్న ఋధ్యాస్మ నవో నవో కగ్నిర్మిత్రశ్చన్ద్రమాः షట్ ॥ ౬॥

అగ్నిర్నస్తం నో వాయురహిర్బుధ్నియ ఋక్షా వా ఇయమథైత్పౌర్ణమాస్యా అజో వా ఏకపాత్సూర్యో వై త్రిషష్టిः ॥ ౬౩॥

అగ్నిర్నः పాతు ప్రతిష్ఠాయై స్వాహేతి ॥ హరిः ఓమ్ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయ కాణ్డే ప్రథమः ప్రపాఠకः ॥ 1 ॥

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ప్రథమ ప్రపాఠకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే
ప్రథమోఽనువాకః

1. మంత్రము : **తృతీయస్యామితో దివి సోమ ఆసీత్ । తం గాయత్ర్యా ఽహరత్ । తస్య పర్ణమచ్ఛిద్యత । తత్పర్ణోఽభవత్।**

తత్పర్ణస్య పర్ణత్వమ్ ।

వేదార్థదీపిక

అవతారిక: దర్శయాగము చేయఁగోరు యజమానుఁడు అమావాస్యనాటి ప్రాతఃకాలమున అగ్నిహోత్రుని పూజించి దర్శయాగమునకై ''మమాగ్నే వర్చః'' ఇత్యాది మంత్రములచే అగ్నులందు సమిదాధాన రూపమైన అన్వాధానము చేసి వత్సాపకరణార్థమైన ''ఇషే త్వా'' ఇత్యాది మంత్రమును పఠించుచు పలాశ శాఖను (మోదుగుకొమ్మను) ఛేదించవలెను. ఆ పలాశముయొక్క ప్రాశస్త్యము ''తృతీయస్యామితః'' ఇత్యాది బ్రాహ్మణముచే తెలియఁజేయఁబడుచున్నది. ''ఇషే త్వా'' ఇత్యాది మంత్రభాగము తైత్తిరీయ సంహితయందలి ప్రథమకాండారంభమునఁ గలదు.

అర్థము : ఇతః=ఈ పృథివినుండి, తృతీయస్యామ్=మూఁడవదియైన, దివి=ద్యులోకమునందు, సోమః=సోమ మనెడి లతావిశేషము, ఆసీత్=ఉండెను. తమ్=ఆ లతావిశేషమును, గాయత్రీ=గాయత్రీ చ్ఛందోదేవత, ఆహరత్=తెచ్చెను. తస్య=ఆ లతా విశేషముయొక్క, పర్ణమ్=ఆకు, అచ్ఛిద్యత=తెగెను. తత్=అది, పర్ణః=మోదుగుచెట్టుగా, అభవత్=ఆయెను. తత్=ఆ పర్ణము చెట్టుగా అగుటవలన, పర్ణస్య=మోదుగు చెట్టునకు, పర్ణత్వమ్=పర్ణవృక్ష మనెడి వ్యవహారము, అభవత్=ఆయెను.

తాత్పర్యము : ఈ పృథివినుండి మూఁడవదియైన ద్యులోకమునందు సోమ మనెడి లతావిశేషముండెను. గాయత్రీ చ్ఛందోదేవత పక్షిరూపమున వెళ్లి ఆ సోమమును భూలోకమునకు తెచ్చుచుండఁగా దాని ఆకు (పర్ణము) తెగి భూమిపైని పడి వృక్ష మాయెను. పర్ణము (ఆకు) వృక్షముగా అగుటవలన దానికి పర్ణ వృక్ష మనెడి వ్యవహార మేర్పడెను. పర్ణము వృక్షముగా నగుట అసంభవము కదా! యని ఆశ్చర్యపడ నవసరము లేదు. విధాతయైన ఈశ్వరుఁడు అచింత్యశక్తి కలవాఁడు కదా! అట్లు కానిచో బీజమునుండి వృక్షము పుట్టుచున్నదను విషయమునఁగూడ బీజమెక్కడ? వృక్షమెక్కడ? అనియు విస్మయము కలుగుచున్నది. అట్లైనచో ప్రతిపర్ణము నుండియు వృక్షము పుట్టవలెను కదా! యన్నచో అచట ఈశ్వర సంకల్పము లేదు కావున ప్రతిపర్ణమునుండి వృక్షము పుట్టుట లేదని సమాధానమును చెప్పుకొనవలెను. ఆ సంకల్పము కార్యైక సమధిగమ్యము. కనుక వేదార్థమునందు కుతర్కములచే ఏదియు నిర్ణయించరాదు. ద్యు శబ్దము అంతరిక్ష వాచకముగ ప్రసిద్ధము కనుక ఆ అంతరిక్షార్థమును నివారించి స్వర్లోక వివక్షను చూపుటకై ''తృతీయస్యామితో దివి'' అని ఉపాత్తమైనది.

2. మంత్రము : **బ్రహ్మ వై పర్ణః । యత్పర్ణశాఖయా వత్సా నపాకరోతి । బ్రహ్మణైవైనా నపాకరోతి ।**

అర్థము : పర్ణః=పలాశ వృక్షము, బ్రహ్మ వై=బ్రహ్మయే. పర్ణశాఖయా=పలాశ శాఖచే (మోదుగు కొమ్మచే), వత్సాన్=ఆలదూడలను, అపాకరోతి యత్=తొలఁగించినచో, బ్రహ్మణైవ=బ్రహ్మచేతనే, ఏనాన్=ఈ దూడలను, అపాకరోతి=తొలఁగించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : మేఁత మేయుటకై అడవికి పోవుచున్న గోవులను వెంబడించుచున్న ఆ గో వత్సములను గోవులనుండి తొలఁగించుటకై అధ్వర్యుఁడు మోదుగు కొమ్మను పట్టుకొనవలెను. ఆ పలాశ శాఖ యిచట ప్రశంసించఁబడుచున్నది. జగన్నిష్పాదకుఁడైన బ్రహ్మ ప్రశస్తుఁడైన విధముగ యాగ నిష్పాదకమైన పలాశము ప్రశస్త మగుటచే పలాశము బ్రహ్మగా స్తుతించఁబడినది. పలాశము బ్రహ్మమే కావున అధ్వర్యుఁడు గోవత్సలను పలాశ శాఖచే తొలఁగించినచో బ్రహ్మచేతనే తొలగించినవాఁ డగును. మంత్రమునందలి వై శబ్దముచే పలాశమునకు అర్థవాదాంతరముచే ఉపాదితమైన బ్రహ్మసంబంధ ప్రసిద్ధి సూచించబడుచున్నది. దేవతలు పరస్పరము బ్రహ్మతత్త్వమును నిరూపించుకొనుచుండఁగా పలాశ వృక్షము ఆ బ్రహ్మతత్త్వమును వినెను. ఇదియే పలాశమునకుఁగల బ్రహ్మసంబంధము. ఈ విషయము ఔపానువాక్యకాండమునందు జుహువునకు పర్ణమయీత్వ విధివిశేషమైన అర్థవాదమునందు ''దేవా వై బ్రహ్మన్నవదన్త. తత్పర్ణ ఉపాశృణోత్. సుశ్రవా వై నామ. యస్య పర్ణమయీ జుహూర్భవతి. న పాపగ్ం శ్లోకగ్ం శృణోతి.'' 'పలాశ శాఖయా వత్సా నపాకుర్యాత్' = 'పలాశ శాఖచే గో వత్సములను తొలఁగించవలెను' అను విధి యిచట చెప్పఁబడినది.

3. మంత్రము : **గాయత్రో వై పర్ణః । గాయత్రాః పశవః । తస్మాత్త్రీణి త్రీణి పర్ణస్య పలాశాని । త్రిపదా గాయత్రీ ।**

యత్పర్ణశాఖయా గాః ప్రార్పయతి । స్వయైవైనా దేవతాయా ప్రార్పయతి ।

అర్థము : పర్ణః=పలాశము, గాయత్రః వై=గాయత్రీ దేవతా సంబంధియే, పశవః=పశువులు, గాయత్రాః=గాయత్రీ దేవతాకములు. తస్మాత్=పలాశము గాయత్ర మగుటవలన, పర్ణస్య=పలాశముయొక్క, పలాశాని=ఆకులు, త్రీణి త్రీణి=మూఁడుగా, సన్తి=ఉంటున్నవి. గాయత్రీ=గాయత్రీ దేవతాక మంత్రము, త్రిపదా=మూఁడు పాదములు కలది. పర్ణశాఖయా=మోదుగు కొమ్మచే, గాః=గోవులను, ప్రార్పయతి యత్=గమ్యస్థానమును పొందించినచో, స్వయా దేవతయా ఏవ=పలాశసంబంధినియగు దేవతచేతనే, ప్రార్పయతి=గమ్యస్థానమును పొందించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : పలాశమునకు గాయత్రీ దేవతా సంబంధము వేదగమ్యము. అది సోమాహరణము ద్వారా పూర్వము ఉదాహరించఁబడినది. గాయత్రీ మంత్ర పాదములందువలె పలాశ పర్ణములందు కూడ త్రిత్వము కలదు కనుక అనుమాన గమ్యమైన సంబంధము కూడ కలదు. ఈ విధముగ పర్ణము గాయత్రమే యగుచున్నది. ఇట్టి పర్ణశాఖచే (మోదుగు కొమ్మచే) గోవులను అదలించినచో పర్ణసంబంధినియైన దేవతచేతనే గోవులను గమ్యస్థానమును పొందించినవాఁ డగును. గో ప్రస్థాపనమునందుఁగూడ పలాశ శాఖను ఉపయోగించవలె ననెడి విధి ఈ బ్రాహ్మణమువలన స్పష్ట మగుచున్నది.

4. మంత్రము : **యంకామయేతాపశుఃస్యాదితి । అపర్ణం తస్మై శుష్కాగ్రా మాహరేత్ । అపశురేవ భవతి । యం కామయేత పశుమాన్థ్స్యాదితి । బహుపర్ణం తస్మై బహుశాఖా మాహరేత్ । పశుమన్త మేవైనం కరోతి। యత్రాచీ మాహరేత్ । దేవలోక మభిజయేత్ ।యదుదీచీం మనుష్య లోకమ్ ।ప్రాచీముదీచీ మాహరతి। ఉభయోర్లోకయో రభిజిత్యై ।**

అర్థము : అధ్వర్యుఃఅధ్వర్యుడు, యమ్=ఏ యజమానుని గూర్చి, అపశుఃపశురహితుడు, స్యాత్ ఇతి= కావలెనని, కామయేత=కోరునో, తస్మై=ఆ యజమానునికొఱకు, అపర్ణామ్=ఆకులు లేనిదియు, శుష్కాగ్రామ్=ఎండిన అగ్రభాగము కలదియునగు పలాశ శాఖను, ఆహరేత్=తీసికొనవలెను(గ్రహించ వలెను). తదా=అప్పుడు, సఃఆ యజమానుడు, అపశుఃఏవ=పశురహితుడే, భవతి= అగుచున్నాడు. యమ్=ఏ యజమానుని గూర్చి, పశుమాన్=పశుమంతుడు, స్యాత్ ఇతి=కావలెనని, కామయేత=కోరునో, తస్మై=ఆ యజమానునికొఱకు, బహుపర్ణామ్=అనేకములైన ఆకులు కలదియు, బహుశాఖమ్= బహుభాగములు గలదియునగు మోదుగు కొమ్మను, ఆహరేత్=గ్రహించవలెను. తదా=అప్పుడు, సఃఆ అధ్వర్యుడు, ఏనమ్=ఈ యజమానుని, పశుమన్తమ్ ఏవ=పశుమంతునిగానే, కరోతి=చేయుచున్నాడు, ప్రాచీమ్ ఆహరేత్ యత్=తూర్పుదిక్కుగా గ్రహించుచో, దేవలోకమ్= దేవలోకమును, అభిజయేత్= అంతటను జయించును. ఉదీచీం యత్=ఉత్తర దిక్కుగా గ్రహించుచో, మనుష్యలోకమ్=భూలోకమును, అభిజయేత్. ఉభయోఃలోకయోఃదేవ మనుష్యలోకముల రెండింటి యొక్క, అభిజిత్యై=అభిజయము (ప్రాప్తి) కొఱకు, ప్రాచీమ్ ఉదీచీమ్=ప్రాచీ దిక్కుగాను, ఉత్తర దిక్కుగాను, ఆహరతి=గ్రహించవలెను.

తాత్పర్యము : మోదుగుచెట్టునుండి కొమ్మను ఛేదించునప్పుడు ఆ కొమ్మకు బహుపర్ణత్వ ప్రాగ్రత్వాది గుణములు ఉండవలెనని ఈ బ్రాహ్మణము విధించుచున్నది. తాత్పర్యము స్పష్టము.

5. మంత్రము : **ఇషే త్వోర్జే త్వేత్యాహ।**

అర్థము : ఇషే త్వోర్జే త్వా ఇతి=పలాశ శాఖను ఛేదించునపుడు ''ఇషే త్వోర్జే త్వా'' అను మంత్రమును, ఆహ= పఠించవలెను.

తాత్పర్యము : పలాశ శాఖను ఛేదించునపుడు ''ఇషే త్వోర్జే త్వా'' ఇత్యాది మంత్రమును పఠించవలెను. ఈ మంత్రము తైత్తిరీయ సంహిత ప్రథమకాండమున వ్యాఖ్యానించబడినది. తైత్తిరీయ సంహిత ప్రథమకాండము ప్రథమప్రపాఠకమునందలి మంత్రముల కన్నింటికి ఈ బ్రాహ్మణము తృతీయకాండమునందలి ద్వితీయప్రపాఠకము వ్యాఖ్యానరూపమే గాక, తత్తదర్థవిధాయక మనియు గ్రహించవలెను. కనుక సంహితయందలి మంత్రముల కర్థతాత్పర్యాదులను సంహితా వ్యాఖ్యానమునందు చూడవలెను.

6. మంత్రము : **ఇషమేవోర్జం యజమానే దధాతి ।**

అర్థము : (అధ్వర్యుఃఅధ్వర్యుడు,) యజమానేయజమానునియందు, ఇషమ్అన్నమును, ఊర్జమ్బలమును, దధాతి ఏవతప్పక సంపాదించును.

తాత్పర్యము : పలాశశాఖను ఛేదించునపుడు అధ్వర్యుడు ''ఇషే త్వోర్జే త్వా'' అను మంత్రమును పఠించుటచేత నిశ్చయముగ యజమానునకు భోజనమునకై అన్నమును, బలమునకై రసమును సంపాదించును. ఈ బ్రాహ్మణ వాక్యము ప్రశంసారూప గుణవాదాత్మకమైన అర్థవాదము.

7. మంత్రము : **వాయవఃస్థేత్యాహ। వాయుర్వా అన్తరిక్షస్యాధ్యక్షాః । అన్తరిక్షదేవత్యాఃఖలు వై పశవః । వాయవ ఏవైనాన్పరిదదాతి ।**

అర్థము : వాయవఃస్థఓ గో వత్సములారా! మీరు మీ తల్లుల సమీపమునుండి స్వేచ్ఛగానే, అరణ్యమునందు సంచరించువారు కండు. ఇతిఅని, ఆహా=''వాయవఃస్థ'' అను మంత్రము చెప్పినది. (ఈ యర్థము సంహితా వ్యాఖ్యానమున ప్రాయఁబడినది. ఇది యొకపక్షము.) వాయుఃవాయువు, అన్తరిక్షస్యఆకాశమునకు, అధ్యక్షాఃవాఅధ్యక్షుడు కదా! పశవఃపశువులు, అన్తరిక్షదేవత్యాఃఖలు వైఅంతరిక్షదేవత దేవతగాఁ గలవియే కదా! తథా సతిఅట్లుకాఁగా, అధ్వర్యుఃఅధ్వర్యుడు, ఏనాన్ఈ గోవత్సములను, వాయవే ఏవవాయువుకొఱకే, పరిదదాతిఒసఁగుచున్నాడు. (ఇది రెండవపక్షము).

తాత్పర్యము : అధ్యక్షాఃఅని వచనవ్యత్యయము ఛాందసము. అధ్యక్షఃఅని యర్థము. ఓ గో వత్సములారా! మీరు మీ తల్లులనుండి తొలఁగి అరణ్యమునందు స్వేచ్ఛగా సంచరించుఁడు. ఇది ఒకపక్షము. గో వత్సములు పరంపరగా వాయుదేవతాకము లగుటవలన తదభేద వివక్షచే వత్సములకు వాయురూపత్వమును చెప్పుచు అధ్వర్యుఁడు వాని రక్షణమునకై ఆ వత్సములను వాయుదేవతకొఱకు సమర్పించుచున్నాఁడు. వాయువు తన ప్రచారముచే అంతరిక్షమును అధిష్ఠించియుండును. అంతరిక్షమునందు స్వేచ్ఛగా సంచరించుటకై బహుళమైన అవకాశము నొసఁగుచు వాయువు వత్సములను లాలించుచుండును. పశువులు అంతరిక్ష దేవతయగు వాయువు దేవతగాఁగలవి కనుక అధ్వర్యుఁడు ఈ వత్సములను వాయువునకు సమర్పించుచున్నాఁడని యర్థము. పశువులకు వాయువునకుఁగల స్వస్వామిభావ సంబంధము, అర్థవాదాంతరమునఁగలదు. ఇది వా, ఖలు, వై శబ్దములచే గమ్య మగుచున్నది.

8. మంత్రము : **ప్ర వా ఏనానేత దాకరోతి । యదాహ। వాయవఃస్థేతి ।**

అర్థము : వాయవఃస్థేతి ఆహయత్అధ్వర్యుడు ఈ మంత్రభాగము నుచ్చరించుచో, ఏతత్ఈ ఉచ్చారణముచేత, ఏనాన్ఈ వత్సములను, ప్ర వా ఆకరోతివాయు తాదాత్మ్య లక్షణమైన ప్రకృష్టాకారము కలవానినిగా చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ఆ మంత్రభాగమునకే మఱియొక ప్రకారముగ అభిప్రాయము ఈ బ్రాహ్మణమునందు ఆమ్నాత మైనది. అధ్వర్యుఁడు ''వాయవఃస్థ'' అను మంత్రభాగము నుచ్చరించుచో, ఈ ఉచ్చారణముచే వత్సములను వాయు తాదాత్మ్య లక్షణమైన ప్రకృష్టాకారము కలవానినిగా చేసినవాఁ డగును.

9. మంత్రము : **ఉపాయవ॑ స్థేత్యాహ। యజమానాయైవ పశూనుపహ్వయతే ।**

అర్థము : ఉపాయవః స్థ ఇతి ఆహ = 'ఓ వత్సములారా! మీరు మఱుల సాయంకాలమున యజమానుని గృహమును గూర్చి వచ్చినవారు కండు' అని చెప్పుటచే, పశూన్ = పశువులను, యజమానాయైవ = యజమానునికొఱకే, ఉపహ్వయతే = పిలిచినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : ''ఉపాయవః స్థ'' అను ఉత్తరభాగమును ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించుచున్నది. 'ఓ వత్సములారా! మీరు మఱుల సాయంకాలమున తిరిగి వచ్చినవారు కండు' అని చెప్పుటచే అధ్వర్యుఁడు పశువులను యజమానునికొఱకు పిలిచినవాఁడగుచున్నాఁడు.

10. మంత్రము :**దేవో వ॑ సవితా ప్రార్పయత్విత్యాహ ప్రసూత్యై ।**

అర్థము : సవితా దేవః = సవిత్రు దేవుఁడు, వః = మిమ్ము, ప్రార్పయతు = ప్రేరణ చేయుఁగాక, ఇతి = అని, ఆహ = చెప్పుట, ప్రసూత్యై = ప్రేరణకొఱకు, భవతి = అగుచున్నది.

తాత్పర్యము : ''దేవో వః సవితా ప్రార్పయతు శ్రేష్ఠతమాయ కర్మణే'' అను మంత్రమున రెండు భాగములు కలవు. ఓ గోవులారా! ప్రేరకుఁడును, అంతర్యామియునగు పరమేశ్వరుఁడు అత్యంత శ్రేష్ఠమైన ఇంద్ర దధిరూప కర్మకొఱకు మిమ్ము అరణ్యమునందు గడ్డిని మేయుటకై ప్రేరించుఁగాక యని మంత్రార్థము. ఈ మంత్రము యొక్క పూర్వభాగమునందలి సవిత్రుపదమునొక్క తాత్పర్యమును ఈ బ్రాహ్మణ భాగము తెలియఁజేయుచున్నది. ప్రార్పయతు అనఁగా పొందించుఁగాక అని పదార్థము. సవితా అనఁగా ప్రేరకుడని యర్థము. ఆ సవిత్రు పద ముండుటవలన ప్రేరణ చేయుఁగాక అను నర్థము వ్యక్త మగుచున్నది. ఈ యభిప్రాయమును బ్రాహ్మణభాగమునందలి 'ప్రసూత్యై' అను పదము తెలియఁజేయుచున్నది.

11. మంత్రము :**శ్రేష్ఠతమాయ కర్మణ ఇత్యాహ। యజ్ఞో హి శ్రేష్ఠతమం కర్మ । తస్మాదేవమాహ।**

అర్థము : శ్రేష్ఠతమాయ కర్మణే ఇతి = అత్యంత శ్రేష్ఠమైన కర్మకొఱకు అని, ఆహ = ఆ మంత్రము చెప్పినది. యజ్ఞః = యజ్ఞము, శ్రేష్ఠతమం కర్మ హి = అత్యంత శ్రేష్ఠమైన కర్మ కదా! తస్మాత్ = ఆ కారణమువలన, ఏవమ్ = ఈ విధముగ (శ్రేష్ఠతమాయ అని), ఆహ = శ్రుతి చెప్పినది.

తాత్పర్యము : యజ్ఞము అత్యంత శ్రేష్ఠమైన కర్మ కనుక ''శ్రేష్ఠతమాయ కర్మణే'' అని శ్రుతి చెప్పినది.

12. మంత్రము :**ఆప్యాయధ్వ మఘ్న్యా దేవభాగ మిత్యాహ। వత్సేభ్యశ్చ వా ఏతాః పురా మనుష్యేభ్యశ్చాప్యాయన్త ।**

దేవేభ్య ఏవైనా ఇన్ద్రాయా ऽऽప్యాయయన్తి ।

అర్థము : హే అఘ్న్యాః! = ఓ గోవులారా!, దేవభాగమ్ = దేవుఁడైన ఇంద్రునియొక్క దధిరూపమైన భాగమును, ఆప్యాయధ్వమ్ = సమృద్ధముగఁ జేయుఁడు, ఇతి = అని, ఆహ = శ్రుతి చెప్పినది. పురా = యాగార్థప్రవృత్తికి పూర్వము, వత్సేభ్యః చ = వత్సముల (దూడల) కొఱకును, వా = లేదా, మనుష్యేభ్యః = మనుష్యులకొఱకును,

ఏతాఃఈ గోవులు, ఆప్యాయన్త=క్షీరమును వృద్ధిచేసినవి. (ఊర్ధ్వం తు= యాగార్థము ప్రవర్తించిన యనంతర మైనచో,) ఏనాఃఈ ఆవులు, దేవేభ్యఃఇతర దేవతలకొఱకు, ఇన్ద్రాయ ఏవం=ఇంద్రుని కొఱకునే, ఆప్యాయయన్తి=వృద్ధిచేయుచున్నవి.

తాత్పర్యము : ఓ గోవులారా! మీరు ఇంద్రదేవునియొక్క దధిరూపమైన భాగమును వృద్ధిచేయుఁడని శ్రుతి చెప్పినది. యాగము నిమిత్తము ప్రవర్తించుటకు పూర్వము ఈ గోవులు గోగ్రాసముచే వత్స భాగము, మనుష్య భాగమును వృద్ధిచేసినవి. లోకమున ఆవులు గోగ్రాసమును తినుటచే ప్రవృద్ధమైన క్షీరములో కొంతభాగమును తమ దూడలకు, కొంతభాగమును తమ యజమానులకును ఇచ్చుచున్నవను విషయము ప్రసిద్ధము. యాగార్థము ప్రవృత్తములైనప్పుడు మాత్రము గోవులు క్షీరాజ్యరూపమైన దేవతాంతర భాగమును, దధిరూపమైన ఇంద్రభాగమును వృద్ధిచేయుచున్నవి. ఏవకారముచే మనుష్య భాగము వ్యావృత్త మగుచున్నది.

13. మంత్రము : **ఊర్జస్వతీఃపయస్వతీరిత్యాహ। ఊర్జగ్ం హి పయఃసంభరన్తి ।**

అర్థము : ఊర్జస్వతీఃఅత్యంత రసము కలిగినవియు, పయస్వతీఃఅధిక క్షీరము కలిగినవియునైన గోవులను, ఇతి=అని, ఆహ=శ్రుతి చెప్పినది. ఊర్జమ్=రసమును, పయఃక్షీరమును, సంభరన్తి హి=బాగుగ వహించుచున్నవి కదా!.

తాత్పర్యము : అడవియందు అధికమైన గోగ్రాసమును మేయుటచే రసాధిక్య సంపాదనము, క్షీరాధిక్య సంపాదనము లౌకిక దోహమునందు ప్రసిద్ధ మను విషయమును హి శబ్దము తెలియుఁజేయుచున్నది.

14. మంత్రము :**ప్రజావతీ రనమీవా అయక్ష్మా ఇత్యాహ ప్రజాత్యై ।**

అర్థము : ప్రజావతీ రనమీవా అయక్ష్మాఃఇతి ఆహ='బహు సంతానముకలవియు, క్రిమిదోష రహితములును, రోగాంతర హీనములునైన గోవులను' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ చెప్పుట, ప్రజాత్యై=సంతానము కొఱకు, సిద్ధ్యతి=సిద్ధించుచున్నది.

తాత్పర్యము : మంత్రములోని ప్రజావతీ రిత్యాది తృతీయ భాగమునకు ప్రయోజనమును ఈ బ్రాహ్మణము చెప్పుచున్నది. వంధ్యయగుటచేత, క్రిమిదోషముచేత, రోగాంతరముచేతను ప్రజోత్పత్తి కలుగదు. ఆ వంధ్యాత్వము, క్రిమిదోషము, రోగాంతరమును లేనిచో ప్రజోత్పత్తి కలుగునని భావము.

15. మంత్రము :**మా వఃస్తేన ఈశత మాఘశగ్ంస ఇత్యాహ గుప్త్యై ।**

అర్థము : ''మా వఃస్తేన ఈశత మాఽఘశగ్ంస ఇతి ఆహ''='చోరుఁడు మిమ్ము నపహరించుటకు సమర్థుఁడు కాకుండుఁగాక. ఘాతకమైన వ్యాఘ్రాదికము కూడ మిమ్ము అపహరించుటకై సమర్థము కాకుండుఁగాక' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ చెప్పుట, గుప్త్యై =రక్షణముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : గోవులను చోరుఁడు, ఘాతకమైన వ్యాఘ్రాదికము కూడ మిమ్ము అపహరించుటకు సమర్థము కాకుండుఁగాక అని చెప్పుటచే గోవులకు రక్షణము సిద్ధించుచున్నది. మంత్ర చతుర్థభాగముయొక్క ప్రయోజనము రక్షణమని ఈ బ్రాహ్మణము చెప్పుచున్నది.

16. మంత్రము :**రుద్రస్య హేతిః పరి వో వృణక్త్విత్యాహ। రుద్రాదేవైనాస్త్రాయతే ।**

అర్థము : ''రుద్రస్య హేతిః పరి వో వృణక్త్విత్యాహ'' క్రూరదేవుడైన రుద్రునియొక్క ఆయుధము మిమ్ము అంతటను విడచుఁగాక అని శ్రుతి చెప్పినది. రుద్రాదేవ=రుద్రునినుండియే, ఏనాఃఈ గోవులను, త్రాయతే=రక్షించుచున్నాఁడు.

తాత్పర్యము : క్రూరదేవుడైన రుద్రుని ఆయుధము అంతటను మిమ్ము విడచుఁగాక అని అధ్వర్యుఁడు పలుకుటచే అధ్వరుఁడు రుద్రునినుండియే ఈ గోవులను రక్షించుచున్నాఁడు. ఈ మంత్రపాఠముయొక్క ఫలము ఇచట చెప్పఁబడినది.

17. మంత్రము :**ధ్రువా అస్మిన్గోపతౌ స్యాత బహ్వీరిత్యాహ। ధ్రువా ఏవాస్మిన్బహ్వీః కరోతి ।**

అర్థము : ధ్రువా అస్మిన్గోపతౌ స్యాత బహ్వీః ఇతి ఆహ=ఓ గోవులారా! మీరు ఈ మీ స్వామియగు యజమానునియందు స్థిరములను అపత్యపరంపరచే అనేకములును కండు అని శ్రుతి చెప్పినది. అస్మిన్=ఈ యజమానునియందు, ధ్రువాఃస్థిరములనుగాను, బహ్వీఃఅనేకములనుగాను, కరోతి=చేయుచున్నాఁడు.

తాత్పర్యము : ఓ గోవులారా! మీరు మీ స్వామియగు ఈ యజమానునియందు స్థిరములును అపత్య పరంపరచే అనేకములును కండు అని అధ్వర్యుఁడు (శ్రుతి) పలుకుటచే ఈ గోవులను స్థిరములనుగాను, అపత్య పరంపరచే అనేకములనుగాను చేయుచున్నాఁడు. స్థిరములుగా నుండుట యనఁగా యజమానుని విడువకుఁడని యర్థము.

18. మంత్రము :**యజమానస్య పశూన్పాహీత్యాహ। పశూనాం గోపీథాయ ।తస్మాత్సాయం పశవ ఉపసమావర్తన్తే ।**

అర్థము : యజమానస్య పశూన్పాహి ఇతి ఆహ='యజమానునియొక్క పశువులను రక్షించుము' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ చెప్పుట, పశూనామ్=పశువులయొక్క, గోపీథాయ=రక్షణముకొఱకు, భవతి=అగుచున్నది. తస్మాత్=ఆ కారణమువలన, సాయమ్=సాయంకాలమున, పశవఃగో పశువులు, ఉపసమావర్తన్తే=యజమాన గృహ సమీపమునకు బాగుగ వచ్చుచున్నవి.

తాత్పర్యము : ఓ పలాశశాఖా! యజమానునియొక్క పశువులను రక్షించుమని చెప్పుటచే పశువులకు రక్షణము కలుగుచున్నది. ఆ రక్షణము కలుగుటవలన పశువులు సాయంకాలమున యజమానునియొక్క గృహ సమీపమునకు క్షేమముగ తిరిగి వచ్చుచున్నవి.

19. మంత్రము :**అనధఃసాదయతి । గర్భాణాం ధృత్యా అప్రపాదాయ । తస్మాద్గర్భాఃప్రజానా మప్రపాదుకాఃఁ ।**

అర్థము : అనధఃసాదయతి=పలాశశాఖను భూమియందు ఉంచరాదు. గర్భాణామ్=గర్భములయొక్క, ధృత్యై=ధారణముకొఱకు, అప్రపాదాయ=ప్రకృష్ట పాదములు లేకుండుటకొఱకు, భవతి=అగుచున్నది.

తస్మాత్=ఆ కారణమువలన, గర్భాః=గర్భములు, ప్రజానామ్=ప్రజలకు, అప్రపాదుకాః=ప్రకృష్ట పాదములు లేనివి, భవన్తి=అగుచున్నవి.

తాత్పర్యము : పూర్వోక్తమైన పలాశ శాఖకు ఉచ్చదేశ స్థాపనము, తత్ఫలమును ఈ బ్రాహ్మణము చెప్పుచున్నది. పలాశ శాఖను భూమియందు ఉంచరాదు. అట్లు చేయటవలన గర్భముల ధారణము, ప్రకృష్ట పాదములు లేకుండుటయు కలుగుచున్నవి. పలాశ శాఖను భూమియందు ఉంచరాదు, అను నిషేధమును ఈ బ్రాహ్మణము విధించుచున్నది. దానివలన గర్భముల ధారణము, ఆ గర్భములకు ప్రకృష్ట పాదములు లేకుండుటను ఫలముగా ఈ బ్రాహ్మణము చెప్పుచున్నది.

20. మంత్రము :**ఉపరీవ నిదధాతి । ఉపరీవ హి సువర్గో లోకః । సువర్గస్య లోకస్య సమష్ట్యై ।**

పశవః కరోతి పశవో దేవభాగమిత్యాహ కరోతి నవ చ ॥ ౧ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయ ప్రపాఠకే ప్రథమోఽనువాకః ॥ ౧ ॥

అర్థము : ఉపరీవ=ఊర్ధ్వభాగమునందే, నిదధాతి=పలాశ శాఖను ఉంచవలెను. సువర్గః లోకః=స్వర్గలోకము, ఉపరీవ హి=ఉపరితలమునందే కలదు కదా! ఏతత్=పలాశ శాఖను ఊర్ధ్వభాగమున ఉంచుట, సువర్గస్య లోకస్య=స్వర్గలోకముయొక్క, సమష్ట్యై =వ్యాప్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : పలాశ శాఖను ఊర్ధ్వప్రదేశమునందు ఉంచవలెను. స్వర్గలోకము ఉపరితలమునందే కలదు కదా! పలాశ శాఖను ఉపరితలమున ఉంచుటవలన స్వర్గలోకమున సమ్యగ్వ్యాప్తి కలుగుచున్నది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ద్వితీయ ప్రపాఠకమునందు ప్రథమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే
ద్వితీయోఽనువాకః

1. మంత్రము : **దేవస్య త్వా సవితుః ప్రసవ ఇత్యశ్వపర్ము మాదత్తే ప్రసూత్యై । అశ్వినో ర్బాహుభ్యా మిత్యాహ। అశ్వినౌ హి దేవానా మధ్వర్యూ ఆస్తామ్ । పూష్ణో హస్తాభ్యా మిత్యాహ యత్యై ।**

అవతారిక: తైత్తిరీయ సంహితయందలి ప్రథమకాండములోని ప్రథమప్రపాఠకమునఁగల ప్రథమానువాక గత మంత్రములకు వ్యాఖ్యానాత్మకమైన బ్రాహ్మణము పూర్వానువాకమున వ్యాఖ్యానించఁబడినది. తై.సం.ప్ర.కా. ద్వితీయానువాక గత మంత్రములకు వ్యాఖ్యానాత్మకమైన బ్రాహ్మణము ఈ ద్వితీయానువాకమున వ్యాఖ్యానించఁబడుచున్నది. సంహితయందు ప్రథమకాండ ప్రథమప్రపాఠక గత ద్వితీయానుకమునందు ''యజ్ఞస్య ఘోషదసీ''త్యాదికము ప్రథమ మంత్రముగా ఆమ్నాత మైనది. ఈ బ్రాహ్మణముచే ఆ మంత్రము కంటెపూర్వము 'దేవస్య త్వా సవితుః' అనెడి యితర మంత్రము శాఖాంతరాది న్యాయముచే వ్యాఖ్యానించఁబడుచున్నది. ఆ బ్రాహ్మణము ప్రథమమున ఇచట వ్యాఖ్యానించఁ బడుచున్నది యజ్ఞాంగములలో ఒకటియైన బర్హిస్సును కోసి తెచ్చుటకై ఒకానొక కత్తిని తీసికొని వెళ్లుట ఇచట ప్రకృతాంశము.

అర్థము : [హే లవనసాధన!=ఓ లవనసాధనమా!,] సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య= దేవునియొక్క (అంతర్యామి యొక్క), ప్రసవే=ప్రేరణము ఉండఁగా, అశ్వినోఃఅశ్వినీదేవతలయొక్క, బాహుభ్యామ్= బాహువుల చేతను, పూష్ణఃపూషదేవునియొక్క, హస్తాభ్యామ్=హస్తములచేతను, త్వా=నిన్ను, ప్రతిగృహ్ణామి= స్వీకరించుచున్నాను. (అని మంత్రార్థము.) దేవస్య త్వా సవితుః ప్రసవే ఇతి='దేవస్య త్వా' అను మంత్రముచే, అశ్వపర్ముమ్=గుఱ్ఱపుటెముకను, ఆదత్తే=స్వీకరించవలెను. ఏతత్=ఈ స్వీకరించుట, ప్రసూత్యై=ఆజ్ఞకొఱకు, భవతి=అగుచున్నది. అశ్వినోర్బాహుభ్యామితి ఆహ=అశ్వినీదేవతల బాహువులచేతనని శ్రుతి చెప్పినది. అశ్వినౌ=అశ్వినీ దేవతలు, దేవానామ్=దేవతలకు, అధ్వర్యూ= అధ్వర్యులుగా, ఆస్తాం హి=ఉండిరి కదా! పూష్ణో హస్తాభ్యామితి ఆహ=పోషకుఁడైన దేవునియొక్క హస్తములచేతనని శ్రుతి చెప్పినది. ఈఏతత్=ఈ చెప్పుట, యత్యై=నియమముకొఱకు, భవతి=అగుచున్నది. లవనము=కోయుట.

తాత్పర్యము : ''దేవస్య సవితుః'' ఇత్యాది మంత్రమును పఠించుచు లవన సాధనమైన అశ్వపర్ముమును తీసికొనవలెను. ఈ మంత్రమునందు 'అశ్వినీదేవతల బాహువులచేత' అని యున్నది. అశ్వినీదేవతలు, దేవతలు చేసిన యజ్ఞములందు అధ్వర్యులుగా ఉండుటచే 'అశ్వినోర్బాహుభ్యామ్' అని శ్రుతి చెప్పినది. ఈ అధ్వర్యుఁడు తనబాహువులను అశ్వినీ దేవతల బాహువులనుగా భావన చేయవలెనని యర్థము. 'పోషక దేవునియొక్క హస్తములచేత' అని శ్రుతి యందు కలదు. ఇది నియమముకొఱకు అగుచున్నది. ఏ యే యజ్ఞసాధనమును గ్రహించవలెనో, అది యంతయు పోషకుఁడైన దేవునియొక్క హస్తములచేతనే గ్రహించవలెనని నియమము. యజ్ఞసాధనమును గ్రహించునపుడు తన హస్తములను పూషదేవుని హస్తములనుగా భావన చేయవలెనని

యర్థము. ఓ లవన సాధనమా! నిన్ను దేవతాసంబంధములైన బాహువులచేతను, హస్తములచేతను గ్రహించుచున్నానని మంత్రార్థము. మణిబంధమునకు అధోభాగమునcగలవి బాహువులు. మణిబంధమునకు ఉపరితలమునcగలవి హస్తములు. బర్హిస్సును పొందుటకై అశ్వపర్యువుతో కూడ వెళ్లవలెననెడి విధి ఈ అర్థవాదవాక్యముచే ఉన్నీయమాన మగుచున్నది.

2. మంత్రము : **యో వా ఓషధీః పర్వశో వేద । నైనాꣳ స హినస్తి । ప్రజాపతిర్వా ఓషధీః పర్వశో వేద । స ఏనా న హినస్తి।**

అశ్వపర్వా బర్హిరచ్ఛేతి । ప్రాజాపత్యో వా అశ్వః సయోనిత్వాయ । ఓషధీనా మహిగ్ంసాయై ।

అర్థము : యఃవా=ఏ పురుషుcడైతే, ఓషధీఃఓషధులను, పర్వశఃపర్వము(కనువు)నుండి, వేద=తెలిసికొనెనో, సఃఅతcడు, ఏనాఃఈ ఓషధులను, న హినస్తి=హింసించినవాc డగుట లేదు. ప్రజాపతిఃవా=ప్రజాపతియే, ఓషధీఃఓషధులను, పర్వశఃపర్వమునుండి, వేద=తెలిసికొనెను. సఃఆ ప్రజాపతి, ఏనాఃఈ ఓషధులను, న హినస్తి=హింసించుటలేదు. అశ్వపర్వ్వా=అశ్వముయొక్క ఎముకతో, బర్హిఃబర్హిస్సును, అచ్ఛేతి=పొందుటకు వెళ్లవలెను. అశ్వఃఅశ్వము, ప్రాజాపత్యఃవా=ప్రజాపతి సంబంధమైనది కదా! ఏతత్=ఇది, సయోనిత్వాయ=సమాన కారణ సాహిత్యముకొఱకు, భవతి=అగుచున్నది. అపిచ=మఱియు, ఓషధీనామ్=ఓషధులయొక్క, అహింసాయై=హింసాభావముకొఱకు, భవతి=అగుచున్నది. అశ్వముయొక్క ఎముక బర్హిస్సును కోయుటకై తగిన పదను కలిగియుండును.

తాత్పర్యము : ఓషధులను ప్రతిపర్వమునుండియు తెలిసికొనిన యతcడు ఓషధులను హింసించినవాcడు కాcడు. ప్రజాపతి ఓషధులయొక్క ప్రతికనుపును తెలిసినవాcడు. కనుక ప్రజాపతి ఓషధులను హింసించcడు. బర్హిస్సును పొందుటకై అశ్వపర్యువును తీసికొని వెళ్లవలెను. అశ్వము ప్రజాపతి కంటినుండి పుట్టినదని అశ్వమేధపర్వము నందు ''ప్రజాపతే రక్ష్యశ్వయత్. తత్పరాపతత్. తదశ్వోఽభవత్. యదశ్వయత్. తదశ్వత్వమ్'' అని చెప్పcబడినది. అందువలన అశ్వము ప్రాజాపత్య మగుచున్నది. అశ్వము ప్రాజాపత్య మగుటవలనను, ప్రజాపతి ఓషధులందలి ఆ యా పర్వములను తెలిసినవాc డగుటచే పర్వముల సంధి భాగములను ఛేదించుటకై ప్రవృత్తుcడైనను, పర్వభంజకుcడు కాకుండుటచే ప్రజాపతి రూపమైన అశ్వపర్యువుచే దర్భచ్ఛేదము కలిగినను హింస యగుట లేదు. బర్హిస్సును కోయుటకై లవన సాధనాంతరమును విడచి అశ్వపర్యువును గ్రహించుట అశ్వపర్యు యోనిభూత ప్రజాపతి సాహిత్యముకొఱకని గ్రహించవలెను. కారణముయొక్క సాహిత్యము కార్యమునం దనుగతమై యుండును. ఇచట అశ్వపర్యువు కార్యము. ప్రజాపతి కారణము. అందువలన ప్రజాపతిద్వారా కర్తకు హింసాదోషము లేదనుట ఉపపన్న మగుచున్నది.

3. మంత్రము : **యజ్ఞస్య ఘోషదసీత్యాహ । యజమాన ఏవ రయిం దధాతి ।**

అర్థము : హే అశ్వపర్యో!=ఓ అశ్వపర్యూ!, త్వమ్=నీవు, యజ్ఞస్య=యజ్ఞమునకు, ఘోషత్='ఘోషత్' అను పేరు కల ధనము, అసి=అగుచున్నావు. ఇతి=అని, ఆహ=శ్రుతి చెప్పినది. అధ్వర్యుఃఅధ్వర్యుcడు, యజమానేయజమానునియందు, రయిమ్=ధనమును, దధాత్యేవతప్పక ఉంచుచున్నాcడు.

తాత్పర్యము : అశ్వపర్యువు యజ్ఞాంగమైన బర్హిస్సును కోయుటలో సాధన మగుటచే అది యజ్ఞమునకు ధనమువంటిదని యర్థము. ఆ ధనమునకు 'ఘోషత్' అని పేరు. యజ్ఞమునకు ధనరూపమైన అశ్వపర్యువును అధ్వర్యుడు బర్హిస్సును కోయుటకై ఉపయోగించుటచే అతడు యజమానునియందు ధనము నుంచినవాడగు చున్నాడు.

4. మంత్రము : **ప్రత్యుష్టగ్ం రక్షః ప్రత్యుష్టా అరాతయ ఇత్యాహ। రక్షసామపహత్యై ।**

అర్థము : ప్రత్యుష్టం రక్షః ప్రత్యుష్టా అరాతయః ఇత్యాహ=ఈ అశ్వపర్యువునందు నిగూఢమైయున్న రాక్షస స్వరూపము నశింపజేయబడినది. శత్రువులు నశింపజేయబడినారు, అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, రక్షసామ్=రాక్షసులయొక్క, అపహత్యై=నాశనమునకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : లవన సాధనమైన అశ్వపర్యువునందు నిగూఢముగా ఉన్నటువంటి రాక్షస స్వరూపము, శత్రువులు నశింపజేయబడినా రనుట రాక్షస నాశమున కగుచున్నది.

5. మంత్రము : **ప్రేయమగా ధిషణా బర్హిరచ్ఛేత్యాహ । విద్యా వై ధిషణా । విద్యయైవైన దచ్ఛైతి ।**

అర్థము : ప్రేయమగా ధిషణా బర్హిరచ్ఛేత్యాహ=''అభిజ్ఞయైన ఈ అశ్వపర్యువు బర్హిస్సును పొందుటకై వెళ్లుచున్నది'' అని శ్రుతి చెప్పినది. ధిషణా=ధిషణ(బుద్ధి)గా చెప్పబడిన పర్యువు, విద్యా వా=విద్యారూపమే. విద్యయైవ=విద్యచేతనే, ఏనత్=ఈ బర్హిస్సును, అచ్ఛైతి=పొందుటకై వెళ్లినవాడగుచున్నాడు.

తాత్పర్యము : అధ్వర్యుడు బర్హిస్సును కోసితెచ్చుటకై లవన సాధనమైన అశ్వపర్యువుతో వెళ్లుచున్నాడని చెప్పబడినది. ప్రజాపతినుండి పుట్టిన అశ్వముయొక్క యెముక విద్యారూపముగా వర్ణించబడుటచే అధ్వర్యుడు విద్యతోడనే బర్హిస్సును పొందుటకై వెళ్లుచున్నవాడగుచున్నాడని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. ''ప్రేయమగా ధిషణా'' ఇత్యాది మంత్రముయొక్క ప్రథమభాగమునందలి పదార్థమును, తాత్పర్యమును ఈ బ్రాహ్మణము చెప్పినది.

6. మంత్రము : **మనునా కృతా స్వధయా వితష్టేత్యాహ। మానవీ హి పర్యుః స్వధా కృతా ।**

అర్థము : మనునా కృతా స్వధయా వితష్టేత్యాహ=ఈ పర్యువు ప్రజాపతి రూప మనువుచే తనచక్షుస్సునుండి నిర్మించబడినదియు, అశ్వభక్షితమైన అన్నము(స్వధ)చే విశేషముగ తీక్ష్ణముగచేయబడినదియునని శ్రుతి చెప్పినది. మానవీ=ప్రజాపతి రూప మనువు సంబంధియైన, పర్యుః=అశ్వముయొక్క యెముక, స్వధా కృతా హి=అశ్వభక్షితమైన అన్న మనెడి స్వధచే తీక్ష్ణీకృత మైనది కదా! అన్నముచేత ఎముక వృద్ధినొందుట అన్వయ వ్యతిరేక సిద్ధము.

తాత్పర్యము : తాత్పర్యము అర్థమునందే వివరించబడినది. పై మంత్రములోని ద్వితీయ భాగముయొక్క అర్థమునందు శ్రుత్యంతర ప్రసిద్ధిని, అనుమాన ప్రసిద్ధిని ఈ బ్రాహ్మణము తెలియజేసినది.

7. మంత్రము : **త ఆవహన్తి కవయఃపురస్తా దిత్యాహ। శుశ్రువాగ్ంసో వై కవయఃI యజ్ఞఃపురస్తాత్। ముఖత ఏవ యజ్ఞమారభతే।**

అర్థము : ''త ఆవహన్తి కవయఃపురస్తా దిత్యాహ''='ఆ పూర్వ విద్వాంసులు బర్హిస్సును తూర్పుదిక్కునుండి తెచ్చినారు' అని శ్రుతి చెప్పినది. కవయఃవిద్వాంసులు, శుశ్రువాంసఃవైశ్రుతి విహిత కర్మ ననుష్ఠించినవారే. యజ్ఞఃయజ్ఞము, పురస్తాత్హోమాధారమైన ఆహవనీయాగ్నికి పూర్వదిక్కునందు, వర్తతే ఇతిఉంటున్నదని, ఉచ్యతేచెప్పబడుచున్నది. తత్ఆ కారణమువలన, ముఖతఃఏవతూర్పుదిక్కు నందే, యజ్ఞమ్యజ్ఞమును, ఆరభతేఆరంభించినవాడగుచున్నాడు.

తాత్పర్యము : పూర్వవిద్వాంసులు శ్రుతిచోదిత కర్మను బాగుగ ననుష్ఠించినవారు. వారు బర్హిస్సును తూర్పుదిక్కునుండి తెచ్చినారు. అందువలన యజ్ఞము హోమాధారమైన ఆహవనీయాగ్నికి తూర్పుదిక్కున ఉన్నదని చెప్పబడుచున్నది. ఆ విధముగ బర్హిస్సును తూర్పుదిక్కునుండి తెచ్చుటవలన యజమానుడు యజ్ఞమును తూర్పుదిక్కునందే ఆరంభించినవాడగును.

8. మంత్రము : **అథో యదేతదుక్త్వా యతఃకుతశ్చాకహరతి। తత్ప్రాచ్యా ఏవ దిశో భవతి।**

అర్థము : అథోమఱియు, ఏతత్ఉక్త్వాఈ పూర్వోక్త పాఠమును చెప్పి, యతఃకుతశ్చిత్ఏదియో ఒక దిక్కునుండి, ఆహరతి యత్బర్హిస్సును తెచ్చినచో, తత్అప్పుడు, ప్రాచ్యాఃదిశఃఏవతూర్పుదిక్కునుండియే, భవతియజ్ఞము ఆరంభించబడిన దగుచున్నది.

తాత్పర్యము : మఱియు ''త ఆవహన్తి కవయఃపురస్తాత్'' అను మంత్రపాఠమును చెప్పి ఏదియో ఒక దిక్కునుండి బర్హిస్సును తెచ్చినయెడల ఆ యజ్ఞము తూర్పుదిక్కునుండియే ఆరంభింపబడిన దగును. ఆ మంత్రము నందలి తచ్ఛబ్ద పాఠమువలన దిగంతర ప్రయుక్తమైన వైకల్యము లేదని ఈ బ్రాహ్మణము చెప్పుచున్నది.

9. మంత్రము : **దేవేభ్యో జుష్టమిహ బర్హిరాసద ఇత్యాహ। బర్హిషఃసమృద్ధ్యై। కర్మణోకనపరాధాయ।**

అర్థము : ''దేవేభ్యో జుష్టమిహ బర్హిరాసద ఇత్యాహ''=హవిర్భుక్కులైన దేవతలకు ప్రియమైన బర్హిస్సును ఈ వేదియందు ఉంచవలెను'' అని శ్రుతి చెప్పినది. ఏతత్ఈ విధముగ చెప్పుట, బర్హిషఃసమృద్ధ్యై = బర్హిస్సు యొక్క సమృద్ధికొఱకు, కర్మణఃయజ్ఞకర్మయొక్క, అనపరాధాయన్యూనత్వ లక్షణమైన అపరాధము లేకుండుట కొఱకును, సంపద్యతేసంపన్న మగుచున్నది.

తాత్పర్యము : దేవతలకు ప్రియమైన బర్హిస్సును ఈ వేదియందు ఉంచవలెను(పఱచవలెను)అని శ్రుతి చెప్పుట వలన బర్హిస్సమృద్ధి, యజ్ఞకర్మకు న్యూనత్వ మనెడి దోషము కలుగకుండుటయు సంపన్నము లగుచున్నవి. మంత్ర చతుర్థభాగమునందలి ఆసదే అను పదముయొక్క తాత్పర్యమును ఈ బ్రాహ్మణము చెప్పినది.

10. మంత్రము :**దేవానాం పరిహూత మసీత్యాహ।యద్వా ఇదం కించ।తద్దేవానాం పరిహూతమ్।**

అర్థము : ''దేవానాం పరిషూత మసీత్యాహ''='ఓ దర్భసముదాయమా! నీవు దేవతల నిమిత్తము పరిగ్రహించబడినదాన వగుచున్నావు' అని శ్రుతి చెప్పినది. వా=లేదా, ఇదం కించ యత్=ఈ కొంచెమేది కలదో, తత్=అది, దేవానామ్=దేవతల నిమిత్తము, పరిషూతమ్=పరిగ్రహించబడినది.

తాత్పర్యము : ఓ దర్భజాతమా! నీవు దేవతలనిమిత్తము పరిగ్రహించబడినదాన వగుచున్నావు. కాని నాయొక్క గృహోచ్ఛాద నార్థము కాదు. కావున నాకు లవన దోషము (కోయుటవలన దోషము) లేదు. వర్షముచేత మఱల వృద్ధి నొందుదువు కనుక నీకును హాని లేదు. పరిగ్రహించబడిన సర్వము దేవార్థమే కాని, ఏకదేశము దేవార్థము కాదని ఈ బ్రాహ్మణము తెలియజేయుచున్నది.

11. మంత్రము :అథో యథా వస్యసే ప్రతిప్రోచ్యా కహేదం కరిష్యామీతి । ఏవమేవ తదధ్వర్యు ర్దేవేభ్యః ప్రతిప్రోచ్య బర్హిర్దాతి । ఆత్మనో కహింసాయై ।

అర్థము : అథో=మఱియు, ఇదం కరిష్యామీతి=దీనిని చేయగలనని, ప్రతిప్రోచ్య=ప్రత్యేకముగ చెప్పి, యథా వస్యసే=ఏ విధముగ ఉండగలవో, ఏవమేవ=ఈ విధముగనే, తత్=దానిని, అధ్వర్యుః=అధ్వర్యుడు దేవేభ్యః=దేవతలకొఱకు, ఇతి=అని, ప్రతిప్రోచ్య=ప్రత్యేకముగ చెప్పి, బర్హిః=బర్హిస్సును, దాతి=కోయుచున్నాడు. ఏతత్=ఇది, ఆత్మనః=తనకు, అహింసాయై=హింసాదోషము లేకుండుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : మఱియు లోకమునందు ఒకానొక భృత్యుడు రాజాజ్ఞవలన గ్రామములకు వెళ్లి బలవంతముగ (బలాత్కారముగ) తీసికొనబడుచున్న దధి క్షీరాది ద్రవ్యము ధనికశ్రేష్ఠుడైన రాజుకొఱకేకాని, నాకొఱకు కాదని ప్రజలయెదుట ప్రత్యేకముగ చెప్పి తప్పక ఈ ద్రవ్యమును తీసికొందునని ఏ విధముగ పలుకుచున్నాడో, ఆ విధముగనే ఇదియు నటెడి అభిప్రాయాంతరమును ఈ బ్రాహ్మణము తెలియజేసినది. దేవతలకొఱకు బర్హిస్సును కోయుచున్నానని చెప్పుటవలన అధ్వర్యునకు లవన దోషము ఉండదు.

12. మంత్రము :యావతః స్తమ్బాన్పరిదిశేత్ । యత్తేషా ముచ్ఛిగ్ంష్యాత్ । అతి తద్యజ్ఞస్య రేచయేత్ । ఏకగ్ం స్తమ్బం పరిదిశేత్ । తగ్ం సర్వం దాయాత్ । యజ్ఞస్యానతిరేకాయ ।

అర్థము : యావతః స్తమ్బాన్=ఎన్ని దర్భస్తంభములను, పరిదిశేత్=యజ్ఞవేదియందు పఱచునో, తం సర్వమ్=ఆ సమస్తమును, దాయాత్=కోయవలెను. తాషామ్=ఆ దర్భస్తంభములలో, ఉచ్ఛిష్యాత్ యత్=మిగిల్చినచో, తత్=అప్పుడు, యజ్ఞస్య=యజ్ఞమునకు, అతిరేచయేత్=అతిరేకము చేసినవాడగును. ఏకం స్తమ్బమ్=ఒక దర్భస్తంబమును, పరిదిశేత్=యజ్ఞవేదియందు ఉంచవలెను. తం సర్వమ్=ఆ సర్వమును, దాయాత్=కోయవలెను. ఏతత్=ఇది, యజ్ఞస్య అనతిరేకాయ=యజ్ఞమునకు అతిరేకము లేకుండుటకై, భవతి=అగుచున్నది. స్తంబము=బోదెలేనిచెట్టు, దుబ్బు అని యర్థము.

తాత్పర్యము : యజ్ఞసంబంధియైన ద్రవ్యమును యజ్ఞమునకు బహిర్భాగమున ఉంచుట అతిరేక మనఁబడును. ఆ దోషము లేకుండుటకై యజ్ఞమునకు సంబంధించిన దర్భస్తంభమును కోయవలెను. దానిని యజ్ఞమున నుపయోగించవలెను. కోసినస్తంబములలో దేనిని మిగుల్చునో, అది అతిరేక మగును. కనుక యజ్ఞమునకు అతిరేక దోషము లేకుండుటకై ఒక దర్భస్తంబమును కోయవలెను. దానిని యజ్ఞవేదియందు ఉంచవలెను.

13. మంత్రము :**వ॒ర్ష॑వృద్ధ మ॒సీ॑త్యాహ। వ॒ర్ష॑వృ॒ద్ధా వా ఓ॑ష॒ధయ॑ఃఽ ।**

అర్థము : ''వర్షవృద్ధమసీత్యాహ''=ఓ దర్భజాతమా! నీవు వర్షముచే వృద్ధి నొందినదాన వగుచున్నావని శ్రుతి చెప్పినది. ఓషధయఃఽ=ఓషధులు, వర్షవృద్ధాఃఽ వా=వర్షముచే వృద్ధి నొందునట్టివి కదా!

తాత్పర్యము : ఓ దర్భజాతమా! నీవు వర్షముచే వృద్ధి నొందినదాన వగుచున్నావని శ్రుతి చెప్పినది. ఓషధులు వర్షముచే వృద్ధి నొందునట్టివి కదా! అకృష్టపచ్యములైన (భూమిని దున్నికయే ఫలించునట్టివియైన) దర్భాదులకు తటాకాదుల నీటి యపేక్ష లేకయే వర్షముచే వృద్ధి ప్రసిద్ధమని ఈ బ్రాహ్మణము తెలియఁజేసినది.

14. మంత్రము :**దే॑వబ॒ర్హి॑రి॒త్యా॑హ। దే॒వేభ్య॑ ఏ॒వైన॑త్కరోతి ।**

అర్థము : ''దేవబర్హి రిత్యాహ''=దేవతల నిమిత్తము కోయఁబడు బర్హిస్సు దేవబర్హిస్సని శ్రుతి చెప్పినది. ఏనమ్=ఈ బర్హిస్సును, దేవేభ్యఃఽ ఏవ=దేవతలకొఱకే, కరోతి=చేయుచున్నాఁడు.

తాత్పర్యము : దేవతలకొఱకే ఈ బర్హిస్సును అధ్వర్యుఁడు ఉపయోగించుచున్నాఁడు కనుక, ఇది దేవబర్హిస్సని శ్రుతి చెప్పినది. బర్హిస్సునకు దేవసంబంధము తాదర్థ్య రూపమని ఈ బ్రాహ్మణము తెలియఁజేయుచున్నది.

15. మంత్రము :**మా త్వా॒ఽన్వ॒జ్మా తి॒ర్యగి॑త్యాహాహిꣳసా॒యై ।**

అర్థము : ''మా త్వాఽన్వజ్మా తిర్యగిత్యాహాహిꣳసాయై''=ఓ దేవబర్హీ! నిన్ను నిలువుగాను, అడ్డముగాను కూడ హింసించనని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, అహింసాయై=హింసాభావముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఓ దేవబర్హీ! నిన్ను నిలువుగాను అడ్డముగాను కూడ హింసించనని అధ్వర్యుఁడు చెప్పినట్లు శ్రుతి చెప్పినది. ఇట్లు చేయుటవలన అధ్వరుఁనకు హింసా దోషము కలుగదని ఈ బ్రాహ్మణము తెలియఁజేయుచున్నది. అన్వక్కుగా హింసించుట యనఁగా దర్భను నిలువుగా రెండుగా చీల్చుట. తిర్యక్కుగా హింసించుట యనఁగా దర్భను ముక్కలు ముక్కలుగా ఛేదించుట యని యర్థము.

16. మంత్రము :**ప॑ర్వ తే రాధ్యాస మి॒త్యా॑హ॒ర్ద్ధ్యై ।**

అర్థము : ''పర్వ తే రాధ్యాస మిత్యాహ''=ఓ దేవబర్హీ! నీ పర్వము నష్టము కానివిధముగ చేయుచున్నానని అధ్వర్యుఁడు చెప్పినట్లు శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, ఋద్ధ్యై=సమృద్ధికొఱకు, భవతి=అగుచున్నది. పర్వము=పునఃప్రరోహ స్థానము.

తాత్పర్యము : పునః ప్రరోహ సమృద్ధికై పర్వసాధనమని ఈ బ్రాహ్మణము చెప్పినది. తాత్పర్యము స్పష్టము.

17. మంత్రము :**ఆచ్ఛేత్తా తే మా రిషమిత్యాహ। నాస్యా కకత్మనో మీయతే । య ఏవం వేద ।**

అర్థము : ''ఆచ్ఛేత్తా తే మా రిషమిత్యాహ''=ఓ దేవబర్హీ! నీకు నేను ఛేదకుడనైనను, నిన్ను హింసించుట లేదని అధ్వర్యుడు చెప్పినట్లు శ్రుతి చెప్పినది. యః=ఏ పురుషుడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనెనో, అస్య ఆత్మనః=ఇతనికి, న మీయతే=నశించుట లేదు.

తాత్పర్యము : ఓ దేవబర్హీ! నీకు నేను అంతటను ఛేదకుడనైనను మంత్రసామర్థ్యమువలన నిన్ను నేను హింసించుట లేదని శ్రుతి అధ్వర్యుడు చెప్పినట్లు చెప్పినది. ఈ విధముగ తెలిసికొనినవానికి కూడ ఏదియు నశించదు. ఇచట ''మా రిషమ్'' అను మంత్రమును పఠించువానికిని, దానియర్థమును తెలిసికొనినవానికి కూడ స్వకీయము ఏదియు నశించదని ఈ బ్రాహ్మణము తెలియజేయుచున్నది. ''మీఙ్-హింసాయామ్'' అను హింసార్థకమైన 'శ్యన్' వికరణి ధాతువునుండి 'మీయతే' అను లడంత రూప మేర్పడినది.

18. మంత్రము :**దేవబర్హిః శతవల్శం విరోహేత్యాహ। ప్రజా వై బర్హిః । ప్రజానాం ప్రజననాయ ।**

అర్థము : ''దేవబర్హిః శతవల్శం విరోహేత్యాహ''=ఓ దేవబర్హీ! నీవు అనంత శాఖలు కలదానవుగా విశేషముగ పాదుర్భవించుమని అధ్వర్యుడు పలికినట్లు శ్రుతి చెప్పినది. బర్హిః=బర్హిస్సు, ప్రజా వై=ప్రజయే. ఏతత్=ఇది, ప్రజానామ్=ప్రజలయొక్క, ప్రజననాయ=ప్రకర్షతో కూడిన ఉత్పత్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఓ దేవబర్హీ! నీవు అనంత శాఖలు కలదానవుగా ప్రాదుర్భవించుమని అధ్వర్యుడు బర్హిస్సును ప్రార్థించినట్లు శ్రుతి చెప్పినది. బర్హిస్సు పుత్రాదులవలె ఉపకారక మగుటచే దాని ప్రరోహమునకై చేయు యత్నము పుత్రోత్పత్తికొఱ కగునని ఈ బ్రాహ్మణము తెలియజేయుచున్నది.

19. మంత్రము :**సహస్రవల్శా వి వయగ్ం రుహేమేత్యాహ। ఆశిష మేవైతా మాశాస్తే ।**

అర్థము : ''సహస్రవల్శా వి వయగ్ం రుహేమేత్యాహ''=ఓ దేవబర్హీ! మేము అనంత శాఖలుగా విశేషముగ ప్రాదుర్భవింతుమని (వృద్ధి నొందుదుమని) అధ్వర్యుని మాటగా శ్రుతి చెప్పినది. ఏతామ్=దీనిని, ఆశిషమేవ=ఆశీస్సునుగానే, ఆశాస్తే=అధ్వర్యుడు కోరుచున్నాడు.

తాత్పర్యము : ''సహస్రవల్శా వి వయగ్ం రుహేమ'' అను మంత్రము ఆశీఃపరమని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. దీనిని అధ్వర్యుడు ఆశీస్సుగానే తలచుచున్నాడని యర్థము.

20. మంత్రము :**పృథివ్యాః సంపృచః పాహీత్యాహ ప్రతిష్ఠిత్యై ।**

అర్థము : ''పృథివ్యాః సంపృచః పాహీత్యాహ''=తృణ కాష్ఠాద్యాధారమైన ఓ పదార్థ విశేషమా! ఈ దర్భజాతమును పృథివియొక్క సంపర్కమునుండి రక్షించుమని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : కోసిన బర్హిస్సును భూమియందు ఒక వస్తువుపైని ఉంచవలెను. ఆ వస్తువు ఇచట సంబోధించఁబడినది. కోసిన దర్భజాతము భూమిపైని ఉంచినచో ఉచ్ఛిష్టాది స్పర్శచే అది అప్రతిష్ఠిత మగును (అపవిత్ర మగును.) ద్రవ్యాంతరముపైని ఉంచినచో ఉచ్ఛిష్టాది స్పర్శ ఉండదు కనుక ప్రతిష్ఠిత మగును. ద్రవ్యాంతరముపైని స్థాపనమునందు ప్రయోజనమును ఈ బ్రాహ్మణము చెప్పినది.

21. మంత్రము :**అయుఙ్గాయుఙ్గా న్మష్టీల్లునోతి । మిథునత్వాయ ప్రజాత్యై ।**

అర్థము : అయుఙ్గాయుఙ్గాన్=యుగ్మభిన్నములైన(అసమ సంఖ్యాకములైన), ముష్టీన్=దర్భముష్టులను, లునోతి=కోయవలెను. ఏతత్=ఇది, మిథునత్వాయ=స్త్రీ పురుష మిథునత్వముకొఱకు, ప్రజాత్యై=ప్రజోత్పత్తి కొఱకును, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : యుగ్మము కానిది అయుంగము. దర్భముష్టులను అయుగ్మములుగా (అసమ సంఖ్యాకములుగా) కోయవలెను. అయుగ్మములు మూఁడు, అయిదు, ఏడు, తొమ్మిది ఇత్యాదులైన అసమ సంఖ్యలు అనేకములు కలవు. ఆ అన్నింటి సంగ్రహమునకై ''అయుఙ్గాయుఙ్గాన్'' అని వీప్స ప్రయుక్త మైనది. దర్భముష్టులను అసమసంఖ్యాకములుగా కోసినచో మిథునత్వసిద్ధియు, దానివలన ప్రజోత్పత్తియు కలుగును. పూర్వము ప్రస్తర మనెడి దర్భముష్టిని సమంత్రకముగ కోయవలెనని చెప్పఁబడినది. ఈ బ్రాహ్మణము ఇతర దర్భముష్టులను అయుగ్మములుగ అమంత్రకముగ కోయవలెనని విధించినది. సమంత్రకామంత్రములైన లవనములు రెండు కావున, మిథునత్వము ఏర్పడుచున్నది. ఆ మిథునత్వముచే లౌకిక స్త్రీ పురుష మిథున స్మృతి కలిగి తద్ద్వారా ఆత్మప్రజోత్పత్తికి లవన ద్వయము సంపన్న మగుచున్నది. లవనము=కోయుట. ఈ బ్రాహ్మణము అమంత్రక లవన విధాయకము. అమంత్రక లవనమునందు ఆపస్తంబ మహర్షి ''ప్రస్తరమేవ మన్త్రేణ దాతి తూష్ణీ మితరదిత్'' అను వాజసనేయ బ్రాహ్మణమును ఉదాహరించెను.

22. మంత్రము :**సుసంభృతా త్వా సంభరామీత్యాహ। బ్రహ్మణైవైనత్సంభరతి । అదిత్యై రాస్నాకసీత్యాహ। ఇయం వా అదితిః । అస్యా ఏవైనద్రాస్నాం కరోతి ।**

అర్థము : ''సుసంభృతా త్వా సంభరామీత్యాహ''=ఓ దర్భముష్టి సముదాయమా! నిన్ను బాగుగ గ్రహించుటకై యోగ్యమైన రజ్జువుచే(త్రాటిచే)సంగ్రహించుచున్నానని అధ్వర్యుఁడు చెప్పినట్లు శ్రుతి చెప్పినది. బ్రహ్మణైవ=బ్రహ్మస్వరూపమైన రజ్జువుచే, ఏనత్=ఈ దర్భజాతమును, సంభరతి=బాగుగ కూర్పు చేయుచున్నవాఁ డగుచున్నాఁడు. ''అదిత్యై రాస్నాఽసీత్యాహ''=ఓ రజ్జూ! నీవు భూదేవికి కాంచీగుణ స్థానీయమగు రశన మగుచున్నావని శ్రుతి చెప్పినది. ఇయం వా=ఈ భూమియే, అదితిః=అదితి. అస్యాఃఏవ=ఈ భూమికే, ఏనమ్=ఈ దర్భజాతమును, రాస్నామ్=రశనగా(మొలనూలుగా), కరోతి=చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ఓ దర్భముష్టి సముదాయమా! నిన్ను యోగ్యమైన త్రాటిచే కూర్చుచున్నాను (కట్టుచున్నాను). రజ్జువు దర్భమయ మగుటచే అది బ్రహ్మగా వర్ణించఁబడినది. కనుక అధ్వర్యుఁడు బ్రహ్మచే ఈ దర్భముష్టి

సముదాయమును కట్టుచున్నవాఁ డగుచున్నాఁడు. ఓ రజ్జూ! నీవు అదితికి కాంచీగుణ స్థానీయమగు రశన వగుచున్నావు. ఈ భూమియే అదితి. అధ్వర్యుఁడు ఈ భూమికే ఈ దర్భజాతమును కాంచీగుణ స్థానీయమైన రశనగా చేసినవాఁ డగుచున్నాఁడు.

23. మంత్రము :**ఇన్ద్రాణ్యై సంనహన మిత్యాహ। ఇన్ద్రాణీ వా అగ్రే దేవతానాగ్ం సమనహ్యత । సా ऽకర్ధ్నోత్ । ఋద్ధ్యై సంనహ్యతి ।**

అర్థము : ''ఇన్ద్రాణ్యై సంనహన మిత్యాహ''=ఇంద్రుని భార్యయైన శచీదేవికి దర్భల త్రాటితో బంధనము ప్రియ మని శ్రుతి చెప్పినది. అగ్రే=పూర్వము, దేవతానామ్=దేవతలలో, ఇన్ద్రాణీ వై=ఇంద్రునిభార్యయే, సమనహ్యత=దర్భల త్రాటితో బంధించఁబడెను. సా=ఆ ఇంద్రాణి, అర్ధ్నోత్=వృద్ధి నొందెను. ఋద్ధ్యై=సమృద్ధికొఱకు, సంనహ్యతి=యజమానునియొక్క భార్యను దర్భల త్రాటితో బంధించవలెను.

తాత్పర్యము : త్రాటియొక్క మూలాగ్రములచేమేఖలా రూపమున బంధనము సంనహన మనఁబడును. ఆ సంనహనము ఇంద్రాణి కిష్టమైనదని శ్రుతి చెప్పినది. పూర్వము దేవతలలో ఇంద్రాణియే దర్భల త్రాటితో బంధించఁబడినది. అనఁగా:- ఇప్పుడు ఇంద్రునకు భార్యగ ఉన్నటువంటి ఇంద్రాణి పూర్వజన్మమునందు శతక్రతువుల ననుష్ఠించిన యజమానునకు భార్యగా ఉండి ఆ యా క్రతువులందు ఆ యజమానునిచే దర్భల త్రాటితో బంధించఁబడుటచే అనంతరము ఇంద్రాణిగా వృద్ధి నొందినది. కనుక ఆ ఇంద్రాణికి సంనహనము ప్రియమైనది. ఆ కారణమువలన సమృద్ధికొఱకే అధ్వర్యుఁడు యజమాన పత్నిని దర్భలతో సంనహనము చేయవలెను.

24. మంత్రము :**ప్రజా వై బర్హిః । ప్రజానా మపరావాపాయ । తస్మాత్స్నావసంతతాः ప్రజా జాయన్తే ।**

అర్థము : ప్రజా=ప్రజ, బర్హిః వై=బర్హియే, ఏతత్=ఈ దర్భల త్రాటితో సంనహనము, ప్రజామ్=ప్రజలకు, అపరావాపాయ=శైథిల్యము లేకుండుటకై, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది. తస్మాత్=ఆ కారణమువలన, ప్రజాः=ప్రజలు, స్నావసంతతాः=ధమనులచే వ్యాప్తులై, జాయన్తే=పుట్టుచున్నారు.

తాత్పర్యము : ప్రజ బర్హీరూపమే. కనుక ఈ సంనహనము ప్రజలకు శైథిల్యము లేకుండుటకై సంపన్న మగుచున్నది. ఆ కారణమువలన బ్రహ్మసృష్టియందు కూడ ప్రజలు ధమనులతో (నరములతో) కూడినవారై పుట్టుచున్నా రని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

25. మంత్రము :**పూషా తే గ్రన్థిం గ్రథ్నాత్విత్యాహ। పుష్టిమేవ యజమానే దధాతి ।**

అర్థము : ''పూషా తే గ్రన్థిం గ్రథ్నాత్విత్యాహ''=సంనద్ధమైన ఓ రజ్జూ!, పోషకుఁడైన దేవుఁడు నీయొక్క ముడిని చేయుఁగాక(వేయుఁగాక) అని శ్రుతి చెప్పుటచే, పూషా=పోషక దేవుఁడు, యజమానే=యజమానుని యందు, పుష్టిమ్=పుష్టిని, దధాత్యేవ=తప్పక కలుగఁజేయును.

తాత్పర్యము : అధ్వర్యుcడు యజమాన పత్నికి దర్భల త్రాటిని మేఖలా రూపమున చుట్టి ముడివేయునపుడు ''పూషా తే గ్రన్థిం గ్రథ్నాతు'' అను మంత్రమును పఠించును. తానే ముడి వేయుచున్నను పూషదేవుcడు ముడిని వేయుచున్నట్లు భావన చేయవలెను. అట్లు చేయుట పోషకుcడైన దేవుcడు యజమానునియందు పుష్టిని కలుగcజేయునని అర్థము.

26. మంత్రము :**స తే మా ఽఽస్థాదిత్యాహాహిగ్ంసాయై ।**

అర్థము : ''స తే మాఽఽస్థాదిత్యాహ''='ఓ దర్భా! నీకు నిర్బంధకారియైన ఆ రజ్జుగ్రంథి (త్రాటిముడి) చిరకాలము ఉండదు గాక' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ కథనము, అహింసాయై=హింస లేకుండుటకై భవతి=అగుచున్నది.

తాత్పర్యము : దర్భోపద్రవ పరిహార రూపమైన నిషేధ ఫలమును ఈ బ్రాహ్మణము చెప్పినది. ఓ దర్భా! నీకు నిర్బంధకారియైన ఆ రజ్జుగ్రంథి చిరకాలము ఉండదు గాక యని చెప్పుటచే హింస ఉండదని స్పష్ట మగుచున్నది.

27. మంత్రము :**పశ్చాత్ప్రాఞ్చ ముపగూహతి । పశ్చాద్వై ప్రాచీనగ్ం రేతో ధీయతే। పశ్చాదేవాస్మై ప్రాచీనగ్ం రేతో దధాతి ।**

అర్థము : పశ్చాత్=వెనుకవైపున, ప్రాఞ్చమ్=ప్రాగగ్రములు కలదిగా, ఉపగూహతి=సమీపమున దాcచవలెను. పశ్చాత్ వై=పశ్చిమ భాగముననే ఉండి, ప్రాచీనం రేతః=ప్రాచీనముగ(తూర్పుదిశగ) రేతస్సు, ధీయతే=యోనియందు ఉంచcబడుచున్నది. అస్మై=అపత్యార్థియైన ఈ యజమానునికొఱకు, పశ్చాత్=పశ్చిమ భాగమున నుండి, ప్రాచీనం రేతః=రేతస్సును ప్రాచీనముగ, దధాతి=ధరింపcజేయుచున్నవాcడగు చున్నాcడు.

తాత్పర్యము : దర్భల త్రాటిని యజమాన పత్ని నడుమునకు చుట్టి ముడి వేసి అధ్వర్యుcడు ఆ గ్రంథిశేషమును రెండుగా చేసి రజ్జువేష్టన స్థానమునుండి వెనుకకు లాగి తూర్పువైపునకు కొనలు వచ్చునట్లుగా గూహనము చేయువలెను. (గూహనము=దాcచుట.) లోకమునందు పురుషుcడు కూడ రతిసమయమున పశ్చిమమున ఉండి తూర్పువైపుగ యోనియందు రేతస్సు నుంచుచున్నాcడు. ఇట్లు చేయుట వలన పోషకుcడైన దేవుcడు సంతానార్థియైన యజమానునికొఱకు పశ్చిమమున ఉండి ప్రాచీనముగ రేతస్సు నుంచునట్లుగ చేయునని ఈ బ్రాహ్మణము వివరించినది.

28. మంత్రము :**ఇన్ద్రస్య త్వా బాహుభ్యా ముద్యచ్ఛ ఇత్యాహ। ఇన్ద్రియమేవ యజమానే దధాతి ।**

అర్థము : ''ఇన్ద్రస్య త్వా బాహుభ్యా ముద్యచ్ఛ ఇత్యాహ''=ఓ బర్హీ! నిన్ను ఇంద్రునియొక్క బాహువులచే ఎత్తుచున్నానని శ్రుతి చెప్పినది. అనేన=ఈ కథనముచే, అధ్వర్యుః=అధ్వర్యుcడు, యజమానే=యజమానునియందు, ఇన్ద్రియమేవ=ఇంద్రియ సామర్థ్యమునే, దధాతి=ఉంచుచున్నవాcడగుచున్నాcడు.

తాత్పర్యము : ఇచట ఇంద్రశబ్ద ప్రయోగముచే ఇంద్రదత్త సామర్థ్యము సిద్ధించునని ఈ బ్రాహ్మణము తెలియజేయుచున్నది. ఓ దర్భజాతమా! నిన్ను ఇంద్రునియొక్క బాహువులచే ఎత్తుచున్నా నని శ్రుతి చెప్పుటచే అనగా మంత్రమునందు ఇంద్రశబ్ద ముండుటచే అధ్వర్యుడు యజమానునియందు ఇంద్రియ సామర్థ్యమునే ఉంచినవాడగుచున్నాడు. మిగిలిన బర్హిస్సును పైకి ఎత్తుకొనునప్పుడు అధ్వర్యుడు ఈ మంత్రమును పఠించును.

29. మంత్రము :**బృహస్పతేర్మూర్ధ్నా హరామీత్యాహ । బ్రహ్మ వై దేవానాం బృహస్పతిః । బ్రహ్మణైవైనద్ధరతి ।**

అర్థము : ''బృహస్పతేర్మూర్ధ్నా హరామీత్యాహ''=ఓ దర్భజాతమా! నిన్ను బృహస్పతియొక్క శిరస్సుతో తీసికొనుచున్నా నని శ్రుతి చెప్పినది. దేవానామ్=దేవతలకు, బృహస్పతిః=బృహస్పతి, బ్రహ్మ వై=బ్రహ్మయే. బ్రహ్మణైవ=బ్రహ్మచేత, ఏనత్=ఈ దర్భజాతమును, హరతి=తీసికొనుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : అధ్వర్యుడు పై కెత్తిన దర్భసముదాయమును శిరస్సుపైని ఉంచుకొనుచు తనును బృహస్పతినిగా భావన చేయుచు బృహస్పతియొక్క శిరస్సుతో దర్భను తీసికొనుచున్నానని అనును. దేవతలకు బృహస్పతి బ్రహ్మయే కావున బ్రహ్మచేతనే ఈ దర్భజాతమును తీసికొనుచున్నవాడగుచున్నాడు. ప్రాశస్త్యమువలన బృహస్పతి యిచట బ్రహ్మగా స్తుతించబడెను.

30. మంత్రము :**ఉర్వన్తరిక్ష మన్వీహీత్యాహ గత్యై ।**

అర్థము : ''ఉర్వన్తరిక్ష మన్వీహీత్యాహ''='ఓ దర్భజాతమా! విస్తీర్ణమైన అంతరిక్షము ననుసరించి పొమ్ము' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ కథనము, గత్యై=గమనముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఓ దర్భా! నీవు విస్తీర్ణమైన అంతరిక్షము ననుసరించిన పొమ్మని శ్రుతి చెప్పుటచే గమనానుకూల్యము సిద్ధించుచున్నది. ఇచట మంత్రమునందలి 'ఇహి' అను శబ్దముయొక్క వివక్షను బ్రాహ్మణము కనబఱచినది.

31. మంత్రము :**దేవంగమమసీత్యాహ। దేవానేవైనద్గమయతి ।**

అర్థము : ''దేవంగమమసీత్యాహ''=ఓ దర్భా! నీవు దేవతలను పొందుదాన వగుచున్నావని శ్రుతి చెప్పినది. అధ్వర్యుః=అధ్వర్యుడు, ఏనమ్=ఈ దర్భజాతమును, దేవానేవ=దేవతలనే, గమయతి=పొందించుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : ఓ దర్భజాతమా! నీవు దేవతలను పొందుచున్నదాన వగుచున్నావని అధ్వర్యుడు అనినట్లు శ్రుతి చెప్పుటచే అధ్వర్యుడు ఈ దర్భసముదాయమును దేవతలకే పొందించుచున్నవాడగుచున్నాడు. ఈ బ్రాహ్మణము మంత్రమునందలి 'అసి' అను పదముయొక్క అభిప్రాయమును తెలియజేసినది.

32. మంత్రము :**అనధఃసాదయతి । గర్భాణాం ధృత్యా అప్రపాదాయ తస్మాద్గర్భాఃప్రజానా మప్రపాదుకాఃఉపరీవ**

నిదధాతి । ఉపరీవ హి సువర్గో లోకఃసువర్గస్య లోకస్య సమష్ట్యై ।

స యోనిత్వాయ స్వధాకృతా కసీత్యాహ దాయాద్వేదభరతి జాయన్తే బృహస్పతి స్సమష్ట్యై॥ ౩ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయ కాణ్డే ద్వితీయ ప్రపాఠకే ద్వితీయోఽనువాకః ॥ ౨ ॥

అర్థము : ఈ బ్రాహ్మణభాగము ప్రథమానువాకాంతమున వ్యాఖ్యానించబడినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ద్వితీయ ప్రపాఠకమునందు
ద్వితీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే
తృతీయోఽనువాకః

1. మంత్రము : **పూర్వేద్యు ర్దిధ్మాబర్హిః కరోతి । యజ్ఞమేవా ఽఽరభ్య గృహీత్వోపవసతి ।**

వేదార్థదీపిక

అవతారిక: ప్రథమ ద్వితీయానువాకములందు అమావాస్యనాటి పగటివేళ చేయదగిన పనికి సంబంధించిన మంత్రములను బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. అనగా:- వత్సాపకరణార్థ మంత్రములను, బర్హిరాహరణార్థములకు బ్రాహ్మణము ఆమ్నాత మైనది. ఈ తృతీయానువాకముచే అమావాస్యనాటి రాత్రియందు కర్తవ్యమైన దోహమునకు (పాలుపితుకుటకు) సంబంధించిన మంత్రములకు బ్రాహ్మణము చెప్పబడుచున్నది. ప్రథమమున బర్హిస్సుయొక్క కాలము విధించబడుచున్నది.

అర్థము : పూర్వేద్యుః=దర్శపూర్ణమాసేష్టి చేయదగిన ప్రతిపత్తిథికి పూర్వదినమున, ఇధ్మాబర్హిః=ఇధ్మమును, బర్హిస్సును, కరోతి=చేయవలెను (సంపాదించవలెను). యజ్ఞమేవ=యజ్ఞమునే, ఆరభ్య=ఆరంభించి, గృహీత్వా=దేవతలను గ్రహించి, ఉపవసతి=ఆ దేవతల సమీపమున నివసించుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : దర్శపూర్ణమాసేష్టిని ప్రతిపత్తునందే చేయవలసియున్నను పర్వదినమునందే యజమానుడు ఆ దర్శపూర్ణమాసేష్టి కవసరములైన ఇధ్మమును, బర్హిస్సును సంపాదించవలెను. తావన్మాత్రముచే యజ్ఞము ప్రారంభించబడినదియే యగును. అంతియ కాదు. యజమానుడు దేవతలను పొంది వారి సమీపమున నివాసము చేసినవాడగును. దీనిచే దేవతా పరిగ్రహమునకు కూడ పూర్వదినమే కాలమని సూచిత మగుచున్నది. ఆ విధానము యజమానకాండమునందు చెప్పబడును. ''యత్క్రుష్ణో రూపం కృత్వా'' ఇత్యాదులు ఇధ్మ మంత్రములు. అవి మఱియొకచోట ఆమ్నాతము లగుటవలన అచటనే వ్యాఖ్యానించబడును.

2. మంత్రము : **ప్రజాపతి ర్యజ్ఞ మసృజత । తస్యాఖే అస్రగ్ంసేతామ్ । యజ్ఞో వై ప్రజాపతిః । యత్సాంనాయ్యాఖే భవతః । యజ్ఞస్యైవ తదుఖే ఉపదధాత్యప్రస్రగ్ంసాయ ।**

అర్థము : ప్రజాపతిః=ప్రజాపతి, యజమ్=దర్శేష్టిని, అసృజత=సృజించెను. తస్య=ఆ యజ్ఞముయొక్క, ఉఖే=పాత్రములు, అస్రంసేతామ్=క్రిందపడెను (నశించెను). యజ్ఞః=యజ్ఞము, ప్రజాపతిః వై=ప్రజాపతి స్వరూపమే. సాంనాయ్యాఖే=దధిపయస్సులతై ఉఖాపాత్రములు, భవతః యత్=ఉన్నయెడల, తత్=ఆ ఉఖాసంపాదనముచేత, యజ్ఞస్యైవ=యజ్ఞమునకే, ఉఖే=పాత్రములను, ఉపదధాతి=ఉపధానము చేసినవాడగుచున్నాడు. ఏతత్=ఇది, అప్రస్రంసాయ=యజ్ఞము నశింపకుండుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఒకప్పుడు ప్రజాపతి దర్శేష్టిని సృజించెను. ఆ యజ్ఞమునకు సంబంధించిన కుంభములు క్రిందపడెను (నశించెను). యజ్ఞము ప్రజాపతి స్వరూపమే కనుక, యజ్ఞపాత్రముల నాశమువలన యజ్ఞమునశించును.

యజ్ఞ నాశమువలన సృష్టయైన ప్రజాపతికి నాశము సంభవించును. కనుక సాంన్నాయ్య కుంభములు ఉన్నచో యజమానుఁడు ఆ ఉఖాసంపాదనముచే ఆ ఉఖలను యజ్ఞమునకే ఉపధానము చేసినవాఁ డగుచున్నాఁడు. ఇది ప్రజాపతియొక్క అవినాశము కొఱ కగుచున్నది. ఇధ్మాబర్హిస్సంపాదనానంతరము దోహనమునకై కుంభీద్వయము (పాత్ర ద్వయము) ఈ బ్రాహ్మణము విధించినది.

3. మంత్రము : **శున్ధధ్వం దైవ్యాయ కర్మణే దేవయజ్యాయా ఇత్యాహ। దేవయజ్యాయా ఏవైనాని శున్ధతి ।**

అర్థము : ''శున్ధధ్వం దైవ్యాయ కర్మణే దేవయజ్యాయా ఇత్యాహ''='ఓ పాత్రములారా! దేవయజ్యా స్వరూపమైన దైవిక కర్మకొఱకు మీరు శుద్ధములు కండు' అని శ్రుతి చెప్పినది. దేవయజ్యాయై ఏవ=దేవయజ్యాత్మక కర్మకొఱకే, ఏనాని=ఈ పాత్రములను, శున్ధతి=శోధించుచున్నాఁడు.

తాత్పర్యము : తాత్పర్యము స్పష్టము. దానవ్రతాది రూపమైన స్మార్త కర్మ కూడ దైవికమే యగును. ఆ దాన వ్రతాది రూప స్మార్త కర్మ కాదని తెలుపుటకై మంత్రమునందు 'దేవయజ్యాయై' అను విశేషణ ముపాత్త మైనది.

4. మంత్రము : **మాతరిశ్వనో ఘుర్మోఽసీత్యాహ। అన్తరిక్షం వై మాతరిశ్వనో ఘుర్మః । ఏషాం లోకానాం విధృత్యై । ద్యౌరసి పృథివ్యసీత్యాహ। దివశ్చ హ్యేషా పృథివ్యాశ్చ సంభృతా । యదుఖా । తస్మాదేవమాహ। విశ్వధాయా అసి పరమేణ ధామ్నేత్యాహ। వృష్టిర్వై విశ్వధాయాః । వృష్టిమేవావరున్ధే । దృగ్ంహస్వ మా హ్వారిత్యాహ ధృత్యై।**

అర్థము : ''మాతరిశ్వనో ఘుర్మోఽసీత్యాహ''=ఓ సాంనాయ్య పాత్రమా! నీవు వాయువునకు సంచార స్థానము నొసఁగుటచే దీపకమగు నంతరిక్ష స్వరూప మగుచున్నావని శ్రుతి చెప్పినది. అన్తరిక్షం వై=అంతరిక్షమే, మాతరిశ్వనః=వాయువునకు, ఘుర్మః=దీపకము. ఏషాం లోకానామ్=ఈ లోకములయొక్క, విధృత్యై=విశేషధారణముకొఱకు, భవతి=అగుచున్నది. ''ద్యౌరసి పృథివ్యసీత్యాహ''=నీవు ద్యు లోక రూపము, పృథివీ లోక రూపమును అగుచున్నా వని శ్రుతి చెప్పినది. ఉఖా యత్=ఉఖ యేది కలదో, ఏషా=ఇది, దివశ్చ=ద్యు లోకమునుండియు, పృథివ్యాశ్చ=పృథివీ లోకమునుండియు, సంభృతా హి=సంపాదించఁబడినది కదా! తస్మాత్=ఆ కారణమువలన, ఏవమ్=ఈ విధముగా, ఆహ=శ్రుతి చెప్పినది. ''విశ్వధాయా అసి పరమేణ ధామ్నా''=నీవు బహుక్షీర ధారణ సామర్థ్యముచే విశ్వధారక వృష్టిరూప మగుచున్నావని శ్రుతి చెప్పినది. వృష్టిః వై=వృష్టియే, విశ్వధాయాః=విశ్వధారకము, (తతః=అందువలన, యజమానః=యజమానుఁడు,) వృష్టిమేవ=వర్షమునే, అవరున్ధే=పొందుచున్నాఁడు. ''దృగ్ంహస్వ మా హ్వారిత్యాహ''ఓ పాత్రమా! నీవు దృఢమ వగుము. భగ్నము కావల దని శ్రుతి చెప్పినది. ఈ చెప్పుట పాత్రముయొక్క దార్ఢ్యముకొఱ కగుచున్నది.

తాత్పర్యము : ఓ కుంభమా! (పాత్రమా!) నీ యుదరమునందు అంతరిక్ష ముండుటవలన నీవు వాయువునకు సంచార స్థానము నొసఁగుటచే దీపకమైన అంతరిక్ష రూప మగుచున్నావు. మఱియు ద్యులోక జన్య వర్షోదకమునుండియు, భూలోకస్థ మృత్తికనుండియు సంపాదింపఁబడుటచే నీవు లోకద్వయ రూప

మగుచున్నావు. అందువలన దృఢమ వగుము. భగ్నము కావలదు. ''ద్యౌరసి పృథివ్యసి'' అని రెండు లోకములకు వాచకమైన శబ్దముచే ఉపాత్త మగుటవలన సాహచర్యముచే ఘర్మ శబ్దము అంతరిక్షపర మగుచుండఁగా కుంభము (సాంనాయ్య పాత్రము) నందు విశేషముగ ముల్లోకముల ధారణము సిద్ధించుచున్నది. 'విశ్వధాయా' అను ఉచ్చారణమువలన వృష్టియొక్క అవరోధము స్వాధీన మగుచున్నది.

5. మంత్రము : **వసూనాం పవిత్రమసీత్యాహ। ప్రాణా వై వసవః। తేషాం వా ఏతద్భాగధేయమ్। యత్పవిత్రమ్। తేభ్య ఏవైనత్కరోతి।**

అర్థము : ''వసూనాం పవిత్రమసీత్యాహ''=ఓ శాఖాపవిత్రమా! నీవు ప్రాణ నివాస హేతువులైన క్షీరధారలకు శోధక మగుచున్నా వని శ్రుతి చెప్పినది. వసవః=క్షీరధారలు, ప్రాణాః వై=ప్రాణ స్వరూపములే. పవిత్రం యత్=శాఖాపవిత్ర మేది కలదో, ఏతత్=ఈ శాఖాపవిత్రము, తేషాం వై=ఆ ప్రాణములకే, భాగధేయమ్=భాగధేయము. తేభ్యః ఏవ=ఆ ప్రాణములకొఱకే, ఏనత్=ఈ క్షీరశోధనమును, కరోతి=సర్వ జనుఁడు చేయుచున్నాఁడు.

తాత్పర్యము : పాలు పితుకుటకు ముందుగా పాత్రము ముఖమునందు శాఖాపవిత్రమును ఉంచవలెను. ఆ శాఖాపవిత్రము ఇచట సంబోధించఁబడుచున్నది. ఓ శాఖాపవిత్రమా! కుంభీముఖమునందు ఉంచఁబడిన నీవు ప్రాణ నివాస హేతువులైన క్షీరధారలకు (క్షీరావయవములకు) శోధక మగుచున్నావని ''వసూనాం పవిత్రమసి'' అను మంత్రము చెప్పినది. కుంభియందు క్షీరముతో కూడ పడుచున్న తృణ పర్ణాదులు శాఖాపవిత్రముచే అడ్డగించఁబడును. ధనవాచియైన వసు శబ్దముచే క్షీరావయవములు ఇచట వివక్షితము లైనవి. ఆ క్షీరావయవములు ప్రాణ నివాస లక్షణమైన జీవనమునకు హేతువు లగుటచే ప్రాణరూపములని వర్ణించఁబడినవి. శోధకమైన పవిత్రము ప్రాణములకే సంబంధించినది. సర్వజనుఁడు ప్రాణములకొఱకే పిపీలికా మక్షికాదులను తొలఁగించుటచేత క్షీరశోధనము చేయుచున్నాఁడు కదా! వసుశబ్దార్థమును, షష్ఠ్యభిప్రేతమైన సంబంధివిశేషమును ఈ బ్రాహ్మమము వివరించినది. కుంభి=క్షీరపాత్రము.

6. మంత్రము : **శతధారగ్ం సహస్రధార మిత్యాహ। ప్రాణేష్వేవాయుర్దధాతి సర్వత్వాయ।**

అర్థము : ''శతధారగ్ం సహస్రధార మిత్యాహ''=ఓ శాఖాపవిత్రమా! నీవు శత సంఖ్యాకములుగను, సహస్ర సంఖ్యాకములుగను కుంభియందు పడుచున్న క్షీరధారలకు శోధక మగుచున్నా వని శ్రుతి చెప్పినది. (అనేన=ఈ చెప్పుటచే, అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) ప్రాణేష్వేవ=ప్రాణములందే, ఆయుః=ఆయువును, దధాతి=ఉంచినవాఁ డగుచున్నాఁడు. ఏతత్=ఇది, సర్వత్వాయ=ఆయుస్సంపూర్ణత్వముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ''శతాయుర్భవ'' ''సహస్రాయుర్భవ'' అని యీ విధముగ ఆశీర్వాదము లోకమునందు ప్రసిద్ధ మైనది. ఆ యాశీర్వాదము అపమృత్యు పరిహారముచే ఆయువుయొక్క సంపూర్ణత్వముకొఱకు సంపన్న

మగుచున్నది. మంత్రగతములైన శత సహస్ర శబ్దములచే సూచితమైన యర్థమును ఈ బ్రాహ్మణము స్పష్టీకరించినది. శాఖాపవిత్రము= పలాశ శాఖయందు ఉంచబడిన దర్భమయమైన పవిత్రము.

7. మంత్రము : **త్రివృత్పలాశశాఖాయాం దర్భమయం భవతి ।**

అర్థము : పలాశ శాఖాయామ్=పలాశ శాఖయందు, దర్భమయమ్=దర్భమయమైన పవిత్రము, త్రివృత్=మూడు వరుసలు (పేటలు) కలదిగా, భవతి=ఉండవలెను.

తాత్పర్యము : పలాశ శాఖయందు దర్భమయమైన పవిత్రము ఉండవలెను.

8. మంత్రము : **త్రివృద్వై ప్రాణః । త్రివృతమేవ ప్రాణం మధ్యతో యజమానే దధాతి । సౌమ్యః పర్ణః సయోనిత్వాయ। సాక్షాత్పవిత్రం దర్భాః ।**

అర్థము : ప్రాణః=ప్రాణము, త్రివృత్ వై=మూడు వృత్తులు కలదియే. ప్రాణమ్=ప్రాణ వాయువును, త్రివృతమేవ=మూడు వృత్తులు కలదానినిగానే, యజమానే=యజమానునియందు, మధ్యతః=మధ్యభాగమున, దధాతి=స్థాపించినవాడగుచున్నాడు. పర్ణః=పలాశము, సయోనిత్వాయ=కారణమైన సోమునియొక్క అనుమతికొఱకు, సౌమ్యః=సోమ (దేవతాకము) సంబంధి యగుచున్నది. దర్భాః=దర్భలు, సాక్షాత్=సాక్షాత్తుగానే (స్వయముగనే), పవిత్రమ్=శుద్ధి హేతువులు.

తాత్పర్యము : ప్రాణవాయువు ప్రాణాపానవ్యాన నామకములైన ఊర్ధ్వధోమధ్య వృత్తి లక్షణములైన అవాంతరభేదములచే త్రివృత్తు అగుచున్నది. పలాశము కార్యము. సోముడు కారణము. కార్యమైన పలాశమునందు కారణమైన సోముని అనుమతియే సయోనిత్వము. అందుకొఱకే ఇచట పలాశశాఖాయందాదరము. దర్భలు మాత్రము స్వయముగనే శుద్ధి హేతువులు. కాని, ద్రవ్యాంతర సంపాదనముచేత కాదు. ఈ విషయము సంధ్యావందనాది శాస్త్రములందు ప్రసిద్ధము. శాఖాపవిత్రముయొక్క నిర్మాణ ప్రకారము కల్పసూత్రమునందు ఈ విధముగ చూపబడినది:- ''త్రివృద్దర్భమయం పవిత్రం కృత్వా వసూనాం పవిత్రమసీతి శాఖాయాగ్ం శిథిల మవస్యజతి మూలే మూలాన్యగ్రేఽగ్రాణి న గ్రన్థిం కరోతి''. =దర్భలను మూడు వరుసలు కల పవిత్రముగాచేసి దానిని ''వసూనాం పవిత్రమసి'' అని ఉచ్చరించుచు శాఖయందు శిథిలమైనదిగా విడువవలెను. దర్భల మొదళ్లను మొదళ్లతోను, అగ్రములను అగ్రములతోను కలుపవలెను. ముడిని వేయరా దని దీని యర్థము.

9. మంత్రము : **ప్రాక్సాయమధినిదధాతి । తత్ప్రాణాపానయో రూపమ్ । తిర్యక్ప్రాతః । తద్దర్శస్య రూపమ్ । దార్శ్యగ్ం హ్యేతదహః । అన్నం వై చన్ద్రమాః । అన్నం ప్రాణాః । ఉభయ మేవోపైత్యజామిత్వాయ । తస్మాదయగ్ం సర్వతః పవతే ।**

అర్థము : సాయమ్=అమావాస్యనాటి సాయంకాలమున, (దోహన సమయమునందు) ప్రాక్=దర్భమయ పవిత్రమును ప్రాగగ్రములు కలదిగా, అధినిదధాతి=కుంభీ ముఖమునందు ఉంచవలెను. తత్=అది, ప్రాణాపానయోః =ప్రాణాపాన వాయువులయొక్క రూపము. ప్రాతః=ప్రతిపత్తునందు ప్రాతఃకాలమున (దోహన సమయమున) తిర్యక్=అడ్డముగా, అధినిదధాతి=కుంభీ ముఖమునందు ఉంచవలెను. తత్=అది, దర్శస్య=అమావాస్యయొక్క, రూపమ్=రూపము. ఏతత్ అహ్నః=ఈ అహస్సు, దార్శ్యం హి=దర్శిసంబంధి కదా! చన్ద్రమాః=చంద్రుడు, అన్నం వై=అన్నస్వరూపుడే. ప్రాణాః=ప్రాణములు, అన్నమ్=అన్నరూపములు. ఉభయమ్=ఈ పూర్వోక్తవిధముగ చేసిన యతడు, అన్న ప్రాణముల రెండింటిని, ఉపైత్యేవ=నిశ్చయముగ పొందుచున్నాడు. ఏతత్=ఇది, అజామిత్వాయ=ఆలస్యము లేకుండుటకై, భవతి=అగుచున్నది. తస్మాత్=ఆ కారణమువలన, అయమ్=ఈ వాయువు, సర్వతః=అంతటను, పవతే=వీచుచున్నాడు.

తాత్పర్యము : పూర్వోక్త శాఖాపవిత్రమునకు కాలభేదముచే కుంభీముఖమునందు స్థాపన ప్రకార భేదము నీ బ్రాహ్మణము విధించుచున్నది. అమావాస్య దినమునందు సాయందోహమున కుంభికి ఉపరిభాగమున శాఖాపవిత్రమును ప్రాగగ్రముగాను, పశ్చాన్ముఖముగాను ఉంచవలెను. అట్లు చేయగా ప్రాణాపాన సదృశమగును. ప్రాణ వాయువు పూర్వరూపమైన ముఖద్వారమునందు బయలువెడలుచున్నది. అపాన వాయువు పశ్చిమ రూపమైన అధోద్వారమందు మలమును తొలగించుచున్నది. కనుక సాదృశ్యము కలదు. ప్రతిపత్తునందు ప్రాతర్దోహమున శాఖాపవిత్రమును తిర్యక్కుగా ఉంచవలెను. ప్రాగగ్రము దీర్ఘ మగుటవలన ఉదగగ్రము తిర్యగగ్ర మగుచున్నది. అది దర్శనవిషయుడైన చంద్రునితో సదృశ మగుచున్నది. చంద్రుడు శుక్లపక్షమున ద్వితీయాది తిథులందు దక్షిణోత్తరవర్తి శృంగద్వయోపేతుడై కనబడుచున్నాడు కదా! ప్రతిపత్తునందు చంద్రుడు కనబడకున్నను ఒకకళతో చంద్రోత్పత్తి కలుగుచున్నదని శాస్త్రప్రసిద్ధి ఉండుటచే దర్శన యోగ్యుడగుటవలన ఈ అహస్సు చంద్ర దర్శన సంబంధి యగుచున్నది. చంద్ర ప్రాణ రూపత్వమున ప్రయోజనము లేదని అనరాదు. చంద్రుడు ప్రాణము అన్నరూపులు కనుక ప్రయోజనము కలదు. ఓషధుల ననుగ్రహించుచున్న చంద్రుడు ఆ ఓషధులద్వారా అన్నరూపుడగుచున్నాడు. ప్రాణము అన్నముచే వృద్ధి నొందుచుండుటవలన అన్నరూప మగుచున్నది. సాయంప్రాతఃకాలముల రెండింటియందును శాఖాపవిత్రమును ప్రాగగ్రముగానే ఉంచరాదా? అని అనరాదు. ఆలస్యము లేకుండుటకై విలక్షణములైన ప్రాగగ్రత్వమును, ఉదగగ్రత్వమును, ఉభయమును చేయవలయును. ఆలస్యము అవశ్యము త్యజింపదగినది. కనుక వాయువు అనలసుడై సర్వదేశములందు, సర్వకాలములందును వీచుచున్నాడు.

10. మంత్రము :**హుతః స్తోకో హుతో ద్రప్స ఇత్యాహ ప్రతిష్ఠిత్యై । హవిషో వ్యస్కన్దాయ । న హి హుతగ్ం స్వాహాకృతగ్ం స్కన్దతి ।**

అర్థము : ''హుతః స్తోకో హుతో ద్రప్స ఇత్యాహ''='అల్ప బిందువు, ప్రౌఢబిందువును నాక నామకుడును, స్వర్గవాసియు, ప్రౌఢుడునగు అగ్నికొఱకు హుత మగుటగాక' యని శ్రుతి చెప్పినది. ప్రతిష్ఠిత్యై=ఇది

ప్రతిష్ఠకొఱకగుచున్నది. హవిషః=హవిస్సుయొక్క, అస్కన్దాయ=జాఱకుండుటకై, భవతి=అగుచున్నది. హుతమ్=హుతమై, స్వాహాకృతమ్=స్వాహాకారముతో అర్పించబడిన హవిస్సు, న స్కన్దతి హి=జారిపడుట లేదు కదా!

తాత్పర్యము : అల్ప బిందువు స్తోకమనియు, ప్రౌఢ బిందువు ద్రప్స మనియు అర్థము. ఆ యుభయము నాకనామకుఁడును, స్వర్గవాసియు, ప్రౌఢుఁడునగు అగ్నికొఱకు హుత మగుఁగాక అని శ్రుతి చెప్పినది. ఇచట హుత శబ్దప్రయోగమువలన క్షీరబిందువు హవిస్సుగా ప్రతిష్ఠిత మగుచున్నది. అందువలన స్కన్నదోషము లేదని ఈ బ్రాహ్మణము చెప్పుచున్నది. హుతమును, స్వాహాకృతమునైన హవిస్సు స్కన్న మగుటలేదు. (స్కన్నము=జాఱినది.) హవిస్సును అగ్నియందు ఉంచుటను హుత మని యందురు. దేవతోద్దేశ పూర్వకముగ త్యాగ వాచక స్వాహాశబ్ద ప్రయోగముచే విషయీకృతము స్వాహాకృత మని యందురు.

11. మంత్రము :దివి నాకో నామాగ్నిः తస్య విప్రుషో భాగధేయమ్ । అగ్నయే బృహతే నాకాయేత్యాహ। నాకమేవాగ్నిం భాగధేయేన సమర్ధయతి ।

అర్థము : దివి=ద్యులోకమునందు, నాకः నామ=నాక నామకుఁడైన, అగ్నిः=అగ్ని, అస్తి=కలఁడు. తస్య=ఆ అగ్నికి, విప్రుషः=ఉదక బిందువులు, భాగధేయమ్=హవిస్సుగా ఈయఁదగిన భాగము, బృహతే=ప్రౌఢుఁడైన, నాకాయ అగ్నయే=నాక నామకుఁడైన అగ్నికొఱకు, ఇతి=అని, ఆహ=శ్రుతి చెప్పినది. భాగధేయేన=సమర్పితమైన భాగముచేత, నాకమ్ అగ్నిమ్ ఏవ=నాక నామకాగ్నినే, సమర్ధయతి=సమృద్ధునిగా చేసినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము నాకీయములైన ఉదక బిందువులకు హోమము ఉపపాదించుచున్నది. ద్యులోకమునందు నాక నామకుఁడైన అగ్ని కలఁడు. అతనికి ఉదక బిందువులు హవిర్భాగము. 'ప్రౌఢుఁడైన నాకాగ్నికొఱకు' అని మంత్రము చెప్పుటచే అధ్వర్యుఁడు నాకీయ భాగముచేతనే నాకాగ్నిని సమృద్ధునిగాఁ జేసినవాఁడగుచున్నాఁడు.

12. మంత్రము :స్వాహా ద్యావాపృథివీభ్యా మిత్యాహ। ద్యావాపృథివ్యో రేవైన త్ప్రతిష్ఠాపయతి ।

అర్థము : ''స్వాహా ద్వావాపృథివీభ్యామిత్యాహ''=ద్యావాపృథువులకొఱకు సమర్పించఁబడిన దగుఁగాక యని శ్రుతి చెప్పినది. ద్యావాపృథివోయ్ः=ద్యావాపృథువులకై, ఏనత్=ఈ హవిస్సు, ప్రతిష్ఠాపయతి =ప్రతిష్ఠింపఁజేయుచున్నది.

తాత్పర్యము : నాకాగ్నియొక్క భాగము ద్యావాపృథువులకు ఎట్లు ఈయఁబడినది? అను ప్రశ్నకు ఈ బ్రాహ్మణము సమాధానము చెప్పుచున్నది:- ఆ ద్యావాపృథువులకు నాకాగ్నికివలె భోక్తృత్వము లేదు. కాని, స్థితి కాధారము లగుటచే పాలకత్వము కలదని ఈ బ్రాహ్మణము చెప్పినది.

13. మంత్రము :**పవిత్రవత్యానయతి । అపాం వైవౌషధీనాం చ రసగ్ం సగ్ంసృజతి । అథో ఓషధీష్వేవ పశూన్ప్రతిష్ఠాపయతి ।**

అర్థము : పవిత్రవతీ=దర్భమయ పవిత్రములతో కూడిన రెండు సాంనాయ్య పాత్రములను(కుంభములను), ఆనయతి=క్షీరసేచనమునకై తీసికొనిరావలెను. అపాం చ=ఉదకములయొక్కయు, ఓషధీనాం చ=ఓషధులయొక్కయు, రసమ్=రసమును, సంసృజతి=బాగుగ విడచుచున్నవాఁ డగుచున్నాఁడు. అథో=మఱియు, ఓషధీష్వేవ=ఓషధులందే, పశూన్=పశువులను, ప్రతిష్ఠాపయతి=ప్రతిష్ఠింపఁజేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము దర్భపవిత్ర సహిత పాత్రమునందు క్షీరసేచనమును విధించుచున్నది. క్షీరసేచనమునకై అధ్వర్యుఁడు దర్భపవిత్ర సహితములైన రెండు సాంనాయ్య పాత్రములను తీసికొనిరావలెను. ఆ అధ్వర్యుఁడు ఉదకములయొక్కయు, ఓషధులయొక్కయు రసమును సాంనాయ్య పాత్రమునందు విడువవలెను (విడచినవాఁ డగుచున్నాఁడు). మఱియు ఓషధులందే పశువులను ప్రతిష్ఠింపఁజేసినవాఁ డగుచున్నాఁడు. వర్షధారలతో వచ్చిన ఉదకములయొక్క రసము దర్భ. గోవులు భక్షించిన ఓషధులయొక్క రసము క్షీరము. ఈ ఉభయము ఇచట సంసృష్ట మగుచున్నది. మఱియు అధ్వర్యుఁడు దర్భోపలక్షితములైన ఓషధులందు క్షీరోపలక్షితములైన పశువులను ప్రతిష్ఠింపఁజేసినవాఁ డగుచున్నాఁడు.

14. మంత్రము :**అన్వారభ్య వాచం యచ్ఛతి । యజ్ఞస్య ధృత్యై ।**

అర్థము : అన్వారభ్య=అధ్వర్యుఁడు క్షీరపాత్రమును పట్టుకొని, వాచం యచ్ఛతి=వాక్కును నియమించవలెను (మౌనముగా నుండవలెను). ఏషః=ఈ వాజ్నియమము, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ధృత్యై=ధారణము కొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : అధ్వర్యుఁడు క్షీరపాత్రమును పట్టుకొని మౌనముగా నుండవలెను. ఇది యజ్ఞముయొక్క ధృతికి సంపన్న మగును. ఈ బ్రాహ్మణము దోహన కాలమందు కుంభీ స్పర్శన పూర్వకముగ మౌనమును వహించవలెనని విధించినది.

15. మంత్రము :**ధారయన్నాస్తే । ధారయన్త ఇవ హి దుహన్తి ।**

అర్థము : ధారయన్=పవిత్రమును ధరించుచు, ఆస్తే=కూర్చుండవలెను. ధారయన్తః ఇవ=లౌకికులైన దోగ్ధలు పాత్రమును పట్టుకొనినవారువలె, దుహన్తి హి=పాలు పితుకుచున్నారు కదా!

తాత్పర్యము : అధ్వర్యుఁడు పాలుపితుకు సమయమున పవిత్రమును ధరించి యుండవలెను. లోకమునందు పాలు పితుకువారు ఎడమ చేతితోఁగాని, జానువులతో (మోకాళ్లతోఁ) గాని క్షీరపాత్రమును ధరించియే పాలు పితుకుచున్నారు కదా! ఆ విధముగ అధ్వర్యుఁడు పవిత్రమును ధరించుచునే పాలుపితుకుటకై కూర్చుండవలెను. ఇచట పవిత్ర ధారణము విధించఁబడినది. ''కుమ్భీ మన్వారభ్య వాచం యచ్ఛతి. పవిత్రం

వా ధారయన్నాస్తే.'' క్షీరపాత్రమును పట్టుకొని మౌనముగా నుండవలెను. లేదా పవిత్రమును ధరించుచు కూర్చుండవలెనుని కల్పసూత్రము కుంభీస్పర్శ పవిత్రధారణముల వికల్పమును చెప్పినది.

16. మంత్రము :కామధుక్ష ఇత్యాహా ఽఽతృతీయస్యై । త్రయ ఇమే లోకాః ఇమానేవ లోకాన్యజమానో దుహే।

అర్థము : ''కామధుక్ష ఇత్యాహాఽఽతృతీయస్యై''=ఉన్న గోవులలో ఏ గోవును పాలు పితికినవాడవగు చున్నావు? అని దోగ్ధను కూర్చి ప్రశ్నించవలెను. ఆతృతీయస్యై=తృతీయ లోకపర్యంతము ఈ ప్రశ్న వర్తించు చున్నది. ఇమే లోకాః=ఈ భూరాది లోకములు, త్రయః=త్రిసంఖ్యాకములు(మూడు). ఇమాన్ లోకానేవ=ఈ ముల్లోకములనే, యజమానః=యజమానుడు, దుహే(దోగ్ధి)=పితకుచున్నాడు.

తాత్పర్యము : గోవును పాలు పితికి క్షీరకుంభమునొద్దకు క్షీరమును తెచ్చుచున్నదోగ్ధను ప్రశ్నించవలెనని ఈ బ్రాహ్మణము విధించుచున్నది. గోవు భూరాది లోకముల రూప మగుటవలన, పాలు పితుకవలసిన గోవులు మూడు ఉండుటవలనను, ముల్లోకముల దోహము ఇచట లభ్యమగుచున్నది.

17. మంత్రము :అమూమితి నామ గృహ్ణాతి । భద్రమేవా ఽఽస్యాం కర్మా ఽఽవిష్కరోతి ।

అర్థము : అమూమ్ ఇతి=ఈ గోవును అని, నామ=గోవుయొక్క వ్యావహారిక నామమును, గృహ్ణాతి=గ్రహించ వలెను(చెప్పవలెను). అనేన=ఈ నామ గ్రహణముచేత, ఆసామ్=ఈ గోవులయొక్క, భద్రమేవ కర్మ=బహుక్షీర ప్రదాన లక్షణమైన కర్మనే, ఆవిష్కరోతి=ఆవిష్కరింపజేసినవాడగుచున్నాడు.

తాత్పర్యము : దోగ్ధయొక్క సమాధానము ఇచట విధించబడుచున్నది. లోకమునందు గో స్వాములు తమ గోవులను గంగ, యమున, సరస్వతీత్యాది విధముగసంకేతములతో (పేర్లతో) పిలుచుకొనుచుందురు. కనుకపూర్వోక్త ప్రశ్నకు దోగ్ధ (పాలు పితుకునట్టి అధ్వర్యుడు) వేలితో నిర్దేశించి ఈ గోవును అని ఆ గోవుయొక్క వ్యవహార నామమును చెప్పవలెను. తత్తన్నామ గ్రహణమువలన ఈ గోవులయొక్క బహుక్షీర ప్రదాన లక్షణమైన కర్మ ఆవిష్కృత మగును. లేదా- ''కామధుక్షః ప్ర ణో బ్రూహీన్ద్రాయ హవిరిన్ద్రియమ్,'' ''అమూం యస్యాం దేవనాం మనుష్యాణాం పయో హితమ్.'' అను రెండు మంత్రములు అచ్ఛిద్రకాండము నందు ఆమ్నాతము లైనవి. ప్రశ్నోత్తర వాక్యములచేత ఆ మంత్రములలోని 'కామధుక్షః,' 'అమూమ్' అను పదములను ప్రతీకములనుగా గ్రహించవలెను.

18. మంత్రము :సా విశ్వాయుః సా విశ్వవ్యచాః సా విశ్వకర్మేత్యాహ। ఇయం వై విశ్వాయుః । అన్తరిక్షం విశ్వవ్యచాః । అసౌ విశ్వకర్మా । ఇమానేవైతాభి ర్లోకాన్యథాపూర్వం దుహే।

అర్థము : ''సా విశ్వాయుః సా విశ్వవ్యచాః సా విశ్వకర్మేత్యాహ''='ఆ గోవు సమస్తమైన ఆయువు కలది. ఆ గోవు విశ్వముయొక్క వ్యాప్తి కలది. ఆ గోవు సమస్త కర్మలు కలది' అని శ్రుతి చెప్పినది. ఇయం వై=ఈ భూమియే, విశ్వాయుః=సమస్తమైన ఆయువు కలది. అన్తరిక్షమ్=అంతరిక్షము, విశ్వవ్యచాః=విశ్వముయొక్క వ్యాప్తి

కలది. అసౌ=దివి(ద్యులోకము), విశ్వకర్మా=సమస్తములైన కర్మలు కలది. ఏతాభిః=ఈ గోవులచే, ఇమాన్ లోకానేవ=ఈ భూరాది లోకములనే, యథాపూర్వమ్=పూర్వోక్త విధముగ, దుహే(దుగ్ధే)=పితుకు చున్నాఁడు.

తాత్పర్యము : పృథివ్యంతరిక్ష ద్యులోక దేవతలు వరుసగ విశ్వాయురాది గుణములను కలిగియుండుటవలన తదభేదముగ మూఁడు గోవులు ఇచట స్తుతించఁబడినవి. మిగిలిన తాత్పర్యము స్పష్టము.

19. మంత్రము :అథో యథా ప్రదాత్రే పుణ్యమాశాస్తే। ఏవ మేవైనా ఏతదుపస్తౌతి। తస్మాత్ప్రాదా దిత్యున్నీయ వన్దమానా ఉపస్తువన్తః పశూన్దుహన్తి।

అర్థము : అథో=మఱియు, ప్రదాత్రే=ఎక్కువగా దానము చేసినవానికై, యథా=ఏ విధముగ, పుణ్యమ్=ఆశీస్సును, ఆశాస్తే=కోరుచున్నాఁడో, ఏవమేవ=ఈ విధముగానే, ఏనాః=ఈ గోవులను, ఏతత్=ఈ మంత్రముచే, ఉపస్తౌతి=అధ్వర్యుఁడు స్తుతించుచున్నాఁడు. తస్మాత్=ఆ కారణమువలన, ప్రాదాత్ ఇతి ఉన్నీయ=నిన్నటి దినమున ఆవు బాగుగ పాలు ఇచ్చినదని నిశ్చయించి, వన్దమానాః=నమస్కరించుచు, ఉపస్తువన్తః= దగ్గఱ స్తుతించు చున్నవారై, పశూన్=పశువులను, దుహన్తి=పాలు పితుకుచున్నారు.

తాత్పర్యము : లోకమునందు అధికముగ ధనము నొసఁగిన రాజును ''చిరం జీవ'' (చాలకాలము జీవించుము) అని పురోహితుఁడు ఆశీర్వదించుచున్నాఁడు. ఆ విధముగానే అధ్వర్యుఁడు గోవులు అధికముగ క్షీరము నొసఁగుటచే సంతుష్టుఁడై ''సా విశ్వాయుః'' ఇత్యాది మంత్రముచే ఆశీర్వాదము చేయుచున్నాఁ డనెడి అభిప్రాయాంతరమును ఈ బ్రాహ్మణము చెప్పినది. శాస్త్రీయ దోహనమునందు స్తుతి ఆమ్నాతమైనది కనుక, లౌకిక దోహనమునందు కూడ పూర్వదినమున అధికముగ క్షీరము నిచ్చినదని నిశ్చయించి పాలు పితుకునట్టి గోస్వాములు చేతులతో నమస్కరించి, నా తల్లివి కదా!, నా యక్కవు కదా!, అని యీ విధముగ గోవులను స్తుతించుచు పాలు పితుకుచున్నారు.

20. మంత్రము :బహు దుగ్ధీన్ద్రాయ దేవేభ్యో హవిరితి వాచం విసృజతే। యథాదేవతమేవ ప్రసౌతి। దైవ్యస్య చ మానుషస్య చ వ్యావృత్త్యై।

అర్థము : హే దోగ్ధః!=ఓ దోగ్దా!, త్వమ్=నీవు, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, దేవేభ్యః=తదనుచరులైన దేవతల కొఱకును, బహు=బహు క్షీర రూపమైన, హవిః=హవిస్సును, దుగ్ధి=పితుకుచున్నావు. ఇతి=అని, వాచం విసృజతే=వాక్కును విడువవలెను(చెప్పవలెను.) అనేన=ఈ వాగ్విసర్జనముచే, యథాదేవతమేవ=ఆ యా దేవతల కనుగుణముగనే, ప్రసౌతి=ప్రేరణ చేసినవాఁ డగుచున్నాఁడు. ఏతత్=ఇది, దైవ్యస్య చ=ఇతర దేవతా సంబంధమైన క్షీరముయొక్క, మానుషస్య చ=మనుష్య సంబంధియైన క్షీరముయొక్కయు, వ్యావృత్త్యై= వ్యావృత్తి కొఱకు, భవతి=అగుచున్నది. దోగ్ధా=పాలు పితుకువాఁడు.

తాత్పర్యము : ప్రథమకాండములోని మంత్రములలో ఆమ్నాతము కానట్టి ఒకానొక మంత్రము నుత్పాదింపఁజేసి ఆ మంత్రము వినియోగము ఇచట చెప్పబడుచున్నది. పాలుపితుకునట్టి ఓ అధ్వర్యూ! నీవు ఇంద్రునకు, తదనుచరులైన దేవతలకును సరిపోవు నంతటి బహుక్షీర రూప హవిస్సును సంపాదించుటకు పితుకుచున్నావనెడి వాక్కును యజమానుఁడు పలుకవలెను. ఇట్లు చెప్పుటవలన ఇంద్రునకు, తదనుచరులైన దేవతలకు మాత్రము ప్రేరణ చేసినవాఁడగును. తదితర దేవతల సంబంధి క్షీరము, మనుష్యులు పొందఁదగు క్షీరమును ఈ సంపాదించఁబడిన క్షీరములో చేరనట్లు వ్యావృత్తి కలుగుచున్నది.

కల్పమునందు మాత్రము అచ్ఛిద్రకాండోక్తమును, తత్సమానార్థమునైన మంత్రము వినియుక్తమైనది. ''బహు దుగ్ధిన్వాయ దేవేభ్యో హవ్య మాప్యాయతాం పునః. వత్సేభ్యో మనుష్యేభ్యః పునర్దోహాయ కల్పతామితి త్రిర్వాచం విసృజేత్.'' ఇది అచ్ఛిద్రకాండములోని మంత్రము. ఈ బ్రాహ్మణమునందలి ''బహు గుగ్ధిన్వాయ దేవేభ్యః'' అను భాగము పై మంత్రమునకు ప్రతీకమునుగా కూడ గ్రహింపవచ్చును.

21. మంత్రము :**త్రిరాహ । త్రిషత్యా హి దేవాః ।**

అర్థము : త్రిః ఆహ=పై మంత్రమును ఆవృత్తిచే మూఁడు మారులు పలుకవలెను. దేవాః=దేవతలు, త్రిషత్యాః హి=మూఁడు మారులు పలుకఁగా సత్యత్వ బుద్ధి కలవారు కదా! త్రిరుక్తం సత్యత్వబుద్ధిః యేషాం తే, త్రిషత్యాః.

తాత్పర్యము : ఇచట మంత్రావృత్తి విధించఁబడుచున్నది. దేవతలు మూఁడు మారులు పలుకఁగా సత్యత్వ బుద్ధి కలవారు (మూఁడు మారులు పలుకుటవలన) విశ్వసించువారు కనుక పై మంత్రమును ఆవృత్తి చేసి మూఁడు మారులు పలుకవలెను.

22. మంత్రము :**అవాచంయమో కనన్వారభ్యోత్తరాః అపరిమిత మేవావరున్ధే ।**

అర్థము : అవాచంయమః=వాఙ్నియతి (మౌనము) లేనివాఁడై, అనన్వారభ్య=సాంనాయ్య పాత్రమును స్పృశించక, ఉత్తరాః=పూర్వోక్త గో త్రయముకంటె అధికములైన గోవులను, దుహ్యాత్=పాలు పితుకవలెను. అనేన=ఈ దోహనముచే, అపరితమేవ=పరిమితి లేని(అధిక) క్షీరమునే, అవరున్ధే=పొందుచున్నాఁడు.

తాత్పర్యము : మౌనము, కుంభీ స్పర్శనము లేకుండనే మూఁడు గోవులకంటె అధికములైన గోవులను పాలు పితుకవలెనని ఈ బ్రాహ్మణము విధించుచున్నది. వాచంయమ మనఁగా మౌనము. అధ్వర్యుఁడు మౌన రహితుఁడై పాలకుంభమును స్పృశించకయే మూఁడు గోవులకంటె అధిక గోవులను పాలు పితుకవలెను. ఈ దోహనముచే అపరిమితముగనే క్షీరమును పొందును. ఉత్తరములైన గోవులయొక్క దోహనమునందుఁగూడ బహు దేవ సహితుఁడైన ఇంద్రునికై అపరిమితముగ క్షీరము సంపాదిత మగునని యర్థము.

'తూష్ణీ ముత్తరా దోహయిత్వా' - మంత్రరహితముగ ఉత్తర గోవులను పాలుపితికి అని అమంత్రక దోహనము కల్పసూత్రమునందు చూపబడినది.

23.మంత్రము :**న దారుపాత్రేణ దుహ్యేత్ । అగ్నివద్వై దారుపాత్రమ్ । యద్దారుపాత్రేణ దుహ్యేత్ । యాతయామ్నా హవిషా యజేత ।**

అర్థము : దారుపాత్రేణ=కొయ్యతో నిర్మితమైనపాత్రముచే, న దుహ్యేత్=పాలు పితుకరాదు. దారుపాత్రమ్=దారు పాత్రము, అగివత్ వై=అగ్ని సహిత మైనదియే. దారుపాత్రేణ=దారుపాత్రముతో, దుహ్యేత్ యత్=పాలు పితుకుచో, యాతయామ్నా హవిషా=గతసారమైన హవిస్సుతో, యజేత=యాగము చేసినవాడగును.

తాత్పర్యము : ఇచట దారుపాత్రము పూర్వపక్షముగ నిషేధించబడుచున్నది. దారుపాత్రము అగ్నిసహితమే కావున దారుపాత్రముతో పాలు పితుకరాదు. దారుపాత్రముతో పాలు పితుకుచో అతడు సారము పోయిన హవిస్సుతో యాగము చేసినవాడగును. అనగా:- పూర్వము దారువునందు అగ్ని గూఢముగా ఉండి మంథనముచే అభివ్యక్త మగును. కనుక అట్టిదారువుతో చేయబడిన పాత్రము అగ్నివత్తే యగుచున్నది. ఆ దారుపాత్రముతో పాలు పితుకుచో ఆ దారువునందలి అగ్నిచే క్షీరము గ్రహించబడుటవలన హవిస్సు గతసారమే యగు నని యర్థము. ఇది పూర్వపక్షము.

24. మంత్రము :**అథో ఖల్వాహుః । పురోడాశముఖాని వై హవీగ్ంషి । నేత ఇతః పురోడాశగ్ం హవిషో యామో కస్తీతి ।**

కామమేవ దారుపాత్రేణ దుహ్యేత్ ।

అర్థము : అథో=పూర్వపక్షానంతరము, ఆహుః ఖలు=అభిజ్ఞులు ఈ విధముగ చెప్పిరి కదా! హవీంషి=యజ్ఞము నందలి హవిస్సులు, పురోడాశ ముఖాని వై=పురోడాశము ప్రధానముగా గలవియే. ఇతః ఇతః పురోడాశమ్= పురోడాశముకంటె అత్యంతము అర్వాచీనమైన, హవిషః=హవిస్సునకు, యామః=సారము, అస్తీతి న=ఉంటున్నదనుట లేదు. కామమేవ=స్వేచ్ఛగానే, దారుపాత్రేణ=దారుపాత్రముతో, దుహ్యేత్= దోహనము చేయవలెను.

తాత్పర్యము : ఇచట సిద్ధాంతపరముగ దారుపాత్రము విధించబడుచున్నది. పూర్వపు నిషేధవాదులు హవిస్సుయొక్క తత్త్వమును తెలియనివారు. అందువలన తద్వ్యావృత్తికై అథో శబ్దము ఉపాత్త మైనది. అభిజ్ఞులు మాత్రము ఈ విధముగ చెప్పుచున్నారు. లోకమునందు అపూపము, అన్నము మున్నగునవి ఆకలిని పోగొట్టునవిగా ఉన్నవి కనుక ఆ అపూపాన్నాదులు ఋన్నివారకములుగ ప్రాధాన్యము కలిగియున్నవి. దధి క్షీరాదులు వానికి సహకారకములుగనే గ్రహించబడుచున్నవి. అందువలన యాగములందుగూడ పురోడాశ చరు మాంసములే సారవంతములైన హవిస్సులు. అంతియ కాని, చరు పురోడాశాదులకంటె అత్యంతము అర్వాచీనమైన క్షీరాది హవిస్సునకు సారము లేదు. కనుక సారము అగ్నిచే స్వీకరించబడుచున్న దనుట సరియైనది కాదు. అందువలన దారుపాత్ర దోహనము విరుద్ధము కాదు.

25. మంత్రము :**శూద్ర ఏవ న దుహ్యేత్ । అసతో వా ఏష సంభూతః । యచ్ఛూద్రః । అహవిర్దేవతదిత్యాహుః ।**

యచ్ఛూద్రో దోగ్ధీతి ।

అర్థము : శూద్రః ఏవ=శూద్రజాతీయుఁడే, న దుహ్యేత్=దోహనము చేయరాదు. శూద్రః యత్= శూద్రుఁడు ఎవఁడు కలఁడో, ఏషః=ఈ శూద్రుఁడు, అసతః=అధమావయవమైన పాదమునుండి, సంభూతః వా=పుట్టినవాఁడు, కదా! శూద్రః=శూద్రుడు, యత్ దోగ్ధితి=దేనిని దోహనము చేయుచున్నాడో, తత్=అది, అహవిః ఏవ ఇతి=హవిస్సు కానిదియే అని, ఆహుఃకొందఱు చెప్పుచున్నారు.

తాత్పర్యము : మఱియొక పూర్వపక్షము ఇచట చూపఁబడుచున్నది:- శూద్రుఁడు విరాట్పురుషుని యొక్క అధమావయవమైన పాదమునుండి పుట్టినవాఁ డగుటచే శూద్రుఁడే దోహనము చేయరాదు. శూద్రుఁడు పితికిన క్షీరము హవిస్సు కానేరదని కొందఱు చెప్పుచున్నారు. ఇది పూర్వపక్షము.

26. మంత్రము :అగ్నిహోత్రమేవ న దుహ్యేచ్ఛూద్రః । తద్ధి నోత్పునన్తి । యదా ఖలు వై పవిత్ర మత్యేతి ।

అథ తద్ధవిరితి।

అర్థము : శూద్రః=శూద్రుఁడు, అగ్నిహోత్రమేవ=అగ్నిహోత్రమునే, న దుహ్యేత్=దోహనము చేయరాదు (మథించరాదు). తత్=ఆ అగ్నిహోత్రమును, న ఉత్పునన్తి హి=త్రిరావృత్తిచే ఉత్పవనము (శుద్ధి) చేయుట లేదు. కదా! యదా ఖలు వై=ఎప్పుడైతే, పవిత్రమ్=శుద్ధిని, అత్యేతి=అతిశయముగ పొందుచున్నదో, అథ=అందువలన, తత్=అది, హవిరితి=హవిస్సని, ఆహుఃఅభిజ్ఞులు చెప్పుచున్నారు.

తాత్పర్యము : ఇచట సిద్ధాంతము చెప్పఁబడుచున్నది. శూద్రుఁడు అగ్నిహోత్రమునే దోహనము చేయరాదు (మథించరాదు). ఉత్పవన మనఁగా- హవిస్సునందు దర్భపవిత్రము నుంచి ముందుకు వెనుకకు మంత్రపూర్వకముగ కదలించుట. అట్లు చేయుటవలన ఆ హవిస్సునకు శుద్ధి యేర్పడునని శ్రుతియే చెప్పుచున్నది. అగ్నిహోత్రమునకు అట్టి ఉత్పవనము లేదు కనుక శూద్రుఁడు అగ్నినే మథించరాదు. క్షీరాది హవిస్సునకు ఉత్పవనముచే శుద్ధి కలదు కనుక శూద్రుఁడు క్షీరమును పితుకవచ్చు నని అభిజ్ఞులు సిద్ధాంతీకరించినారు.

27. మంత్రము :సంపృచ్యధ్వ మృతావరీరిత్యాహ । అపాం చైవౌషధీనాం చ రసగ్ం సగ్ం సృజతి । తస్మాదపాం చౌషధీనాం చ రసముపజీవామః।

అర్థము : ''సంపృచ్యధ్వ మృతావరీ రిత్యాహ''='క్షాళన సామర్థ్యవంతములైన ఓ ఉదకములారా! కుంభియందలి క్షీరముతో కలసికొనుఁడు'- అని శ్రుతి చెప్పినది. అపాం చ=ఉదకములయొక్కయు, ఓషధీనాం చ=ఓషధులయొక్కయు, రసమ్=రసమును, సంసృజతి=సంపృక్తము చేసినవాఁడగుచున్నాఁడు. (కలుపవలెను). తస్మాత్=ఆ కారణమువలన, అపాం చ=ఉదకములయొక్కయు, ఓషధీనాం చ=ఓషధులయొక్కయు, రసమ్ ఉపజీవామఃరసము నాధారముగాఁగొని జీవించుచున్నాము.

తాత్పర్యము : మంత్రమునందలి సత్యవాచియైన ఋత శబ్దముచే జలమునందు అవశ్యంభావియైన క్షాలన సామర్థ్యము

ఉపలక్షించcబడుచున్నది. 'సామర్థ్యోపేతములైన ఓ ఉదకములారా! మీరు క్షీరపాత్రమునందలి క్షీరముతో సంపృక్తములు కండు-' అని '' సంపృచ్యధ్వ మృతావరీః'' అను మంత్రము చెప్పుటచే అధ్వర్యుcడు ఉదక రసమును ఓషధుల రసమును సంపృక్తము చేసినవాc డగుచున్నాcడు. దోహపాత్ర క్షాలనముచే ఉదకముల రసము స్వాదుతమ మగును. క్షీరపాత్రమునందలి క్షీర స్వరూపమే గోవులు భక్షించిన ఓషధుల రసము. ఆ రస ద్వయము క్షీరపాత్రమునందు సంసృష్టమైనది. ఈ ఉభయ రస మేళనము ప్రశస్తమైనది కనుక, మనమందఱము ఆ రసద్వయము నాధారముగcగొని జీవించుచున్నాము. ఇది లోకప్రసిద్ధము.

ఈ విషయమునే విశదీకరించి ఛాందోగ్యోపనిషత్తు ఈ విధముగ చెప్పుచున్నది:- ''అన్నమశితం త్రేధా విధీయతే. తస్య యఃస్థవిష్ఠో ధాతు స్తత్పురీషం భవతి. యో మధ్యమ స్తన్మాగ్ంసం, యోఽణిష్ఠ స్తన్మనఃు. ఆపఃు పీతా స్త్రేధా విధీయన్తే. తాసాం యఃస్థవిష్ఠోధాతు స్తన్మూత్రం భవతి. యో మధ్యమ స్తల్లోహితం, యోఽణిష్ఠఃు స ప్రాణఃు'' (ఛాం.6.5.1) ఇతి..-భుక్తమైన అన్నము మూcడు విధములుగ పరిణామము చెందుచున్నది. దానిలోని స్థవిష్ఠమైన ధాతువు పురీష మగుచున్నది. మధ్యమమైన ధాతువు మాంస మగుచున్నది. అణిష్ఠ (అల్ప) మైన ధాతువు మనస్సు అగుచున్నది. త్రాగిన నీరు కూడ మూcడు విధములుగపరిణమించుచున్నది. ఆ త్రాగిన ఉదకమునందలి స్థవిష్ఠ ధాతువు మూత్రమగుచున్నది. మధ్యమ ధాతువు రక్త మగుచున్నది. అణిష్ఠ ధాతువు ప్రాణ మగుచున్నదని ఆ ఉపనిషద్వాక్యార్థము.

28. మంత్రము :**మన్ద్రా ధనస్య సాతయ ఇత్యాహ। పుష్టిమేవ యజమానే దధాతి ।**

అర్థము : ''మన్ద్రా ధనస్య సాతయ ఇత్యాహ''='హర్ష హేతువులైన ఉదకములారా! మీరు సాంనాయ్య లక్షణ ధనముయొక్క లాభముకొఱకు క్షీరముతో సంపృక్తములు కండు' అని శ్రుతి చెప్పినది. అనేన=దీనిచే యజమానే=యజమానునియందు, పుష్టిమేవ=పుష్టినే, దధాతి=స్థాపించినవాcడగుచున్నాcడు.

తాత్పర్యము : ఇది ''సంపృచ్యధ్వమృతావరీః'' అను మంత్రముయొక్క శేష భాగము. 'మన్ద్రా' అను పదము ఉదకములకు విశేషణము. ఈ మంత్రమును అధ్వర్యుcడు పఠించుచు దోహనము చేయునపుడు ఉదకములతో దోహపాత్రమును క్షాలనము చేయును. ఇట్లు చేయుటవలన అధ్వర్యుcడు యజమానునియందు పుష్టినే స్థాపించినవాc డగును.

29. మంత్రము :**సోమేన త్వాకతనచ్మీన్ద్రాయ దధీత్యాహ। సోమ మేవైనత్కరోతి ।**

అర్థము : ''సోమేన త్వాఽఽతనచ్మీన్ద్రాయ దధీత్యాహ''='ఓ క్షీరమా! దధి రూపమైన సోమరసముచే నిన్ను ఆతంచనము (తోడుపెట్టుట) చేయుచున్నానని అధ్వర్యుcడు అనినట్లు మంత్రము చెప్పినది. ఏనమ్=ఈ సాంనాయ్యమును, సోమమేవ=సోమముగానే, కరోతి=చేయుచున్నవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : ఓ క్షీరమా! నిన్ను దధిరూప సోమముతో తోడుపెట్టుచున్నాను. దధి రూప సోమమే ఈ సాంనాయ్యమును చేయును. పితికిన పాలను కాcచి, పిమ్మట దానిని శీతలము చేసి, అనంతరము దధితో తోడుపెట్టవలెనని కల్పసూత్రము వివరించినది. ఇచట సోమశబ్దముచే ముఖ్యమైన సోమమును పరిత్యజించి ఎందువలన దధి ఉపలక్షించcబడినది? అను ప్రశ్న కలుగుచున్నది. ఆతంచన ద్రవ్యములు అనేకములు కలవు. ఒక్కొక్క

దేవతకు ఒక్కొక్క ఆతంచన ద్రవ్యముతో తోడుపెట్టుట ఇష్టముగా నుండుననియు, ఇంద్రునకు దధితో తోడుపెట్టుట ఇష్ట మనియు బ్రాహ్మణాంతరమునఁ గలదు. కావున సోమ శబ్దముచే దధి ఉపలక్షిత మైనది. ఇంద్రునకు దధితో తోడుపెట్టుట ఇష్టమైనచో ముఖ్యమైన దధి శబ్దమే మంత్రమునందు ఆమ్నాతము కావచ్చును కదా! దధ్యర్థమున గౌణమైన సోమ శబ్దము ఎందువలన ఆమ్నాత మైనది? అను ప్రశ్నకు ''యో వై సోమం భక్షయిత్వా'' ఇత్యాది బ్రాహ్మణము సమాధానము చెప్పుచున్నది:-

30. మంత్రము :**యో వై సోమం భక్షయిత్వా సంవత్సరగ్ం సోమం న పిబతి । పునర్భక్ష్యో ఽస్య సోమపీథో భవతి ।**

సోమః ఖలు వై సాంనాయ్యమ్ । య ఏవం విద్వాన్థ్సాంనాయ్యం పిబతి । అపునర్భక్ష్యో ఽస్య

సోమపీథో భవతి ।

అర్థము : యఃవై=ఏ పురుషుఁడైతే, సోమం భక్షయిత్వా=సోమమును భక్షించి(త్రాగి), సంవత్సరమ్=సంవత్సరకాలము (వఱకు), సోమమ్=సోమమును, న పిబతి=త్రాగుట లేదో, అస్య=ఇతనియొక్క, సోమపీథఃత్రాగఁదగినదిగా విహితమైన సోమము, పునఃమఱల, భక్ష్యఃభక్షింపఁదగినది(త్రాగఁదగినది). సోమఃవై=సోమమే, సాంనాయ్యం ఖలు=సాంనాయ్యము కదా! యఃఏ పురుషుఁడు, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, సాంనాయ్యం పిబతి=సాంనాయ్యమును త్రాగుచున్నాఁడో, అస్య=ఇతని యొక్క, సోమపీథఃత్రాగఁదగినదిగా విహితమైన సోమము, అపునర్భక్ష్యఃమఱల భక్షింపఁదగినది(త్రాగఁదగినది) కాదు.

తాత్పర్యము : ఏ పురుషుఁడైతే అగ్నిష్టోమ యాగము ననుష్ఠించి ఒక సంవత్సరము గడపి అనంతరము సోమయాగమును చేయఁడో, అతఁడు పూర్వము చెప్పఁబడిన విధముగ సోమశబ్దముచే ఉపలక్షితమైన దధితో తోడుపెట్టఁబడఁగా ఏర్పడిన సాంన్నాయ్యమును భక్షించవలెను. సాంనాయ్యము సోమమే కదా! అనఁగా ఇది సోమీకృతమైనది. ఈ విధముగ తెలిసికొని సాంనాయ్యమును భక్షించిన యతఁడు మఱల సోమమును త్రాగ నవసరము లేదు. ''వసన్తే వసన్తే జ్యోతిషా యజేత'' ప్రతివసంతమునందును జ్యోతిష్టోమము ననుష్ఠించవలెనని శ్రుతి చెప్పుచున్నది. ఒకవేళ ద్రవ్యాభావాది కారణముల వలన మఱల జ్యోతిష్టోమమును చేయలేని పురుషుఁడు జ్యోతిష్టోమము ననుష్ఠించితిననెడి భావనతో ఈబ్రాహ్మణమున చెప్పఁబడిన సోమీకృత సాంన్నాయ్యమును భక్షించినచో ఆ వైకల్యము పరిహృత మగును. స్వయముగ ననుష్ఠించుట కశక్తుఁడైన వానికి అంతటను భావనచే తత్కర్మానుష్ఠాన పూర్తి యగునని బృహదారణ్యకోపనిషత్తునందు స్పష్టీకరించఁబడినది. కనుక సోమభావనచే వైకల్య పరిహారము యుక్తమే అగుచున్నది.

31. మంత్రము :**న మున్మయేనాపిదధ్యాత్ । యన్మున్మయేనాపిదధ్యాత్ । పితృదేవత్యగ్ం స్యాత్ । అయస్పాత్రేణ వా**

దారుపాత్రేణ వా కపిదధాతి । తద్ధి సదేవమ్ ।

అర్థము : మృన్మయేన =మృత్పాత్రముచే, న అపిదధ్యాత్=క్షీరపాత్రముపైని ఉంచరాదు(ఆచ్ఛాదించరాదు). మృన్మయేన= మృత్పాత్రముచే, అపిదధ్యాత్ యత్=ఆచ్ఛాదించినచో, పితృదేవత్యం స్యాత్=పితృదేవతా సంబంధి యగును. అయస్పాత్రేణ వా =లోహ(ఇనుప)పాత్రముచేc గాని, దారుపాత్రేణ వా =కొయ్యతో, జేయcబడిన పాత్రముచేc గాని, అపిదధాతి=పిధానము (ఆచ్ఛాదనము) చేయవలెను. తత్=అది, దైవం హి=దేవతల సంబంధి కదా!

తాత్పర్యము : పూర్వోక్తమైన పయఃకుంభమును మట్టితోc జేయcబడిన పాత్రముచే ఆచ్ఛాదించరాదు. అట్లు చేసినచో అది పితృదేవతల సంబంధి యగును. ఉదకుంభ శ్రాద్ధాదికమునందు పితృదేవతలకు మృత్పాత్రము సిద్ధమై యున్నది. అయస్పాత్రముచేcగాని, దారుపాత్రముచే గాని క్షీరకుంభమును పిధానము చేయవలెను.

32. మంత్రము :**ఉదన్వద్భవతి । ఆపో వై రక్షోఘ్నీ: । రక్షసా మపహత్యై ।**

అర్థము : ఉదన్వత్ భవతి=పిధాన పాత్రము ఉదకముతో కూడినదై యుండవలెను. ఆపఃఉదకములు, రక్షోఘ్నీ: వై=రాక్షసులను నశింపcజేయునవియే. ఉదన్వత్=ఉదక సహిత పిధాన పాత్రము, రక్షసామ్=రాక్షసుల యొక్క, అపహత్యై=నాశముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : క్షీరకుంభమును పిధానము చేయు పాత్రము ఉదక సహితమై యుండవలెను. ఉదకములు రక్షోనాశకములే. ఇది రాక్షస నాశమునకై అగును. ఇచట పిధాన పాత్రమునకు సోదకత్వము విధించcబడినది.

33. మంత్రము :**అదస్తమసి విష్ణవే త్వేత్యాహ। యజ్ఞో వై విష్ణుః । యజ్ఞాయైవైన దదస్తం కరోతి ।**

అర్థము : ''అదస్తమసి విష్ణవే త్వేత్యాహ''=ఓ సాంనాయ్యమా! నీవు క్షీణించనిదాన వగుచున్నావని ''అదస్తమసి విష్ణవే త్వా యజ్ఞాయాపిదధామ్యహమ్। అద్భిరద్భిస్తేన పాత్రేణ యాఃపూతాఃపరిశేరతే''అను అచ్ఛిద్రకాండమునందు చెప్పినది. యజ్ఞఃయజ్ఞము, విష్ణుఃవై=విష్ణుస్వరూపమే. అతఃఈ కారణమువలన, ఏనత్=ఈ సాంనాయ్యమును, యజ్ఞాయైవ=యజ్ఞస్వరూపుడైన విష్ణువుకొఱకే, అదస్తమ్=ఉపక్షీణము కానిదిగా, కరోతి=చేసినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : పిధానముకొఱకు అచ్ఛిద్రకాండమునందలి మంత్రము నుత్పాదింపcజేసి ఈ బ్రాహ్మణము ఆ మంత్రమును వ్యాఖ్యానించుచున్నది. ఓ సాంనాయ్యమా! నీవు క్షీణించనిదాన వని శ్రుతి చెప్పినది. యజ్ఞము విష్ణువు స్వరూపమే. కావున అధ్వర్యుcడు విష్ణు స్వరూపమైన యజ్ఞముకొఱకు ఈ సాంనాయ్యమును క్షీణించనిదానినిగా చేయుచున్నవాc డగుచున్నాcడు. ఈ మంత్రమును పఠించుచు అధ్వర్యుcడు క్షీరకుంభమును పిధానపాత్రముచే పిధానము చేయవలెను.

34. మంత్రము :**విష్ణో హవ్యగ్ం రక్షస్వేత్యాహ గుప్త్యై ।**

అర్థము : ''విష్ణో హవ్యగ్ం రక్షస్వేత్యాహ''= ఓ విష్ణూ! ఈ సాంనాయ్య హవిస్సును రక్షించుమని శ్రుతి చెప్పినది. ఇదమ్=ఈ విష్ణుసంబోధనము, గుప్త్యై =రక్షణముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఇచట 'విష్ణో' అను విష్ణుసంబోధనము హవీరక్షణముకొఱకే కాని, హవిస్స్వీకారముకొఱకు కాదని ఈ బ్రాహ్మణము విశదీకరించినది.

35. మంత్రము :**అనధఃసాదయతి । గర్భాణాం ధృత్యా అప్రపాదాయ । తస్మాద్గర్భాః ప్రజానా మప్రపాదుకాః ।**

ఉపరీవ నిదధాతి । ఉపరీవ హి సువర్గో లోకః । సువర్గస్య లోకస్య సమష్ట్యై ॥

అసీత్యాహ ధృత్యై యజమానే దధాత్యజామిత్వాయ స్థాపయతి దుహే దుహన్తి దుహ్యోద్ధ్వీతి

దధీత్యాహ స్యాత్సాదయతి పఞ్చ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయ ప్రపాఠకే తృతీయోఽనువాకః ॥౩॥

అర్థము : ఈ మంత్రము ప్రథమానువాకమున వ్యాఖ్యానించఁబడినది. ప్రథమానువాకమున పలాశశాఖా విషయమునను, ద్వితీయానువాకమున బర్హిర్విషయమునను, ఇచట సాంనాయ్యవిషయమునను అని గ్రహించవలెను.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ద్వితీయ ప్రపాఠకమునందు తృతీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే
చతుర్థోఽనువాకః

1. మంత్రము : **కర్మణే వాం దేవేభ్యః శకేయ మిత్యాహ శక్త్యై ।**

వేదార్థదీపిక

అవతారిక: ఈ అనువాకమునందలి బ్రాహ్మణభాగము తైత్తిరీయ సంహితలోని ప్రథమ కాండగత ప్రపాఠకస్థ చతుర్థానువాకములోని మంత్రములకు వ్యాఖ్యానాత్మకము. పూర్వోక్తములైన మూడు అనువాకములచేతను పర్వదిన కర్తవ్యము సమాప్తి చేయబడినది. ఇక మిగిలిన పది అనువాకములచేతను ప్రతిపత్తునందు చేయదగినది చెప్పవలసియున్నది. ప్రథమమున ఈ చతుర్థానువాకమున హవిర్నిర్వాప మంత్రములను ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించుచున్నది.

అర్థము : ''కర్మణే వాం దేవేభ్యః శకేయ మిత్యాహ'' = 'ఓ హస్తములారా! దేవతల సంబంధియైన కర్మకొఱకు మిమ్ము ప్రయోగించుటకై (ఉపయోగించుటకై) శక్తుడ నగుదును గాక' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ చెప్పుట, శక్త్యై =శక్తికొఱకు, సంపద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : యజమానుడు ప్రాతరగ్నిహోత్రము ననుష్ఠించిన యనంతరము ఓ హస్తములారా! దేవతల కర్మకొఱకు మిమ్ము ప్రయోగించుటకై సమర్థుడ నగుదును గాక- అను ఈ మంత్రమును పఠించుచు చేతులను ప్రక్షాళనము చేసికొనవలెను. ప్రక్షాళనము చేయకున్నను చేతులకు లౌకిక శక్తి కలదు కనుక, శాస్త్రీయ శక్త్యర్థమైన ఈ మంత్రము ప్రక్షాళన హేతు వగుచున్నది.

2. మంత్రము : **యజ్ఞస్య వై సన్తతిమను ప్రజాః పశవో యజమానస్య సన్తాయన్తే । యజ్ఞస్య విచ్ఛిత్తిమను ప్రజాః పశవో యజమానస్య విచ్ఛిద్యన్తే । యజ్ఞస్య సన్తతిరసి యజ్ఞస్య త్వా సన్తత్యై స్తృణామి సన్తత్యై త్వా యజ్ఞస్యేత్యాహవనీయాత్సన్తనోతి । యజమానస్య ప్రజాయై పశూనాగ్ం సన్తత్యై ।**

అర్థము : యజ్ఞస్య=యజ్ఞముయొక్క, సంతతిమ్ అను వై=విస్తృతిననుసరించియే, యజమానస్య=యజమానుని యొక్క, ప్రజాః=ప్రజలు(సంతానము), పశవః=పశువులు, సంతాయన్తే=ఎక్కువ విస్తరించుచున్నారు. యజ్ఞస్య=యజ్ఞముయొక్క, విచ్ఛిత్తిమ్ అను=విచ్ఛేదము ననుసరించి, యజమానస్య=యజమానుని యొక్క, ప్రజాః=పుత్ర పౌత్రాది ప్రజలు, పశవః=గవాది పశువులు, విచ్ఛిద్యన్తే=విచ్ఛిన్నము లగుచున్నారు. హే ఉలపరాజే!=ఉలపరాజి యనెడి ఓ తృణవిశేషమా!, త్వమ్=నీవు, యజ్ఞస్య=యజ్ఞమునకు, సంతతిః= బాగుగ విస్తారకము, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, సంతత్యై=విస్తృతి కొఱకు, స్తృణామి=పఱచుచున్నాను. త్వా, యజ్ఞస్య, సంతత్యై, ఇతి=అని, ఆహవనీయాత్= ఆహవనీయ

ప్రదేశమునుండి, సంతనోతి=ఉలపరాజి తృణ సముదాయమును విస్తరింపcజేయవలెను. ఏతత్=ఈ విధముగ చేయుట, యజమానస్య=యజమానునియొక్క, ప్రజాయై= సంతానముయొక్క, పశూనామ్=పశువుల యొక్క, సంతత్యై=విస్తృతికొఱకు, సంపద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : సంహితలో లేనిట్టి ఒక మంత్రమును ఉత్పాదింపcజేసి ఈ బ్రాహ్మణము ఆ మంత్రమును తృణాస్తరణమందు (తృణవిశేషమును పఱచుటయందు) వినియోగించుచున్నది:- యజ్ఞముయొక్క విస్తృతి ననుసరించి యజమానుని పుత్ర పౌత్రాది ప్రజలు, గవాది పశువులును విస్తరింతురు. యజ్ఞముయొక్క విచ్ఛిత్తి ననుసరించి విచ్ఛిన్న లగుదురు. ఓ ఉలపరాజి తృణవిశేషమా! నీవు యజ్ఞమును విస్తరింపcజేయుదాన వగుచున్నావు. యజ్ఞవిస్తృతివై నిన్ను పఱచుచున్నాను. ఈ మంత్రమును పఠించుచు గార్హపత్యాగ్ని ప్రదేశమునండి ఆరంభించి ఆహవనీయ ప్రదేశము వఱకు ఉలపరాజు లనెడి తృణములను నేల కనcబడకుండు విధముగ పఱచవలెను. ఉలపము=దట్టముగ అల్లుకొనునట్టి ఒకానొక తీcగ. ఆ తీcగలలో శ్రేష్ఠ మైనది ఉలపరాజి. మంత్రమునందు 'యజ్ఞస్య, త్వా, సంతత్యా' అను పదములు ఆదరార్థమున ద్విరుక్తము లగుటచే భూమి కనcబడకుండు విధముగ తృణములను పఱచవలె ననెడి అర్థము సూచిత మగుచున్నది.

3. మంత్రము : **అపః ప్రణయతి ।**

అర్థము : అపః=ఉదకములను, ప్రణయతి=ప్రణయనము చేయవలెను.

తాత్పర్యము : తృణాస్తరణానంతరము అచట ఉదకములను ప్రణయనము చేయవలెను. (ప్రణయనము=పవిత్రముచే కదలించుట. ఇచట ప్రణయనము విధించcబడినది.)

4. మంత్రము : **శ్రద్ధా వా ఆపః । శ్రద్ధామేవా ऽऽరభ్య ప్రణీయ ప్రచరతి ।**

అర్థము : ఆపః=ఉదకములు, శ్రద్ధా వై=శ్రద్ధా స్వరూపములే. శ్రద్ధామేవ=శ్రద్ధనే, ఆరభ్య=ఆరంభించి, ప్రణీయ=ప్రణయనము చేసి, ప్రచరతి=ప్రణీతోదకములతో పిష్టమును మిశ్రణము చేసినవాc డగుచున్నాఁడు.

తాత్పర్యము : ఉదకములు శ్రద్ధా స్వరూపములే. ప్రణీతోదకములతో పిండిని మిశ్రణము చేసినప్పుడు శ్రద్ధనే ఆరంభించి ప్రణీతోదకములతోపిండిని మిశ్రణము చేసినట్లగును. ఇచట ప్రణయనవిధి అర్థవాదముచే స్తుతించcబడినది. ఉదకములు శ్రద్ధా జనకములు కావున శ్రద్ధగా ఉపచరింపcబడినవి. లోకమునందు స్నానము, ఆచమనము చేసినయతనికి శ్రద్ధాతిశయము కలుగుచుండుట ప్రసిద్ధము.

5. మంత్రము : **అపః ప్రణయతి । యజ్ఞో వా ఆపః । యజ్ఞమేవా ऽऽరభ్య ప్రణీయ ప్రచరతి । అపః ప్రణయతి । వజ్రో వా ఆపః । వజ్రమేవ భ్రాతృవ్యేభ్యః ప్రహృత్య ప్రణీయ ప్రచరతి । అపః ప్రణయతి । ఆపో వై రక్షోఘ్నాః । రక్షసామపహత్యై । అపః ప్రణయతి । ఆపో వై దేవానాం ప్రియం ధామ ।**

దేవానామేవ ప్రియం ధామ ప్రణీయ ప్రచరతి । అపః ప్రణయతి । ఆప్ వై సర్వా దేవతాః ।

దేవతా ఏవాऽऽరభ్య ప్రణీయ ప్రచరతి ।

అర్థము : అపః=ఉదకములను, ప్రణయతి=ప్రణయనము చేయవలెను. ఆపః=ఉదకములు, యజ్ఞః వై=యజ్ఞ స్వరూపములే. ఏవం సతి=ఇట్లు కాగా, యజమానః=ప్రణయనము చేసిన యజమానుడు, యజ్ఞమేవ=యజ్ఞమునే ఆరంభించి, ప్రణీయ=ప్రణయనము చేసి, ప్రచరతి=ఆ ప్రణీతోదకములతో పిండిని మిశ్రణము చేసినవాడగుచున్నాడు. ఆపః=ఉదకములు, వజ్రః వై=వజ్రస్వరూపములే, వజ్రమేవ=వజ్రమే, భ్రాతృవ్యేభ్యః= శత్రువులనుండి, ప్రహృత్య=నిరోధించి కాపాడుతుంది. ప్రణీయ, ప్రచరతి. అపః, ప్రణయతి. ఆపః=ఉదకములు, రక్షోఘ్నైః వై=రక్షోనాశకములే. ఏతత్=ఈ ఉదక ప్రణయనము, రక్షసామ్=రాక్షసులయొక్క, అపహత్యై=నాశముకొఱకు, భవతి=అగుచున్నది. అపః, ప్రణయతి. ఆపః ఉదకములు, దేవానామ్=దేవతలకు, ప్రియం ధామ వై=ప్రియమైన స్థానములే. అసౌ=ఈ ఉదక ప్రణయనము చేసిన యజమానుడు, దేవానాం ప్రియంధామైవ=దేవతలకు ప్రీతిపాత్రమైన స్థానమునే, ప్రణీయ=ప్రణయనము చేసి, ప్రచరతి=పిష్టమును మిశ్రణము చేసినవాడగుచున్నాడు. అపః, ప్రణయతి. ఆపః=ఉదకములు, సర్వాః దేవతాః వై=సర్వ దేవతా స్వరూపములే. అసౌ=ఈ ఉదక ప్రణయనము చేసిన యజమానుడు, దేవతాః ఆరభ్యైవ=దేవతల నారంభించియే, ప్రణీయ=ప్రణయనము చేసి, ప్రచరతి=పిండిని మిశ్రణము చేసినవాడగుచున్నాడు.

తాత్పర్యము : తాత్పర్యము స్పష్టము. పూర్వోక్తమైన ప్రణయనవిధియే మఱల మఱల అనువదించి యిచట స్తుతించబడుచున్నది. యజ్ఞము అభీష్ట స్వర్గ సాధనమైన విధముగ ఉదకములు కూడ అభీష్ట ప్రీత్యాది సాధనము లగుటచే యజ్ఞస్వరూపములుగా వర్ణించబడినవి. ప్రణీతములైన ఉదకములచే పిష్టమును బాగుగ మిశ్రణము చేయుట ప్రచరణ మనబడును. వజ్రము శత్రువును వారించువిధముగ ఉదకములు కూడ శత్రువును వారించుచున్నవి కనుక ఉదకములు వజ్రరూపములుగా వర్ణింపబడినవి. ఉదకములకు రక్షోఘ్నత్వము పూర్వమే చెప్పబడినది. వర్షోదకము దేవతలకు ప్రియధామమైన ద్యులోకమునుండి పుట్టుటచే అవి ప్రియ ధామములుగా వర్ణించబడినవి. దేవతలు అగ్నిని ప్రవేశించి తద్భావమును పొందిరను విషయము ఈ శ్రుతివలన తెలియుచున్నది:- ''దేవాసురాఃసంయత్తా ఆయన్. తే దేవా బిభ్యతోఽగ్నిం ప్రావిశన్. తస్మాదాహురగ్నిఃసర్వా దేవతా ఇతి.'' పూర్వము దేవతలు అసురులు యుద్ధ సన్నద్ధులైరి. ఆ దేవతలు భయపడినవారై అగ్నిని ప్రవేశించిరి. దేవత లందఱు అగ్నిని ప్రవేశించుటవలన అగ్ని సర్వదేవతా స్వరూపుడని చెప్పుచున్నారు.

ఆ యగ్ని ఉదకములందు ప్రవేశించెనని యీ శ్రుతి చెప్పుచున్నది- ''స నిలాయత. సోఽపఃప్రావిశత్.'' ఆ యగ్ని పారిపోయెను. అతడు ఉదకములందు ప్రవేశించె నని యీ శ్రుత్యర్థము. అందువలన ఉదకములు సర్వదేవతా స్వరూపములుగా వర్ణించబడినవి. బ్రాహ్మణాంతరమునుండి కూడి ఉదకములకు సర్వదేవతాత్వమును తెలిసికొనవచ్చును.

6. మంత్రము : **వేషాయ త్వోత్యాహ। వేషాయ హ్యేనదాదత్తే ।**

అర్థము : ''వేషాయ త్వేత్యాహ''=ఓ శూర్పమా! నిన్ను యజ్ఞముకొఱకు తీసికొనుచున్నా నని శ్రుతి చెప్పినది. వేషాయ=యజ్ఞముకొఱకు, ఏనత్=ఈ శూర్పమును, ఆదత్తే హి=అధ్వర్యుడు తీసికొనుచున్నాడు కదా! శూర్పము=చేట (చెరిగెడు సాధనము).

తాత్పర్యము : ఓ శూర్పమా! నిన్ను యజ్ఞముకొఱకు గ్రహించుచున్నానని శ్రుతి చెప్పనది. స్రుగ్యము, కపాలములు, అగ్నిహోత్రహవణి, శూర్పము మున్నగునవి యజ్ఞాయుధములుగా చెప్పబడినవి. ధాన్యమును దంచునప్పుడు చెరుగుటకై శూర్పము యజ్ఞమునందు ఉపయోగించబడును.

7. మంత్రము : ప్రత్యుష్టగ్ం రక్షః ప్రత్యుష్టా అరాతయ ఇత్యాహ। రక్షసా మపహత్యై ।

అర్థము : ''ప్రత్యుష్టగ్ం రక్షః ప్రత్యుష్టా అరాతయ ఇత్యాహ''=రక్షోజాతి నశింపజేయబడినది. శత్రువులు నశింపజేయబడినా రని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, రక్షసామ్=రాక్షసులయొక్క, అపహత్యై=నాశముకొఱకు, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : యజ్ఞార్థమైన శూర్పమును ఆహవనీయమునందుc గాని, గార్హపత్యమునందుc గాని వెచ్చపెట్టవలెను. ఆ సమయమున ఈ మంత్రమును పఠించవలెను. ఇట్లు చేయుటవలన ఆ శూర్పమునందు అంతర్లీనముగ ఉన్నటువంటి రాక్షసులు, శత్రువులు నశింతురని ''ప్రత్యుష్టగ్ం రక్షః'' ఇత్యాది శ్రుతి చెప్పినది. ఇది రాక్షసుల నాశమునకై సంపన్న మగును.

8. మంత్రము : ధూరసీత్యాహ। ఏష వై ధుర్యో కగ్నిః । తం యదనుపస్పృశ్యాతీయాత్ । అధ్వర్యుం చ యజమానం చ ప్రదహేత్ । ఉపస్పృశ్యాత్యేతి । అధ్వర్యోశ్చ యజమానస్య చాప్రదాహాయ ।

అర్థము : ''ధూరసీత్యాహ''=ఓ యగ్నీ! నీవు హింసకుడవగుచున్నావని శ్రుతి చెప్పినది. ఏషఃవై=ఇతడే, ధుర్యఃఅగ్నిఃబరువును మోయునట్టి అగ్ని. తమ్=ఆ యగ్నిని, అనుపస్పృస్య=స్పృశించక, అతీయాత్ యత్=అతిక్రమించునెడల, అధ్వర్యుంచ=అధ్వర్యుని, యజమానంచ=యజమానుని కూడ, ప్రదహేత్=అధికముగ దహించును. ఉపస్పృశ్య=అగ్నిని దగ్గఱ స్పృశించి, అత్యేతి=అతిక్రమించి వెళ్లవలెను. ఏతత్=ఈ అగ్నిని తాకివెళ్లుట, అధ్వర్యోఃచ=అధ్వర్యునియొక్కయు, యజమానస్యచ=యజమానునియొక్కయు, అప్రదాహాయ=దహింపకుండుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : వ్రీహి రూపమైన హవిస్సును మోయునట్టి శకటముయొక్క కాడియందు (ఎద్దు మోయునట్టి ప్రదేశమునందు) ఒకానొక హింసకుడైన అగ్ని ఉండునని శాస్త్ర ప్రసిద్ధి కలదు. ఆ యగ్ని ఇచట ప్రార్థించబడుచున్నాడు. ఓ యగ్నీ! నీవు హింసకుడవగుచున్నావని మంత్రము చెప్పినది. ఈ యగ్నియే బరువును మోయునట్టి వాడు. అట్టి అగ్నికి ఆధారమైన కాడిని చేతితో తాకక ముందుకు వెళ్లినచో ఆ యగ్ని అధ్వర్యుని, యజమానుని కూడ అధికముగ దహించును. ఆ యగ్నిని స్పృశించి ముందుకు పోవుటవలన అధ్వర్యు యజమానులకు అగ్నిదాహము జరుగదు. ఇచట శాస్త్ర ప్రసిద్ధ వహ్నికాధారమైన బండికాడిని స్పృశించుట విహితమైనది.

9. మంత్రము : **ధూర్వ తం యో ఽస్మాన్ధూర్వతి తం ధూర్వ యం వయం ధూర్వామ ఇత్యాహ । ద్వౌ వావ పురుషౌ ।**

యం చైవ ధూర్వతి । యశ్చైనం ధూర్వతి । తావుభౌ శుచా కర్పయతి ।

అర్థము : ''ధూర్వ తం యోఽస్మాన్ధూర్వతి తం ధూర్వ యం వయం ధూర్వామ ఇత్యాహ''='ఓ యగ్నీ! యాగమునకు విఘ్నము చేయుటమూలమున మమ్ము హింసించునట్టి ఆ శత్రువును నశింపజేయుము. మఱియు మేము హింసించునట్టి ఆలస్యాది రూప వైరిని కూడ నశింపజేయుము' అని శ్రుతి చెప్పినది. ద్వౌ వావ పురుషౌ=ఈ మంత్రమునందు ఇద్దఱు పురుషులే చెప్పబడిరి. యం చైవ ధూర్వతి=యజమానుడు ఎవనినైతే హింసించునో, యశ్చ ఏనం ధూర్వతి=ఏ రాక్షసుడైతే ఈ యజమానుని యాగవిఘ్నము మూలమున హింసించుచున్నాడో, తౌ ఉభౌ=ఆ శత్రువుల నుభయులను, శుచా=దుఃఖముతో, అర్పయతి=కలుపుచున్నాడు.

తాత్పర్యము : మంత్ర తాత్పర్యము స్పష్టము. ''తం ధూర్వ'' అను వాక్యములు పునరుక్తము లనెడి భ్రమ కలుగుచున్నది. ఈ బ్రాహ్మణము ఆ పౌనరుక్త్య భ్రమను తొలగించుచున్నది. ఇచట ఇద్దఱు పురుషులు కలరు. ఒకడు యజమానునిచే హింసింపబడు పాపరూప శత్రువు. ఇంకొకడు యాగమునకు విఘ్నమును కల్పించుట మూలమున యజమానుని హింసించునట్టి రాక్షసుడు. ఈ విధముగ అగ్నిని ప్రార్థించుటచే యజమానుడు ఆ శత్రువుల నుభయులను శోకనిమగ్నులనుగ చేయుచున్నాడు.

10. మంత్రము :**త్వం దేవానామసి సస్నితమం పప్రితమం జుష్టతమం వహ్నితమం దేవహూతమ మిత్యాహ।**

యథాయజురేవైతత్ ।

అర్థము : ''త్వం దేవానామసి సస్నితమం పప్రితమం జుష్టతమం వహ్నితమం దేవహూతమ మిత్యాహ''=ఓ శకటమా! నీవు దేవతల సంబంధి వగుచున్నావు. అందువలన మిక్కిలి శుద్ధమును, ప్రీతులతో అధికముగ నిండినదానవును, అత్యంతప్రియమైనదానవును, హవిస్సును అధికముగ మోయుదానవును, అత్యంతము దేవతల నాహ్వానించుదానవు నగుచున్నావని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, యథాయజుర్వేద=యజుస్సు (మంత్రము) ననుసరించినదియే. అనగా మంత్రార్థము స్పష్టముగా నున్నదని యర్థము.

తాత్పర్యము : ''త్వందేవానామసీ'' త్యాది మంత్రముయొక్క ప్రథమభాగముయొక్క అర్థము స్పష్టముగా నున్నదని ఈ బ్రాహ్మణము చెప్పినది.

11. మంత్రము :**అహ్రుతమసి హవిర్ధాన మిత్యాహానార్త్యై ।**

అర్థము : అహ్రుతమసి హవిర్ధాన మిత్యాహానార్త్యై =ఓ శకటమా! నీవు వ్రీహి భారముచే కలిగెడి వక్రత్వము లేనిదానవును, హవిస్సును వహించుదానవు నగుచున్నా వని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, అనార్త్యై =ఆర్తి లేకుండుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : పూర్వోక్త మంత్రముయొక్క ద్వితీయ భాగమునందు వ్రీహిభార ప్రయుక్తమైన శైథిల్యము వారించబడు చున్నదని ఈ బ్రాహ్మణము వివరించినది. మంత్ర తాత్పర్యము స్పష్టము.

12. మంత్రము :**దృగ్ంహస్వ మా హ్వారిత్యాహ ధృత్యై ।**

అర్థము : ''దృగ్ంహస్వ మా హ్వారిత్యాహ''=ఓ శకటమా! దృఢమవు కమ్ము. భగ్నము కావల దని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, ధృత్యై=ధైర్యముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఓ శకటమా! నీవు దృఢమవు కమ్ము. భగ్నము కాగలదని శ్రుతి చెప్పినది. ఇట్లు చెప్పుట ధైర్యముకొఱకు సంపన్న మగుచున్నది. మంత్రముయొక్క ఈ తృతీయభాగమునందు అధ్వర్యుడు స్వయముగ శకటము నారోహించుటకై ధైర్యము సంపాదించబడుచున్నదని ఈ బ్రాహ్మణము వివరించినది.

13. మంత్రము :**మిత్రస్య త్వా చక్షుషా ప్రేక్ష ఇత్యాహ మిత్రత్వాయ ।**

అర్థము : ''మిత్రస్య త్వా చక్షుషా ప్రేక్ష ఇత్యాహ''=ఓ వ్రీహి సమూహమా! జగన్మిత్రుడైన సూర్యునియొక్క చక్షువుతో నిన్నుఁ జూచుచున్నా నని శ్రుతి చెప్పినది. మిత్రత్వాయ=మిత్రత్వముకొఱకు, ఏతత్ సమ్పద్యతే=ఇది సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : ఓ వ్రీహి సమూహమా! జగత్తునకు మిత్రుడైన సూర్యునియొక్క చక్షువుతో నిన్నుఁ జూచుచున్నానని శ్రుతి చెప్పినది. ఇది అనుకూలమైనదను బుద్ధిని కలిగించుటకై మంత్రమునందు మిత్రశబ్దము ప్రయుక్తమైనది.

14. మంత్రము :**మా భేర్మా సంవిక్థా మా త్వా హిగ్ంసిష మిత్యాహ హిగ్ంసాయై ।**

అర్థము : ''మా భేర్మా సంవిక్థా మా త్వా హిగ్ంసిష మిత్యాహ''=ఓ వ్రీహి సమూహమా! భయపడవలదు. కంపించవలదు. నేను నిన్ను హింసించ నని అధ్వర్యుడు వ్రీహి సమూహము నుద్దేశించి పలికినట్లు శ్రుతి చెప్పినది. హింసాయై=భయ కంపములు హింస నుద్దేశించి ఏర్పడుచున్నవి.

తాత్పర్యము : భయము, కంపము కూడ హింసయొక్క అవాంతరభేదము లనెడి అభిప్రాయముతో ఈ విధముగ చెప్పఁబడిన దని ఈ బ్రాహ్మణము 'హింసాయై' అను పదముచే సూచించినది.

15. మంత్రము :**యద్వై కించ వాతో నాభివాతి । తత్సర్వం వరుణదేవత్యమ్ । ఉరు వాతాయేత్యాహ। అవారుణ మేవైనత్కరోతి।**

అర్థము : వాతః వాయువు, యద్వై కించ=ఏ కొంచెమైనను, న అభివాతి=అంతటను వీచుటలేదో, తత్ సర్వమ్=అది యంతయు, వరుణదేవత్యమ్=వరుణ దేవతాకము, భవతి=అగుచున్నది. అతః=ఇందువలన, ''ఉరు వాతాయేత్యాహ''='ఓ కరిష్యమాణ ద్వారమా! నీవు వాయుప్రవేశమునకై విస్తీర్ణమవు కమ్ము' అని శ్రుతి

చెప్పినది. అనేన=ఈ చెప్పుటచే, అధ్వర్యుఃఅధ్వర్యుడు, ఏనత్=ఈ వ్రీహి రూప హవిస్సును, అవారుణమేవ=వరుణ దేవతాకము కానిదానినిగానే, కరోతి=చేయుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : వ్రీహి సమూహమునకు పైని ఆచ్ఛాదకముగానున్నటువంటి తృణాదులను తొలగించు నపుడు ద్వారము వంటిది ఏర్పడును. ఆ ద్వారము ఇచట సంభోధించబడినది. వాయు సంచారము లేని ద్రవ్యము వరుణ దేవతాక మగును. ఆ ద్వారమును వాయుప్రవేశమునకై విస్తీర్ణము కమ్మని చెప్పుటచే అధ్వర్యుడు ఈ వ్రీహి రూప హవిస్సునకు వరుణ స్వామికత్వమును వాయువుచే నివర్తింపజేసినవాడగుచున్నాడు. ఏ ద్రవ్యము ఆవృతమై యుండుటచే వాయువుచే స్పృశించబడదో, ఆ ద్రవ్యవ్యమునకు ఆవరకుడుగా ఉన్నట్టి వరుణుడు స్వామి యగును. ఆ స్వామిత్వము వాయువుచే నివర్తించబడుచున్నదని యర్థము. హవిస్సునకై ధాన్యమును గోతమునందు పోసి ఆ గోతమును శకటముపైనుంచి ఆ శకటమును యజ్ఞశాల యొద్దకు తీసికొనివచ్చి అందలి కొంతధాన్యమును చెరుగుటకై భూర్పములో (చేటలో) పోయునపుడు ఆ గోతము ముడిని ఊడదీయుదురు. ఆ సందర్భమున ఈ మంత్రము చెప్పబడినది.

16. మంత్రము :**దేవస్య త్వా సవితుః ప్రసవ ఇత్యాహ ప్రసూత్యై । అశ్వినోర్బాహుభ్యామిత్యాహ । అశ్వినౌ హి దేవానా మధ్వర్యూ ఆస్తామ్ । పూష్ణో హస్తాభ్యామిత్యాహ యత్యై । అగ్నయే జుష్టం నిర్వపామీత్యాహ। అగ్నయ ఏవైనాజుష్టం నిర్వపతి ।**

అర్థము : ''దేవస్య త్వా సవితుః ప్రసవ ఇత్యాహ ప్రసూత్యై। అశ్వినోర్బాహుభ్యా మిత్యాహ। అశ్వినౌ హి దేవానా మధ్వర్యూ ఆస్తామ్ । పూష్ణో హస్తాభ్యా మిత్యాహ యత్యై।''-ఈ బ్రాహ్మణ భాగము ద్వితీయా నువాకారంభమున వ్యాఖ్యానించబడినది. అచట బర్హిస్సును కోయుటకై 'అశ్వపర్శువు' అను కత్తిని చేతులలోనికి తీసికొను నపుడు ఈ మంత్రము అమ్నాత మైనది. ఇచట శకటముపైని ఉన్నటువంటి ధాన్యమును చేటలో పోయుటకై చేతులలోనికి తీసికొను నపుడు ఈ మంత్రము చెప్పబడినది. అచట అశ్వపర్శువు సంబోధించబడినది. ఇచట వ్రీహిసముదాయము(ధాన్యము) సంబోధించబడినది.

''అగ్నయే జుష్టం నిర్వపామీత్యాహ''=ఓ ధాన్యమా! అగ్నికొఱకు ప్రియమగునట్లుగా నిన్ను భూర్పమునందు ఉంచుచున్నానని మంత్రము చెప్పినది. ఏనామ్=ఈ వ్రీహులను(ధాన్యమును), అగ్నయే ఏవ=అగ్నికొఱకే, జుష్టమ్=ప్రియమగునట్లుగా, నిర్వపతి=నిర్వాపము చేయుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : అగ్నికొఱకు ఇష్టమగునట్లుగా నిర్వాపము చేయుచున్నానని చెప్పుటచే అధ్వర్యుడు ఈ వ్రీహులను (ధాన్యమును) అగ్నికొఱకే ఇష్టమైన హవిస్సు నిర్వాపము చేయుచున్నవాడగుచున్నాడు.

17. మంత్రము :**త్రిర్యజుషా । త్రయ ఇమే లోకాః । ఏషాం లోకానామాప్త్యై । తూష్ణీం చతుర్థమ్ । అపరిమిత మేవావరున్ధే ।**

అర్థము : త్రిః=మూcడు మారులు, యజుషా=మంత్రముచే, నిర్వపేత్=ధాన్యమును భూర్పమునందు ఉంచవలెను. ఇమే లోకాః=ఈ భూరాది లోకములు, త్రయః=త్రిసంఖ్యాకములు. ఏతత్=ఈ మూcడు మారులు నిర్వాపము చేయుట, ఏషాం లోకానామ్ ఆప్త్యై =ఈ మూcడు లోకముల ప్రాప్తికొఱకు, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది. చతుర్థమ్=నాల్గవ పర్యాయము, తూష్ణీమ్=మంత్ర రహితముగ నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. అపరిమితమేవ=అపరిమితమునే, అవరున్ధే=పొందును.

తాత్పర్యము : చేటయందు ధాన్యమును మూcడు మారులు మంత్రపఠనము చేయుచు నిర్వాపము చేయవలెను. భూరాది లోకములు మూcడు. మూcడు మారులు నిర్వాపము చేయుటవలన యజమానునకు ముల్లోకముల ప్రాప్తి కలుగును. నాల్గవ పర్యాయము మంత్రపఠన రహితముగ నిర్వాపము చేయవలెను. దీనివలన అపరిమిత ఫలమునే పొందును.

18. మంత్రము :స ఏవ మేవానుపూర్వగ్ం హవీగ్ంషి నిర్వపతి ।

అర్థము : సం=ఆ అధ్వర్యుcడు, ఏవమేవ=ఈ విధముగనే, ఆనుపూర్వమ్=ఆనుపూర్వముగ, హవీంషి=వ్రీహి రూప హవిస్సులను, నిర్వపతి=నిర్వాపము చేయవలెను.

తాత్పర్యము : ''దేవస్య త్వా సవితుః'' అను మంత్రభాగముతో ఉపక్రమించి ''జుష్టం నిర్వపామి'' అను మంత్ర భాగముతో ముగించి, ఈ మధ్యమున '' అగ్నీషోమాభ్యామ్'' అని ప్రయోగించవలెను. 'ఆనుపూర్వమ్' అని బ్రాహ్మణము ఈ యర్థమునే తెలియcజేసినది.

19. మంత్రము :ఇదం దేవానా మిదము నః సహేత్యాహ వ్యావృత్త్యై ।

అర్థము : ''ఇదం దేవానామిదము నః సహేత్యాహ''='ఈ భూర్పమునందు ఉంచcబడిన హవిర్ధాన్యము దేవతలకే. శకటమునందు మిగిలియున్న హవిర్ధాన్యము దేవతలతో కూడ మాకు'అని మంత్రము చెప్పినది. ఏతత్=ఈ విధముగ చెప్పుట, వ్యావృత్త్యై =రెండు భాగములకు సాంకర్యము లేకుండుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : భూర్పమునందు నిరుప్తమైన (ఉంచcబడిన) ఈ హవిర్ధాన్యము దేవతలకే భాగము. శకటమునందు మిగిలియున్న హవిర్ధాన్య మైనచో దేవతలకు మాకుcగూడ భాగము. ఇంకను మున్ముందు మేము యాగములను చేయుదుము కావునను, ఆ యాగములందు హవిస్సును భక్షింతుము కావునను శకటమున మిగిలియున్న హవిర్ధాన్యము దేవతలతోcగూడ మాకును అని చెప్పcబడినది. ఈ రెండు విధములైన భాగములకు వ్యావృత్తికై సాంకర్యము లేకుండుటకై ''ఇదం దేవానా'' మిత్యాదికము మంత్రద్వయమని ఈ బ్రాహ్మణము తెలియcజేసినది.

20. మంత్రము :స్ఫాత్యై త్వా నారాత్యా ఇత్యాహ గుప్త్యై ।

అర్థము : ''స్ఫాత్యై త్వా నారాత్యా ఇత్యాహ''=ఓ హవిర్ధాన్యమా! నిన్ను అభివృద్ధికొఱకు అభిమంత్రించు చున్నాను. అభివర్ధనము దానము చేయకుండుటకై కాదు. దేవతల కొసcగుటకొఱకే యని మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, గుప్త్యై =రక్షణముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ''స్కాత్యై త్వా '' అను మంత్రము హవిస్సు క్రిందపడి నశింపకుండునట్లు రక్షణమునకై చెప్పబడినదని ఈ బ్రాహ్మణమున 'గుప్యై' అని ఆమ్నాత మైనది.

21. మంత్రము :**తమసీవ వా ఏషోఽన్తశ్చరతి యః పరీణహా । సువరభి విఖ్యేషం వైశ్వానరం జ్యోతిరిత్యాహ ।**

సువరేవాభి విపశ్యతి వైశ్వానరం జ్యోతిః ।

అర్థము : యః=ఎవడైతే, పరీణహా=ఆచ్ఛాదించుచున్నాడో, ఏషః=ఇతడు, తమసీవ వా=తమస్సునందువలెనే, అన్తః=లోపల, చరతి=సంచరించుచున్నాడు. ''సువరభి విఖ్యేషం వైశ్వానరం జ్యోతిరిత్యాహ''= స్వర్గసాధన మగుటచే స్వర్గరూప సర్వయాగ ప్రదేశమును అంతటను విశేషముగ చూచుచున్నాను. ఆహవనీయాగ్నిని స్వర్గ ప్రకాశక జ్యోతిస్స్వరూపమునుగా చూచుచున్నా నని అధ్వర్యుడు పలికినట్లు శ్రుతి చెప్పినది. వైశ్వానరం జ్యోతిః=వైశ్వానర జ్యోతిస్స్వరూపమైన, సువరేవ=స్వర్గమునే, అభి విపశ్యతి=అంతటను విశేషముగ చూచుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : శకటముపైని కటవేష్టితమైన చీకటి గల ప్రదేశమునందు ఉన్నటువంటిదానికి బహిరవలోకనము కూడ అపేక్షిత మని ఈ బ్రాహ్మణము చెప్పుచున్నది.

22. మంత్రము :**ద్యావాపృథివీ హవిషి గృహీత ఉదవేపేతామ్ । దృగ్ంహన్తాం దుర్యా ద్యావాపృథివ్యోరిత్యాహ।**

గృహాణాం ద్యావాపృథివ్యోర్ధృత్యై ।

అర్థము : హవిషి=హవిస్సు, గృహీతే సతి=గ్రహించబడిన దగుచుండగా, ద్యావాపృథివీ=ద్యావాభూములు, ఉదవేపేతామ్=ఎక్కువగా కంపించినవి. ''దృగ్ంహన్తాం దుర్యా ద్యావాపృథివ్యో రిత్యాహ''=ఇహలోక పరలోకములందు మా గృహములు దృఢము లగుగాక యని అధ్వర్యుడు ప్రార్థించినట్లు శ్రుతి చెప్పినది. ఇయమ్=ఈ ప్రార్థన, ద్యావాపృథివ్యోఃద్యావాభూములందలి, గృహాణామ్=గృహములయొక్క, ధృత్యై=దార్ఢ్యముకొఱకు, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : ఇహలోక పరలోకములందలి మా గృహములు దృఢము లగుగాక యని అధ్వర్యుడు ప్రార్థించినట్లు మంత్రము చెప్పినది. అదార్ఢ్యశంక కలుగుటవలన దార్ఢ్యము ఆశంసనీయమని (కోరదగినదని) ఈ బ్రాహ్మణము చెప్పుచున్నది. హవిస్సు గ్రహించబడగానే ద్యావాభూములు కంపించినవి. కనుక ద్యావాభూములందలి మా గృహములు దృఢము లగుగాక యని అధ్వర్యుడు ప్రార్థించుట ద్యావాభూము లందలి గృహములయొక్క దార్ఢ్యసిద్ధికి సంపన్న మగును. హవిస్సును గ్రహించిన అధ్వర్యుడు దేనిని ఉద్దేశించి సమర్పించునో? అని అజ్ఞానమువలన ద్యావాభూములకు భయముచేత కంపము ప్రాప్తమైనది. ''దృంహన్తామ్''-'దృఢము లగుగాక' యని చెప్పగా ద్యావాభూముల వినాశము హవిష్ప్రదానము నందు ఉద్దేశ్యము కాదను నిశ్చయమువలన ఆ ద్యావాభూములకు ధైర్యము కలుగునని యర్థము.

23. మంత్రము :**ఉర్వన్తరిక్ష మన్వీహీత్యాహ గత్యై ।**

అర్థము : ''ఉర్వన్తరిక్ష మన్వీహీత్యాహ'' = 'ఓ హవిర్ధాన్యమా! విశాలమైన అంతరిక్షము ననుసరించి పొమ్ము' అని అధ్వర్యుని మాటగా శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, గత్యై=గమనమునకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఓ హవిర్ధాన్యమా! నీవు విశాలమైన అంతరిక్షమున వెళ్లుమని అధ్వర్యుడు ఆ ధాన్యమును గైకొనును. వెళ్లుటకొఱకే అధ్వర్యుడు ఈ విధముగ ననెను.

24. మంత్రము :**అదిత్యాస్ట్వోపస్థే సాదయామీత్యాహ। ఇయం వా అదితిః । అస్యా ఏవైనదుపస్థే సాదయతి ।**

అర్థము : ''అదిత్యా స్ట్వోపస్థే సాదయామీత్యాహ'' = ఓ హవిర్ధాన్యమా! నిన్ను భూమియొక్క ఉత్సంగమునందు ఉంచుచున్నానని అధ్వర్యుని మాటగా మంత్రము చెప్పినది. ఇయం వై=ఈ భూమియే, అదితిః=అదితి. అస్యాః ఉపస్థే ఏవ=ఈ భూదేవియొక్క ఉత్సంగమునందే, ఏవత్=ఈ హవిర్ధాన్యమును, సాదయతి=ఉంచినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : మంత్రమునందలి అదితిశబ్దమునకు భూమి అర్థమని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించుచున్నది. ఓ హవిర్ధాన్యమా! నిన్ను అదితియొక్క ఉత్సంగమునందు ఉంచుచున్నానని అధ్వర్యుఁడు చెప్పినట్లు మంత్రము చెప్పినది. ఈ భూమియే అదితి కనుక అధ్వర్యుఁడు ఈ హవిర్ధాన్యమును ఈ భూమియొక్క ఉత్సంగమునందే ఉంచినవాఁ డగుచున్నాఁడు.

25. మంత్రము :**అగ్నే హవ్యగ్ం రక్షస్వేత్యాహ గుప్త్యై ॥**

యజ్ఞో వా ఆపో ధామ ప్రణీయ ప్రచరత్యతీయాదేత ద్బాహుభ్యామిత్యాహ హవీగ్ంషి నిర్వపతి

గత్యై చత్వారి చ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయ ప్రపాఠకే చతుర్థోఽనువాకః ॥౪॥

అర్థము : ''అగ్నే హవ్యగ్ం రక్షస్వేత్యాహ'' = ఓ యగ్నీ! ఈ హవిస్సును రక్షించు మని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, గుప్త్యై =రక్షణముకొఱకు, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : హవిర్ధాన్యమును గార్హపత్యాగ్నికి ఉత్తరపు దిక్కున భూమియందు ఉంచిన యనంతరము ఓ అగ్నీ ఈ హవిర్ధాన్యమును రక్షించుమని అధ్వర్యుఁడు అగ్నిని ప్రార్థించుచున్నాఁడు. ఈ ప్రార్థన హవిస్సుయొక్క రక్షణముకొఱకు సంపన్న మగుచున్నది. ఈ మంత్రమును పఠించుచు అధ్వర్యుఁడు గార్హపత్యాగ్నిని అభిమంత్రించును. ఆ యా మంత్రముల వినియోగములు సంహితా వ్యాఖ్యానమునందే చెప్పఁబడినవి.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ద్వితీయ ప్రపాఠకమునందు చతుర్థానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే

పఞ్చమోఽనువాకః

1. మంత్రము : **ఇన్ద్రో వృత్రమహన్ । సోకపః । అభ్యమ్రియత । తాసాం యన్మేధ్యం యజ్ఞియగ్ం సదేవ మాసీత్ । తదపోదక్రామత్ । తే దర్భా అభవన్ । యద్దర్భైరప ఉత్పునాతి । యా ఏవ మేధ్యా యజ్ఞియాః సదేవా ఆపః । తాభిరేవైనా ఉత్పునాతి ।**

వేదార్థదీపిక

అవతారిక: చతుర్థానువాకమునందు వ్రీహి నిర్వాప మంత్రములకు బ్రాహ్మణము చెప్పఁబడినది. నిరుప్తములైన వ్రీహులందలి పొట్టు రక్షోభాగ మగుటవలన ఆ పొట్టు పోవుటకై వ్రీహ్యవఘాతము (ధాన్యమును దంచుట) పంచమానువాకమునందు చెప్పఁబడుచున్నది. ప్రోక్షించఁబడిన వ్రీహులు అవఘాత యోగ్యము లగుటవలనను, ప్రోక్షణము ఉత్పూతోదక సాధ్య మగుటవలనను, అంగమైన ఉత్పవన మంత్రము అంగియైన ఉత్పవనమునందు ఆకాంక్షా సహితమైయుండుటవలనను, ఉత్పవన మంత్ర వ్యాఖ్యానముకంటె ముందుగానే ప్రథమమున ఉత్పవనము విధించఁబడుచున్నది. ఉత్పవనము=దర్భలను ఉదకములందు ఉంచి మంత్రము నుచ్చరించుచు ముందు వెనుకలకు కదలించుట (శుద్ధిచేయుట).

అర్థము : ఇన్ద్రః=ఇంద్రుఁడు, వృత్రమ్=వృత్రాసురుని, అహనత్=సంహరించెను. సః=ఆ వృత్రుఁడు, అపః అభి=ఉదకములకెదుట, అమ్రియత=మరణించెను. తాసామ్=ఆ ఉదకములలో, యత్=ఏది, మేధ్యమ్=పాప శోధకమును, యజ్ఞియమ్=ద్రవ్య శోధకమును (యజ్ఞార్హమును) అయిన, సదేవమ్=దైవము, ఆసీత్=ఉండెనో, తత్=అది, అపోదక్రామత్=తొలఁగి పోయెను. తే=ఆ తొలఁగిపోయిన ఉదకాంశములు, దర్భాఃదర్భలుగా, అభవన్=అయినవి. దర్భైఃదర్భలచే, అపఃఉదకములను, ఉత్పునాతి యత్=పవిత్రములను చేయుచో, (చేయవలెనని విధి.) యాఃఏవ=ఏ ఉదకములే, మేధ్యాఃపాప శోధకములును, యజ్ఞియాఃద్రవ్య శోధకములునైన (యజ్ఞార్హములునైన), సదేవాఃదేవాంశముతో కూడిన, ఆపఃఉదకములో, తాభిరేవ=ఆ ఉదకములచేతనే, ఏనాఃఈ ఉదకములను, ఉత్పునాతి= పవిత్రములుగా చేసినవాఁ డగును.

తాత్పర్యము : పూర్వము ఒకనాఁడు ఇంద్రుఁడు వృత్రాసురుని సంహరించఁగా ఆ వృత్రుఁడు ఉదకముల కభిముఖముగ మరణించెను. ఆ ఉదకములలోని దైవాంశములు తొలఁగి పోయి దర్భలుగా అయినవి. ఆ దైవాంశోపేతములైన ఉదకములు పాపశోధకములు, ద్రవ్యశోధకములునైనవి. ఆ దర్భలతో ఇచట వ్రీహి ప్రోక్షకములైన ఉదకములను ఉత్పవనము (పవిత్రము) చేయవలెను. (ఇది ఉత్పవన విధి.) దర్భలచే ఉత్పవనము చేసినచో పైని చెప్పఁబడిన దైవాంశోదకములచేతనే పవిత్రము చేసినట్లగును. అనఁగా:- ఇంద్రునిచే హతుఁడైన వృత్రుఁడు ఉదకము కభిముఖముగ మరణించుటచే ఉదకముల సారము తొలఁగి పోయినది. ఆ సారము దైవ మానుష భేదములచే ద్వివిధముగ నున్నది. మలప్రక్షాళనోపయుక్తము మానుష

మనcబడును. దైవము రెండు విధములుగా ఉన్నది. స్నానాదులచే పాపమును శోధించునది. ఒక రకము. ప్రోక్షణాదులచే ద్రవ్యమును శోధించునది ఇంకొక రకము. ఈ ఉభయము ఇచట మేధ్య యజ్ఞియ శబ్దములచే వివక్షిత మైనది. ఆ తొలcగిపోయిన దైవమైన ఉదక సారము భూమియందు దర్భలుగా ఆవిర్భవించెను. ఇచట ''దర్భైరుత్పునీయాత్'' అను విధి చెప్పcబడినది.

2. మంత్రము : **ద్వాభ్యా ముత్పునాతి । ద్విపాద్యజమానః ప్రతిష్ఠిత్యై ।**

అర్థము : ద్వాభ్యామ్=రెండు దర్భలచే, ఉత్పునాతి=ఉదకములను ఉత్పవనము చేయవలెను. యజమానః=యజమానుcడు, ద్విపాత్=రెండు పాదములు కలవాcడు. ఏతత్=ఈ ఉత్పవనము, ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠితి కొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : వ్రీహి ప్రోక్షకోదకములను రెండు దర్భలచే ఉత్పవనము (పవిత్రములుగా) చేయవలెను. యజమానుcడు ద్విపాదుcడు కనుక ఈ ఉత్పవనము యజమానుcడు దృఢముగ భూమిపైని నిలుచుటకు సంపన్న మగును. ఇచట దర్భల సంఖ్య విధించcబడినది. పూర్వ మంత్రమునందు ''దర్భైరుత్పునాతి'' అని దర్భశబ్దము బహువచనాంతముగాను, ఈ మంత్రమున ''ద్వాభ్యామ్'' అని ద్వివచనాంతముగాను ఉండుటచే పరస్పర విరోధమేర్పడుచున్నది. అందువలన పూర్వమంత్రమున ''దర్భైః'' అని బహువచనము జాత్యభిప్రాయమని గ్రహించవలెను. యజమానుcడు ఒక పాదముచే ధృఢముగ నిలుచుండలేcడు. రెండు పాదములచే దృఢముగ నుండcగలcడు. అందువలన దర్భద్విత్వము కూడ ప్రతిష్ఠితికొఱ కగుచున్నది.

3. మంత్రము : **దేవో వ: సవితోత్పునాత్విత్యాహ। సవితృప్రసూత ఏవైనా ఉత్పునాతి । అచ్ఛిద్రేణ పవిత్రేణేత్యాహ।**

అసౌ వా ఆదిత్యో ఽచ్ఛిద్రం పవిత్రమ్ । తేనైవైనా ఉత్పునాతి । వసోః సూర్యస్య రశ్మిభి రిత్యాహ।

ప్రాణా వా ఆపః ప్రాణా వసవః । ప్రాణా రశ్మయః । ప్రాణైరేవ ప్రాణాన్త్సంపృణక్తి ।

అర్థము : ''దేవో వ: సవితోత్పునాత్విత్యాహ''='ఓ ఉదకములారా! అధ్వర్యుని హృదయమునందు ఉన్నటువంటి ప్రేరకుcడైన అంతర్యామి మిమ్ము ఊర్ధ్వమున పవిత్రములుగాc జేయుcగాక' అని మంత్రము చెప్పినది. సవితృ ప్రసూతః ఏవ=ప్రేరకుcడైన అంతర్యామిచే ప్రేరితుc డయియే, ఏనాః=ఈ ఉదకములను, ఉత్పునాతి=ఉత్పవనము చేసినవాc డగుచున్నాcడు. ''అచ్ఛిద్రేణ పవిత్రేణేత్యాహ''='అచ్ఛిద్రమైన దర్భపవిత్రముచేత' అని మంత్రము చెప్పినది. అసౌ ఆదిత్యః వై=ఈ ఆదిత్యcడే, అచ్ఛిద్రం పవిత్రమ్=ఛిద్ర రహితమైన పవిత్రము. తేనైవ=ఆ ఆదిత్యునిచేతనే, ఏనాః=ఈ ఉదకములను, ఉత్పునాతి=ఉత్పవనము చేసినవాc డగుచున్నాcడు. ''వసోః సూర్యస్య రశ్మిభిః ఇత్యాహ''='జగన్నివాస హేతువైన సూర్యునియొక్క కిరణములచే' అని మంత్రము చెప్పినది. ఆపః=ఉదకములు, ప్రాణాః వై=ప్రాణ స్వరూపములే. ప్రాణాః=ప్రాణములు, వసవః=నివాస హేతువులు. రశ్మయః=రశ్మిలు, ప్రాణాః=ప్రాణ స్వరూపములు. అతః=ఇందువలన, ప్రాణైరేవ= ప్రాణములతోనే, ప్రాణాన్=ప్రాణములను, సంపృణక్తి= సంపృక్తములనుగాc జేసినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : అగ్నిహోత్రహవణియందు ఉదకములను పోసి ఆ ఉదకములను పవిత్రముగాc జేసిన రెండు దర్భలచే అధ్వర్యుcడు మూcడు మారులు ''దేవో వః'' ఇత్యాది మంత్రమును పఠించుచు ఉత్పవనము చేయవలెనని విధి. ఆ '' దేవో వః'' ఇత్యాది మంత్రమును మూcడు భాగములుగాc జేసి యీ బ్రాహ్మణము వ్యాఖ్యానించుచున్నది. 'ఓ ఉదకములారా! అధ్వర్యుని హృదయమునందు ఉన్నటువంటి ప్రేరకుడైన అంతర్యామి ఆదిత్య రూపత్వ భావనా బలమువలన అచ్ఛిద్రమైన దర్భపవిత్రముచేతను, జగన్నివాస హేతువైన సూర్యునియొక్క రశ్ములుగా భావితములైన దర్భావయవములచేతను మిమ్ము ఊర్ధ్వమున పవిత్రములను చేయుcగాక' యని మంత్రార్థము.

ప్రాణములు ఉదకములచే వృద్ధి నొందును కనుక ఉదకములు ప్రాణ స్వరూపములు. ఆదిత్యాద్యధిష్ఠాతృ దేవతానుగ్రహములచే చక్షురాదులైన ప్రాణములను దేహమునందు నివసింపcజేయుటవలన వసు శబ్దాభిధేయములైన దేవతానుగ్రహములు ప్రాణ స్వరూపములు. ఆదిత్య రశ్ములు ప్రాణవ్యవహారోపకారకములగుటవలన ప్రాణ స్వరూపములు. అందువలన సూర్య రూప ప్రాణములుగా భావితములైన దర్భప్రాణములతోc గూడ ఉదక రూప ప్రాణములు ఉత్పవన సమయమున సంపృక్తము లగుచున్నవి. 'సమ్' ఇత్యుపసర్గ పూర్వక ''పృచీ-సంపర్కే'' ఇతి ధాతోః లటి 'సంపృణక్తి' ఇతి రూపమ్. సంపృక్తములు=సంపర్కము కలవి.

4. మంత్రము : సావిత్రియర్చా । సవితృప్రసూతం మే కర్మాసదితి । సవితృప్రసూత మేవాస్య కర్మ భవతి ।

పచ్ఛో గాయత్రియా త్రిష్టమృద్ధత్వాయ ।

అర్థము : మే=నాయొక్క, కర్మ=యజ్ఞ మనెడి కర్మ, సవితృ ప్రసూతమ్=సవితృ దేవతచే ప్రేరితము, అసత్(అస్తు)=అగుcగాక, ఇతి=అని, సావిత్రియా ఋచా=గాయత్రీ చ్ఛందస్సు కల ఋక్కుచే, ఉత్పునీయాత్=ఉదకములను ఉత్పవనము చేయవలెను. అస్య=ఈ యజమానునియొక్క, కర్మ=యజ్ఞకర్మ, సవితృ ప్రసూతమేవ=సవితృ ప్రేరితమే, భవతి=అగుచున్నది. గాయత్రియా=గాయత్రీ చ్ఛందస్కమైన ఋక్కుచే, పచ్ఛః=పాదములవలన, త్రిః=మూcడు మారులు, ఉత్పునీయాత్=ఉత్పవనము చేయవలెను. ఏతత్=ఈ త్రిసంఖ్యాకమైన ఉత్పవనము, సమృద్ధత్వాయ=సమృద్ధికొఱకు, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : నా యీ యజ్ఞకర్మ సమస్తము సవితచే ప్రేరిత మగుcగాక యను భావనతో ''దేవో వః సవితోత్పునాచ్ఛిద్రేణ'' ఇత్యాది సావిత్ర మంత్రముచే ఉదకములను ఉత్పవనము చేయవలెను. అట్లు చేయుటచే ఆ కర్మ ఆ విధముగనే సంపన్న మగును. ఆ మంత్రము ఋగ్రూప మగుటచే ఆ ఋక్కునందలి ఛందస్సును తెలిసికొనుటకు సాధ్య మగుచున్నది. లక్షణము ననుసరించి పాదములు కల దగుటవలనను, ప్రతి పాదము నుచ్చరించుచు ఉత్పవనము చేయcగా త్రిరావృత్తిచే ఆ ఉదకము శుద్ధ మగును. కర్మఫలము అతిశయముగ సమృద్ధ మగును. '' దేవో వః సవితోత్పునాత్వితి ప్రథమ మచ్ఛిద్రేణ పవిత్రేణేతి ద్వితీయం వసోః సూర్యస్య రశ్మిభిరితి తృతీయమ్'' అను కల్పసూత్రమునందు ఆవృత్తి ప్రకారము చూపcబడినది. ఇచట 'సవితా' అనెడి లింగముచే మంత్రముయొక్క సావిత్రత్వము, పాద బద్ధ మగుటవలన మంత్రముయొక్క ఋగ్రూపత్వము అను ఈ ఉభయము ప్రయోజనము కలదని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

5. మంత్రము : **ఆపో దేవీరగ్రేపువో అగ్రేగువ ఇత్యాహ। రూపమేవా ऽऽసా మేతన్మహిమానం వ్యాచష్టే ।**

అర్థము : ''ఆపో దేవీరగ్రేపువో అగ్రేగువ ఇత్యాహ''='ఓ జలదేవతలారా! మీరు శుద్ధిహేతువులైన దర్భలకుc గూడ ప్రోక్షణముచే శోధకు లగుటవలన ముందుగా పవిత్రము చేయువారు. అందుచేత యజ్ఞమును సమాప్తము చేయుటకు సమర్థులు. మఱియు ప్రవాహ రూపమున శీఘ్రగాము లగుటవలన శత్రువులైన మనుష్యులకంటెను ముందుగా పోవువారు. అందువలన యజమానుని స్వర్గమునకు పొందించువారు' అని శ్రుతి చెప్పినది. ఏతత్ రూపమేవ=''ఆపో దేవీ'' రిత్యాది మంత్రముయొక్క పూర్వభాగమునందలి ఈ శబ్దస్వరూపమే, ఆసామ్=ఈ ఉదకములయొక్క, మహిమానమ్=మహిమను, వ్యాచష్టే=స్పష్టముగ (అభిధా వృత్తిచే) చెప్పుచున్నది.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము ''ఆపో దేవీ'' రిత్యాది మంత్రమును మూcడు భాగములుగాc జేసి ప్రథమ భాగమునందలి శబ్దస్వరూపమే అభిధా వృత్తిచే ఈ ఉదకములయొక్క మహిమను స్పష్టముగాc జెప్పుచున్నది. కనుక వ్యాఖ్యానించcదగినది అన్యము లేదని ఈ బ్రాహ్మణము చెప్పినది.

6. మంత్రము : **అగ్ర ఇమం యజ్ఞం నయతాగ్రే యజ్ఞపతి మిత్యాహ। అగ్ర ఏవ యజ్ఞం నయన్తి । అగ్రే యజ్ఞపతిమ్।**

అర్థము : ''అగ్ర ఇమం యజ్ఞం నయతాగ్రే యజ్ఞపతి మిత్యాహ''='ఓ జలదేవతలారా! మీరు ఈ యజ్ఞమును నిర్విఘ్నముగ పరిసమాప్తిని పొందించుcడు. యజమానుని స్వర్గమును పొందించుcడు' అని మంత్రము చెప్పినది. యజ్ఞమ్=యజ్ఞమును, అగ్రే నయన్త్యేవ=ఉదకములు నిర్విఘ్నముగ సమాప్తిని తప్పక పొందించును. యజ్ఞపతిమ్=యజమానుని, అగ్రే నయన్త్యేవ=నిశ్చయముగ స్వర్గమును పొందించును.

తాత్పర్యము : ''ఆపో దేవీ'' రిత్యాది మంత్రముయొక్క మధ్యమ భాగమందు ప్రార్థించcబడిన కార్యమును ఉదకములు ఉపేక్షించుట లేదని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. అనcగా- ప్రార్థించcబడిన యజ్ఞపరిసమాప్తిని, యజమానునకు స్వర్గప్రాప్తిని ఈ ఉదకములు తప్పక కలుగcజేయునని అర్థము.

7. మంత్రము : **యుష్మానిన్ద్రో ऽవృణీత వృత్రతూర్యే యూయ మిన్ద్ర మవృణీధ్వం వృత్రతూర్య ఇత్యాహ। వృత్రగ్ం హనిష్యన్నిన్ద్ర ఆపో వవ్రే । ఆపో హేన్ద్రం వవ్రిరే । సంజ్ఞామేవా ऽऽసా మేతత్సామానం వ్యాచష్టే ।**

అర్థము : ''యుష్మానిన్ద్రో ऽవృణీత వృత్రతూర్యే యూయ మిన్ద్ర మవృణీధ్వం వృత్రతూర్య ఇత్యాహ''='ఓ ఉదక దేవతలారా! వృత్రాసురుని యుద్ధమునందు ఇంద్రుcడు మిమ్ము వరించెను (వేడుకొనెను). వృత్రాసురుని యుద్ధమునందు మీరు ఇంద్రుని వరించిరి (వేడుకొనిరి).' అని మంత్రము చెప్పినది. ఇన్ద్రః=ఇంద్రుcడు, వృత్రమ్=వృత్రుని, హనిష్యన్=చంపcబోవుచు, ఆపః(అపః)=ఉదకములను, వవ్రే హ=వేడుకొనె నcట! ఆపః=ఉదకములు, ఇన్ద్రమ్=ఇంద్రుని, వవ్రిరే హ=వేడుకొనిన వcట! ఏతత్=ఇది, ఆసామ్=ఈ ఉదకములయొక్క, సామానం (సమానాం) సంజ్ఞామేవ=సమ్యక్ జ్ఞానమునే, వ్యాచష్టే=చెప్పుచున్నది.

తాత్పర్యము : ఇంద్రునకు ఉదకములకుc గల పరస్పర సాపేక్షత్వమే ''ఆపో దేవీ'' రిత్యాది మంత్రముయొక్క తృతీయ భాగమునందు చూపcబడుచున్నదని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించుచున్నది. ఈ సాపేక్షత్వము

బ్రాహ్మణాంతర ప్రసిద్ధము. వృత్రునివలన భయపడిన ఇంద్రునికొఱకు ప్రజాపతి వజ్రాయుధమును ఉదకములతో ప్రక్షాళనము చేసి ఇంద్రున కొసఁగె ననెడి ఈ యింద్రునకుఁ గల ఉదకాపేక్షత్వ ప్రసిద్ధి ''వృత్రగ్ం హ'' అను చోటఁ గల 'హ' శబ్దముచే సూచింపఁబడుచున్నది. ఈ విషయముననే ''తస్మా దిన్ద్రోఽబిభేత్స ప్రజాపతి ముపాధావ చ్ఛత్రుర్మేఽజనీతి తస్మై వజ్రగ్ం సిక్త్వా ప్రాయచ్ఛ దేతేన జహీతి తేనాభ్యాయత''='ఆ వృత్రునివలన ఇంద్రుఁడు భయపడి ప్రజాపతి యొద్దకుఁజని, తనకు శత్రువు కలిగెనని ప్రజాపతికి చెప్పెను. ఆ ప్రజాపతి వజ్రాయుధమును ఉదకములతో ప్రక్షాళనము చేసి దీనిచే వృత్రుని సంహరించుమని వజ్రాయుధమును ఆ యింద్రున కొసఁగెను. అతఁ డా వజ్రాయుధముతో వృత్రుని కభిముఖముగ వచ్చెను' అని శ్రుతి చెప్పుచున్నది.

వజ్రాయుధము ప్రక్షాళిత మైనను ఇంద్రునిచే ప్రయోగింపఁబడుటవలన ఉదకములకు ఇంద్రాపేక్ష కల దనెడి ఈ ప్రసిద్ధి''ఆపో హ'' అను చోట 'హ' శబ్దముచే సూచింపఁబడుచున్నది. 'ఉదకములు తనకు సహకారిణులు' అని ఇంద్రునకు సమ్యక్ జ్ఞానము. 'ఇంద్రుఁడు తమకు సహకారి' అని ఉదకములకు సమ్యక్ జ్ఞానము. ఈ సమ్యక్ జ్ఞానము ఇంద్రునకు ఉదకములకు సమానమని మంత్రము వ్యక్తము చేయుచున్నది. ''ఆపో వఁవే'' అను చోట 'అపఃʼ అని ఉండవలెను. దీర్ఘము ఛాందసము. ''ఏతత్సామానం వ్యాచష్టే'' అను చోట 'సమానాం వ్యాచష్టే' అని యుండవలెను. అనఁగా - నకారముపైని ఉండఁదగిన దీర్ఘము సకారముపైని ప్రయుక్త మైనది. ఈ దీర్ఘవ్యత్యాసము ఛాందసము.

8. మంత్రము : **ప్రోక్షితాఃస్థేత్యాహ। తేనాకఁపఃప్రోక్షితాఃꣳ**

అర్థము : ''ప్రోక్షితాఃస్థేత్యాహ''='ఓ ఉదకములారా! ప్రోక్షించఁబడినవారు కండు' అని మంత్రము చెప్పినది. తేన=ఆ మంత్రముచే, అపఃꣳ=ఉదకములు, ప్రోక్షితాఃꣳ=ప్రోక్షించఁబడినవి. భవన్తి=అగుచున్నవి.

తాత్పర్యము : మంత్రపాఠమే ఉదకములకు ప్రోక్షణమని ఈ బ్రాహ్మణము చెప్పినది. ఈ విషయమే ''అద్భిర్హ్యేవ హవీంషి ప్రోక్షతి. బ్రహ్మణాఽప ఇధ్మాబర్హిꣳ ప్రోక్షతి''='ఉదకములచేతనే హవిస్సులను ప్రోక్షించవలెను. అభిమంత్రణ మంత్రముచే ఇధ్మమును, బర్హిస్సును ప్రోక్షించవలెను' అను శ్రుతియందు చెప్పఁబడినది.

9. మంత్రము : **అగ్నయేవో జుష్టం ప్రోక్షామ్యగ్నీషోమాభ్యాం మిత్యాహ। యథాదేవతమేవైనాꣳ ప్రోక్షతి ।**

అర్థము : ''అగ్నయే వో జుష్టం ప్రోక్షామ్యగ్నీషోమాభ్యాం మిత్యాహ''='ఓ ధాన్యమా! మిమ్ము అగ్నిదేవతకొఱకు ఇష్ట మగునట్లుగను, అగ్నీషోమ దేవతలకొఱకు ఇష్ట మగునట్లుగను ప్రోక్షించుచున్నాను.' అని మంత్రము చెప్పినది. యథాదేవతమ్=మంత్రమునందు చెప్పఁబడిన అగ్ని, అగ్నీషోమ దేవతల ననుసరించి, ఏనాన్=ఈ ధాన్య రూప హవిస్సులను, ప్రోక్షతి=ప్రోక్షించవలెను.

తాత్పర్యము : ఓ ధాన్యమా! మిమ్ము అగ్నిదేవతకొఱకును, అగ్నీషోమ దేవతలకొఱకును ఇష్ట మగువిధముగ ప్రోక్షించుచున్నానని మంత్రము చెప్పుటచే మంత్రమునందు చెప్పఁబడిన ఈ అగ్నిదేవతకొఱకు ప్రోక్షించుచున్నాను. ఈ అగ్నీషోమ దేవతలకొఱకు ప్రోక్షించుచున్నానని ఆ దేవతలను ప్రత్యేకముగ ఉద్దేశించి ధాన్య హవిస్సును ప్రోక్షించవలెను.

10. మంత్రము :**త్రిః ప్రోక్షతి । త్ర్యావృద్ధి యజ్ఞః । అథో రక్షసా మపహత్యై ।**

అర్థము : త్రిః=మూడు మారులు, ప్రోక్షతి=ప్రోక్షించవలెను. యజ్ఞః=యజ్ఞము, త్ర్యావృత్ హి=మూడు ఆవృత్తులు కలది కదా! అథో=మఱియు, ఏతత్=ఈ మూడు మారులు ప్రోక్షించుట, రక్షసామ్=రాక్షసుల యొక్క, అపహత్యై=నాశముకొఱకు(తొలగింపుకొఱకు), భవతి=అగుచున్నది.

తాత్పర్యము : యజ్ఞము మూడు ఆవృత్తులు కలది కనుక ధాన్య రూప హవిస్సును మూడు మారులు ప్రోక్షించవలెను. మఱియు రాక్షసులను తొలగించుటకొఱకు ఈ ప్రోక్షణము సంపన్న మగుచున్నది. ''త్రిః ప్రథమాం త్రిరుత్తమామ్'' ఇత్యాది శ్రౌత ప్రసిద్ధిని హి శబ్దము సూచించుచున్నది.

11. మంత్రము :**శున్ధధ్వం దైవ్యాయ కర్మణే దేవయజ్యాయా ఇత్యాహ। దేవయజ్యాయా ఏవైనాని శున్ధతి । త్రిః ప్రోక్షతి। త్ర్యావృద్ధి యజ్ఞః । అథో మేధ్యత్వాయ ।**

అర్థము : ''శున్ధధ్వం దైవ్యాయ కర్మణే దేవయజ్యాయా ఇత్యాహ''='ఓ పాత్రములారా! మీరు దేవతల సంబంధియు, దేవ యాగ రూపమైనదియునగు కర్మకొఱకు పరిశుద్ధములు కండు' అని మంత్రము చెప్పినది. దేవయజ్యాయై ఏవ=దేవయాగ రూప కర్మకొఱకే, ఏనాని=ఈ పాత్రములను, శున్ధతి=పరిశుద్ధములుగాఁ జేసినవాఁ డగుచున్నాఁడు. త్రిః=మూడు మారులు, ప్రోక్షతి=ప్రోక్షించవలెను. యజ్ఞః=యజ్ఞము, త్ర్యావృత్ హి=మూడు ఆవృత్తులు కలది కదా! అథో=మఱియు, మేధ్యత్వాయ=యజ్ఞార్హతకొఱకు, ఏతత్=ఈ త్రిః ప్రోక్షణము, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : 'ఓ పాత్రములారా! మీరు దేవతల సంబంధియు, దేవ యాగ రూపమైనదియునగు కర్మకొఱకు పరిశుద్ధములు కండు' అని అధ్వర్యుని మాటఁగా శ్రుతి చెప్పుటవలన అధర్యుఁడు దేవ యాగ రూప కర్మకొఱకే ఈ పాత్రములను పరిశుద్ధములనుగాఁ జేసినవాఁ డగుచున్నాఁడు. పాత్రములను ఉత్తానములనుగాఁ జేసి యజ్ఞము త్ర్యావృత్తు కనుక మూఁడు మారులు ప్రోక్షించవలెను. మఱియు ఈ ప్రోక్షణమువలన పాత్రములు యజ్ఞార్హములగును.

12. మంత్రము :**అవధూతగ్ం రక్షో ఽవధూతా అరాతయ ఇత్యాహ। రక్షసా మపహత్యై ।**

అర్థము : ''అవధూతగ్ం రక్షో ఽవధూతా అరాతయ ఇత్యాహ''='రక్షోజాతి వినాశితము. శత్రువులు నశింపఁ జేయఁబడినారు' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, రక్షసామ్=రాక్షసులయొక్క, అపహత్యై=వినాశము కొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : 'రక్షోజాతి వినాశితము. శత్రులు వినాశితులు' అని అధ్వర్యునిమాటఁగా శ్రుతి చెప్పుట రాక్షస నాశముకొఱకగుచున్నది.

13. మంత్రము :**అదిత్యా స్త్వగసీత్యాహ। ఇయం వా అదితిః । అస్యా ఏవైనత్ త్వచం కరోతి । ప్రతి త్వా పృథివీ వేత్త్విత్యాహ। ప్రతిష్ఠిత్యై ।**

అర్థము : ''అదిత్యాస్త్వగసీత్యాహ'' = 'ఓ కృష్ణాజినమా! నీవు భూదేవతయొక్క, త్వక్స్వరూప మగుచున్నావు' అని శ్రుతి చెప్పినది. ఇయం వై = ఈ భూమియే, అదితిః = అదితి. ఏనత్ = ఈ కృష్ణాజినమును, అస్యాఃఏవ = ఈ భూమికే, త్వచమ్ = చర్మమునుగా, కరోతి = చేసినవాడగుచున్నాడు. ''ప్రతి త్వా పృథివీవేత్త్వితాహ'' = ''ఓ కృష్ణాజినమా! అందువలన భూమి నిన్ను ప్రతిగ్రహించి 'ఈ చర్మము నాదియే' అని యీ విధముగ తెలిసికొనుచుగాక.'' అని అధ్వర్యుని మాటచగా శ్రుతి చెప్పినది.

తాత్పర్యము : ఓ కృష్ణాజినమా! నీవు భూదేవతయొక్క త్వక్స్వరూప మగుచున్నావు. అందువలన భూమి నిన్ను స్వీకరించి ఈ చర్మము తనదియే యని తెలిసికొనుచుగాక యని మంత్రము చెప్పినది. మంత్రము చెప్పిన ఈ యర్థమునే ఈ బ్రాహ్మణము చూపుచున్నది. ఎట్లనచగా - ఈ భూమియే అదితి. అధ్వర్యువు ఈ కృష్ణాజినమును ఈ భూమికే త్వక్కుగా చేసినవాడగుచున్నాడు. ఈ విధముగ తెలిసికొనుట కృష్ణాజినముయొక్క ప్రతిష్ఠ (మంచి స్థితి) కొఱకగుచున్నది. భూమి కృష్ణాజినమును తన చర్మమునుగా స్వీకరించనిచో అప్పుడు కృష్ణాజినమును జాఱవిడుచును. అప్పు డది ప్రతిష్ఠితము కానేరదు. కనుక ఈ స్వీకారము కృష్ణాజిన ప్రతిష్ఠార్థమే యగుచున్నది.

14. మంత్రము : **పురస్తా త్ప్రతీచీన గ్రీవ ముత్తరలోమోపస్తృణాతి మేధ్యత్వాయ । తస్మాత్పురస్తా త్ప్రత్యఞ్చః పశవో మేధముపతిష్ఠన్తే । తస్మాత్ప్రజా మృగంగ్రాహుకాః ।**

అర్థము : మేధ్యత్వాయ = కృష్ణాజినముయొక్క యజ్ఞార్హతకొఱకు, కృష్ణాజినమ్ = కృష్ణాజినమును, పురస్తాత్ = ఆహవనీయమునకు పూర్వభాగమునందు, ప్రతీచీనగ్రీవమ్ = పశ్చిమ శిరస్కముగాను, ఉత్తరలోమమ్ = ఊర్ధ్వలోమకముగాను, ఉపస్తృణాతి = సమీపమున పఱచవలెను. తస్మాత్ = ఆ కారణమువలన, పశవః = పశువులు, పురస్తాత్ = ఆహవనీయ పూర్వభాగమున, ప్రత్యఞ్చః = ప్రతీచీన శిరస్కములై, మేధమ్ = యజ్ఞమును ఉపతిష్ఠన్తే = సేవించుచున్నవి. తస్మాత్ = ఆ కారణమువలన, ప్రజాః = ప్రజలు, మృగంగ్రాహుకాః = మృగగ్రహణశీలురుగా, భవన్తి = అగుచున్నారు. మృగగ్రహణము = మృగమును పట్టుకొనుట.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము కృష్ణాజినమునకు దేశాది గుణ విశిష్టమైన ఆస్తరణమును విధించుచున్నది. ఆహవనీయము యొక్క పూర్వభాగమునందు కృష్ణాజినమును పశ్చిమ శిరస్కముగాను, ఊర్ధ్వలోమకముగాను పఱచవలెను. ఆ కారణమువలన పశువులు యూపస్తంభమునందు ఆ విధముగనే బంధించబడునవై యజ్ఞమును సేవించుచున్నవి. ఈ విధముగ పశువులచే యజ్ఞము సేవించబడుచున్నది కనుక ప్రజలు ప్రత్యవాయ భయ రహితులై యజ్ఞముకొఱకు మృగ గ్రహణ శీలు రగుచున్నారు. ఆస్తరణము = పఱచుట.

15. మంత్రము : **యజ్ఞో దేవేభ్యో నిలాయత । కృష్ణో రూపం కృత్వా । యత్కృష్ణాజినే హవి రధ్యవహన్తి । యజ్ఞాదేవ తద్యజ్ఞం ప్రయుజ్కే । హవిషో కస్కన్దాయ ।**

అర్థము : యజ్ఞః = యజ్ఞము, కృష్ణాః (భూత్వా) = కృష్ణమృగముగా అయి, రూపమ్ = ఆ కృష్ణమృగముయొక్క రూపమును, కృత్వా = తనకు సంపూర్ణముగాచ జేసికొని, దేవేభ్యః = దేవతలనుండి, నిలాయత = వెడలి

పోయెను. కృష్ణాజినే =కృష్ణాజినమునందు, హవిః=ధాన్య రూప హవిస్సును (హవిస్సుకొఱకైన ధాన్యమును), అధ్వవహన్తి యత్=ఉంచి దంచినచో, తత్=అప్పుడు, యజ్ఞాదేవ=యజ్ఞశరీరమైన కృష్ణాజినమునుండియే, యజ్ఞమ్=హవీరూప యజ్ఞమును, ప్రయుఙ్క్తే=ప్రయోగించినవాడగుచున్నాడు. ఏతత్=ఇది, హవిషః=హవిస్సుయొక్క, అస్కన్దాయ=స్కందన దోష రాహిత్యమునకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఒకప్పుడు యజ్ఞ పురుషుడు ఏదియో ఒక నిమిత్తమున దేవతలనుండి విముఖుడై వెడలిపోయెను. అప్పుడా యజ్ఞపురుషుడు దేవతలకు కనబడకుండుటకై స్వయముగ కృష్ణమృగముయొక్క రూపమును తనకు సంపూర్ణముగ జేసికొనెను. ఈ గాథవలన కృష్ణాజినము యజ్ఞపురుషుడే యని తెలియుచున్నది. అందువలన అధ్వర్యుడు కృష్ణాజినముపైని హవిస్సుకొఱకైన ధాన్యము నుంచి దంచినచో, యజ్ఞశరీరమేయైన కృష్ణాజినము నుండి హవీరూప యజ్ఞమును తీసికొని ప్రయోగించినవాడగును. ఆ ధాన్యము కృష్ణాజినము పైని పడినను విధి విహితమగుటవలనను, ఆ హవిస్సు భూమిపైని పడకుండునట్లు కృష్ణాజినముచే అవరుద్ధమగుటవలనను అస్కన్నమే యగును. అనగా - క్రిందపడుటవలన కలుగునట్టి దోషము ఉండదని యర్థము. ఇచట కృష్ణాజినము నాదరించుటయందు హేతువును చెప్పుచు హవిర్ధాన్యమును కృష్ణాజినముపైని ఱోటియందు ఉంచి దంచవలెనని ఈ బ్రాహ్మణము విధించుచున్నది.

16. మంత్రము :**అధిషవణమసి వానస్పత్య మిత్యాహ। అధిషవణ మేవైనత్కరోతి ।**

అర్థము : ''అధిషవణమసి వానస్పత్య మిత్యాహ''='ఓ ఉలూఖలమా! నీవు ధాన్యమును దంచుట కాధార భూతమును, వృక్షమునుండి పుట్టినదానవు నగుచున్నావు' అని శ్రుతి చెప్పుచున్నది. ఏనత్=ఈ ఉలూఖలమును, అధిషవణమేవ=దంచుట కాధారముగానే, కరోతి=చేయుచున్నవాడగుచున్నాడు. ఉలూఖలము=ఱోలు. ఇది కొయ్యఱోలు కనుక వానస్పత్యమని చెప్పబడినది.

తాత్పర్యము : అవఘాతాధారముగ చేయుటకై అధిషవణ విశేషణమని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. మంత్ర తాత్పర్యము స్పష్టము.

17. మంత్రము :**ప్రతి త్వాఽదిత్యాస్త్వగ్వేత్త్విత్యాహ సయత్వాయ ।**

అర్థము : ''ప్రతి త్వాఽదిత్యాస్త్వగ్వేత్త్విత్యాహ''='ఓ ఉలూఖలమా! అటువంటి నిన్ను కృష్ణాజిన రూపమైన భూమియొక్క చర్మము గ్రహించి తనది యని తెలిసికొనుటగాక' అని మంత్రము చెప్పినది. ఏతత్=ఈ కథనము, సయత్వాయ=సంబంధముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : 'ఓ ఉలూఖలమా! నిన్ను కృష్ణాజిన రూపమైన భూమియొక్క చర్మము తనది యని తెలిసికొనుటగాక' అని మంత్రము చెప్పుటవలన కృష్ణాజినమునకు ఉలూఖలమునకుగల సంఖంధము తెలియుచున్నది. విరోధము లేకుండ సంబంధముకొఱకు ఇది యాశీస్సుగా జెప్పబడినదని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

18. మంత్రము :**అగ్నేస్తనూరసీత్యాహ। అగ్నేర్వా ఏషా తనూः । యదోషధయः । వాచో విసర్జన మిత్యాహ। యదా హి ప్రజాఓషధీనా మశ్నన్తి । అథ వాచం విసృజన్తే । దేవవీతయే త్వా గృహ్ణామీత్యాహ।**

దేవతాభి రేవైనత్సమర్ధయతి।

అర్థము : ''అగ్నేస్తనూ రిత్యాహ''='ఓ పురోడాశీయ వ్రీహి సమూహమా! నీవు అగ్నియొక్క శరీర మగుచున్నావు' అని మంత్రము చెప్పినది. ఓషధయः యత్=ఓషధులు ఏవి కలవో, ఏషా=ఇది, అగ్నేः=అగ్నియొక్క, తనూः వా=శరీరము కదా! ''వాచో విసర్జన మిత్యాహ''='ఓ పురోడాశీయ వ్రీహి సమూహమా! నీవు వాక్కుయొక్క ప్రవృత్తికి కారణ మగుచున్నావు' అని మంత్రము చెప్పినది. యదా హి=ఎప్పుడైతే, ప్రజాः=ప్రజలు, ఓషధీనామ్ అశ్నన్తి=ఓషధులను తినుచున్నారో, అథ=అప్పుడు, వాచమ్=వాక్కును, విసృజన్తే=విడుచుచున్నారు(మాటాడుచున్నారు). ''దేవవీతయే త్వా గృహ్ణామీత్యాహ''='ఓ పురోడాశీయ వ్రీహి సమూహమా! అటువంటి నిన్ను దేవతల భక్షణమునకై ఉలూఖలమునందు ఉంచుచున్నాను' అని మంత్రము చెప్పినది. దేవతాభిः ఏవ=దేవతలచేతనే, ఏనత్=ఈ పురోడాశీయ ధాన్యమును, సమర్ధయతి=వృద్ధి చేయుచున్నవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : ''అగ్నేస్తనూ''రిత్యాది మంత్రమును మూcడు భాగములనుగాc జేసి బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. **(1)**'ఓ పురోడాశీయ వ్రీహి సమూహమా! నీవు అగ్నికి శరీర మగుచున్నావు' అని మంత్రముయొక్క ప్రథమభాగమున కర్థము. దహింపcదగిన కాష్ఠమునువలె వ్రీహి సమూహమునుండి పురోడాశమును స్వీకరించి భక్షించుటచే ఉదరాగ్నియు, ఆహవనీయాగ్నియు వృద్ధి నొందుదురు. కనుక పురోడాశీయ వ్రీహి సమూహమును అగ్నియొక్క శరీరమునుగా శ్రుతి వర్ణించినది. **(2)**పురోడాశీయ వ్రీహి సమూహము వాక్కుయొక్క ప్రవృత్తికి కారణ మని మంత్రముయొక్క ద్వితీయ భాగమున కర్థము. పురోడాశీయ రసముచే వృద్ధి నొందిన వాక్కు శబ్దోచ్చారణమునందు ప్రవృత్త మగును కనుక, శ్రుతి ఆ విధముగ వర్ణించినది. **(3)** 'ఓ పురోడాశీయ వ్రీహి సమూహమా! అటువంటి నిన్ను దేవతలు భక్షించుటకై ఉలూఖలమునందు ఉంచుచున్నాను' అని మంత్రముయొక్క మూcడవ భాగమున కర్థము. అధ్వర్యుcడు దేవతలచేతనే ఈ పురోడాశీయ వ్రీహి సమూహమును సమృద్ధముగాc జేయుచున్నాcడు. పురోడాశము ఆ యా దేవత నుద్దేశించి అగ్నియందు హోమము చేయcబడినపుడు ఆహుతి వృద్ధి నొందునని భావము. ఆహుతిని దేవతలు భక్షించినపుడు ''యావదేకా కామయతే యావదేకా. తావదాహుతిः ప్రథతే'' అను న్యాయముచే అభివృద్ధి యని స్పష్ట మగుచున్నది.

19. మంత్రము :**అద్రిరసి వానస్పత్య ఇత్యాహ।గ్రావాణ మేవైనత్కరోతి । స ఇదం దేవేభ్యో హవ్యగ్ం సుశమి శమిష్యేత్యాహ**

శాన్తై్య ।

అర్థము : ''అద్రిరసి వానస్పత్య ఇత్యాహ''='ఓ ముసలమా!నీవు వనస్పతినుండి పుట్టినదాన వైనను పాషాణమ వగుచున్నావు' అని మంత్రము చెప్పినది. ఏనత్=ఈ ముసలమును (రోకలిని), గ్రావాణమేవ=దార్ఢ్యమున పాషాణమునుగానే, కరోతి=చేసినవాc డగుచున్నాఁడు. ''స ఇదం దేవేభ్యో హవ్యగ్ం సుశమి శమిష్యేత్యాహ''='ఓ ముసలమా! అటువంటి నీవు దేవతలకొఱకు ఈ హవిస్సును సుష్ఠుగ శాంత మగునట్లు చేయుము' అని మంత్రముయొక్క రెండవ భాగము చెప్పినది. ఏతత్=ఈ చెప్పుట శాన్త్యై=శాంతికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ధాన్యమునుండి బియ్యమును తీసి ఆ బియ్యమును పిండిగాcజేసి పిమ్మట ఆ పిండిని పురోడాశమునుగా చేయుటవలన ఏర్పడిన హవిస్సును అగ్నియందు హోమము చేయుదురు. ఓటియందలి ధాన్యమును దంచుటకై ఉపయోగించcబడు రోకలి యిచట సంబోధించcబడినది. అది వనస్పతి జన్య మైనను దార్ఢ్యమున పాషాణమువంటిదని యర్థము. శాంతి యనcగా తండులములపైని ఉన్న పోట్టును పోcగొట్టుటయే. అప్పు డది దేవతలు భక్షించుటకు సుష్ఠుగా నుండును. బ్రాహ్మణము ఈ యర్థమునే వివరించినది.

20. మంత్రము :హవిష్కృదేహీత్యాహ। యు ఏవ దేవానాగ్ం హవిష్కృతః । తాన్వ్యయతి । త్రిర్వ్యయతి । త్రిషత్యా హి దేవాః।

అర్థము : ''హవిష్కృదేహీత్యాహ''='ఓ హవిస్సును చేయునట్టి పాషాణమా! రమ్ము' అని మంత్రము చెప్పినది. యే ఏవ=ఏ పాషాణములైతే, దేవానామ్=దేవానామ్=దేవతలయొక్క, హవిష్కృతః=హవిస్సును నిష్పన్నము చేయునో, తాన్=ఆ పాషాణములను, హ్వాయతి=ఆహ్వానించుచున్నాcడు. త్రిః=మూcడు మారులు, హ్వాయతి=ఆహ్వానించవలెను. దేవాః=దేవతలు, త్రిషత్యాః హి=మూcడు సత్యములు (ప్రకటనలు) కలవారు కదా!

తాత్పర్యము : ''హవిష్కృదేహి'' అను మంత్రము వినియోగమును తెలియcజేయుటకై ఇచట ఉత్పన్న మైనది కాని, ఇది సంహితలోనిది కాదు. బియ్యమును పిండిగాc జేయుటకై తిరుగలి ఱాలను ఉపయోగింతురు. ఆ తిరుగలి ఱాయి హవిస్సునకై పిండిని చేయునది. దానిని మూcడు మారులు పిలువవలెను. దేవతలు త్రిసత్యులు కనుక దేవతల హవిస్సును చేయునట్టి ఱాలను మూcడు మారులు పిలువవలెనని యర్థము.

21. మంత్రము :ఇషమా వదోర్జమా వదేత్యాహ। ఇషమేవోర్జం యజమానే దధాతి । ద్యుమద్వదత వయగ్ం సంఘాతం జేష్మేత్యాహ। భ్రాతృవ్యాభిభూత్యై ।

అర్థము : ''ఇషమా వదోర్జమా వదేత్యాహ'' 'ఓ పాషాణమా! హవిస్స్వరూపమైన ఈ యన్నమును, తదీయ రసమును యజమానుcడు తీసికొనిరాcగలc డని దేవతలకొఱకు చెప్పుము' అని అధ్వర్యునిమాటcగా మంత్రము చెప్పినది. (అనేన=ఈ చెప్పుటచే, అధ్వర్యుః=అధ్వర్యుcడు,) యజమానే=యజమానుని యందు, ఇషమ్=అన్నమును, ఊర్జమ్=తదీయ రసమును, దధాత్యేవ=తప్పక ఉంచినవాc డగుచున్నాcడు. ''ద్యుమద్వదత వయగ్ం సంఘాతం జేష్మేత్యాహ''=ఓ యజ్ఞాయుధములారా! మీ రందఱు ఈ హవిస్సు రసవంత మైనదని దేవతలకొఱకు చెప్పుcడు. మేము వినీతి రహితమైన వైరి సమూహమును ఈ పాషాణ

ధ్వనిచే జయింతు మని అధ్వర్యుని మాటcగా మంత్రముయొక్క ఉత్తర భాగము చెప్పినది. ఇదమ్=ఈ కథనము, భ్రాతృవ్యాభిభూత్యై=శత్రు పరిభవముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ''ఇషమా వదోర్జమా వద'' అనునది ఈ మంత్రముయొక్క ప్రథమ భాగము. అధ్వర్యుc డీ విధముగc జెప్పుటవలన యజమానుని అన్నము కలవానినిగాను, అన్నరసము కలవానినిగాను చేసినవాc డగును. ''ద్యుమద్వదత వయగ్ం సంఘాతం జేష్మ'' ఇది మంత్రముయొక్క ద్వితీయ భాగము. బియ్యమును సన్నెకల్లునందు పోసి నూఱునపుడు ఒక పాషాణముతో ఆ సన్నెకల్లుపైని అధ్వర్యుcడు కొట్టును. ఆ కొట్టుటవలన ధ్వని ఏర్పడును. ఆ విధముగ కొట్టుచు అధ్వర్యుcడు 'ఓ యజ్ఞాయుధములారా! మీ రందఱు ఈ హవిస్సు రసవంతమైనదని దేవతలతోc జెప్పుcడు. మేము ఈ పాషాణ ధ్వనిచే అవినీతి పరులైన శత్రువులను జయింతు' మని పలుకును. దీనివలన శత్రు పరిభవము కలుగును. యజ్ఞమునందు ఉపయోగించcబడు సాధనము లన్నియు యజ్ఞాయుధములే.

22. మంత్రము :**మనోః శ్రద్ధా దేవస్య యజమానస్యాసురఘ్న్యై వాక్ । యజ్ఞాయుధేషు ప్రవిష్టా కసీత్ । తే కసురా యావన్తో యజ్ఞాయుధానా ముద్వదతా ముపాశృణ్వన్ । తే పరాభవన్ । తస్మాత్స్వానాం మధ్యే కవసాయ యజేత। యావన్తోకస్య భ్రాతృవ్యా యజ్ఞాయుధానా ముద్వదతా ముపశృణ్వన్తి । తే పరాభవన్తి ।**

అర్థము : మనోఃదేవస్య=మనువుయొక్క దేవతా రూపుcడును, యాజమానస్య=యజమానుcడునైన, శ్రద్ధా=శ్రద్ధ, అసురఘ్న్యై=అసుర సంహారకమైన, వాక్=వాక్కుగా, యజ్ఞాయుధేషు=యజ్ఞాయుధములందు, ప్రవిష్టా ఆసీత్=ప్రవేశించిన దాయెను. తే అసురాఃఆ అసురులు, యావన్తఃఎంతమంది, ఉద్వదతాం యజ్ఞాయుధానామ్=ఊర్ధ్వముగ ధ్వనిచేయుచున్న యజ్ఞాయుధములయొక్క, (ధ్వనిమ్=ధ్వనిని,) ఉపాశృణ్వన్=సమీపమున వినిరో, తే=ఆ యసురు లందఱు, పరాభవన్=పరాభూతు లైరి. తస్మాత్=ఆ కారణమువలన, స్వానాం మధ్యే=జ్ఞాతుల మధ్యమందు, అవసాయ=ఈ వృత్తాంతమును నిశ్చయించి, యఃఏ యజమానుcడు, యజేత=యాగము చేయునో, అస్య=ఈ యజమానునియొక్క, యే భ్రాతృవ్యాఃఏ శత్రువులు, ఉద్వదతాం యజ్ఞాయుధానామ్=ఊర్ధ్వముగ ధ్వనిచేయుచున్న యజ్ఞాయుధములయొక్క, ధ్వనిమ్=ధ్వనిని, ఉపశృణ్వన్తి=సమీపమున వినుచున్నారో, తే=ఆ శత్రువులు, పరాభవన్తి=పరాభూతు లగుచున్నారు.

తాత్పర్యము : శ్రద్ధాలువుగా యాగము చేయుచున్న మనువుయొక్క వాక్కు అసుర సంహారకమై యజ్ఞాయుధములందు ప్రవేశించెను. ఉచ్చైస్స్వరముతో ధ్వనించుచున్న యజ్ఞాయుధముల ధ్వనిని వినిన అసురు లందఱు పరాభూతులైరి. కావున అనుకూలురును, ప్రతికూలురునైన సర్వ జ్ఞాతుల మధ్యమున ఈ వృత్తాంతమును నిశ్చయించి యాగము చేయునట్టి యజమానునియొక్క ఉచ్చైస్స్వరముతో ధ్వనించుచున్న యజ్ఞాయుధముల ధ్వనిని సమీపమున వినునట్టి శత్రువు లందఱు పరాభూతు లగుదురు. ఈ బ్రాహ్మణము ఉపాఖ్యానముచేత భ్రాతృవ్యాభిభూతిని దృఢీకరించినది.

23. మంత్రము :**ఉచ్చైఃసమాహన్త వా ఆహవిజిత్యై । వృజ్యా ఏషా మిన్ద్రియం వీర్యమ్ । శ్రేష్ఠ ఏషాం భవతి ।**

అర్థము : ''ఉచ్చైఃసమాహన్త వా ఆహ''='ఓ ఆగ్నీధ్రా! ఉపలాయుగ్మమును నీ హస్తమునందలి పాషాణముతో దృఢముగానే కొట్టు'మని అధ్వర్యుడు పలుకవలెను. (సఃఆ పాషాణ ధ్వని,) విజిత్యై=విజయము కొఱకు, భవతి=అగుచున్నది. (యజమానఃయజమానుడు, అనేన=ఈ పాషాణ ధ్వనిచేత,) ఏషామ్=ఈ శత్రువులయొక్క, ఇన్ద్రియమ్=ఇంద్రియగత సామర్థ్యమును, వీర్యమ్=బలమును, వృజ్యై=నశింపచేయుచున్నాడు. ఏషామ్=ఈ జ్ఞాతులలో, ఏషఃఈ యజమానుడు, శ్రేష్ఠఃశ్రేష్ఠుడు, భవతి=అగుచున్నాడు.

తాత్పర్యము : ఇచట ప్రైష మంత్రమును ఉత్పాదింపజేసి వినియోగమును తాత్పర్యమును శ్రుతి చూపుచున్నది. ''ఉచ్చైఃసమాహన్త వై'' అనునది ప్రైషమంత్రము. 'ఓ ఆగ్నీధ్రుడా! నీ చేతియందలి పాషాణముతో ఉపలాయుగ్మమును దృఢముగా కొట్టవలసినది' అని ప్రైషమంత్రముయొక్క అర్థము. ఆ పాషాణ ధ్వని విజయముకొఱ కగును. యజమానుడు ఈ తన వైరులయొక్క ఇంద్రియ సామర్థ్యమును బలమును పాషాణధ్వనిచే నశింపజేయును. ఇతడు ఈ జ్ఞాతులలో శ్రేష్ఠ డగును. ఉపల=ఒకానొక ఱాయి. యుగ్మము=జత.

24. మంత్రము :**వర్షవృద్ధమసి ప్రతి త్వా వర్షవృద్ధం వేత్త్విత్యాహ। వర్షవృద్ధా వా ఓషధయఃవర్షవృద్ధా ఇషీకాఃసమృద్ధ్యై।**

అర్థము : ''వర్షవృద్ధమసి ప్రతి త్వా వర్షవృద్ధంవేత్త్విత్యాహ''='ఓ వ్రీహిసమూహమా! నీవు వర్షముచే వృద్ధి నొందిన దాన వగుచున్నావు. అటువంటి నిన్ను వర్షముచే వృద్ధి నొందిన శూర్పము(చేట తనదానినిగా తెలిసి కొనుటగాక)' అని మంత్రము చెప్పినది. ఓషధయఃఓషధులు, వర్షవృద్ధాఃవైవర్షముచే వృద్ధి నొందినవియే. ఇషీకాఃవేణువులు(వెదురులు), వర్షవృద్ధాఃవర్షముచే వృద్ధి నొందినవి. మంత్రే వృద్ధ శబ్ద ద్వయమ్=మంత్రమునందలి వృద్ధ శబ్ద ద్వయము, సమృద్ధ్యై=సమృద్ధికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : సన్నెకల్లులో పోసి నూఱిన బియ్యమును చేటతో చెరుగుదురు. ఆ బియ్యము (వ్రీహి సమూహము) ఇచట సంబోధించబడినది. చేట వెదురు బద్దలతో చేయబడినదై యుండవలెను. మంత్రమునందు 'వర్షవృద్ధ' మనుపదము ద్విరుక్త మైనది. ఆ పదద్వయముచే సమృద్ధి సూచిత మైనదని బ్రాహ్మణము చెప్పుచున్నది. వ్రీహు లనగా ఓషధులు. ఓషధులు, వెదురులును వర్షముచే వృద్ధి నొందునవియే. శేషము సుగమము.

25. మంత్రము :**యజ్ఞగ్ం రక్షాగ్ంస్యనుప్రావిశన్ । తాన్యస్మా పశుభ్యో నిరవాదయన్త తుషైరోషధీభ్యఃపరాపూతగ్ం రక్షఃపరాపూతా అరాతయ ఇత్యాహ। రక్షసా మపహత్యై ।**

అర్థము : రక్షాంసి=రాక్షసులు, యజ్ఞమ్ అను ప్రావిశన్=యజ్ఞములో ప్రవేశించిరి. (దేవాఃదేవతలు,) తాని=ఆ రక్షస్సులను, అస్మా=రక్తముచేత, పశుభ్యఃపశుయాగములనుండి, తుషైఃపొట్టు(ఱోచక)చే,

ఓషధీభ్యః=ఓషధులనుండియు, నిరవాదయన్త=తొలగించిరి. ''పరాపూతగ్ం రక్షః పరీపూతా అరాతయ ఇత్యాహ''='రాజక్షస జాతి తొలగింపబడినది. శత్రువులు తొలగింపబడిరి' అని మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, రక్షసామ్=రాక్షసులయొక్క, అపహత్యై=నాశముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఇచట రాక్షసుల ప్రసంగము నుపన్యసించి ఈ బ్రాహ్మణము ''పరాపూతగ్ం రక్షః'' ఇత్యాది మంత్రమును వ్యాఖ్యానించుచున్నది. రాక్షసులు యజ్ఞమునందు ప్రవేశించగా దేవతలు వారికి పశుయాగములందు భాగముగా రక్తము నొసగి వారిని పశుయాగములనుండి తొలగించిరి. ఆ విధముగనే వారికి భాగముగా పొట్టును (ఊకను) ఒసగి వారిని ఓషధులనుండి తొలగించిరి. కనుకనే 'రక్షోజాతి తొలగించబడినది. శత్రువులు తొలగించబడిరి' అని మంత్రము చెప్పినది. ఇది రాక్షస నాశముకొఱకగును.

26. మంత్రము :**రక్షసాం భాగోఽసీత్యాహ । తుషైరేవ రక్షాగ్ంసి నిరవదయతే ।**

అర్థము : ''రక్షసాం భాగోఽసీత్యాహ''='ఓ తుషమా! నీవు రాక్షసుల భాగమ వగుచున్నావు' అని మంత్రము చెప్పినది. తుషైరేవ=పొట్టుచేతనే, రక్షాంసి=రాక్షసులను, నిరవదయతే=తొలగింపజేసినవాడగుచున్నాడు.

తాత్పర్యము : రాక్షసులను తొలగించుటకొఱకు రాక్షసులకు భాగ మీయబడుచున్నదని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. మధ్యమ పురోడాశ కపాలమునందు పొట్టును ఉంచి అధ్వర్యుడు ''రక్షసాం భాగోఽసి'' అని చెప్పుచున్నాడు. పైని చెప్పబడినవిధముగ అధ్వర్యుడు రాక్షసులకు పొట్టును భాగముగా నొసగి వారిని యజ్ఞమునుండి తొలగించుచున్నాడని అర్థము.

27. మంత్రము :**అప ఉపస్పృశతి మేధ్యత్వాయ।**

అర్థము : మేధ్వత్వాయ=పవిత్రతకొఱకు, అపః=ఉదకములను, ఉపస్పృశతి=హస్తములతో తాకవలెను.

తాత్పర్యము : అధ్వర్యుడు పవిత్రతకై హస్తములతో ఉదకములను తాకవలెను. ఇది విధి.

28. మంత్రము :**వాయుర్వో వి వినక్త్విత్యాహ। పవిత్రం వై వాయుః । పునాత్యేవైనాన్ ।**

అర్థము : ''వాయుర్వో వివినక్త్విత్యాహ''='ఓ తండులములారా! వాయువు మిమ్ము కణములనుండి వేఱుపడజేయుగాక' అని మంత్రము చెప్పినది. వాయుః=వాయువు, పవిత్రంవై=పవిత్రమైనదే. ఏనాన్=ఈ తండులములను, పునాత్యేవ=తప్పక పవిత్రము చేయును.

తాత్పర్యము : 'ఓ తండులములారా! వాయువు మిమ్ము కణములనుండి వేఱుపడజేయుగాక' అని అధ్వర్యుడు చెప్పుచున్నట్లుగా మంత్రము చెప్పినది. వాయువు తండులములను కణములనుండి వేఱుచేయగల సామర్థ్యము కలది. స్వయముగ పవిత్రమైనది కనుక పవిత్రము చేయునుగూడ. అందువలన ఈ విధముగ జెప్పబడినది.

29. మంత్రము :**అన్తరిక్షాదివ వా ఏతే ప్రస్కన్దన్తి యే శూర్పాత్ । దేవో వః సవితా హిరణ్యపాణిః ప్రతిగృహ్ణాత్వి త్యాహ ప్రతిష్ఠిత్యై । హవిషో కవస్కన్దాయ ।**

అర్థము : యే=ఏ తండులములు, శూర్పాత్=చేటనుండి, ప్రస్కన్దన్తి=ఎక్కువగా జాఱిపడుచున్నవో, ఏతే=ఇవి, అన్తరిక్షాదివ వై=ఆకాశమునుండివలెనే, ప్రస్కన్దన్తి=ఎక్కువగా జాఱిపడుచున్నవి. ''దేవో వః సవితా హిరణ్యపాణిః ప్రతిగృహ్ణాత్వి త్యాహ''='ఓ తండులములారా! బంగరు టుంగరము హస్తమునందుఁ గల సవిత్రుదేవుఁడు మిమ్ము పట్టుకొనుఁగాక(స్వీకరించుఁగాక)' అని మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, హవిషః=తండుల రూప హవిస్సుయొక్క, ప్రతిష్ఠిత్యై=ప్రకృష్టమైన స్థితికొఱకు(జాఱిపోకుండుటకొఱకు), అవస్కన్దాయ=నాశము లేకుండుటకొఱకును, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : అంతరిక్షమునుండి పడునట్టి వర్షోపలములవలె పైని ఉన్న చేటనుండి పడుచున్న తండులములు ఇటు నటు పడి ఒక చోట వానికి స్థిరమైన ఉనికి ఉండదు. మఱియు హవిర్వినాశము సంభవించును. ఆ విధముగ ఇటునటుపడకుండ ఆ తండులములకు స్థిరమైన స్థితి (ప్రతిష్ఠ) కలుగుటకును, హవిర్వినాశము కలుగకుండుటకును హిరణ్యపాణియైన సవిత్రుదేవుఁడు చేటనుండి పడుచున్న తండులములను స్వీకరించుఁగాక (ప్రతిగ్రహించుఁగాక) యని అధ్వర్యుఁడు పలికినట్లు ''దేవో వః సవితా'' ఇత్యాది మంత్రము చెప్పినదని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

30. మంత్రము :**త్రిష్ఠలీ కర్తవా ఆహ। త్ర్యావృద్ధి యజ్ఞః అథో మేధ్యత్వాయ ॥**

ద్వాభ్యాముత్పునాతి రశ్మయో నయన్త్యగ్రే యజ్ఞపతిం యజ్ఞో కదితి రస్కన్దాయ గృహ్ణామీత్యాహ

వదేత్యాహ విజిత్యా అపహత్యా అస్కన్దాయ త్రీణి చ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయ ప్రపాఠకే పంచమో కనువాకః ॥౫॥

అర్థము : ''త్రిష్ఠలీ కర్తవా ఆహ''='ఓ యజమానపత్నీ! తండులములు మూఁడు మారులు ఫలీకర్తవ్యములు' అని అధ్వర్యుఁడు చెప్పెను. యజ్ఞః=యజ్ఞము, త్ర్యావృత్=మూఁడు ఆవృత్తులు కలది కదా! అథో=మఱియు, ఏతత్=ఈ ఫలీకరణము, మేధ్యత్వాయ=యజ్ఞార్హతకొఱకు, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : ఇచట బ్రాహ్మణము ప్రైషమంత్రము నుత్పాదింపఁజేసి దానిని వివరించుచున్నది. ''త్రిష్ఠలీకర్తవా'' అనునది ప్రైష మంత్రము. ఓ యజమానపత్నీ! తండులములు మూఁడు మారులు ఫలీకర్తవ్యములని అధ్వర్యుఁడు యజమానపత్నితో చెప్పవలెను. యజ్ఞము మూఁడు ఆవృత్తులు కలది కనుక ఆ విధముగ చేయవలెను. మఱియు ఈ ఫలీకరణము తండులములకు యజ్ఞార్హత్వమును కలుగఁజేయును. తండులముల తెల్లఁదమునకు ఆచ్ఛాదకముగా ఉన్నటువంటి పొట్టును (ఊఁకను) తొలఁగించుట ఫలీకరణ మనఁబడును.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ద్వితీయ ప్రపాఠకమునందు

పంచమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే షష్ఠోఽనువాకః

1. మంత్రము : **అవధూతగ్ం రక్షోఽవధూతా అరాతయ ఇత్యాహ। రక్షసామపహత్యై । అదిత్యాస్త్వగసీత్యాహ। ఇయం వా అదితిః । అస్యా ఏవైనత్త్వచం కరోతి । ప్రతి త్వా పృథివీ వేత్త్విత్యాహప్రతిష్ఠిత్యై ।పురస్తా త్ప్రతీచీనగ్రీవ ముత్తరలోమోపస్తృణాతి మేధ్యత్వాయ । తస్మాత్పురస్తాత్ప్రత్యఞ్చఃపశవో మేధ ముపతిష్ఠన్తే ।తస్మాత్ప్రజా మృగంగ్రాహుకాః ।యజ్ఞో దేవేభ్యో నిలాయత ।కృష్ణో రూపం కృత్వా ।యత్కృష్ణాజినే హవిరధిపినష్టి । యజ్ఞాదేవ తద్యజ్ఞం ప్రయుఙ్క్తే । హవిషోఽస్కన్దాయ ।**

వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు వ్రీహ్యవఘాత మంత్రములను బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. అవహతములైన తండులములను పిండి చేయుటకు పూర్వము కపాలోపధానము నిప్పయోజన మగుటచే తదుపధానమునకు పూర్వము ఈ షష్ఠానువాకమున తండుల పేషణ మంత్రములకు బ్రాహ్మణము చెప్పcబడుచున్నది. అవఘాతము=దంచుట. కపాలోపధానము=పాత్రములను వెచ్చcబెట్టుట. పేషణము=పిండిచేయుట.

అర్థము : ఈ మంత్రమునకు పంచమానువాకములోని **12, 13, 14** మంత్రముల వ్యాఖ్యానమును చూడుcడు.

2. మంత్రము : **ద్యావాపృథివీ సహాఽకస్తామ్ । తే శమ్యామాత్ర మేక మహర్వ్యేతాగ్ం శమ్యామాత్ర మేకమహః ।**

దివ్యఃస్కమ్భనిరసి ప్రతి త్వాఽదిత్యాస్త్వగ్వేత్త్విత్యాహ ।ద్యావాపృథివ్యో ర్వీత్యై ।

అర్థము : ద్యావాపృథివీ=ద్యావాభూములు, సహ ఆస్తామ్=(పూర్వము)కలసి ఒకటిగా నుండెను. తే=ఆ ద్యావాభూములు, ఏకమ్ అహఃఒక్క దినమును, శమ్యామాత్రమ్=శమ్యాప్రమాణముతో, వ్యేతామ్=విడిపోయినవి. తే, శమ్యామాత్రమ్, ఏకమ్ అహఃప్రతిదినము ఆ విధముగనే అయినవి. (ఈ యర్థమును సూచించుటకై వీప్స చెప్పcబడినది.) ''దివఃస్కమ్భనిరసి ప్రతి త్వాఽదిత్యాస్త్వ గ్వేత్త్విత్యాహ''='ఓ శమ్యా! నీవు ద్యులోకమును ధరించుచున్నదాన వగుచున్నావు. అదితి రూపయైన భూమియొక్క ఈ కృష్ణాజినము నిన్ను అభిమానించుcగాక' అని మంత్రము చెప్పినది. ఏతత్=ఈ దివఃస్కంభని యని చెప్పుట, ద్యావాపృథివ్యోఃద్యావాభూములయొక్క, వీత్యై=విశ్లేషము కొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : గదతో సమానాకారము కలిగి వ్యామార్ధ పరిమితమైన కాష్ఠవిశేషము శమ్యయనcబడును. ఆ శమ్యను కృష్ణాజినముపైని ఉంచి పిండిచేయుటలో సాధనమైన దృషత్తును (ఱాతి విశేషమును) దాని పశ్చిమభాగమున ఉంచుదురు. ఆ శమ్య ఇచట ద్యులోకాధారముగా వర్ణించcబడినది. బ్రహ్మసృజించన ద్యావాభూములు పూర్వము ఒకటిగా కలసి (సంశ్లిష్టములై) యుండెను. అవి ప్రతిదినము శమ్యామాత్రపరిమితితో విశ్లేషమును పొందుచుండెను. ఓ శమ్యా! నీవు ద్యులోకమున కాధార మగుచున్నావు. (అంతటి ఔన్నత్యము కలదానవు.) అదితిరూపయైన ఈ భూమియొక్క చర్మము (కృష్ణాజినము) నిన్ను అభిమానించుcగాక. ద్యావాభూములు సంశ్లిష్టములై యున్నచో యాగమున కవకాశము ఉండదు. కనుక ద్యావాభూముల విశ్లేషముకొఱకు దివఃస్కంభని అని చెప్పcబడినది.

3. మంత్రము : **ధిషణా కసి పర్వత్యా ప్రతి త్వా దివఃస్కమ్భని ర్వేత్తి్వత్యాహ । ద్యావాపృథివ్యో ర్విధృత్యై ।**

అర్థము : ''ధిషణఽసి పర్వత్యా ప్రతి త్వా దివఃస్కమ్భని ర్వేత్తి్వత్యాహ''='ఓ దృషద్రూపమా! నీవు దృఢమైన దానవును, (కనుకనే) పర్వతముతో సమానమైనదానవు నగుచున్నావు. అటువంటి నిన్ను ద్యులోకాధారమైన ఈ శమ్య తనదానినిగా తెలిసికొనుcగాక' అని మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, ద్యావాపృథివ్యోఃద్యావాభూములయొక్క, విధృత్యై=విశిష్ట ధారణముకొఱకు, కల్పతే=సమర్థ మగుచున్నది.

తాత్పర్యము : పైని చెప్పcబడిన శమ్యపైని సన్నెకల్లును ఉంచి దానిలో తండులములను పోసి 'దృషత్' అనే ఒకానొక ఱాతితో నూరుదురు. అప్పుడు ఆ తండులములు పిండి యగును. పిండి చేయుటలో సాధనమైన దృషత్తు ఇచట సంబోధించcబడినది. మంత్రార్థము స్పష్టము. దృషత్తు దృఢ మగుటచే లోకద్వయ ధారణముకొఱకు సమర్థ మగుచున్నది. ''పాషాణమయీ పేషణకాలే పేషణీద్రవ్యాశ్రయభూతా దృషదిత్యుచ్యతే'' పిండిచేయునపుడు పిండిచేయcబడు ద్రవ్యమున కాశ్రయమైనదియునగు పాషాణమయి (ఒకానొక ఱాయి) దృషత్తని శ్రౌతపదార్థ నిర్వచనము.

4. మంత్రము : **ధిషణా కసి పార్వతేయీ ప్రతి త్వా పర్వతి ర్వేత్తి్వత్యాహ। ద్యావాపృథివ్యో ర్విధృత్యై।**

అర్థము : ''ధిషణాఽసి పార్వతేయీ ప్రతి త్వా పర్వతి ర్వేత్తి్వత్యాహ''='ఓ ఉపలమా! నీవు దృఢమైనదానవు, పర్వత సంబంధినివి నగుచున్నావు. అటువంటి నిన్ను పర్వత సంబంధినియైన దృషత్తు తనదానినిగాc దెలిసికొనుcగాక' యని మంత్రము చెప్పినది. ఏతత్=ఇది ద్యావాపృథివ్యోఃద్యావాభూములయొక్క, ధృత్యై=ధారణముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : సన్నెకంటిపైనుంచి బియ్యమును పిండిగా నూఱుటకు సాధనమైన ఱాయి ఉపల యనcబడును. ''పాషాణనిర్మితా పేషణ సాధనభూతా ఉఫలా కథితా''='పాషాణనిర్మితమును, పిండిచేయుటలో సాధన మైనదియు ఉపల యని చెప్పcబడినది' అని శ్రౌతపదార్థనిర్వచనము. మంత్రార్థము స్పష్టము. ఇది ద్యావాభూముల ధారణమునకు సమర్థ మగుచున్నది. ఈ మంత్రమును పఠించుచు దృషత్తునందు ఉపలను ఉంచవలెను.

5. మంత్రము : **దేవస్య త్వా సవితుః ప్రసవ ఇత్యాహ ప్రసూత్యై । అశ్వినో ర్బాహుభ్యా మిత్యాహ। అశ్వినౌ హి దేవానా మధ్వర్యూ ఆస్తామ్ । పూష్ణో హస్తాభ్యా మిత్యాహయత్యై । అధి వపామీత్యాహ। యథాదేవత మేవైనా నధివపతి ।**

అర్థము : ''దేవస్య త్వా సవితుః ప్రసవ ఇత్యాహ'' ప్రసూత్యై। ''అశ్వినోర్బాహుభ్యా మిత్యాహ'' అశ్వినౌ హి దేవానా మధ్వర్యూ అస్తామ్। ''పూష్ణో హస్తాభ్యా మిత్యాహ'' యత్యై। (దీని అర్థ తాత్పర్యములను చతుర్థానువాకమున **16** వ మంత్ర వ్యాఖ్యానమునందు చూడుఁడు.)''అధివపామీత్యాహ''= 'తండులములను సన్నెకల్లునందు ఉంచుచున్నాను' అని ఈ మంత్రభాగము చెప్పినది. యథాదైవతమ్= మంత్రములందు చెప్పఁబడిన దేవతల కనుగుణముగ, ఏనాన్=ఈ తండులములను, అధివపతి= సన్నెకల్లునందు ఉంచవలెను.

తాత్పర్యము : ''దేవస్య త్వా'' అను మంత్రమునందు ''అగ్నయే జుష్టమ్''='అగ్నికొఱకు ఇష్ట మగునట్లుగ' అని అధ్యాహారము చేయవలెనని ఆపస్తంబ మహర్షులు చెప్పియున్నారు. అగ్నికొఱకు ఇష్ట మగునట్లుగా దృషత్తునందు తండులముల నుంచుచున్నానని భావము. శేషము సుగమము.

6. మంత్రము : **ధాన్యమసి ధినుహి దేవానిత్యాహ । ఏతస్య యజుషో వీర్యేణ । యావదేకా దేవతా కామయతే యావదేకా । తావదాహుతిః ప్రథతే న హి తదస్తి । యత్తావదేవ స్యాత్ । యావజ్జుహోతి ।**

అర్థము : ''ధాన్యమసి ధినుహి దేవానిత్యాహ''='ఓ బియ్యమా! నీవు పోషించుదాన వగుచున్నావు. కనుక దేవతను సంతోషపఱుచుము' అని మంత్రము చెప్పినది. ఏనా దేవతా=ఒక దేవత, యావత్=ఏ మాత్రమును, కామయతే=కోరుచున్నదో, యజుషః=మంత్రముయొక్క, వీర్యేణ=సామర్థ్యముచేత, తావత్=ఆ మాత్రము, ఆహుతిః=హవీరూపమైన ఆహుతి, ప్రథతే=వృద్ధి నొందుచున్నది. యావత్=ఎంత హవిస్సును, జుహోతి=హోమము చేయుచున్నాఁడో, తావదేవ=అంతమాత్రము ప్రీణనమే, స్యాత్ యత్=ఉండుననుటయేది కలదో, తత్ నాస్తి=ఆ నియమము లేదు. దధాతి=పోషయతి దేహమితి ధాన్యమ్. ''డు ధాఞ్=ధారణ పోషణయోః'' ఇతి ధాతుః. దేహమును పోషించునది యని వ్యుత్పత్త్యర్థము. ఓ బియ్యమా! నీవు ధాన్యమవు కనుక దేవతలను పోషించుటద్వారా సంతోషపఱుచు మని యర్థము. అల్పమైన ఆహుతి రూప హవిస్సు దేవతలను ఎట్లు సంతోషపఱుచఁగలదు? అను ప్రశ్నకు ఈ బ్రాహ్మణము ఈ విధముగ సమాధానము చెప్పుచున్నది:- ఏ దేవత ఏ మాత్రము ఆహుతి రూప హవిస్సును కోరునో, ఆహుతి రూపమైన హవిస్సు అల్పమైనను మంత్ర సామర్థ్యముచే ఆ యా దేవత కోరినంత ఆహుతి వృద్ధి నొందునని తాత్పర్యము. 'యావదేకా దేవతా' ఇత్యాదికము అంతటను అన్వయించుటకై ద్విరుక్తమైనది.

7. మంత్రము : **ప్రాణాయ త్వాఽపానాయ త్వేత్యాహ ప్రాణానేవ యజమానే దధాతి ।**

అర్థము: ''ప్రాణాయ త్వాఽపానాయ త్వేత్యాహ''''ఓ తండుల రూప హవిర్విశేషమా! నిన్ను ప్రాణముకొఱకు, అపానముకొఱకును నూఱుచున్నా'నని మంత్రము అధ్వర్యుని మాటగా చెప్పినది. అనేన=దీనిచే, అధ్వర్యుఃఅధ్వర్యుడు, యజమానే=యజమానునియందు, ప్రాణాన్=ప్రాణాపాన వ్యాన వాయు వృత్తులను, దధాత్యేవ=తప్పక స్థాపించుచున్నాడు.

తాత్పర్యము : ఉచ్ఛ్వాస నిశ్వాస తత్సంధిగత వృత్తులు ప్రాణాపానవ్యానములు. 'ఓ తండుల రూప హవిర్విశేషమా! ఉచ్ఛ్వాసాది వృత్తిత్రయమును యజమానునియందు స్థాపించుటకొఱకు నిన్ను పిండి చేయుచున్నాను' అని అధ్వర్యుని మాటగా శ్రుతి చెప్పుటచే అధ్వర్యుడు యజమానునియందు ఉచ్ఛ్వాస నిశ్వాస తత్సంధిగత వృత్తులను నిశ్చయముగ స్థాపించినవాడగుచున్నాడు. ''అథ యః ప్రాణాపానయోఃసన్ధిఃస వ్యాన'' ప్రాణాపానముల సంధి వ్యానమని శ్రుత్యంతరము చెప్పుచున్నది. ''ప్రాణాయ త్వాఽపానాయ త్వా వ్యానాయ త్వా'' అని పఠించుచు బియ్యమును పిండి యగునట్లుగా నూఱవలెనని బౌధాయన మహర్షులు చెప్పియున్నారు. దృషత్తులో నుంచిన తండులములను ''ప్రాణాయ త్వా'' అని తూర్పుభాగమునను, ''అపానాయ త్వా'' అని పశ్చిమ భాగమునను, ''వ్యానాయ త్వా'' అని మధ్యమ భాగమునను నూఱవలెనని ఆపస్తంబ మహర్షులు చెప్పియున్నారు.

8. మంత్రము : **దీర్ఘామను ప్రసితి మాయుషే ధామిత్యాహ। ఆయురేవాస్మిన్ దధాత్యేవ ।**

అర్థము : ''దీర్ఘామను ప్రసితి మాయుషే ధామిత్యాహ''='యజమానుని ఆయురభివృద్ధికై అవిచ్ఛిన్న కర్మసమూహమునకు హేతులైన ఉపలను ధరించిన(పట్టుకొనిన)వాడగుచున్నాను' అని మంత్రము చెప్పినది. అస్మిన్=ఈ యజమానునియందు, ఆయుఃఆయువును, దధాత్యేవ=నిశ్చయముగ స్థాపించినవాడగుచున్నాడు.

తాత్పర్యము : యజమానుని ఆయురభివృద్ధికొఱకు అవిచ్ఛిన్న కర్మసంతతి హేతువైన ఉపలను ధరించినవాడగుచున్నా నని అధ్వర్యుని మాటగా శ్రుతి చెప్పుటచే అధ్వర్యుడు తప్పక యజమానునియందు ఆయువును స్థాపించినవాడగుచున్నాడు.

9. మంత్రము : **అన్తరిక్షాదివ వా ఏతాని ప్రస్కన్దన్తి । యాని దృషదః । దేవో వః సవితా హిరణ్యపాణిః ప్రతిగృహ్ణాత్విత్యాహ ప్రతిష్ఠిత్యై । హవిషో కస్కన్దాయ ।**

అర్థము : యాని దృషదఃదృషత్తునుండి ఏవిపడుచున్నవో, ఏతాని=ఇవి, అన్తరిక్షాత్=ఆకాశమునుండి, ప్రస్కన్దన్తీవ వై=పడుచున్నవివలె ఉన్నవి కదా! ''దేవో వః సవితా హిరణ్యపాణిః ప్రతి గృహ్ణాత్విత్యాహ''='ఓ పిష్టములారా! హిరణ్యపాణియగు సవిత్రు దేవుడు మిమ్ము ప్రతిగ్రహించుగాక' యని శ్రుతి అధ్వర్యునిమాటగా చెప్పినది. ఏతత్=ఈ ప్రతిగ్రహణము, ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠకొఱకు, భవతి=అగుచున్నది. హవిషఃపిష్టరూప హవిస్సుయొక్క,అస్కన్దాయ=పడకుండుటకొఱకును,భవతి=అగుచున్నది. పిష్టములు=తండులకణములు.

తాత్పర్యము : దృషత్తుపైని ఉపలతో నూఱుటవలన ఏర్పడిన పిండిని (తండులకణములను) కృష్ణాజినమునందు పోయవలెను. దృషత్తునుండి పడుచున్న తండులకణములు (పిష్టములు) ఆకాశమునుండి పడుచున్నవివలె నున్నవి కనుక 'ఓ పిష్టములారా! మిమ్ము హిరణ్యపాణియగు సవిత్రుదేవుఁడు ప్రతిగ్రహించుఁగాక (పట్టుకొనుఁగాక)' అని అధ్వర్యుఁడు పలికెను. సవిత్రు దేవుఁడు దృషత్తునుండి కృష్ణాజినముపైని పడుచున్న పిష్టములను ప్రతిగ్రహించుటవలన ఆ పిష్టములు పడకుండ మంచి స్థితి (పతిష్ఠ) కలవియై యుండును.

10. మంత్రము : **అసంవపన్తీ పిగ్ంషాణూని కురుతాదిత్యాహ మేధ్యత్వాయ ॥**

నిలాయత విధృత్యై వీర్యేణ స్కన్దన్తి చత్వారి చ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయ ప్రపాఠకే షష్ఠోఽనువాకః ॥౬॥

అర్థము : ''అసంవపన్తీ పిగ్ంషాణూని కురుతా దిత్యాహ'' = 'ఓ యజమానపత్నీ! పిష్టములను ద్రవ్యాంతర సంపర్కము లేనివానినిగా చేయుము' అని అధ్వర్యుఁడు యజమానపత్నితో చెప్పవలెను. లేదా, ఓ దాసీ! అని దాసితో చెప్పవలెను. ఏతత్ = ఇట్లు చేయుట, మేధ్యత్వాయ = పిష్టమునకు యజ్ఞయోగ్యత కలుగుటకై, భవతి = అగుచున్నది.

తాత్పర్యము : యజమానపత్ని నుద్దేశించి కాని, దాసి నుద్దేశించి కాని అధ్వర్యుఁడు ''అసంవపన్తీ పిగ్ంషాణూని కురుతాత్'' అను ప్రైషమంతమును పఠించవలెను. ఓ దాసీ! తండులములందు అన్యద్రవ్యమును కొంచెమైనను కలుపనిదాన వగుచు పిష్టములను సూక్ష్ములనుగా చేయు మని ప్రైషమంత్రార్థము. పిష్టము (పిండి) సూక్ష్ముగా (సన్నఁగా) నున్నచో అది పురోడాశము ద్వారా యజ్ఞయోగ్య మగును.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున ద్వితీయ ప్రపాఠకమునందు షష్ఠానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే
సప్తమోఽనువాకః

1. మంత్రము : **ధృష్టిరసి బ్రహ్మ యచ్ఛేత్యాహ ధృత్యై ।**

వేదార్థదీపిక

అవతారిక: షష్ఠానువాకమునందు సంహితలోని తండుల పేషణార్థ మంత్రములకు బ్రాహ్మణము చెప్పఁబడినది. పేషణానంతరము ఈ సప్తమానువాకమునందు పురోడాశ నిష్పాదనార్థ మంత్రములకు బ్రాహ్మణమును చెప్పవలెను. కాని పురోడాశమును వండుటకై ఉపయోగించునట్టి కపాలములను (పాత్రములను) వెచ్చఁబెట్టకుండ పురోడాశమును వండుట యసాధ్యము కనుక ఈ యనువాకమున కపాలోపధాన మంత్రములకు బ్రాహ్మణము చెప్పఁబడుచున్నది. ఈ సప్తమానువాకములోని బ్రాహ్మణము తైత్తిరీయ సంహితలోని ప్రథమకాండగత ప్రథమ ప్రపాఠకమునందలి సప్తమానువాకములోని కపాలోపధాన మంత్రములకు వ్యాఖ్యానాత్మకము.

అర్థము : ''ధృష్టిరసి బ్రహ్మ ప్రయచ్ఛేత్యాహ ధృత్యై''='ఓ ఉపవేషమా! నీవు దిట్టవు అగుచున్నావు. పురోడాశ రూప దేవాన్నము నొసఁగుము' అని మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, ధృత్యై=యజ్ఞముకొఱకు, సమ్పద్యతే=సంపన్న మగుచున్నది.

తాత్పర్యము : ఉపవేష మనఁగా:- మోదుగుకొమ్మ మొదటిని ప్రాదేశ మాత్ర పరిమితముగ పట్టుకారు మాదిరి ఛేదించిన భాగము. ఇది పురోడాశమును (సాన్నాయ్యమును) సంస్కరించు సమయమున గార్హపత్యాగ్నియందలి అంగారములను పైకి తీయుటకు పట్టకారువలె నుపయోగించును. పురోడాశ రూప దేవాన్నమును సంస్కరించుటలో సాధన మగుటచే ఆ పురోడాశము యజ్ఞమున వినియోగించఁబడునని యర్థము.

2. మంత్రము : **అపాగ్నేఽగ్ని మామాదం జహి నిష్క్వ్యాదగ్ం సేధాఽఽదేవయజం వహేత్యాహ।**

యే ఏవాఽఽమాత్క్వ్యాత్ । తమపహత్య । మేధ్యేఽగ్నౌ కపాల ముపదధాతి ।

అర్థము : ''అపాగ్నేఽగ్ని మామాదం జహి నిష్క్వ్యాదగ్ం సేధాఽఽదేవయజం వహేత్యాహ''='ఓ గార్హపత్యాగ్నీ! శాస్త్రీయ పాకము లేకుండ యోగ్యమైన ద్రవ్యమును భక్షించునట్టి అగ్నిని పోఁగొట్టుము. లౌకికమైన మాంసమును భక్షించునగ్నిని నిషేధించుము. దేవతలను యజించునట్టి అగ్నిని ఆవహించుము' అని మంత్రము చెప్పినది. యఃఏవ=ఏ అగ్నియే, ఆమాత్(ఆమమ్ అత్తీతి, ఆమాత్)శాస్త్రీయ పాకరహితముగ యోగ్యమైన అన్నమును తినునో, లౌకికమైన మాంసమును తినునో, తమ్=ఆ అగ్నిని, అపహత్య=తొలఁగించి, మేధ్యే అగ్నౌ=పవిత్రమైన (యజ్ఞార్హమైన)అగ్నియందు, కపాలమ్=పాత్రమును, ఉపదధాతి=ఉంచవలెను.

తాత్పర్యము : అధ్వర్యుcడు గార్హపత్యాగ్నియందు ఉత్తరమునcగల అగ్నికణమును, మధ్యమమునcగల అగ్నికణమును తీసివైచి దక్షిణాగ్నియందు అగ్నిని స్థాపించి, పిమ్మట పురోడాశమును వండుటకు సాధనమైన కపాలమును (పాత్రమును) వెచ్చcబెట్టవలెను. ఆమాత్తు, క్రవ్యాత్తు అయిన అగ్నులు యజ్ఞార్హములు కావనెడి భావముతో యజ్ఞార్హమైన (దేవతలను యజించునట్టి) అగ్నిని ఆవహింపcజేసి ఆ యగ్నియందు కపాలమును (పాత్రమును) ఉంచవలెనని యీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

3. మంత్రము : **నిర్దగ్ధగ్ం రక్షో నిర్దగ్ధా అరాతయ ఇత్యాహ। రక్షాగ్ంస్యేవ నిర్దహతి ।**

అర్థము : ''నిర్దగ్ధం రక్షో నిర్దగ్ధా అరాతయ ఇత్యాహ''='ఈ కపాలమునందు ఉన్నట్టి రక్షోజాతి నిశ్శేషముగ దగ్ధ మైనది. శత్రువులను నిశ్శేషముగ దగ్ధ లైరి' అని మంత్రము చెప్పినది. అనేన=ఈ మంత్రపఠనముచే, అధ్వర్యుః=అధ్వర్యుcడు, రక్షాంసి=రాక్షసులను, నిర్దహత్యేవ=నిశ్చయముగ దగ్ధలనుగాc జేసివాc డగుచున్నాcడు.

తాత్పర్యము : అధ్వర్యుcడు ''నిర్దగ్ధం రక్ష'' ఇత్యాది మంత్రమును పఠించుచు కపాలమును గార్హపత్యాగ్నియందు ఉంచుటచే కపాలమునందు అంతర్లీనముగ నున్నట్టి రాక్షసులను, శత్రువులను దగ్ధలను చేసినవాc డగుచున్నాcడు.

4. మంత్రము : **అగ్నివత్యుపదధాతి । అస్మిన్నేవ లోకే జ్యోతిర్ధత్తే ।**

అర్థము : అగ్నివతి=అగ్ని కల ప్రదేశమునందు, ఉపదధాతి=కపాలమును ఉంచవలెను. అనేన=ఈ ఉపధానముచే, యజమానః=యజమానుcడు, అస్మిన్నేవ లోకే=ఈ లోకమునందే, జ్యోతిః=అగ్నిని, ధత్తే=స్థాపించు చున్నవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : కపాలమును అగ్ని కల ప్రదేశమునం దుంచవలెను. అట్లు చేయుటచే అధ్వర్యుcడు ఈ లోకమునందే అగ్నిని స్థాపించినవాc డగును. ఇచట అగ్నియందు కపాలోపధానము విధించcబడినది.

5. మంత్రము : **అఙ్గార మధివర్తయతి । అన్తరిక్ష ఏవ జ్యోతిర్ధత్తే ।**

అర్థము : అఙ్గారమ్=అగ్నికణమును, అధివర్తయతి=కపాలముపైని వర్తింపcజేయవలెను. అనేన=ఈ అధివర్తనముచే, అధ్వర్యుః=అధ్వర్యుcడు అన్తరిక్షే ఏవ=అంతరిక్షమునందే, జ్యోతిః=అగ్నిని, ధత్తే=స్థాపించుచున్నాcడు.

తాత్పర్యము : అధ్వర్యుcడు అగ్నికణమును కపాలముపైని ఉంచవలెను. అట్లు చేయుటచే అధ్వర్యుcడు అంతరిక్షమునందే అగ్నిని స్థాపించినవాc డగుచున్నాcడు.

6. మంత్రము : **ఆదిత్యమేవాముష్మింల్లోకే జ్యోతిర్ధత్తే ।**

అర్థము : ఆదిత్యమేవజ్యోతిః=ఆదిత్య రూపుcడైన అగ్నినే, అముష్మిన్ లోకే=ద్యులోకమునందు, ధత్తే=స్థాపించిన వాcడగుచున్నాcడు.

తాత్పర్యము : కపాలముయొక్క ఊర్ధ్వాధోభాగములందు స్థాపించcబడిన అంగారములచే లోకద్వయము అగ్నిమంత మగుచుండcగా, అంతకంటెను పైని అంగారమును స్థాపించుట అసంభవము కనుక, ద్యులోకమున అగ్ని ఉండకపోవు ననెడి శంకను ఈ బ్రాహ్మణము నిరాకరించుచున్నది. దివియందు ఆదిత్యcడనెడి అగ్నిని స్థాపించినవాc డగుచున్నాcడు. కనుక దివి కూడ జ్యోతిష్మంత మగుచున్నది.

7. మంత్రము : **జ్యోతిష్మన్తోకస్మా ఇమే లోకా భవన్తి । య ఏవం వేద ।**

అర్థము : యః=ఏ పురుషుcడు, ఏవమ్=ఈ పూర్వోక్తవిధముగ, వేద=తెలిసికొనుచున్నాcడో, అస్మై=ఇతనికొఱకు, ఇమే లోకాః=ఈ మూcడు లోకములు, జ్యోతిష్మన్తః=అగ్నికలవి, భవన్తి=అగుచున్నవి.

తాత్పర్యము : శ్రుతి ఈ వృత్తాంతము నెఱుcగుటను ప్రశంసించుచున్నది. ఈ పూర్వోక్త విధముగ తెలిసికొనిన పురుషునికై ఈ ముల్లోకములు జ్యోతిష్మంతము లగును.

8. మంత్రము : **ధ్రువమసి పృథివీం దృగ్ంహేత్యాహ। పృథివీమేవైతేన దృగ్ంహతి । ధర్త్రమస్యన్తరిక్షం దృగ్ంహేత్యాహ। అన్తరిక్ష మేవైతేన దృగ్ంహతి । ధరుణమసి దివం దృగ్ంహేత్యాహ। దివ మేవైతేన దృగ్ంహతి । ధర్మాసి దిశో దృగ్ంహేత్యాహ। దిశ ఏవైతేన దృగ్ంహతి ।**

అర్థము : ''ధ్రువమసి పృథివీం దృగ్ంహేత్యాహ''='ఓ కపాలమా! నీవు దృఢ మగుచున్నా వని' మంత్రము అధ్వర్యుని మాటగా చెప్పినది. ఏతేన దీనిచే, పృథివీమేవ=పృథివినే, దృంహతి=దృఢపఱుచుచున్నవాc డగుచున్నాcడు. ''ధర్త్రమస్యన్తరిక్షం దృగ్ంహేత్యాహ''='ఓ కపాలమా! నీవు ధారణ సమర్థ మగుచున్నా వని అధ్వర్యుని మాటగా మంత్రము చెప్పినది. ఏతేన=దీనిచే, అధ్వర్యుః=అధ్వర్యుcడు, అన్తరిక్షమేవ=అంతరిక్షమునే, దృంహతి=దృఢపఱుచుచున్నవాc డగుచున్నాcడు. ''ధరుణమసి దివం దృగ్ంహేత్యాహ''='ఓ కపాలమా! నీవు ధరించుటకు తగిన సామర్థ్యము కలదాన వగుచున్నా' వని అధ్వర్యుని మాటగా మంత్రము చెప్పినది. ఏతేన=దీనిచే, దివమేవ=దివినే, దృంహతి=దృఢపఱుచినవాc డగుచున్నాcడు. ''ధర్మాసి దిశో దృగ్ంహేత్యాహ''='ఓ కపాలమా! నీవు ధరించు సామర్థ్యము కలదాన వగుచున్నా' వని అధ్వర్యుని మాటగా మంత్రము చెప్పినది. ఏతేన=దీనిచే, దిశః ఏవ=దిక్కులనే, దృంహతి=దృఢపఱుచినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : ఈ మంత్రమునందలి ధర్మ ధర్త్ర ధరుణ శబ్దములు శబ్దశక్తిచే ధారకత్వమును చెప్పుచు, లక్షణచే దృఢత్వమును తెలియcజేయుచున్నవి. తాత్పర్యము స్పష్టము. ఈ మంత్రమును పఠించుచు అగ్నియందు మధ్యమ పురోడాశ కపాలమును ఉంచవలెను.

9. మంత్రము : **ఇమా నేవైతైర్లోకా స్దృగ్ంహతి ।**

అర్థము : ఏతైః=ధ్రువమసీత్యాదులచే, అధ్వర్యుఃఅధ్వర్యుడు, ఇమాన్ లోకానేవ=ఈ పృథివ్యాది లోకములనే, దృంహతి=దృఢపఱచినవాడగుచున్నాడు.

తాత్పర్యము : అధ్వర్యుడు (లేదా, యజమానుడు) ధ్రువమసీత్యాదులచే ఈ పృథివ్యాది లోకములనే దృఢపఱచినవాడగును. ఇది ఉపసంహారవాక్యము.

10. మంత్రము :దృగ్ంహన్తే కస్తా ఇమే లోకాః ప్రజయా పశుభిః । య ఏవం వేద ।

అర్థము : యఃఏపురుషుడు, ఏవమ్=ఈ పూర్వోక్త విధముగ, వేద=తెలిసికొనుచున్నాడో, అస్మై=ఈ తెలిసికొనిన పురుషునికొఱకు, ఇమే లోకాఃఈ పృథివ్యాది లోకములు, ప్రజయా=ప్రజతోడను, పశుభిఃపశువులతోడను, దృంహన్తే=దృఢపడుచున్నవి.

తాత్పర్యము : ఏతద్వేదనమును శ్రుతి ప్రశంసించుచున్నది. ఈ పూర్వోక్త విధముగ తెలిసికొనిన పురుషునికొఱకు ఈ లోకములు ప్రజా పశువులతో దృఢపడును.

11. మంత్రము :త్రీణ్యగ్రే కపాలాన్యుపదధాతి । త్రయ ఇమే లోకాః ఏషాం లోకానా మాప్త్యై।

అర్థము : అగ్రేప్రథమమున, త్రీణి కపాలాని=మూడు పురోడాశీయ పాత్రములను, ఉపదధాతిఉపధానము చేయవలెను. (ఆగ్నియందుంచవలెను). ఇమే లోకాఃఈ పృథివ్యాది లోకములు, త్రయఃత్రి సంఖ్యాకములు. అతఃఈ కారణము వలన ఏతత్ =ఈ కపాల త్రయోపధానము, ఏషాం లోకానామ్ = ఈ మూడు లోకముల యొక్క, ఆప్త్యై =ప్రాప్తి కొఱకు భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ప్రథమమున అగ్నియందు మూడు పురోడాశీయ పాత్రములను ఉపధానము చేయవలెను. ఈ లోకములు మూడు కనుక తత్సంఖ్యా సామ్యముచే ప్రథమమున మూడు కపాలముల ఉపధానము ఈ ముల్లోకముల ప్రాప్తికొఱకు సంపన్న మగును. అంతటను విధేయమైన కపాలోపధానమును ఏదియో ఒక ప్రకారముగ స్తుతించి శ్రద్ధ ఉత్పాదనీయమని విశేషముగ ఉత్పాదించుటకై శ్రుతి కపాలోపధానమును బహువిధముల స్తుతించుచున్నది. అందు ఇది యొక విధము.

12. మంత్రము :ఏకమగ్రే కపాల ముపదధాతి । ఏకం వా అగ్రే కపాలం పురుషస్య సంభవతి । అథ ద్వే । అథ త్రీణి । అథ చత్వారి । అథాష్ట । తస్మా దష్టాకపాలం పురుషస్య శిరః ।

అర్థము : అగ్రేప్రథమమున, ఏకం కపాలమ్=ఒక కపాలమును, ఉపదధాతిఉపధానము చేయవలెను. అగ్రేప్రథమమున, ఏకం కపాలం వైఒక కపాలమే, పురుషస్యపురుషునకు, సంభవతిసంభవించుచున్నది. అథ= అనంతరము, ద్వేరెండు కపాలములను, ఉపదధాతిఉపధానము చేయవలెను. అథపిమ్మట, త్రీణిమూడు కపాలములను, ఉపదధాతి. అథఅనంతరము, చత్వారినాలుగు కపాలములను, ఉపదధాతి. అథపిమ్మట, అష్టాఎనిమిది కపాలములను, ఉపదధాతి. తస్మాత్ఆ కారణమువలన, పురుషస్యపురుషునియొక్క, శిరఃశిరస్సు, అష్టాకపాలమ్ఎనిమిది కపాలములు కలది.

తాత్పర్యము : ప్రథమమున ''ధ్రువమసీ''త్యాది మంత్ర భాగము నుచ్చరించుచు ఒక పురోడాశీయ కపాలమును అగ్నియందు ఉపధానము చేయవలెను. అనంతరము ''ధర్త్రమసీ''త్యాది మంత్ర భాగము నుచ్చరించుచు ద్వితీయ కపాలము నుపధానము చేయవలెను. దీనిచే రెండు కపాలములుపధానము చేయcబడిన వగును. ఆ విధముగ ''ధరుణమసీ''త్యాది మంత్ర భాగముచే మూcడవ కపాలమును, ''ధర్త్రాసీ''త్యాది మంత్ర భాగముచే నాల్గవ కపాలము నుపధానము చేయcగా నాలుగు కపాలముల నుపధానము చేసిన ట్లగును. కొందఱి మతమున ఉపరితనమైన ''చితఃస్థే''త్యాది మంత్ర భాగము నుచ్చరించుచు ఉపరితనములైన నాలుగు కపాలములను ఉపధానము చేయవలెను. ఇట్లు చేయcగా ఎనిమిది కపాలముల ఉపధాన మగును. గర్భమున నున్నప్పుడు పురుషునకు అఖండమైన శిరోరూప కపాలమొక్కటియే ఏర్పడును. అనంతరము క్రమముగ రేఖలచే ఎనిమిదిగా భిన్న మగునని అర్థము.

13. మంత్రము :**యదేవం కపాలాన్యుపదధాతి । యజ్ఞో వై ప్రజాపతిః । యజ్ఞమేవ ప్రజాపతిగ్ం సగ్ంస్కరోతి । ఆత్మానమేవ తత్సగ్ంస్కరోతి । తగ్ం సగ్ంస్కృత మాత్మానమ్ । అముష్మి ల్లోకే ఽనుపరైతి ।**

అర్థము : ఏవమ్=ఈ విధముగ, కపాలాని=కపాలములను, ఉపదధాతి యత్=ఉపధానము చేయుచో, ప్రజాపతిః=ప్రజాపతి, యజ్ఞః వై=యజ్ఞస్వరూపుcడే. తతః=ఆ ఉపధానమువలన, యజ్ఞమేవ ప్రజాపతిమ్=యజ్ఞ స్వరూపుcడే యైన ప్రజాపతిని, సంస్కరోతి=సంస్కరించినవాc డగు చున్నాcడు. తత్=ఆ సంస్కారము వలన, ఆత్మానమేవ=తననే(యజమానునే), సంస్కరోతి=సంస్కరించుకొనుచున్న వాcడగుచున్నాడు. తమ్=ఆ, సంస్కృతమ్=సంస్కరించcబడిన, ఆత్మానమ్=తనను(యజమానుని), అను=అనుసరించి, అముష్మిన్ లోకే=స్వర్గ లోకమునందు, పరైతి=(యజ్ఞస్వరూప ప్రజాపతి రూపధారియైన ఒకానొక దేవుcడు) వెళ్లుచున్నాcడు.

తాత్పర్యము : ఉపధానముచే పురోడాశీయ కపాలములు సంస్కరించcబడినవి కాcగా ఆ సంస్కారముద్వారా యజ్ఞము సంస్కరించcబడిన దగును. యజ్ఞము ద్వారా యజ్ఞస్రష్టయైన ప్రజాపతికి సంస్కారము సంపన్న మగును. ఆ కపాల యజ్ఞ ప్రజాపతుల సంస్కారముచేత యజమానుcడు స్వయముగ సంస్కరించcబడినవాc డగును. సంస్కృతుcడైన ఆ యజమానుcడు స్వర్గమునకు పోవుచుండcగా అతని ననుసరించి ఫలము నొసగుటకై ప్రజాపతి రూప ధారియైన యజ్ఞదేవుcడు స్వర్గమునకు పోవును.

14. మంత్రము :**యదష్టా వుపదధాతి । గాయత్రియా తత్సంమితమ్ । యన్నవ । త్రివృతా తత్ । యద్దశ । విరాజాతత్ । యదేకాదశ । త్రిష్టుభా తత్ । యద్ద్వాదశ । జగత్యా తత్ । ఛన్దఃసంమితాని స ఉపదధత్కపాలాని । ఇమాంల్లోకా ననుపూర్వం దిశో విధృత్యై దృగ్ంహతి । అథా ఽఽయుః ప్రాణాన్ప్రజాం పశూన్యజమానే దధాతి । సజాతా నస్మా అభితో బహులా న్కరోతి ।**

అర్థము : అష్టౌ=ఎనిమిది పురోడాశీయ కపాలములను, ఉపదధాతి యత్=ఉపధానము చేయునెడల, తత్=ఆ ఉపధానము, గాయత్రియా=గాయత్రీ ఛ్ఛందస్సుతో, సంమితమ్=సమానము. నవ యత్=తొమ్మిది యైనచో, తత్=ఆ ఉపధానము, త్రివృతా=త్రివృత్ స్తోమముతో, సంమితమ్. దశ యత్=పది యైనచో, తత్=అది, విరాజా=విరాట్ ఛందస్సుతో, సంమితమ్. ఏకాదశ యత్=పదునొకండు అయినచో, తత్=అది, త్రిష్టుభా=త్రిష్టుప్ ఛందస్సుతో, సంమితమ్. ద్వాదశ యత్=పండ్రెండు అయినచో, తత్=అది, జగత్యా=జగతీ ఛ్ఛందస్సుతో, సంమితమ్. ఛన్దస్సంమితాని=ఛందస్సులతో సమానములైన, కపాలాని=కపాలములను, ఉపదధాత్=ఉపధానము చేయుచున్న, సః=ఆ అధ్వర్యుఁడు, అనుపూర్వమ్=అనుక్రమముగ, ఇమాన్ లోకాన్=ఈ పృథివ్యాది లోకములను, దిశః=ప్రాచ్యాది దిక్కులను, విధృత్యై=విశేష ధారణమునకై, ధృంహతి=దృఢముగా చేయుచున్నవాఁడగుచున్నాఁడు. అథ=మఱియు, యజమానే=యజమానునియందు, ఆయుః=ఆయువును, ప్రాణాన్=ప్రాణములను, ప్రజామ్=సంతానమును, పశూన్=పశువులను, దధాతి=సంపాదించినవాఁ డగుచున్నాఁడు. అస్మై=ఈ యజమానునికొఱకు, సజాతాన్=జ్ఞాతులను, బహులాన్=బహుసంఖ్యాకులనుగా, కరోతి=చేయుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : 'త్రివృత్' శబ్దము స్తోమవాచకము. ఆ త్రివృత్ స్తోమము ''ఉపాస్మై గాయతా నర'' ఇత్యాదులైన తొమ్మిది ఋక్కులచే ఏర్పడుచున్నది. గాయత్రీ విరాట్ త్రిష్టుప్ జగతీ ఛ్ఛందస్సులకు వరుసగా అష్టత్వాద్యక్షర సంఖ్య ప్రసిద్ధము. ఆ విధముగ కపాలములకు ఛందస్సాదృశ్యము సిద్ధించినది. లోకబుద్ధిచే కపాలముల నగ్నియం దుంచుటవలన ఇటువంటి కపాలములను ఉపధానము చేయుచున్న అధ్వర్యుఁడు అనుక్రమముగ పృథివ్యాది లోకములను, ప్రాగాది దిక్కులను దృఢములుగాఁ జేసినవాఁ డగుచున్నాఁడు. కనుక ఈ ఉపధానము లోకవృద్ధికొఱకగును. మఱియు ఆయురాదులను, భ్రాతృపుత్రాదులను యజమానునికొఱకు సంపాదించినవాఁ డగును. యజమానునకు జ్ఞాతులను బహు సంఖ్యాకులనుగాఁ జేసినవాఁడు నగును.

15. మంత్రము :చితఃస్థేత్యాహ। యథాయజురేవైతత్ ।

అర్థము : ''చితఃస్థేత్యాహ''='ఓ అష్టమ కపాలమా! నీవు ఉపచిత రూపము అగుచున్నావు' అని మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, యథాయజుః ఏవ=మంత్రోక్తవిధమే. (వ్యాఖ్యానించవలసిన విషయము అధికముగ లేదని భావము.)

తాత్పర్యము : తాత్పర్యము స్పష్టము. 'చితఃస్థ' అని బహ్వవచనము ఆదరార్థమున ప్రయుక్త మైనది. 'చిత్' అని ఏకవచనాంతము.

16. మంత్రము :భృగూణా మఙ్గిరస్తాం తపసా తప్యధ్వ మిత్యాహ। దేవతానా మేవైనాని తపసా తపతి ।

అర్థము : ''భృగూణా మఙ్గిరసా తపసా తప్యధ్వ మిత్యాహ''='ఓ కపాలములారా! మీరు భృగువులయొక్కయు, అంగిరసులయొక్కయు తపోరూపమైన ఈ అగ్నిచే తప్తములు కండు' అని మంత్రము చెప్పినది. అధ్వర్యుఃఅధ్వర్యుఁడు, దేవతానాం తపసైవ=దేవతలయొక్క తపస్సుచేతనే, ఏనాని=ఈ కపాలములను, తపతి=తప్తములుగా చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : భృగువులు, అంగిరసులును మహాతపోవంతు లగుటవలన అధ్వర్యుcడు దేవతల తపోరూపమైన అగ్నిచే ఈ కపాలములను తప్తములుగాc జేసినవాc డగుచున్నాcడని ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

17. మంత్రము :తాని తతః సగ్ంస్థితే । యాని ఘర్మే కపాలాన్యుపచిన్వన్తి వేధస ఇతి చతుష్పదయర్చా విముఞ్చతి ।

చతుష్పాదః పశవః । పశుష్వేవోపరిష్టా త్ప్రతితిష్ఠతి ॥

వర్తయతి దివమేవైతేన దృగ్ంహతి సమ్భవతి తగ్ం సగ్ంస్కృత మాత్మాన న్వాదశ సగ్ంస్థితే

త్రీణి చ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయ ప్రపాఠకే సప్తమోఽనువాకః ॥౭॥

అర్థము : సంస్థితే=బాగుగ నెలకొల్పcబడిన, ఘర్మే=వేడిమి కల అగ్నియందు, యాని కపాలాని=ఏ కపాలములను, ఉపచిన్వన్తి=ఉంచుచున్నారో, తతః=ఆ అగ్నినుండి, తాని=ఆ కపాలములను, వేధసః=బ్రహ్మసదృశులైన అధ్వర్యులు, ''యాని ఘర్మే కపాలాన్యుపచిన్వన్తి వేధసః'' ఇతి=అనెడి, చతుష్పదయా ఋచా=నాలుగు పాదములు కల ఋక్కుచేత, విముఞ్చతి=విడిపించవలెను. పశవః=పశువులు, చతుష్పాదః=నాలుగు పాదములు కలవి. పశుష్వేవ=పశువులయందే, ఉపరిష్టాత్=పైని, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుc డగుచున్నాcడు.

తాత్పర్యము : బాగుగ నెలకొల్పcబడిన వేడిమి కల అగ్నియందు ఉంచcబడిన కపాలములను అధ్వర్యుcడు ''యాని ఘర్మే'' ఇత్యాదికమైన నాలుగు పాదముల ఋక్కును పఠించుచు ఆ యగ్నినుండి విడిపించవలెను. పశువులు నాలుగు పాదములు కలవి కనుక ఆ విధముగ కపాలములను అగ్నినుండి తీయుటవలన యజమానుcడు పశువులలో ప్రతిష్ఠితు డగును. పశుసమృద్ధి కలవాc డగునని యర్థము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున ద్వితీయ ప్రపాఠకమునందు సప్తమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే అష్టమోఽనువాకః

1. మంత్రము : **దేవస్య త్వా సవితుః ప్రసవ ఇత్యాహ ప్రసూత్యై । అశ్వినోర్బాహుభ్యా మిత్యాహ । అశ్వినౌ హి దేవానా మధ్వర్యూ ఆస్తామ్ । పూష్ణో హస్తాభ్యా మిత్యాహ యత్యై । సంవపామీత్యాహ । యథా దేవత మేవైనాని సంవపతి ।**

అవతారిక: సప్తమానువాకమునందు కపాలోపధానార్థ మంత్రములకు బ్రాహ్మణ మభిహిత మైనది. ఈ యష్టమానువాకమునందు సంహితయందలి **(కా. 1. ప్ర. 1. అ. 8.)** పురోడాశ నిష్పాదనార్థ మంత్రములకు బ్రాహ్మణము చెప్పcబడుచున్నది.

అర్థము : దేవస్య త్వా----పూష్ణో హస్తాభ్యామిత్యాహ యత్యై'' అను మంత్రభాగము ద్వితీయానువాకమునందు వ్యాఖ్యానించcబడినది. పురోడాశార్థమైన పిండిని ఉదకములతో కలుపుటకై ప్రణీతోదకములను చేతిలోనికి తీసికొనుసమయమున ఈ మంత్ర మిచట వినియోగించcబడుచున్నది. 'సంవపామి ఇతి ఆహ=ఓ బియ్యపుపిండీ! నిన్ను పాత్రమునం దుంచుచున్నాను' అని శ్రుతి చెప్పినది. యథాదేవతమ్ ఏనాని సంవపతి= ఆ యా దేవతల నుద్దేశించి బియ్యపుపిండిని పాత్రమునం దుంచవలెను. బియ్యపుపిండి తండులకణములే కనుక ఏనాని అని చెప్పcబడినది.

తాత్పర్యము : పురోడాశహవిస్సును నిష్పన్నము చేయుటకై బియ్యపుపిండిని పాత్రము నందుంచవలెనని యీ బ్రాహ్మణము చెప్పినది.

2. మంత్రము : **సమాపో అద్భిరగ్మత సమోషధయో రసేనేత్యాహ। ఆపో వా ఓషధీర్జిన్వన్తి । ఓషధయో ఽపో జిన్వన్తి । అన్యా వా ఏతాసామన్యా జిన్వన్తి । తస్మాదేవమాహ।**

అర్థము : ''సమాపో అద్భిరగ్మత సమోషధయో రసేన'' ఇతి ఆహ='ఓ ప్రణీతోదకములారా! మీరు మదంతి యను నుదకములతోc గలసికొనుcడు. ఓ యోషధులారా! మీరు ప్రణీతములు, మదంతి యనెడి రెండువిధములైన యుదకములయొక్క రసముతోc గలసికొనుcడు' అని వేదము చెప్పినది. ఆపః వై=ఉదకములే, ఓషధీః=ఓషధులను, జిన్వన్తి=తృప్తిపఱుచుచున్నవి. ఓషధయః=ఓషధులు, అపః=ఉదకములను, జిన్వన్తి=తృప్తిపఱుచుచున్నవి. ఏతాసామ్=ఈ యుదకౌషధులలో, అన్యాఃవై అన్యాః జిన్వన్తి=ఇతరములైన యుదకములే యితరములైన యోషధులను, ఇతరములైన యోషధు లితరములైన యుదకములను తృప్తి పఱుచుచున్నవి. తస్మాత్=ఒండొరులు ఒండొరులను తృప్తిపఱుచుటవలన, ఏవమ్='సమాపో అద్భిరగ్మత సమోషధయో రసేన' అని యీ విధముగ, ఆహ=వేదము చెప్పినది.

తాత్పర్యము : వస్తుస్థితియందు అచేతనములైన యుదకములకు, ఓషధులకును ప్రీతి లేదు. కాని, అయినను పురోడాశరూపమున దేవప్రియహేతు వగుటవలన ఆ విధముగ ఉపచారము చేయఁబడినది. కేవలము జలముచేతఁగాని, కేవలము ఓషధికార్యమైన పిష్టముచేతఁగాని పురోడాశము సంభవించుటలేదు. మఱేమనఁగా - అన్యోన్యమేళనరూపమైన ప్రీణనముచేత పురోడాశమేర్పడుచున్నది. ఆ యుదకౌషధులలో అన్యోన్య ప్రీణనముచేత అన్యోన్య ప్రీణనము కలుగుచున్నది. ఆ కారణమువలన మంత్రము 'సమోషధయో రసేన' అని చెప్పినది. ఇచట మంత్రపూర్వభాగమునందు జలౌషధిసంగమమునకు ఫలము చెప్పఁబడినది.

3. మంత్రము : సగ్ం రేవతీ ర్జగతీభి ర్మధుమతీ ర్మధుమతీభిః సృజ్యధ్వ మిత్యాహ। ఆపో వై రేవతీః । పశవో జగతీః ।

ఓషధయో మధుమతీః । ఆప ఓషధీః పశూన్ । తానేవాస్మా ఏకధా సగ్ంసృజ్య । మధుమతః కరోతి ।

అర్థము : ''సగ్ం రేవతీ ర్జగతీభి ర్మధుమతీ ర్మధుమతీభిః సృజ్యధ్వమ్'' ఇతి ఆహ = 'ఓ యుదకములారా! సస్యము మూలమున ధనమును వృద్ధిచేయువారును, మధురములునైన మీరు పశ్వభివృద్ధిహేతువులును, మాధుర్యము కలవియునగు పిష్టరూపముగనున్న యోషధులతోఁ గలసికొనుఁడు' అని చెప్పినది. ఆపః = ఉదకములు, రేవతీః వై = సర్వసస్యాభివృద్ధి హేతువు లగుటవలన తద్ద్వారా ధనవత్తులే. పశవః = పశువులు, జగతీః = జంగమములు. ఓషధయః = ఓషధులు, మధుమతీః = మాధుర్యయుక్తములైన ఉదకములను, ఆపః = ఉదకములు, పశూన్ = పశ్వభివృద్ధిహేతువులైన, ఓషధీః = ఓషధులను (ఓషధిజన్యమైన పిండిని,) సంసృజన్తే = బాగుగ కలయుచున్నవి. తానేవ = ఆ యోషధులనే, అస్మై = ఈ పురోడాశముకొఱకు, ఏకధా = ఒకటిగా, సంసృజ్య = మేళనముచేసి, మధుమతః = మాధుర్యవంతములనుగా, కరోతి = (అధ్వర్యుఁడు) చేయుచున్నాఁడు.

తాత్పర్యము : ఇచట మంత్రముయొక్క ఉత్తరభాగమునందు మాధుర్యసంపాదన రూపమైన ఫలము నీ బ్రాహ్మణము చెప్పినది. తాత్పర్యము స్పష్టము.

4. మంత్రము : అద్భ్యః పరి ప్రజాతాః స్థ సమద్భిః పృచ్యధ్వమితి పర్యాప్లావయతి । యథా సువృష్ట ఇమా మను

విసృత్య । ఆప ఓషధీ ర్మహయన్తి । తాదృగేవ తత్ ।

అర్థము : ''అద్భ్యః పరి ప్రజాతాః స్థ సమద్భిః పృచ్యధ్వమ్'' ఇతి పరిప్లావయతి = పిష్టరూపములైన ఓ యోషధులారా! మీరు పూర్వము ఉదకములనుండి పుట్టినవారై యుంటున్నారు. కావున ఇప్పుడు కూడ నుదకములతో కలసినవారై యుండుఁడు' అను మంత్రముచే (మంత్రమును పఠించుచు) పిండిని తడుపవలెను. యథా = ఏ విధముగ, సువృష్టే = పర్జన్యుఁడు బాగుగ వర్షించుచుండఁగా, ఆపః = ఉదకములు, ఇమామ్ అనువిసృత్య = ఈ భూమి ననుసరించి ప్రవేశించి, ఓషధీః = ఓషధులను, మహయన్తి = వృద్ధిచేయుచున్నవో, తత్ = ఆ యార్ద్రీకరణము, తాదృగేవ = అటువంటిదే.

తాత్పర్యము : ''అధ్వ్యుఃపరి ప్రజాతాఃʼʼ అను మంత్రమును పఠించుచు పిండిని తడుపవలెను. వర్షము కురియుచున్న సమయమున వర్షోదకములు భూమియందు ప్రవేశించి యోషధులను వృద్ధిచేయునటువంటిదే ఆ యార్ద్రీకరణము కూడ. ఇచట పిష్టమున నార్ద్రీకరణము చెప్పఁబడినది.

5. మంత్రము : **జనయత్యై త్వా సం యౌమీత్యాహ। ప్రజా ఏవైతేన దాధార ।**

అర్థము : ''జవయత్యై త్వా సం యౌమిʼʼ ఇతి ఆహ='ఓ యార్ద్రీకృత పిష్టమా! నిన్ను హస్తాంగుళిమర్దనముచేత బాగుగ మిశ్రమము చేయుచున్నాను' అని శ్రుతి చెప్పినది. ఏతేన=ఈ మిశ్రీకరణముచే, ప్రజాఃఏవ=ప్రజలనే (సంతానమునే), దాధార=ధరింపఁజేసినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : ఓ యార్ద్రీకృత పిష్టమా! నిన్ను హస్తాంగుళిమర్దనముచే బాగుగ మిశ్రమము చేయుచున్నానని అధ్వర్యుఁడనుటచే శుక్రశోణిత మిశ్రణనముచేతనే యజమానునకు ప్రజోత్పత్తికొఱకు సంపన్న మగుచున్నది. ''జనయత్యై త్వా సంయౌమిʼʼ అను మంత్రముయొక్క యర్థమునే యీ బ్రాహ్మణము విశదీకరించినది.

6. మంత్రము : **అగ్నయే త్వాఽగ్నీషోమాభ్యా మిత్యాహ వ్యావృత్యై ।**

అర్థము : ''అగ్నయే త్వాఽగ్నీషోమాభ్యామ్ʼʼ ఇతి ఆహ=ఓ పిష్టమా! నిన్ను అగ్నికొఱకు, అగ్నీషోముల కొఱకును తాఁకుచున్నాను. 'అగ్నయే త్వా,' 'అగ్నీషోమాభ్యామ్' అను నీ మంత్రమును రెండు భాగములుగా (మంత్రద్వయముగాఁ జేయుట), వ్యావృత్యై=సాంకర్యము లేకుండుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : అసాంకర్యము మంత్రద్వయప్రయోజనమని యీ బ్రాహ్మణము చెప్పినది.

7. మంత్రము : **ముఖస్య శిరోఽసీత్యాహ। యజ్ఞో వై ముఖః । తస్యైతచ్ఛిరః । యత్పురోడాశః । తస్మాదేవమాహ।**

అర్థము : ''ముఖస్య శిరోఽసిʼʼ ఇతి ఆహ='ఓ పురోడాశమా! నీవు యజ్ఞమునకు శిరస్సు వగుచున్నావు' అని శ్రుతి చెప్పినది. యజ్ఞఃవై=యజ్ఞమే, ముఖఃముఖశబ్దార్థము. తస్య=ఆ యజ్ఞమునకు, పురోడాశఃయత్=పురోడాశమేది కలదో, ఏతత్=ఈ పురోడాశము, తస్య=ఆ యజ్ఞమునకు, శిరఃశిరస్సు (వంటిది). తస్మాత్=ఆ కారణమువలన, ఏవమ్=ఈ విధముగ, ఆహ=శ్రుతి చెప్పినది.

తాత్పర్యము : ఓ పురోడాశమా! నీవు యజ్ఞమునకు (ముఖమునకు) శిరస్సు వగుచున్నావని శ్రుతి చెప్పినది. ముఖశబ్దవాచ్యము యజ్ఞమే. పురోడాశ మా యజ్ఞమునకు శిరస్సు (వంటిది). ఆ కారణమువలన పురోడాశము యజ్ఞమునకు శిరస్సని శ్రుతి చెప్పినది.

8. మంత్రము : **ఘర్మోఽసి విశ్వాయురిత్యాహ। విశ్వమేవాఽఽయు ర్యజమానే దధాతి ।**

అర్థము : ''ఘర్మోఽసి విశ్వాయుఃʼʼ ఇతి ఆహ='ఓ పురోడాశమా! దీపించినదానవై సర్వాయుఃప్రదమగుచున్నావని' శ్రుతి చెప్పినది. (అనేన=ఈ చెప్పుటచే, పురోడాశఃపురోడాశము,) యజమానే=యజమానునియందు, విశ్వమేవ ఆయుఃసర్వాయువునే, దధాతి=స్థాపించుచున్న దగుచున్నది.

తాత్పర్యము : ఓ పురోడాశమా! నీవు తప్తకపాలమం దుండుటచే దీపించినదానవై సర్వాయుఃప్రద మగుచున్నావని శ్రుతి చెప్పినది. 'విశ్వమ్ ఆయుః యస్య సః విశ్వాయుః' అను బహువ్రీహికి ఆయుష్ప్రదము నీవని యర్థమని యీ బ్రాహ్మణము చెప్పినది. కనుక ఈ విధముగ జేయబడిన పురోడాశము యజమానునియం దాయువును స్థాపించును.

9. మంత్రము : ఉరు ప్రథస్వోరు తే యజ్ఞపతిః ప్రథతా మిత్యాహ। యజమానమేవ ప్రజయా పశుభిః ప్రథయతి ।

అర్థము : ''ఉరు ప్రథస్వోరు తే యజ్ఞపతిః ప్రథతామ్'' ఇతి ఆహ='ఓ పురోడాశమా! నీవు అధిక మగునట్లుగ విస్తీర్ణ మగుము. నీ యజ్ఞపతి ప్రజాదులచే ప్రథితుడగుగాక' అని శ్రుతి చెప్పినది. (అయమ్=ఈ ప్రథితమైన పురోడాశము,) యజమానమేవ=యజమానునే, ప్రజయా=సంతానముచేతను, పశుభిః=పశువులచేతను, ప్రథయతి=ప్రఖ్యాతుని(విస్తీర్ణుని), కరోతి=చేయుచున్నది.

తాత్పర్యము : 'ఓ పురోడాశమా! నీవు అధికమగునట్లు విస్తీర్ణ మగుము. నీ యజ్ఞపతి విస్తీర్ణుడగుగాక' అని శ్రుతి చెప్పుటచే విస్తీర్ణమైన పురోడాశము యజమానునే ప్రజా పశువులచే విస్తీర్ణునిజేయును. ఈ బ్రాహ్మణము యజుస్సు చెప్పిన యజ్ఞపతియొక్క విస్తారమును చూపించినది.

10. మంత్రము :త్వచం గృహ్ణీష్వేత్యాహ । సర్వమేవైనగ్ం సతనుం కరోతి ।

అర్థము : ''త్వచం గృహ్ణీష్వ'' ఇతి ఆహ='ఓ పురోడాశమా! నీవు ఉదకముచే మృదువైన శరీరమును స్వీకరించుము' అని శ్రుతి చెప్పినది. ఏనం సర్వమ్=ఈ సర్వపురోడాశమును, సతనుమేవ=శరీరసహితమునుగానే, కరోతి=చేయుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : 'ఓ పురోడాశమా! నీవు ఉదకముచే మృదువైన శరీరమును స్వీకరించుము' అని చెప్పుచు పురోడాశముపైని ఉదకమును చల్లుటవలన నిమ్నోతభావము పోయి త్వక్సాదృశ్యము వచ్చుటచే అధ్వర్యుడీ పురోడాశమును సర్వమును శరీరసహితమునుగానే చేసినవాడగుచున్నాడు. నిమ్నోన్నతపరిహారముచే త్వక్సాదృశ్య మేర్పడగా పురోడాశము సదేహ మగునని యీ బ్రాహ్మణము చెప్పినది.

11. మంత్రము :అథాప ఆనీయ పరిమార్ష్టి । మాగ్ంస ఏవ తత్త్వచం దధాతి । తస్మాత్త్వచా మాగ్ంసం ఛన్నమ్ ।

అర్థము : అథ=అనంతరము, అపః=ఉదకములను, ఆనీయ=తీసికొని, పరిమార్ష్టి=అంతటను మార్జనము చేయవలెను, (చల్లవలెను). తత్=ఆ పరిమార్జనముచే, త్వచమ్=శరీరమును, మాంసే ఏవ=మాంసమునందే, దధాతి=స్థాపించినవాడగుచున్నాడు. తస్మాత్=ఆ కారణమువలన, త్వచా=శరీరముచే, మాంసమ్=మాంసము, ఛన్నమ్=కప్పబడినది.

తాత్పర్యము : ఉదకముచేత తడిపి మర్దించి పురోడాశమును ముద్దగాజేసినతరువాత దానిపైని అంతటను ఉదకములచే మార్జనము చేయవలెను. అధ్వర్యుడా పరిమార్జనముచే శరీరమును మాంసమునందే స్థాపించినవాడగుచున్నాడు. ఆ కారణమువలన చర్మముచే మాంసము కప్పబడియుండును. ఈ బ్రాహ్మణము పురోడాశమునకు శ్లక్ష్ణీకరణమును విధించినది.

12. మంత్రము :**ఘుర్మో వా ఏషోకశాన్తః । అర్ధమాసేకర్ధమాసే ప్రవృజ్యతే । యత్పురోడాశః । స ఈశ్వరో యజమానగ్ం శుచాకప్రదహాః । పర్వగ్ని కరోతి । పశుమేవైనమకః । శాన్త్యా అప్రదాహాయ ।**

అర్థము : పురోడాశః యత్=పురోడాశమేది కలదో, ఏషః=ఈ పురోడాశము, ఘుర్మః వై=దీపించుచున్నదియే యై, అశాన్తః=శాంతము కానిదై, అర్ధమాసే అర్ధమాసే=ప్రతి యర్ధమాసమందు(పక్షమునందు), ప్రవృజ్యతే=తప్తకపాలములచే తపించబడుచున్నది. సః=తప్తమగుచున్న పురోడాశము, యజమానమ్=యజ్ఞకర్తను, శుచా=తాపముచేత, అప్రదహాః=ప్రకర్షముగ దహించుటకై, ఈశ్వరః=సమర్థ మగుచున్నది. శాన్త్యై=శాంతి కొఱకు, అప్రదాహాయ=ప్రకర్షముగ తాపము లేకుండుటకొఱకును, పర్యగ్నికరోతి=దీప్తములైన దర్భలచే పురోడాశమున కంతటను రాక్షస సంశోధనము చేయవలెను. ఏనమ్=ఈ పురోడాశమును, పశుమేవ=పశువునుగానే, అకః=చేసినవాడగును.

తాత్పర్యము : ఈ పురోడాశము ప్రతిపక్షమునందు తప్తకపాలములచే తప్యమానమగుటవలన దీప్యమానమైన అగ్నియై ఒకప్పుడును శమించదు. ఆ పురోడాశము యజమానుని పకర్షముగ దహించుటకు సమర్థ మగును. అందు పశూపచారముచేత, పర్యగ్నికరణముచే పురోడాశము పశువుగాచ జేయబడిన దగుచుండగా ప్రదీప్తాగ్నిరూప పరిత్యాగముచే శాంతమై యజమానుని దహించదు. ఇచట పర్యగ్నికరణము విధించబడినది.

13. మంత్రము :**త్రిః పర్యగ్ని కరోతి । త్ర్యావృద్ధి యజ్ఞః అథో రక్షసా మపహత్యై ।**

అర్థము : త్రిః=మూడు మారులు, పర్యగ్ని కరోతి=దీపించుచున్న దర్భలను పురోడాశమునకు చుట్టు త్రిప్పవలెను. యజ్ఞః=యజ్ఞము, త్ర్యావృత్=మూడు ఆవృత్తులు కలది కదా! అథో=మఱియు, ఏతత్=ఈ త్రిఃపర్యగ్ని కరణము, రక్షసామ్=రాక్షసులయొక్క, అపహత్యై=నాశమునకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : మండుచున్న దర్భలను పురోడాశమునకు చుట్టు మూడు మారులు త్రిప్పవలెను. యజ్ఞము మూడు ఆవృత్తులు కలది కదా! మూడు మారులు చేయబడునని యర్థము. మఱియు ఈ పర్యగ్నికరణమువలన రాక్షసనాశము కలుగును. ఇచట పర్యగ్నికరణమున కావృత్తి విధించబడినది.

14. మంత్రము :**అన్తరితగ్ం రక్షోకన్తరితా అరాతయ ఇత్యాహ। రక్షసా మన్తర్హిత్యై ।**

అర్థము : ''అన్తరితగ్ం రక్షోఽన్తరితా అరాతయః'' ఇతి ఆహ='రాక్షసజాతియు, శత్రువులును దూరమున ఉన్నవారగుదురు గాక' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ కథనము, రక్షసామ్ అన్తర్హిత్యై=రాక్షసులంతర్హితులగుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : రాక్షసజాతియు, శత్రువులును దూరస్థ లగుదురు గాక యని చెప్పుటచే రాక్షసులు, శత్రువులును దూరస్థ లగుదురు. 'అన్తరితగ్ం రక్షః' అను మంత్రము నీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

15. మంత్రము :**పురోడాశం వా అధిశ్రితగ్ం రక్షాగ్ంస్యజిఘాగ్ంసన్ । దివి నాకో నామాగ్నీ రక్షోహా । స ఏవాస్మాద్రక్షాగ్ం స్యపాహన్ । దేవస్త్వా సవితా శ్రపయత్విత్యాహ। సవితృప్రసూత ఏవైనగ్ం శ్రపయతి । వర్ష్మే అధి నాక ఇత్యాహ। రక్షసామపహత్యై । అగ్నిస్తే తనువం మా కతిధా గిత్యాహానతిదాహాయ ।**

అర్థము : అధిశ్రితమ్=పక్వము చేయcబడిన, పురోడాశంవై=పురోడాశమునే, రక్షాంసి=రాక్షసులు, అజిఘాంసన్=హింసింప నిచ్ఛయింతురు. దివి=ద్యులోకమునందు, నాకః నామ అగ్నిః=నాక నామకుడైన యగ్ని, రక్షోహా=రాక్షసహంతయై, ఆసీత్=ఉండెను. సః ఏవ=ఆ యగ్నియే, అస్మాత్=ఈ యజ్ఞమునుండి, రక్షాంసి=రాక్షసులను, అపాహన్=పోcగొట్టెను. ''దేవస్త్వా సవితా శ్రపయతు'' ఇతి ఆహ='ఓ పురోడాశమా! సవితృదేవుcడు నిన్ను వండుcగాక,' అని శ్రుతి చెప్పెను. అనేన=ఈ చెప్పుటచే, సవితృప్రసూతఃఏవ=అధ్వర్యుcడు సవితచే ప్రేరితుcడేయై, ఏనమ్=ఈ పురోడాశమును, శ్రపయతి=వండుచున్నవాcడగుచున్నాcడు. ''వర్ష్మే అధి నాకే'' ఇతి ఆహ='ప్రకర్షముగ వృద్ధినొందుచున్న యగ్నియందు వండుచున్నాcడని' చెప్పుట, రక్షసామ్=రాక్షసులయొక్క, అపహత్యై=నాశముకొఱకు, భవతి=అగుచున్నది. ''అగ్నిస్తే తనువం మాఽతి ధాక్'' ఇతి ఆహ='ఓ పురోడాశమా! అగ్ని నీ శరీరము నత్యంతము (భస్మమగునట్లు) దహింపకుండుcగాక' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ కథనము, అనతిదాహాయ=పురోడాశమునకు భస్మీభావరూపమైన యతిదాహము లేకుండుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఓ పురోడాశమా! ప్రవృద్ధమైన నాకనామాగ్నియందు నిన్ను ఉంచి సవితృదేవుcడు పక్వముగాc జేయుcగాక. ఈ యగ్ని నీ శరీరమునకు భస్మీభావరూపమైన యతిదాహమును చేయకుండుcగాక. మంత్రమునందలి సవితృపదముయొక్కయు, నాకపదముయొక్కయు, 'మాఽతిధాక్' అనుదానియొక్కయు నభిప్రాయమును ఈ బ్రాహ్మణము తెలియcజేసినది. శేషము సులభగ్రాహ్యము.

16. మంత్రము :**అగ్నే హవ్యగ్ం రక్షస్వేత్యాహ గుప్త్యై ।**

అర్థము : ''అగ్నే హవ్యగ్ం రక్షస్వ'' ఇతి ఆహ='ఓ యగ్నీ! హవిస్సును రక్షించుము' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఇది, గుప్త్యై=రక్షణముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఓ యగ్నీ! హవిస్సును రక్షించుమని మంత్రము చెప్పినది. ఈ విధముగ చెప్పుటవలన హవీరక్షణ మగును. ఈ యజుస్సును పఠించుచు నధ్వర్యుcడు గార్హపత్యాగ్ని నభిమంత్రించవలెను.

17. మంత్రము :**అవిదహన్తః శ్రపయతేతి వాచం విసృజతే । యజ్ఞమేవ హవీగ్ంష్యభివ్యాహృత్య ప్రతనుతే । పురోరుచ మవిదాహాయ శ్రుత్యై కరోతి ।**

అర్థము : 'అవిదహన్తఃశ్రపయత' ఇతి వాచం విసృజతే='విశేషముగ భస్మీభావ రూపమైన దాహము కలుగఁజేయనివారై బాగుగపాకమును చేయుcడు'అను ప్రైషమంత్రముచే వాక్కును విడువవలెను. యజ్ఞమేవ=యజ్ఞమునే,

అభివ్యాహృత్య=అభిలక్షించి,(తత్రాపి=ఆ యజ్ఞమునందును, ప్రధానభూతాని=ప్రధానములైన) హవీంషి=హవిస్సులను, అభివ్యాహృత్య=అభిలక్షించి, ప్రతనుతే=యజ్ఞమును విస్తరింపఁజేసినవాఁ డగుచున్నాఁడు. కించ=మఱియు, అవిదాహాయ=విశేషముగ దాహనివృత్తికొఱకు, శ్రుత్యై=బాగుగ పాకగుణసిద్ధికొఱకును, పురోరుచిమ్=హవిస్స్వీకారమునకు పూర్వమే రుచిని, కరోతి=చేయుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : 'ఓ యాగ్నీధ్రుఁడా! భస్మీభావరూపమైన విశేషదాహమును పరిత్యజించి బాగుగ పాకమును చేయుము' అను ప్రైషమంత్రముచే నాగ్నీధ్రుఁడు సంప్రపనకాలమున స్వీకరించిన వాజ్ఞియమమును విడువవలెను. 'అవిదహన్తః' అను బహువచన పూజార్థము. ఈ సమయమున వాగ్విమోకము కలుగఁగా యజ్ఞమునే యభిలక్షించి, అందునను ప్రధానములైన హవిస్సుల నభిలక్షించి వాక్కునుచ్చరించి యజ్ఞమును విస్తరింపఁజేసినవాఁ డగును. మఱియు విశేషముగ దాహనివృత్తికొఱకు, బాగుగ పాకగుణసిద్ధికొఱకును ఆగ్నీధ్రుఁ డీ ప్రైషమంత్రము నధ్వర్యునిచే నుచ్చరింపఁజేసినవాఁ డగుచు హవిస్స్వీకారమునకు పూర్వమే దేవతలకొఱకు రుచిని చేసినవాఁ డగును. ఇచట ఆగ్నీధ్రునిఁ గూర్చి ప్రైషమంత్రము నుత్పాదించి యీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. పురోడాశనిష్పత్తికై పిండిని కలుపునప్పుడు పాటించిన వాజ్ఞియమము నీ సమయమున పరిత్యజించవలెనని యర్థము.

18. మంత్రము :**యో విదగ్ధః స నైర్ఋతో యో ఽశృతః స రౌద్రో యః శృతః స సదేవ స్తస్మా దవిదహతా శృతం కృత్యై సదేవత్వాయ ।**

అర్థము : యః=ఏది, విదగ్ధః=విశేషముగ(భస్మీభావరూపమున) దగ్ధమైనదో, సః=అది, నైర్ఋతః=నిర్ఋతికి సంబంధించినది. యః=ఏది,అశృతః=పక్వముచేయఁబడనిదో,సః=అది, రౌద్రః=రుద్రసంబంధి (రుద్రుఁడను క్రూరదేవునికి సంబంధించినది). యః=ఏది, శృతః=పక్వమైనదో, సః=అది, సదేవః=దేవసహిత మైనది. తస్మాత్=ఆ కారణమువలన, అవిదహతా=భస్మీభావరూపముకాని దాహముచేత, శృతంకృత్యైః=పక్వము చేయఁబడినది, సదేవత్వాయ=దేవసాహిత్యముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : విశేషముగ దగ్ధమైన పురోడాశము నిర్ఋతికి సంబంధించిన దగును. పక్వముకాని పురోడాశము రుద్రుఁడను క్రూరదేవునకు సంబంధించిన దగును. పక్వము చేయఁబడిన పురోడాశము దేవసంబంధి యగును. ఆ కారణమువలన అనతిదాహముచే పక్వము చేయఁబడిన పురోడాశము దేవసాహిత్యమున కగును. భస్మీభావరూప దాహమును పరిత్యజించి బాగుగ శ్రపణమును చేయవలెనను విషయము ఈ బ్రాహ్మణమున వివరించఁబడినది.

19. మంత్రము :**మస్తిష్కో వై పురోడాశః । తం యన్నాభివాసయేత్ । ఆవిర్మస్తిష్కః స్యాత్ । అభివాసయతి । తస్మాద్గుహా మస్తిష్కః ।**

అర్థము : పురోడాశః=పురోడాశము, మస్తిష్కఃవై=శిరస్సునందుఁగలమేదఃఖండమే(మేదఃఖండమువంటిదే). తమ్=ఆ పురోడాశమును, నాభివాసయేత్ యత్=అంతట నాచ్ఛాదించనిచో, మస్తిష్కఃమస్తిష్కమువంటి పురోడాశము, ఆవిఃస్యాత్=ఆవిరి యగును. అభివాసయతి=పురోడాశము నాచ్ఛాదింపవలెను. తస్మాత్=ఆ కారణమువలన, మస్తిష్కఃశిరస్సునం దుండునట్టి మేదఃఖండము, గుహా=గూఢమైనది. ఆచ్ఛాదితమని యర్థము.

తాత్పర్యము : పురోడాశము శిరస్సునందుఁగలమేదఃఖడమువంటిదే. అట్టిపురోడాశము నాచ్ఛాదింపనిచో మస్తిష్కమువంటి యా పురోడాశము ఆవిరి యగును. అందువలన నాచ్ఛాదించవలెను. ఆ కారణమువలన శిరోభాగము నందుఁగల మేదఃఖండ మాచ్ఛాదితమై యున్నది. ఇచట పురోడాశాచ్ఛాదనము విధించఁబడినది.

20. మంత్రము :భస్మనాఽభివాసయతి । తస్మాన్మాగ్ంసేనాస్థి ఛన్నమ్ ।

అర్థము : భస్మనా=భస్మముచేత, అభివాసయతి=పురోడాశము నాచ్ఛాదించవలెను. తస్మాత్=ఆ కారణమువలన, మాంసేన=మాంసముచేత, అస్థి=ఎముక, ఛన్నమ్=ఆచ్ఛాదిత మైనది.

తాత్పర్యము : పూర్వోక్తమైన పురోడాశమును భస్మముచే నాచ్ఛాదించవలెను. భస్మముచే పురోడాశ మాచ్ఛాదిత మగుట వలన లోకమునందు మాంసముచే ఎముక ఆచ్ఛాదితమై యున్నది. ఇచట ఛాదనయోగ్యమైన భస్మము విధించఁబడినది.

21. మంత్రము :వేదేనాభివాసయతి । తస్మాత్కేశైఃశిరశ్ఛన్నమ్ ।

అర్థము : వేదేన=దర్భకట్టచే, అభివాసయతి=పురోడాశముపైని భస్మము నాచ్ఛాదింపవలెను. తస్మాత్=ఆ కారణము వలన, కేశైఃకేశములచే, శిరఃశిరస్సు, ఛన్నమ్=ఆచ్ఛాదిత మైనది.

తాత్పర్యము : వేదిని సంమార్జనము చేయుటలో హేతువైనదియు, దర్భముష్టినిర్మితమైనదియునగు దర్భలకట్ట ఇచట వేద మనఁబడుచున్నది. అట్టి వేదముచే భస్మమును పురోడాశముపైని ఆచ్ఛాదింపవలెను. ఆ కారణమువలన కేశములచే శిరస్సు ఆచ్ఛాదితమై యున్నది. ఆ దర్భకట్టయందలి దర్భలకు కేశములతో సామ్యము. ఇచట భస్మమును కప్పుటయందు సాధనము విధించఁబడినది.

22. మంత్రము :అఖలతిభావుకో భవతి । య ఏవం వేద ।

అర్థము : యఃఏ పురుషుఁడు, ఏవమ్=ఈ పూర్వోక్తవిధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సఃఅతఁడు, అఖలతిభావుకఃభవతి=ఖలతిభవనశీలుఁడగుటలేదు. ఖలతిఃకేశరహితశిరోయుక్తుఁడు(బట్టతలవాఁడు). తద్భిన్నుఁడు అఖలతిభావుకుఁడు.

తాత్పర్యము : పూర్వోక్తవిధముగతెలిసికొనినయతఁడు బట్టతలవాఁడుకాఁడు. ఇచట ఏతద్వేదనము ప్రశంసించఁబడినది.

23. మంత్రము :**పశోర్వై ప్రతిమా పురోడాశః । స నాయజుష్కమభివాస్యః । వృథైవ స్యాత్ । ఈశ్వరా యజమానస్య పశవః ప్రమేతోః । సం బ్రహ్మణా పృచ్యస్వేత్యాహ। ప్రాణా వై బ్రహ్మ । ప్రాణాః పశవః । ప్రాణైరేవ పశూన్త్సంపృణక్తి । న ప్రమాయుకా భవన్తి ।**

అర్థము : పురోడాశః=పురోడాశము, పశోః=పశువునకు, ప్రతిమా వై=ప్రతిమయే. సః=పశువుగా నుపచారము చేయcబడిన యా పురోడాశము, అయజుష్కమ్=అమంత్రకముగ, న అభివాస్యః=ఆచ్ఛాదితవ్యము కాదు. వృథైవ స్యాత్=మంత్రరహితముగ నాచ్ఛాదనము చేయుట వ్యర్థమువలె నగును. యజమానస్య=యజమానుని యొక్క, పశవః=పశువులు, ప్రమేతోః=మరణించుటకు, ఈశ్వరాః=సమర్థములు, స్యుః=అగును. తత్=ఆ కారణమువలన, ''సః బ్రహ్మణా పృచ్యస్వ'' ఇతి ఆహ='ఓ పురోడాశమా! నీవు మంత్రముతో బాగుగ కలసికొనుము' అని శ్రుతి చెప్పినది. బ్రహ్మ=మంత్రము, ప్రాణాః వై=ప్రాణముల స్వరూపమే. పశవః=పశువులు, ప్రాణాః=ప్రాణస్వరూపములు. (తదా=అప్పుడు అధ్వర్యుః=అధ్వర్యుcడు,) పశూన్=పశువులను, ప్రాణైః ఏవ=ప్రాణములతోడనే, సంపృణక్తి=కలిపినవాc డగుచున్నాcడు. పశవః=పశువులు, ప్రమాయుకాః=మరణించునట్టివి, న భవన్తి=అగుట లేదు.

తాత్పర్యము : పర్యకరణముచే పురోడాశము పశూకృత మగుటవలన, పశువుమంత్రసంస్కార్య మగుటవలనను, మంత్రము లేకుండ నభివాసన మనర్థక మగును. కేవలము వైయర్థ్యమే కాదు. యజమానునియొక్క పశువులు మరణించునవియు నగును. (ఇది వ్యతిరేకము.) సంపర్కప్రతియోగియైన మంత్రము పశువులను మరణమునుండి కాపాడును కనుక మంత్రము ప్రాణస్వరూపము. పశువులు ప్రాణాధారము లగుటవలన ప్రాణస్వరూపములు. ఈ కారణముచే పురోడాశము యోగ్యమగుటవలన పురోడాశమునకు మంత్ర సంపర్కము కలుగcగానే పశువులు మరణించునవి కావు. (ఇది అన్వయము.) ఇచట సమంత్రకత్వ ప్రకాశకమైన మంత్రమును అన్వయవ్యతిరేకములచే ఈ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

24. మంత్రము :**యజమానో వై పురోడాశః ప్రజా పశవః పురీషమ్ । యదేవ మభివాసయతి ।యజమానమేవ ప్రజయా పశుభిః సమర్ధయతి ।**

అర్థము : యజమానః=యజమానుcడు, పురోడాశః వై=పురోడాశమే(పురోడాశమువంటివాcడే). ప్రజా=ప్రజ, పశవః=పశువులును, పురీషమ్=పురీష(భస్మ)స్వరూపములు. ఏవమ్ అభివాసయతి యత్=ఈ విధముగ అధ్వర్యుcడు భస్మముచే పురోడాశము నాచ్ఛాదించినచో, యజమానమేవ=యజమానునే, ప్రజయా=ప్రజచేత(సంతానముచేత), పశుభిః=పశువులచేత, సమర్ధయతి=సమృద్ధునిగాc జేసినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : యజమానుcడు పురోడాశ స్వరూపుcడే. ప్రజయు, పశువులును భస్మమువంటివారు. పూర్వోక్తవిధముగ నధ్వర్యుcడు భస్మముచే పురోడాశము నాచ్ఛాదించినచో యజమానుని సంతానముచేతను, పశువులచేతను

సమృద్ధునిగాc జేసినవాc డగును. పురీషమ్=భస్మము. మంత్రముచే సంపర్కము యుక్తమైనవిధముగ భస్మముచేcగూడ సంపర్కము యుక్తమని యీ బ్రాహ్మణము చెప్పినది.

25. మంత్రము :**దేవా వై హవిర్భూత్వా కబ్రువన్ । కస్మిన్నిదం మ్రక్ష్యామహ ఇతి। సో కగ్నిరబ్రవీత్ । మయి తనూః సంనిధధ్వమ్ । అహం వస్తం జనయిష్యామి ।యస్మిన్మ్రక్ష్యధ్వ ఇతి । తే దేవా అగ్నౌ తనూః సంన్యదధత। తస్మాదాహుః । అగ్నిః సర్వా దేవతా ఇతి ।సో కజ్గారేణాపః ।అభ్యపాతయత్ । తత ఏకతో కజాయత ।స ద్వితీయ మభ్యపాతయత్ । తతో ద్వితో కజాయత । స తృతీయ మభ్యపాతయత్ । తతస్త్రితో కజాయత। యదద్భ్యో కజాయన్త ।తదాప్యానా మాప్యత్వమ్ ।యదాత్మభ్యో కజాయన్త ।తదాత్మ్యానా మాత్మ్యత్వమ్।**

అర్థము : దేవాః=దేవతలు, హవిఃవై భూత్వా=హవిస్సుగానే అయి (హవిస్సును సంపాదించి), కస్మిన్=ఏ పురుషుని యందు, ఇదమ్=ఈ పాపమును, మ్రక్ష్యామహే?=ఉంచుదుము? ఇతి=అని, అబ్రువన్=పలికిరి. 'మయి=నాయందు, తనూఃశరీరములను(వీర్యములను), సంనిధధ్వమ్=ఉంచుcడు. యస్మిన్=దేని యందు, మ్రక్ష్యధ్వమ్=ఉంచుదురో, వఃమీయొక్క, తమ్=ఆ వీర్యమును, జనయిష్యామి=పుట్టింతును' ఇతి=అని, సఃఅగ్నిఃఆ యగ్ని, అబ్రవీత్=పలికెను. తే దేవాఃఆ దేవతలు, అగ్నౌ=అగ్నియందు, తనూఃశరీరములను (వీర్యములను), సంన్యదధత=బాగుగనుంచిరి. తస్మాత్=దేవతలు శరీరములను అగ్నియందు ఉంచుటవలన, అగ్నిఃఅగ్ని, సర్వాఃదేవాఃఇతి=సర్వదేవతలని (సర్వదేవతాస్వరూపుcడని), ఆహుఃచెప్పిరి.

సఃఆ యగ్ని, అజ్గారేణ=సర్వవీర్యధారియైన అంగారముచేత, అపఃఅబ్దేవత నభిలక్షించి, అపాతయత్=వీర్యమును పడవైచెను. తతఃపడిన యా వీర్యమునుండి, ఏకతఃఏకత నామకుcడు, అజాయత=పుట్టెను. సఃఆ యగ్ని, ద్వితీయమ్=రెండవపర్యాయము, అభ్యపాతయత్=అబ్దేవత నభిలక్షించి పడవైచెను. తతఃఆ రెండవదానినుండి, ద్వితఃద్విత నామకుcడు, అజాయత=పుట్టెను. సఃఆ యగ్ని, తృతీయమ్=మూcడవపర్యాయము, అభ్యపాతయత్=అబ్దేవత నభిలక్షించి పడవైచెను. తతఃఆ మూcడవదానినుండి, త్రితఃత్రిత నామకుcడు, అజాయత=పుట్టెను. అద్భ్యఃఅజాయన్త యత్ తత్=అప్పుల(ఉదకముల)నుండి పుట్టుటవలన, అప్యానామ్=అప్పులసంబంధులైనవారికి, అప్యత్వమ్=ఆప్య నామము, అభవత్=ఆయెను. ఆత్మభ్యఃఅజాయన్త యత్ తత్=దేవతాత్మలనుండి పుట్టుటవలన, ఆత్మ్యత్వమ్=ఆత్మ్య నామము, అభవత్=ఆయెను.

తాత్పర్యము : పూర్వము దేవతలు వ్రీహులను అవహననాదికము చేయుటచే హవిస్సును సంపాదించి, దానిని భక్షించి, ఆ వ్రీహ్యవఘాతాదికమువలన (బీజవధాదికమువలన) జన్యమైన పాపలేపమును ఏ పురుషునియందుంచుదుము? అని విచారించి, అగ్నివచనము ననుసరించి తమ వీర్యము నగ్నియందు స్థాపించిరి. అనంతరము ఆ యగ్ని సర్వవీర్యధారియైన అంగారముచేత అబ్దేవత నభిలక్షించి యా వీర్యమును పడవైచెను.

పడిన యా వీర్యమునండి ఏకత నామకుఁడు పుట్టెను. రెండవమారు పడవేయఁగా నా వీర్యమునండి ద్విత నామకుఁడు పుట్టెను. మూఁడవమారు కూడ పడవేయఁగా దానినుండి త్రిత నామకుఁడు పుట్టెను. ఆ వీర్యము నుండి పుట్టిన ఏకతాది నామకులైన దేవవిశేషములకు అబ్దేవతలు తల్లులు, దేవతలైన యాత్మలు తండ్రులును కనుక వారికి ఆప్యనామకత్వము, ఆత్మ్యనామకత్వము కూడ యుక్తము.

26. మంత్రము :**తే దేవా ఆపేయ్ష్వమృజత। ఆప్యా అమృజత సూర్యాభ్యుదితే । సూర్యాభ్యుదితః । సూర్యాభినిమ్రుక్తే**

సూర్యాభినిమ్రుక్తః కునఖినీ । కునఖీ శ్యావదతి । శ్యావదన్నగ్రదిధిషా ।

అగ్రదిధిషుఃపరివిత్తే । పరివిత్తో వీరహణీ । వీరహా బ్రహ్మహణీ । తద్బ్రహ్మహణం నాత్యచ్యవత ।

అర్థము : తే దేవాః=ఆ దేవతలు, ఆపేయ్ష=ఏకతాదులందు, అమృజత=పాపలేపమును ప్రోక్షించిరి(చల్లిరి). ఆప్యాః=ఏకతాదులు, సూర్యాభ్యుదితునియందు, అమృజత=ఆ పాపలేపమును ప్రోక్షించిరి. సూర్యాభ్యుదితః=సూర్యాభ్యుదితుఁడు, సూర్యాభినిమ్రుక్తే=సూర్యాభినిమ్రుక్తునియందు అమృజ. సూర్యాభినిమ్రుక్తః=సూర్యాభినిమ్రుక్తుఁడు, కునఖిని=కునఖియందు, అమృజ. శ్యావదన్=శ్యావదంతుఁడు, అగ్రదిధిషా=అగ్రదిధిషునియందు, అమృజ. అగ్రదిధిషుఃఅగ్రదిధిషుఁడు, పరివిత్తే=పరివిత్తునియందు, అమృజ. పరివిత్తఃపరివిత్తుడు, వీరహణి=క్షత్రియహంతయందు, అమృజ. వీరహా=క్షత్రియహంత, బ్రహ్మహణి=బ్రహ్మహంతయందు, అమృజ. తత్=ఆ పాపము, బ్రహ్మహణమ్=బ్రహ్మహంతను, నాత్యచ్యవత=అతిక్రమించిపోలేదు.

తాత్పర్యము : పూర్వోక్తమైన పాపలేపము పరంపరగా వ్రీహ్యవఘాతియైన పురుషునియందు పర్యవసితమైనదని యీ బ్రాహ్మణము చెప్పుచున్నది. పూర్వము చెప్పబడిన యా దేవతలు పాపలేపమును ఆప్యులైన యేకతాదులందు చల్లిరి. ఆప్యాదులు సూర్యాభ్యుదితాదులందు పరంపరగా నా పాపలేపమును చల్లిరి. బ్రహ్మహంత పాపాధిక్యము కలవాఁడగుటవలన ఆ పాపలేపము బ్రహ్మహంత నతిక్రమించి పోలేదు. అనఁగా ఆ పాపలేపమా బ్రహ్మహంతయందే యుండెను.

వివరణము: సూర్యాభ్యుదిఃసూర్యోదయకాలమందు నిద్రించినవాఁడు. సూర్యాభినిమ్రుక్తఃసూర్యాస్తమయకాలము నందు నిద్రించినవాఁడు. కునఖీనఖవక్రత్వమనెది రోగవిశేషము కలవాఁడు. శ్యావదన్=దంతమాలిన్యము కలవాఁడు. అగ్రదిధిషుఃజ్యేష్ఠకన్య అవివాహితయై యుండఁగా కనిష్ఠకన్యను వివాహము చేసికొనియున్నవాఁడు. పరివిత్తఃకనిష్ఠుఁడు వివాహితుఁడై యుండఁగా వివాహరహితుఁడైన జ్యేష్ఠుఁడు. వీరహా=(వీరుని) క్షత్రియుని చంపినవాఁడు. బ్రహ్మహా=బ్రాహ్మణుని చంపినవాఁడు.

27. మంత్రము :**అన్తర్వేది నినయత్యవరుద్ధ్యై ।**

అర్థము : అన్తర్వేది=వేదియొక్క మధ్యభాగమున, నినయతి=పురోడాశము నుంచవలెను. ఏతత్=ఈ నినయనము, అవరుద్ధ్యై=కర్మఫలప్రాప్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : వేదిమధ్యమున ప్రక్షాళనోదకములయొక్క రేఖలందు నినయనము విధించఁబడినది. పురోడాశమును వేదిమధ్యభాగమున నుంచవలెను. యజమానునకు కర్మఫలప్రతిబంధమైన పాపలేపము తొలఁగుటవలన ఈ నినయనము ఫలసంపాదనమునకై సంపన్న మగుచున్నది.

28. మంత్రము :**ఉల్ముకేనాభిగృహ్ణాతి శృతత్వాయ । శృతకామా ఇవ హి దేవాః ॥**

అన్యా జిన్వన్త్యను విసృత్యైవ మాహాశాన్త ఆహ గుహ్యే ఛన్నం బ్రహ్మోకబ్రవీ ద్ద్వితీయ

మభ్యపాత యత్సూర్యాభినిమ్రుక్తే దేవాః ॥

ఇతి కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే అష్టమోనువాకః ॥౮॥

అర్థము : శృతత్వాయ=పక్వత్వముకొఱకు, ఉల్ముకేన=కొఱవిచే, అభిగృహ్ణాతి=జలము నంతటను గ్రహించవలెను. దేవాః=దేవతలు, శృతకామాః ఇవ హి=పక్వమును కోరువారే కదా!

తాత్పర్యము : పురోడాశమును వేదిమధ్యమున ప్రక్షాళనోదకరేఖలయం దుంచవలెనని పూర్వమంత్రమునఁ జెప్పఁబడినది. ఆ యుదకమును కొఱవితో గ్రహించవలెను. అప్పు డా యుదకము పక్వమువంటి దగును. దేవతలు శృతమును కోరునట్టివారివంటివారు కదా! శృతమైనది సదేవమని పూర్వ ముదాహరించఁబడినది.

కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున ద్వితీయ ప్రపాఠకమునందు
అష్టమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే
నవమోఽనువాకః

1. మంత్రము : **దేవస్య త్వా సవితుః ప్రసవ ఇతి స్ఫ్యమాదత్తే ప్రసూత్యై । అశ్వినోర్బాహుభ్యామితి ఆహ। అశ్వినౌ హి దేవానామధ్వర్యూ ఆస్తామ్ । పూష్ణో హస్తాభ్యామితి ఆహ యత్యై ।**

అవతారిక: అష్టమానువాకమునందు పురోడాశ(శ్రపణము చెప్పఁబడినది. శ్రపణము=పక్వము చేయుట. పక్వమైన హవిస్సును వేదియం దాసాదనము చేయవలయును కనుక, ఈ నవమానువాకమందు వేది చెప్పఁబడుచున్నది. వేదికరణార్థములైన మంత్రములు సంహితయందు (కా.1. ప్ర.1. అ.9.) ఆమ్నాతము లైనవి. ఆ మంత్రములకు వ్యాఖ్యానరూప మీ బ్రాహ్మణము.

అర్థము : 'దేవస్య త్వా సవితుః ప్రసవే' ఇతి='దేవస్య త్వా------హస్తాభ్యామాదదే' అను మంత్రముచే, స్ఫ్యమ్=స్ఫ్య మనెడి ఖననసాధన విశేషమును, ఆదత్తే=గ్రహించవలెను. ఏతత్=ఈ గ్రహణము, ప్రసూత్యై=ప్రేరణముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : వేదినిర్మాణమునకై భూమిని త్రవ్వవలెను కనుక త్రవ్వుటయందు సాధనమైన యాయుధవిశేషమును చేతులతో గ్రహించవలెనని యర్థము. ఈ మంత్రము పూర్వము వ్యాఖ్యానించఁబడినది. ఈ బ్రాహ్మణము యథోక్తమైన ఆదానమును విధించినది.

2. మంత్రము : **ఆదద ఇన్ద్రస్య బాహురసి దక్షిణ ఇత్యాహ। ఇన్ద్రియమేవ యజమానే దధాతి ।**

అర్థము : ''ఆదద ఇన్ద్రస్య బాహురసి దక్షిణః'' ఇతి ఆహ='ఓ స్ఫ్యము అను ఖననసాధన విశేషమా! నీవు ఇంద్రునియొక్క దక్షిణబాహువువలె సమర్థ మగుచున్నావు' అని యధ్వర్యుఁడనెనని మంత్రము చెప్పినది. ఇన్ద్రియమేవ=ఇంద్రియ సామర్థ్యమునే, యజమానే=యజమానునియందు, దధాతి=స్థాపించుచున్నవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : అధ్వర్యుఁడు వేదినిర్మాణమునకై భూమిని త్రవ్వుటకొఱకు స్ఫ్యమును హస్తములతో తీసికొనుచు ఓ యాయుధమా! నీవు ఇంద్రునియొక్క దక్షిణ బాహువువలె సమర్థ మగుచున్నావని యనుటచే నతఁడు యజమానునియందు ఇంద్రియ సామర్థ్యమునే స్థాపించినవాఁడగుచున్నాఁడు. ఈ మంత్రమును పఠించుచు నధ్వర్యుఁడు స్ఫ్యము నభిమంత్రించవలెను.

3. మంత్రము : **సహస్రభృష్టిః శతతేజా ఇత్యాహ। రూపమేవాస్యైతన్మహిమానం వ్యాచష్టే ।**

అర్థము : ''సహస్రభృష్టిః శతతేజాః'' ఇతి ఆహ='ఓ స్ఫ్యమా! నీవు సహస్రసంఖ్యాకులైన శత్రువులయొక్క మారణము కలదానవును, తీక్ష్ణమైనతేజస్సు కలదానవు నగుచున్నావు'అని మంత్రము చెప్పినది. రూపమేవ=మంత్రగత

శబ్దస్వరూపమే, అస్య=ఈ స్ఫ్యముయొక్క, ఏతన్మహిమానమ్=ఈ సహస్రభృష్టిత్వేత్యాది రూపమహిమను, వ్యాచష్టే=విశేషముగ చెప్పుచున్నది.

తాత్పర్యము : మంత్రముయొక్క ద్వితీయభాగమునందలి శబ్దస్వరూపమే యీ స్ఫ్యముయొక్క మహిమను విశేషముగ చెప్పుచున్నదని యీ బ్రాహ్మణము వివరించినది.

4. మంత్రము : **వాయురసి తిగ్మతేజా ఇత్యాహ। తేజో వై వాయుః (1) తేజ ఏవాస్మిన్దధాతి ।**

అర్థము : ''వాయురసి తిగ్మతేజాః'' ఇతి ఆహ='ఓ స్ఫ్యమా! నీవు తీక్ష్ణతేజస్సు కల వాయుసదృశము కూడ నగుచున్నావు' అని మంత్రతృతీయభాగము చెప్పినది. వాయుః=వాయువు, తేజః వై=తేజస్స్వరూపుcడే. అతః=ఈ కారణమువలన, తేజః ఏవ=తేజస్సునే, అస్మిన్=ఈ యజమానునియందు, దధాతి=వేదము స్థాపించును.

తాత్పర్యము : మంత్రతృతీయభాగమునందు తేజోజనకముగా తేజోరూపcడైన వాయువుతో స్ఫ్యరూపము పోల్చcబడుటవలన యజమానునియందు తేజస్సు ఏర్పడునని యీ బ్రాహ్మణము మంత్రతృతీయభాగమును వ్యాఖ్యానించినది.

5. మంత్రము : **విషాద్వై నామాసుర ఆసీత్ । సోకబిభేత్ । యజ్ఞేన మా దేవా అభిభవిష్యన్తీతి । స పృథివీ మభ్యవమీత్ । సా కమేధ్యా కభవత్ । అథో యదిన్ద్రో వృత్రమహన్ । తస్య లోహితం పృథివీమను వ్యధావత్ । సా కమేధ్యా కభవత్ । పృథివి దేవయజనీత్యాహ (2) ।**

మేధ్యామేవైనాం దేవయజనీం కరోతి ।

అర్థము : విషాత్ నామ అసురః ఆసీత్ వై=విషాత్తు అను పేరు గల యసురుc డుండెనcట! 'యజ్ఞేన=యజ్ఞముచేత, దేవాః=దేవతలు, మా=నన్ను, అభిభవిష్యన్తీతి=అభిభవింపcగలరని (తిరస్కరించcగలరని), సః=ఆ యసురుcడు, అబిభేత్=భయపడెను. సః=ఆ యసురుcడు, పృథివీమ్=భూమిని, అభ్యవమీత్=అంతటను వాంతిచేసికొనెను. సా=ఆ భూమి, అమేధ్యా=అపవిత్రమాయెను. అథో=మఱియు, ఇన్ద్రః=ఇంద్రుcడు, వృత్రమ్=వృత్రుని, అహన్ యత్=వధించినప్పుడు, తస్య=ఆ వృత్రునియొక్క, లోహితమ్=నెత్తురు, పృథివీమను=భూమిననుసరించి, వ్యధావత్=విశేషముగ స్రవించెను. సా=ఆ భూమి, అమేధ్యా=అపవిత్రము, అభవత్=ఆయెను. ''పృథివి దేవయజని'' ఇతి ఆహ='దేవయాగాశ్రయమైన యో పృథివీ!' అని మంత్రము నధ్వర్యుcడు పలికెను. (అనేన=ఈ మంత్రోచ్చారణముచేత, సః=ఆ యధ్వర్యుcడు,) ఏనాం దేవయజనీమ్=దేవయాగాశ్రయమైన యీ భూమిని, మేధ్యామేవ=పవిత్రమునుగానే, కరోతి=చేయుచున్నవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : విషాత్తనెడి అసురుఁడు భూమియందు వాంతిచేసికొనుటచేతను, వృత్రవధ జరిగినప్పుడు ఆ వృత్రునియొక్క నెత్తురు భూమియందు స్రవించుటచేతను అపవిత్రమైన భూమిని 'పృథివి దేవయజని' అను మంత్రము నుచ్చరించుటచే నధ్వర్యుఁడు ఆ భూమిని పవిత్రముగాఁ జేసినవాఁ డగుచున్నాఁడని యీ బ్రాహ్మణము వివరించినది. శేషము సుగమము. విషమ్ అత్తీతి విషాత్=విషమును తినువాఁడు.

6. మంత్రము : **ఓషధ్యాస్తే మూలం మా హిగ్ంసిషమిత్యాహ। ఓషధీనా మహిగ్ంసాయై ।**

అర్థము : ''ఓషధ్యాస్తే మూలం మా హిగ్ంసిషమ్'' ఇతి ఆహ='ఓ పృథివీ! నీ యోషధియొక్క మూలమును హింసించను' అని చెప్పుట, ఓషధీనామ్=ఓషధులయొక్క, అహింసాయై=అహింసకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : మంత్రములోని యితరభాగముయొక్క ప్రయోజనము నీ బ్రాహ్మణము చెప్పినది. శేషము సుస్పష్టము.

7. మంత్రము : **వ్రజం గచ్ఛ గోస్థానమిత్యాహ। ఛన్దాగ్ంసి వై వ్రజో గోస్థానః । ఛన్దాగ్ం స్యేవాస్మై వ్రజం గోస్థానం కరోతి ।**

అర్థము : ''వ్రజం గచ్ఛ గోస్థానమ్'' ఇతి ఆహ='గడ్డితోఁగూడిన యో ధూశీ! ఆగ్నీధ్రుఁడు పలుకునట్టి 'అస్తు శ్రౌషట్' అను ప్రత్యాశ్రవణరూపమైన వాక్కునకు స్థానమైన ఉత్కరప్రదేశమును (వ్రజమును) పొందుము' అని మంత్రము చెప్పినది. ఛన్దాంసి వై=గాయత్ర్యాదిచ్ఛందస్సులే, గోస్థానః వ్రజః=వాక్కునకు స్థానమైన వ్రజము (ఉత్కరప్రదేశము). అసౌ=ఈ యధ్వర్యుఁడు, ఛన్దాంస్యేవ=ఛందస్సులనే, గోస్థానమ్=వాక్కునకు స్థానమైన, వ్రజమ్=ఉత్కరప్రదేశమునుగా, కరోతి=చేయుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ''గడ్డితోఁగూడిన యో ధూశీ! ఆగ్నీధ్రుఁడు పలికిన 'అస్తు శ్రౌషట్' అను ప్రత్యాశ్రవణరూపమైన వాక్కునకు స్థానమైన వ్రజమును పొందుము'' అని శ్రుతి చెప్పినది. గాయత్ర్యాదిచ్ఛందస్సులే గోశబ్దాభిధేయములైన వాక్కులకు అవస్థానయోగ్యమైన వ్రజశబ్దాభిధేయమైన దేశవిశేషము. అందు అర్థద్వయసాధారణ శబ్దోపేతమైన మంత్రమును పఠించుచు ఛందోరూపమైన యుత్కరప్రదేశమును యజమానుఁడు సంపాదించినవాఁ డగుచున్నాఁడు. 'అస్తు శ్రౌషట్' అను మంత్రముచే నాగ్నీధ్రుఁడు ప్రత్యాశ్రవణమును పలుకును. ఆ వాక్కు ఇచట గోశబ్దముచే వివక్షితమైనది.

8. మంత్రము : **వర్షతు తే ద్యౌరిత్యాహ । వృష్టిర్వై ద్యౌః । వృష్టిమేవావరున్ధే ।**

అర్థము : ''వర్షతు తే ద్యౌః'' ఇతి ఆహ='ఓ వేదీ! నీ తృప్తికొఱకు (నిన్ను తడుపుటకొఱకు) ద్యుశబ్దోపలక్షితమైన పర్జన్యుఁడు వర్షించుఁగాక,' అని వేదము చెప్పినది. ద్యౌః=ద్యుశబ్దార్థము, వృష్టిః వై=పర్జన్యుఁడే. అనేన=ఈ చెప్పుటచేత, యజమానః=యజమానుఁడు, వృష్టిమేవ=పర్జన్యునే, అవరున్ధే=పొందుచున్నాఁడు.

తాత్పర్యము : దివి పర్జన్యున కాధారమగుటచే దివికి పర్జన్యత్వోపచారము చెప్పఁబడినదని యీ బ్రాహ్మణము ద్యు శబ్దార్థమును వివరించినది. వర్షతీతి వృష్టిః=పర్జన్యః. వర్షించువాఁడు కనుక వృష్టిశబ్దార్థము పర్జన్యుఁడని వ్యుత్పత్త్యర్థము.

9. మంత్రము : **బధ్నాన దేవ సవితః పరమస్యాం పరావతీత్యాహ(3)। ద్వావావ పురుషౌ। యం చైవ ద్వేష్టి। యశ్చైనం ద్వేష్టి। తావుభౌ బధ్నాతి పరమస్యాం పరావతి శతేన పాశైః। యో ఽస్మాన్ద్వేష్టి యం చ వయం ద్విష్మస్తమతో మామౌగిత్యాహానిమ్రుక్త్యై।**

అర్థము : ''బధ్నాన దేవ సవితః పరమస్యాం పరావతి'' ఇతి ఆహ='ఓ సవిత్రుదేవా! నీవు ద్వేష్టను, ద్వేష్యుని అత్యంతదూరదేశమునందు పాశశతముచే బంధించుము' అని మంత్రము చెప్పినది. పురుషౌ=పురుషులు, ద్వౌ వావ=ఇద్దఱే. యం చైవ=ఎవనినైతే, అయమ్=ఈ యజమానుఁడు, ద్వేష్టి=ద్వేషించుచున్నాఁడో, చ=మఱియు, యః=ఎవఁడు, ఏనమ్=ఈ యజమానుని, ద్వేష్టి=ద్వేషించుచున్నాఁడో, తౌ ఉభౌ=ఆ ద్వేష్టద్వేష్యుల నుభయులను, పరమస్యాం పరావతి=అత్యంతదూరదేశమునందు, శతేన పాశైః=శత సంఖ్యాకములైన పాశములచేత, బధ్నాతి=బంధించుచున్నాఁడు. ''యః=ఎవఁడు, అస్మాన్=మమ్ము (యజమానాదులను), ద్వేష్టి=ద్వేషించుచున్నాఁడో, చ=మఱియు, వయమ్=యజమానాదులమైనమేము, యమ్=ఎవనిని, ద్విష్మః=ద్వేషించుచున్నామో, తమ్=ఆ పురుషద్వయమును, అతః=ఈ బంధనమునుండి, మా మౌక్=విడువవలదు'' ('యో ఽస్మాన్ద్వేష్టి యం చ వయం ద్విష్మమతో మామౌక్') ఇతి ఆహ=అని మంత్రము చెప్పెను. ఏతత్=ఈ కథనము, అనిమ్రుక్త్యై=విమోచనాభావమునకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : 'యో ఽస్మాన్ద్వేష్టి యం చ వయం ద్విష్మః' అను మంత్రమునందు 'యో ఽస్మాన్యం చ' అనునది పునరుక్తి కాదనియు, ద్వేష్యుని గూర్చి కర్తగాను, కర్మగాను పురుషభేదము కలదని యీ బ్రాహ్మణము పునరుక్తి దోషశంకను నివారించినది. తాత్పర్యము స్పష్టము.

10. మంత్రము :**అరరురై నామాసుర ఆసీత్। స పృథివ్యాముపమ్లుష్టో ఽశయత్। తం దేవా అపహతో ఽరరుః పృథివ్యా ఇతి పృథివ్యా అపాఘ్నన్। భ్రాతృవ్యో వా అరరుః। అపహతో ఽరరుః పృథివ్యా ఇతి యదాహ(4)। భ్రాతృవ్యమేవ పృథివ్యా అపహన్తి।**

అర్థము : అరరుః నామ అసురః వై=అరరు నామకుఁడైన యసురుఁడే, ఆసీత్=ఉండెను. సః=అతఁడు, పృథివ్యామ్=భూమియందు, ఉపమ్లుష్టః=తిరోహితుఁడై, అశయత్=శయనించెను. తమ్=ఆ యసురుని, దేవాః=దేవతలు, ''అపహతో ఽరరుః పృథివ్యాః'' ఇతి=అరరు నామక రాక్షసుఁడు పృథివినుండి పోఁగొట్టఁబడెను' అను

మంత్రముచే, పృథివ్యాః=పృథివినుండి, అపాఘ్నన్=పోcగొట్టిరి. 'అపహతోఽరరుః పృథివ్యాః' ఇతి ఆహ యత్='అపహతోఽరరుః పృథివ్యాః' అను మంత్రమును పఠించినచో, సః=ఆ మంత్రము నుచ్చరించిన యజమానుcడు, భ్రాతృవ్యమ్=శత్రువును, పృథివ్యాః=భూమినుండి, అపహన్త్యేవ=నిశ్చయముగ పోcగొట్టును.

తాత్పర్యము : ''అపహతోఽరరుః పృథివ్యై'' అను మంత్రము **7,8,9** మంత్రములకంటె పూర్వమున ఉన్నను అది స్పష్టార్థబుద్ధిచే దాని నుపేక్షించి బ్రాహ్మణము **7,8,9** మంత్రములను వ్యాఖ్యానించినది.ఇప్పుడు మఱల సింహావలోకనన్యాయముచే స్మరించి యీ బ్రాహ్మణము దాని నిచట వ్యాఖ్యానించుచున్నది. అరరు నామక రాక్షసుcడు యజ్ఞవిఘాతమునకై గూఢరూపమున భూమియందు శయనించి యుండుటవలన తిరోహిcడయ్యెను. కనుకనే అతcడు శత్రువు. ఆ శత్రువును దేవతలవలె మంత్రోచ్చారణపూర్వకముగ తృణసహితములైన పాంసువులను నిర్మూలించుటచే యజమానుc డా శత్రువును పోcగొట్టినవాc డగును. శేషము స్పష్టము.

విశేషాంశములు:సంహితయందు ''అపహతోఽరరుః పృథివ్యై'' ''అపహతోఽరరుః పృథివ్యై దేవయజన్యై,'' ''అపహతోఽరరుః పృథివ్యా అదేవయజనః'' అని యీ విధముగ మంత్రభాగ ములున్నవి. ఇచట ప్రథమభాగమున 'పృథివి దేవయజని' అనునది లేదు. ''ఆ దద ఇన్ద్రస్య'' అను ప్రథమమంత్రమునcగల 'పృథివి దేవయజని' అనుదానిని ప్రథమపర్యాయమునుండి ద్వితీయ తృతీయభాగములం దనుషంగము చేయవలెను. వాక్యపరిపూర్తికై శబ్దాంతరము ననుషంగము చేయువిధముగ ప్రయోగపరిసమాప్తికై మంత్రానుషంగము న్యాయ్యము. అరరుశయనముచే నుపహతవేదిభూమిపాంసువులు కొన్నియైనను ప్రథమ పర్యాయమునం దపనీతములై యుండును. ఆ మాత్రముచేవేది భూమియొక్క యేకదేశము యాగయోగ్యముగ సంపన్న మైనది. ఈ యభిప్రాయముతోనే ద్వితీయ పర్యాయమునందు 'పృథివ్యై దేవయజన్యై' అని పృథివి విశేష్యముగc జేయcబడినది. తృతీయ పర్యాయమున మాత్రము 'అదేవయజనః' అనునది అరరువిశేషణము. ఈ విధముగ నుపహతములైన తృణపాంసువులను యజ్ఞభూమినుండి పైకితీసి ఉత్తరదిగ్దేశమునందు పడవేయవలెను. ఆ యుత్తరదిగ్దేశము ఉత్కర మనcబడును.

11. మంత్రము :**తే కమన్యన్త । దివం వా అయమితః పతిష్యతీతి । తమరరుస్తే దివం మా స్కానితి దివః పర్యబాధన్త ।**

భ్రాతృవ్యో వా అరరుః । అరరుస్తే దివం మా స్కానితి యదాహ। భ్రాతృవ్యమేవ దివః పరిబాధతే ।

అర్థము : అయమ్=ఈ యరరు రాక్షసుcడు, ఇతః=ఇటనుండి, దివం వై=స్వర్గమును గూర్చియే, పతిష్యతీతి=వెళ్లcగలcడని, తే=ఆ దేవతలు, అమన్యన్త=తలcచిరి. 'అరరుః=అరరువు, దివమ్=స్వర్గమును, మా స్కానితి=పొందకుండుcగాక' యని, తే=ఆ దేవతలు, దివః=స్వర్గమునుండి, పర్యబాధన్త=అంతటను బాధించిరి. అరరుః=అరరువు, భ్రాతృవ్యః వై=శత్రువే. 'అరరుస్తే దివం మా స్కాన్' ఇతి యత్ ఆహ='అరరుస్తే దివం మా స్కాన్' అను మంత్రమును పఠించినచో, సః=పఠించిన యా యజమానుcడు, దివః=స్వర్గమునుండి, భ్రాతృవ్యమేవ=శత్రువునే, పరిబాధతే=అంతటను బాధించువాc డగును.

తాత్పర్యము : పూర్వము ''అపహతోఽరరుః'' అని ద్వితీయ తృతీయపర్యాయము లామ్నాతములైన మంత్రములు ప్రథమ పర్యాయము ఆమ్నాతమైన మంత్రముయొక్క వ్యాఖ్యచేతనే తెలిసికొనుటకు శక్యము లగుటచే ఆ మంత్రముల నుపేక్షించి బ్రాహ్మణము 'తేఽమన్యన్త' అను మంత్రమును వ్యాఖ్యానించుచున్నది. అరరువు ఏ యుపాయముచేతనైనను పూర్వము చేయcబడిన బంధమును ఛేదించి ఫలవిఘాతము చేయుటకై స్వర్గమునకు పోcగలడని తలcచి, మంత్రముచే ఆ బంధమును దృఢముగాc జేసి స్వర్గసమీపమునుండి యంతటను బాధితుcడగువిధముగ యత్నము చేసిరి. అందువలన ఆగ్నీధ్రునియొక్క అంజలిచేత పాంసురాశి నిరుద్ధ మగుచుండcగా శత్రువు స్వర్గబాధితుc డగును. మంత్రములను వ్యాఖ్యానించి బ్రాహ్మణము స్తమ్బయజుర్హరతీత్యాదికముచే అనుష్ఠానమును విధించుచున్నది.

12. మంత్రము :**స్తమ్బయజుర్హరతి । పృథివ్యా ఏవ భ్రాతృవ్యమపహన్తి । ద్వితీయగ్ం హరతి (5) । అన్తరిక్షాదేవైన మపహన్తి । తృతీయగ్ం హరతి । దివ ఏవైన మపహన్తి । తూష్ణీం చతుర్థగ్ం హరతి । అపరిమితాదేవైన మపహన్తి ।**

అర్థము : స్తమ్బయజుఃయజుర్మంత్రముచే ఛిన్నమైన స్తంబరూపమైన దర్భను హరతి=(స్రుగ్యముచే ఛేదించి) ఉత్కరప్రదేశమునందు పడవేయవలెను. అనేన=ఈ ప్రథమహరణముచేత, భ్రాతృవ్యమ్=శత్రువును, పృథివ్యాఃఏవ=పృథివినుండియే, అపహన్తి=పోcగొట్టినవాc డగును. ద్వితీయమ్=రెండవ పర్యాయము, హరతి=పడవేయవలెను. అనేన=ఈ ద్వితీయహరణముచేత, అన్తరిక్షాదేవ=అంతరిక్షమునుండియే, ఏనమ్=ఈ శత్రువును, అపహన్తి=పోcగొట్టినవాc డగును. తృతీయం హరతి=మూcడవ పర్యాయము పడవేయవలెను. అనేన=ఈ తృతీయ హరణముచేత, దివఃఏవ=దివినుండియే, ఏనమ్=ఈ శత్రువును, అపహన్తి=పోcగొట్టినవాc డగును. తూష్ణీమ్=మంత్రరహితముగ, చతుర్థమ్=నాల్గవ పర్యాయము, హరతి=పడవేయవలెను. అపరిమితాదేవ=అపరిమితమైన బ్రహ్మాండమునుండియే, ఏనమ్=ఈ శత్రువును, అపహన్తి=పోcగొట్టినవాc డగును.

తాత్పర్యము : యజుర్మంత్రముచే ఛిన్నమైన దర్భ స్తంబయజుస్సు. దానిని స్తంబముగాc జేసి స్రుగ్యముచే ఛేదించి ఉత్కరప్రదేశమునందు పడవేయవలెను. ఈ విధముగ మూcడు మారులు పడవైచుటచేత లోకములనుండి శత్రువు హతుcడగును. మంత్రరహితముగ నాల్గవమారు పడవైచుటచే అపరిమితమైన సమస్త బ్రహ్మాండమునుండి భ్రాతృవ్యాపహృతము కలుగును.

13. మంత్రము :**అసురాణాం వా ఇయమగ్ర ఆసీత్ । యావదాసీనః పరాపశ్యతి । తావద్దేవానామ్ । తే దేవా అబ్రువన్ । అస్త్వేవ నోఽస్యామపీతి (6)। క్యం నో దాస్యథేతి । యావత్త్వయం పరిగృహ్ణీథేతి । తే వసవస్త్వేతి దక్షిణతః పర్యగృహ్ణన్ । రుద్రాస్త్వేతి పశ్చాత్ । ఆదిత్యాస్త్వేత్యుత్తరతః । తేఽగ్నినా ప్రాశ్నోఽజయన్ ।**

వసుభిర్దక్షిణా । రుద్రైః ప్రత్యఞ్చః । ఆదిత్యైరుదఞ్చః । యస్యైవం విదుషో వేదిం పరిగృహ్ణన్తి (7) ॥

భవత్యాత్మనా । పరాఽస్య భ్రాతృవ్యో భవతి ।

అర్థము : అగ్రే=ప్రథమమున, ఇయమ్=ఈ భూమి, అసురాణాం వై=అసురులకే, ఆసీత్=ఉండెను. ఆసీనః=కూర్చున్నవాఁడై, యావత్=ఎంతప్రదేశమును, పరాపశ్యతి=అంతటను చూచుచుండునో, తావత్=అంత ప్రదేశము, దేవానామ్=దేవతలకు, ఆసీత్=ఉండెను. 'నః అపి=మాకుఁ గూడ, అస్యామ్=ఈ భూమియందు, అస్త్వే=తప్పక భాగముండుఁగాక, ఇతి=అని, కృత్=ఆ భూభాగమునందు కొంత భూస్థానమును, నః=మాకొఱకు, దాస్యథ ఇతి=ఒసఁగుఁడని' తే దేవాః=ఆ దేవతలు, అబ్రువన్=పలికిరి. యావత్=ఎంతప్రదేశమును, స్వయమ్=స్వీయమగునో, తావత్=అంతభాగమును, పరిగృహ్ణీథ=పరిగ్రహించుఁడు, ఇతి=అని, అనుజ్ఞాతాః=అనుజ్ఞాతులై, తే=ఆ దేవతలు, 'వసవస్త్వా' ఇతి=వసవస్త్వా అను మంత్రభాగముచే, దక్షిణతః=దక్షిణదిక్కునుండి, పర్యగృహ్ణన్=స్వీకరించిరి. రుద్రాస్త్వా ఇతి=రుద్రాస్త్వా అను మంత్రభాగముచే, పశ్చాత్=పశ్చిమభాగమునుండి, పర్యగృహ్ణన్. ఆదిత్యాస్త్వా ఇతి=ఆదిత్యాస్త్వా అను మంత్రభాగముచే, ఉత్తరతః=ఉత్తరభాగమునుండి, పర్యగృహ్ణన్.

తే=ఆ దేవతలు, అగ్నినా=అగ్నిచే, ప్రాఞ్చః=ప్రాగ్దిగ్భాగములను, అజయన్=జయించిరి. వసుభిః=వసువులచే, దక్షిణా=దక్షిణ దిగ్భాగములను, అజయన్. రుద్రైః=రుద్రులచే, ప్రత్యఞ్చః=పశ్చిమ దిగ్భాగములను, అజయన్. ఆదిత్యైః=ఆదిత్యులచే, ఉదఞ్చః=ఉత్తర దిగ్భాగములను అజయన్. ఏవం విదుషః=ఈ విధముగ తెలిసికొనిన, యస్య=ఏ యజమానునినిమిత్తము, అధ్వర్యవః=అధ్వర్యులు, వేదిమ్=వేదిని, ప్రతిగ్రహింతురో, సః=ఆ యజమానుఁడు, ఆత్మనా=స్వయముగ, భవతి=ప్రఖ్యాతుఁడగును. అస్య=ఈ యజమానునియొక్క, భ్రాతృవ్యః=శత్రువు, పరా భవతి=తిరస్కృతుఁడగును.

తాత్పర్యము : ఆహవనీయ గార్హపత్యాగ్నుల మధ్యమందు వేదిని త్రవ్వుటకై వేదిని కొలుచుటకు స్ఫ్యముచే దిక్కయమునందు రేఖలను గీయవలెను. ఈ విధముగ వేదిమానమునకై దిక్కయమునందు రేఖాత్రయమును చేయుటవేదియొక్క పరిగ్రహ మనఁబడును. పరిగ్రహీత యైన యధ్వర్యుఁడు దిక్కయమునందు క్రమమున భావనచే వస్వాదిరూపుఁడు. పరిగ్రాహసాధనమైన స్ఫ్యము ఛందస్త్రయరూపము. ఆ యీ పరిగ్రాహము నీ బ్రాహ్మణము విధించుచున్నది.

పూర్వము ఒక్కప్పు డసురులకు విజయము కలుగఁగా ఈ పృథివి యంతయు నా యసురులకే స్వంతమై యుండెను. దేవతలకు కొంచెమైనను భూభాగము లేకుండెను. కాని, ఏ దేవత యెచట కూర్చుండి యెంతమేర చూచుచుండునో, అంతమేర యా దేవత కప్పుడు స్వాధీనమై యుండెను. అందువలన దేవత లీ విధముగ నసురులను యాచించిరి- 'ఓ యసురులారా! మీయధీనమైన యీ భూమియందు మాకు నియమితమైన కొంత భూభాగ మపేక్షితమై యున్నది. అందు కొంతభూభాగమును మా కొసఁగుఁడు' అని. అనంతర మసురులచే ననుజ్ఞాతులై దేవతలు మంత్రములచే వేదిని స్వకీయముగ స్వీకరించిరి. ఆ వేదికి ప్రాగ్దిక్కునందు ఆహవనీయాగ్ని పాలకుఁడు గాను, దక్షిణాది దిక్కులందు వస్వాదులును పాలకులుగా నుండిరి. అందువలన నాలుగుదిక్కులందు ఉన్నట్టి దేవతలకు అగ్న్యాదులద్వారా విజయమే

కలిగినది. అందువలన ఈ విధముగతెలిసికొనిన యే యజమానునినిమిత్తము అధ్వర్యులు యథోక్తములైన 'వసవస్త్వా' ఇత్యాది మంత్రములచే వేదిపరిగ్రాహము చేయుదురో, ఆ యజమానుడు స్వీయరూపముచేతనే యభిప్రఖ్యాతుడగును. అతని శత్రువు పరాభూతుడగును. 'పరిగృహ్ణన్తి' అను బహువచనము పూజార్థము. లేదా - ప్రయోగభేదాభిప్రాయముచే ప్రయుక్తమైనది.

14. మంత్రము :**దేవస్య సవితుః సవ ఇత్యాహ ప్రసూత్యై। కర్మ కుర్వన్తి వేధస ఇత్యాహ। ఇషితగ్ం హి కర్మ క్రియతే ।**

అర్థము : ''దేవస్య సవితుః సవే'' ఇతి ఆహ = 'సవిత్ (ప్రేరక)దేవునియొక్క ప్రేరణము ఉండుగా' అని మంత్రము చెప్పినది. ఏతత్ = ఈ చెప్పుట, ప్రసూత్యై = ప్రేరణముకొఱకు, భవతి = అగుచున్నది. ''కర్మ కుర్వన్తి వేధసః'' ఇతి ఆహ = బ్రహ్మసమానులైన యధ్వర్యులు ఈ ఖననరూపమైన కర్మను చేయుచున్నారని మంత్రము చెప్పినది. ఇషితం కర్మ = ఇష్టమైన కర్మ, క్రియతే హి = చేయబడుచున్నది కదా!

తాత్పర్యము : పరమేశ్వరానుజ్ఞ యుండగా బ్రహ్మసమానులైన యధ్వర్యులు ఉద్ధననరూపమైన (ఖననరూపమైన) కర్మను చేయుచున్నారు. ఈశ్వరానుజ్ఞచే సర్వజనులచే స్వాభీష్టమైన కర్మ చేయబడుచున్నదను విషయము విద్వాంసులకు ప్రసిద్ధమే యని యీ బ్రాహ్మణము వివరించినది.

15. మంత్రము :**పృథివ్యై మేధ్యం చామేధ్యం చ వ్యుదక్రామతామ్ । ప్రాచీనముదీచనం మేధ్యమ్ । ప్రతీచీనం దక్షిణా మేధ్యమ్ । ప్రాచీముదీచీం ప్రవణాం కరోతి। మేధ్యామేవైనాం దేవయజనీం కరోతి (8) ।**

అర్థము : పృథివ్యై (వ్యాః) = పృథివియొక్క, మేధ్యం చ = పవిత్రభాగము, అమేధ్యం చ = అపవిత్రభాగము, వ్యుదక్రామతామ్ = విభాగమును పొందుగాక. ప్రాచీనమ్ = ప్రాచీనదిక్సంబంధియైన, ఉదీచీనమ్ = ఉత్తరదిగ్భాగము, మేధ్యమ్ = పవిత్రమైనది. ప్రతీచీనమ్ = పశ్చిమదిక్సంబంధియైన, దక్షిణా = దక్షిణదిగ్భాగము, మేధ్యమ్ = పవిత్ర మైనది. ప్రాచీమ్ ఉదీచీమ్ = వేదికి ప్రాగ్భాగమును, ఉత్తరభాగమును, ప్రవణామ్ = వాటుపుపల్లమునుగా, కరోతి = చేయవలెను. (తదా = అప్పుడు, అయమ్ = ఈ యజమానుడు,) ఏనాం దేవయజనీమ్ = ఈ దేవయజనభూమిని, మేధ్యామేవ = పవిత్రమునుగానే, కరోతి = చేయుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము వేదియొక్క దిగ్వ్యయమునందు నిమ్నతను విధించినది. తాత్పర్యము స్పష్టము.

16. మంత్రము :**ప్రాఞ్చౌ వేద్యగ్ంసావున్నయతి । ఆహవనీయస్య పరిగృహీత్యై । ప్రతీచీ శ్రోణీ । గార్హపత్యస్య పరిగృహీత్యై । అథో మిథునత్వాయ ।**

అర్థము : ఆహవనీయస్య = ఆహవనీయముయొక్క, పరిగృహీత్యై = పరిగృహీతికొఱకు, ప్రాఞ్చౌ వేద్యంసౌ = వేదియొక్క ప్రాగంసములను, ఉన్నయతి = ఉన్నతములుగా జేయవలెను. గార్హపత్యస్య = గార్హపత్యము యొక్క,

పరిగృహీత్యై=పరిగృహీతికొఱకు, ప్రతీచీ శ్రోణీ=వేదియొక్క పశ్చిమశ్రోణులను, ఉన్నయతి=ఉన్నతములుగాc జేయవలెను. అథో=మఱియు, ఏతత్=ఈ యౌన్నత్యద్వయము, మిథునత్వాయ=మిథున భావముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము అంసాకారముగాను, శ్రోణ్యాకారముగాను నాలుగుకోణములందు ఔన్నత్యమును విధించుచున్నది. వేదియొక్క ప్రాగంసములను ఉన్నతములనుగాc జేయవలెను. ఈ యౌన్నత్యము ఆవహనీయము యొక్క పరిగృహీతికొఱ కగును. వేదియొక్క పశ్చిమశ్రోణులను ఉన్నతములనుగాc జేయవలెను. ఈ యౌన్నత్యము గార్హపత్యముకొఱ కగును. మఱియు రెండు ఔన్నత్యములు మిథునీభావముకొఱ కగును. పరిగృహీతి - అంతటను గ్రహింపఁజాలినబుద్ధి. అంసములు, శ్రోణులును ప్రత్యేకముగ యుగ్మము కనుక మిథునత్వము సిద్ధించును. లేదా=అంస (శబ్ద)ము పుంలింగ మగుటవలన పురుషుఁడనియు, శ్రోణి (శబ్దము) స్త్రీలింగ మగుటవలన స్త్రీ యనియు భావించినచో మిథునత్వసిద్ధి యేర్పడుచున్నది.

17. మంత్రము :**ఉద్ధన్తి । యదేవాస్యా అమేధ్యమ్ । తదపహన్తి ।**

అర్థము : ఉద్ధన్తి=భూమియొక్క యూర్ధ్వభాగమును స్ఫ్యముచేత తొలఁగించవలెను. తేన=ఆ యుద్ధననముచే, అస్యాఃఈ భూమియొక్క, అమేధ్యం యత్=అపవిత్ర మేది కలదో, తత్=దానిని, అపహన్తి=తొలఁగించినవాc డగును.

తాత్పర్యము : భూమియొక్క యూర్ధ్వభాగమును స్ఫ్యముచేత తొలఁగించవలెను. ఈ విధముగ తొలఁగించుటచే నధ్వర్యుఁడు భూమియొక్క యపవిత్రాంశమును తొలఁగించినవాc డగును. ఈ బ్రాహ్మణము భూమియొక్క యూర్ధ్వభాగముయొక్క అపసారణమును విధించినది.

18. మంత్రము :**ఉద్ధన్తి । తస్మాదోషధయః పరాభవన్తి (9) । మూలం ఛినత్తి । భ్రాతృవ్యస్యైవ మూలం ఛినత్తి ।**

మూలం వా అతితిష్ఠద్రక్షాగ్ంస్యనూత్పతే ।

అర్థము : ఉద్ధన్తి=భూమియొక్క, యూర్ధ్వభాగమును స్ఫ్యముచేత తొలఁగించవలెను. తస్మాత్=ఆ యూర్ధ్వ భాగాపసరణమువలన, ఓషధయఃఓషధులు, పరాభవన్తి=పరాభూతము లగుచున్నవి. మూలమ్=తృణ మూలమును, ఛినత్తి=ఛేదించవలెను. (తేన=ఆ తృమూలచ్ఛేదనముచేత, అధ్వర్యుఃఅధ్వర్యుఁడు,) భ్రాతృవ్యస్య=శత్రువుయొక్క, మూలమేవ=నివాసాధికరణమైన గృహాదికమునే, ఛినత్తి=ఛేదించినవాc డగుచున్నాఁడు. మూలమ్=తృణమూలము, అతితిష్ఠద్వై=భూమి నతిక్రమించి యుండునెడల, అను (తదను)=దాననుసరించి, రక్షాంసి=రాక్షసులు, ఉత్పతే=ఉద్భవింతురు.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము పూర్వోక్తవిధిననువదించి యర్థవాదాంతరమును చెప్పుచున్నది. భూమియొక్క యూర్ధ్వ భాగమును తొలఁగించుటవలన బర్హిరాహరణ హవిరాసాదన విరోధులైన తృణస్తంబములు నశించును.

భూమియందు అత్యంతము నిరూఢములైన తృణమూలములు ఉద్ధననమాత్రముచే తొలఁగవు కనుక మఱియొక ప్రయత్నముచే ఛేదనము నీ బ్రహ్మణము విధించుచున్నది. తృణమూలము భూమి నతిక్రమించి కొంచెమున్నను దానినుండి రాక్షసులు పుట్టుదురు కనుక అధ్వర్యుఁడు తృణమూలమును ఛేదించవలెను. ఆ మూలచ్ఛేదనముచే శత్రువునకు మూలమైన (నివాసాధికరణమైన) గృహాదికమునే ఛేదించినవాఁడగును.

19. మంత్రము :యద్ధస్తేన ఛిన్ద్యాత్ । కునఖినీః ప్రజాః స్యుః । స్ఫ్యేన ఛినత్తి । వజ్రో వై స్ఫ్యః । వజ్రేణైవ యజ్ఞాద్రక్షాగ్ంస్యపహన్తి ।

అర్థము : హస్తేన=హస్తముచే, ఛిన్ద్యాత్ యత్=ఛేదించుచో, ప్రజాః=ప్రజలు, కునఖినీః=వంకరగోళ్లు(కుచ్చితమైన గోళ్లు)కలవారు, స్యుః=అగుదురు. స్ఫ్యేన=స్ఫ్యముచేత, ఛినత్తి=తృణమూలమును ఛేదించవలెను. స్ఫ్యః=స్ఫ్యము, వజ్రఃవై=వజ్రమే (వజ్రము వంటిదే). తదా=అప్పుడు, సఃఆ యధ్వర్యుఁడు, వజ్రేణైవ=వజ్రముచేతనే, యజ్ఞాత్=యజ్ఞమునుండి, రక్షాంసి=రాక్షసులను, అపహన్తి=తొలఁగించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము ఛేదనసాధనమును విధించుచున్నది. తృణమూలమును హస్తముచే ఛేదించినచో ప్రజలు కునఖులగుదురు. స్ఫ్యమనెడి ఆయుధవిశేషముచే ఛేదించవలెను. స్ఫ్యము వజ్రాయుధమే. స్ఫ్యమునకు వజ్రత్వము ''ఇన్ద్రో వృత్రాయ వజ్రం ప్రాహరత్ ।'' స త్రేధా వ్యభవత్ । స్ఫ్యస్తృతీయమ్ । రథస్తృతీయమ్। యూపస్తృతీయమ్।'' అను శ్రుతియందు వివరించఁబడినది. అధ్వర్యుఁడు వజ్రాయుధమేయైన స్ఫ్యముచే తృణమూలమును ఛేదించుటచేత వజ్రాయుధముచేతనే యజ్ఞమునుండి రాక్షసులను పోఁగొట్టినవాఁ డగును.

20. మంత్రము :పితృదేవత్యా కతిఖాతా । ఇయతీం ఖనతి (10) । ప్రజాపతినా యజ్ఞముఖేన సంమితామ్ ।

అర్థము : అతిఖాతా=ప్రాదేశపరిమాణము నతిక్రమించి త్రవ్వఁబడిన వేదిభూమి, పితృదేవత్యా=పితృదేవతాకము, స్యాత్=అగును.ప్రజాపతినా సమమ్=ప్రజాపతిముఖముతో సమానమైన, యజ్ఞముఖేన= యజ్ఞపురుష ముఖముతో, సంమితామ్=తుల్యమైన, ఇయతీమ్=ఈ ప్రాదేశమాత్రము పరిమాణము కల భూమిని, ఖనతి=త్రవ్వవలెను.

తాత్పర్యము : ఇచట ప్రాదేశపరిమితమైనవేదిఖననము విధించఁబడుచున్నది.వేదిభూమి ప్రాదేశపరిమాణము నతిక్రమించి త్రవ్వఁబడినచో అది పితృదేవత్య మగును కాని, యా వేది దైవికి కాదు. ప్రజాపతిసృష్ట మగుటచే తద్రూపమైన యజ్ఞపురుషముఖముతో సమానమైన ప్రాదేశపరిమితమైన వేదిభూమిని త్రవ్వవలెను. 'ఇయతీమ్' ఈ మాత్రము పరిమాణము కలదని ప్రాదేశపరిమాణాభినయము. కనుక ప్రాదేశపరిమిత వేదిని త్రవ్వవలెను.

21. మంత్రము :వేదిర్దేవేభ్యో నిలాయత । తాం చతురఙ్గులే కన్వవిన్దన్ । తస్మాచ్చతురఙ్గులం ఖేయా ।

అర్థము : వేదిఃవేదిదేవత, దేవేభ్యఃదేవతలనుండి, నిలాయత=విముఖియై భూమియందు మిక్కిలి అడఁగిన దాయెను. దేవాఃదేవతలు, తామ్=ఆ వేదిదేవతను, చతురఙ్గులే=నాలుగంగుళములందు, అన్వవిన్దన్=

పొందిరి. తస్మాత్=ఆ కారణమువలన, చతురఙ్గులమ్=చతురంగులమాత్రము, ఖేయా=వేదిభూమి త్రవ్వcదగినది.

తాత్పర్యము : ఏదియో ఒక నిమిత్తముచే వేదిదేవత దేవతలనుండి విముఖయై భూమియందు మిక్కిలి యడcగియుండెను. అప్పుడు దేవతలు చతురంగులమాత్రపు ఖననముచే నా వేదిదేవతను పొందిరి. అందువలన చతురంగుల ప్రమాణమున భూమిని త్రవ్వవలెను. ఇచట వేదిఖనన విషయమున పక్షాంతరము విధించcబడినది.

22. మంత్రము :**చతురఙ్గులం ఖనతి చతురఙ్గులే హ్యోషధయః ప్రతితిష్ఠన్తి ।**

అర్థము : చతురఙ్గులమ్=చతురంగుళములు,ఖనతి=త్రవ్వవలెను. ఓషధయః=ఓషధులు, చతురఙ్గులే=చతురంగుళములందు, ప్రతితిష్ఠన్తి హి=ప్రతిష్ఠితము లగుచున్నవి కదా!

తాత్పర్యము : వేదిభూమిని నాలుగంగుళములు త్రవ్వవలెను. నాలుగంగుళములందు ఓషధిమూలము వ్యాపించియుండcగా ఆ యోషధులు వాయువుచే నున్మీలింపcబడవు కనుక ప్రతిష్ఠితములై యుండును. ఇచట చతురంగులవిధి ననువదించి శ్రుతి యర్థవాదాంతరమును చెప్పినది.

23. మంత్రము :**ఆ ప్రతిష్ఠాయై ఖనతి । యజమానమేవ ప్రతిష్ఠాం గమయతి ।**

అర్థము : ఆ ప్రతిష్ఠాయై=గట్టిదైన భూమి లభించువఱకు, ఖనతి=త్రవ్వవలెను. యజమానమేవ=యజమానునే, ప్రతిష్ఠాం గమయతి=ప్రతిష్ఠను పొందించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : ఇచట పక్షాంతరము విధించcబడుచున్నది. చతురంగులప్రమాణముచేc గాని, ప్రాదేశప్రమాణముచేc గాని సికతాదిప్రయుక్తశైథిల్యమువలన భూమి లభించనిచో, భూమి లభించువఱకు అధ్వర్యుcడు త్రవ్వవలెను. ఈ విధముగ త్రవ్విన యధ్వర్యుcడు యజమానునకే ప్రతిష్ఠను (మంచిస్థితిని) కలుగcజేసినవాc డగును.

24. మంత్రము :**దక్షిణతో వర్షీయసీం కరోతి । దేవయజనస్యైవ రూపమకః (11) ।**

అర్థము : దక్షిణతః=వేదికి దక్షిణదిక్కునందు, వర్షీయసీమ్= వేదిని ఉన్నతమునుగా, కరోతి=చేయవలెను. (తథా కృతవాన్=ఆ విధముగc జేసిన యధ్వర్యుcడు,)దేవయజనస్యైవ=దేవయజన భూమికే, రూపమ్=రూపమును, అకః=చేసినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : వేదికి దక్షిణభాగమున ఎత్తుగాc జేయవలెను. పూర్వము 'ప్రాచీముదీచీం ప్రవణాం కరోతి' అని చెప్పుటచేతనే దక్షిణభాగమున ఔన్నత్యము సిద్ధించుచున్నది. కాని, మఱల కుడ్యాకారమున మృత్తికాప్రక్షేప మిచట విధించcబడినది. అకః=చేసినవాc డగుచున్నాcడని యర్థము. ఇచట దక్షిణదిశయం దౌన్నత్యము విధించc బడినది.

25. మంత్రము :**పురీషవతీం కరోతి । ప్రజా వై పశవః పురీషమ్ । ప్రజయైవైనం పశుభిః పురీషవన్తం కరోతి ।**

అర్థము : పురీషవతీం కరోతి =మట్టి గడ్డలు లేని ఇసుకవంటి సన్నని మట్టిని వేదియందంతటను వెదచల్లుచున్నాడు. (వెదచల్లవలెను). ప్రజాః=ప్రజలు, పశవః =పశువులు, పురీషం వై=పురీషమే కదా! (తథా కృతవాన్=ఆ విధముగ జేసిన అధ్వర్యుడు) ఏనమ్=ఈ యజమానుని, ప్రజయా=ప్రజలతో (సంతతితో), పశుభిః = పశువులతో, పురీషవన్తం కరోతి=పురీషవంతునిగా చేయుచున్నాడు.

తాత్పర్యము : పురీషమనగా మెత్తని మట్టి. జనసంచారము, పశుసంచారము ఎక్కువగా ఉండే భూమియందు ధూళి ఎక్కువగా ఉంటుంది కావున ప్రజలకు, పశువులకు పురీషత్వము చెప్పబడింది. అందువలన అధ్వర్యుడు వేదియందు సన్నని ఇసుకవంటి మట్టిని వెదచల్లుటవలన యజమానునికూడ ప్రజలతో (సంతతితో), పశువులతో పురీషవంతునిగా చేయుచున్నాడు.

26. మంత్రము :**ఉత్తరం పరిగ్రాహం పరిగృహ్ణాతి । ఏతావతీ వై పృథివీ । యావతీ వేదిః । తస్యా ఏతావత ఏవ భ్రాతృవ్యం నిర్భజ్య । ఆత్మన ఉత్తరం పరిగ్రాహం పరిగృహ్ణాతి ।**

అర్థము : ఉత్తరం వేదిపరిగ్రాహమ్=ఉత్తరపుదైన వేదిపరిగ్రాహము, పరిగృహ్ణాతి=పరిగ్రహించవలెను. వేదిః=వేది, యావతీ వై=ఏమాత్రపుదో, ఏతావతీ పృథివీ వై=ఈ మాత్రపు భూమియే, ఉపయుక్తా=కర్మానుష్ఠానమునకు ఉపయుక్తమైనది. ఏతావతః తస్యాః ఏవ=ఈ మాత్రపుదైన యా భూమినుండియే, భ్రాతృవ్యమ్=శత్రువును, నిర్భజ్య=తొలచగించి, ఆత్మనః=తనకు, ఉత్తరం పరిగ్రాహం పరిగృహ్ణాతి= ఉత్తర పరిగ్రాహమును గ్రహించినవాడగును.

తాత్పర్యము : పరిగ్రాహ మనగా వేదిని స్పృశుచేత కొలచుట యని పూర్వము చెప్పబడినది. 'వసవస్త్వా' ఇత్యాది మంత్రమును పఠించుచు పూర్వపరిగ్రాహము చేయవలెననియు **13**వ మంత్రమున చెప్పబడినది. ఇచట ఉత్తరపరిగ్రాహము విధించబడుచున్నది. వేదివ్యతిరిక్తమైన భూమి ఆసురము కనుక కర్మయం దుపయోగము లేనందున, ఉపయుక్తమైన భూమి వేదియే. అట్లు కాగా, పూర్వపరిగ్రాహముచే మహాభూమికి సంబంధించినవేదరూపమైన తావన్మాత్రప్రదేశమునుండి వైరిని తొలగించి స్వార్థము ఉత్తరపరిగ్రాహమును చేయవలెను.

27. మంత్రము :**ఋతమస్యృతసదనమస్యృతశ్రీరసీత్యాహ। యథాయజురేవైతత్ (12)।**

అర్థము : ''ఋతమస్యృతసదనమస్యృతశ్రీరసి'' ఇతి ఆహ='ఓ వేదీ! నీవు సత్యస్వరూపము, సత్యరూపమైన హవిస్సునకు స్థానము, ఋతశ్రీవియు నగుచున్నావు' అని యజుస్సు చెప్పినది. ఏతత్=ఇది, యథాయజుః ఏవ=మంత్రపదములం దభివ్యక్త మైనదే.

తాత్పర్యము : మంత్రార్థము మంత్రపదములందే యభివ్యక్తమైనదని యీ బ్రాహ్మణము స్పష్టపఱచినది.

28. మంత్రము :**క్రూరమివ వా ఏతత్కరోతి । యద్వేదిం కరోతి । ధా అసి స్వధా అసీతి యోయుప్యతే శాన్త్యై ।**

అర్థము : వేదిం కరోతి యత్=వేదిని చేయుచున్నాఁడనుట యేది కలదో, ఏతత్=దీనిని, క్రూరమివ వై కరోతి=క్రూరము వలెనే చేయుచున్నవాఁడగుచున్నాఁడు. ''ధా అసి స్వధా అసి'' ఇతి='ఓ యజ్ఞవేదీ! నీవు దేవహవిస్సులను ధరించుదాన వగుచున్నావు. మఱియు పితృదేవతల హవిస్సుతో గూడిన దానవగుచున్నావు'అను మంత్రముచే, యోయుప్యతే=వేదిని సమీకరించవలెను (సరిచేయవలెను).ఏతత్=ఈ సమీకరణము, శాన్త్యై=శాంతికొఱకు, భవతి=అగుచున్నది. యోయుప్యతే=సమీకరోతీతి విద్యారణ్యమ్.

తాత్పర్యము : ''ధా అసి స్వధా అసి'' అను మంత్రమును పఠించుచు యజ్ఞవేదిని సమీకరించవలెను. వేదికరణము క్రూరమైన కర్మవంటిదే కనుక సమీకరణము చేయుటవలన శాంతి కలుగునని యీ బ్రాహ్మణము సమీకరణమును విధించినది.

29. మంత్రము :**ఉర్వీ చాసి వస్వీ చాసీత్యాహ। ఉర్వీమేవైనాం వస్వీం కరోతి ।**

అర్థము : ''ఉర్వీ చాసి వస్వీ చాసి'' ఇతి ఆహ='ఓ యజ్ఞవేదీ! నీవు దేవతల హవిస్సును, పితృదేవతల హవిస్సును ధరించుటవలన వైశాల్యము కలదానవు, పురోడాశాదిరూప ధనము కలదానవు నగుచున్నావు' అని మంత్రము చెప్పినది. అనేన=ఈ చెప్పుటచే, అయమ్=ఈ యధ్వర్యుఁడు, ఏనామ్=ఈ వేదిని, ఉర్వీమ్=విస్తృతముగాను, వస్వీమ్=ధనవతినిగాను, కరోతి=చేయుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ''ధా అసి స్వధా అసి'' అను మంత్రమునందలి విశేషణద్వయముచే వేదికి కృత్స్నభూమిరూపత్వము, అశేషధనోపేతత్వము కూడ సంపాదించఁబడుచున్నదని యీ బ్రాహ్మణము చెప్పినది.

30. మంత్రము :**పురా క్రూరస్య విసృపో విరప్శిన్నిత్యాహ మేధ్యత్వాయ ।**

అర్థము : ''పురా క్రూరస్య విసృపో విరప్సిన్'' ఇతి ఆహ='ఓ యజ్ఞవేదీ! క్రూరుఁడైన అరరు రాక్షసునియొక్క అపసరణముకంటె పూర్వము' అని మంత్రము చెప్పెను. ఏతత్=ఈ చెప్పుట, మేధ్యత్వాయ=వేదియొక్కపవిత్రతకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : మంత్రమునందలి 'విసృపః పురా' అను ఉక్తిచే అరరుప్రయుక్తమైన అశుచిత్వము నివారించఁబడుచున్నదని యీ బ్రాహ్మణము చెప్పినది. ''పురా క్రూరస్య విసృపో విరప్సిన్'' అను మంత్రము నావేదార్థదీపకయందు సంహితయందు (కా. 1, ప్ర. 1, అ. 9;) విపులముగ వివరించఁబడినది.

31. మంత్రము :**ఉదాదాయ పృథివీం జీరదానుర్యామైరయఞ్ఛ్వభ్రమసి స్వధాభిరిత్యాహ। యదేవాస్యా అమేధ్యమ్ ।**

తదపహత్య ।మేధ్యాం దేవయజనీం కృత్వా (13) ।యదదశ్వభ్రమసి మేధ్యమ్ ।తదస్యామేరయతి।

అర్థము : ''ఉదాదాయ పృథివీం జీరదానుర్యామైరయఞ్చన్ద్రమసి స్వధాభిః'' ఇతి ఆహ='హవిఃప్రదాతలైన వృద్ధ యజమానులు పూర్వము వేదిరూపమైన భూమిని రాక్షసులనుండి రక్షించి చంద్రునియం దమృత కిరణములతో స్థాపించిరి' అని మంత్రము చెప్పినది. అస్యాఃఈ వేదియొక్క, యదేవ అమేధ్యమ్=ఏ యపవిత్రతయే కలదో, తత్ అపహాయ=ఆ యపవిత్రతను పోcగొట్టి, దేవయజనీమ్=దేవయాగభూమిని, మేధ్యామ్=పవిత్రమునుగా, కృత్వా=చేసి, చన్ద్రమసి=చంద్రునియందు, యత్ అదఃమేధ్యమ్=ఈ పవిత్రత్వమేది కలదో, తత్=ఆ పవిత్రత్వమును,అస్యామ్=ఈదేవయజనియందు, ఏరయతి=(అధ్వర్యుcడు లేదా -యజమానుcడు) తీసికొనివచ్చినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : 'చన్ద్రమస్యైరయన్' అను అనుసంధానముయొక్క ప్రయోజనము నీ బ్రాహ్మణము చెప్పినది. హవిఃప్రదాతలైన వృద్ధయజమానులు పూర్వము వేదిరూపమైన భూమిని రాక్షసులనుండి రక్షించి చంద్రునియందు స్థాపించిరని యజుస్సు చెప్పినది. అనcగా ఈ వేదియొక్క యపవిత్రతను పోcగొట్టి యీ దేవయజనిని పవిత్రమునుగాc జేసి అధ్వర్యుcడు చంద్రునియందలి పవిత్రతను ఈ వేదియందు తీసికొనివచ్చినవాc డగుచున్నాcడని యర్థము.

32. మంత్రము :**తాం ధీరాసో అనుదృశ్య యజన్త ఇత్యాహానుఖ్యాత్యై ।**

అర్థము : ''తాం ధీరాసో అనుదృశ్య యజన్తే'' ఇతి ఆహ='అట్టి వేదిని ఇప్పటిబుద్ధిమంతులగు యజమానులు ఆ విషయమును మనస్సుతో నాలోచించి యాగము చేయుచున్నారని' యజుస్సుచెప్పినది. ఏతత్=ఈ కథనము, అనుఖ్యాత్యై=అనుసంధానముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : యజుస్సునందలి 'అనుదృశ్య' అను పదముయొక్క యభిప్రాయము నీ బ్రాహ్మణము చెప్పినది. శేషము స్పష్టము.

33. మంత్రము :**ప్రోక్షణీరాసాదయ ఇధ్మాబర్హిరుపసాదయ । స్రువం చ స్రుచశ్చ సంమృడ్ఢి । పత్నీగ్ం సంనహ్య ।**

ఆజ్యేనోదేహీత్యాహానుపూర్వతాయై ।

అర్థము : ''హే అగ్నీధ్ర!=ఓ యాగ్నీధ్రుcడా!, ప్రోక్షణీః=ప్రోక్షణ సాధనములైన యుదకములను, ఆసాదయ = వేదియందు ఉంచుము. ఇధ్మాబర్హిః =ఇధ్మమును, బర్హిస్సును, ఉపసాదయ =ఆ ప్రోక్షణజలముల సమీపమున నుంచుము. పత్నీమ్=యజమానపత్నిని, సంనహ్య=దర్భలత్రాటితో బంధించి(నడుమునకు మేఖలగా చుట్టి)స్రువమ్ చ=స్రువమును, స్రుచఃచ=స్రుక్కులను, సమృడ్ఢి=బాగుగ శుద్ధిచేయుము. ఆజ్యేన=ఆజ్యముతోc గూడ, ఉదేహి=లేచిరమ్ము'' ఇతి ఆహ=అని యధ్వర్యుcడు ఆగ్నీధ్రునిcగూర్చి ప్రైషమంత్రమును పఠించెను. ఏతత్=ఈ ప్రైషమంత్రపఠనము, అనుపూర్వతాయై=అనుక్రమముగ ననుష్ఠానము కొఱకు, ఉపయుజ్యతే=ఉపయోగించcబడుచున్నది.

తాత్పర్యము : అధ్వర్యుc డాగ్నీధ్రునిcగూర్చి ప్రైషమంత్రమును పఠించెను. (ఆ ప్రైషమంత్రార్థము అర్థమునందు వివరించcబడినది.) ఈ బహ్వార్థవిషయ ప్రైషమంత్రపఠనము అనుక్రమముగ ననుష్ఠానము జరుగుట కుపయోగపడును. ఇచట శ్రుతి ప్రైషమంత్రము నుత్పాదింపcజేసినది.

34. మంత్రము :**ప్రోక్షణీరాసాదయతి । అప్తో వై రక్షోఘ్నీః (14) । రక్షసామపహత్యై । స్ఫ్యస్య వర్త్మన్నాదయతి ।**

యజ్ఞస్య సంతత్యై ।

అర్థము : (ఆగ్నీధ్రః=ఆగ్నీధ్రుcడు,)ప్రోక్షణీః=ప్రోక్షించుటకొఱకైన యుదకములను, ఆసాదయతి=వేదియం దాసాదనము చేయవలెను(ఉంచవలెను). ఆపః=ఉదకములు, రక్షోఘ్నీః వై=రాక్షసులను నశింపc జేయునట్టివియే. ఏతత్=ఈ ప్రోక్షణ్యాసాదనము, రక్షసామ్=రాక్షసులయొక్క, అపహత్యై=పోcగొట్టుటకై (తొలcగింపునకై), భవతి=అగుచున్నది. స్ఫ్యస్య=స్ఫ్యముయొక్క, వర్త్మన్=రేఖయందు, సాదయతి=ఉంచవలెను. ఏతత్=ఈ సాదనము, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, సంతత్యై=అవిచ్ఛిత్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము ఆగ్నీధ్రునియొక్క అనుష్ఠానమును విధించుచున్నది. అధ్వర్యుని ప్రైషమంత్ర పఠనము ననుసరించి యాగ్నీధ్రుcడు ప్రోక్షణ్యుదకములను వేదియందు స్ఫ్యముచే గీయcబడిన రేఖయం దుంచవలెను. ఉదకములు రాక్షసనాశమును చేయునవియే కనుక ఈ ప్రోక్షణ్యుదకాసాదనము రాక్షసాపహతికిc గారణము లగును. స్ఫ్యముయొక్క వర్త్మమం దుంచుట యజ్ఞసంతతికిc గారణ మగును.

35. మంత్రము :**ఉవాచ హాసితో దైవలః । ఏతావతీర్వా అముష్మింల్లోక ఆప ఆసన్ । యావతీః ప్రోక్షణీరితి ।**

తస్మాద్బహ్వీరాసాద్యాః ।

అర్థము : 'యావతీః ప్రోక్షణీః సన్తి=ప్రోక్షణార్థములైన యుదకము లెన్నికలవో, తావతీః ఆపః వై=అన్నియుదకములే, అముష్మిన్ లోకే=స్వర్గలోకమునందు, ఆసన్=ఉన్నవి.' ఇతి=అని, హాసితః=హాసితునికుమారుcడైన, దైవలః=దైవలుcడు,ఉవాచ=చెప్పెను.తస్మాత్=ఆ కారణమువలన, బహ్వీః ఆసాద్యాః=బహుళములైన యుదకము లాసాదింపcదగినవి.

తాత్పర్యము : ఈ యాగమునందు ప్రోక్షణమునకై యుదకము లెన్ని యాసాదించcబడుచున్నవో, అన్నియుదకములే స్వర్గలోకమునందు ఉంటున్నవని హాసితుcడైన దేవలుcడు చెప్పుటవలన బహుళముగ నుదకముల నాసాదించవలెను. ఇచట ప్రోక్షణార్థములైన యుదకముల బాహుళ్యము విధించcబడినది.

36. మంత్రము :**స్ఫ్యముదస్యన్ । యం ద్విష్యాత్తం ధ్యాయేత్ । శుచైవైనమర్పయతి (15) ॥**

వై వా॒యుర॑హ పరా॒వతీ॒త్యా॑హ॑ ద్వితీయగ్ం హర॒తీతి॑ పరిగృహ్ణా॒తి దే॒వయ॑జనీం కరోతి భవన్తి ఖనత్యకరే॒తత్కృ॒త్వా ర॑క్షో॒ఘ్నార॑ర్పయతి ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయ ప్రపాఠకే నవమోఽనువాకః ॥౯॥

అర్థము : యజమానః=యజమానుcడు, యమ్=ఏ పురుషుని, ద్విష్యాత్=ద్వేషించునో, స్రుక్యమ్=స్రుక్యమును, ఉదస్యన్=ఉత్కరమునందు పరిత్యజించుచు, తమ్=ఆ ద్వేష్యుని, ధ్యాయేత్=మనస్సునందు తలcచువలెను. తదా=అప్పుడు, సః=ఆ యజమానుcడు, ఏనమ్=ఈ ద్వేష్యుని, శుచైవ=దుఃఖముతోనే, అర్పయతి=అర్పించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : ఇచట బ్రాహ్మణము ఉత్కరమందు ధ్యానవిశిష్టమైన స్రుక్ పరిత్యాగమును విధించుచున్నది. యజమానుcడు తాను ద్వేషించుచున్న పురుషుని (శత్రువును) తలcచుచు స్రుక్యమును ఉత్కరమునందు పరిత్యజించవలెను.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునకృతీయ కాండమున ద్వితీయ ప్రపాఠకమునందు
నవమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే
దశమోఽనువాకః

1. మంత్రము : **వజ్రో వై స్ఫ్యః । యదన్వఞ్చం ధారయేత్ । వజ్రేకధ్వర్యుః క్షణ్వీత । పురస్తాత్తిర్యఞ్చం ధారయతి । వజ్రో వై స్ఫ్యః । వజ్రేణైవ యజ్ఞస్య దక్షిణతో రక్షాగ్ంస్యపహన్తి । అగ్నిభ్యాం ప్రాచశ్చ ప్రతీచశ్చ । స్ఫ్యేనోదీచశ్చాధరాచశ్చ । స్ఫ్యేన వా ఏష వజ్రేణాస్యై పాప్మానం భ్రాతృవ్యమపహత్య । ఉత్కరేకధి ప్రవృశ్చతి (1) । యథోపధాయ వృశ్చన్త్యేవమ్ ।**

అర్థము : స్ఫ్యః=స్ఫ్యము, వజ్రః వై=వజ్రాయుధమే. అన్వఞ్చమ్=అభిముఖముగ, ధారయేత్ యత్=ధరింపc జేయుచో, వజ్రే=వజ్రాయుధమువంటి స్ఫ్యము విషయమున, అధ్వర్యుః=అధ్వర్యుcడు, క్షణ్వీత=మరణించును. పురస్తాత్=తూర్పుదిక్కున, తిర్యఞ్చమ్=అడ్డముగ, ధారయతి=ధరింపcజేయవలెను. స్ఫ్యః వజ్రః వై=స్ఫ్యము వజ్రాయుధమే. వజ్రేణైవ=వజ్రాయుధముచే, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, దక్షిణతః=దక్షిణ దిక్కునందు, రక్షాంసి=రాక్షసులను, అపహన్తి=నశింపcజేసినవాc డగుచున్నాcడు. అగ్నిభ్యామ్ ప్రాచశ్చ ప్రతీచశ్చ=ఆహవనీయ గార్హపత్యాగ్నులచే ప్రాక్పశ్చిమ దిక్కులందు, రక్షాంసి, అపహన్తి. స్ఫ్యేన=స్ఫ్యముచే, ఉదీచః=ఉత్తరదిక్కునc గల రాక్షసులను, అధరాచశ్చ=అధో దిక్కునc గల రాక్షసులను, అపహన్తి. ఏషః=ఈ యధ్వర్యుcడు, స్ఫ్యేన వై వజ్రేణ =స్ఫ్యమే అయిన వజ్రముచేత, అస్యై=ఈ వేదినుండి, పాప్మానం భ్రాతృవ్యమ్=హీపరూపవైరిని, అపహత్య= నశింపcజేసి, యథా=ఏ విధముగ, ఉపధాయ=ఆధారము నందుంచి, వృశ్చన్తి=ఛేదించుచున్నారో, ఏవమ్= ఈ విధముగ, ఉత్కరే అధి వృశ్చతి= ఉత్కరమనెడి ఆధారమునందు ఛేదించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : స్ఫ్యమునకు వజ్రత్వ ప్రతిపాదకమైన శ్రుత్యంతరము పూర్వము ఉదాహరించcబడినది. యథోక్త ప్రైషకాలమందు స్ఫ్యముయొక్క తిర్యగ్ధారణము నీ బ్రాహ్మణము విధించుచున్నది. స్ఫ్యము వజ్రాయుధము వంటిదే. స్ఫ్యము నభిముఖముగ ధరింపcజేసినచో నధ్వర్యుcడు మరణించును. కనుక అధ్వర్యుcడు యజమానునిచే స్ఫ్యము నడ్డముగ ధరింపcజేయవలెను. స్ఫ్యము వజ్రమువంటిది కనుక, అడ్డముగ పట్టుకొనcగా దక్షిణాగ్ర మగుటవలన వేదికి దక్షిణదిక్కునందుc గల రాక్షసులు హతు లగుదురు. ఆహవనీయాగ్నిచే పూర్వదిక్కునందుc అసురులను సంహరించువాc డగును. గార్హపత్యాగ్నిచే పశ్చిమదిక్కునc గల రాక్షసులను సంహరించినవాc డగును. స్ఫ్యముయొక్క మూలముచే నుత్తరదిక్కునc గల రాక్షసులను సంహరించినవాc డగును. స్ఫ్యముయొక్క అధోధారణచే అధస్తనులైన రాక్షసులను, ఊర్ధ్వధారణచే ఉపరితనులైన రాక్షసులను సంహరించినవాc డగుననియు గ్రహించవలెను. ఈ విధముగ తిర్యక్కుగ ధరింపcజేయుచు నధ్వర్యుcడు పాపరూప వైరిని ఈ వేదినుండి తొలcగించి ఉత్కరమందు

ఛేదించినవాc డగును. ఒకానొక కాష్ఠము నొకయాధారమునందుంచి లోకులు ఛేదించుచుండుటవంటిదే యిది కూడ.

2. మంత్రము : **హస్తావవనేనిక్తే । ఆత్మానమేవ పవయతే ।**

అర్థము : హస్తౌ=హస్తములను, అవనేనిక్తే=ప్రక్షాళనము చేసికొనవలెను. (తేన=ఆ ప్రక్షాళనముచే, యజమానః=యజమానుcడు,)ఆత్మానమేవ=తననే, పవయతే=పవిత్రముగc జేసికొనినవాc డగుచున్నాcడు. ప్రక్షాళనము=చక్కcగాకడుగుట.

యజమానుcడు హస్తప్రక్షాళనము చేసికొనవలెను. ఈ ప్రక్షాళనముచే తననే పవిత్రముcగ జేసికొనినవాc డగును. ఇచట హస్తప్రక్షాళనము విధించcబడినది.

3. మంత్రము : **స్ఫ్యం ప్రక్షాలయతి మేధ్యత్వాయ । అథో పాప్మన ఏవ భ్రాతృవ్యస్య న్యఙ్గం ఛినత్తి ।**

అర్థము : స్ఫ్యమ్=స్ఫ్యమును, ప్రక్షాలయతి=ప్రక్షాళనము చేయవలెను. ఏతత్=ఈ ప్రక్షాళనము, మేధ్యత్వాయ=పవిత్రతకొఱకు, భవతి=అగుచున్నది. అథో=మఱియు, పాప్మనః భ్రాతృవ్యస్యైవ=పాపరూప శత్రువుయొక్కయే, అఙ్గమ్=శరీరమును, నిచ్ఛినత్తి=నిశ్శేషముగ ఛేదించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : అధ్వర్యుcడు స్ఫ్యమును ప్రక్షాళనము చేయవలెను. ప్రక్షాళితమైన స్ఫ్యము పవిత్రమై యజ్ఞయోగ్య మగును. మఱియు ఈ ప్రక్షాళనముచే నధ్వర్యుcడు లేదా-యజమానుcడు పాపరూప వైరియొక్క శరీరమును ఛేదించినవాc డుగును. ఇచట స్ఫ్యముయొక్క ప్రక్షాళనము కూడ విధించcబడినది.

4. మంత్రము : **ఇధ్మాబర్హిరుపసాదయతి యుక్త్యై । యజ్ఞస్య మిథునత్వాయ । అథో పురోరుచమేవైతాం దధాతి ।**

ఉత్తరస్య కర్మణో కనుఖ్యాత్యై ।

అర్థము : ఇధ్మాబర్హిః=ఇధ్మమును, బర్హిస్సును, ఉపసాదయతి=వేదియందు ఉపసాదనము చేయవలెను. ఏతత్=ఈ యుపసాదనము, యుక్త్యై=రెండింటియొక్క సహాయోగము(పరస్పరసంబంధము)కొఱకు, భవతి= అగుచున్నది. (ఏషః=ఈ సహాయోగము,) యజ్ఞస్య మిథునత్వాయ భవతి=యజ్ఞసంబంధియైన మిథునము కొఱ కగుచున్నది. అథో=మఱియు, ఏతామ్=ఈ యుపసాదనరూపమైన, రుచమేవ=దీప్తినే, పురః=పురోభాగమున, దధాతి=స్థాపించినవాc డగుచున్నాcడు. ఏషా=ఈ పురోదీప్తి, ఉత్తరస్య కర్మణః=తదనంతరకర్మయొక్క, అనుఖ్యాత్యై=అనుఖ్యాతికొఱకు, భవతి=అగుచున్నది. అనుఖ్యాతిః=ప్రసిద్ధి. అనcగా నెంటనే తెలియcజేయcబడుట.

తాత్పర్యము : ఇచట ఆగ్నీధ్రునియొక్క అనుష్ఠానము విధించcబడున్నది. ఆగ్నీధ్రుcడు ఇధ్మమును, బర్హిస్సును ఒకదానినెంట నొకటిగా వేదియందు ఉంచవలెను. ఈ సహసాదనము పరస్పరయోగము (సంబంధము)

కొఱ కగును. ఆ సహయోగముచేత యజ్ఞసంబంధియైన మిథునము సిద్ధించును. మఱియు ఈ యుపసాదనరూపదీప్తిని పురోభాగమునc జేసినవాc డగును. ఆ దీప్తిచే అనంతరకర్తవ్యము ఖ్యాపిత మగును.

5. మంత్రము : **న పురస్తాత్ప్రత్యగుపసాదయేత్ (2) । యత్పురస్తాత్ప్రత్యగుపసాదయేత్ । అన్యత్రా ऽऽహుతిపథాదిధ్మం ప్రతిపాదయేత్ । ప్రజా వై బర్హిః । అపరాధ్నుయాద్బర్హిషా ప్రజానాం ప్రజననమ్ । పశ్చాత్ప్రాగుపసాదయతి । ఆహుతిపథేనేధ్మం ప్రతిపాదయతి । సంప్రత్యేవ బర్హిషా ప్రజానాం ప్రజననముపైతి ।**

అర్థము : ఆగ్నీధ్రుఃఆగ్నీధ్రుcడు, పురస్తాత్=ప్రాగ్దిశయందు, అవస్థాయ=ఉండి, ప్రత్యక్=పశ్చిమముగ, న ఉపసాదయేత్=ఇధ్మము నుపసాదనము చేయరాదు. పురస్తాత్=ప్రాగ్దిశయందు, అవస్థాయ=ఉండి, ప్రత్యక్=పశ్చిమముగ, ఉపసాదయేత్ యత్=ఉపసాదనము చేయుచో, ఆహుతిపథాత్=ఆహుతిమార్గమునుండి, అన్యత్ర=మఱియొకచోట, ప్రతిపాదయేత్=ఇచ్చినవాc డగును. బర్హిఃబర్హిస్సు, ప్రజా వై=ప్రజయే. బర్హిషా=బర్హిస్సుచే, ప్రజానామ్ ప్రజననమ్=ప్రజలయొక్క ప్రకర్ష జననమును, అపరాధ్నుయాత్=నశింపcజేసినవాc డగును. అతఃఈ కారణమువలన, పశ్చాత్=పశ్చిమదిక్కునందు, అవస్థాయ=ఉండి, ప్రాక్ ఉపసాదయతి=ప్రాగ్గముగ, నుపసాదనము చేయవలెను. తదా=అప్పుడు, ఆహుతిపథేన=ఆహుతి మార్గముచే, ఇధ్మమ్=ఇధ్మమును, ప్రతిపాదయతి=ఇచ్చినవాc డగును. సంప్రత్యేవ=ఇప్పుడే, బర్హిషా=బర్హిస్సుచే, ప్రజానామ్=ప్రజలయొక్క, ప్రజననమ్=ప్రకర్షోత్పత్తిని, ఉపైతి=యజమానుcడు పొందినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : ఆగ్నీధ్రుcడు ఇధ్మమును, బర్హిస్సును ప్రాగ్దిశయందు ఉంది పశ్చిమముగ నుపసాదనము చేయరాదు. అట్లు చేసినచో ఆహుతిపథముకంటె నితరమైనప్రదేశమున నిచ్చినవాc డగును (ఉంచినవాc డగును). ఇధ్మమునకు ఆహుతిపథము ప్రాగ్గత్వము. ప్రత్యగ్గమైన బర్హిస్సుచే ప్రజోత్పత్తి నశించును. అందువలన ఆగ్నీధ్రుcడు స్వయముగ పశ్చిమమున అవస్థితుడై ఇధ్మమును, బర్హిస్సును (ఉభయమును) ప్రాగ్గముగ నుపసాదనము చేయవలెను. ఆ విధముగc జేయుటవలన ఇధ్మమునకు ఆహుతిపథము తొలcగిపోదు. ఇప్పుడే సమీచీనమైన బర్హిస్సుచే ప్రజోత్పత్తిని పొందినవాc డగును. ఇచట ఇధ్మబర్హిస్సుల కుపసాదనమందు ప్రాగ్గత్వము విధించcబడినది.

6. మంత్రము : **దక్షిణమిధ్మమ్ । ఉత్తరం బర్హిః । ఆత్మా వా ఇధ్మః । ప్రజా బర్హిః । ప్రజాహ్యాత్మన ఉత్తరతరా తీర్థే । తతో మేధముపనీయ । యథాదేవతమేవైనత్ప్రతిష్ఠాపయతి । ప్రతితిష్ఠతి ప్రజయా పశుభిర్యజమానః (3)। వృశ్చతి సాదయేదిధ్మః పఞ్చ చ ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయప్రపాఠకే దశమోऽనువాకః ॥౧౦॥

అర్థము : ఇధ్మమ్=ఇధ్మమును, దక్షిణమ్=దక్షిణముగా, ఉపసాదయేత్=ఉపసాదనము చేయవలెను. బర్హిః=బర్హిస్సును, ఉత్తరమ్=ఉత్తరముగా, ఉపసాదయేత్. ఇధ్మఃఇధ్మము, ఆత్మావై=ఆత్మ(వంటిది)యే. (పితయే). బర్హిః=బర్హిస్సు, ప్రజా=సంతానమువంటిది. ప్రజా=సంతానము, ఆత్మనఃఆత్మకు(తండ్రికి), ఉత్తరతరా=ఉత్తర భాగమున నున్నదై, తీర్థే=యోగ్యస్థానమున, సంపద్యతే హి=సంపన్నమగుచున్నది కదా! తతఃఆ కారణమువలన, తదుభయమ్=ఆ యుభయమును, మేధమ్=యజ్ఞమును, ఉపనీయ=పొందించి, యథాదేవతమ్=ఆ యా దేవతల నతిక్రమించక, ప్రతిష్ఠాపయతి=స్థాపించినవాఁడగును. యజమానఃయజమానుఁడు, ప్రజయా=సంతానముచేత, పశుభిఃపశువులచేతను, ప్రతితిష్ఠతి= ప్రతిష్ఠితుఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : తండ్రియైన యజమానునకు దక్షిణభాగము యుక్తము. ప్రజకు ఉత్తరభాగము యుక్తము. అట్లు కాఁగా ఆ యుభయము యోగ్యస్థానమునందు సంపన్న మగును. అందువలన ఆగ్నీధ్రుఁడు ఆ యిధ్మాబర్హిస్సుల యుభయమును యజ్ఞమును పొందించి ఆ యా దేవతల నతిక్రమించక స్థాపించినవాఁ డగును. దీనిచే యజమానునకు ప్రజాపశుసమృద్ధి కలుగును.

కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయకాండమున ద్వితీయ ప్రపాఠకమునందు దశమానువాకము సమాప్తము.

తృతీయస్యాం దేవస్యాశ్వపర్ష్మం యో వై పూర్వేద్యుఃకర్మణే వామిన్ద్రో వృత్రమహన్త్సకపోకవధూతం

ధృష్టిర్దేవస్యేత్యాహ సంవపామి దేవస్య స్ఫ్యమాదదే వజ్రో వై స్ఫ్యో దశ।

తృతీయస్యాం యజ్ఞస్యానతిరేకాయ పవిత్రవత్యధ్వర్యుం చాధిషవణమస్యన్తరిక్ష ఏవ రక్షసామన్తర్హిత్యై

ద్యౌ వావ పురుషో యదదశ్చన్దమసి మేధ్యం పఙ్క్తిశీతిః। తృతీయస్యాం యజమానః॥

హరిఃఓమ్।

ఇతి కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే ద్వితీయఃప్రపాఠకఃII2II

కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో ద్వితీయ ప్రపాఠకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే

ప్రథమోఽనువాకః

1. మంత్రము : **ప్రత్యష్టగ్ం రక్షః ప్రత్యష్టా అరాతయ ఇత్యాహ। రక్షసామపహత్యై । అగ్నేర్వస్తేజిష్ఠేన తేజసా నిష్టపామీత్యాహ మేధ్యత్వాయ ।**

వేదార్థదీపిక

అవతారిక : ద్వితీయప్రపాఠకమునందు వత్సాపకరణార్థమంత్రములనుండి వేదికరణార్థ మంత్రములవఱకు బ్రాహ్మణ మభిహితమైనది. ఈ తృతీయ ప్రపాఠకమునందు ఆజ్యాది హవిర్గ్రహార్థ మంత్రములనుండి స్రుగ్వ్యూహనార్థ మంత్రముల వఱకు బ్రాహ్మణము చెప్పఁబడుచున్నది. ప్రథమమున నీ ప్రథమానువాకము నందు ఆజ్యాది హవిర్గ్రహణార్థ మంత్రములకు బ్రాహ్మణము చెప్పఁబడుచున్నది. ఈ యాజ్యాది హవిర్గ్రహణార్థ మంత్రము లన్నియు సంహితయందలి ప్రథమకాండములోని ప్రథమ ప్రపాఠకమునం దామ్నాతము లైనవి.

అర్థము : 'ప్రత్యష్టగ్ం రక్షః ప్రత్యష్టా అరాతయః' ఇతి ఆహ=ఆజ్యాది హవిస్సులను గ్రహించుటయందు సాధనములైన స్రుక్స్రువాదులను హస్తములతో గ్రహించుటచే, అందు నిగూఢముగనున్న రాక్షసస్వరూపము నశింపఁబడిన దగుఁగాక. శత్రువుల రూపము కూడ నశింపఁబడిన దగుఁగాక' అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ స్రుగాదుల గ్రహణము, రక్షసామ్=రాక్షసులయొక్క, అపహత్యై=వినాశముకొఱకు, భవతి=అగుచున్నది. 'అగ్నేర్వస్తేజిష్ఠేన తేజసా నిష్టపామి' ఇతి ఆహ=ఓ స్రుచములారా! మిమ్ము అతితీక్ష్ణమైన యగ్నియొక్క తేజస్సుచే నిశ్శేషముగ తపింపఁజేయుచున్నాను (వెచ్చగాఁజేయుచున్నాను) అని శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ వెచ్చఁజేయుట, మేధ్యత్వాయ=స్రుచాదులయొక్క పవిత్రతకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : శ్రుతి చెప్పెననఁగా యజమానుని పక్షమున అధ్వర్యుఁడు యజ్ఞప్రక్రియను జరుపుచుండును కనుక అధ్వర్యుఁడు చెప్పెనని యర్థము. ఈ యాధ్వర్యవ మంత్రములలో నిట్లు కాఁగా హౌత్ర ప్రయోగ విషయమున హోతయు, యాజమాన ప్రయోగ విషయమున యజమానుఁడును చెప్పెనని గ్రహించవలెను. ఇందు 'ప్రత్యష్ట' మిత్యాదిక మొక మంత్రము. 'అగ్నేర్వః' ఇత్యాదిక మింకొక మంత్రము. ఇందు ప్రథమము అనిష్టపరిహారముకొఱకు, ద్వితీయము ఇష్టసిద్ధికొఱకునని యర్థము. తాత్పర్యము స్పష్టము.

2. మంత్రము : **స్రుచ్చః సంమార్ష్టి ।**

అర్థము : స్రుచఃస్రుక్ స్రువాదులను, సంమార్ష్టి=సమ్మార్జనము (బాగుగ తుడుచుట) చేయవలెను.

తాత్పర్యము : స్రుక్ స్రువాదులను సమ్మార్జనము చేయవలెను. ఇచట స్రుక్ స్రువాదుల సమ్మార్జనము విధించఁబడినది.

3. మంత్రము : **స్రువమగ్రే । పుమాగ్ంసమేవాకభ్యః సగ్ంశ్యతి మిథునత్వాయ ।**

అర్థము : ఆభ్యః=ఈ జుహ్వాదులకంటె, అగ్రే=పూర్వమున (ప్రథమమున), పుమాంసమ్=పురుషునివంటి, స్రువమ్=స్రువమును, సంశ్యతి=సంస్కరించవలెను. ఏతత్=జుహ్వాదులకంటె పూర్వమున ఈ స్రువ సంస్కరణము, మిథునత్వాయ=మిథునభావముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : స్రువము పురుషవాచకము. జుహ్వాదులు స్త్రీవాచకములు. అందువలన ఆ జుహ్వాదులకంటెపూర్వభావిత్వము స్రువమునకు యుక్తము. ఇట్లు చేయుటవలన మిథునత్వము సిద్ధించుచున్నది. ఇచట క్రమము విధించcబడినది.

4. మంత్రము : **అథ జుహూమ్ । అథోపభృతమ్ । అథ ధ్రువామ్ ।**

అర్థము : అథ=స్రువ సంస్కరణానంతరము, జుహూమ్=జుహువును, సంశ్యతి=సంస్కరించవలెను. అథ=తదనంతరము, ఉపభృతమ్=ఉపభృత్తును, సంశ్యతి. అథ=తదనంతరము, ధ్రువామ్=ధ్రువను, సంశ్యతి.

తాత్పర్యము : స్రుక్కు స్రువము, జుహువు, ఉపభృత్తు, ధ్రువ అనునివి ఆజ్యాది హవిస్సులను గ్రహించుటయందు సాధనములు. తాత్పర్యము స్పష్టము. ఇచట పౌర్వాపర్యము విధించcబడినది.

5. మంత్రము : **అసౌ వైజుహూః (1) ।అన్తరిక్షముపభృత్ । పృథివీ ధ్రువా ।ఇమే వై లోకాః స్రుచః । వృష్టిః సంమార్జనాని।**

వృష్టిర్వా ఇమాంల్లోకాననుపూర్వం కల్పయతి ।తే తతః క్లుప్తాః సమేధన్తే ।

అర్థము : జుహూఃజుహువు, అసౌ వై=ద్యులోక స్వరూపమే. ఉపభృత్=ఉపభృత్తు, అన్తరిక్షమ్=అంతరిక్ష స్వరూపము. ధ్రువా=ధ్రువ, పృథివీ=పృథివీ స్వరూపము. స్రుచఃస్రుగాదులు, ఇమే లోకాః వై=ఈ భూరాదిలోక స్వరూపములే. సంమార్జనాని=వేదాగ్రములు, వృష్టిఃవృష్టి స్వరూపములు. ఇమాన్ లోకాన్=ఈ లోకములను, అనుపూర్వమ్=అనుక్రమముగ, వృష్టిఃవృష్టి, కల్పయతి వై=నిశ్చయముగ ధాన్యాదిసంపన్నములనుగాc జేయుచున్నది. తతఃఅందువలన, తే=ఆ లోకములు, క్లుప్తాఃసంపన్నములై, సమేధన్తే=బాగుగ వృద్ధినొందుచున్నవి.

తాత్పర్యము : క్రమావస్థానసామ్యముచే స్రుగాదులకు లోకత్వము చెప్పcడినది. సంమృజ్యన్తే స్రుచఃయైవేదాగ్రైఃతాని సంమార్జనాని. ప్రథమమున దర్భలచే వేదమును చేసి (కట్టcగాcగట్టి) తదగ్రములను పరివాసము చేసి (కోసి) యా వేదపరివాసనములు స్రుక్కుల సంమార్జనమునకై స్థాపించcబడినవి. అవి వృష్టిజన్యములు కనుక వృష్టిరూపములు. వృష్టిరూపములైనవేదాగ్రములచే లోకరూపములైన జుహ్వాదులకు క్రమముగసంమార్జనము కలుగcగా వృష్టియే అనుక్రమవర్తులైన లోకములను ధాన్యాదిసంపన్నములనుగాc జేయుచున్నది. అందువలన ఆ లోకము లభివృద్ధము లగుచున్నవి. ఇచట ప్రశంస చేయcబడినది.

6. మంత్రము : **సమేధన్తే కస్మా ఇమే లోకాః ప్రజయా పశుభిః ।య ఏవం వేద ।**

అర్థము : యఃఏ పురుషుcడు, ఏవమ్=పూర్వోక్తవిధముగ, వేద=తెలిసికొనుచున్నాcడో, అస్మై=ఈ పురుషుని

కొఱకు, ఇమే లోకాః=ఈ లోకములు, ప్రజయా=ప్రజచేతను, పశుభిః=పశువులచేతను, సమేధన్తే=బాగుగ నభివృద్ధి నొందుచున్నవి.

తాత్పర్యము : పూర్వోక్తవిధముగ దెలిసికొనినవానికొఱకు ఈ లోకములు ప్రజా పశు సంపదచే నభివృద్ధి నొందును. ఇచట వేదనము ప్రశంసించబడినది.

7. మంత్రము : **యది కామయేత వర్షుకః పర్జన్యః స్యాదితి । అగ్రతః సంమృజ్యాత్ (2) । వృష్టిమేవ నియచ్ఛతి ।**

అర్వాచీనాగ్రా హి వృష్టిః । యది కామయేతావర్షుకః స్యాదితి । మూలతః సంమృజ్యాత్ ।

వృష్టిమేవోద్యచ్ఛతి।

అర్థము : పర్జన్యః=వర్షాధిదేవత, వర్షుకః=వర్షించునట్టిది, స్యాత్=అగుచుగాక, ఇతి=అని, కామయేత యది=అధ్వర్యుడు కోరుకొనుచో, అగ్రతః=వేదపరివాసనముల యగ్రభాగముచే సంమృజ్యాత్=సంమార్జనము (తుడుచుట) చేయవలెను. వృష్టిమేవ=వర్షమునే, నియచ్ఛతి=న్యగ్భావముచే ప్రవర్తింపచేసినవాడగును. వృష్టిః=వృష్టి, అవాచీనాగ్రా హి=అవాచీనాగ్ర (వంగినట్టిది) కదా! అవర్షుకః స్యాదితి=వర్షాధిదేవత వర్షింపనట్టిదగుచుగాక యని కామయేత యది=అధ్వర్యుడు కోరుకొనుచో, మూలతః=వేదపరివాసనముల మూలభాగముచే, సంమృజ్యాత్=సంమార్జనము చేయవలెను. తదా=అప్పుడు, వృష్టిమేవ=వర్షమునే, ఉద్యచ్ఛతి=ఊర్ధ్వాకారముగ వారింపజేయువాడగును.

తాత్పర్యము : పర్జన్యదేవుడు వర్షించవలెనని యధ్వర్యుడు కోరుకొనుచో నతడు వేదపరివాసనముల యగ్రభాగమునుండి సంమార్జనము చేయవలెను. వృష్టి యర్వాచీనాగ్రకనుక (వంగినదై యుండును కనుక) వర్షము నధోముఖముగ ప్రవర్తింపచేయువాడగును. పర్జన్యదేవుడు వర్షించరాదని కోరుకొనుచో పరివాసనముల మూలభాగముచే సంమార్జనము చేయవలెను. అప్పుడతడు వృష్టి నూర్ధ్వాకారముగ వారింపచేయువాడగును. ఇచట వేదపరివాసనములయొక్క అగ్ర మూలములకు వ్యవస్థ చూపబడినది. వేదపరివాసనములు=అగ్రములను కోయగా మిగిలినదర్భలకట్టలోని దర్భలు.

8. మంత్రము : **తదు వా ఆహుః । అగ్రత ఏవోపరిష్టాత్సంమృజ్యాత్ । మూలతోఽధస్తాత్ । తదనుపూర్వం కల్పతే**

వర్షుకో భవతీతి (3) ।

అర్థము : తదు వై=ఆ విషయమునునే,ఆహుః=సంప్రదాయవిదులు చెప్పుచున్నారు. అగ్రతః ఏవ=వేదపరివాసనముల యగ్రభాగముచేతనే, ఉపరిష్టాత్=స్రుక్స్రువాదుల పైభాగమున (బిలభాగమున), సంమృజ్యాత్=సంమార్జనము చేయవలెను. మూలతః=వేదపరివాసనముల మూలభాగముచే, అధస్తాత్=స్రుక్స్రువాదుల యొక్క యధోభాగమున (దండభాగమున), సంమృజ్యాత్=సంమార్జనము చేయవలెను. తత్=అప్పుడు, అనుపూర్వం కల్పతే=ఆనుపూర్వి సమాన మగును. పర్జన్యశ్చ=పర్జన్యదేవుడును, వర్షతి=వర్షించును.

తాత్పర్యము : ఉపరిష్టాత్ స్రుక్స్రువాదుల బిలభాగము. అధస్తాత్=ఆ స్రుక్స్రువాదల దండభాగము. ఈ విధముగ

జేయుటవలన పరివాసనములయొక్కయు, స్రుక్స్రువాదులయొక్కయు నగ్ర మగ్రముతోను, మూలము మూలముతోను సంబద్ధ మగుటచే ఆనుపూర్వి సమాన మగును. అప్పుడు పర్వన్యఁడు వర్షించును. ఇది సంప్రదాయవిదుల మతము. పూర్వోక్తవిషయముననే ఈ శ్రుతి సంప్రదాయవిదుల మతమును చెప్పినది.

9. మంత్రము : ప్రాచీమభ్యాకారమ్ । అగ్రైరన్తరతః । ఏవమివ హ్యన్నమద్యతే । అథో అగ్రాద్వా ఓషధీనామూర్జం ప్రజా ఉపజీవన్తి । ఊర్జ ఏవాన్నాద్యస్యావరుద్ధ్యై ।

అర్థము : అగ్రైః=పరివాసనాగ్రములచేత, అన్తరతః=స్రుక్స్రువములయొక్క బిలము లోపల, ప్రాచీమ్ అభ్యాకారమ్=పశ్చిమమున నారంభించి ప్రాగ్భాగమున ముగించునట్లుగా సంమార్జనము చేయవలెను. ఏవమివ=ఈ విధముగనే, అన్నమ్=అన్నము, అద్యతే హి=తినఁబడుచున్నది కదా! అథో=మఱియు, ఓషధీనామ్=ఓషధులయొక్క, అగ్రాత్ వై=అగ్రభాగమునుండియే, రసమ్=రసమును, ఆనీయ=తెచ్చి, ప్రజాః=ప్రజలు, ఉపజీవన్తి=ఆ రసము నాశ్రయించి జీవించుచున్నారు. ఏతత్=ఈ సమ్మార్జనము, ఊర్జః=రసరూపమైన, అన్నాద్యస్య=భోజ్యముయొక్క, అవరుద్ధ్యై=ప్రాప్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : స్రుక్స్రువముల బిలభాగమునందు పశ్చిమోపక్రమము, ప్రాగవసానమునైన స్రుక్సమ్మార్జనక్రియను చేసి, బిలముయొక్క లోపల నంతటను లాఁగి లాఁగి సమ్మార్జనము చేయవలెను. భోజనము చేయుచున్న పురుషఁడు హస్తమును ఎదుటనున్న పాత్రమునందు చాఁచి అంతటను భోజ్యమును లాఁగి లాఁగి ముఖబిలమందు ఉంచుకొనుటవంటిదే యిది కూడ. మఱియు ప్రజలు ఓషధుల యగ్రభాగమునుండి రసమును తెచ్చి యా రసము నాశ్రయించి జీవించుచుందురు. ఇదియు నట్టిదే. ఇచట బిలభాగమునందలి విశేషము చెప్పఁబడినది.

10. మంత్రము :అధస్తాత్ప్రతీచీమ్ । దణ్డముత్తమతః । మూలేన మూలం ప్రతిష్ఠిత్యై ।

అర్థము : అధస్తాత్=అధోభాగమున, అవస్థితమ్=ఉన్నటువంటి, దణ్డమ్=దండమును గూర్చి, ప్రతీచీమ్=ప్రాగుపక్రమము, పశ్చిమావసానమునైన సంమార్జనక్రియను, ఉత్తమతః=ఉత్తమమైన దండభాగముచే, కుర్యాత్=చేయవలెను. తథా సతి=అట్లు కాఁగా, మూలేన=దర్భమూలముతో, మూలమ్=స్రుక్స్రువాదుల మూలము, సంబధ్యతే=సంబద్ధ మగుచున్నది. తచ్చ=అదియు, ప్రతిష్ఠాయై=ప్రతిష్ఠకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : అధోభాగమున ఉన్నటువంటి స్రుక్స్రువాదుల దండమును గూర్చి ప్రాగ్దిశయందు ఆరంభించి, పశ్చిమ దిశయందు ముగియునట్లుగాఁ జేయవలెను. ఆ విధముగఁ జేయఁగా దర్భమూలముతో స్రుక్స్రువాదుల మూలము సంబద్ధ మగును. ఆ సంబంధము ప్రతిష్ఠకొఱ కగును. ఇచట దండభాగమునందు విశేషము చెప్పఁబడినది.

11. మంత్రము :**తస్మాదరత్నౌ ప్రాఞ్చ్యౌపరిష్టాల్లోమాని । ప్రత్యఞ్చ్యధస్తాత్ (4) । స్రుగ్ఘ్యేషా ।**

అర్థము : తస్మాత్=ఆ కారణమువలన, అరత్నౌ ఉపరిష్టాత్=మణిబంధమునకూర్ధ్వమున, లోమాని=సూక్ష్మ రోమములు, ప్రాఞ్చౌ=ప్రాఙ్ముఖములు. అధస్తాత్=మణిబంధమున కధోభాగమున, లోమాని=రోమములు, ప్రత్యఞ్చౌ=ప్రత్యఙ్ముఖములు. ఏషా హి స్రుక్=ఈ లౌకిక స్రుగ్దృష్టాంతముచే వైదిక స్రుక్కునందు గూడ యథోక్త ప్రకారము ద్రష్టవ్యము.

తాత్పర్యము : అరత్ని యనcగా చిటికినవ్రేలు చాచిన పిడిమూర. అరత్నికూర్ధ్వమున సూక్ష్మరోమములు ప్రాఙ్ముఖములు గాను, అధోభాగమున ప్రత్యఙ్ముఖములుగాను ఉండును. ఈ లౌకికస్రుగ్దృష్టాంతముచే వైదికస్రుక్కునందుc గూడ యథోక్తప్రకారము ద్రష్టవ్యము.

12. మంత్రము :**ప్రాణోవై స్రువః । జుహూర్దక్షిణో హస్తః । ఉపభృత్సవ్యః । ఆత్మా ధ్రువా । అన్నగ్ం హి సంమార్జనాని ।**

ముఖతో వై ప్రాణోఽపానో భూత్వా । ఆత్మానమన్నం ప్రవిశ్య । బాహ్యతస్తనువగ్ం శుభయతి ।

తస్మాత్స్రువమేవాగ్రే సంమార్ష్టి । ముఖతో హి ప్రాణోఽపానో భూత్వా । ఆత్మానమన్న మావిశతి ।

అర్థము : స్రువః=స్రువము, ప్రాణః వై=ప్రాణస్వరూపమే. జుహూః=జుహువు, దక్షిణః హస్తః=దక్షిణహస్త స్వరూపము. ఉపభృత్=ఉపభృత్తు, సవ్యః=సవ్యహస్త స్వరూపము. ధ్రువా=ధ్రువ, ఆత్మా=మధ్యశరీర స్వరూపము. సంమార్జనాని=వేదపరివాసనములు, అన్నమ్=అన్నస్వరూపములు. ప్రాణః=ప్రాణరూపమైన వాయువు, అపానః భూత్వా=అపానమై, ముఖతః=మునుండి, అన్నమ్=అన్నగ్రాసమును, ఆత్మానం ప్రవిశ్య=మధ్యశరీరమునందు ప్రవేశించి, బాహ్యతః తనువమ్=బాహ్యమైన హస్తాదిరూప శరీరమును, శుభయతి=పుష్టిచే శోభితమునుగాc జేయుచున్నది. తస్మాత్=ఆ కారణమువలన, స్రువమేవ=స్రువమునే, అగ్రే=ప్రథమమున, సంమార్ష్టి =సంమార్జనము చేయవలెను. ముఖతః=ముఖమునుండి, ప్రాణః=ప్రాణవాయువు, అపానః భూత్వా=అపానము అయి, ఆత్మానమ్=మధ్యశరీరమునందు, అన్నమ్=అన్నమును, ఆవిశతి హి=ప్రవేశింపcజేయుచున్నది కదా!

తాత్పర్యము : ఆత్మ యనcగా - హస్తముల మధ్యమున నుండునట్టి శరీరము. ముఖమునందు సంచరించునట్టి వాయువునకు ప్రాణము, అపానము అను నామధేయములు కల రెండు వృత్తులు కలవు. ప్రాణవృత్తి ఉచ్ఛ్వాసరూపమున వెలుపలకు వెడలుచుండును. అపానవృత్తి నిశ్వాసరూపమున లోపల ప్రవేశించుచుండును. అందు ప్రాణరూపమైన వాయువు ప్రాణత్వమును పరిత్యజించి స్వయముగ నపానముగ అయి, ముఖమునందు ఉంచcబడిన అన్నగ్రాసమును మధ్యశరీరమునందు ప్రవేశపెట్టి, బాహ్యమైన హస్తాదిరూప శరీరమును పుష్టిచే శోభితమునుగాc జేయుచున్నది. ఆ కారణమువలన అన్నరూపములైన వేదాగ్రములచే ప్రాణరూపమైన స్రువమునకు ఆదియందు సమ్మార్జనము చేయవలెను. అట్లు చేయcగా ప్రథమమున అన్నప్రవేశము, అనంతరము బాహ్యహస్తరూపమైన జుహ్వాదికమునకు శోభయని యీ విధముగ నిది యుపపన్నమగును. ఇచట శ్రుతి ప్రథమమున స్రువమునకు సమ్మార్జమును రూపకకల్పనచే నుపపాదించినది.

13. మంత్రము :**తౌ ప్రాణాపానౌ । అవ్యర్ధుకః ప్రాణాపానాభ్యాం భవతి । య ఏవం వేద (5) ।**

జుహూర్ధ్రుజ్యాద్భవతీతి ప్రత్యఞ్చ్యధస్తాన్మార్ష్టి పఞ్చ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే ప్రథమోఽనువాకః ॥౧॥

అర్థము : తౌ ప్రాణాపానౌ =ఆ ప్రాణాపానములను, యః =ఏ పురుషుఁడు, ఏవమ్ =యథోక్తప్రకారముగ, వేద = తెలిసికొనుచున్నాఁడో, సః =అతఁడు, అవ్యర్ధుకః =అకాలమృత్యుగ్రస్తుఁడు కానివాఁడు, భవతి =అగు చున్నాఁడు.

తాత్పర్యము : ప్రకర్షేణ బహిః అనితీతి ప్రాణః అపకర్షేణ అన్తః అనితీతి అపానః. అని యీ విధముగ వృత్తిభేదమువలన ఆ ప్రాణాపానములు సంపన్నము లైనవని తెలిసికొనినవానికి అకాలమందు ప్రాణాపానములతో మృత్యు రూపమైన వియోగము కలుగదు. ప్రసంగవశమున ఇచట ప్రాణాపానవేదనము ప్రశంసింపఁబడినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు
ప్రథమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే

ద్వితీయోఽనువాకః

1. మంత్రము : **దివఃశిల్పమవతతమ్ ।పృథివ్యాఃకకుభిశ్రితమ్ ।తేనవయగ్ంసహస్రవల్శేన ।సపత్నం నాశయామసి**

స్వాహేతి ।స్రుక్సంమార్జనాన్యగ్నౌప్రహరతి ।

వేదార్థదీపిక

అవతారిక: వేదియందు ఆసాదనీయమైన (ఉంచదగిన) ఆజ్యాదిహవిస్సును గ్రహించుటయందు నియోక్తవ్యములైన మంత్రములకు కొన్నింటికి బ్రాహ్మణము ప్రథమానువాకమునందు చెప్పబడినది. మఱికొన్ని మంత్రములకు బ్రాహ్మణ మీ ద్వితీయానువాకమునందు చెప్పబడుచున్నది.

అర్థము : దివఃద్యులోక సమీపమునుండి, అవతతమ్=వృష్టిరూపమున క్రిందపడిన, శిల్పమ్=దర్భరూపమైన యీ చిత్రవస్తువు, పృథివ్యాఃకకుభి=భూమి కుపరితలమునందు, శ్రితమ్=ఆశ్రితమైనది. శతవల్శేన=శత సంఖ్యాకములైన శాఖలుకల, తేన=ఆ దర్భతో, వయమ్=మేము, సపత్నమ్=వైరిని, నాశయామసి=నశింపజేయుచున్నాము. స్వాహా=ఈ దర్భరూపము హుత మగుటకొఱకు, ఇతి=అని, యీ మంత్రముచే, స్రుక్సంమార్జనాని=వేదపరివాసనములను, అగ్నౌ=అగ్నియందు, ప్రహరతి=పడవేయవలెను.

తాత్పర్యము : 'దివినుండి వర్షరూపమున క్రింద పడిన దర్భరూప చిత్రవస్తువు పృథివిపైని ఆశ్రయించినది. శతసంఖ్యాక శాఖలుకల ఆ దర్భతో మేము వైరిని నశింపజేయుచున్నాము. ఈ దర్భరూపము హుత మగుటకొఱకు' అను నీ మంత్రమును పఠించుచు వేదపరివాసనముల నగ్నియందు పడవేయవలెను. ఇచట శ్రుతి 'దివఃశిల్పమవతతమ్' ఇత్యాది మంత్రము నుత్పాదింపజేసి యీ మంత్రవినియోగమును చెప్పినది.

2. మంత్రము : **ఆపో వై దర్భాఃరూపమేవైషాం మేతన్మహిమానం వ్యాచష్టే ।**

అర్థము : దర్భాఃదర్భలు, ఆపఃవై=ఉదకరూపములే. ఏషామ్=ఈ దర్భలయొక్క, రూపమేవ=రూపమే, ఏతన్మహిమానమ్=దివియొక్క శిల్పత్వాది లక్షణమైన మహిమను, వ్యాచష్టే=వెల్లడిచేయుచున్నది.

తాత్పర్యము : 'దివఃఅవతతమ్' అను భాగముచే వృష్టిరూపములైన యుదకములు ప్రతీయమానము లగుచున్నవి. ఉదకములు దర్భరూపములు. ఉదకములకు దర్భరూపమున నుత్పత్తి ఉత్పవనబ్రాహ్మణమునందు (పూర్వమే) చూపబడినది. అందువలన ఈ మంత్రమునందలి శబ్దస్వరూపమే యీ దర్భలకు ద్యులోకశిల్పత్వాది లక్షణమైన మహిమను వెల్లడిచేయుచున్నది. 'దివఃశిల్పమవతతమ్' అను నీ మంత్రమునందు సమ్మార్జనములు ప్రతీయమానము లగుట లేదను శంక యిచట వారించబడినది.

3. మంత్రము : **అనుష్టుభర్చా ।**

అర్థము : అనుష్టుభా ఋచా = 'దివఃశిల్పమవతతమ్' ఇత్యాదికమైన అనుష్టుప్ఛందోయుతమైన ఋక్కుచే, సంమృజ్యాత్ = స్రుక్స్రువాదులను సమ్మార్జనము చేయవలెను.

తాత్పర్యము : ''దివఃశిల్పమవతతమ్'' ఇత్యాది మంత్రమునకు అనుష్టుప్త్వము, ఋగ్రూపత్వమును అనుసంధేయమని యీ బ్రాహ్మణము చెప్పినది. తాత్పర్యము స్పష్టము.

4. మంత్రము : ఆనుష్టుభఃప్రజాపతిఃప్రాజాపత్యోవేదఃవేదస్యాగ్రగ్ం స్రుక్సంమార్జనాని (1)స్వేనైవైనాని ఛన్దసాస్వయాదేవతయాసమర్ధయతి।

అర్థము : ప్రజాపతిః = ప్రజాపతి, ఆనుష్టుభః = అనుష్టుప్ఛందస్సంబంధి. వేదః = దర్భలకట్ట, ప్రాజాపత్యః = ప్రజాపతి సంబంధి. (అతః = ఈ కారణమువలన, అధ్వర్యుః = అధ్వర్యుఁడు,) వేదస్య అగ్రమ్ = దర్భల కట్టయొక్క యగ్రభాగరూపమైన ఏనాని స్రుక్సంమార్జనాని = ఈ స్రుక్సమ్మార్జనములను, స్వేనైవ ఛన్దసా = స్వీయ ఛందస్సుచేతనే, స్వయా దేవతయా = స్వకీయ దేవతచేతను, సమర్ధయతి = సమృద్ధములనుగాఁ జేసినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : జగత్తును సృష్టించుసమయమున ప్రజాపతికి అనుష్టుప్ఛందస్సు సహకారి యైనదని ''స ఏతం మన్త్రరాజం నారసింహ మానుష్టుభ మపశ్యత్. తేనవై సర్వమిద మసృజత'' అను తాపనీయోపనిషత్తునందు శ్రుతమైనది. కనుక ప్రజాపతికి ఆనుష్టుప్త్వము చెప్పఁబడినది. వేదమునకు (దర్భలకట్టకు) ప్రాజాపత్యత్వమును ''ప్రజాపతేర్వా ఏతాని శ్మశ్రూణి. యద్వేదః'' అను వక్ష్యమాణ శ్రుతి చెప్పినది. ఇట్లుకాఁగా వేదాగ్రమునకు స్వకీయమైన ఛందస్సు, స్వకీయదేవత అను నుభయము సమృద్ధిహేతు వగుచున్నది. ఇచట అనుష్టుప్త్వము స్తుతించఁబడినది.

5. మంత్రము : అథోఋగ్వావయోషాదర్భోవృషాతన్మిథునమ్మిథునమేవాస్యతద్యజ్ఞే కరోతిప్రజననాయ। ప్రజాయతేప్రజయాపశుభిర్యజమానః।

అర్థము : అథో = మఱియు, ఋక్ వావ = ఋక్కే, యోషా = స్త్రీ. దర్భః = దర్భ, పుమాన్ = సేచన సమర్థఁడైన పురుషుఁడు. తత్ = ఆ ఛందోరూపమైన ఋక్కు, దర్భ అను నుభయము, మిథునమ్ = మిథునమువంటిది. అస్య = ఈ యజమానునియొక్క, యజ్ఞే = యజ్ఞమునందు, తత్ మిథునమేవ = ఆ మిథునమే, ప్రజననాయ = ప్రకర్షముగ సంతానోత్పత్తికై, కరోతి = చేయుచున్నది. యజమానః = యజమానుఁడు, ప్రజయా = పుత్రపౌత్రాది ప్రజతోను, పశుభిః = పశువులతోను, ప్రజాయతే = ప్రకర్షముగ పుట్టుచున్నాఁడు.

తాత్పర్యము : పూర్వముత్పాదితమైన ''దివఃశిల్పమవతతమ్'' అను మంత్రమునకు అనుష్టుప్ఛందస్త్వము, ఋక్త్వము ''ఆనుష్టుభర్చా'' అను శ్రుతిచే ననుసంధానము చేయఁబడినవి. అందలి అనుష్టుప్త్వము ''ఆనుష్టుభఃప్రజాపతిః'' అను శ్రుతిచే ప్రశంసించఁబడినది. అందలి ఋక్త్వము ''అథో ఋగ్వావ యోషా'' అను నీ శ్రుతిచే ప్రశంసించఁబడినది. శేషము స్పష్టము.

6. మంత్రము : **తాన్యేకే వృథైవాపాస్యన్తి । తత్తథా న కార్యమ్ । ఆరబ్ధస్య యజ్ఞియస్య కర్మణ్యః స విదోహః (2) । యద్యేనాని పశవోఽభితిష్ఠేయుః । న తత్పశుభ్యః కమ్ । అద్భిర్మార్జయిత్వోత్కరే న్యస్యేత్ । యద్వై యజ్ఞియస్య కర్మణోఽన్యత్రాఽఽహుతీభ్యః సంతిష్ఠతే । ఉత్కరో వావ తస్య ప్రతిష్ఠా । ఏతాగ్ం హి తస్మై ప్రతిష్ఠాం దేవాః సమభరన్ । యదద్భిర్మార్జయతి । తేన శాన్తమ్ । యదుత్కరే న్యస్యతి ప్రతిష్ఠామేవైనాని తద్గమయతి (3) । ప్రతితిష్ఠతి ప్రజయా పశుభిర్యజమానః ।**

అర్థము : తాని=ఆ స్రుక్సమ్మార్జనములను, కేచిత్=కొందఱు, వృథైవ=వ్యర్థముగనే (ఉదకములచే ప్రక్షాళనము చేయకయే) అపాస్యన్తి=పరిత్యజించుచున్నారు. తత్=అది, తథా=ఆ విధముగ, న కార్యమ్=చేయఁదగినది కాదు. ఆరబ్ధస్య=ఆరంభించఁబడిన, యజ్ఞియస్య=అనుష్ఠానప్రకారమునకు, సః=ఆ పరిత్యాగము, విదోహః=విపరీతఫలదోహము, భవేత్=అగును. ఏనాని=ఈ పరిత్యజింపఁబడిన స్రుక్సమ్మార్జనములను, పశవః=పశువులు, అభితిష్ఠేయుః యది=ఆక్రమించినచో, తత్=ఆ యాక్రమణము, పశుభ్యః=పశువులకొఱకు, న కమ్=సుఖము కాదు.

ఆహుతీభ్యః=ఆహుతులకంటె, అన్యత్ర=అన్యస్థలములందు, యజ్ఞియస్య కర్మణః=యజ్ఞకర్మకు, యత్ వై=ఏ ద్రవ్యమైతే, సంతిష్ఠతే=బాగుగ నుంటున్నదో, తత్=దానిని, అద్భిః=ఉదకములచే, మార్జయిత్వా=ప్రక్షాళనముచేసి, ఉత్కరే=ఉత్కరమందు, న్యస్యేత్=ఉంచవలెను. ఉత్కరః వావ=ఉత్కరమే, తస్య=ఆహుతివ్యతిరిక్తమైన యా యజ్ఞియద్రవ్యమునకు, ప్రతిష్ఠా=ప్రతిష్ఠ, భవతి=అగుచున్నది. దేవాః=దేవతలు, తస్మై=ఆ యాహుతి వ్యతిరిక్త యజ్ఞియద్రవ్యముకొఱకు, ఏతాం ప్రతిష్ఠామ్=ఈ ప్రతిష్ఠను, సమభరన్ హి=సంపాదించిరి కదా! అద్భిః=ఉదకములచే, మార్జయతి యత్=ప్రక్షాళనము చేయుచున్నచో, తేన=ఆ ప్రక్షాళనముచే, శాన్తమ్=శాంతమగును. ఉత్కరే=ఉత్కరమందు, న్యస్యతి యత్=ఉంచుచో, తత్=ఆ న్యాసముచే, ఏనాని=ఈ స్రుక్సమ్మార్జనములను, ప్రతిష్ఠాం గమయతి=ప్రతిష్ఠను పొందించినవాఁ డగును. యజమానః=యజమానుఁడు, ప్రజయా=సంతానముతోను, పశుభిః=పశువులతోను, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగును.

తాత్పర్యము : కొందఱు ఆ స్రుక్సమ్మార్జనములను ఉదకములచే ప్రక్షాళనము చేయకయే ఏదియో యొకచోట పరిత్యజించుచున్నారు. అట్లు చేయుట యుక్తము కాదు. అట్లు చేయుటవలన ఈ కర్మానుష్ఠానప్రకారము కర్మకు విపరీతఫలమును కలుగఁజేయును. ప్రక్షాళనము చేయకయే పాఱవైచిన దర్భల నాక్రమించుటచే పశువులకు రోగము పుట్టుటచే సుఖముండదు. ప్రక్షాళనముచే అది శాంత మగును. ఆహుతివ్యతిరిక్తమైన యజ్ఞియద్రవ్యమునకు ఉత్కరము సమాప్తిస్థానమని దేవతలు నిర్ధారణ చేయుటవలన ఉత్కరమందు పరిత్యజించినచో ప్రతిష్ఠ కలుగును. 'దివఃశిల్పమవతతమ్' అను మంత్రమును పఠించుచు స్రుక్సమ్మార్జనముల నగ్నియందు పడవేయుట యనునది యొకపక్షము. ఉదకములచే ప్రక్షాళనము చేసి స్రుక్సమ్మార్జనముల నుత్కరమందు పడవేయుట మఱియొకపక్షము. ఇచట ఈ రెండవపక్షము విధించఁబడినది.

7. మంత్రము : **అథో స్తమ్బస్య వా ఏతద్రూపమ్ । యత్స్రుక్సంమార్జనాని । స్తమ్బో వా ఓషధయః । తాసాం జరత్కాషే పశవో న రమన్తే । అప్రియో హ్యేషాం జరత్కాషః । యావదప్రియో హ వై జరత్కాషః పశూనామ్ । తావదప్రియః పశూనాం భవతి । యస్యైతాన్యన్యత్రాగ్నేర్దధతి ।**

అర్థము : అథో=మఱియు, స్రుక్సంమార్జనాని యత్=స్రుక్సమ్మార్జనము లేవి కలవో, ఏతద్రూపమ్=ఈ స్రుక్సమ్మార్జన ములరూపము, స్తమ్బస్య వై=స్తంబసంబంధియే. ఓషధయః=ఓషధులు, స్తమ్బశః వై=స్తంబమునుండియే, ఉత్పద్యన్తే=పుట్టుచున్నవి. తాసామ్=ఆ యోషధులయొక్క, జరత్కాషే=జీర్ణించిన కషమునందు (ఎండిన గడ్డియందు), పశవః=పశువులు, న రమన్తే=ఇష్టపడుటలేదు. ప్రీతికల వగుట లేదు). ఏషామ్=ఈ పశువులకు, జరత్కాషః=జరత్కాషము, అప్రియః హి=ప్రియము కానిది కదా! యావత్=ఎంతవఱకు, జరత్కాషః=జరత్కాషము, పశూనామ్=పశువులకు, అప్రియః హ వై=ప్రియము కానిదే యగునో, యస్య=ఏ యజమానుని యొక్క, ఏతాని=ఈ స్రుక్సమార్జనములను, అగ్నేః=అగ్నికంటె, అన్యత్ర=వేఱైన చోటునందు, దధతి=ఉంచుచున్నాడో, తావత్=అంతవఱకు, సః=ఆ యజమానుడు, పశూనామ్=పశువులకు, అప్రియః=అప్రియుడు, భవతి=అగును.

తాత్పర్యము : అథో శబ్దము ఉత్కర్షపక్షవ్యావృత్త్యర్థము. ఓషధులు స్తంబరూపములు, నవదావ్యరూపములునని రెండు విధములుగా నున్నవి. కోమల తృణములు లేకుండుటచే స్వాదువుకాని జరత్కాషము స్తంబమని యర్థము. దావాగ్నిదగ్ధ ప్రదేశమునందు వృష్టిచే సముత్పన్నమును, కోమలమునైన స్వాదుతృణసమూహము నవదావ్య మనబడును. అందు స్రుక్సమ్మార్జనములు స్తంబమునుండి కోయబడుటచే స్తంబరూపములు. స్తంబరూపములైన యీ స్రుక్సమ్మార్జనముల నగ్నికంటె భిన్నమైన ఉత్కరమునందు పరిత్యజించినచో, అప్పు డచ్చటచ్చట వికీర్ణములైన యా స్రుక్సమ్మార్జనములు బహుస్తంబములైన యోషధులుగా పుట్టును. ఆ యోషధుల సంబంధియైన జరత్కాషమునందు ప్రీతి లేకుండుట వలన జరత్కాషమువలె యజమానుడు కూడ పశువుల కప్రియుడు కనుక అపశువే (పశురహితుడే) యగును. అగ్నిప్రహరణపక్షమును ద్రఢీకరించుటకై యిచట ఉత్కరమందు పరిత్యాగము దూషింపబడినది. జరత్కాషము=ఎండి శిథిలమైన గడ్డి (పఱక).

8. మంత్రము : **నవదావ్యాసు వా ఓషధీషు పశవో రమన్తే (4) । నవదావో హ్యేషాం ప్రియః । యావత్ప్రియో హ వై నవదావః పశూనామ్ । తావత్ప్రియః పశూనాం భవతి । యస్యైతాన్యగ్నౌ ప్రహరన్తి । తస్మాదేతాన్యగ్నావేవ ప్రహరేత్ । యతరస్మిన్న్యం మృజ్యాత్ । పశూనాం ధృత్యై ।**

అర్థము : నవదావ్యాసు=నవదావ్యములైన, ఓషధీషు వై=ఓషధులందే, పశవః=పశువులు, రమన్తే=ప్రీతి కలవగుచున్నవి. నవదావః=నవదావము, ఏషామ్=ఈ పశువులకు, ప్రియః హి=ఇష్టమైనది కదా! నవదావః= నవ దావము,

పశూనామ్=పశువులకు, యావత్=ఎంతవఱకు, ప్రియఃహవై=ప్రియమే యైనదో, యస్య=ఏ యజమానుని యొక్క, ఏతాని=ఈ స్రుక్సమ్మార్జనములు, అగ్నౌ=అగ్నియందు, ప్రహరన్తి=పడవేయుచున్నారో, సఃఆ యజమానుcడు, తావత్=ఆ మాత్రము, పశూనామ్=పశువులకు, ప్రియఃఇష్టcడు, భవతి=అగుచున్నాcడు. తస్మాత్=ఆ కారణమువలన, ఏతాని=ఈ స్రుక్సమ్మార్జనములను, అగ్నౌ=అగ్నియందు, ప్రహరేత్= పడవేయవలెను. యతరస్మిన్=అహవనీయ గార్హపత్యములలో నేదియేని ఒక యగ్నియందు, (స్రుచఃస్రుక్సమ్మార్జనములను, ప్రతితప్య=సమానముగ వెచ్చcజేసి.) సంమృజ్యాత్=ప్రక్షాళనము చేయునో, ఏతత్= ఈ ప్రహరణము,ధృత్యై=యజమాన గృహమందు బహుపశువులస్థితి (ధారణము) కొఱకు, భవతి= అగుచున్నది.

తాత్పర్యము : నవఃప్రత్యాసన్నపూర్వకాలభావీ, దావఃదావాగ్నిఃయస్య కోమలస్య ఓషధిసమూహస్య, సఃనవదావఃఅత్యంతసమీపపూర్వకాలమున ఏర్పడిన దావాగ్ని కల కోమలమైన యోషధిసమూహము నవదావమనcబడుచున్నది. అట్టి నవదావములైన యోషధులందు పశువులకు ప్రీతియుండును. అటువంటి యోషధివలె యజమానుcడు కూడ సమ్మార్జనముల నగ్నియందు పడవేసినచో పశువులకు ఇష్టc డగును. అప్పుడు యజమానగృహమునందు బహుపశువులకు స్థితి ఉండును. ఈ సమ్మార్జనములను ఆహవనీయాగ్నియందుcగాని, గార్హపత్యాగ్నియందుc గాని సమానముగ వెచ్చcజేసి పిమ్మట ప్రక్షాళనము చేసి యగ్నియందు పడవేయవలెను. ఇచట అగ్నిప్రహరణపక్షము ద్రఢీకరించcబడినది.

9. మంత్రము : **యో భూతానా మధిపతిఃరుద్రస్తన్తిచరో వృషాపశూనస్మాకం మా హిగ్ంసీఃఏతదస్తు హుతం తవ స్వాహేత్యగ్ని సంమార్జనాన్యగ్నౌ ప్రహరతి**

అర్థము : యఃఏ రుద్రుcడు, భూతానామ్=ప్రాణులకు, అధిపతిఃఏలికయో, హే రుద్ర!=ఓ రుద్రదేవా! తన్తిచరఃకర్మసంతానమునందు (కర్మపరంపరయందు) సంచరించువాcడవును, వృషా=దేవతలలో శ్రేష్ఠcడవునగు, సఃత్వమ్=అటువంటి నీవు, అస్మాకమ్=మాయొక్క, పశూన్=పశువులను, మా హింసీఃహింసింపకుము. ఏతత్=ఈ యగ్నిసంమార్జనద్రవ్యము, తవ=నీకు, హుతమ్ అస్తు=హుత మగుcగాక. స్వాహా ఇతి=స్వాహా అని, అగ్నిసంమార్జనాని=అగ్నిసంమార్జనములను, అగ్నౌ=అగ్నియందు, ప్రహరతి=పడవేయవలెను.

తాత్పర్యము : ఓ రుద్రదేవా! ప్రాణులకు ఏలికవు, కర్మపరంపరయందు సంచరించువాcడవు, దేవతలలో శ్రేష్ఠcడవునగు నీవు మా పశువులను హింసింపకుము. ఈ యగ్నిసమ్మార్జనద్రవ్యము నీకు హుత మగుcగాక. స్వాహా అని యుచ్చరించుచు నగ్నిసమ్మార్జనద్రవ్యముల నగ్నియందు పడవేయవలెను. స్రుక్సమ్మార్జన ప్రసంగమువలన అగ్నిసమ్మార్జనములకుc గూడ ఒకానొక మంత్రము నుత్పాదింపcజేసి యిచట తన్మంత్రము వినియోగించcబడినది.

10. మంత్రము :**ఏషా వా ఏతేషాం యోనిఃఏషా ప్రతిష్ఠా స్వామేవైనాని యోనిమ్ స్వం ప్రతిష్ఠాం గమయతి ప్రతితిష్ఠతి ప్రజయా పశుభిర్యజమానఃస (5)**

వేదస్యాగ్రగ్ం స్రుక్సంమార్జనాని విద్వాగ్మయతి పశవో రమన్తే హిగ్ంసీః షట్ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే ద్వితీయోఽనువాకః ॥౨॥

అర్థము : ఏతేషామ్=ఈ యగ్నిసమ్మార్జనములకు, ఏషా వై=ఈ వహ్నిరూపమే, యోనిః=స్థానము. ఏషా=ఈ వహ్నిరూపము, ప్రతిష్ఠా=ప్రతిష్ఠ. ఏనాని=ఈ సమ్మార్జనములను, స్వాం యోనిమ్=స్వకీయస్థానమును, స్వాం ప్రతిష్ఠామ్=స్వకీయ ప్రతిష్ఠను, గమయతి=పొందించినవాఁ డగుచున్నాఁడు. యజమానః=యజమానుఁడు, ప్రజయా=పుత్రపౌత్రాది ప్రజతోను, పశుభిః=పశువులతోను, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : అగ్నిదగ్ధప్రదేశమునందు మఱల ఉత్పన్నములై బాగుగ వృద్ధినొందుటవలన దర్భలనగ్నియందు పడవేయుట యుక్తమని యీ బ్రాహ్మణము చెప్పుచున్నది. ఈ సమ్మార్జనముల కగ్నియే యోని. అగ్ని ప్రతిష్ఠ. కనుక అగ్నియందు సమ్మార్జనములను ప్రహరించిన యజమానుఁడీ సమ్మార్జనములకు స్వకీయస్థానమును, స్వకీయ ప్రతిష్ఠను పొందించినవాఁ డగుచున్నాఁడు. మఱియు నతఁడు పుత్రపౌత్రాది సంతానముతోను, పశువులతో ప్రతిష్ఠితుఁ డగును.

''యో భూతానామధిపతిః. రుద్రస్తన్తిచరో వృషా'' అను మంత్రమును పఠించుచు నగ్నిసమ్మార్జనములను (దర్భలను) అగ్నియందు పడవేయవలెనని పూర్వము చెప్పఁబడినది. ఈ మంత్రము రుద్రవిషయము. ప్రహరణము అగ్నియందు. అగ్ని రుద్రులు భిన్నులు కనుక వ్యధికరణము కాదా? అని ప్రశ్నించరాదు. అగ్నియే యిచట రుద్రుఁడు. ''రుద్రో వా ఏషః యదగ్నిః. స ఏతర్హి జాతః'' అను శ్రుత్యంతరమువలనను, ''యదరోదీత్తద్రుద్రస్య రుద్రత్వమ్'' అని నిర్వచించుటవలనను అగ్నియే యిచట రుద్రుఁడని స్పష్టమగుచున్నది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు
ద్వితీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే
తృతీయోఽనువాకః

1. మంత్రము : అయజ్ఞో వా ఏషః । యో ఽపత్నీకః । న ప్రజాః ప్రజాయేరన్ । పత్న్యన్వాస్తే । యజ్ఞమేవాకః । ప్రజానాం ప్రజననాయ ।

వేదార్థదీపిక

అవతారిక: ఈ యనువాకమునందుc గూడ పూర్వోక్తశేషములైన ఆజ్యాది హవిర్గ్రహణార్థమంత్రములకు బ్రాహ్మణము చెప్పcబడుచున్నది.

అర్థము : యః=ఏ యజ్ఞకర్త, అపత్నీకః=పత్నీరహితుcడో, ఏషః=ఈ యజమానుcడు, అయజ్ఞుఃవై=యజ్ఞరహితుcడే, భవతి=అగుచున్నాcడు. (తదా=అప్పుడు, సః=ఆ యజమానుcడు) ప్రజాఃః=ప్రజను, న ప్రజాయేరన్=పుట్టించలేడు. పత్నీ=యజమానపత్ని, అన్వాస్తే=గార్హపత్య సమీపమున కూర్చుండవలెను. (తదా= అప్పుడు, సః=ఆ యజమానుcడు,) యజ్ఞమ్=యజ్ఞమును, అకః ఏవ=చేసినవాcడే యగుచున్నాcడు. ఏతత్=ఈ పత్న్యుపవేశనము, ప్రజానామ్=పుత్రపౌత్రాది ప్రజలయొక్క, ప్రజననాయ= ప్రకర్షముగ నుత్పత్తిచేయుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : పత్నీరహితుcడైన యజ్ఞ రహితుc డగును. అప్పు డతcడు ప్రజను పుట్టించలేcడు. యజమానపత్ని గార్హపత్యాగ్ని సమీపమున కూర్చుండవలెను. అప్పు డా యజమానుcడు యజ్ఞమును చేసినవాcడే యగును. యజమానపత్ని గార్హపత్యాగ్ని సమీపమున నుపవసించుట ప్రకర్షముగ పుత్రపౌత్రాది ప్రజలను పుట్టించుటకొఱ కగును. యో క్తబంధనమునకై గార్హపత్యసమీపమున యజమానపత్నియొక్క యుపవేశన మిచట విధించcబడినది.

2. మంత్రము : యత్తిష్ఠన్తీ సంనహ్యేత । ప్రియం జ్ఞాతిగ్o రున్ధ్యాత్ । ఆసీనా సంనహ్యతే । ఆసీనా హ్యేషా వీర్యం కరోతి (1) ।

అర్థము : తిష్ఠన్తీ=యజమానపత్ని నిలుచున్నదై సంనహ్యతే యత్=త్రాటిచే బంధించcబడిన దగుచో, జ్ఞాతిం ప్రియమ్=భర్తను, రున్ధ్యాత్=నశింపజేయున దగును. ఆసీనా=కూర్చున్నదై, సంనహ్యతే=త్రాటిచే బంధింపcబడవలెను. ఆసీనా=కూర్చున్నదైన, ఏషా=ఈమె, వీర్యమ్=సామర్థ్యమును, కరోతి హి=చేయు చున్నది కదా! (సమర్థురా లగుచున్నది కదా!).

తాత్పర్యము : యజమానపత్ని నిలుచున్నదై త్రాటిచే బంధించcబడినచో భర్తను నశింపcజేయున దగును. కనుక కూర్చున్నదై త్రాటిచే బంధించcబడవలెను. చాలకాలము కూడ నుండుటకు శక్యమగుటవలన కూర్చున్నట్టియామెకు సామర్థ్య ముండును. బంధనకాలమందుc గూడ ఉపవేశనమే కాని, యుత్థానము కాదని యీ బ్రాహ్మణము చెప్పినది.

3. మంత్రము : **యత్పశ్చాత్ప్రాచ్యన్వాసీత । అనయా సమదం దధీత । దేవానాం పత్న్యా సమదం దధీత । దేశాద్దక్షిణత ఉదీచ్యన్వాస్తే ఆత్మనో గోపీథాయ ।**

అర్థము : పశ్చాత్=పశ్చిమదిక్కునందు, ప్రాచీ=ప్రాఙ్ముఖియై, ఆసీత యత్=యజమానపత్ని కూర్చుండునెడల, అనయా=వేదిరూప పృథివితో, సమదమ్=కలహమును, దధీత=చేయున దగును. దేవానాం పత్న్యా=పత్నీసంయాజహోమములందు తృతీయాహుతికి దేవతయైన దేవపత్నితోఁగూడ, సమదమ్=కలహమును, దధీత=చేయున దగును. అతః=ఈ కారణమువలన, ఆత్మనః గోపీథాయ=ఆత్మరక్షణమునకై, దేశాత్=గార్హపత్యదేశముకంటె, దక్షిణతః=దక్షిణ దిగ్భాగమునందు, ఉదీచీ=ఉదఙ్ముఖియై, అన్వాస్తే=కూర్చుండవలెను.

తాత్పర్యము : యజమానపత్ని గార్హపత్యమునకు పశ్చిమభాగమున ప్రాఙ్ముఖియై కూర్చున్నచో, ప్రాచీనప్రవణయైన వేదిరూప పృథివితోఁ గూడ కలహ మేర్పడును. పత్నీసంయాజ హోమములందు తృతీయాహుతికి దేవతయైన దేవపత్నికిఁ గూడ అదియే స్థానము కనుక ఆ దేవపత్నితోఁ గూడ కలహ మేర్పడును. ఇందువలన దక్షిణదేశమందు ఆత్మరక్షణమునకై ఉదఙ్ముఖియై కూర్చుండవలెను. ఇచట శ్రుతి దిగ్దేశములను విధించినది.

4. మంత్రము : **ఆశాసానా సౌమనసమిత్యాహ। మేధ్యామేవైనాం కేవలీం కృత్వా । ఆశిషా సమర్ధయతి ।**

అర్థము : ''ఆశాసానా సౌమనసమ్'' ఇతి ఆహ=వహ్ని కనుసారిణియై యుండి 'సౌమనస్యాదికమును కోరుచున్న యజమానపత్నిని శోభనకర్మకై సుఖమగునట్లుగ బంధించుచున్నానని' అధ్వర్యునివాక్యముగ శ్రుతి చెప్పినది. (అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) ఏనామ్=ఈ యజమానపత్నిని, మేధ్యామ్=దేవయజనప్రదేశముచే యజ్ఞయోగ్యురాలినిగాను, కేవలీమ్=పాపక్షయముచే స్వచ్ఛమైనదానినిగాను, కృత్వైవ=చేసియే, ఆశిషా='ఆశాసానా' అని పలుకుచు సత్యమైన యాశీస్సుచే, సమర్ధయతి=సమృద్ధురాలినిగాఁ జేసినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : సాధారణముగ నందఱు స్త్రీలు సౌమనస్యాది కామములనే యాశించుచుందురు కదా! యజమానపత్ని విషయమున విశేషమేమి కలదు? అని శంకించి 'ఆశాసానా' ఇత్యాది మంత్రమునందలి పూర్వార్ధముయొక్క యభిప్రాయము నీ బ్రాహ్మణము వివరించినది. అన్యము స్పష్టము.

5. మంత్రము : **అగ్నేరనువ్రతా భూత్వా సంనహ్యే సుకృతాయ కమిత్యాహ। ఏతద్వై పత్న్యై వ్రతోపనయనమ్ (2) । తేనైవైనాం ప్రతముపనయతి ।**

అర్థము : ''అగ్నేరనువ్రతా భూత్వా సంనహ్యే సుకృతాయ కమ్'' ఇతి ఆహ='అగ్ని కనుసారిణియై యుండి సౌమనస్యాదికము నాశించుచున్న యజమానపత్నిని శోభనమైన కర్మకొఱకు సుఖమగునట్లుగా యోక్త్రముచే బంధించుచున్నాను' అని యధ్వర్యుని వాక్యమునుగా శ్రుతి చెప్పినది. ఏతత్ వై=ఈ యోక్త్రమే, పత్న్యై=

యజమానపత్నికి, వ్రతోపనయనమ్ =అనువ్రతస్వీకరణలింగము. తేనైవ =ఆ యోక్త్రముచేతనే, ఏనామ్ =ఈ యజమానపత్నిని, వ్రతమ్ =అనువ్రతమును, ఉపనయతి =అధ్వర్యుడు పొందించినవాడగుచున్నాడు.

తాత్పర్యము : పత్నికి స్వతంత్రముగ కర్మాధికారము లేదు కనుక, పత్నితోడగూడ యజమానున కా యధికారము కలుగుచుండగా ఆ యోక్త్రమే యామెకు అనువ్రతలింగ మగును. స్త్రీకి వివాహమునందు కంఠమునందు మంగళసూత్రము లింగమగువిధముగ ఈ యజ్ఞకర్మయందీ యజమానపత్ని కీ యోక్త్రము లింగమగును. ఇచట అనువ్రతసూచితమైన యర్థము చెప్పబడినది. యోక్త్రము =తాడు.

6. మంత్రము : **తస్మాదాహుః । యశ్చైవం వేద యశ్చ న । యోక్త్రమేవ యుతే । యమన్వాస్తే । తస్యాముష్మింల్లోకే భవతీతి । యోక్త్రేణ ।**

అర్థము : తస్మాత్ =సూత్రధారణము లోకమునందు, వేదమునందును నియమస్వీకారమున లింగ మగుటవలన, యః =ఏ పురుషుడు, ఏవమ్ =పూర్వోక్తవిధముగ, వేద =యాగమును తెలిసికొనుచున్నాడో, చ =మఱియు, యః =ఏ పురుషుడు, న వేద =తెలిసికొనుటలేదో, (తే సర్వేఽపి =వారందఱు, ఏవమ్ =ఈ విధముగ,) ఆహుః = చెప్పుచున్నారు. -ఇయం పత్నీ =ఈ పత్ని, యోక్త్రమ్ =యోక్త్రమును, యుతే ఏవ =అవశ్యము బంధించుచున్నది. యమ్ =ఏ పతిని, అన్వాస్తే =అనుసరించి వ్రతమును స్వీకరించి యుంటున్నదో, తస్య =ఆ పతికి సంబంధించిన, యోక్త్రేణ =మంగళసూత్రముతో, అముష్మిన్ లోకే =స్వర్గలోకమునందు, భవతి =కూడిన దగుచున్నది, ఇతి =అని, ఆహుః =చెప్పుచున్నారు.

తాత్పర్యము : లోకమునందు, వేదమునందును సూత్రధారణము నియమస్వీకారమున లింగము (చిహ్నము). లోకమునందు దూరదేశమునందుగల దేవుని దర్శించుకొనుటకై సంకల్పించినవారై సూత్రమును చేతికిగాని, మెడలోగాని బంధించుచున్నారు. వేదమునగూడ ఉపనయనవ్రతమునందు మౌంజిని బంధించుచున్నారు. ఆ కారణమువలన ఈ విధముగ యాగమును తెలిసినవారును, తెలియనివారునగు వారందఱు 'ఈ పత్ని యవశ్యముగ సూత్రమును బంధించవలెను. ఏ పతి ననుసరించి వ్రతమును స్వీకరించి యుండునో, స్వర్గమున ఆ పతికి సంబంధించిన మంగళసూత్రముతోడ గూడిన దగునని' చెప్పుచున్నారు. వ్రతమునందు సూత్రధారణవిషయమున లౌకిక వైదిక ప్రసిద్ధి యిచట చూపబడినది. మౌంజి =ముంజదర్భమొలత్రాడు.

7. మంత్రము : **యద్యోక్త్రమ్ । స యోగః । యదాస్తే । స క్షేమః (3) । యోగక్షేమస్య క్ల్ప్త్యై ।**

అర్థము : యోక్త్రం యత్ =యోక్త్రమేది కలదో, సః యోగః అది యోగము (అప్రాప్తవస్తుప్రాప్తి). ఆస్తే యత్ = ఉంటున్నాడనుట యేది కలదో, సః క్షేమః =అది క్షేమము (ప్రాప్తవస్తు రక్షణము). ఏతత్ =ఈ యోక్త్రము, యోగక్షేమస్య =యోగక్షేమోభయము యొక్క, క్ల్ప్త్యై =సిద్ధికొఱకు, భవతి =అగుచున్నది.

తాత్పర్యము : ఇచట శ్రుతి ప్రకారాంతరముగ యోక్త్రమును స్తుతించినది. తాత్పర్యము స్పష్టము.

8. మంత్రము : **యుక్తం క్రియాతా ఆశీః కామే యుజ్యాతా ఇతి । ఆశిషః సమృద్ధ్యై ।**

అర్థము : ఆశీఃసౌమనస్యాదిరూపమైన నా యీ యాశీస్సు, కామే=ఫలమునందు, యుజ్యాతై=కలయుcగాక, ఇతి=అని, (మయా=నాచే,) యుక్తమ్=శాస్త్రీయమైన కర్మ, క్రియాతై=చేయcబడుచున్నది. అతః=ఈ కారణమువలన, ఏతత్=ఈ యోక్త్రబంధనము, ఆశిషః సమృద్ధ్యై =ఆశీస్సుయొక్క సమృద్ధికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఏ యభిప్రాయమును మనస్సునందుంచుకొని యీ యజమానపత్ని యోక్త్రముచే బంధించcబడుచున్నది? అని యాశంకించి శ్రుతి యీ విధముగ సమాధానము చెప్పుచున్నది. 'నాచే శాస్త్రీయమైన కర్మ చేయcబడుచున్నది. ఇందువలన సౌమనస్యాదిరూపమైన నా యీ యాశీస్సు ఫలమునందు కలయుcగాక (ఫలవంత మగుcగాక)' అను నభిప్రాయముచే ఆశీస్సు సమృద్ధ మగుచున్నది.

9. మంత్రము : గ్రన్థిం గ్రథ్నాతి । ఆశిష ఏవాస్యాం పరిగృహ్ణాతి । పుమాన్వై గ్రన్థిః । స్త్రీ పత్నీ । తన్మిథునమ్ । మిథునమేవాస్య తద్యజ్ఞే కరోతి ప్రజననాయ । ప్రజాయతే ప్రజయా పశుభిర్యజమానః (4) । అథో అర్ధో వా ఏష ఆత్మనః । యత్పత్నీ । యజ్ఞస్య ధృత్యా అశిథిలంభావాయ ।

అర్థము : గ్రన్థిం గ్రథ్నాతి=యోక్త్రమును ముడివేయవలెను. ఆశిషః ఏవ=ఆశీస్సులనే, అస్యామ్=ఈ యజమానపత్ని యందు, పరిగృహ్ణాతి=యోక్త్రగ్రంథి పరిగ్రహించుచున్నది. గ్రన్థిః=గ్రంథి, పుమాన్ వై=పురుషరూపమే. పత్నీ=పత్ని, స్త్రీ=స్త్రీ, తత్=ఆ పత్నీగ్రంథులద్వయము, మిథునమ్=మిథునము. తత్ మిథునమేవ=ఆ మిథునమే, అస్య=ఈ యజమానునియొక్క, యజ్ఞే=యజ్ఞమునందు, ప్రజననాయ=ప్రకృష్టమైన జననము కొఱకు, కరోతి=చేయుచున్నది. యజమానః=యజమానుcడు, ప్రజయా=పుత్రపౌత్రాది ప్రజతోను, పశుభిః =పశువులతోను, ప్రజాయతే=ప్రకర్షముగ పుట్టుచున్నాcడు. అథో=మఱియు, పత్నీ యత్=పత్ని యేది కలదో, అత్మనః=తనకు (పురుషునకు) ఏషః అర్ధః వై=ఇది అర్ధభాగమే. తతః=ఆ కారణమువలన, తదీయగ్రన్థిః= అమెయొక్క యోక్త్రగ్రంథి, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ధృత్యై=ధారణముకొఱకు, అశిథిలంభావాయ=శైథిల్యాభావముకొఱకును, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : సౌమనస్యాద్యాశీస్సు లన్నియు యోక్త్రగ్రంథిచే నామెయందు పరిగ్రహింపcబడిన వగుచున్నవి. పత్ని యజ్ఞకర్తకు అర్ధస్వరూప మైనది. అందువలన ఆమెయొక్క యోక్త్రగ్రంథిచే యజ్ఞము ధరించcబడుచున్నది. శిథిల మగుట లేదు. ఇచట యోక్త్రగ్రంథిగ్రథనము విధించcబడినది.

10. మంత్రము :సుప్రజస్త్వా వయగ్ం సుపత్నీరుపసేదిమేత్యాహ। యజ్ఞమేవ తన్మిథునీకరోతి । ఊనే కతిరిక్తం ధీయాతా ఇతి ప్రజాత్యై ।

అర్థము : ''సుప్రజస్త్వా వయగ్ం సుపత్నీరుపసేదిమ'' ఇతి ఆహ='ఓ యగ్నీ! శోభనసంతానోపేతులము, శోభనపతికలవారమునగుమేము (యజమానపత్ని) నిన్నుసమీపించి కూర్చుందుము' అని యజమానపత్ని

వాక్యముగా శ్రుతి చెప్పినది. తత్=ఆ యుపవేశనము, యజ్ఞమేవ=యజ్ఞమునే, మిథునీకరోతి=మిథునవంతముగాc జేయున దగుచున్నది. ఊనే=యజమానానుషిత యజ్ఞాంగము ఊనమగుచుండగా, అతిరిక్తమ్=యజమానునిచే ననుషితముకాని యజ్ఞాంగము, ధీయాతై ఇతి=పత్నిచే ననుషితమగును. కనుక, ఏతత్=ఈ మిథునము, ప్రజాత్యై=ప్రజాసంతతికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : 'శోభనః పతిః యస్యాః సా సుపత్నీ' అని చెప్పుటవలన యజమానపత్ని యజ్ఞశాలయందు గార్హపత్యాగ్ని సమీపమున కూర్చుండుటవలన ఆ యుపవేశనము యజ్ఞమును మిథునవంతముగc జేయున దగును. ఆ మిథునమునందు పతి యజ్ఞకర్మ ననుష్ఠించుచుండcగా నతనిచే ననుషితముకాని యజ్ఞాంగము ఊన (లుప్త) మగును. ఆ ఊనప్రదేశమందు యజమానుc డనుష్ఠించని యజ్ఞాంగము యజమానపత్నిచే ధరించcబడుటచే (అనుష్ఠించcబడుటచే) పూర్ణమగును. కనుకనే ''అష్టలౌ పూర్ణపాత్రమానయతి। రేత ఏవాస్యాం ప్రజాం దధాతి'' 'యజమానపత్ని దోసిలియందు పూర్ణపాత్రమును పట్టుకొని రావలయును. అట్లు చేయుటవలన రేతస్సు యీమెయందు ప్రజను ధరించుచున్నది' అని పత్నికర్తవ్యమైన పూర్ణపాత్రనినయన మామ్నాతమైనది. దీనివలన ప్రజాసంతతి యేర్పడును. ఇచట యజమానపత్నియొక్క ఉపవేశనమందు ప్రయోజనము చూపcబడినది.

11. మంత్రము :**మహీనాం పయో ఽస్యోషధీనాగ్ం రస ఇత్యాహ। రూపమేవాస్యైతన్మహిమానం వ్యాచష్టే ।**

అర్థము : ''మహీనాం పయో ఽస్యోషధీనాగ్ం రసః'' ఇతి ఆహ='ఓ ఆజ్యమా! నీవు గోవులయొక్క పయస్సువు, ఓషధులయొక్క రసము నగుచున్నావు' అని శ్రుతి చెప్పినది. అస్య=ఈ ఆజ్యముయొక్క, రూపమేవ=రూపమే, ఏతన్మహిమానమ్=ఈ గవాదుల మహిమను, వ్యాచష్టే=వివరించి చెప్పుచున్నది.

తాత్పర్యము : ఓ ఆజ్యమా! సాక్షాత్తుగ గోక్షీరమునుండి పుట్టుటవలన గోవులయొక్క పయోరూప మగుచున్నావు. ఓషధులనుండి పరంపరగా పుట్టుటచే ఓషధుల రసము నగుచున్నావు. (గోవులు భక్షించిన యోషధులవలన క్షీర మేర్పడును. ఆ క్షీరమునుండి నేయి యేర్పడును. ఇదియే పరంపర.) అధ్వర్యుc డు హోమార్థమైన యాజ్యమును పాత్రమం దుంచునపుడు (నిర్వాపము చేయునపుడు) ఆ యాజ్యము నుద్దేశించి పైవిధముగ ననును. ''మహీనాం పయో ఽసి'' ఇత్యాది మంత్రముయొక్క పూర్వభాగము నీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

12. మంత్రము :**తస్య తే కక్షీయమాణస్య నిర్వపామి దేవయజ్యాయా ఇత్యాహ। ఆశిషమేవై తామాశాస్తే (5) ॥**
కరోతి వ్రతోపనయనం క్షేమో యజమానః శాస్తే ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృ తీయకాణ్డే తృ తీయ ప్రపాఠకే తృ తీయో ఽనువాకః ॥3॥

అర్థము : అక్షీయమాణస్య=ఓ ఆజ్యమా! క్షీరరహితమైన, తస్యతే=అటువంటి నిన్ను, (కర్మణి షష్ఠి) దేవయజ్యాయై=దేవయాగముకొఱకు, నిర్వపామి=పాత్రమందు నిర్వాపము చేయుచున్నాను', ఇతి=అని, ఆహ=శ్రుతి చెప్పినది. ఏతామ్=దీనిని, ఆశిషమేవ=ఆశీస్సునుగానే, ఆశాస్తే=యజమానుc డు తలcచుచున్నాcడు.

తాత్పర్యము : ఓ ఆజ్యమా! గోక్షీరరూపమును, ఓషధుల రసరూపమును,క్షయరహితమునైన నిన్ను దేవయాగముకొఱకు పాత్రమందు నిర్వాపము చేయుచున్నానని శ్రుతి చెప్పినది. దీనిని ఆశీస్సునుగానే యజమానుఁడు తలఁచుచున్నాఁడు. పూర్వోక్తమైన ''మహీనాం పయోఽసి'' అను మంత్రముయొక్క ఉత్తర భాగమునఁగల 'అక్షీయమాణస్య' అను పదముయొక్క యభిప్రాయము నీ బ్రాహ్మణము చెప్పినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు
తృతీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే
చతుర్థోఽనువాకః

1. మంత్రము : ఘృతం చ వై మధు చ ప్రజాపతిరాసీత్ । యతో మధ్వాసీత్ । తతః ప్రజా అసృజత । తస్మాన్మధుషి ప్రజననమివాస్తి । తస్మాన్మధుషా న ప్రచరన్తి । యాతయామ హి। ఆజ్యేన ప్రచరన్తి । యజ్ఞో వా ఆజ్యమ్। యజ్ఞేనైవ యజ్ఞం ప్రచరన్త్యయాతయామత్వాయ ।

వేదార్థదీపిక

అవతారిక: తృతీయానువాకమునందు ఆజ్యాది హవిర్గ్రహణార్థమంత్రములకు కొన్నింటికి బ్రాహ్మణము చెప్పఁబడినది. మిగిలిన మంత్రముల కీ యనువాకమునందు బ్రాహ్మణము చెప్పఁబడుచున్నది. ఆ మంత్రము లన్నియు సంహితలో (కా. 1. ప్ర. 1. అ. 10) ఆమ్నాతములైనవి.

అర్థము : ప్రజాపతిః=ప్రజాపతి, ఘృతం చ ఆజ్యమునుగాను, మధు చ=మధువు (తేనె) గాను, ఆసీత్ వై=ఆయెనఁట! యతః=ఏ కారణమువలన, మధు=మధువుగా, ఆసీత్=ఆయెనో, తతః=ఆ కారణమువలన, ప్రజాః=ప్రజలను, అసృజత=సృష్టించెను. తస్మాత్=ఆ కారణమువలన, మధుషి=మధువునందు, ప్రజననమివ=ఉత్పత్తిబీజోత్పత్తి సాధనమువంటిది, అస్తి=కలదు. తస్మాత్=ఆ కారణమువలన, మధుషా=మధువుచే, న ప్రచరన్తి=మధువుచే యాజ్ఞికులు యజ్ఞప్రయోగము చేయరాదు. యాతయామ హి=మధువు గతసారము (సారవిహీనము) కదా! ఆజ్యేన=ఆజ్యముచే, ప్రచరన్తి=యజ్ఞప్రయోగము చేయవలెను. యజ్ఞః= యజ్ఞము, ఆజ్యం వై=ఆజ్యరూపమే. అతః=ఈ కారణమువలన, అయాతయామత్వాయ=సారవిహీనత్వము లేకుండుటకై, యజ్ఞేనైవ=యజ్ఞరూపమైన యాజ్యముచేతనే, యజ్ఞమ్=యజ్ఞమును, ప్రచరన్తి=అనుష్ఠించినవారగుదురు.

తాత్పర్యము : పూర్వము ప్రజాపతి ఆజ్యము యాగసాధనమని, మధువు సృష్టిసాధనమని తలఁచి సత్యసంకల్పఁడగుటచే స్వయముగనే ఘృతమధురూపమున పరిణతుఁడాయెను. ఉత్పత్తిబీజత్వము కలదను నభిప్రాయముచే మధువుగా నాయెను కనుక, మధు బీజముచే ప్రజలను సృష్టించెను. కనుకనే మధువుచే నానాబీజోత్పాదనము కలుగుచున్నది. ఆ యుత్పాదనముచే గతసార మగుటవలన మధువుచే యాగమును చేయరాదు. సారవంత మగుటవలన ఆజ్యముచే యాగమును చేయవలెను. సర్వయజ్ఞహేతు వగుటవలన ఆజ్యమునకు యజ్ఞత్వమును, యజ్ఞహేతుత్వమును, ''సర్వస్మై వా ఏతద్యజ్ఞాయ గృహ్యతే। యద్ధ్రువాయామాజ్యమ్'' అను శ్రుతి చెప్పుచున్నది. కనుక యజ్ఞయోగ్యసాధనముచేతనే యజ్ఞానుష్ఠానము చేయుటవలన గతసారత్వదోషము లేదు. ఇచట శ్రుతి ఆజ్యభాగాంగత్వమును విధించినది.

2. మంత్రము : **పత్న్యవేక్షతే (1) । మిథునత్వాయ ప్రజాత్యై । యద్వై పత్నీ యజ్ఞస్య కరోతి । మిథునం తత్ । అథో పత్న్యా ఏవైష యజ్ఞస్యాన్వారమ్భో ఽనవచ్ఛిత్త్యై ।**

అర్థము : పత్నీ=యజమానపత్ని, అవేక్షతే=ఆజ్యమును చూడవలెను. ఏతత్=ఈ యవేక్షణము, మిథునత్వాయ= మిథునత్వముకొఱకు, ప్రజాత్యై=ప్రజాసంతతికొఱకును, భవతి=అగుచున్నది. పత్నీ= యజమానపత్ని, యజ్ఞస్య=యజ్ఞమునకు, యత్ వై=దేనినే, కరోతి=చేయుచున్నదో, తత్=అది, మిథునమ్= మిథునము. అథో=మఱియు, పత్న్యై=యజమానపత్నియొక్క, ఏషః ఏవ=ఈ యవేక్షణమే, యజ్ఞస్య=యజ్ఞము యొక్క అన్వారమ్భః=అన్వారంభము. ఏషః=ఈ యన్వారంభము, అనవచ్ఛిత్త్యై=విచ్ఛిత్తి లేకుండుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : యజమానపత్ని ఆజ్యమును చూడవలెను. ఈ యవేక్షణము మిథునత్వముకొఱకు, ప్రజాసంతతికొఱకు నదును. యజమానపత్ని యజ్ఞమునకేది చేయునో, అది మిథున మగును. యజ్ఞము పురుషఁ డగుటవలన, ఆ యజ్ఞముతోఁగూడ పత్నికి మిథనత్వము సిద్ధించుచున్నది. మఱియు పత్నియొక్క ఆజ్యావేక్షణరూపమైన యిదియే యజమాను ననుసరించి యజ్ఞారంభము. దంపతులైన యుభయులు కూడ ఆరంభము చేయఁగా యజ్ఞమువిచ్ఛిన్నము కాదు. ఇచట పత్నియొక్క ఆజ్యావేక్షణము విధించఁబడినది.

3. మంత్రము : **అమేధ్యం వా ఏతత్కరోతి । యత్పత్న్యవేక్షతే । గార్హపత్యే ఽధిశ్రయతి మేధ్యత్వాయ । ఆహవనీయ మభ్యుద్ధవతి । యజ్ఞస్య సంతత్యై । తేజో ఽసి తేజో ఽనుప్రేహీత్యాహ (2) । తేజో వా అగ్నిః । తేజ ఆజ్యమ్ । తేజసైవ తేజః సమర్ధయతి । అగ్నిస్తే తేజో మా వినైదిత్యాహాహిగ్ంసాయై ।**

అర్థము : పత్నీ=యజమానపత్ని, యత్ అవేక్షతే=దేనిని చూచుచున్నదో, ఏతత్=దీనిని, అమేధ్యం వై= అపవిత్రముగానే, కరోతి=చేయుచున్నది. మేధ్యత్వాయ=పవిత్రతకొఱకు, గార్హపత్యే= గార్హపత్యాగ్ని యందు, అధిశ్రయతి=ఆజ్యమును వెచ్చఁబెట్టవలెను. ఆహవనీయమ్ అభి=ఆహవనీయాగ్ని కభిముఖముగ, ఉద్ధవతి=ఆజ్యమునెత్తి ద్రవముగాఁ జేయవలెను. ఏతత్=ఇది, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, సంతత్యై= సంతతి (పరంపర) కొఱకు, భవతి=అగుచున్నది. ''తేజోఽసి తేజోఽనుప్రేహి'' ఇతి ఆహ='ఓ యాజ్యమా! నీవు తేజోరూప మగు చున్నావు' అని మంత్రము చెప్పినది. అగ్నిః=అగ్ని, తేజః వై= తేజోరూపమే. ఆజ్యమ్=ఆజ్యము, తేజః= తేజస్స్వరూపము. (తథా సతి=అట్లు కాఁగా, అధ్వర్యుః= అధ్వర్యుఁడు) తేజసైవ=తేజస్సుచేతనే, తేజః= తేజస్సును, సమర్ధయతి=సమృద్ధముగాఁ జేసినవాఁడగు చున్నాఁడు. ''అగ్నిస్తేతేజో మా వినైత్'' ఇతి ఆహ='ఓ యాజ్యమా! ఈ యాహవనీయాగ్ని నీతేజస్సును పోఁగొట్టకుండుఁగాక' అని యధ్వర్యునివాక్యముగా మంత్రము చెప్పినది. ఏతత్=ఈ కథనము, అహింసాయై=ఆజ్యముయొక్క అహింసకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : అధ్వర్యుcడు ''తేజోఽసి తేజోఽను ప్రేహి'' అను మంత్రభాగమును పఠించుచు గార్హపత్యాగ్నియొక్క తూర్పుదిక్కునుండి సమిధను తీసి దానిపైని ఆజ్యమును వెచ్చcబెట్టి, పిమ్మట ''అగ్నిస్తే తేజో మా వినైత్'' అను మంత్రభాగమును పఠించుచు ఆ యాజ్యమును గార్హపత్యాగ్నియందు ద్రవముగా నగునట్లు వెచ్చcజేయవలెను. తాత్పర్యము స్పష్టము.

4. మంత్రము : **స్ఫ్యస్య వర్త్మన్నాదయతి । యజ్ఞస్య సంతత్యై ।**

అర్థము : స్ఫ్యస్య=స్ఫ్య మనెడి కత్తియొక్క, వర్త్మన్=రేఖయందు, సాదయతి=ఆజ్యము నుంచవలెను. ఏతత్=ఈ సాదనము, యజ్ఞస్య=యజ్ఞము యొక్క, సంతత్యై=సంతతి (పరంపర)కొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఆహవనీయమునందుc గల ఆజ్యమును ఉత్తరదిశయందు తీసికొనివచ్చుటకై స్ఫ్య మనెడి కత్తిచే ఒకానొక గీతను చేసి, 'అగ్నేర్జిహ్వాఽసి' అను మంత్రమును పఠించుచు ఆ గీతయందు నాజ్యము నుంచవలెను. అట్లు చేయుట యజ్ఞసంతతికి కారణ మగును.

5. మంత్రము : **అగ్నేర్జిహ్వాకసి సుభూర్దేవానామిత్యాహ। యథాయజురేవైతత్ । ధామ్నే ధామ్నే దేవేభ్యో యజుషే యజుషే భవేత్యాహ । ఆశిషమేవైతామాశాస్తే (3) ।**

అర్థము : ''అగ్నేర్జిహ్వాఽసి సుభూర్దేవానామ్'' ఇతి ఆహ='ఓ యాజ్యమా! నీవు అగ్నికి జిహ్వా వగుచున్నావు. దేవతల సుఖముకొఱకైనదాన వగుచున్నావు' అని మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, యథాయజురేవ=మంత్రానుగుణమే. ''ధామ్నేధామ్నే దేవేభ్యో యజుషే భవ'' ఇతి ఆహ='ఓ యాజ్యమా! అటువంటి నీవు దేవతలకై ఆ యా యాహుతిస్థానముకొఱకు, తత్తన్మంత్రపూర్వక గ్రహణముకొఱకు సమర్థ మగుము' అని మంత్రము చెప్పినది. ఏతామ్=దీనిని, ఆశిషమేవ=ఆశీస్సునుగానే, ఆశాస్తే=యజమానుcడు తలcచుచున్నాcడు.

తాత్పర్యము : జ్వాలారూపమైన జిహ్వాను పుట్టించుటచే నాజ్యము గ్నికి జిహ్వాగాc జెప్పcబడినది. శేషము స్పష్టము.

6. మంత్రము : **తద్వా అతః పవిత్రాభ్యామేవోత్పునాతి । యజమానో వా ఆజ్యమ్ । ప్రాణాపానౌ పవిత్రే । యజమాన ఏవ ప్రాణాపానౌ దధాతి ।**

అర్థము : అతఃవై=పత్ని చూచుటచే (యోషిద్వీక్షణముచే) నపవిత్రమైన యాజ్యమునకు పవిత్రతకొఱకు గార్హపత్యాధ్యధిశ్రయణము చేయcబడుటవలననే, తత్=ఆ యాజ్యమును, పవిత్రాభ్యామ్=రెండు దర్భపవిత్రములచే, ఉత్పునాతి=ఉత్పవనము చేయవలెను. యజమానఃయజమానుcడు, ఆజ్యం వై=ఆజ్యరూపుcడే. పవిత్రే=దర్భ పవిత్రములు, ప్రాణాపానౌ=ప్రాణాపాన రూపములు. (అనేన=ఈ యుత్పవనముచే, అధ్వర్యుఃఅధ్వ ర్యుcడు,) యజమానే=యజమానునందు, ప్రాణాపానావేవ=ప్రాణాపానములనే, దధాతి=స్థాపించినవాc డగుచున్నాcడు. ఉత్పవనము=ఆజ్యమునందు పవిత్రముల నిటునటు కదల్చుట.

తాత్పర్యము : స్త్రీ చూచుటచే నపవిత్రమైన యాజ్యమునకు పవిత్రత కలుగుటకై గార్హపత్యాద్యధిశ్రయణము చేయcబడుటవలననే, అత్యంతశుద్ధికై ఆ యాజ్యమునందు దర్భపవిత్రములచే నుత్పవనము చేయవలెను. యజమానుcడు ఆజ్యస్వరూపుcడే. ప్రాణపానములు పవిత్రముల రూపములు. కనుక ఉత్పవనము చేసిన యధ్వర్యుcడు యజమానునియందు ప్రాణాపానములనే స్థాపించినవాc డగును. ఇచట ఆజ్యమునకు ఉత్పవనము విధించcబడినది.

7. మంత్రము : **పునరాహారమ్ । ఏవమివ హి ప్రాణాపానౌ సంచరతః ।**

అర్థము : పునఃఆహారమ్=ఆజ్యమునందు ఉంచcబడిన పవిత్రములను మఱల మఱల ప్రాగ్దిశనుండి పశ్చిమదిశ వఱకు తెచ్చి మధ్యభాగమునుండి ఊర్ధ్వముగా నుత్పవనము చేయవలెను. ప్రాణాపానౌ=ప్రాణాపాన వాయు వృత్తులు, ఏవమివ=ఈ విధముగవలె, సంచరతఃహి=సంచరించుచున్నవి కదా! ఈ విధముగ మూcడు మారులు ఉత్పవనము చేయవలెననెడి అభిప్రాయముచే 'ఆహారమ్' అని వీప్సార్థమున ణముల్ ప్రత్యయము ప్రయుక్త మైనది.

తాత్పర్యము : స్పష్టము. ఇచట ఉత్పవనమునందు ప్రకారవిశేషము విధించcబడినది.

8. మంత్రము : **శుక్రమసి జ్యోతిరసి తేజోకసీత్యాహ । రూపమేవాస్యైతన్మహిమానం వ్యాచష్టే ।**

అర్థము : ''శుక్రమసి జ్యోతిరసి తేజోఽసి'' ఇతి ఆహ='ఓ యాజ్యమా! నీవు దీప్తిమంత మగుచున్నావు. జ్యోతి స్వరూప మగుచున్నావు తేజస్స్వరూపమగుచున్నావు' అని మంత్రము చెప్పినది. అస్య=ఈ యాజ్యము యొక్క, రూపమేవ=రూపమే, ఏతన్మహిమానమ్=ఈ యాజ్యముయొక్క మహిమను, వ్యాచష్టే=విశేషముగ చెప్పుచున్నది.

తాత్పర్యము : మంత్రము శుక్రమసి, జ్యోతిరసి, తేజోఽసి అని మూcడు భాగములుగా నున్నది. ఈ మూcడు మంత్ర భాగములు స్పష్టార్థము కలవిగా నున్నవని యీ బ్రాహ్మణము తెలియcజేసినది. ఒక్కొక్క మంత్రభాగముచే ఒక్కొక్క పర్యాయము ఉత్పవనము చొప్పున మూcడు మంత్రభాగములచే మూcడు పర్యాయములు ఉత్పవనము చేయవలెనని ''అథైనదుదగ్రాభ్యాం పవిత్రాభ్యాం పునరాహార ముత్పునాతి శుక్రమసీతి ప్రథమం జ్యోతిరసీతి ద్వితీయం తేజోఽసీతి తృతీయమ్'' అను కల్పసూత్రము వివరించినది. ఆ యభిప్రాయముతోనే 'పునరాహారమ్' అని ప్రయుక్త మైనది.

9. మంత్రము : **త్రిర్యజుషా । త్రయ ఇమే లోకాః (4) । ఏషాం లోకానామాప్త్యై ।**

అర్థము : యజుషా=మంత్రముచే, త్రిఃమూcడు మారులు, ఉత్పునాతి=ఉత్పవనము చేయవలెను. ఇమే లోకాఃఈ భూరాది లోకములు, త్రయఃత్రిసంఖ్యాకములు. ఏతత్=ఈ త్రిరుత్పవనము, ఏషాం లోకానామ్=ఈ మూcడు లోకములయొక్క, ఆప్త్యై =ప్రాప్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : శుక్రమసీత్యాది మంత్రమునందలి మూcడు భాగములలోని ప్రతియొక మంత్రభాగముచేతను ఉత్పవనము చేయవలెను. ఈ భూరాది లోకములు త్రిసంఖ్యాకములు (మూcడు) కనుక ఈ యుత్పవనమువలన ముల్లోకముల ప్రాప్తియు కలుగును. ఇచట ప్రతిమంత్రక్రియ విధించcబడినది.

10. మంత్రము :**త్రిః । త్యావృద్ధి యజ్ఞః । అథో మేధ్యత్వాయ ।**

అర్థము : త్రిః=మూడు మారులు, ఉత్పునాతి=ఉత్పవనము చేయవలెను. యజ్ఞః=యజ్ఞము, త్యావృత్‌హి=మూడు ఆవృత్తులు కలది కదా! అథో=మఱియు, మేధ్యత్వాయ=పవిత్రతకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : యజ్ఞము మూడు ఆవృత్తులు కలది. అనగా మూడు మారు లనుష్ఠేయము. కనుక మూడు మారులు ఉత్పవనము చేయవలెను. మఱియు మూడు మారులు ఉత్పవనము చేయుటవలన ఆజ్యమునకు పవిత్రత కలుగును. ఇచట శ్రుతి త్రిత్వము ననువదించి యర్థవాదాంతరమును చెప్పినది.

11. మంత్రము :**అథా కజ్యవతీభ్యామపః । రూపమేవా కసామేతద్వర్ణం దధాతి । అపి వా ఉతా కహుః । యథా హ్వై యోషా సువర్ణగ్ం హిరణ్యం పేశలం బిభ్రతీ రూపాణ్యాస్తే । ఏవమేతా ఏతర్హీతి ।**

అర్థము : అథ=అనంతరము, ఆజ్యవతీభ్యామ్=ఆజ్యవంతములైన పవిత్రములచే, అపః=ఉదకములను, ఉత్పునీయాత్=ఉత్పవనము చేయవలెను. ఏతత్=ఈ యాజ్యము, ఆసామ్=ఈ ఉత్పూతములైన యుదకములకు, వర్ణం రూపమేవ=వర్ణవిశేషోపేతమైన రూపమునే, దధాతి=సంపాదించుచున్నది. అపి వై ఉత ఆహుః=మఱియు నీ విధముగ కొందఱు చెప్పుచున్నారు. యథా హ వై=ఏవిధముగనైతే, యోషా=స్త్రీ, సువర్ణమ్=తామ్రాది కాలుష్య రాహిత్యముచే శోభనవర్ణోపేతమును, పేశలమ్=కటకాద్యాకారసౌకర్యముచే చక్కనిదియునగు, హిరణ్యమ్=బంగారమును, బిభ్రతీ=ధరించుచున్నదై, రూపాణీ=రూపవతిగా, ఆస్తే=ఉండుచున్నదో, ఏతర్హి= ఇటులైనచో, ఏతాః=ఈ యుదకములు, ఏవమ్=ఈ విధముగ, నేత్రప్రియాః భవన్తి=నేత్రప్రియము లగుచున్నవి.

తాత్పర్యము : ఏ పవిత్రములచే నాజ్యము ఉత్పూత మైనదో, ఆజ్యలిప్తములైన యా పవిత్రములచేతనే యుదకముల నుత్పవనము చేయవలెను. ఈ యాజ్యము తన బిందువులచే ఈ యుదకములకు వర్ణవిశేషోపేతమైన రూపమును సంపాదించును. మఱియు తామ్రాది కాలుష్య రాహిత్యముచే శోభనవర్ణోపేతమును, కటకాద్యాకార సౌకర్యముచే చక్కనిదియునైన బంగారమును ధరించిన స్త్రీవలె ఈ యుదకము లాజ్యబిందు యుక్తములై నేత్రప్రియము లగును. ఇచట శ్రుతి పూర్వోక్తమైన యుత్పవనమును పవిత్రవిశిష్టముగ విధించినది.

12. మంత్రము :**ఆపో వై సర్వా దేవతాః (5) । ఏషా హివిశ్వేషాం దేవానాం తనూః । యదాజ్యమ్ । తత్రోభయోర్మిథునగ్ంసాజామిః స్యాత్ । యద్యజుషా కజ్యం యజుషా కప ఉత్పునీయాత్ । ఛన్దసా కప ఉత్పునాత్యజామిత్వాయ। అథో మిథునత్వాయ । సావిత్రియర్చా । సవితృప్రసూతం మే కర్మాసదితి । సవితృప్రసూతమేవాస్య కర్మ భవతి । పచ్ఛో గాయత్రియా త్రిః షమృద్ధత్వాయ । అద్భిరేవౌషధీః సంనయతి । ఓషధీభిః పశూన్। పశుభిర్యజమానమ్ ।**

అర్థము : సర్వాఃదేవతాఃసర్వదేవతలు, అపఃవై=ఉదకస్వరూపులే. ఆజ్యం యత్=ఆజ్యమేది కలదో, ఏషా=ఇది, విశ్వేషాం దేవానామ్=సర్వదేవతలకు, తనూఃశరీరము. తత్ర=ఆ యాజ్యోదకములందు, ఉభయోఃమీమాంసా=ఋగ్యస్సుల మీమాంస, భవతి=అగుచున్నది. యజుషా=యజుస్సుచే, ఆజ్యమ్=ఆజ్యమును, యజుషా=యజుస్సుచే, అపఃఉదకములను, ఉత్పునీయాత్ యత్=ఉత్పవనము చేయుచో, జామి స్యాత్=ఆలస్యమగును. అజామిత్వాయ=ఆలస్యము లేకుండుటకై, ఛన్దసా=ఛందోయుక్తమైన మంత్రముచే (ఋక్కుచే) అపఃఉదకములను, ఉత్పునాతి=ఉత్పవనము చేయవలెను. అథో=మఱియు, (ఏతత్=ఋగ్యజుస్సుల చేతనైన ఈ యుత్పవనము,) మిథునత్వాయ=మిథునత్వసిద్ధికై, భవతి=అగుచున్నది.

సవిత్రప్రసూతంమే కర్మ అసత్ ఇతి=నా యొక్క యజ్ఞకర్మ సవితృదేవతా ప్రేరిత మగుటగాక యనెడి, సావిత్రియా ఋచా=సవితృదేవతాకమైన ఋక్కుచే, (అపఃఉదకములను, ఉత్పునీయాత్=ఉత్పవనము చేయవలెను). తథా సతి=అట్లు కాఁగా, అస్య=ఈ యజమానునియొక్క, కర్మ=కర్మ, సవిత్రప్రసూతమేవ=సవిత్రదేవతా ప్రేరితమే, భవతి=అగుచున్నది. సమృద్ధత్వాయ=సమృద్ధిసిద్ధికై, గాయత్రియా=గాయత్రీ చ్ఛందస్కమైన ఋక్కుచే, పచ్ఛఃపాదములవరుసగా, త్రిఃమూఁడు మారులు, ఉత్పునీయాత్=ఉత్పవనము చేయవలెను. (తదా=అప్పుడు, సఃఆ యధ్వర్యుఁడు,) అద్భిరేవ=ఉదకములచేతనే, ఓషధీఃఓషధులను, సంనయతి=సమృద్ధములనుగాఁ జేయుచున్నవాఁ డగుచున్నాఁడు. ఓషధీభిఃఓషధులచే, పశూన్=పశువులను, సంనయతి. పశుభిఃపశువులచే, యజమానమ్=యజమానుని, సంనయతి.

తాత్పర్యము : ఉదకరూపమైన వీర్యముచే దేవతాశరీర ముత్పన్న మగుచున్నది. ఆహుతిరూపమైన యాజ్యముచే ఆ శరీరము పోషింపఁబడుచున్నది. ఆ కారణమువలన ఆజ్యోదకములకు సర్వదేవతారూపత్వము సమాన మగుచుండఁగా ఆజ్యము, ఉదకము అను నీ యుభయమును యజుస్సుచేతనే ఉత్పవనము చేయవలెనా? లేక, ఉదకములను ఋక్కుచే నుత్పవనము చేయవలెనా? అను మీమాంసయందు ఆలస్యనివారణమునకై ఋక్కుచేతనే యుదకముల నుత్పవనము చేయుట యుక్తము. ఇట్లు చేయుటవలన ఋగ్యజుస్సులచే మిథునత్వము కూడ సంపన్న మగును. మూఁడు మారులు ఉదకము లుత్పవనము చేయఁబడుటచే నాదరాతిశయమువలన నుదకములచే క్రమముగ ఓషధీ పశు యజమానులు సమృద్ధ లగుదురు. గాయత్రీఋక్కు మూఁడు పాదములు కలది. ఒక్కొక్క పాదమును పఠించుచు నొక్కొక్క యుత్పవనము చేయుటవలన ఉత్పవనము త్రివార మగును. కనుకనే పచ్ఛఃఅని ప్రయుక్త మైనది. మంత్రగతచ్ఛందఃప్రభృతిని అనుసంధేయముగా నిచట శ్రుతి విధించినది.

13. మంత్రము :**శుక్రం త్వా శుక్రాయాం జ్యోతిస్త్వా జ్యోతిష్యర్చిస్త్వా కర్చిషీత్యాహసర్వత్వాయ । పర్యాప్త్యా**

అనన్తరాయాయ (6) ।

ఈక్షత ఆహ శాస్తే లోకా దేవతా భవతి షట్ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే చతుర్థోఽనువాకః ॥౪॥

అర్థము : ''శుక్రం త్వా శుక్రాయాం జ్యోతిస్త్వా జ్యోతిష్యర్చిస్త్వాఽర్చిషి'' ఇతి ఆహ = 'ఓ యాజ్యమా! దీప్తమైన నిన్ను, దీప్తమైన జుహువునందు తత్తన్మంత్రపూర్వకగ్రహణముకొఱకు, తత్తద్ధోమస్థానముకొఱకును పర్యాప్త మగునట్లుగా గ్రహించుచున్నాను. ఓ యాజ్యమా! జ్యోతీరూపమైన నిన్ను జ్యోతీరూపమైన ఉపభృత్తునందు తత్తన్మంత్రపూర్వకగ్రహణము కొఱకు, తత్తద్ధోమస్థానము కొఱకును గ్రహించుచున్నాను. ఓ యాజ్యమా! అర్చీ (వెలుగు) రూపమైన నిన్ను అర్చీరూపమైన ధ్రువ యందు తత్తన్మంత్రపూర్వకగ్రహణముకొఱకు, తత్తద్ధోమస్థానముకొఱకును గ్రహించుచున్నా'నని మంత్రము చెప్పినది. ఏతత్ = ఈ గ్రహణము, సర్వత్వాయ = ఆహుతిబాహుళ్యముకొఱకు, పర్యాప్త్యై = పర్యాప్తి కొఱకును, అనన్తరాయాయ = అనంతరాయముకొఱకును, భవతి = అగుచున్నది. పర్యాప్తిః = ఒక్కొక్క ఆహుతియందు ఆజ్య బాహుళ్యము. అనన్తరాయః = ఒక్క యాహుతికిని లోపము లేకుండుట.

తాత్పర్యము : అధ్వర్యుడు కుడిచేతితో స్రువమును, ఎడమచేతితో జుహువును తీసికొని ''శుక్రం త్వా శుక్రాయాం ధామ్నే ధామ్నే దేవేభ్యో యజుషే యజుషే గృహ్ణామి'' అను మంత్రమును పఠించుచు జుహువులోనికి ఆజ్యమును గ్రహించవలెను. ఈ విధముగానే ఉపభృత్తులోనికి, ధ్రువలోనికిని ఆజ్యమును గ్రహించుచు పై మంత్రమును పఠించవలెను. శేషము అర్థమునందే వివరించబడినది. ఉపభృత్తులోనికి గ్రహించునపుడు 'శుక్రం శుక్రాయాం' అను పదములకు మారుగా 'జ్యోతిః జ్యోతిషి' అనియు, ధ్రువలోనికి గ్రహించునపుడు 'అర్చిః అర్చిషి' అనియు పఠించవలెను.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు
చతుర్థానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే

పంచమోఽనువాకః

1. మంత్రము : **దేవాసురాః సంయత్తా ఆసన్ । స ఏతమింద్ర ఆజ్యస్యావకాశ మపశ్యత్ । తేనావైక్షత । తతో దేవా అభవన్ । పరాసురాః । య ఏవం విద్వానాజ్య మవేక్షతే । భవత్యాత్మనా । పరాస్య భ్రాతృవ్యో భవతి ।**

వేదార్థదీపిక

అవతారిక: శేషించిన ఆజ్యాది హవిర్గ్రహణార్థమంత్రముల కీ పంచమానువాకమునందు బ్రాహ్మణము చెప్పఁబడుచున్నది.

అర్థము : దేవాసురాః=దేవతలు, అసురులు, సంయత్తాః=యుద్ధసన్నద్ధులైరి. సః ఇన్ద్రః=దేవతలలో ప్రసిద్ధుఁడైన యింద్రుఁడు, ఆజ్యస్య=ఆజ్యమునకు, అవకాశమ్ ఏతమ్=ప్రకాశమైన ''అగ్నేర్జిహ్వాఽసీ'' త్యాదికమైన యీ మంత్రమును, అపశ్యత్=కనుఁగొనెను. తేన=ఆ మంత్రముచే, అవైక్షత=ఆజ్యమును చూచెను. తతః=ఆ యవేక్షణవలన, దేవాః=దేవతలు, అభవన్=విజయు లైరి. అసురాః=అసురులు, పరా భవన్=తిరస్కృతు లైరి. యః=ఏ పురుషుఁడు, ఏవమ్=పూర్వోక్తవిధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, ఆజ్యమ్=ఆజ్యమును, అవేక్షతే =చూచునో, సః=అతఁడు, ఆత్మనా =స్వయముగ, భవతి=విజయుఁ డగును. అస్య=ఇతనియొక్క, భ్రాతృవ్యః=శత్రువు, పరా భవతి=పరా భూతుఁ డగును.

తాత్పర్యము : పూర్వమొకప్పుడు దేవాసురులు పరస్పరము యుద్ధము చేయుటకై సన్నద్ధు లైరి. అందు ప్రసిద్ధుఁడైన యింద్రుఁడు ఆజ్య ప్రకాశకమైన ''అగ్నేర్జిహ్వాసి'' ఇత్యాది మంత్రమును కనుఁగొని దానిచే (దానిని పఠించుచు) నాజ్యమును చూచెను. ఆ చూచుటవలన దేవతలకు విజయము లభించఁగా, నసురుల కపజయము కలిగినది. ఈ విధముగ తెలిసికొని చూచిన యతఁడు కూడ విజయుఁ డగును. అతని శత్రువు తిరస్కృతుఁ డగును. పూర్వోక్తమైన యాజ్యావేక్షణమునందు విశేషమును చెప్పుటకై శ్రుతి ఆ యాజ్యావేక్షణమును స్తుతించినది.

2. మంత్రము : **బ్రహ్మవాదినో వదన్తి । యదాజ్యేనాన్యాని హవీగ్ంష్యభిఘారయతి (1) । అథ కేనాఽఽజ్యమితి । సత్యేనేతి బ్రూయాత్ । చక్షుర్వై సత్యమ్ । సత్యేనైవైనదభిఘారయతి ।**

అర్థము : ఆజ్యేన=ఆజ్యముచే, అన్యాని హవీంషి=ఇతరములైన హవిస్సులను, అభిఘారయతి యత్=అభిఘారము చేయుచున్నచో, అథ=అప్పుడు, కేన=ఏ విశేషముచే, ఆజ్యమ్=ఆజ్యము, అస్తి=ఉంటున్నది? ఇతి=అని, బ్రహ్మవాదినః=మంత్రజ్ఞులు, వదన్తి=మాటలాడుకొనుచున్నారు (ప్రశ్నించుకొనుచున్నారు). సత్యేన=సత్యముచేత, ఇతి=అని, బ్రూయాత్=సమాధానము చెప్పవలెను. చక్షుః=చక్షువు, సత్యంవై=సత్యరూపమే.

సత్యేనైవ=సత్యముచేతనే, ఏనత్=ఈ యాజ్యమును, అభిఘారయతి=అభిఘారము చేయుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : వక్తకు విప్రలంభము సంభవము కనుక, శ్రుతమైన యర్థము (విన్నది) ఒకొనొకప్పుడు యథార్థము కాకపోవచ్చును. చూడబడినది యథార్థమే యగును కాని, విపరీతము కాదు. కనుక చక్షువు సత్యమగుచున్నది. శుక్తిరజత రజ్జుసర్ప వ్యభిచారము (భ్రాంతి) మాత్రము కాచకామలాది దోష ప్రయుక్తమైనది. విప్రలంభము=మిక్కిలి వంచనము. వ్యభిచారము=తప్పి చరించుట. విన్నది వినినట్లు కాకుండుట. కాచము=గాజుపూస. కామలము=పైత్యదోషము. కనుక చక్షువు సత్యమే. సత్యముచేతనే యీ యాజ్యము నభిఘారము చేసినవాడగుచున్నాడు. ఇచట అభిఘారణత్వకథనముచేత అవేక్షణము ప్రశంసించబడినది.

3. మంత్రము : **ఈశ్వరో వా ఏషోఽన్ధో భవితోః । యశ్చక్షుషాఽజ్యమవేక్షతే । నిమీల్యావేక్షేత । దాధారాఽఽత్మన్చక్షుః । అభ్యాజ్యం ఘారయతి ।**

అర్థము : యఃఏ పురుషుడు, చక్షుషా=చక్షువుచే, ఆజ్యమ్=ఆజ్యమును, అవేక్షతే=చూచుచున్నాడో, ఏషఃఇతడు, అన్ధఃఅంధుడుగా, భవితోఃఅగుటకై, ఈశ్వరఃవై=సమర్థుడే. నిమీల్య=కన్నుమూసి, అవేక్షేత=చూడవలెను. తదా=అప్పుడు, సఃఅతడు, చక్షుఃచక్షువును, ఆత్మన్=ఆత్మయందు, దాధార=ధరించెను. తత్=ఆ కారణమువలన, ఆజ్యమ్=ఆజ్యమును, అభిఘారయతి=అభిఘారము చేయవలెను.

తాత్పర్యము : ఆజ్యము ఆదిత్యమండలమువలెతేజస్వి యగుటవలన, నిరంతరము చూచుటచే నతడంధుడగుట కవకాశమేర్పడును. అచట నిమీలనముచే చక్షువు స్వాత్మప్రవిష్ట మగును. ఆ సమయమున నతడు చక్షువు నాత్మయందు ధరించుటవలన నంధుడు కాడు. వీక్షణముచే నాజ్యము నభిఘరించవలెను. ఇచట అవేక్షణమందు నిమీలనరూప విశేషము విధించబడినది.

4. మంత్రము : **ఆజ్యం గృహ్ణాతి (2) । ఛన్దాగ్ంసి వా ఆజ్యమ్ । ఛన్దాగ్ంస్యేవ ప్రీణాతి ।**

అర్థము : ఆజ్యమ్=ఆజ్యమును, గృహ్ణాతి=జుహ్వాదులయందు గ్రహించవలెను. ఆజ్యమ్=ఆజ్యము, ఛన్దాంసివై=ఛందస్స్వరూపమే. తత్=ఆ యాజ్యగ్రహణమువలన, ఛన్దాంస్యేవ=(ఛందోదేవతలనే) ఛందస్సులనే, ప్రీణాతి=సంతోషపఱచినవాడగును.

తాత్పర్యము : ఆజ్యము యజ్ఞసాధన మగుటచే ఆజ్యమునకు ఛందస్సాదృశ్యము చెప్పబడినది. ఆజ్యమును జుహ్వాదులలోనికి గ్రహించవలెను. ఆ యాజ్యము ఛందస్సదృశము కనుక ఆజ్యమును జుహ్వాదులలోనికి గ్రహించిన యధ్వర్యుడు ఛందస్సులనే (ఛందోదేవతలనే) సంతోషపఱచినవాడగును. ఇచట ఆజ్యగ్రహణము విధించబడినది.

5. మంత్రము : **చతుర్జుహ్వాం గృహ్ణాతి । చతుష్పాదః పశవః । పశూనేవావరున్ధే । అష్టావుపభృతి । అష్టాక్షరా గాయత్రీ । గాయత్రః ప్రాణః । ప్రాణమేవ పశుషు దధాతి । చతుర్ధ్రువాయామ్ (3) । చతుష్పాదః పశవః । పశుష్వేవోపరిష్టాత్ప్రతితిష్ఠతి ।**

అర్థము : జుహ్వామ్=జుహువునందు,చతుః=నాలుగుమాఱులాజ్యమును గ్రహించవలెను. పశవః=పశువులు, చతుష్పాదః=నాలుగు పాదములు కలవి. అయమ్=యజమానుఁడు, పశూన్=పశువులను, అవరున్ధే ఏవ=నిశ్చయముగ పొందును. ఉపభృతి=ఉపభృత్తునందు, అష్టౌ=ఎనిమిది మాఱులు, ఆజ్యం గృహ్ణీయాత్=ఆజ్యమును గ్రహించవలెను. గాయత్రీ=గాయత్రీఛందస్సు, అష్టాక్షరా=ఒక్కొక్క పాదమునందు ఎనిమిదేసి అక్షరములు కలది. ప్రాణాః=ప్రాణము, గాయత్రః=గాయత్రీరక్షిత మగుటచే గాయత్రీసంబంధి. తేన=ఆ యెనిమిదిమాఱులాజ్యమును గ్రహించుటచే, యజమానః=యజమానుఁడు, పశుషు=పశువులందు, ప్రాణమేవ=ప్రాణమునే, దధాతి=స్థాపించినవాఁ డగును. ధ్రువాయామ్=ధ్రువయందు, చతుః=నాలుగు మాఱులు, ఆజ్యం గృహ్ణీయాత్=ఆజ్యమును గ్రహించవలెను. ఉపరిష్టాత్=అనంతర ప్రయోగమువలన, పశుష్వేవ=పశువులందే, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగును.

తాత్పర్యము : యజమానునకు ప్రతినిధిగా అధ్వర్యుఁ డాజ్యమును జుహువునందు నాలుగు మాఱులు గ్రహించవలెను. పశువులు నాలుగు పాదములు కలవి. కనుక తత్సాదృశ్యమువలన యజమానుఁడు పశువులను పొందును. ఉపభృత్తునందు ఎనిమిది పర్యాయము లాజ్యమును గ్రహించవలెను. గాయత్రీచ్ఛందస్సు ఒక్కొక్క పాదమునందు ఎనిమిదేసి యక్షరములు కలది. ప్రాణము గాయత్రిచే రక్షితము కనుక గాయత్రము (గాయత్రీ సంబంధి). కనుక యజమానుఁ డష్టత్వసంఖ్యాసాదృశ్యముచే ప్రాణమునే పశువులందు స్థాపించినవాఁ డగును. ధ్రువయందు నాలుగు పర్యాయము లాజ్యమును గ్రహించవలెను. పశువులు నాలుగు పాదములు కలవి. స్వాధీనముగా పొందఁబడిన పశువులందు పశ్చాత్ప్రయోగముచే యజమానుఁడు ప్రతిష్ఠితుఁ డగును. స్రుగ్విశేషముచే ఆవృత్తివిశేష మిచట విధించఁబడినది. గయాన్=ప్రాణాన్ తత్రే ఇతి గాయత్రీనామ. గయము లనఁగా ప్రాణములు. తత్రే=రక్షించినది. కనుక గాయత్రీనామ మేర్పడినదని వాజసనేయులు వ్యవహరించుచున్నారు.

6. మంత్రము : **యజమానదేవత్యా వై జుహూః । భ్రాతృవ్యదేవత్యోపభృత్ । చతుర్జుహ్వాం గృహ్ణన్భూయో గృహ్ణీయాత్ । అష్టావుపభృతి గృహ్ణన్యనీయసః । యజమానాయైవ భ్రాతృవ్యముపస్తిం కరోతి ।**

అర్థము : జుహూః=జుహువు, యజమాన దేవత్యా వై=యజమానుఁడు దేవతగాఁ గలదియే. ఉపభృత్=ఉపభృత్తు, భ్రాతృవ్యదేవత్యా=శత్రువు దేవతగాఁ గలది. జుహ్వామ్=జుహువునందు, చతుః=నాలుగు మాఱులు, గృహ్ణన్=అధ్వర్యుఁ డాజ్యమును గ్రహించుచు, భూయసః=అధికముగ, గృహ్ణీయాత్=(ఆజ్యమును) గ్రహించవలెను. ఉపభృతి=ఉపభృత్తునందు, అష్టౌ=ఎనిమిది మాఱులు, గృహ్ణన్=ఆజ్యమును

గ్రహించుచు, కనీయఃఅల్పముగా, గృహ్ణీయాత్=గ్రహించవలెను. (తదా=అప్పుడు, సఃఆ యధ్వర్యుడు,) యజమానాయైవ=యజమానునికొఱకే, భ్రాతృవ్యమ్=శత్రువును, ఉపస్తిమ్=సమీపమున భృత్యునిగా నుండువానినిగా, కరోతి=చేయువాడగును.

తాత్పర్యము : జుహువు యజమానదేవత్యము. ఉపభృత్తు భ్రాతృవ్యదేవత్యము. అధ్వర్యుడు జుహువులోనికి నాలుగు మాఱులాజ్యమును గ్రహించునపు డధికముగ గ్రహించవలెను. ఉపభృత్తులోనికెనిమిదిమాఱు లాజ్యమును గ్రహించునపు డల్పముగ గ్రహించవలెను. ఈ విధముగ నల్పాధికప్రమాణముగ నాజ్యమును గ్రహించుటవలన అధ్వర్యుడు యజమానునకే శత్రువును సమీపమున భృత్యునిగా నుండువానినిగాఁ జేయువాడగును. ఉప =సమీపే భృత్యత్వేన అస్తి=తిష్ఠతీతి ఉపస్తిః. సమీపమున భృత్యుడుగా నుండువాడు ఉపస్తియని వ్యుత్పత్త్యర్థము. ఇచట గ్రాహ్యమైన యాజ్యమునకు స్రుగ్విశేషముచే అల్పాధికపరిమాణము విధించఁబడినది.

౭. మంత్రము : గౌర్వై స్రుచ॑ः । చ॒తుర్జు॒హ్వాం గృ॑హ్ణాతి । తస్మాచ్చ॒తుష్పదీ (4) । అ॒ష్టావు॑పభృ॒తి । తస్మా॒దష్టా॑శఫా ।

చ॒తుర్ధ్రువా॑యామ్ । తస్మాచ్చ॒తుస్స్తనా । గామే॒వ తత్సగ్ం స్కు॑రోతి ।

సా క॒స్మై సగ్ం స్కృ॑తేష॒మూర్జం దు॑హే।

అర్థము : స్రుచఃజుహ్వాది స్రుక్కులు, గౌఃవై=గోరూపములే. జుహ్వామ్=జుహువునందు, చతుఃనాలుగు మాఱులు, గృహ్ణాతి=ఆజ్యమునధ్వర్యుడు గ్రహించుచున్నాడు. తస్మాత్=ఆ కారణమువలన, చతుష్పదీ=గోవు నాలుగు పాదములు కలది. ఉపభృతి=ఉపభృత్తునందు, అష్టౌ=ఎనిమిది మాఱులు, గృహ్ణాతి=అధ్వర్యుఁ డాజ్యమును గ్రహించుచున్నాడు. తస్మాత్=ఆ కారణమువలన, అష్టాశఫా=గోవు ఎనిమిది శఫములు కలది. ధ్రువాయామ్ =ధ్రువయందు, చతుఃనాలుగు మాఱులు, గృహ్ణాతి=అధ్వర్యుఁ డాజ్యమును గ్రహించుచున్నాడు. తస్మాత్ =ఆ కారణమువలన, చతుస్స్తనా=గోవు నాలుగు స్తనములు కలది. తత్=స్రుక్కుల కాజ్యపూర్తిరూప సంస్కారము చేయుటచేత, (అధ్వర్యుఃఅధ్వర్యుడు,) గామేవ=గోవునే, సంస్కరోతి=సంస్కరించినవాఁ డగుచున్నాడు. సంస్కృతా సా=సంస్కరించఁబడిన యా గోవు, అస్మై=ఈ యజమానునికొఱకు, ఇషమ్=పయోరూపమైన యన్నమును, ఊర్జమ్=ఆజ్యరూపమైన రసమును, దుహే=పితుకుచున్నది (ఇచ్చుచున్నది). శఫము=గోవు మొదలగువాని గొరిసె (గొరిజ).

తాత్పర్యము : అభిమత దోహనమువలన స్రుక్కులకు గోరూపత్వము, సంఖ్యచే తదవయవసామ్యము నిచట చెప్పఁబడినవి. అందువలన జుహ్వాది స్రుక్కుల కాజ్యపూర్తిరూప సంస్కారము చేయుటచే అధ్వర్యుడు (లేదా- యజమానుఁడు) గోవునే సంస్కరించినవాఁ డగుచున్నాఁడు. సంస్కరించఁబడిన యా గోవు ఈ యజమానునకు పయోరూపమైన యన్నమును, ఆజ్యరూపమైన రసమును ఇచ్చుచున్నది. ఇచట సంఖ్యమఱల ప్రకారాంతరముగ స్తుతించఁబడినది.

8. మంత్రము : **యజ్జుహ్వాం గృహ్ణాతి । ప్రయాజేభ్యస్తత్ । యదుపభృతి ప్రయాజానూ యాజేభ్యస్తత్ ।**

సర్వస్మై వా ఏతద్యజ్ఞాయ గృహ్యతే యద్ధ్రువాయామాజ్యమ్ (5) ।

అభిఘారయతి గృహ్ణాతి ధ్రువాయాం చతుష్పదీ ప్రయాజానూయాజేభ్యస్తద్ధ్వే చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే పఞ్చమోఽనువాకః ॥౫॥

అర్థము : జుహ్వామ్=జుహువునందు, యత్=ఏ యాజ్యమును, గృహ్ణాతి=గ్రహించుచున్నాడో, తత్=ఆ యాజ్యము, ప్రయాజేభ్యః=ప్రయాజయాగములకొఱకు, గృహ్యతే=గ్రహించబడుచున్నది. ఉపభృతి=ఉపభృత్తునందు, యత్=ఏ యాజ్యమును, గృహ్ణాతి=గ్రహించుచున్నాడో, తత్=ఆ యాజ్యము, ప్రయాజానూయాజేభ్యః= ప్రయాజానూయాజయాగములకొఱకు, గృహ్యతే. ధ్రువాయామ్=ధ్రువపాత్రమందు, యత్=ఏ యాజ్యమును, గృహ్ణాతి=గ్రహించుచున్నాడో, ఏతత్=ఈ యాజ్యము, సర్వస్మై యజ్ఞాయ వై=సర్వయజ్ఞముకొఱకే, గృహ్యతే=గ్రహించబడుచున్నది.

తాత్పర్యము : అయిదు ప్రయాజయాగములలో మూడు యాగములు జౌహవాజ్యముచే నిష్పాద్యములు. రెండు ఔపభృతార్థముచే నిష్పాద్యములు. శిష్టమైన యౌపభృతాజ్యముచే అనూయాజలు నిష్పాద్యములు. ద్రవ్యాపేక్షకల సర్వస్థలములందును ధ్రౌవాజ్యమును హోమము చేయవలెను. గృహీతమైన యాజ్యమునకు యథోచితమైన ఆహుత్యంగత్వము నీ శ్రుతి చూపినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు
పంచమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే
షష్ఠోఽనువాకః

1. మంత్రము : **ఆపో దేవీరగ్రే పువో అగ్రే గువ ఇత్యాహ। రూపమేవా ऽऽసా మేతన్మహిమానం వ్యాచష్టే । అగ్ర ఇమం యజ్ఞం నయతాగ్రే యజ్ఞపతిమిత్యాహ। అగ్ర ఏవ యజ్ఞం నయన్తి । అగ్రే యజ్ఞపతిమ్ । యుష్మానిన్ద్రో ऽవృణీత వృత్రతూర్యే యూయమిన్ద్రమవృణీధ్వం వృత్రతూర్య ఇత్యాహ। వృత్రగ్ం హ హనిష్యన్నిన్ద్ర ఆపో వవ్రే । ఆపో హేన్ద్రం వవ్రిరే । సంజ్ఞామేవా ऽऽసామేతత్సామానం వ్యాచష్టే । ప్రోక్షితాः స్థేత్యాహ (1) । తేనా ऽऽపः ప్రోక్షితాः ।**

వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు ఆజ్యాదిహవిర్గ్రహణార్థ మంత్రములకు బ్రాహ్మణము చెప్పఁబడినది. ఈ షష్ఠానువాకమునందు ఇధ్మాబర్హిఃపూర్వకహవిరాసాదనార్థ మంత్రములకు బ్రాహ్మణము చెప్పఁబడుచున్నది. ఆ మంత్రములలో ''కృష్ణోఽస్యాఖరేష్ఠోఽగ్నయే'' అనునది ఆద్యమంత్రము. ఆ మంత్రముకంటె పూర్వము ''ఆపో దేవీరగ్రేపువः'' ఇత్యాదికమైన ఉపకాభిమంత్రణమంత్రము ఆమ్నాతవ్యమను నభిప్రాయముతో నా మంత్రము నీ బ్రాహ్మణభాగము వ్యాఖ్యానించుచున్నది.

వివరణము: ''ఆపో దేవీరగ్రేపువः'' అను నీ యుదకాభిమంత్రణమంత్రము పంచమానువాకమున వ్యాఖ్యానించఁబడినది.

2. మంత్రము : **అగ్నిర్దేవేభ్యో నిలాయత । కృష్ణో రూపం కృత్వా । స వనస్పతీన్ప్రావిశత్ । కృష్ణో ऽస్యాఖరేష్ఠో ऽగ్నయే త్వా స్వాహేత్యాహ। అగ్నయ ఏవైనం జుష్టం కరోతి । అథో అగ్నేరేవ మేధమవరున్ధే ।**

అర్థము : అగ్నిः=అగ్ని, దేవేభ్యः=దేవతలనుండి, కృష్ణः రూపం కృత్వా=కృష్ణమృగ రూపమును ధరించి, నిలాయత=తొలఁగిపోయెను. సः=ఆ యగ్ని, వనస్పతీన్=వృక్షములను, ప్రావిశత్=ప్రవేశించెను. ''కృష్ణోఽ స్యాఖరేష్ఠోఽగ్నయే త్వా స్వాహా'' ఇతి ఆహ='ఓ యిధ్మమా! నీవు వహ్నిప్రియ మగుటవలన తదభేదోపచారముచే కృష్ణమృగ మగుచున్నావు. ఆ విధముగ వనస్పతిస్థ మగుచున్నావు. ఇందువలన అగ్నికొఱకు ప్రియమైన నిన్ను ప్రోక్షించుచున్నాను' అని వేదము చెప్పినది. ఏనమ్=ఈ యిధ్మమును, అగ్నయే=అగ్నికొఱకు, జుష్టమ్=ఇష్ట మైనదానిగా, కరోతి=యజమానుఁడు చేసినవాఁడగుచున్నాఁడు. అథో=మఱియు, అగ్నేరేవ=అగ్నినుండియే, మేధమ్=యజ్ఞమును, అవరున్ధే=పొందుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ''కృష్ణోఽస్యాఖరేష్ఠోఽగ్నయే స్వాహా'' అను మంత్రమునందలి నానార్థమైన స్వాహా శబ్దము ప్రోక్షణార్థమును చెప్పుచున్నదని తెలియఁజేయుచు నీ బ్రాహ్మణ మా మంత్రముయొక్క యర్థమును చూపుచున్నది. అగ్ని కారణాంతరమువలన కోపించి కృష్ణమృగరూపమును ధరించి దేవతలనుండి తొలఁగిపోయి యనంతరము వనస్పతులను ప్రవేశించెనని యీ బ్రాహ్మణ మగ్నికి కృష్ణమృగరూపత్వమును, వనస్పతిస్థత్వమును నిరూపించుటచే ప్రోక్షణీయమైన యిధ్మము అగ్న్యభేదోపచారముచే కృష్ణమృగమని, వనస్పతిస్థమనియు మంత్రార్థము స్పష్ట మైనది. అట్టి యిధ్మము నగ్నికై ప్రోక్షించుటవలన యజమానుఁడిధ్మము నగ్నికి ప్రియమైనదానినిగాఁ జేసినవాఁడగుచున్నాఁడు. అందువలన యజమానుఁడగ్నినుండియే యజ్ఞమును పొందినవాఁడగుచున్నాఁడు.

3. మంత్రము : **వేదిరసి బర్హిషే త్వా స్వాహేత్యాహ। ప్రజా వై బర్హిః । పృథివీ వేదిః (2) । ప్రజా ఏవ పృథివ్యాం ప్రతిష్ఠాపయతి।**

అర్థము : ''వేదరసి బర్హిషే త్వా స్వాహా'' ఇతి ఆహ='ఓ వేదీ! నీవు పొందఁబడినదాన వగుచున్నావు. బర్హిస్సు కొఱకు నిన్ను ప్రోక్షించుచున్నాను' అని వేదము చెప్పినది. ప్రజా వై=ప్రజయే, బర్హిః=బర్హిస్సు. వేదిః=వేది, పృథివీ=పృథివీరూపము. ప్రజాః ఏవ=ప్రజలనే, పృథివ్యామ్=పృథివియందు, ప్రతిష్ఠాపయతి=యజమానుఁడు ప్రతిష్ఠింపఁజేసినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : ''తదిమామవిన్దన్త యదిమా మవిన్దన్త తద్వేద్యై వేదిత్వమ్'' అను శ్రుతి ఈ వేదిని పొందినారు కనుక వేదికి వేదియను పేరు సిద్ధించినదని చెప్పినది. ఓ వేదీ! నీవు పొందఁబడినదాన వగుచున్నావు. కనుక బర్హిస్సును ధరించుటకై నిన్ను ప్రోక్షించుచున్నానని వేదిరసీత్యాది మంత్రము యజమానునిపక్షమున నధ్వర్యుని వాక్యముగాఁ జెప్పినది. ప్రజయే బర్హిస్సు. వేది పృథివీరూపము. కనుక బర్హిస్సును ధరించుటకై బర్హిస్సును ప్రోక్షించిన యధ్వర్యుఁడు ప్రజను పృథివియందు ప్రతిష్ఠింపఁజేసినవాఁడగుచున్నాఁడు. ప్రోక్షించినపిమ్మట బర్హిస్సును వేదియందు పఱచుదురు. అప్పుడు వేది యాధారము, బర్హిస్సు ఆధేయము నగును. ఇచట రూపకముచే ఈ బ్రాహ్మణము ఆధారాధేయభావమును చూపినది.

4. మంత్రము : **బర్హిరసి స్రుగ్భ్యస్త్వా స్వాహేత్యాహ। ప్రజా వై బర్హిః । యజమానాః స్రుచః । యజమానమేవ ప్రజాసు ప్రతిష్ఠాపయతి ।**

అర్థము : ''బర్హిసి స్రుగ్భ్యస్త్వా స్వాహా'' ఇతి ఆహ='ఓ దర్భా! నీవు వేదియం దుంచఁబడినదాన వగుచున్నావు. స్రుక్కులకొఱకు నిన్ను ప్రోక్షించుచున్నాను' అని అధ్వర్యుని వాక్యమునుగా మంత్రము చెప్పినది. బర్హిః=బర్హిస్సు, ప్రజా వై=ప్రజాస్వరూపమే. స్రుచః=స్రుక్కులు, యజమానాః=యజమానస్వరూపములు. (అతః=ఈ కారణమువలన, అయమ్=ఈ యధ్వర్యుఁడు, యజమానమేవ=యజమానునే, ప్రజాసు=ప్రజలయందు, ప్రతిష్ఠాపయతి=ప్రతిష్ఠింపఁ జేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : వేదిపైని బర్హిస్సును పఱచి, దానిపైని హోమసాధనములైన జుహ్వాది స్రుక్కుల నుంచుదురు కనుక పూర్వము వలెనే యిచటc గూడ ఈ బ్రాహ్మణము ఆధారత్వమును చూపినది. శేషము సుగమము.

5. మంత్రము : **దివే త్వాఽన్తరిక్షాయ త్వా పృథివ్యై త్వేతి బర్హిరాసాద్య ప్రోక్షతి । ఏభ్య ఏవైనల్లోకేభ్యః ప్రోక్షతి ।**

అర్థము : ''దివే త్వాఽన్తరిక్షాయ త్వా పృథివ్యై త్వా'' ఇతి='ఓ బర్హిస్సూ! ద్యులోకముకొఱకు, అంతరిక్షము కొఱకు, పృథివికొఱకును నిన్ను ప్రోక్షించుచున్నాను' అను మంత్రముచేత, బర్హిః ఆసాద్య=వేదియందు బర్హిస్సును పఱచి, ప్రోక్షతి=ప్రోక్షించవలెను. ఏభ్యః లోకేభ్యః ఏవ=ఈ ద్యౌరాది లోకములకొఱకే, ఏనత్=ఈ బర్హిస్సును, ప్రోక్షించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : బర్హిస్సునందే లోకత్రయమును భావనచేసి యీ బ్రాహ్మణము ప్రోక్షణమునకు లోకార్థత్వమును చెప్పినది. వేదిమధ్యమందు ముడికెదుట బర్హిస్సును పఱచి 'దివే త్వా' అను మంత్రభాగమును పఠించుచు బర్హిరగ్రభాగమును, 'అన్తరిక్షాయ త్వా' అని పఠించుచు బర్హిర్మధ్యభాగమును, 'పృథివ్యై త్వా' అని పఠించుచు మూలభాగమును ప్రోక్షించవలెనని ''అన్తర్వేది పురోగ్రన్థి'' ఇత్యాది కల్పసూత్రము చెప్పినది.

6. మంత్రము : **అథ తతః సహస్రుచా పురస్తాత్ప్రత్యఞ్చం గ్రన్థిం ప్రత్యుక్షతి । ప్రజా వై బర్హిః । యథా సూత్యై కాల ఆపః పురస్తాద్యన్తి (3) । తాదృగేవ తత్ ।**

అర్థము : అథ=అగ్రాదిత్రయ ప్రోక్షణానంతరము, తతః=పఱచcబడిన బర్హిస్సునకు, పురస్తాత్=పురోభాగమున, స్రుచా సహ=స్రుక్కుతోcగూడ, గ్రన్థిం ప్రతి=గ్రంథినిగూర్చి, ప్రత్యఞ్చమ్=అడ్డముగా, ఉక్షతి=ఉదకమును చల్ల వలెను. బర్హిః=బర్హిస్సు, ప్రజా వై=ప్రజయే, యథా=ఏ విధముగ, సూత్యైకాలే=ప్రసూతికాలమందు, ఆపః=ఉదకములు, పురస్తాత్=పురోభాగమున, యన్తి=పోవుచున్నవో, తత్=ఆ యుదకసేచనము, తాదృగేవ=అటువంటిదే.

తాత్పర్యము : బర్హిరగ్రాదిత్రయ ప్రోక్షణానంతరము ప్రోక్షణశేషమైన యుదకమును స్వయముగ హస్తమునం దుంచిన ప్రోక్షణపాత్రముతోcగూడ బర్హిస్సునకు పురోభాగమునందు హస్తమును చాచి ప్రత్యక్కుగా (అడ్డముగా) చేల్లవలెను. ఏ విధముగ లోకమునందు మనుష్యులకుcగాని, పశువులకుcగాని ప్రసూతికాలమునందు ప్రథమమున నీరు వెలువడునో, ఆ ప్రోక్షణ మటువంటిదే. ఇచట ప్రోక్షణము విధించcబడినది.

7. మంత్రము : **స్వధా పితృభ్య ఇత్యాహ। స్వధాకారో హి పితౄణామ్ । ఊర్జ్వ బర్హిషద్భ్య ఇతి దక్షిణాయై శ్రోణేరుత్తరస్యై నినయతి సంతత్యై । మాసా వై పితరో బర్హిషదః । మాసానేవ ప్రీణాతి । మాసా వా ఓషధీర్వర్ధయన్తి । మాసాः పచన్తి సమృద్ధ్యై । అనతిస్యన్దన్హ పర్జన్యో వర్షతి । యత్రైతదేవం క్రియతే (4) । ఊర్జా పృథివీం గచ్ఛతేత్యాహ। పృథివ్యామేవోర్జం దధాతి । తస్మాత్పృథివ్యా ఊర్జా భుఞ్జతే ।**

అర్థము : ''స్వధా పిత్భ్యఃయ'' ఇతి ఆహ='ఓ జలమా! నీవు పితృదేవతలకొఱకు నాచే ఈయఁబడినదాన వగుచున్నావు' అని యీ మంత్రము చెప్పినది. స్వధాకారఃయ=స్వధాకారము (స్వధా శబ్దము నుచ్చరించుట.) పిత్నామ్=పితృ దేవతలకొఱకు, హి=ప్రియమైనది కదా! ''ఊర్గ్భవ బర్హిషద్భ్యఃయ'' ఇతి='బర్హిస్సునందు ఉన్నటువంటి పితృదేవతలకొఱకు రసరూపము కమ్ము' అను మంత్రభాగముచే, దక్షిణాయై శ్రోణేః=వేదియొక్క దక్షిణపుటంచునుండి, ఉత్తరస్యై=ఉత్తరపుటంచువఱకు, నినయతి=ప్రోక్షణశేషోదకమును పోయవలెను. ఏతత్=ఈ నినయనము, సంతత్యై=యజమానునకు అవిచ్ఛిన్నసంతతికొఱకు, భవతి=అగుచున్నది. బర్హిషదఃయ పితరఃయ= బర్హిస్సునందుఁగల పితృదేవతలు, మాసాఃయ వై=మాసాభిమానిదేవతలే. అతఃయ=ఈ కారణమువలన, మాసానేవ=మాసాభిమానిదేవతలనే, ప్రీణాతి=సంతోషపరచినవాఁడగుచున్నాఁడు. తదా=అప్పుడు, మాసాఃయ వై=అభిమంతవ్య కాలాత్మక మాసములే, ఓషధీఃయ=ఓషధులను, వర్ధయన్తి=వృద్ధినొందించుచున్నవి.

మాసాఃయ=ఆ యభిమంతవ్య కాలాత్మక మాసములు, సమృద్ధ్యై పచన్తి=సమృద్ధముగ ఫలమును సంపాదించుచున్నవి. యత్ర ఏవం క్రియతే=ఏ ప్రదేశమునం దీ విధముగ జేయఁబడుచున్నదో, తత్ర=ఆ దేశమునందు, పర్జన్యఃయ=పర్జన్యదేవుఁడు, అనతిస్కన్దన్ వర్షతి హ=అత్యధికముగ వర్షించనివాఁడగుచు, యథోచితముగ వర్షించుచున్నాఁడు. ''ఊర్జా పృథివీం గచ్ఛత'' ఇతి ఆహ='ఓ జలావయవములారా! భవదీయమైన ఉద్భూత రసరూపముచే పృథివిని పొందుఁడు' అని యధ్వర్యుని వాక్యముగ ఈ మంత్రభాగము చెప్పినది. (తేన=దానిచే, అధ్వర్యుఃయ=అధ్వర్యుఁడు,) పృథివ్యామేవ=పృథివియందే, ఊర్జమ్=ఉదకరసమును, దధాతి=స్థాపించినవాఁడగుచున్నాఁడు. తస్మాత్=ఆ కారణమువలన, పృథివ్యాఃయ ఊర్జా=పృథివీజన్యమైన యన్నరసముచే, భుఞ్జతే=జనులు భోగములను సంపాదించుచున్నారు.

తాత్పర్యము : 'స్వధాకారఃయ పితృణాం ప్రియఃయ' అను నర్థము వాజసనేయులకు ప్రసిద్ధ మైనది. ''దేవా ఉపజీవన్తి స్వాహాకారం చ వషట్కారం చ హన్తకారం మనుష్యాఃయ స్వధాకారం పితరఃయ'' అని శ్రుతి. దేవతలు స్వాహాకారమును, వషట్కారమును, మనుష్యులు హంతకారమును, పితృదేవతలు స్వధాకారమును ఆశ్రయించి జీవించుచున్నారని యర్థము. 'దేవేభ్యఃయ స్వాహా, దేవేభ్యఃయ వషట్'అని దేవతలకు హవిరాదుల నొసఁగినచో వారు దానిచేత జీవింతురు. 'పిత్భ్యఃయ స్వధా' అని పితృదేవతల కన్నము నొసఁగినచో వారు దానిచే జీవింతురు. 'హన్త' అని మనుష్యుల కన్నము నొసఁగినచో వారు దానిచే తృప్తిపడుదురు. హన్తకారము=అతిథికి పెట్టవలసిన యన్నము. స్వాహాకారము=స్వాహాశబ్దము నుచ్చరించుట.

వేదికి దక్షిణశ్రోణినుండి ఉత్తరశ్రోణివఱకు ప్రోక్షణశేషోదకమును పోయుటచే యజమానునకు అవిచ్ఛిన్నమైన సంతతి కలుగును. మాసాభిమానిదేవతలే బర్హిస్సునందలి పితృదేవతలు కనుక, వారికి ప్రీతి కలుగఁగా అభిమంతవ్య కాలాత్మక మాసములు ఓషధులను వృద్ధినొందించి ఫలమును సంపాదించుచున్నవి. తత్ఫలసంపాదనమువలన అన్నసమృద్ధి కలుగుచున్నది. ఏ దేశమునం దీ యుదకనినయన మీ విధముగ చేయఁబడునో, ఆ దేశమునందు పర్జన్యఁడతివృష్టిచే సస్యమును నశింపఁజేయక కాలానుగుణముగను, యథోచితముగను వర్షించును. ఉదకరసము పృథివిగత మగుటవలన పృథివీజన్యమైన యన్నరసముచే జనులు భోగమును సంపాదించుచున్నారు.

8. మంత్రము : **గ్రన్థిం విస్రగ్ంసయతి । ప్రజనయత్యేవతత్ ।**

అర్థము : గ్రన్థిమ్=దర్భ ముడిని, విస్రంసయతి=విడదీయవలెను. తత్=ఆ బర్హిస్సును, ప్రజనయత్యేవ=ఉత్పన్నము చేసినవాడే యగుచున్నాడు.

తాత్పర్యము : వేదిమధ్యమునందుగల దర్భముడిని విడదీయవలెను. అప్పు డా యధ్వర్యుడు బర్హిస్సు నుత్పన్నము చేసినవాడే యగును. బంధనరూపమైన పల్లమునందుగల బర్హిస్సునకు విస్రంసనమే యుత్పాదనము. ఇచట గ్రంథిశైథిల్యము విధించబడినది.

9. మంత్రము : **ఊర్ధ్వం ప్రాఞ్చముద్యూధం ప్రత్యఞ్చ మాయచ్ఛతి । తస్మాత్ప్రాచీనగ్ం రేతో ధీయతే । ప్రతీచీః ప్రజా జాయన్తే ।**

అర్థము : ఊర్ధ్వమ్=ఊర్ధ్వముగ, ప్రాఞ్చమ్ ఉద్యూధమ్=ప్రాఙ్ముఖముగ కూర్చంబడినదైన (గూఢమైన) గ్రంథియొక్క యగ్రమును, ప్రత్యఞ్చమ్=ప్రత్యఙ్ముఖముగ, ఆయచ్ఛతి=లాగవలెను. తస్మాత్=ఆ కారణమువలన, రేతః=రేతస్సు, ప్రాచీనమ్=ప్రాఙ్ముఖముగ, ధీయతే=ఉంచబడుచున్నది. ప్రజాః=ప్రజలు (సంతానము) ప్రతీచీః=ప్రత్యఙ్ముఖులుగా, జాయన్తే=పుట్టుచున్నారు.

తాత్పర్యము : ఊర్ధ్వముగ ప్రాఙ్ముఖముగ కట్టబడిన దర్భగ్రంథియొక్క యగ్రభాగమును ప్రత్యఙ్ముఖముగ లాగవలెను. ఆ కారణమువలన లోకమునందు ప్రాఙ్ముఖముగరేతస్సు యోనియందుంచబడుచున్నది. ప్రత్యఙ్ముఖముగ ప్రజలు పుట్టుచున్నారు. శిథిలమైన గ్రంథియొక్క విమోచన మిచట విహితమైనది.

10. మంత్రము :**విష్ణోః స్తూపోఽసీత్యాహ । యజ్ఞో వై విష్ణుః (5) । యజ్ఞస్య ధృత్యై ।**

అర్థము : ''విష్ణోః స్తూపోఽసి''ఇతి ఆహ='ఓ ప్రస్తరమా! నీవు వ్యాప్తియైన యజ్ఞమునకు సంఘాతరూప ధారకమగుచున్నావు' అనిమంత్రము చెప్పినది. యజ్ఞః=యజ్ఞము, విష్ణుః వై=సర్వవ్యాపియైన విష్ణుస్వరూపమే. ఏషః= ఈ ప్రస్తరము, యజ్ఞస్య ధృత్యై=యజ్ఞముయొక్క ధారణముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ప్రస్తరము యజ్ఞమునకు ధారకమని యీ బ్రాహ్మణము తెలియజేసినది. అనేక యజ్ఞాంగములతోగూడియుండుటచే యజ్ఞము విస్తృతమైనది. విష్ణువు సర్వవ్యాపి కనుక యజ్ఞము విష్ణుస్వరూపముగ నిచట వర్ణించబడినది.

11. మంత్రము :**పురస్తాత్ప్రస్తరం గృహ్ణాతి । ముఖ్యమేవైనం కరోతి ।**

అర్థము : పురస్తాత్=వేదికి పూర్వభాగమున, ప్రస్తరణమ్=ప్రస్తరమును, గృహ్ణాతి=గ్రహించవలెను. ఏనమ్=ఈ ప్రస్తరమును, ముఖ్యమేవ=ముఖ్యమైనదానినిగానే, కరోతి=చేయుచున్నవాడగుచున్నాడు.

తాత్పర్యము : వేదికి పూర్వభాగమున బ్రహ్మకాని, యజమానుడు కాని ప్రస్తరమును పట్టుకొనవలెను. ఆ ధారణముచే ఈ ప్రస్తరమును ముఖ్యమునుగానే చేసినవాడగుచున్నాడు. ఇచట ప్రస్తరధారణము విహితమైనది.

12. మంత్రము :**ఇయ॑న్తం గృహ్ణాతి । ప్ర॒జాప॑తినా యజ్ఞ॒ముఖే॑న సంమి॑తమ్ ।**

అర్థము : ఇయన్తమ్=ఈ మాత్రమైన, ప్రజాపతినా=ప్రజాపతిరూపమైన, యజ్ఞముఖేన=యజ్ఞముఖముతో, సంమితమ్=సమానమైన ప్రస్తరమును, గృహ్ణాతి=గ్రహించవలెను.

తాత్పర్యము : 'ఇయన్తమ్' అని యుండుటచే వేదిఖననవాక్యమునందువలె ఈ యభినయము ప్రాదేశమాత్రపరముగ గ్రహించఁదగినది. అనఁగా ముఖసమానమైన ఎత్తుగా హస్తముచే ప్రస్తరమును గ్రహించవలెను. ఈ బ్రాహ్మణము ప్రస్తరధారణమునకై ముఖసమానమైన యౌన్నత్యమును హస్తముచే నభినయించి విధించినది.

13. మంత్రము :**ఇయ॑న్తం గృహ్ణాతి । య॒జ్ఞప॑రుష్టా సంమి॑తమ్ । ఇయ॑న్తం గృహ్ణాతి । ఏ॒తావ॒ద్వై పు॑రు॒షే వీ॒ర్యమ్ ।**

వీ॒ర్యసంమితమ్ (6) ।

అర్థము : ఇయన్తం గృహ్ణాతి=ఈ మాత్రము ఉన్నతముగ గృహ్ణాతి=ప్రస్తరమును హస్తముతో గ్రహించవలెను. యజ్ఞపరుషా సంమితమ్=ఆ యౌన్నత్యము యజ్ఞపర్వముతో సమానమైనది. ఏతావత్ వై=ఈ మాత్రమే, పురుషే=పురుషునియందు, వీర్యమ్=సామర్థ్యము, భవతి=ఉంటున్నది. ఇయన్తమ్=ఈ మాత్రమును, గృహ్ణాతి=గ్రహించవలెను. ఏతత్=ఇది, వీర్యసంమితమ్= పురుష సామర్థ్యముతో సమానమైనది.

తాత్పర్యము : పరువనఁగా పర్వము (గనుపు). అది యజ్ఞపురుషునియొక్క హస్తకూర్పరములకు ఉభయభాగములందును ప్రాదేశమాత్ర మగును. చాచఁబడిన అంగుష్ఠకనిష్ఠికల ప్రేల్లయం దెంతమధ్యభాగ ముండునో ఆ మాత్రమే పురుషునియందు సామర్థ్య ముండును. హానోపాదానాదృశేషవ్యాపారము లచటనే నిష్పన్నము లగును. పైని చెప్పఁబడినదియే యిచట అనువదించి ప్రశంసించఁబడినది. కూర్పరము=మోచేయి. హానము=విడుచుట, ఉపాదానము=ప్రతిగ్రహించుట.

14. మంత్రము :**అప॑రిమితం గృహ్ణాతి । అప॑రిమితస్యా॒వరు॑ద్ధ్యై ।**

అర్థము : అపరిమితం గృహ్ణాతి=పరిమితము కానట్టి యున్నతముగ, గృహ్ణాతి=ప్రస్తరమును గ్రహించవలెను. ఏతత్=ఈ యపరిమితోన్నముగ గ్రహించుట, అపరిమితస్య=అపరిమిత ఫలముయొక్క, అవరుద్ధ్యై=ప్రాప్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఎంత ఉన్నతముగ గ్రహించినచో తనకు సౌకర్య ముండునో, ఆ మాత్రము ఉన్నతముగ ప్రస్తరమును పట్టుకొనవలెను. ఇచట పక్షాంతరము విధించఁబడినది.

15. మంత్రము :**తస్మి॑న్పవి॒త్రే అపి॑సృజతి । య॒జమా॑నో వై ప్ర॒స్త॒రః । ప్రా॒ణాపా॒నౌ ప॒వి॒త్రే । య॒జమా॑న ఏ॒వ ప్రా॒ణాపా॒నౌ ద॑ధాతి ।**

అర్థము : తస్మిన్=ఆ ప్రస్తరమునందు, పవిత్రే=ఉత్పవన హేతువులైన పవిత్రములను, అపిసృజతి=విడువవలెను (ఉంచవలెను). ప్రస్తరః=ప్రస్తరము, యజమానః వై=యజమానస్వరూపమే. పవిత్రే=పవిత్రములు,

ప్రాణాపానౌ = ప్రాణాపాన స్వరూపములు. తథా సతి=అట్లు కాఁగా, యజమానే ఏవ=యజమానుని యందే, ప్రాణాపానౌ = ప్రాణాపానములను, దధాతి=స్థాపించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ఉత్పవనహేతువులైన దర్భపవిత్రముల నా ప్రస్తరమం దుంచవలెను. యజమానునివలె యజ్ఞసిద్ధిహేతు వగుటచే ప్రస్తరము యజమాన స్వరూపమే యగును. పవిత్రములు ప్రాణాపాన స్వరూపములు (ప్రాణాపానముల వంటివి). కనుక ప్రస్తరమునందు ప్రవిత్రముల నుంచిన యధ్వర్యుఁడు యజమానునియందే ప్రాణాపానములను స్థాపించినవాఁ డగును. ప్రస్తరము యజమానునివలె యజ్ఞసిద్ధిహేతు వగుటచే ప్రస్తరమునకు యజమానాభేదోపచారము చేయఁబడినది.

16. మంత్రము :**ఊర్ణామ్రదసం త్వా స్తృణామీత్యాహ। యథాయజురేవైతత్ । స్వాసస్థం దేవేభ్య ఇత్యాహ। దేవేభ్య ఏవైనత్స్వాసస్థం కరోతి (7)।**

అర్థము : ''ఊర్ణామ్రదసం త్వా స్తృణామి'' ఇతి ఆహ = 'ఓ దేవబర్హిస్సూ! కంబమువలె మృదువైన నిన్నువేదియందు పఱచుచున్నానని' యధ్వర్యుని వాక్యముగా మంత్రము చెప్పినది. ఏతత్ యథాయజుః ఏవ=ఇది మంత్రమున కనుగుణ మైనదే. ''స్వాసస్థం దేవేభ్యః'' ఇతి ఆహ = 'ఈ బర్హిస్సు దేవతలు సుఖముగ కూర్చుండుటకు స్థానరూపమైనదని' మంత్రము చెప్పినది. ఏతత్ = ఈ దేవబర్హిస్సును, దేవేభ్యః ఏవ = దేవతలకొఱకే, స్వాసస్థమ్ = సుఖముగ కూర్చుండుటకు స్థానమునుగా, కరోతి = అధ్వర్యుఁడు చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : స్పష్టము. ''బర్హిర్వేద్యాగ్ం స్తృణాతి దేవబర్హిః'' అను శాఖాంతర పాఠము ననుసరించి 'దేవబర్హిః' అను పద మిచట పూరింపఁబడినది.

17. మంత్రము :**బర్హిః స్తృణాతి । ప్రజా వై బర్హిః । పృథివీ వేదిః । ప్రజా ఏవ పృథివ్యాం ప్రతిష్ఠాపయతి ।**

అర్థము : బర్హిః = బర్హిస్సును, స్తృణాతి = వేదియందు పఱచవలెను. బర్హిః = బర్హిస్సు, ప్రజా వై = ప్రజాస్వరూపమే. వేదిః = వేది, పృథివీ = పృథివీరూపము. అయమ్ = వేదియందు బర్హిస్సును పరచిన యీ యధ్వర్యుఁడు, ప్రజాః ఏవ = ప్రజలనే, పృథివ్యామ్ = పృథివియందు, ప్రతిష్ఠాపయతి = ప్రతిష్ఠింపజేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ఇచట బర్హిస్సు ప్రజగాను, వేది పృథివిగాను రూపకమున వర్ణింపఁబడుటచే వేదియందు బర్హిస్సును పఱచిన యధ్వర్యుఁడు పృథివియందు ప్రజలనే ప్రతిష్ఠింపఁజేసినవాఁ డగుచున్నాఁడు. ఇచట బర్హిరాస్తరణము విధించఁబడినది.

18. మంత్రము :**అనతిదృశ్నగ్ం స్తృణాతి । ప్రజయైవైనం పశుభి రనతిదృశ్నం కరోతి ।**

అర్థము : అనతిదృశ్నమ్ = భూమిస్వరూపము కనుపించనివిధముగ, స్తృణాతి = బర్హిస్సును పఱచవలెను. ప్రజయా = ప్రజచేతను, పశుభిః = పశువులచేతను, ఆవృతమ్ ఏనమ్ = ఈ యజమానుని, అనతిదృశ్నమేవ కరోతి = అధ్వర్యుఁడు వైదేశికులచే కనఁబడనివానినిగానే చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : వేదియందు బర్హిస్సును భూమి కనుపించనంతటి దట్టముగా పఱచవలెను. ఈ విధముగ బర్హిస్సును పఱుచుటవలన బహుప్రజాపశ్వావృతుఁడైన యజమానుఁడు కూడ వైదేశికులచే చూడఁబడని ప్రభువగును. ఇచట బర్హిరాస్తరణమునందు విశేషము విధించఁబడినది.

19. మంత్రము :**ధారయన్ప్రస్తరం పరిధీన్పరిదధాతి । యజమానో వై ప్రస్తరః యజమాన ఏవ తత్స్వయం పరిధీన్పరిదధాతి । గన్ధర్వోఽసి విశ్వావసురిత్యాహ(8) । విశ్వమేవాऽకయు ర్యజమానే దధాతి । ఇన్ద్రస్య బాహూరసి దక్షిణ ఇత్యాహ। ఇన్ద్రియమేవ యజమానే దధాతి । మిత్రావరుణౌ త్వోత్తరతః పరిధత్తామిత్యాహ। ప్రాణాపానౌ మిత్రావరుణౌ । ప్రాణాపానావేవాస్మి న్దధాతి ।**

అర్థము : ప్రస్తరమ్=ప్రస్తరమును, ధారయన్=ధరించినవాఁ డగుచు, పరిధీన్=పరిధులను, పరిదధాతి=వేదియం దంతటను ఉంచవలెను. ప్రస్తరః=ప్రస్తరము, యజమానః వై=యజమానస్వరూపమే. తత్=ఆ కారణము వలన, అయమ్=పరిధిలనుంచిన యీ యధ్వర్యుఁడు, యజమానే ఏవ=యజమానునియందే, పరిధీన్=పరిధులను, పరిదధాతి=అంతటను ఉంచినవాఁ డగుచున్నాఁడు. ''గన్ధర్వోఽసి విశ్వావసుః'' ఇతి ఆహ='ఓ మధ్యమ పరిధీ నీవు విశ్వావసు నామక గంధర్వుఁడ వగుచున్నావు' అని మంత్రము చెప్పినది. అయమ్='గంధర్వోఽసీ'త్యాది మంత్రభాగమును పఠించుచు మధ్యమపరిధి నుంచిన యీ యధ్వర్యుఁడు, యజమానే=యజమానునియందు, విశ్వమ్ ఆయురేవ=సమస్తమైన ఆయువునే, దధాతి=స్థాపించినవాఁ డగుచున్నాఁడు. ''ఇన్ద్రస్య బాహూరసి దక్షిణః'' ఇతి ఆహ='ఓ దక్షిణపరిధీ! నీవు ఇంద్రునకు దక్షిణ (కుడి) బాహు వగుచున్నావు' అని మంత్రము అధ్వర్యుని వాక్కుగా చెప్పినది. తత్=ఆ కారణమువలన, అయమ్=ఈ యధ్వర్యుఁడు, యజమానే=యజమానునియందు, ఇన్ద్రియమేవ=సామర్థ్యమునే, దధాతి=స్థాపించినవాఁ డగుచున్నాఁడు. ''మిత్రావరణౌ త్వోత్తరతః పరిధత్తామ్'' ఇతి ఆహ='ఓ ఉత్తరపరిధీ! మిత్రావరుణదేవతలు నిన్ను ఉత్తరభాగమున ఉంచుదురు గాక' అని మంత్రము అధ్వర్యునివాక్కుగా చెప్పినది. మిత్రావరుణౌ=మిత్రావరుణులు, ప్రాణాపానౌ=ప్రాణాపాన స్వరూపులు. అతః=ఈ కారణమువలన, అయమ్=ఈ యధ్వర్యుఁడు, అస్మిన్=ఈ యజమానునియందు, ప్రాణాపానావేవ=ప్రాణాపానములనే, దధాతి=స్థాపించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : పరిధి యనఁగా యజ్ఞార్హమైన మేడిచెట్టునకు సంబంధించినపుల్ల. పరితః దధాతీతి=పుష్ణాతీతి పరిధిః. హోమాగ్నికి రక్షకముగా నాల్గువైపులందు పఱచఁబడి యుండును. అధ్వర్యుఁడు ప్రస్తరమును ధరించి మూఁడు పరిధులనువేదియందు పఱచవలెను. ''గన్ధర్వోఽసి విశ్వావసు'' రిత్యాది మంత్రము మూఁడు భాగములుగా నున్నది. ''గన్ధర్వోఽసి విశ్వావసుః .....పరిధిరిడ ఈడితః'' అను ప్రథమ భాగమును పఠించుచు ఆ పఱచఁబడిన మూఁడు పరిధులలో మధ్యమపరిధిని సంబోధించవలెను. ''ఇన్ద్రస్య బాహూరసి... ఈడితః'' అను ద్వితీయ భాగమును పఠించుచు దక్షిణపరిధిని సంబోధించవలెను. ''మిత్రావరుణౌ.....ఈడితః'' అను తృతీయ భాగమును పఠించుచు ఉత్తరపరిధిని సంబోధించవలెను. ఇచట విధిపూర్వకముగ ఈ బ్రాహ్మణము గన్ధర్వోసీత్యాది మంత్రమును వ్యాఖ్యానించినది.

20. మంత్రము :సూర్యస్త్వా పురస్తాత్పాత్విత్యాహ। రక్షసామపహత్యై । కస్యాశ్చిదభిశస్త్యా ఇత్యాహ। అపరిమితాదేవైనం పాతి (9)।

అర్థము : ''సూర్యస్త్వా పురస్తాత్పాతు'' ఇతి ఆహ = 'ఓ యాహవనీయాగ్నీ! సూర్యుడు తూర్పుదిక్కునుండి నిన్ను ప్రతియొక హింసనుండియు రక్షించుగాక' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ఏతత్ = ఈ కథనము, రక్షసామ్ = రాక్షసులయొక్క, అపహత్యై = నాశముకొఱకు, భవతి = అగుచున్నది. ''కస్యాశ్చిదభిశస్త్యా ఃఇతి ఆహ = ఏ యొకహింసనుండి నిన్ను రక్షించునని మంత్రము చెప్పినది. అపరిమితాదేవ = సమస్తమైన హింసనుండియే, ఏనమ్ = ఈ యగ్నిని, పాతి = సూర్యుడు రక్షించును.

తాత్పర్యము : ఓ యగ్నీ! సూర్యుడు తూర్పుదిక్కునుండి నిన్ను సమస్తమైన హింసనుండి రక్షించు నను నభిప్రాయముతో ఈ బ్రాహ్మణము పై మంత్రమును వ్యాఖ్యానించినది.

21. మంత్రము :వీతిహోత్రం వా కవ ఇత్యాహ। అగ్నిమేవ హోత్రేణ సమర్ధయతి । ద్యుమన్తగ్ం సమిధీమహీత్యాహ సమిద్ధ్యై । అగ్నే బృహన్తమధ్వర ఇత్యాహ వృద్ధ్యై ।

అర్థము : ''వీతిహోత్రం త్వా కవే'' ఇతి ఆహ = 'విద్వాంసుడవైన ఓ యగ్నీ! సమృద్ధి (వ్యాప్తి) కొఱకు హోమము కల నిన్ను ప్రజ్వలింపజేయుచున్నామని' అధ్వర్యుని వాక్కుగా వేదము చెప్పినది. హోత్రేణ = హోమముచే, అగ్నిమేవ = అగ్నినే, సమర్ధయతి = సమృద్ధునిగాc జేసినవాc డగుచున్నాడు. ''ద్యుమన్తం సమిధీమహి'' ఇతి ఆహ = 'ఓ విద్వన్నగ్నీ! ప్రకాశించుచున్న నిన్ను ప్రజ్వలింపజేయు చున్నామని' ఆ మంత్రమునందలి రెండవభాగము చెప్పినది. ఏతత్ = ఇది, సమిద్ధ్యై = బాగుగ జ్వలించుటకై, భవతి = అగుచున్నది. ''అగ్నేబృహన్త మధ్వరే'' ఇతి ఆహ = ఓయగ్నీ! గొప్పవాడవైన నిన్ను యాగము నిమిత్తము ప్రజ్వలింపజేయు చున్నామని మంత్రము యొక్క మూడవ భాగము చెప్పినది. ఏతత్ = ఇది, వృద్ధ్యై = వృద్ధి కొఱకు, భవతి = అగుచున్నది.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము ''వీతిహోత్రం త్వా'' ఇత్యాది మంత్రముయొక్క మూడు భాగములకు ప్రయోజనములను తెలియజేసినది.

22. మంత్రము :విశో యన్త్రే స్థ ఇత్యాహ। విశాం యత్యై ।

అర్థము : ''విశో యన్త్రే స్థః''ఇతి ఆహ = 'ఓ దర్భరూప విధృతులారా! మీరు ప్రజలకు నియామకము లగుచున్నారు' అని అధ్వర్యుని వాక్కుగా మంత్రము చెప్పినది. ఏతత్ = ఈ కథనము, విశామ్ = ప్రజలయొక్క, యత్యై = నియతికొఱకు, భవతి = అగుచున్నది.

తాత్పర్యము : వేదియందు పఱచెడి రెండు దర్భలకు విధృతులని పేరు. విశేషేణ ధారణమ్ = ప్రస్తరాదీనాం ధారణం యస్మిన్నితి విధృతిః అని వ్యుత్పత్తి. ప్రస్తరాదులధారణము కలవని యర్థము. ఈ విధృతులైన రెండు దర్భలను

ప్రజలనియామకములు కండని యధ్వర్యుఁడు కోరుచున్నాఁడు. కనుక యీ ప్రార్థన ప్రజల నియమనము కొఱకగును.

23. మంత్రము :**ఉదీచీనాగ్రే నిదధాతి ప్రతిష్ఠిత్యై ।**

అర్థము : ఉదీచీనాగ్రే=విధృతులైన దర్భలను ఉత్తరపుకొనలు కలవిగా, నిదధాతి=వేదియందు ఉంచవలెను. ఏతత్=ఈ విధృతిస్థాపనము, ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఇచట విధృతిస్థాపనము విధించఁబడినది. ఈ విధృతిస్థాపనము ప్రతిష్ఠకొఱ కగును.

24. మంత్రము :**వసూనాగ్ం రుద్రాణా మాదిత్యానాగ్ం సదసి సీదేత్యాహ। దేవతానామేవ సదనే ప్రస్తరగ్ం సాదయతి ।**

అర్థము : ''వసూనాగ్ం రుద్రాణా మాదిత్యానాగ్ం సదసి సీద'' ఇతి ఆహ='ఓ ప్రస్తరమా! నీవు వసు రుద్రాదిత్యులకు స్థానమైన విధృతిద్వయమునం దుపవసింపుము'' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. (అయమ్=ఈ యధ్వర్యుఁడు,) దేవతానామ్=దేవతలయొక్క, సదనే ఏవ=సదనమునందే, సాదయతి=ప్రస్తరము నుంచివాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : అధ్వర్యుఁడు వసురుద్రాదిత్యులకు స్థానమైన విధృతిద్వయమునందు ప్రస్తరము నుపవసించుమని చెప్పుటచే దేవతల సదనమునందే ప్రస్తరము నుంచినవాఁ డగుచున్నాఁడు. విధృతిద్వయమే సదనమనెడి అభిప్రాయముతో బ్రాహ్మణము నీ మంత్రమును వ్యాఖ్యానించినది.

25. మంత్రము :**జుహూరసి ఘృతాచీ నామ్నేత్యాహ(10)। అసౌ వై జుహూః। అన్తరిక్ష ముపభృత్। పృథివీ ధ్రువా।**

తాసామేతదేవ ప్రియం నామ। యద్ఘృతాచీతి। యద్ఘృతాచీత్యాహ। ప్రియేణైవైనా నామ్నా సాదయతి ।

అర్థము : ''జుహూరసి ఘృతాచీ నామ్నా'' ఇతి ఆహ='ఓ జుహూ! నీవు పేరుచే జుహువగుచున్నావు. ప్రియమైన నామముచే ఘృతాచి వగుచున్నావు' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. అసౌ వై=దివియే, జుహూఃజుహువు. అన్తరిక్షమ్=అంతరిక్షము, ఉపభృత్=ఉపభృత్తు. పృథివీ=పృథివి, ధ్రువా=ధ్రువ. ఘృతాచి యత్=ఘృతాచియను పేరు ఏది కలదో, ఏతదేవ=ఈ ఘృతాచి యను నామమే, తాసామ్=ఆ జుహూ ప్రభృద్ధ్రువలకు, ప్రియం నామ=ఇష్టమైన నామము. ''యద్ఘృతాచీ'' ఇతి ఆహ='ఘృతాచి'యని చెప్పుటవలన, అధ్వర్యుఃఅధ్వర్యుఁడు, ఏనాఃఈ జుహూపభృద్ధ్రువలను, ప్రియేణ నామ్నైవ=ప్రియమైన పేరుతోనే, సాదయతి=విధృతిద్వయమునం దుంచినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : జుహువు, ఉపభృత్తు, ధ్రువ- అను హోమసాధనపాత్రములకు జుహ్వాదినామములు సాధారణము లైనవి. అవి ఘృతముతో నిండియుండుటచే 'ఘృతాచి' యను పేరు వానికి ప్రియ మైనది. ఘృతమ్=ఆజ్యమ్, అఞ్చతి=ప్రాప్నోతీతి ఘృతాచీ యను వ్యుత్పత్తిచే ఘృతమును పొందునది యను నర్థ మేర్పడుచున్నది. అందువలన జుహూపభృద్ధ్రువ పాత్రములు తమకు ప్రియమైన విధృతి స్థానమునం దుండవలసినదిగా ప్రార్థించఁబడినవి.

26. మంత్రము : **ఏతా అసదన్త్సుకృతస్య లోక ఇత్యాహ। సత్యం వై సుకృతస్య లోకః । సత్య ఏవైనాः సుకృతస్య లోకే సాదయతి । తా విష్ణో పాహీత్యాహ। యజ్ఞో వై విష్ణుः యజ్ఞస్య ధృత్యై । పాహి యజ్ఞం పాహి యజ్ఞపతిం పాహి మాం యజ్ఞనియమిత్యాహ। యజ్ఞాయ యజమానాయా ऽऽత్మనే।**

తేభ్యఏవా ऽऽశిషమాశాస్తే ऽనార్త్యై (11)॥

స్థేత్యాహపృథివీ వేదిర్యన్తి క్రియతే విష్ణుర్వీర్యసంమితం కరోత్యాహ పాతి నామ్నేత్యాహ

లోకే సాదయతి షట్ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే షష్ఠోऽనువాకः ॥౬॥

అర్థము : ''ఏతా అసదన్త్సుకృతస్య లోకే'' ఇతి ఆహ = 'ఈ జుహూపభృద్ధువపాత్రములు పుణ్యమునకు స్థానమైన ప్రస్తరమునం దున్నవి' అని మంత్రము చెప్పినది. సత్యం వై = సత్యమే, పుణ్యస్య = పుణ్యమునకు, లోకः = స్థానము. (అతः = ఈ కారణమువలన, అయమ్ = ఈ యధ్వర్యుఁడు,) సుకృతస్య = పుణ్యమునకు, లోకే = స్థానమైన, సత్యే ఏవ = సత్యమునందే, ఏనాः = ఈ జుహ్వాది పాత్రములను, సాదయతి = ఉంచినవాఁడగుచున్నాఁడు. ''తా విష్ణో పాహి'' ఇతి ఆహ = 'ఓ విష్ణూ! ఆ జుహ్వాది పాత్రములను రక్షించుము' అని మంత్రము చెప్పినది. యజ్ఞः వై = యజ్ఞమే, విష్ణుः = విష్ణువు. ఏతత్ = ఈ జుహ్వాదులను రక్షించుమని విష్ణువును ప్రార్థించుట, యజ్ఞస్య ధృత్యై = యజ్ఞపురుషకర్తకమైన స్రుక్కుల పోషణమునకై, భవతి = అగుచున్నది.

''పాహి యజ్ఞం పాహి యజ్ఞపతిం పాహి మాం యజ్ఞనియమ్'' ఇతి ఆహ = 'ఓ విష్ణూ! యజ్ఞమును రక్షించుము. యజ్ఞకర్తను రక్షించుము. యజ్ఞమును చేయించుచున్న నన్ను (అధ్వర్యుని) రక్షించు'మని యధ్వర్యుని వాక్కుగా ఈ మంత్రభాగము చెప్పినది. అయమ్ = ఈ ప్రార్థించిన యధ్వర్యుఁడు, యజ్ఞాయ = యజ్ఞముకొఱకు, యజమానాయ = యజమానునికొఱకును, ఆత్మనే = తన (అధ్వర్యుని)కొఱకును, తేభ్యः = ఆ ముప్పురికొఱకే, ఆశిషమ్ = ఆశీస్సును, ఆశాస్తే = కోరినవాఁడగుచున్నాఁడు. ఏషా = ఈ యాశీస్సు, అనార్త్యై = ఆర్తి (దుఃఖము) లేకుండుటకై, భవతి = అగుచున్నది.

తాత్పర్యము : లోకమునందు అవశ్యంభావిఫలరూపముగ భావించఁబడిన ప్రస్తరమందు జుహ్వాదు లున్నవనెడి యర్థమునే యీ బ్రాహ్మణము తెలియఁజేసినది. తాత్పర్యము అర్థమునందే వివరించఁబడినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు
షష్ఠానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే సప్తమోఽనువాకః

1. మంత్రము : **అగ్నినా వై హోత్రా । దేవా అసురా నభ్యభవన్ । అగ్నయే సమిధ్యమానాయానుబ్రూహీత్యాహ భ్రాతృ వ్యాభిభూత్యై ।**

వేదార్థదీపిక

అవతారిక: పూర్వము ఇధ్మాబర్హిఃస్రుక్కులకు ప్రోక్షణాదికము చెప్పినపిమ్మట షష్ఠానువాకమునందు ఆజ్యహవిస్సుతో నిండియున్న స్రుక్కులకు వేదియం దాసాదనము విహిత మైనది. ఆ యాసాదనముచే పురోడాశ సాంనాయ్యములకుc గూడవేదియం దాసాదన ముపలక్షింపcబడుచున్నది. ఆ మంత్రము లచ్చిద్రకాండమునందు చూడcదగినవి. సర్వహవిస్సు లాసాదితములు కాcగా నగ్నియం దభ్యాహితములైన యిధ్మకాష్ఠములపైని హోమము చేయుటకై ఆఘారమంత్రములు సంహితయందలి ప్రథమకాండమునcగల ప్రథమ ప్రపాఠకస్థ ద్వాదశానువాకమునం దామ్నాతము లైనవి. ఆ మంత్రముల కీ సప్తమానువాకమునందు బ్రాహ్మణము చెప్పcబడుచున్నది. ఆ యాఘారార్థమంత్రముల కీ బ్రాహ్మణము వివరణాత్మక మని భావము.

అర్థము : హోత్రా=హోతయైన, అగ్నినా వై=అగ్నిచేతనే, దేవాఃదేవతలు, అసురాన్=రాక్షసులను, అభ్యభవన్=తిరస్కరించిరి (జయించిరి). ''హే హోతఃఓ హోతా! సమిధ్యమానాయ=బాగుగ జ్వలింపఁజేయcబడుచున్న, అగ్నయే=అగ్నికొఱకు, అనుబ్రూహి=అనురూపములైన మంత్రములను పఠించుము'' ఇతి=అను ఈప్రైషమంత్రమును, ఆహ=అధ్వర్యుcడు హోతనుగూర్చి పలుకవలెను. ఏతత్=ఈ మంత్రపఠనము, భ్రాతృవ్యాభిభూత్యై=శత్రువులను జయించుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : సంహితలోని ప్రథమకాండమునందలి భువనమసీత్యాది మంత్రము ద్వితీయాఘారశేష మగుటవలన, అమంత్రకమైన ప్రథమాఘారము పూర్వ మనుష్ఠేయము కనుక ఆ యాఘారమును విధింపcబోవుచు దానికంటె పూర్వము హోతను గూర్చి ప్రైషమంత్రమును వేదము ఉత్పాదించుచున్నది. 'ఓ హోతా! ఇధ్మకాష్ఠములచే సమిధ్యమానుcడైన యగ్ని కనురూపములైన మంత్రములను పఠించుము' అను ప్రైషమంత్రము నధ్వర్యుcడు హోతను గూర్చి పలుకవలెను. పూర్వము దేవతలు తమ యాగములందు వహ్నిని హోతనుగాc జేసి యా వహ్నిమూలమున అసురులను జయించిరి. ఈ కారణమువలన ఇప్పుడు కూడ వైరితిరస్కారమునకై సమంత్రకములైన కాష్ఠములచే నగ్నిని ప్రజ్వలితునిగాc జేయవలెను.

2. మంత్రము : **ఏకవిగ్ంశతి మిధ్మదారూణి భవన్తి । ఏకవిగ్ంశో వై పురుషః । పురుషస్యాప్త్యై ।**

అర్థము : ఏకవింశతిమ్=(ఇరువదియొక్క) ఏకవింశతి సంఖ్యాకములైన, ఇధ్మదారూణి=ఇధ్మరూపములైన దారువులు, భవన్తి=ఉండవలెను. పురుషఃపురుషుcడు, ఏకవింశఃవై=ఏకవింశసంఖ్యకలవాcడే. ఇయమ్=

ఇధ్మసంబంధిని యైన యీ యేకవింశసంఖ్య, పురుషస్య=పురుషుని యొక్క, ఆప్త్యై =ప్రాప్తికొఱకు, భవతి=అగుచున్నది. దారు=కొయ్య.

తాత్పర్యము : ఇచట బ్రాహ్మణము సంఖ్యావిశిష్టమైన యిధ్మమును విధించుచున్నది. ఏకవింశసంఖ్యాకములైన దారు రూపములైన యిధ్మము లుండవలెను. పురుషుఁడు పది హస్తములప్రేళ్లు (అంగుళులు), పది పాదముల ప్రేళ్లు, ఒక ఆత్మకలసి మొత్తము ఏకవింశతి సంఖ్యా కలవాఁడు. ఈ యేకవింశతిసంఖ్యాకములైన యిధ్మములు పురుషప్రాప్తి కగును.

3. మంత్రము : **పఞ్చదశేధ్మదారూణ్యభ్యాదధాతి । పఞ్చదశ వా అర్ధమాసస్య రాత్రయః । అర్ధమాసశః సంవత్సర ఆప్యతే ।**

అర్థము : పఞ్చదశ ఇధ్మదారూణి=దారుమయములైన పదునైదు ఇధ్మములను, అభ్యాదధాతి=అగ్నియం దంతట నుంచవలెను. అర్ధమాసస్య=అర్ధమాసమునకు, రాత్రయః=రాత్రులు, పఞ్చదశ వై=పదునైదే. అర్ధమాసశః= అర్ధమాసములవలన, సంవత్సరః=సంవత్సరము, ఆప్యతే=పొందఁబడుచున్నది.

తాత్పర్యము : పదునైదు దారుమయములైన యిధ్మముల నగ్నియందతట నుంచవలెను. ఎన్ని అర్ధమాసములవలన సంవత్సరము లభించుచున్నదనఁగా నిరువదినాలుగు అర్ధమాసములవలన సంవత్యరము లభించుచున్నదని యర్థము. ''హోత్రా ప్ర వో వాజా అభిద్యవః'' ఇత్యాదులైన సామిధేనీ సంజ్ఞక ఋక్కులను పఠించుచుండఁగా పదునైదు ఇధ్మకాష్ఠముల నగ్నియం దుంచవలెనని యీ బ్రాహ్మణము పంచదశేధ్మకాష్ఠ ప్రక్షేపణమును విధించినది.

4. మంత్రము : **త్రీన్పరిధీన్పరిదధాతి (1) । ఊర్ధ్వే సమిధావాదధాతి । అనూయాజేభ్యః సమిధ మాశినష్టి । షట్సంపద్యన్తే । షడ్వా ఋతవః । ఋతూనేవ ప్రీణాతి ।**

అర్థము : త్రీన్ పరిధీన్=మూఁడు పరిధులను, పరిదధాతి=అంతటను ఉంచవలెను. ఊర్ధ్వే=ఊర్ధ్వములనుగా, సమిధౌ= రెండు సమిధలను ఆదధాతి=ఉంచవలెను. అనూయాజేభ్యః=అనూయాజములకొఱకు, సమిధమ్=ఒక సమిధ నుంచవలెను. షట్ సంపద్యన్తే=మొత్తము ఆఱు సంపన్నము లగుచున్నవి. ఋతవః=ఋతువులు, షట్ వై=ఆఱే. ఋతూనేవ=ఋతువులనే, ప్రీణాతి=సంతోషపఱచినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : మొత్తము ఇరువదియొక్క యిధ్మములలో పూర్వమంత్రమున పదునైదు ఇధ్మముల నగ్నియందు ప్రక్షేపించవలెనని చెప్పఁబడినది. శేషించిన యాఱు కాష్ఠముల వినియోగ మిచట విహిత మైనది. గన్ధర్వోఽసీత్యాదులు పరిధిమంత్రములు. వీతిహోత్ర మిత్యాదికము ఊర్ధ్వసమిన్మంత్రము. ఆ మంత్రములు పూర్వము తై. సం. కా.1, ప్ర.1, అ.11.) ఆమ్నాతము లైనవి. ఆ మంత్రములకు బ్రాహ్మణము షష్టానువాకమునందు చెప్పఁబడినది. తాత్పర్యము స్పష్టము.

5. మంత్రము : **వేదేనోపవాజయతి । ప్రాజాపత్యో వై వేదః ప్రాజాపత్యః ప్రాణః । యజమాన ఆహవనీయః । యజమాన ఏవ ప్రాణం దధాతి (2) ।**

అర్థము : వేదేన=దర్భలకట్టచే, ఉపవాజయతి=వాయువు నుత్పాదింపఁజేయవలెను (అగ్నిప్రజ్వలనమునకై వీచవలెను). వేదః=దర్భలకట్ట, ప్రాజాపత్యః వై=ప్రజాపతిసంబంధియే. ప్రాణః=ప్రాణము, ప్రాజాపత్యః=ప్రజాపతి సంబంధి. ఆహవనీయః=ఆహవనీయము, యజమానః=యజమానస్వరూపము. యజమానే ఏవ=యజమానునియందే, ప్రాణమ్=ప్రాణమును, దధాతి=స్థాపించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : అధ్వర్యుఁడు ఆహవనీయాగ్నిని జ్వలింపఁజేయుటకై దర్భలకట్టచే వాయువు నుత్పాదింపఁజేయవలెను. దర్భలకట్ట ప్రజాపతిశ్మశ్రు వగుటవలన ప్రాజాపత్యము (ప్రజాపతిసంబంధి). ప్రాణవాయువు ప్రజాపతి సృష్ట మగుటచే ప్రాజాపత్యము. 'యజమానః ప్రస్తరః' అను ప్రస్తరన్యాయముచే నాహవనీయాగ్నికి యజమానత్వము చెప్పఁబడినది. ప్రాణరూపమును, ప్రాజాపత్యమునగు దర్భలకట్టచే నాహవనీయాగ్నిని జ్వలింపఁజేయుటకై విసరుటవలన నధ్వర్యుఁడు యజమానునందే ప్రాణమును స్థాపించినవాఁ డగుచున్నాఁడు. ఇచట అగ్నిప్రజ్వలనమునకై వాయూత్పాదనము విధించఁబడినది.

6. మంత్రము : **త్రిరుపవాజయతి । త్రయో వై ప్రాణాః । ప్రాణానేవాస్మిన్దధాతి ।**

అర్థము : త్రిః=మూఁడు మాఱులు, ఉపవాజయతి=అగ్నిసమీపమున వాయూత్పాదనము (విసరుట) చేయవలెను. ప్రాణాః=ప్రాణములు, త్రయః వై=ప్రాణాపానవ్యాన రూపమున మూఁడే. (అతః=ఈ కారణమువలన, అయమ్=మూఁడు మాఱులు గాలివిసరిన యీ యధ్వర్యుఁడు,) అస్మిన్=ఈ యజమానునియందు, ప్రాణానేవ=ప్రాణములనే, దధాతి=స్థాపించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : స్పష్టము. ఇచట ఆవృత్తి విధించఁబడినది. 'ప్రాణోఽపానో వ్యానశ్చ' అని ప్రాణములకు త్రిత్వము ప్రసిద్ధము.

7. మంత్రము : **వేదేనోపయత్యా స్రువేణ ప్రాజాపత్యా మాఘార మాఘారయతి । యజ్ఞో వై ప్రజాపతిః । యజ్ఞమేవ ప్రజాపతిం ముఖత ఆరభతే । అథో ప్రజాపతిః సర్వా దేవతాః । సర్వా ఏవ దేవతాః ప్రీణాతి ।**

అర్థము : వేదేన ఉపయత్యా=దర్భలకట్టపైని స్రువము నుంచి, స్రువేణ=స్రువముచే, ప్రాజాపత్యమ్=ప్రజాపతిసంబంధియైన, ఆఘారమ్ ఆఘారయతి=ఆఘారహోమమును చేయవలెను. ప్రజాపతిః=ప్రజాపతి, యజ్ఞః వై=యజ్ఞ స్వరూపుఁడే. యజ్ఞమేవ ప్రజాపతిం ముఖతః ఆరభతే=ప్రథమమున యజ్ఞరూప ప్రజాపతినే యారంభించినవాఁ డగుచున్నాఁడు. అథో=మఱియు, ప్రజాపతిః=ప్రజాపతి, సర్వాఃదేవతాః=సర్వదేవతా స్వరూపుఁడు. సర్వాఃదేవతాః ఏవ=సర్వదేవతలనే, ప్రీణాతి=సంతోషపరచినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : అధ్వర్యుఁడు దర్భలకట్టపైని స్రువమునుంచి స్రువముచే ప్రజాపతిసంబంధియైన ఆఘారహోమమును చేయవలెను. ప్రజాపతి యజ్ఞస్వరూపుఁడే. ఆహుతుల కీ యాఘార మాదియగుటవలన, యజ్ఞముఖ

మగుచున్నది. ఆ యజ్ఞముఖమందు యజ్ఞస్రష్టగా యజ్ఞరూప ప్రజాపతినే అధ్వర్యుc డారంభించినవాc డగుచున్నాcడు. ప్రజాపతి సర్వదేవతారూపత్వోపపాదనమును వాజసనేయలు ''తద్యదిదమాహురిమం యజామం యజతేవైకం దైవమేతస్యైవ సా విసృష్టిరేష ఉ హ్యేవ సర్వే దేవతాః'' అని ఆమ్నానము చేయుచున్నారు.

8. మంత్రము : **అగ్నిమగ్నిత్తిస్త్రిః సంమృడ్ఢీత్యాహ । త్ర్యావృద్ధి యజ్ఞః (3) । అథో రక్షసామపహత్యై ।**

అర్థము : ''అగ్నిమగ్నిత్తిస్త్రిః సంమృడ్ఢి'' ఇతి ఆహ = 'ఓ యాగ్నిధ్రుcడా! మూcడు మాఱు లగ్నిని ఇధ్మమును కట్టిన దర్భలచే సంమార్జనము చేయుము' అను ప్రైషమంత్రమును అధ్వర్యుc డాగ్నిధ్రుని గూర్చి పలుకవలెను. యజ్ఞః = యజ్ఞము, త్ర్యావత్ హి = మూcడు ఆవృత్తులు కలది కదా! అథో = మఱియు, ఏతత్ = ఈ సంమార్జనము, రక్షసామ్ = రాక్షసులయొక్క, అపహత్యై = నాశముకొఱకు, భవతి = అగుచున్నది.

తాత్పర్యము : 'హే అగ్నేత్!' అని యధ్వర్యుc డాగ్నిధ్రున్ని సంబోధించి యిధ్మమును కట్టిన దర్భలచే నగ్నిని మూcడు మాఱులు సంమార్జనము చేయు మనెడి అర్థము కల యీ ప్రైషము నధ్వర్యుcడాగ్నిధ్రుని గూర్చి పలుకవలెను. అనcగా ఆ దర్భలచే నగ్నిజ్వాలయందు సంమార్జనమును పొందించవలెనని యర్థము. యజ్ఞమును మూcడు మాఱులు చేయవలెను కనుక అది మూcడు ఆవృత్తులు కలది. మూcడు మాఱులీ సంమార్జనము చేయుటవలన రాక్షసనాశ మగును. ఇచట ఆగ్నిధ్రునిcగూర్చి ప్రైషమంత్ర ముత్పాదిత మైనది. త్రిస్త్రిః అని వీప్స పరిధిసంమార్జనాపేక్షచేc జేయcబడినది.

9. మంత్రము : **పరిధీన్త్సంమార్ష్టి । పునాత్యేవైనాన్ ।**

అర్థము : పరిధీన్ = పరిధులను, సంమార్ష్టి = సంమార్జనము చేయవలెను. ఏనాన్ = ఈ పరిధులను, పునాత్యేవ = పవిత్ర ములుగానే జేసినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : అధ్వర్యుcడు పరిధులను సంమార్జనము చేయవలెను. ఈ సంమార్జనముచే నతc డీ పరిధులను పవిత్రములనుగాc జేసినవాc డే యగుచున్నాcడు. ఈ బ్రాహ్మణము పరిధి సంమార్జనమును విధించినది.

10. మంత్రము : **త్రిస్త్రిః సంమార్ష్టి । త్ర్యావృద్ధి యజ్ఞః । అథో మేధ్యత్వాయ । అథో ఏతే వై దేవాశ్వాః । దేవాశ్వానేవ తత్సంమార్ష్టి । సువర్గస్య లోకస్య సమష్ట్యై ।**

అర్థము : త్రిః త్రిః సంమార్ష్టి = ప్రతిపరిధిని మూcడు మాఱులు సంమార్జనము చేయవలెను. యజ్ఞః = యజ్ఞము, త్ర్యావృత్ హి = మూcడు ఆవృత్తులు కలది కదా! అథో = మఱియు, మేధ్యత్వాయ భవతి = మూcడు మాఱులు సంమార్జనము చేయుట పరిధులయొక్క పవిత్రతకొఱ కగుచున్నది. అథో = మఱిము, ఏతే = ఈ పరిధులు, దేవాశ్వాః వై = దేవాశ్వములే. తత్ = ఈ పరిధులు దేవాశ్వరూపములు కనుక, (అయమ్ = ఈ యధ్వర్యుcడు,) దేవాశ్వానేవ = దేవాశ్వములనే, సంమార్ష్టి = సంమార్జనము చేసినవాc డగుచున్నాcడు.

ఏతత్= పరిధి సంమార్జనము, సువర్గస్య లోకస్య = స్వర్గలోకముయొక్క, సమష్ట్యై = ప్రాప్తికొఱకు, భవతి = అగుచున్నది.

తాత్పర్యము : దేవాశ్వములుగా భావించబడిన పరిధులు స్వర్గప్రాప్తికి సాధనము లగును. శేషము స్పష్టము. ఇచట ప్రతిపరిధియందు మూడు మాఱులు సంమార్జనము చేయవలెనని త్రిరావృత్తి విధించబడినది.

11. మంత్రము :**ఆసీనో॑ఽన్య మా॑ఘూర మా॑ఘూరయతి (4) । తిష్ఠ॑న్నన్యమ్ । యథా॑ఽనో॑ వా॑ రథం వా॑ యుఞ్జ్యా॑త్ ।**

ఏవమే॑వ తద॑ధ్వర్యు॑ర్యజ్ఞం॑ యు॑నక్తి । సు॑వర్గస్య॑ లో॑కస్యా॑భ్యూ॑ఢ్యై ।

అర్థము : ఆసీనః=అధ్వర్యుడు కూర్చున్నవాడై, అన్యమ్ ఆఘూరమ్ అఘూరయతి= రెండు ఆఘూరములలో నితరమైన (ఒక) ఆఘూరహోమమును చేయవలెను. తిష్ఠన్= నిలుచున్నవాడై, అన్యమ్ ఆఘూరయతి= ఇతరమైన (రెండవ) ఆఘూరహోమమును చేయవలెను. యథా= ఏవిధముగ, అనః వా= శకటమును గాని, రథం వా = రథమును గాని, యుఞ్జ్యాత్= మొదటి యెద్దులజతను కూర్చునో, ఏవమేవ= ఈ విధముగనే, తదధ్వర్యుః= ఆ యధ్వర్యుడు, యజ్ఞమ్=యజ్ఞమును, యునక్తి =కూర్చుచున్నాడు. ఏతత్= ఇది, సువర్గస్య లోకస్య =స్వర్గ లోకముయొక్క, అభ్యూఢ్యై =అంతటను వహించుటకై, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : అధ్వర్యుడు రెండు ఆఘూరములలో నొక యాఘూరహోమమును కూర్చుండి చేయవలెను. రెండవ యాఘూరహోమమును నిలుచుండి చేయవలెను. శకటమును లాగునట్టి యెద్దులజతలలో మొదటి యెద్దుల జతను పైని కూర్చున్న యతడు ప్రేరణచేయును. రెండవది, మూడవదియైన యెద్దులజతను భూమియందు ఉన్నట్టివాడు ప్రేరణచేయును. ఆ విధముగనే ఆఘూరరథము కూడ స్వర్గలోకము నభిలక్షించి వహనముకొఱకగుచున్నది. రెండు ఆఘూరహోమములకు క్రమముగ గుణభేద మిచట విధించబడినది.

12. మంత్రము :**వహ॑న్త్యే॒నం గ్రా॒మ్యాః ప॒శవ॑ః య ఏ॒వం వే॑ద ।**

అర్థము : యః=ఏ యజమానుడు, ఏవమ్=ఈ పూర్వోక్తవిధముగ, వేద=తెలిసికొనుచున్నాడో, ఏనమ్=ఇతనిని, గ్రామ్యాః పశవః=గ్రామ్యపశువులైన బలీవర్దాశ్వాదులు, వహన్తి=వహించును.

తాత్పర్యము : ఈ విధముగతెలిసికొనినవానిని బలీవర్దాశ్వాదులైన గ్రామ్యపశువులు వహించును. ఇచట ఏతద్రథవేదనము ప్రశంసింపబడినది.

13. మంత్రము :**భు॒వ॒న॒మ॒సి॒ వి॒ప్ర॒థ॒స్వే॒త్యా॑హ । య॒జ్ఞో వై భు॑వ॒నమ్ । య॒జ్ఞ ఏ॒వ య॑జ॒మా॒నం ప్ర॒జ॒యా॒ ప॒శు॒భి॒ఃప్రథయతి । అగ్నే॑ యష్టా॒రి॒దం న॑మ ఇ॒త్యా॑హ (5) । అగ్నిర్వై దే॒వా॒నాం॑ యష్టా । య ఏ॒వ దే॒వా॒నాం॑ యష్టా । త॒స్మా ఏ॒వ న॑మస్కరోతి ।**

అర్థము : ''భువనమసి వి ప్రథస్వ''ఇతి ఆహ='ఓ యాగనిష్పాదకాగ్నీ! నీవు భూతకారణమగుచున్నావు. ఈ కారణమువలన విస్తృతుఁడవు కమ్ము' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. భవన్తి అస్మాద్భూతానీతి భువనమ్=భూతము(ప్రాణు)లీ యగ్నినుండి పుట్టును కనుక అగ్ని భూతకారణము. యజ్ఞః=అగ్న్యభిన్న యజ్ఞము, భువనం వై=భువనమే (భూతకారణమే). అతః=ఈ కారణమువలన, యజ్ఞః ఏవ=అగ్న్యభిన్న యజ్ఞమే, యజమానమ్=యజ్ఞకర్తను, ప్రజయా=సంతానముచేతను, పశుభిః=పశువుల చేతను, ప్రథయతి= విస్తరింపఁజేయును. ''అగ్నే యష్టరిదం నమః'' ఇతి ఆహ='దేవపూజకుఁడవైన ఓ యగ్నీ! నీ కీ నమస్కార మగుఁగాక' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. అగ్నిః=అగ్ని, దేవానామ్=దేవతలకు, యష్టా వై=(హవిస్సును వహించుటచే) పూజకుడే. యః ఏవ=ఏ యగ్నియే , దేవానాం యష్టా=దేవతలకు పూజకుఁడో, తస్మై ఏవ=ఆ యగ్నికొఱకే, నమస్కరోతి=అధ్వర్యుఁడు నమస్కారము చేయుచున్నాఁడు.

తాత్పర్యము : పూర్వోక్తనిర్వచనముచేత భూతోత్పత్తికారణ మగుటవలన అగ్న్యభిన్నయజ్ఞము భువన మగుచున్నది. అగ్ని దేవతలకై హవిస్సును వహించుటచే దేవపూజకుఁ డగుచున్నాఁడు. అట్టి దేవపూజకుఁడైన యగ్నికొఱకే యధ్వర్యుఁడు నమస్కరించుచున్నాఁడు. 'తిష్ఠన్నన్యమ్' అను మంత్రముచే విహితమైన ద్వితీయాఘారమునకు సంబంధించిన మంత్రములందు ప్రథమ మంత్రము నీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

14. మంత్రము :**జుహ్వా హ్యగ్నిస్త్వా ऽऽహ్వయతి దేవయజ్యాయా ఉపభృదేహి దేవస్త్వా సవితా ऽऽహ్వయతి**

దేవయజ్యాయా ఇత్యాహ। అగ్నేయీ వై జుహూః । సావిత్ర్యుపభృత్ । తాభ్యామేవైనే ప్రసూత ఆదత్తే ।

అర్థము : ''జుహ్వా హ్యగ్నిస్త్వాహ్వయతి దేవయజ్యాయా ఉపభృదేహి దేవస్త్వా సవితాహ్వయతి దేవయజ్యాయై'' ఇతి ఆహ='ఓ జుహూ! దేవయాగమునకై యగ్ని నిన్నుఆహ్వానించుచున్నాఁడు . రమ్ము. ఓ ఉపభృత్తూ! సవితృదేవుఁడు, దేవయాగమునకై నిన్ను ఆహ్వానించుచున్నాఁడు. రమ్ము'అని అధ్వర్యుని వాక్కుగా మంత్రము చెప్పినది. జుహూః=జుహువు, ఆగ్నేయీ వై=అగ్నిదేవతాకమే. ఉపభృత్=ఉపభృత్తు, సావిత్రీ=సవితృదేవతాకము. తాభ్యామేవ=ఆ యగ్నిసవితలకొఱకే, ప్రసూతే ఏనే=ప్రేరణచేయబడిన (పిలువబడిన) యీ జుహూపభృత్తులను, ఆదత్తే=అధ్వర్యుఁడు తీసికొనుచున్నాఁడు.

తాత్పర్యము : అగ్నిసవితలు జుహూపభృత్తు లనెడి స్రుక్కులకు అభిమానిదేవతలు. శేషము స్పష్టము. ''జుహ్వా హ్యగ్నిస్త్వా'' ఇత్యాదిమంత్రమునందు రెండు భాగములు కలవు. భాగద్వయాత్మకమైన యీ మంత్రమునందలి అగ్నిసవిత్ర వ్యవస్థ యుక్తమని యీ బ్రాహ్మణము చెప్పినది.

15. మంత్రము :**అగ్నావిష్ణూ మా ऽऽవా మవక్రమిష మిత్యాహ। అగ్నిః పురస్తాత్ । విష్ణుర్యజ్ఞః పశ్చాత్ (6) । తాభ్యామేవ**

ప్రతి ప్రోచ్యాక్రామతి । విజిహాథాం మా మా సంతాప్తమిత్యాహాహిగ్ంసాయై । లోకం మే లోకకృతౌ

కృణుత మిత్యాహ। ఆశిషమేవైతామాశాస్తే ।

అర్థము : ''అగ్నావిష్ణూ మా వామవ క్రమిషమ్'' ఇతి ఆహ='ఓ యగ్నావిష్ణుదేవతలారా! ఆఘారహోమమున్నై మీ యుభయుల మధ్యభాగమునందు వెళ్ళుచున్న నేను పాదముచే మిమ్ము అతిక్రమించను' అని యధ్వర్యుని వాక్కుగా మంత్రము చెప్పినది. అగ్నిః=ఆహవనీయాగ్ని, పురస్తాత్=మధ్యమపరిధికి పురోభాగమున, అవస్థితః=వుండెను. విష్ణుః యజ్ఞః=యజ్ఞాభిమానియైన విష్ణువు, పశ్చాత్=ఆ యగ్నికి పశ్చిమభాగమున స్రుక్కుల కగ్రభాగమున, అవస్థితః=ఉండెను. తాభ్యామేవ=ఆ యగ్నివిష్ణువులకొఱకే, ప్రతిప్రోచ్య=ప్రత్యేకముగ చెప్పి, అత్యాక్రమతి=వారి నతిక్రమించి (దాఁటి) యధ్వర్యుఁడు వెళ్ళుచున్నవాఁ డగుచున్నాఁడు.

''వి జిహీథాం మా మా సంతాప్తమ్'' ఇతి ఆహ='ఓ యగ్నావిష్ణులారా! నాకు గమనావకాశమున్నై (నేను వెళ్ళుటకై) మీరు వియుక్తులు కండు (విడివడుఁడు). నన్నుఁ గుఱించి సంతాపమును చేయకుడు' అని యధ్వర్యుని వాక్కుగా మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, అహింసాయై భవతి=అహింసకొఱకగుచున్నది. ''లోకంమే లోకకృతౌ కృణుతమ్'' ఇతి ఆహ='ఓ యగ్నావిష్ణులారా! స్థానకారణభూతులైన మీరు నాకు గమనస్థానమును చేయుఁడు' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ఏతామ్=దీనిని, ఆశిషమేవ=ఆశీస్సునుగానే, ఆశాస్తే=అధ్వర్యుఁడు తలఁచున్నాఁడు.

తాత్పర్యము : స్పష్టము. ఈ బ్రాహ్మణము మంత్రార్థమును యథాతథముగ చూపించినది.

16. మంత్రము :**విష్ణోఃస్థానమసీత్యాహ। యజ్ఞో వై విష్ణుః। ఏతత్ఖలు వై దేవానా మపరాజిత మాయతనమ్ । యద్యజ్ఞః। దేవానామేవాపరాజిత ఆయతనే తిష్ఠతి ।**

అర్థము : ''విష్ణో స్థానమసి'' ఇతి ఆహ='ఓ భూప్రదేశమా! నీవు యజ్ఞపురుషునకు స్థాన మగుచున్నావు' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. యజ్ఞః వై=యజ్ఞపురుషుడే, విష్ణుః=విష్ణువు. యజ్ఞః యత్=యజ్ఞమేది కలదో, ఏతత్ వై=ఇదియే, దేవానామ్=దేవతలయొక్క, అపరాజితమ్ ఆయతనం ఖలు=పరాజితము కాని స్థానము కదా! (అతః=ఈ కారణమువలన, అయమ్=ఈ యధ్వర్యుఁడు,) దేవానామ్=దేవతలయొక్క, అపరాజితే ఆయతనే=పరాజితముకాని స్థానమునందు, తిష్ఠతి=నిలుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : 'తిష్ఠన్నన్యమ్' అను మంత్రము ద్వితీయాఘారమును నిల్చుండి చేయవలెనని విధించుటచే నిల్చుండి యాఘారహోమముచేయుటకై యధ్వర్యుఁ డగ్నావిష్ణువుల మధ్యమునుండి పోయి యొకప్రదేశమును గూర్చి 'విష్ణోఃస్థానమసి' యని యనెను. ఆ ప్రదేశము యజ్ఞపురుషుని స్థానము. దేవయజనభూ వ్యతిరిక్త భూమి యసురాధీన మగుటచే ఆ ప్రదేశమునందు దేవతలకు పరాజయము కలిగినను, యజ్ఞప్రదేశము అపరాజితమే. కనుక అధ్వర్యుఁడు దేవతలయొక్క అపరాజితప్రదేశమునందే నిలుచున్నవాఁ డగుచున్నాఁడని యర్థము. ఇచట యజ్ఞపురుష ప్రయుక్తమైన యతిశయము చూపఁబడినది.

17. మంత్రము :**ఇత ఇన్ద్రో అకృణోద్వీర్యాణీత్యాహ(7) । ఇన్ద్రియమేవ యజమానే దధాతి ।**

అర్థము : ''ఇత ఇన్ద్రో అకృణోద్వీర్యాణి'' ఇతి ఆహ = 'ఈ దేవయజనస్థానబలమువలన ఇంద్రుడు సురవధ రూపములైన కార్యములను చేసెను' అని వేదము చెప్పినది. (అనేన = దీనిచే, అధ్వర్యుః = అధ్వర్యుడు,) యజమానే ఏవ = యజమానునియందే, ఇన్ద్రియమ్ = ఇంద్రియసామర్థ్యమును, దధాతి = స్థాపించినవాడగుచున్నాడు.

తాత్పర్యము : తాత్పర్యము స్పష్టము. ఈ బ్రాహ్మణము మంత్రమునందలి ఇంద్రశబ్ద సూచితమైన యర్థమును సూచించినది.

18. మంత్రము : **సమారభ్యోర్ధ్వో అధ్వరో దివిస్పృశమిత్యాహ వృద్ధ్యై ।**

అర్థము : ''సమారభ్యోర్ధ్వో అధ్వరో దివిస్పృశమ్'' ఇతి ఆహ = 'నైర్ఋతిదిక్కుమొదలుకొని యీశాన్యదిక్కును స్పృశించి పొడవైన యాఘారహోమము దేవతకొఱకే కీయబడినదని' మంత్రము చెప్పినది. అయమ్ = ఈ పొడవైన యాఘారహోమము, వృద్ధ్యై = అగ్నియొక్క వృద్ధికొఱకు, భవతి = అగుచున్నది.

తాత్పర్యము : ఆఘారహోమము నైర్ఋతిదిక్కున ప్రారంభించి యీశాన్యదిక్కున సమాప్త మగునట్లుగా జేయవలసియుండుటచే ఈ యాఘారము ఊర్ధ్వమైనది (పొడవైనది). కనుక ఈ యాఘారము అగ్నియొక్క వృద్ధికొఱ కగుచున్నది. ఈ బ్రాహ్మణము మంత్రమునందలి ఊర్ధ్వపదము వృద్ధిని సూచించుచున్నదని చెప్పినది.

19. మంత్రము : **ఆఘారమాఘార్యమాణమనుసమారభ్య । ఏతస్మిన్కాలే దేవాః సువర్గం లోకమాయన్ । సాక్షాదేవ యజమానః సువర్గం లోకమేతి । అథో సమృద్ధేనైవ యజ్ఞేన యజమానః సువర్గం లోకమేతి ।**

అర్థము : సమారభ్య ఆఘార్యమాణమ్ ఆఘారమ్ = నైర్ఋతిదిక్కునుండి యీశాన్యదిక్కువఱకు హోమము చేయబడుచున్న యాఘారమును (ఆజ్యమును) అను = అధ్వర్యు ననుసరించి, స్పృష్ట్వా = స్పృశించి, ఏతస్మిన్ కాలే = ఈ కాలమునందు, దేవాః = దేవతలు, సువర్గం లోకమ్ = స్వర్గలోకమును, ఆయన్ = పొందిరి. అతః = ఈ యాఘారహోమమువలన, యజమానః = యజమానుడు, సాక్షాదేవ = సాక్షాత్తుగానే (విలంబము లేకుండనే), సువర్గం లోకమ్ = స్వర్గలోకమును, ఏతి = పొందుచున్నాడు. అథో = మఱియు, సమృద్ధేనైవ యజ్ఞేన = సమృద్ధమైన యజ్ఞముచేతనే, యజమానః = యజమానుడు, సువర్గం లోకమ్ = స్వర్గలోకమును, ఏతి = పొందుచున్నాడు.

తాత్పర్యము : దేవతలు స్వయముగ యాగమును చేయుచున్నవారై యధ్వర్యు ననుసరించి ఆ యాఘారమును స్పృశించి విలంబము లేకుండనే స్వర్గమును పొందిరి. మఱియు సమారభ్య అను పదముచే సమృద్ధి సూచిత మైనది.

20. మంత్రము : **అహ్రుతో యజ్ఞో యజ్ఞపతేరిత్యాహానార్త్యై ।**

అర్థము : ''అహ్రుతో యజ్ఞో యజ్ఞపతేః'' ఇతి ఆహ = 'వంకరలేని యజ్ఞపతియొక్క యాఘారహోమమని' మంత్రము చెప్పినది. అయమ్ = వంకరలేని యీ ఆఘారహోమము, అనార్త్యై = ఆర్తి (బాధ) లేకుండుటకై, భవతి = అగుచున్నది.

తాత్పర్యము : మంత్రమునందలి అహూత శబ్దము వంకరలేనిదను నర్థముచెప్పుటచే ఇది అనార్తికొఱ కగుచున్నది. ఇచట అహూతశబ్దార్థము చూపcబడినది.

21. మంత్రము :**ఇన్ద్రావాన్త్స్వాహేత్యాహ। ఇన్ద్రియమేవ యజమానే దధాతి ।**

అర్థము : ''ఇన్ద్రావాన్త్స్వాహా'' ఇతి ఆహ = 'ఇంద్రుcడు దేవతగాc గల ఆఘారహోమము దేవతకొఱ కీయc బడినదని' మంత్రము చెప్పినది. (అతః = ఈ యాఘారము ఇంద్రదేవతాకమగుటవలన, అధ్వర్యుః = ఆఘార హోమము చేయు నధ్వర్యుcడు,) యజమానే = యజమానునియందు, ఇన్ద్రియమేవ = ఇంద్రియ సామర్థ్యమునే, దధాతి = స్థాపించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : స్పష్టము. ఈ బ్రాహ్మణము మంత్రమునందలి ఇంద్రశబ్దముయొక్క యర్థమును తెలియcజేసినది.

22. మంత్రము :**బృహద్భా ఇత్యాహ(8) । సువర్గో వై లోకో బృహద్భాః । సువర్గస్య లోకస్య సమష్ట్యై ।**

అర్థము : **'బృహద్భా'** ఇతి ఆహ = **'స్వర్గలోకము మిక్కిలి ప్రకాశవంతమైనదని' మంత్రము చెప్పినది. సువర్గో లోకో వా** = **స్వర్గలోకమే, బృహద్భాః** = **గొప్పప్రకాశము కలది. ఏతత్** = **ఈ కథనము, సువర్గస్య లోకస్య** = **స్వర్గలోకముయొక్క, సమష్ట్యై** = **సమష్టి కొఱకగుచున్నది.**

తాత్పర్యము : స్పష్టము.

23. మంత్రము :**యజమానదేవత్యా వై జుహూః । భ్రాతృవ్యదేవత్యోపభృత్ । ప్రాణ ఆఘారః । యత్సగ్ంస్పర్శయేత్ ।**

భ్రాతృవ్యే కస్య ప్రాణం దధ్యాత్ । అసగ్ంస్పర్శయన్నత్యాక్రామతి । యజమాన ఏవ ప్రాణం దధాతి ।

అర్థము : జుహూః = జుహువు, యజమానదేవత్యా వై = యజమానుcడు దేవతగాc గలదియే. ఉపభృత్ = ఉపభృత్తు, భ్రాతృవ్యదేవత్యా = శత్రువు దేవతగాc గలది. ఆఘారః = ఆఘారహోమము, ప్రాణః = ప్రాణస్వరూపము. సంస్పర్శయేత్ యత్ = జుహూపభృత్తులను పరస్పరము తాcకించుచో, (అధ్వర్యుః = అధ్వర్యుcడు,) అస్య = ఈ యజమానుని యొక్క భ్రాతృవ్యే = శత్రువునందు, ప్రాణమ్ = ప్రాణమును, దధ్యాత్ = స్థాపించువాc డగును. అసంస్పర్శయన్ = జుహూపభృత్తుల నొండొంటిని తాcకించనివాc డగుచు, అత్యాక్రామతి = అతిక్రమించి రావలెను. (తదా = అప్పుడు, అయమ్ = ఈ యధ్వర్యుcడు,) యజమానే ఏవ = యజమానుని యందే, ప్రాణమ్ = ప్రాణమును, దధాతి = స్థాపించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : అధ్వర్యుc డాఘారహోమమును చేయునపుడు జుహూపభృత్తులను రెండింటిని పరస్పరము తాcకించకుండ ఉత్తరదిక్కువైపున రావలెను. జుహువు యజమానునివలె యాగమునందు ప్రత్యాసన్న మగుటవలన జుహువు యజమానుcడుగా తలcచcబడుచున్నది. ఉపభృత్తునందలి యాజ్యమునకు జుహూద్వారా హోమము కనుక ఉపభృత్తునకు వ్యవహితత్వమేర్పడుచున్నది. అందువలన ఉపభృత్తునకు శత్రువు దేవత. అధ్వర్యుc డా రెండింటిని తాcకించినచో ఆఘారము ప్రాణరూపము కనుక శత్రువునందు ప్రాణమును స్థాపించినవాc

డగును. అందువలన ఆ రెండింటిని తాcకించకుండ తిరిగిరావలెను. అప్పు డతcడు యజమానునియందే ప్రాణమును స్థాపించినవాc డగును. అర్థవాదాంతరమందైనను ఈ విధముగనే గ్రహించవలెను.

24. మంత్రము :**పాహిమా కగ్నే దుశ్చరితాదామా సుచరితే భజేత్యాహ(9) । అగ్నిర్వావ పవిత్రమ్ । వృజినమన్నృతం దుశ్చరితమ్ । ఋజుకర్మగ్ం సత్యగ్ం సుచరితమ్ । అగ్నిరేవైనం వృజినాదన్నృతాద్దుశ్చరితాత్పాతి । ఋజుకర్మే సత్యే సుచరితే భజతి । తస్మాదేవమాశాస్తే । ఆత్మనో గోపీథాయ ।**

అర్థము : ''పాహి మాఽగ్నే దుశ్చరితాదా మా సుచరితే భజ'' ఇతి ఆహ = 'ఓ యగ్నీ! నీవు నన్ను దుశ్చరితమునుండి రక్షించుము. నన్ను సుచరితమునందు స్థాపించుము' అని యజ్ఞకర్తపక్షమున అధ్వర్యునివాక్కుగా శ్రుతి చెప్పినది. అగ్నిః=అగ్ని, పవిత్రం వావ=పవిత్రుడే. వృజినమ్=శారీరకమైన నిషిద్ధకర్మాచరణము, అనృతమ్=వాచికమైన అసత్యము, దుశ్చరితమ్=దుశ్చరితమగును. ఋజుకర్మ=విహితకర్మాచరణము, సత్యము=వాచికమైన సత్యము, సుచరితమ్=సుచరితమగును. అతః=ఈ కారణమువలన, అగ్నిః ఏవ= అగ్నియే, ఏనమ్=ఈ యజమానుని, వృజినాత్=వృజినరూపమును, అనృతాత్=అనృతరూపమునగు, దుశ్చరితాత్=దుశ్చరితమునుండి, పాతి=రక్షించు(చున్నాcడు) ను. ఋజుకర్మే=విహితకర్మాచరణ రూపమును, సత్యే=వాచికసత్యరూపమునగు, సుచరితే=సుచరితమునందు, భజతి=స్థాపించు (చున్నాcడు)ను. తస్మాత్=ఆ కారణమువలన, (అధ్వర్యుః=అధ్వర్యుcడు,) ఏవమ్= (దుశ్చరితమునుండి రక్షించుము. సుచరితమునందు స్థాపించుము అని) యీ విధముగ, ఆశాస్తే=కోరుచున్నాcడు.ఇయమ్=ఈ ప్రార్థన, ఆత్మనః గోపీథాయ=తనయొక్క రక్షణముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము ''పాహి మాఽగ్నే'' ఇత్యాది మంత్రముయొక్క పదార్థ వాక్యార్థములను చూపించినది. తాత్పర్యము స్పష్టము.

25. మంత్రము :**శిరో వా ఏతద్యజ్ఞస్య । యదాహూరః । ఆత్మా ధ్రువా (10) । ఆహూరమాహూర్య ధ్రువాగ్ం సమనక్తి । ఆత్మన్నేవ యజ్ఞస్య శిరః ప్రతిదధాతి ।**

అర్థము : ఆహూరః యత్=ఆహూరమేది కలదో, ఏతత్=ఇది, యజ్ఞస్య=యజ్ఞమునకు, శిరః వై=శిరస్సే (శిరస్సువలె ముఖ్యాంగమే). ధ్రువా=ధ్రువాపాత్రము, ఆత్మా=శరీరము (వంటిది). ఆహూరమ్ ఆహూర్య= ఆహూర హోమమును చేసి, ధ్రువామ్=ధ్రువపాత్రమును, సమనక్తి=ఆహూరశేషముతో కలుపవలెను. తదా=అప్పుడు, అధ్వర్యుః=అధ్వర్యుcడు, ఆత్మన్నేవ=శరీరమందే, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, శిరః=శిరస్సును, ప్రతిదధాతి=ప్రతిష్ఠించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : ఆహూరము యజ్ఞమునకు శిరమువంటిది. ధ్రువపాత్రము ఆత్మవంటిది. అధ్వర్యుc డాహూరహోమమును చేసి తచ్ఛేషమైన యాజ్యముతో ధ్రువపాత్రమునందలి ఆజ్యమును కలుపవలెను. ఆత్మయనగా కంఠమున కధోభాగమైన దేహము. ఆహూరశేషము జ్యోతిస్స్వరూపముగా మంత్రమునందు వర్ణించcబడినది. కనుక

ఆఘారశేషరూప జ్యోతిస్సుతో ధ్రౌవాజ్యరూప జ్యోతిస్సును కలుపవలెనని యీ బ్రాహ్మణము సమంజనమును విధించినది. ఇట్లుచేసిన యధ్వర్యుడు యజ్ఞశిరస్సును శిరస్సునందే స్థాపించినవాడగును.

26. మంత్రము :**ద్వీఃసమనక్తి । ద్వౌ హి ప్రాణాపానౌ ।**

అర్థము : ద్వీఃరెండు మాఱులు, సమనక్తి=ఆఘారశేషముతో ధ్రౌవాజ్యమును కలుపవలెను. ప్రాణపానౌ=ప్రాణాపానములు, ద్వౌ హి=రెండు కదా!

తాత్పర్యము : ప్రాణాపానములు రెండు కనుక ఆఘారశేషముతో ధ్రౌవాజ్యమును రెండు మాఱులు కలుపవలెనని కొందఱి యభిప్రాయము. ఇది పూర్వపక్షము.

27. మంత్రము :**తదాహుఃత్రిరేవ సమఞ్జ్యాత్ । త్రిధాతు హి శిర ఇతి । శిర ఇవైతద్యజ్ఞస్య । అథో త్రయో వై ప్రాణాః ।**

ప్రాణానేవాస్మిన్దధాతి ।

అర్థము : తత్=అప్పుడు, ఆహుఃసిద్ధాంతమును చెప్పుచున్నారు. త్రిరేవ=మూడు మాఱులే, సమఞ్జ్యాత్=ఆఘారశేషముతో ధ్రౌవాజ్యమును కలుపవలెను. శిరఃశిరస్సు, త్రిధాతు హి=త్వక్కు, అస్కక్కు, అస్థి అను మూడు ధాతువులు కలది కదా! ఏతత్=ఈ యాఘారశేషము, యజ్ఞస్య=యజ్ఞమునకు, శిరఃఇవ=శిరస్సువంటిది. అథో=మఱియు, ప్రాణాఃప్రాణములు, త్రయఃవై=మూడే. అస్మిన్=ఈ యజ్ఞశిరస్సునందు, ప్రాణానేవ=ప్రాణములనే దధాతి=స్థాపించినవాడగుచున్నాడు.

తాత్పర్యము : ఆ పూర్వపక్షము చెప్పబడిన సందర్భమున ఈ విధముగా యాజ్ఞికులు సిద్ధాంతమును చెప్పుచున్నారు. మూడు మాఱులే నాఘారశేషముతో ధ్రౌవాజ్యమును కలుపవలెను. శిరస్సు త్వగస్యగస్థిరూపములైన మూడు ధాతువులు కలది కదా! ఈ యాఘారము యజ్ఞమునకు శిరస్సువంటిది. మఱియు ప్రాణాపానవ్యాన రూపమున ప్రాణములు మూడే. కనుక మూడు మాఱులు సమంజనము చేసిన యధ్వర్యుడీ యజ్ఞశిరస్సునందు ప్రాణములనే స్థాపించినవాడగును. ఇది సిద్ధాంతము.

28. మంత్రము :**ముఖస్య శిరోఽసి సం జ్యోతిషా జ్యోతిరజ్రామిత్యాహ। జ్యోతిరేవాస్మా ఉపరిష్టాద్దధాతి । సువర్గస్య**

లోకస్యానుఖ్యాత్యై (11) ।

పరిదధాతి ప్రాణం దధాతి హి యజ్ఞో ఘారయతి నమ ఇత్యాహ పశ్చాద్వీర్యాణీత్యాహ భా ఇత్యాహ

భజేత్యాహ ధ్రువైవాస్మిన్దధాతి త్రీణి చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే సప్తమోఽనువాకః ॥౭॥

అర్థము : ''మఖస్య శిరోఽసి సం జ్యోతిషా జ్యోతిరజ్ర్కామ్'' ఇతి ఆహ='ఓ యాఘారశేషమా! నీవు యజ్ఞమునకు శిరస్సువలె ఉత్తమాంగమగుచున్నావు. కనుక త్వద్రూపమైన జ్యోతిస్సుతో ద్రౌవాజ్యరూపమైన జ్యోతిస్సు కలుపcబడుcగాక' అని మంత్రము అధ్వర్యునివాక్కుగాc జెప్పినది. (తత్=అందువలన, అయమ్=ఈ యధ్వర్యుcడు, అస్మై=ఈ ద్రౌవాజ్యముయొక్క (షష్ఠ్యర్థే చతుర్థీ) ఉపరిష్టాత్=పైభాగమున, జ్యోతిరేవ=ఆఘారశేషరూప జ్యోతిస్సునే దధాతి=స్థాపించినవాc డగుచున్నాcడు. ఏతత్=ఈ జ్యోతిస్స్థాపనము, సువర్గస్య లోకస్య=స్వర్గలోకముయొక్క అనుఖ్యాత్యై=ప్రకాశముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : మంత్రగత జ్యోతిశ్శబ్దవివక్ష యిచట చూపcబడినది. ద్రౌవాజ్యరూపమైన జ్యోతిస్సున కుపరిభాగమున స్థాపించcబడిన ఆఘారశేషాజ్యరూపమైన అత్యుజ్జ్వలసద్రుదీపముచేతనే స్వర్గలోకము ప్రకాశితమగును.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు

సప్తమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే అష్టమోఽనువాకః

1. మంత్రము : ధిష్ణియా వా ఏతే న్యప్యన్తే । యద్బ్రహ్మా । యద్ధోతా । యదధ్వర్యుః । యదగ్నీత్ । యద్యజమానః । తాన్యదన్తరేయాత్ । యజమానస్య ప్రాణాన్త్సంకర్షేత్ । ప్రమాయుకః స్యాత్ । పురోడాశమపగృహ్య సంచరత్యధ్వర్యుః (1) । యజమానాయైవ తల్లోకగ్ం శిగ్ంషతి । నాస్య ప్రాణాన్త్సంకర్షతి । న ప్రమాయుకో భవతి ।

వేదార్థదీపిక

అవతారిక: సుగూ్యహనమంత్రములు సంహితయందలి ప్రథమకాండగత ప్రథమ ప్రపాఠకమునc గల త్రయోదశానువాకమునం దామ్నాతము లైనవి. జుహూవు, ఉపభృత్తు మొదలగు స్రుక్కులు హోమ సాధనములు. సుగూ్యహన మనcగా స్రుక్కులను విశేషముగ పట్టుకొనుట యని యర్థము. ఆ సుగూ్యహనంత్రములకు బ్రాహ్మణ మీ యనువాకమునందు చెప్పవలసియున్నది. సుగూ్యహనమంత్ర వ్యాఖ్యానముకంటె పూర్వము ఇడాభక్షణాదిక మనుష్ఠేయము కనుక ఆ యిడాభక్షణాదికము ప్రథమమున విధించcబడుచున్నది. అందు పురోడాశమునుండి ఇడాభాగమున కపచ్ఛేద మిచట విధించcబడుచున్నది.

అర్థము : ఏతే ధిష్ణియాఃవై=ధిష్ణియనామకులైన యీ సోమరక్షకదేవతలే, న్యప్యన్తే=వేదికయందు ఉంచcబడుచున్నారు. బ్రహ్మా యత్=బ్రహ్మా యను ఏ ఋత్విజుcడు కలcడో, హోతాయత్=హోతయనెడి ఏ ఋత్విజుcడు కలcడో, అధ్వర్యుఃయత్=అధ్వర్యుc డనెడి ఏ ఋత్విజుcడు కలడో, అగ్నీత్ యత్=ఆగ్నీధ్రుc డనెడి ఏ ఋత్విజుcడు కలcడో, యజమానఃయత్=ఏ యజమానుcడు కలcడో, తాన్=ఆ ధిష్ణియ నామక సోమరక్షకదేవతలను, అన్తరేయాత్ యత్=అతిక్రమించుచో, యజమానస్య=యజమానునియొక్క, ప్రాణాన్=ప్రాణములను, సంకర్షేత్=ఆకర్షించినవాc డగును (లాcగినవాc డగును). ప్రమాయుకఃస్యాత్=యజమానుcడు మరణశీలుc డగును. అతఃఈ కారణమువలన, అధ్వర్యుఃఅధ్వర్యుcడు, పురోడాశమ్=పురోడాశమును, అపగృహ్య=విడిగా తీసికొని, సంచరతి=వేదికయందు సంచరించవలెను. తదా=అప్పుడు, యజమానాయైవ=యజమానునికొఱకే, తల్లోకమ్=ఆ స్వర్గలోకమును, శింషతి=అవశేషముగc జేసినవాc డగును. అస్యఈ యజమానునియొక్క, ప్రాణాన్=ప్రాణములను, న సంరక్షతి=ఆకర్షించువాcడు కాcడు. ప్రమాయుకఃన భవతి=యజమానుcడు మరణశీలుcడు కాcడు.

తాత్పర్యము : ధిష్ణియ నామకులైన కొందఱు దేవతలు సోమరక్షకులుగ నుండిరి. ''ధిష్ణియా వా అముష్మింల్లోకే సోమమరక్షన్'' 'ధిష్ణియులే స్వర్గలోకమునందు సోమమును రక్షించిరి' అను శ్రుతి యీ విషయమునే చెప్పుచున్నది. ఆ ధిష్ణియులు సోమయాగమునందు వేదికాసదృశులుగాను, మృన్మయులుగాను

వ్యవహరించcబడుచున్నారు. ఆ ధిష్ణియుల నతిక్రమించరాదని ''ప్రాణా వా ఏతే యద్ధిష్ణియాఃʼʼ అను శ్రుతి నిషేధమును విధించినది. ఆ విధముగనే యిచటc గూడ ఇడాభక్షణమునకై వేదియొక్క ఉత్తరభాగమునందు ఉంటున్న బ్రహ్మాదులైన ఋత్విజులయొక్క మధ్యమందు సంచరించుచో ప్రాణాపహారమైన బాధకమును చెప్పి, తత్పరిహారమునకై భక్ష్యమైన పురోడాశ భాగమును వేఱుచేసి యా బ్రహ్మాదిఋత్విజుల కొసcగుటకై యధ్వర్యుడు హస్తమునందు పట్టుకొని సంచరించవలెనని యిచట విధించcబడినది. ఆ విధముగc జేయుటచే యజ్ఞమునకు విఘ్నము లేకుండుటవలన యజమానునకు స్వర్గలోకమును మిగిల్చినవాc డగును. యజమానున కిహలోకమునందుc గూడ ప్రాణబాధ యుండదు.

2. మంత్రము : **పురస్తాత్ప్రత్యఙ్ఙాసీనః । ఇడాయా ఇడామాదధాతి । హస్త్యాగ్ం హోత్రే । పశవో వా ఇడా । పశవః పురుషః। పశుష్వేవ పశూన్ప్రతిష్ఠాపయతి । ఇడాయై వా ఏషా ప్రజాతిః (2) । తాం ప్రజాతిం యజమానోఽను ప్రజాయతే ।**

అర్థము : (అధ్వర్యుః=అధ్వర్యుcడు,) పురస్తాత్=పాత్రమునందలి యిడకు పూర్వభాగమున, ప్రత్యఙ్ ఆసీనః= పశ్చిమ ముఖముగ కూర్చున్నవాcడై, ఇడాయాః=సర్వసాధారణమైన యిడనుండి, హస్త్యమ్= హస్తయోగ్యమైన (అల్పమైన), ఇడామ్=ఇడను, (ఆదాయ=తీసి) హోత్రే= హోతకొఱకు (హోతృ హస్తమునందు), ఆదధాతి=ఉంచవలెను. ఇడా=ఇడ, పశవః వై=పశుస్వరూపమే. పురుషః=పురుషుcడు, పశవః= పశుస్వరూపుcడు. తథా సతి=(అట్లు కాగా, అధ్వర్యుః=అధ్వర్యుcడు,) పశుష్వేవ=పశువుల యందే, పశూన్=పశువులను, ప్రతిష్ఠాపయతి=ప్రతిష్ఠింపcజేసినవాc డగుచున్నాcడు. ఏషా=ఈ యవాంతరమైన యిడ, మహత్యాఃఇడాయాః వై=గొప్పదైన సాధారణమైన యిడకే, ప్రజాతిఃసంతతి రూపము. తాం ప్రజాతిమ్ అను=ఆ సంతతి ననుసరించి, యజమానఃయజమానుcడు, ప్రజాయతే= ప్రకర్షముగ పుట్టుచున్నాcడు.

తాత్పర్యము : అధ్వర్యుcడు పాత్రస్థితమైన ఇడకు (పురోడాశమునకు) పూర్వభాగమున పశ్చిమముఖుcడుగ నాసీనుcడై సర్వసాధారణమైన యిడనుండి (పురోడాశమునుండి) హోతకై విభజించి యిచ్చుటకై యతని హస్తమునకు యోగ్యమైన అల్పమైన యిడను తీసి హోతృహస్తమునం దుంచవలెను. ''గౌర్వా అన్యై శరీరమ్ʼʼ అని యిడాభిమానిదేవతారూప శ్రవణమువలన యిడ పశుస్వరూపము. నరమేధమునందు పురుషుcడాలభ్యుcడుగc జెప్పcబడుటవలన పురుషుcడు కూడ పశుస్వరూపుcడే. ఈ యవాంతరమైన మొదటి సాధారణపురోడాశము నుండి పుట్టుటవలన ఇది యా సాధారణమైన యిడకు సంతతి. ఆ సంతతి ననుసరించియే యజమానుcడు ప్రకర్షముగ పుట్టుచున్నాcడు. అనcగా ఆ యిడవలన యజమానునకు సంతతి పుట్టుచున్నది. ఇచట అవాంతరమైన యిడ విధించcబడినది.

3. మంత్రము : **ద్విరజుర్లావనక్తి పర్వణోః । ద్విపాద్యజమానః ప్రతిష్ఠిత్యై ।**

అర్థము : ద్విరఙ్గులౌ=రెండు ప్రేళ్లను, పర్వణోఃరెండు పర్వములందు (గనుపులందు) అనక్తి=ఆజ్యముతో పూయవలెను. యజమానఃయజమానుఁడు, ద్విపాత్=రెండు పాదములు కలవాఁడు. ఏతత్=ఈ యాజ్యలేపనము, ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : అధ్వర్యుఁడు హోతయొక్క రెండు ప్రేళ్లను ఆజ్యముతో పూయవలెను. యజమానుఁడు రెండు పాదములు కలవాఁడు. ఈ యాజ్యలేపనము వలన హోత రెండు పాదములచే స్థైర్యముగ నుండుటకు వీలగును. ప్రతిష్ఠితి యనఁగా రెండు పాదములచే స్థైర్యముతో నుండుట. ఇచట హోతయొక్క ప్రదేశినికి రెండు పర్వములందు ఆజ్యముచే అంజనము విధించఁబడినది.

4. మంత్రము : **సకృదుపస్తృణాతి । ద్విరాదధాతి । సకృదభిఘారయతి । చతుఃసంపద్యతే । చత్వారి వై పశోఃప్రతిష్ఠానాని। యావానేవ పశుఃతముపహ్వయతే (3)।**

అర్థము : సకృత్=ఒక్కపర్యాయము, ఉపస్తృణాతి=ఉపస్తరణము చేయవలెను. ద్విఃరెండు మాఱులు, ఆదధాతి=అవాంతరేడను ఉంచవలెను. సకృత్=ఒకమాఱు, అభిఘారయతి=ఆజ్యముచే ఇడ నభిఘురించవలెను. చతుఃసంపద్యతే=మొత్తము ఉపస్తరణాధానాభిఘారముల సంఖ్య నాలుగు ఏర్పడుచున్నది. పశోఃపశువుయొక్క, ప్రతిష్ఠానాని=పాదములు, చత్వారివై=నాలుగే. పశుఃపశువు, యావానేవ=ఏ మాత్రము పరిమితి కలదో, తమ్=తావత్పరిమితి కల పశువును, ఉపహ్వయతే=అధ్వర్యుఁ డాహ్వానము చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : మొత్తము పురోడాశమునం దొకమాఱు ఉపస్తరణము చేసి (ఆజ్యముచే నభిఘురించి) రెండు మాఱులు సంపూర్ణపురోడాశమునుండి హస్తయోగ్యమైన యిడ నవదానము చేసి (హోతయొక్క హస్తమునం దుంచి) ఆ యవాంతరమైన యిడను ఒకమాఱు ఆజ్యముచే నభిఘురించవలెను. మొత్తము ఉపస్తరణాదుల సంఖ్య నాలుగగును. పశువునకు పాదములు నాలుగే యుండును. ఇడ పశురూపముగ పూర్వము వర్ణించఁబడినది. చతురవత్తమైన యిడను గ్రహించుటవలన చతుష్పాదమైన పశువునే యాహ్వానించినట్లగును. అనఁగా ఇడాభాగ భక్షణమునకై అనుజ్ఞాపించఁబడినవాఁ డగును. ఇచట చతురవత్తమైన పురోడాశభాగమును హోత హస్తమునందు ధరించి భక్షణానుజ్ఞకై హౌత్రకాండమందు పఠితమై ''ఉపహూతగ్ం రథంతరమ్'' ఇత్యాదికమైన యనువాకమును పఠించవలెను.

5. మంత్రము : **ముఖమివ ప్రత్యుపహ్వయేత । సంముఖానేవ పశూనుపహ్వయతే ।**

అర్థము : ముఖమేవ=హోతయొక్క ముఖమునే, అభివీక్ష్య=అభిముఖముగ వీక్షించి, ప్రత్యుపహ్వయేత=అధ్వర్యు యజమానులు ప్రత్యుపాహ్వానరూపమైన మంత్రాంతరమును పఠించవలెను. సంముఖానేవ పశూన్=అభిముఖములైన పశువులనే, ఉపహ్వయతే=ఉపాహ్వానము చేసిన ట్లగును.

తాత్పర్యము : హోత హౌత్రకాండమందలి ''ఉపహూతగ్ం రథంతరమ్'' ఇత్యాదికమైన యనువాకమును పఠించుచుండఁగా తన్మధ్యమున అధ్వర్యు యజమానులు ప్రత్యుపాహ్వానరూపమైన మంత్రాంతరమును హోతృ ముఖమునే యభివీక్షించి పఠించవలెను. అప్పుడు అభిముఖములైన పశువులనే యాహ్వానించిన ట్లగును. ఇచట ప్రత్యుపాహ్వానము విహితమైనది.

6. మంత్రము : **పశవో వా ఇడా । తస్మాత్సా కన్వారభ్యా । అధ్వర్యుణా చ యజమానేన చ ।**

అర్థము : ఇడా=ఇడ, పశవః వై=పశురూపమే. తస్మాత్=ఆ కారణమువలన, సా=ఆ యిడ, అధ్వర్యుణా చ=అధ్వర్యుని చేతను, యజమానేన చ=యజమానునిచేతను, అన్వారభ్యా=స్పృశింపcబడినదై, భవేత్=కావలెను.

తాత్పర్యము : ఇడ పశురూపమే కావున అధ్వర్యు యజమానులు హోతృహస్తగతమైన యిడను తాcకవలెను. ఇచట అధ్వర్యు యజమానులకు హోతృహస్తగతేడాస్పర్శనము విహిత మైనది.

7. మంత్రము : **ఉపహూతః । పశుమానసానీత్యాహ। ఉపహ్వానౌ హ్వయతే హోతా । ఇడాయై దేవతానాముపహవే ।**

అర్థము : (యదా=ఎప్పుడు,) హోతా=హోత, ఇడాయై=ఇడకొఱకు, దేవతానామ్=దేవతలయొక్క, ఉపహవే=అనుజ్ఞాపనమును, కుర్వన్=చేయుచు, ఏనౌ=ఈ యధ్వర్యు యజమానులను, ఉపహ్వయతే=ఆహ్వానించుచున్నాcడో, తదా=అప్పుడు, 'ఉపహూతః (అహమ్)=అధ్వర్యుcడనైన నేను దేవతలచే ననుజ్ఞాతుcడనైతిని. తతః=అందువలన, ఇడా భక్షణేన=ఇడా భక్షణముచేత, పశుమాన్=పశుమంతుc డను, అసాని=అగుదును'' ఇతి=అని, ఆహ=''ఉపహూతః పశుమానసాని'' అను మంత్రాంతరము నధ్వర్యుcడు, యజమానుcడును పఠించవలెను. 'అహం యజమానః దేవైః అనుజ్ఞాతః. తతః ఇడా భక్షణేన పశుమాన్ అసాని'అని యజమానపరముగ మంత్రార్థమును సమన్వయించవలెను.

తాత్పర్యము : హోత యిడకై దేవతలయనుజ్ఞాపనమును చేయుచుండcగా అధ్వర్యు యజమానుల నాహ్వానించినపుడు 'అధ్వర్యుcడనైన నేను దేవతలచే ననుజ్ఞాతుcడను. కనుక ఇడా భక్షణముచే నేను పశుమంతుcడ నగుదును' అను నర్థము కల ''ఉపహూతః పశుమానసాని'' అను మంత్రాంతరము నధ్వర్యుcడు పఠించవలెను. ఈ విధముగనే 'యజమానుcడనైన నేను దేవతలచే ననుజ్ఞాతుcడను. కనుక ఇడా భక్షణముచే పశుమంతుcడ నగుదును' అను నర్థము కల ''ఉపహూతః పశుమానసాని'' అను మంత్రాంతరమును యజమానుcడు కూడ పఠించవలెను. ''దైవ్యా అధ్వర్యవ ఉపహూతా ఉపహూతోఽయం యజమాన ఇతి మన్త్రావయవాభ్యామాభ్యాం తయోరుపహవః.'' ఉపహవః=అనుజ్ఞాపనము.

8. మంత్రము : **ఉపహూతః పశుమాన్భవతి । య ఏవం వేద (4) ।**

అర్థము : యః=ఏ పురుషుcడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాcడో, సః=అతcడు, ఉపహూతః=దేవతలచే ననుజ్ఞాతుcడై, పశుమాన్=పశుమంతుcడు, భవతి=అగుచున్నాcడు.

తాత్పర్యము : ఈ పూర్వోక్తవిధముగ తెలిసికొనిన పురుషుcడు దేవతలచే ననుజ్ఞాతుడై పశుమంతుc డగును. ఇచట తద్వేదనము ప్రశంసించcబడినది.

9. మంత్రము : **యాం వై హస్త్యామిడా మాదధాతి । వాచః సా భాగధేయమ్ । యాముపహ్వయతే । ప్రాణానాగ్ం సా ।**

వాచం చైవ ప్రాణాగ్ంశ్చావరున్ధే ।

అర్థము : యాం హస్త్యామ్ ఇడాం వై=హస్తయోగ్యమైన యే యిడనే, ఆదధాతి=అధ్వర్యుcడు ప్రధానపురోడాశము నుండి తీసి హోతయొక్క హస్తమునందుంచుచున్నాcడో, సా=అది, వాచః=వాగ్దేవత యొక్క, భాగధేయమ్=భాగము. యామ్=ఏ యిడను, ఉపహ్వయతే=ఆహ్వానము చేయుచున్నాcడో, సా=అది, ప్రాణానామ్=ప్రాణదేవతలయొక్క, భాగధేయమ్. అతః=ఈ కారణమువలన, అయమ్=ఈ యజమానుcడు, వాచం చ= వాక్కును, ప్రాణాన్ చ=ప్రాణములను, అవరున్ధే ఏవ=నిశ్చయముగ పొందును.

తాత్పర్యము : అవాంతరేడయొక్క అవదానము, తదుపాహ్వానము వాక్ప్రాణదేవతలకు ప్రియమని యిచట శ్రుతి స్తుతించినది. తాత్పర్యము స్పష్టము.

10. మంత్రము :**అథ వా ఏతర్హ్యుపహూతాయా మిడాయామ్ । పురోడాశశ్యైవ బర్హిషదో మీమాగ్ంసా ।**

అర్థము : అథ=అనంతరము, ఇడాయామ్ ఉపహూతాయాం సత్యామ్=అవాంతరేడ యాహ్వానించcబడిన దగుచుండగా, పురోడాశస్య=అవశిష్టపురోడాశమునకు, ఏతర్హి ఏవ=ఈ కాలమందే, బర్హిషదః మీమాంసా= బర్హిస్థాపనసంబంధినియైన యొకానొక మీమాంస, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఇడావదానానంతరము హోతచే ఆ యవాంతరేడ యాహ్వానించcబడిన దగుచుండcగా ఈ సమయమునందే యవశిష్టపురోడాశమును బర్హిస్సునందుంచవలెనా? లేదా? అను మీమాంస యేర్పడుచున్నది. బర్హిస్సునందు అవశిష్ట పురోడాశ స్థాపనమును విధించుటకై యిచట ప్రస్తుతి చేయcబడినది.

11. మంత్రము :**యజమానం దేవా అబ్రువన్ । హవిర్నో నిర్వపేతి । నాహమభాగో నిర్వప్స్యామీత్యబ్రవీత్ (5) । న మయా ऽభాగయా ऽనువక్ష్యేతి వాగబ్రవీత్ । నాహమభాగా పురోనువాక్యా భవిష్యామీతి పురోనువాక్యా। నాహమభాగా యాజ్యా భవిష్యామీతి యాజ్యా । న మయా ऽ భాగేన వషట్కరిష్యేతి వషట్కారః ।**

యద్యజమానభాగం నిధాయ పురోడాశం బర్హిషదం కరోతి । తానేవ తద్భాగినః కరోతి ।

అర్థము : 'నః=మాకు, హవిః=హవిస్సును, నిర్వప=నిర్వాపము చేయుము' ఇతి=అని, దేవాః=దేవతలు, యజమానమ్=యజమానునిcగూర్చి, అబ్రువన్=పలికిరి. 'అభాగః=పురోడాశభాగ రహితుcడనైన, అహమ్=నేను, న నిర్వప్స్యామి=హవిర్నిర్వాపము చేయలేను' ఇతి=అని, అబ్రవీత్=యజమానుcడు దేవతలతో పలికెను. 'అభాగయా=భాగరహితనైన, మయా=నాచేత (వాక్కుచేత), న అనువక్ష్యథ= అనువచనమును పలికించవద్దు', ఇతి=అని, వాక్=వాగ్దేవి, అబ్రవీత్=పలికెను. 'అహమ్=నేను, అభాగా= పురోడాశభాగరహితనై, పురోనువాక్యా=పురోనువాక్యను, న భవిష్యామీతి=కాలేనని' పురోవాక్యా= పురోనువాక్య, అబ్రవీత్= పలికెను. 'అహమ్= నేను, అభాగా= భాగరహితనై, యాజ్యా= యాజ్యను, న భవిష్యామీతి= కాలేనని' యాజ్యా, అబ్రవీత్. 'అభాగేన=భాగరహితమైన, మయా=నాచేత, న వషట్కరిష్యథ= వషట్కారము చెప్పించవలదని' వషట్కారః, అబ్రవీత్.

యజమానభాగమ్=పురోడాశమునుండి యజమానభాగమును, నిధాయ=ఉంచి (అవదానము చేసి), పురోడాశమ్=అవశిష్ట పురోడాశమును, బర్హిషదమ్=బర్హిస్సునందు ఉన్నదానినిగా, కరోతి యత్=చేయుచున్నచో, తానేవ (దేవాన్)=ఆ వాగాద్యభిమానదేవతలనే, తద్భాగినఃఆ పురోడాశభాగము కలవారినిగా, కరోతి =చేసినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : యజమాన వాగాద్యభిమానిదేవతలు భాగ రహితులై స్వస్వవ్యాపారమును చేయుట లేదు. అందువలన అధ్వర్యుcడు యజమానునకు ఒక పురోడాశభాగమును వేఱుగా నుంచి, యవశిష్టమైన పురోడాశమును బర్హిస్సునందు స్థాపించవలెను. ఆ స్థాపనమాత్రముచే తాము పురోడాశభాగవంతులమని దేవతలకు తుష్టి కలుగును. యాజ్యా పురోనువాక్యా వషట్కార శబ్దార్థములు పూర్వము వివరించcబడినవి. అవశిష్ట పురోడాశమును బర్హిస్సునందు స్థాపించుటవలన ప్రయోజనము లేదని పూర్వపక్షము ప్రాప్తము కాcగా, దేవతలకు సభాగత్వము ప్రయోజనమని తలcచి యీ బ్రాహ్మణము (శ్రుతి) పురోడాశమునకు బర్హిస్థాపనమును విధించినది.

12. మంత్రము :**చతుర్ధా కరోతి చతస్రో దిశః । దిక్ష్వేవ ప్రతితిష్ఠతి ।**

అర్థము : (అధ్వర్యుఃఅధ్వర్యుcడు) చతుర్ధా=బర్హిస్సునందు స్థాపించcబడిన పురోడాశమును నాలుగు భాగములుగా, కరోతి=చేయవలెను. దిశఃధిక్కులు, చతస్రఃనాలుగు. అతఃఈ కారణమువలన, అయమ్=ఈ యజమానుcడు, దిక్షుదిక్కులందు, ప్రతితిష్ఠత్యేవనిశ్చయముగ ప్రతిష్ఠితుc డగును.

తాత్పర్యము : అధ్వర్యుcడు బర్హిస్సునందు స్థాపితమైన పురోడాశమును నాలుగు భాగములుగాc జేయవలెను. దిక్కులు నాలుగు కనుక యజమానుcడు నాలుగు దిక్కులందు ప్రతిష్ఠితుc డగును. బర్హిస్థాపిత పురోడాశమునకు విభాగ మిచట విధించcబడినది.

13. మంత్రము :**బర్హిషదం కరోతి (6) । యజమానో వై పురోడాశః । ప్రజా బర్హిః । యజమానమేవ ।**

ప్రజాసు ప్రతిష్ఠాపయతి। తస్మాదస్థ్నాకన్యాః ప్రజాః ప్రతితిష్ఠన్తి । మాగ్ంసేనాన్యాః ।

అర్థము : బర్హిషదం కరోతి=అవశిష్ట పురోడాశమును బర్హిస్సునందు ఉన్నదానినిగాc జేయవలెను. పురోడాశఃపురోడాశము, యజమానఃవై=యమాన స్వరూపమే. బర్హిఃబర్హిస్సు, ప్రజా=ప్రజా స్వరూపము. (అతఃఈ కారణము వలన, అయమ్=ఈ యధ్వర్యుcడు,) యజమానమ్=యజమానుని, ప్రజాస్వేవ= ప్రజలయందే, ప్రతిష్ఠాపయతి=ప్రతిష్ఠించినవాc డగుచున్నాcడు. తస్మాత్=కఠినమైన పురోడాశము మృదువైన బర్హిస్సునందు స్థాపించcబడుటవలన, అన్యాఃప్రజాఃఇతర ప్రజలు (కొందఱు), అస్థ్నా=కఠినమైన యెముకచేత, ప్రతితిష్ఠన్తి=ప్రతిష్ఠితు లగుచున్నారు (దృఢముగ నుంటున్నారు). మాంసేన=మాంసముచేత, అన్యాఃఇతరప్రజలు (స్థూలకాయులు), ప్రతితిష్ఠన్తి.

తాత్పర్యము : బర్హిస్సునందు స్థాపితమైన కఠినమైన పురోడాశమునకు మృదువైన బర్హిస్సునకు సంయోగ మేర్పడుటవలన లోకమునందు కొందఱు ప్రజలు కఠినమైన యెముకచేత దృఢముగ నుంటున్నారు. కొందఱు

(స్థూలకాయులు) మాంసముచే దృఢముగ నుంటున్నారు. ఇచట పూర్వోక్తవిధి ననువదించి శ్రుతి ప్రశంసించినది.

14. మంత్రము :**అథో ఖల్వాహుః । దక్షిణా వా ఏతా హవిర్యజ్ఞస్యాన్తర్వేద్యవరుధ్యన్తే । యత్పురోడాశం బర్హిషదం కరోతీతి।**

అర్థము : అథో=మఱియు, ఆహుః ఖలు=మంత్రజ్ఞులు చెప్పుచున్నారు కదా! పురోడాశమ్=పురోడాశహవిస్సును, బర్హిషదం=బర్హిస్సునందు ఉన్నదానినిగా, కరోతి యత్=చేయుచున్నచో, ఏతాః దక్షిణాః వై=ఈ దక్షిణలే, హవిర్యజ్ఞస్య=పురోడాశహవిష్కమైన హవిర్యజ్ఞముయొక్క, అన్తర్వేది=వేదిమధ్యయందు, అవరుధ్యన్తే=పొందcబడుచున్నవి.

తాత్పర్యము : పురోడాశము హవిస్సుగాcగల యజ్ఞము హవిర్యజ్ఞ మనcబడును. పురోడాశమును బర్హిస్సునందు పురోడాశ స్థాపనము చేయుచో, ఈ దక్షిణలు హవిర్యజ్ఞముయొక్క వేదిమధ్యమందే పొందcబడుచున్నవని మంత్రజ్ఞులు చెప్పుచున్నారు కదా! ప్రకారాంతరముగ పూర్వోక్తవిధి యిచట ప్రశంసించcబడినది.

15. మంత్రము :**చతుర్ధా కరోతి । చత్వారో హ్యేతే హవిర్యజ్ఞస్యర్త్విజః (7) । బ్రహ్మా హోతాఽధ్వర్యురగ్నీత్ ।**

అర్థము : చతుర్ధా కరోతి=పూర్వోక్త పురోడాశశేషమును నాలుగుభాగములుగాc జేయవలెను. (ఇది పూర్వోక్త విధియే.) హవిర్యజ్ఞస్య=హవిర్యజ్ఞమునకు, ఋత్విజః=ఋత్విజులు, చత్వారః హి=నలుగురు కదా! ఏతే=ఈ ఋత్విజులు, బ్రహ్మా, హోతా, అధ్వర్యుః, అగ్నీత్=బ్రహ్మా, హోత, అధ్వర్యుcడు, అగ్నీధ్రుcడు అనువారు.

తాత్పర్యము : స్పష్టము. ఇచట శ్రుతి విధ్యంతరము ననువదించి తత్ప్రశంస చేసినది.

16. మంత్రము :**తమభిమృశేత్ । ఇదం బ్రహ్మణః । ఇదగ్ం హోతుః । ఇదమధ్వర్యోః । ఇదమగ్నీధ ఇతి । యథైవాదః**

సౌమ్యేఽధ్వరే । ఆదేశమృత్విగ్భ్యో దక్షిణా నీయన్తే । తాదృగేవ తత్ ।

అర్థము : ఇదమ్=పురోడాశముయొక్క నాలుగు భాగములలో ఒకభాగమైన యీ పురోడాశహవిస్సు, బ్రహ్మణః=బ్రహ్మకు, నిర్దిష్టమ్=నిర్దేశించcబడినది. ఇదమ్=ఈ హవిస్సు, హోతుః=హోతకు, నిర్దిష్టమ్. ఇదమ్, అధ్వర్యోః, నిర్దిష్టమ్, ఇదమ్, ఆగ్నీధ్రుః=అగ్నీధ్రునకు, నిర్దిష్టమ్. తమ్=ఆ నాలుగువిధములైన హవిస్సును, అభిమృశేత్=అభిమర్శించవలెను (తాcకవలెను). యథా=ఏ విధముగ, సౌమ్యే అధ్వరే= సోమయాగము నందు, ఆదేశమ్ అదః=నిర్దేశముననుసరించి, ఋత్విగ్భ్యః=ఋత్విజులకొరకు, దక్షిణాః=దక్షిణలు, నీయన్తే=పొందించcబడుచున్నవో, తత్=బ్రహ్మాది ఋత్విజులకు నిర్దిష్టమైన యా హవిస్సు, తాదృగేవ=అటువంటిదే.

తాత్పర్యము : అవశిష్టపురోడాశమును నాలుగుభాగములుగా విభజించవలెనని పూర్వము చెప్పcబడినది. ఆ నాలుగు హవిర్భాగములలో ఒక్కొక్కభాగము బ్రహ్మాదిఋత్విజులలో ఒక్కొక్కరికి చొప్పున నిర్దేశము చేసి దాని నభిమర్శించవలెను. చేతితో తాcకి నిర్దేశించవలెనని యర్థము. సోమయాగమునందు మాధ్యందినసవనమున

దక్షిణలుగా నీయcదగిన ద్రవ్యములను వేదియందు కృష్ణాజినముపైని పఱచి ఇది బ్రహ్మకు, ఇది హోతకు అని యీ విధముగ నాదేశించి యా దక్షిణలు ఋత్విజుల కీయcబడును. ఇది కూడ నటువంటిదే. ఇచట తత్తద్భాగముయొక్క నిర్దేశము విధించcబడినది.

17. మంత్రము :**అగ్నీధే ప్రథమాయా dధాతి (8) । అగ్నిముఖా హ్యృద్ధిః । అగ్నిముఖామేవర్ధి యజమాన ఋధ్నోతి।**

అర్థము : ప్రథమాయ=ప్రథముcడైన, అగ్నీధే=ఆగ్నీధ్రునికొఱకు, ఆదధాతి=ప్రథమహవిర్భాగము నీయవలెను. (ఉంచవలెను). ఋద్ధిః=వృద్ధి, అగ్నిముఖా హి=అగ్నిహేతువుగాc గలది కదా! యజమానః=యజమానుcడు, అగ్నిముఖాం ఋద్ధిమేవ=అగ్ని హేతువుగాc గల వృద్ధి నభిలషించియే, ఋధ్నోతి=సమృద్ధుc డగుచున్నాcడు.

తాత్పర్యము : అగ్ని సమస్తయాగమునకు హేతువు కనుక వృద్ధిహేతు వగుచున్నాcడు. ఆ యగ్నిని దీపింపcజేయువాcడు (అగ్నిమ్ ఇన్ధే ఇతి అగ్నీత్) కనుక ఆగ్నీధ్రునకు ప్రాథమ్యము యుక్తము. బ్రహ్మాదులకు నిర్దిష్టములైన నాలుగు హవిర్భాగములలో ప్రథమమున హవిర్భాగమును ఆగ్నీధ్రున కీయవలెనని యర్థము. అగ్నిముఖమైన వృద్ధి ననుసరించియే యజమానుcడు వృద్ధి నొందుచున్నాcడు. నిర్దిష్ట హవిర్భాగములకు యౌగపద్య నివారణమునకై యీ శ్రుతి క్రమమును విధించినది.

18. మంత్రము :**సకృదుపస్తీర్య ద్విరాదధత్ । ఉపస్తీర్య ద్విరభిఘారయతి । షట్ సంపద్యన్తే । షడ్వా ఋతవః ।**

ఋతూనేవ ప్రీణాతి ।

అర్థము : సకృత్=ఒకమాఱు, ఉపస్తీర్య=ఉపస్తరణము చేసి, ద్విః ఆదధత్=రెండు మాఱులు పురోడాశహవిస్సునుంచవలెను. ఉపస్తీర్య=మఱల ఉపస్తరణము చేసి, ద్విః=రెండు మాఱులు, అభిఘారయతి=అభిఘరించవలెను. షట్ సంపద్యన్తే=మొత్తము ఉపస్తరణాదులు షట్సంఖ్యాకము లగుచున్నవి. షట్ వై ఋతవః=ఋతువులు షట్సంఖ్యాకములే. ఋతూనేవ=ఋతువులనే, ప్రీణాతి=సంతోషపఱచినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : అధ్వర్యుcడు ఆగ్నీధ్రునియొక్క హస్తమును పఱచి పురోడాశమును రెండు మాఱు లవదానము చేసి, మఱల హస్తమును పఱచి యా హస్తమునందలి పురోడాశమునందు రెండు మాఱు లభిఘారము చేయవలెను. ఈ విధముగc జేయుటవలన ఆఱు పర్యాయము లగును. ఋతువులు ఆఱే కనుక షట్సంఖ్యాసామ్యము ననుసరించి యధ్వర్యుcడు ఋతువులనే సంతోషపఱచినవాcడే యగును. ఈ బ్రాహ్మణము ఆగ్నీధ్రునిహస్తమునందు పురోడాశభాగాధాన ప్రకారమును విధించినది.

19. మంత్రము :**వేదేన బ్రహ్మణే బ్రహ్మభాగం పరిహరతి । ప్రాజాపత్యో వై వేదః । ప్రాజాపత్యో బ్రహ్మా (9) ।**

సవితా యజ్ఞస్య ప్రసూత్యై ।

అర్థము : వేదేన=దర్భలకట్టచే, బ్రహ్మణే=బ్రహ్మ యను ఋత్విజునికొఱకు, బ్రహ్మభాగమ్=పురోడాశమందలి బ్రహ్మభాగమును, పరిహరతి=ప్రదానము చేయవలెను. వేదః=దర్భలకట్ట, ప్రాజాపత్యః వై=ప్రజాపతి సంబంధియే. బ్రహ్మా=బ్రహ్మ యను ఋత్విజుఁడు, ప్రాజాపత్యః=ప్రజాపతిసంబంధి. యజ్ఞస్య=యజ్ఞమునకు, ప్రసూత్యై=అనుజ్ఞకొఱకు, సవితా=ప్రేరకుఁడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము : అధ్వర్యుఁడు దర్భలకట్టచే పురోడాశమందలి బ్రహ్మభాగమును బ్రహ్మకొఱ కీయవలెను. వేదమందు (దర్భలకట్టయందు) ప్రజాపతి యంతర్యామిగా నుండును కనుక దర్భలకట్ట ప్రాజాపత్య మగును. బ్రహ్మ కూడ అప్పుడప్పుడు అనుజ్ఞచేత యజ్ఞమునకు ప్రవర్తకుఁడు కనుక బ్రహ్మకు ప్రాజాపత్యత్వము సిద్ధించుచున్నది. ఇచట శ్రుతి బ్రహ్మకు పురోడాశభాగాధాన ప్రకారమును విధించినది.

20. మంత్రము :**అథ కామమన్యేన ।**

అర్థము : అథ=అనంతరము, కామమ్=ఇచ్ఛానుసారముగ, అన్యేన=వేదవ్యతిరిక్త సాధనమైన ప్రదానపాత్రముచే, భాగాంతరః దేయమ్=పురోడాశభాగాంతర మీయఁదగినది.

తాత్పర్యము : ఆగ్నీధ్రునకు, బ్రహ్మకు పురోడాశభాగము నొసఁగినపిమ్మట వేదవ్యతిరిక్త సాధనమైన ప్రదానపాత్రముచే భాగాంతరము నీయవలెను. ఇచట శ్రుతి వేదవ్యతిరిక్త సాధనమైన యేదియేని ఒక ప్రక్రాంతపాత్రముచే భాగాంతర మీయఁదగినదని విధించినది.

21. మంత్రము :**తతో హోత్రే ।మధ్యం వా ఏతద్యజ్ఞస్య ।యద్ధోతా ।మధ్యత ఏవ యజ్ఞం ప్రీణాతి ।**

అర్థము : తతః=బ్రహ్మకు పురోడాశభాగము నొసఁగినపిమ్మట, హోత్రే=హోతకొఱకు, భాగాంతరం దేయమ్=పురోడాశభాగాంతర మీయఁదగినది. హోతా యత్=ఏ హోత కలఁడో, ఏతత్=ఈ హోతృకర్మ, యజ్ఞస్య మధ్యం వై=యజ్ఞమునకు మధ్యమే. యజ్ఞస్య=యజ్ఞముయొక్క, మధ్యతః ఏవ=మధ్యము నుండియే, ప్రీణాతి=సంతోషపరచినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : సామిధేనీహోమముల నారంభించిన యనంతరము హోతృవ్యాపారము యజ్ఞమునందు ఉండుటవలన హోతృకర్మకు యజ్ఞమధ్యత్వము కలుగుచున్నది. కనుక బ్రహ్మకు పురోడాశభాగ మొసఁగినపిమ్మట హోతకు పురోడాశభాగ మీయవలెను. ఇచట హోతకు బ్రహ్మానంతర్యము విహిత మైనది.

22. మంత్రము :**అథాధ్వర్యవే ।ప్రతిష్ఠా వా ఏషా యజ్ఞస్య ।యదధ్వర్యుః ।**

అర్థము : అథ=హోతకు పురోడాశభాగము నిచ్చినయనంతరము, అధ్వర్యవే=అధ్వర్యునికొఱకు, భాగాంతరమ్=మఱియొక పురోడాశభాగము, దేయమ్=ఈయఁదగినది. అధ్వర్యుః యత్=అధ్వర్యు భాగ మనునది యేది కలదో, ఏషా=ఇది, యజ్ఞస్య=యజ్ఞమునకు, ప్రతిష్ఠా వై=సమాప్తియే.

తాత్పర్యము : హోతకు పురోడాశభాగము నిచ్చినయనంతర మధ్వర్యునకు పురోడాశభాగము నీయవలెను. సమిష్టియజుర్హోమపర్యంత మధ్వర్యుఁడు యజ్ఞమును సమాప్తి చేయుచున్నాఁడు కనుక హోత్రనంతరము అంతమున నధ్వర్యున కీయవలెను. ఇచట అధ్వర్యునకు హోత్రానంతర్యము విహిత మైనది.

23. మంత్రము :**తస్మాద్ధవిర్యజ్ఞస్తైతామేవా ऽऽవృతమను (10)। అన్యా దక్షిణా నీయన్తే। యజ్ఞస్య ప్రతిష్ఠిత్యై।**

అర్థము : తస్మాత్=ఆ కారణమువలన, హవిర్యజ్ఞస్య=హవిర్యజ్ఞముయొక్క, ఏతామేవ ఆవృతమను=ఈ ప్రకారము ననుసరించియే, అన్యాః దక్షిణాః=ఇతరములైన దక్షిణలు, నీయన్తే=ఋత్విజులకు పొందించబడుచున్నవి. ఏతత్=ఇది, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ప్రతిష్ఠిత్యై=సమాప్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : హోత్రనంతరము అధ్వర్యునకు భాగము నిచ్చుటవలన ఈ హవిర్యజ్ఞముయొక్క ప్రకారము ననుసరించియే యితరములైన దక్షిణలు ఋత్విజుల కీయబడుచున్నవి. ఈ విధముగ నిచ్చుటవలన యజ్ఞసమాప్తి యగును. శ్రుతి ఆగ్నీధ్రు నారంభించి యధ్వర్యుపర్యంతమైన క్రమము అన్వాహార్యాది దక్షిణయం దతిదేశించినది.

24. మంత్రము :**అగ్నిమగ్నీత్సకృత్సకృత్సంమృడ్ఢీత్యాహ। పరాజివ హ్యేతర్హి యజ్ఞః।**

అర్థము : ''అగ్నిమగ్నీత్సకృత్సకృత్సంమృడ్ఢి'' ఇతి ఆహ=''ఓ యాగ్నీధ్రుడా! అగ్నిని సకృత్సకృత్తుగ సంమార్జనము చేయుము'' అను నీ ప్రైషమంత్రము నధ్వర్యుడా గ్నీధ్రునిగూర్చి పలుకవలెను. ఏతర్హి=ఈ సమయమునందు, యజ్ఞః=యజ్ఞము, పరాక్ ఇవ హి=పరాఙ్ముఖమైనదివలె నుండును కదా!

తాత్పర్యము : అధ్వర్యుడా గ్నీధ్రునిగూర్చి ''అగ్నిమగ్నీత్సకృత్సకృత్సంమృడ్ఢి'' అను ప్రైషమంత్రమును పలుకవలెను. ఈ సమయము యజ్ఞము సమాప్తప్రాయము కనుక పరాఙ్ముఖమై యున్నదివలె నుండును. అందువలన సకృత్సంమార్జనము పర్యాప్తము. 'సకృత్సకృత్' అను వీప్సచే పరిధిసంమార్జనము కూడ లభ్యమగుచున్నది. ఇచట ఆగ్నీధ్రునిగూర్చి ప్రైషమంత్ర ముత్పాదిత మైనది.

25. మంత్రము :**ఇషితా దైవ్యా హోతార ఇత్యాహ। ఇషితగ్ం హి కర్మ క్రియతే। భద్రవాచ్యాయ ప్రేషితో మానుషః**

సూక్తవాకాయ సూక్తా బ్రూహీత్యాహ। ఆశిషమేవైతామాశాస్తే।

అర్థము : ''ఇషితా దైవ్యా హోతారః'' ఇతి ఆహ=ఓ హోతా! దేవహోతలు పరమేశ్వరునిచే ప్రేరణ చేయబడినారు అని యధ్వర్యుడు హోతనుగూర్చి ప్రైషమంత్రమును పలికెను. ఇషితం కర్మ=ఇచ్ఛయించబడిన (ప్రేరణచేయబడిన) కర్మ, క్రియతే హి=చేయబడుచున్నది కదా! ''భద్రవాచ్యాయ ప్రేషితో మానుషః సూక్తవాకాయ సూక్తా బ్రూహి'' ఇతి ఆహ=ఫలమును చెప్పుటకై ''అగ్నిర్హోతా'' ఇత్యాది శ్రుతిప్రసిద్ధులైన దేవహోతలు పరమేశ్వరునిచే ప్రేరణ చేయబడినారు. ''ఇదం ద్యావాపృథివీ భద్రమభూత్'' అను సూక్తమును పఠించుటకై మానుషహోత ప్రేషితుడాయెను. 'ఓ హోతా! నీవు సూక్తములను పఠించుము' అని యధ్వర్యుడు ప్రైషమంత్రమును హోతను గూర్చి పలికెను. ఏతామ్=ఈ సూక్తమును, ఆశిషమేవ=ఆశీస్సునుగానే, ఆశాస్తే=యజమానుడు తలచుచున్నాడు.

తాత్పర్యము : ఫలమును చెప్పుటకై ''అగ్నిర్హోతా'' ఇత్యాది శ్రుతి ప్రసిద్ధులైన దేవహోతలు పరమేశ్వరునిచే ప్రేషితు లైరి. ''ఇదం ద్యావాపృథివీ భద్రమభూత్'' ఇత్యాద్యనువాకమును (సూక్తమును) చెప్పుటకై మానుషహోత ప్రేషితుడాయెను కనుక ఓ హోతా! నీవు ఆ సూక్తమును పఠించుము'' అని యధ్వర్యుడు హోతను

గూర్చి ప్రైషమంత్రమును పలికెను. ప్రేరణచేయcబడిన కర్మ చేయcబడుచుండును కదా! యజమానుcడు దీనిని ఆశీస్సుగానే తలచుచున్నాcడు. హోతను గూర్చి యొకానొక ప్రైషమంత్ర మున్నదని చెప్పి దాని నీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

26. మంత్రము :స్వగా దైవ్యాహోతృభ్య ఇత్యాహ। యజ్ఞమేవ తత్స్వగా కరోతి । స్వస్తిర్మానుషేభ్య ఇత్యాహ। ఆశిషమేవైతామాశాస్తే । శంయోర్బ్రూహీత్యాహ। శంయుమేవ బార్హస్పత్యం భాగధేయేన సమర్ధయతి (11)। చరత్యధ్వర్యుః ప్రజాతిర్వ్యయతే వేదాబ్రవీద్బర్హిషదం కరోత్యృత్విజో దధాతి బ్రహ్మకను కరోతి చత్వారి చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే అష్టమోకనువాకః ॥౮॥

అర్థము : ''స్వగా దైవ్యా హోతృభ్యః స్వస్తిర్మానుషేభ్యః శంయోర్బ్రూహి'' అని యధ్వర్యుcడు హోతను గూర్చి పలికిన ప్రైషమంత్రము. ''స్వగా దైవ్యా హోతృభ్యః'' ఇతి ఆహ='ఈ యజ్ఞము దేవహోతలకు స్వాధీనమని' చెప్పుటచే, యజ్ఞమేవ=యజ్ఞమునే, తత్స్వగాకరోతి=ఆ దేవహోతలకు స్వాధీనము చేసినవాc డగుచున్నాcడు. ''స్వస్తిర్మానుషేభ్యః'' ఇతి ఆహ='మానుషహోతలకొఱకు స్వస్తి యగుcగాక' అని చెప్పుటచే, ఏతామ్ ఆశిషమేవ=దీని నాశీస్సుగానే తలcచుచున్నాcడు. ''శంయోర్బ్రూహి'' ఇతి ఆహ='ఓ హోతా! నీవు శంయుదేవ సంబంధియైన ''తచ్ఛంయోరావృణీమహే'' అను అనువాకమును పఠించుము' అని చెప్పుటచే, బార్హస్పత్యమ్=బృహస్పతికుమారుcడైన, శంయుమ్=శంయువును, భాగధేయేన=హవిర్భాగముచే, సమర్ధయతి=సమృద్ధునిగాc జేసినవాc డగుచున్నాcడు. శంయువను నతcడు బృహస్పతి పుత్రుcడు.

తాత్పర్యము : ''స్వగా దైవ్యా హోతృభ్యః'' అను ప్రైషమంత్రమునందు మూcడు వాక్యములు కలవు. ఆ మూcడు వాక్యములందుcగల స్వగాశబ్ద స్వస్తిశబ్ద శంయుశబ్దముల యభిప్రాయమును క్రమముగ నీ బ్రాహ్మణము తెలియcజేసినది. తాత్పర్యము స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు
అష్టమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే

నవమోఽనువాకః

1. మంత్రము : **అథ స్రుచావనుష్టుగ్భ్యాం వాజవతీభ్యాం వ్యూహతి । ప్రతిష్ఠా వా అనుష్టుక్ । అన్నం వాజః ప్రతిష్ఠిత్యై । అన్నాద్యస్యావరుద్ధ్యై ।**

వేదార్థదీపిక

అవతారిక: ఇంతఱకు ఇడాభాగాద్యనుష్ఠానము విధించఁబడినది. ఇఁక స్రుగ్వ్యూహనాదికము చెప్పఁబడుచున్నది. వ్యూహనము=విశేషముగ తుడుచుట.

అర్థము : అథ=ఇడాభాగాద్యనుష్ఠానాంతరము, స్రుచౌ=జుహూపభృత్తు లనెడి రెండు స్రుక్కులను, వాజవతీభ్యామ్=వాజశబ్ద ఘటితములైన, ఋగ్భ్యామ్ ''వాజస్య మా ప్రసవేన'' ఇత్యాదులైన రెండు ఋక్కులచేత (ఋక్కులను పఠించుచు), వ్యూహతి=వ్యూహనము (తుడుచుట) చేయవలెను. అనుష్టుక్=అనుష్టుచ్ఛందస్కమైన ఋక్కు, ప్రతిష్ఠా వై=ప్రతిష్ఠాహేతువే. అన్నమ్=అన్నము, వాజః=వాజశబ్దార్థము. ఏతత్=ఈ స్రుగ్వ్యూహనము, ప్రతిష్ఠాయై=ప్రతిష్ఠకొరకు, భవతి=అగుచున్నది. ఏతత్=వాజశబ్దఘటిత ఋక్పఠనము, అన్నాద్యస్య=శ్రేష్ఠమైన యన్నము యొక్క, అవరుద్ధ్యై=పొందుటకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఇడాభాగానుష్ఠానానంతరము ''వాజస్య ప్రసవేన'' ఇత్యాదులైన రెండు ఋక్కులను పఠించుచు జుహువు, ఉపభృత్తు అను రెండు స్రుక్కులను తుడువవలెను. నాలుగుపాదములచే గవాది పశువులు ప్రతిష్ఠితములైయుండువిధముగ నాలుగు పాదములు గల అనుష్టుచ్ఛందో ఋక్కు ప్రతిష్ఠాహేతు వగును. వాజశబ్దము అన్నవాచి కనుక వాజశబ్ద ఘటితములైన రెండు ఋక్కులు తినుటకు యోగ్యమైన యన్నమును పొందుటకు హేతువు లగును. ఇచట స్రుగ్వ్యూహనము విహిత మైనది.

2. మంత్రము : **ప్రాచీం జుహూమూహతి । జాతానేవ భ్రాతృవ్యాన్ప్రణుదతే । ప్రతీచీముపభృతమ్ । జనిష్యమాణానేవ ప్రతినుదతే । స విష్వచ ఏవాపోహ్య సపత్నాన్యజమానః । అస్మింల్లోకే ప్రతితిష్ఠతి (1) ।**

అర్థము : జుహూమ్=జుహువును, ప్రాచీమ్=ప్రాచీనముగ, ఊహతి=తుడువవలెను. (అనేన=ఈ ప్రాచీన వ్యూహముచే, అయమ్=ఈ యజమానుఁడు) జాతాన్ భ్రాతృవ్యానేవ=పుట్టిన శత్రువులనే, ప్రణుదతే=పోగొట్టువాఁ డగును. ఉపభృతమ్=ఉపభృత్తును, ప్రతీచీనమ్=ప్రతీచీనముగ, ఊహతి. (అనేన, అయమ్,) జనిష్యమాణానేవ=పుట్టఁబోవు శత్రువులనే, ప్రతినుదతే=పోఁగొట్టును. సః యజమానః=ఆ యజమానుఁడు, సపత్నాన్=శత్రువులను, విష్వచః ఏవ=వివిధ దిక్కులకు పలాయితు లగునట్లుగ, అపోహ్య=తొలఁగించి, అస్మిన్ లోకే=ఈ భూలోకమునందు, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగును.

తాత్పర్యము : పూర్వమంత్రమున సామాన్యాకారముగ విహితమైన స్రుగ్వ్యూహన మీ మంత్రమున విశేషాకారముగ విహిత మైనది. జుహూపభృత్తులలో జుహువును ప్రాచీనముగా వ్యూహనము చేయవలెను. ఈ స్రుగ్వ్యూహనముచే యజమానుc డప్పటివఱకుcగల శత్రువులను తొలcగించినవాc డగును. ఉపభృత్తును ప్రతీచీనముగా వ్యూహనము చేయవలెను. ఈ స్రుగ్వ్యూహనముచే యజమానుcడు భవిష్యత్తునందు సంభవించునట్టి శత్రువులను వివిధ దిక్కులందు పలాయితు లగునట్లు తొలcగించి యీ లోకమునందే ప్రతిష్ఠితుcడగును.

3. మంత్రము : **ద్వాభ్యామ్ । ద్విప్రతిష్ఠో హి।**

అర్థము : ద్వాభ్యామ్=రెండు ఱుక్కులచే వ్యూహనము చేయవలెను. ద్విప్రతిష్ఠః హి=మానవుcడు రెండు పాదములచే ప్రతిష్ఠ (గట్టియునికి) కలవాcడు కదా!

తాత్పర్యము : మంత్రమునందలి 'వాజవతీభ్యామ్' అను ద్విచనార్థము నిచట అనువదించి శ్రుతి ప్రశంసించినది. తాత్పర్యము స్పష్టము.

4. మంత్రము : **వసుభ్యస్త్వా రుద్రేభ్యస్త్వాకదిత్యేభ్యస్త్వేత్యాహ। యథాయజురేవైతత్ ।**

అర్థము : ''వసుభ్యస్త్వా రుద్రేభ్యస్త్వాఽఽదిత్యేభ్యస్త్వా'' ఇతి ఆహ='ఓ మధ్యమపరిధీ! నిన్ను వసువుల కొఱకు జుహూగతమైన ఆజ్యముచే పూయుచున్నాను. ఓ దక్షిణపరిధీ! నిన్ను రుద్రులకొఱకు జుహ్వాజ్యముచే పూయుచున్నాను. ఓ ఉత్తరపరిధీ! నిన్ను ఆదిత్యులకొఱకు జుహ్వాజ్యముచే పూయు చున్నాను' అని యధ్వర్యునివాక్కుగా శ్రుతి చెప్పినది. ఏషః ఈ మంత్రము, యథాయజుః ఏవ=స్పష్టార్థము కలదే.

తాత్పర్యము : వసుభ్యస్త్వేత్యాది మంత్రార్థము స్పష్టమే యని యీ బ్రాహ్మణము తెలిపినది.

5. మంత్రము : **స్రుక్షు ప్రస్తరమనక్తి । ఇమే వై లోకాః స్రుచః । యజమానః ప్రస్తరః । యజమానమేవ తేజసాకనక్తి ।**

త్రేధాకనక్తి । త్రయ ఇమే లోకాః (2) । ఏభ్య ఏవైనం లోకేభ్యోకనక్తి । అభిపూర్వమనక్తి ।

అభిపూర్వమేవ యజమానం తేజసాకనక్తి ।

అర్థము : స్రుక్షు=జుహ్వాది స్రుక్కులందు, ప్రస్తరమ్=ప్రస్తరమును, అనక్తి=తాcకించవలెను. స్రుచః=స్రుక్కులు, ఇమే లోకాః వై=ఈ భూరాదిలోక స్వరూపములే. ప్రస్తరః=ప్రస్తరము, యజమానః=యజమాన స్వరూపము. (అనేన=ప్రస్తరమును స్రుక్కులందు తాcకించుటచే, అయమ్=ఈ యధ్వర్యుcడు,) యజమానమేవ=యజమానునే, తేజసా=తేజస్సుతో, అనక్తి=కలిపినవాc డగుచున్నాcడు. త్రేధా=మూcడు మాఱులు, అనక్తి=తాcకించవలెను. ఇమే లోకాః=ఈ లోకములు, త్రయః=త్రిసంఖ్యాకములు. ఏభ్యః లోకేభ్యః ఏవ=ఈ లోకములకొఱకే, ఏనమ్=ఈ యజమానుని, అనక్తి= తాcకించినవాc డగుచున్నాcడు. అభిపూర్వమ్=అభిముఖముగ నగ్రము పూర్వదిశగా నుండనట్లుగ, అనక్తి=ప్రస్తరమును స్రుక్కులందు

తాcకించవలెను. యజమానమ్=యజమానుని, అభిపూర్వమేవ= అభిముఖముగానే, తేజసా=తేజస్సుతో, అనక్తి=తాcకించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : ప్రస్తరము నధ్వర్యుcడు స్రుక్కులందు తాcకించవలెను. ఈ భూరాది లోకములు మూcడే. ప్రస్తరము యజమాన స్వరూపము. కనుక యమానునే తేజస్సుతో తాcకించినవాc డగును. మూcడు మాఱులు తాcకించవలెను. ఈ లోకములు మూcడు కనుక, ఈ లోకములకొఱకే యీ యజమానుని తాcకించినవాc డగును. అభిముఖముగ ప్రస్తరాగ్రము ప్రాగ్దిశగ నుండునట్లు ప్రస్తరమును తాcకించవలెను. యజమానుcడు కూడ ముఖమునందే సభలందు వక్తృత్వముచే తేజస్వంతుc డగును. ఇచట స్రుక్కులందు ప్రస్తరాంజనము విధించcబడినది.

6. మంత్రము : **అక్తగ్ం రిహాణా ఇత్యాహ। తేజో వా ఆజ్యమ్ । యజమానః ప్రస్తరః । యజమానమేవ తేజసా కనక్తి ।**

అర్థము : ''అక్తగ్ం రిహాణాః'' ఇతి ఆహ='పశు లాజ్యముచే తడిసిన ప్రస్తరాగ్రమును నాకుచున్నవై వివిధ మార్గములకు పోవుcగాక' యని యధ్వర్యునివాక్కుగా శ్రుతి చెప్పినది. ఆజ్యమ్=ఆజ్యము, తేజః ఏవ=తేజోరూపమే. ప్రస్తరః=ప్రస్తరము, యజమానః=యజమానస్వరూపము. తతః=అందువలన, యజమానమేవ=యజమానునే, తేజసా=తేజస్సుతో, అనక్తి=తాcకించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : ఆజ్యము తేజోరూపమే. ప్రస్తరము యజమాన స్వరూపము. కనుక ప్రస్తరాగ్రము నాజ్యమునందు తాcకించిన యధ్వర్యుcడు యజమానునే తేజస్సుతో తాcకించినవాc డగును (తేజస్వంతునిగాc జేసినవాc డగును). ఇచట బ్రాహ్మణము మంత్రగతమైన అక్తశబ్దముయొక్క యభిప్రాయమును తెలిపినది.

7. మంత్రము : **వియన్తు వయ ఇత్యాహ। వయ ఏవైనంకృత్వా । సువర్గం లోకం గమయతి (3) ।**

అర్థము : ''వియన్తు వయః'' ఇతి ఆహ='స్రుక్కులందు అక్తమైన ప్రస్తరాగ్రమును పక్షులు (వయః) వివిధ మార్గములందు పోవుcగాక' అని మంత్రము అధ్వర్యునివాక్కుగా చెప్పినది. (అయమ్=ఈ యధ్వర్యుcడు,) ఏనమ్=ఈ యజమానుని, వయః ఏవ=పక్షినిగానే, కృత్వా=చేసి, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, గమయతి=పొందించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : స్రుగ్గతమైన నేతిని నాకి పక్షులు వివిధ మార్గములందు పోవుcగాక యని యధ్వర్యుcడు చెప్పినట్లు మంత్రము చెప్పుటచే నధ్వర్యుc డీ యజమానుని పక్షినిగానే చేసి స్వర్గలోకమునకు పంపుచున్నాcడని భావము. మంత్రమునందు ప్రథమా బహువచనాంతమైన విశబ్దము పక్షివాచి. బ్రాహ్మణమునందు మాత్రము 'వయః' అను శబ్దము ద్వితీయైకవచనాంతమని గ్రహించవలెను. ఈ బ్రాహ్మణము వి శబ్ద సూచితమును తెలియcజేసినది.

8. మంత్రము : **ప్రజాం యోనిం మా నిర్మృక్షమిత్యాహ। ప్రజాయై గోపీథాయ ।**

అర్థము : ''ప్రజాం యోనిం మా నిర్మృక్షమ్ '' ఇతి ఆహ= 'నేను (అధ్వర్యుcడు) మాత్రము ప్రజను, తత్కారణమును నశింపcజేయను' అని యధ్వర్యునివాక్కుగా శ్రుతి చెప్పినది. ఏతత్=ఈ కథనము, ప్రజాయై=ప్రజయొక్క (షష్ఠ్యర్థే చతుర్థీ.) గోపీథాయ=రక్షణముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : స్పష్టము. ఈ బ్రాహ్మణము 'మా నిర్మృక్షమ్' అను మంత్రభాగముయొక్క యభిప్రాయమును తెలియఁజేసినది.

9. మంత్రము : ఆప్యాయన్తామాప ఓషధయ ఇత్యాహ। ఆప ఏవౌషధీరాప్యాయయతి ।

అర్థము : ''ఆ ప్యాయన్తామాప ఓషధయః'' ఇతి ఆహ = 'ఆజ్యరూపములైన యుదకములు ప్రస్తరమూల రూపములైన యోషధులను తృప్తిపరచుఁగాక' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ఆపః = ఉదకములే, ఓషధీః = ఓషధులను, ఆప్యాయయతి (ఆప్యాయయన్తి) = తృప్తిపఱచుచున్నవి.

తాత్పర్యము : ఆజ్య రూపములైన యుదకములు ప్రస్తరమూల రూపములైన యోషధులను తృప్తిపఱచుఁగాక' అని మంత్రము చెప్పుటచే ఉదకములు ఓషధులను తృప్తిపఱచుచున్నవి. మంత్రమునందలి 'ఓషధయః' అనుచోట ద్వితీయ వివక్షితమని యీ బ్రాహ్మణము చెప్పినది.

10. మంత్రము :మరుతాం పృషతయః స్థేత్యాహ। మరుతో వై వృష్ట్యా ఈశతే । వృష్టిమేవావరున్ధే । దివం గచ్ఛ తతో నో వృష్టిమేరయేత్యాహ। వృష్టిర్వై ద్యౌః । వృష్టిమేవావరున్ధే (4) ।

అర్థము : ''మరుతాం పృషతయః స్థ'' ఇతి ఆహ = 'ప్రస్తరావయవములైన ఓ దర్భలారా! మీరు వాయుప్రేరిత వృష్టిజన్యము లగుటచే వాయువులయొక్క బిందువులుగా నుంటున్నారు' అని యధ్వర్యునివాక్కుగ మంత్రము చెప్పినది. మరుతః వై = వాయువులే, వృష్ట్యై = వర్షమునకై (వర్షమును కురియించుటకై), ఈశతే = సమర్థము లగుచున్నవి. అతః = ఈ కారణమువలన, వృష్టిమ్ = వర్షమును, అవరున్ధే ఏవ = యజ్ఞకర్త నిశ్చయముగ పొందును. ''దివం గచ్ఛ తతో నో వృష్టిమేరయ'' ఇతి ఆహ = 'ఓ ప్రస్తరమా! నీవు స్వర్గమునకు పొమ్ము. అటనుండి మాకొఱకు వర్షమును ప్రేరణచేయుము (పంపుము)' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ద్యౌః = దివి, వృష్టిః వై = వృష్టిస్వరూపమే (అతః = ఈ కారణమువలన, యజమానః = యజమానుఁడు,) వృష్టిమ్ = వర్షమును, అవరున్ధే ఏవ = నిశ్చయముగ పొందును.

తాత్పర్యము : అగ్రములు కల కొన్నిదర్భలను కట్టగాఁ గట్టి దానిని యజ్ఞమునందుపయోగించుచుందురు. దానికి ప్రస్తరమని వైదికవ్యవహారము. ఆ ప్రస్తరమును జుహ్వాది స్రుక్కులలోని యాజ్యమునం దానించి దాని నగ్నియందు పడవేయుచు నధ్వర్యుఁడు ప్రస్తరావయవములను సంబోధించి 'ఓ ప్రస్తరావయవములైన దర్భలారా! మీరు వాయుప్రేరితమైన వృష్టివలన పుట్టుటచే వాయువులయొక్క బిందువులుగా నుంటున్నారని యధ్వరుఁడనెను. మరుత్తులు వర్షమును కురియించుటకై సమర్థములే కనుక యజమానుఁడు వృష్టిని పొందును. మఱియు ' ఓ ప్రస్తరమా! నీవు దివికి వెళ్లి మాకొఱకు వృష్టిని ప్రేరణ చేయుమని యధ్వర్యుఁడు పలికెను. దివి వృష్టి స్వరూపమే కనుక యజమానుఁడు వర్షమును నిశ్చయముగ పొందును. 'మరుతాం పృషతయః స్థ' ఇత్యాది మంత్రము నీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

11. మంత్రము :**యావద్వా అధ్వర్యుః ప్రస్తరం ప్రహరతి । తావదస్యా ఽకయుర్మీయతే । ఆయుష్పా అగ్నేఽస్యా ఽకయుర్మే పాహీత్యాహ। ఆయురేవాత్మన్ధత్తే । యావద్వా అధ్వర్యుః ప్రస్తరం ప్రహరతి । తావదస్య చక్షుర్మీయతే । చక్షుష్పా అగ్నేఽసి చక్షుర్మే పాహీత్యాహ। చక్షురేవా ఽకత్మన్ధత్తే ।**

అర్థము : అధ్వర్యుః=అధ్వర్యుడు, యావత్ ప్రస్తరం వై=ఎంత ప్రస్తరమునే, ప్రహరతి=అగ్నియందు పడవేయు చున్నాడో, తావత్=అంత, అస్య=ఈ యధ్వర్యుని యొక్క, ఆయుః=ఆయువు, మీయతే=నష్టమగు చున్నది (ప్రాణవియోగ మేర్పడుచున్నది). అతః=ఈ కారణమువలన, ''ఆయుష్పా అగ్నేఽస్యాయుర్మే పాహి'' ఇతి ఆహ='ఓ యగ్నీ! నీవు ఆయువును పాలించువాడవ గుచున్నావు. కనుక నాయొక్క ఆయువును రక్షించుము' అని యధ్వర్యుడగ్నిని ప్రార్థించెను. (అనయా=ఈ ప్రార్థనచే, అయమ్=ఈ యధ్వర్యుడు,) ఆత్మన్=తనయందు, ఆయుః=ఆయువును, ధత్తే ఏవ=నిశ్చయముగ ధరించును. అధ్వర్యుః=అధ్వర్యుడు, యావత్ ప్రస్తరం వై=ఎంత ప్రస్తరమునే, ప్రహరతి=అగ్నియందు పడవేయు చున్నాడో, అస్య=ఈ యధ్వర్యునియొక్క తావత్ చక్షుః=అంత చక్షువు, మీయతే=వియుక్త మగుచున్నది. (అతః=ఈ కారణమువలన, అయమ్=ఈ యధ్వరుడు,) ''చక్షుష్పా అగ్నేఽసి చక్షుర్మే పాహి'' ఇతి ఆహ='ఓ యగ్నీ నీవు చక్షుష్పాలకుడవ గుచున్నావు. కనుక నా చక్షువును రక్షించుము' అని పలికెను (ప్రార్థించెను). అనయా=ఈ ప్రార్థనచే, అధ్వర్యుః=అధ్వర్యుడు, ఆత్మన్=తనయందు, చక్షుః=చక్షువును, ధత్తే ఏవ=నిశ్చయముగ ధరించును.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము ఆయుశ్చక్షువులయొక్క పాలనీయతను చూపినది. తాత్పర్యము స్పష్టము.

12. మంత్రము :**ధ్రువా ఽసీత్యాహ ప్రతిష్ఠిత్యై ।**

అర్థము : ''ధ్రువాఽసి'' ఇతి ఆహ='ఓ పృథివీ! స్థిరమైనదాన వగుచున్నావు' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠితికొఱకు (గట్టియునికికొఱకు), భవతి=అగుచున్నది.

తాత్పర్యము : అధ్వర్యుడు వేదిమధ్యమందలి భూమిని తాకుచు 'ఓ పృథివీ! నీవు స్థిరమైనదాన వగుచున్నావని యనుటచే నిది దృఢస్థితికొఱ కగును. 'ధ్రువాఽసి' అను మంత్రము నీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

13. మంత్రము :**యం పరిధిం పర్యధత్థా ఇత్యాహ(5) । యథాయజురేవైతత్ ।**

అర్థము : ''యం పరిధిం పర్యధత్థాః'' ఇతి ఆహ='ఓ యగ్నిదేవా! నీవు ఏ మధ్యమపరిధిని పశ్చిమభాగమునందు స్థాపించితివో' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, యథాయజురేవ=సత్యమే.

తాత్పర్యము : స్పష్టము. 'పర్యధత్థాః' అనునది సత్యమని యీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

14. మంత్రము :**అగ్నే దేవ పణిభిర్వీయమాణ ఇత్యాహ। అగ్నయ ఏవైనం జుష్టం కరోతి ।**

అర్థము : ''అగ్నే దేవ పణిభిర్వీయమాణః'' ఇతి ఆహ = 'ఓ యగ్నిదేవా! స్తుతులచే పొందcబడుచున్న నీవు' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. అతః=అధ్వర్యుcడీ విధముగc జెప్పుటవలన, అగ్నయే ఏవ=అగ్ని కొఱకే, ఏనమ్=ఈ పరిధిని, జుష్టమ్=ప్రియమైనదానినిగా, కరోతి=చేసినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : స్పష్టము. పరిధియం దగ్నికి ప్రీతిని కలుగcజేయుటకై 'అగ్నే దేవ!' అని అగ్నిసంబోధనము చేయcబడినదని యీ బ్రాహ్మణము చెప్పినది.

15. మంత్రము : **తం త ఏతమనుజోషం భరామీత్యాహ। సజాతానేవాస్మా అనుకాన్కరోతి ।**

అర్థము : ''తం త ఏతమనుజోషం భరామి'' ఇతి ఆహ = 'ఓ యగ్నీ! నీకు అనుకూలముగా ప్రియమైన యీ మధ్యమ పరిధిని నీయందు ఉంచుచున్నాను' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. (తత్=ఆ కారణము వలన, అగ్నిః=అగ్ని,) సజాతానేవ=జ్ఞాతులనే, అస్మై=ఈ యజమానునికొఱకు, అనుకూలాన్=అనుకూలులనుగా. కరోతి=చేయును.

తాత్పర్యము : స్పష్టము. మంత్రమునందలి అను శబ్దముచే జ్ఞాతుల యనురక్తత్వము సూచింపcబడుచున్నదని యీ బ్రాహ్మణము చెప్పినది.

16. మంత్రము : **నేదేష త్వదపచేతయాతా ఇత్యాహానుఖ్యాత్యై ।**

అర్థము : ''నేదేష త్వదపచేతయాతై'' ఇతి ఆహ = 'ఓ యగ్నిదేవా! ఈ మధ్యమపరిధి ఇది నీకిష్టము కానిది కాకపోవుcగాక' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ఏషః=ఈ యపరాగనిషేధము, అనుఖ్యాత్యై=అనుకూల్యముకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : స్పష్టము. అపరాగనిషేధము అనుకూల్యార్థమని యీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

17. మంత్రము : **యజ్ఞస్య పాథ ఉపసమిత మిత్యాహ। భూమానమేవోపైతి ।**

అర్థము : ''యజ్ఞస్య పాథ ఉపసమితమ్'' ఇతి ఆహ = 'ఓ దక్షిణోత్తరపరిధులారా! మీరు యజ్ఞముయొక్క ఫలరూపమైన యన్నమును పొందుడు'' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. (అనేన=ఈ చెప్పుటచే, యజమానః=యజమానుcడు,) భూమానమేవ=బహుదివ్యానుకూల్యమునే, ఉపైతి=పొందును.

తాత్పర్యము : ఓ దక్షిణోత్తరపరిధులారా! అని యనేకపరిధుల సహకథనము బహుదివ్యానుకూల్యముకొఱకని యీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది.

18. మంత్రము : **పరిధీన్ప్రహరతి । యజ్ఞస్య సమిష్ట్యై (6) ।**

అర్థము : పరిధీన్=పరిధులను, ప్రహరతి=అగ్నియందు పడవేయవలెను. ఏతత్=ఈ పరిధిప్రహరణము, యజ్ఞస్య=యజ్ఞము యొక్క, సమిష్ట్యై=సంపూర్తికొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : ఇతఃపూర్వము చెప్పcబడిన పరిధుల నగ్నియందు పడవేయవలెను. ఈ పరిధిప్రహరణము యజ్ఞముయొక్క సంపూర్తికొఱ కగును. ఈ బ్రాహ్మణము పరిధిప్రహరణమును విధించినది.

19. మంత్రము :**స్రుచౌ సంప్రస్రావయతి । యదేవ తత్ర క్రూరమ్ । తత్తేన శమయతి । జుహ్వాముపభృతమ్ ।**

యజమానదేవత్యా వై జుహూః । భ్రాతృవ్యదేవత్యోపభృత్ । యజమానాయైవ భ్రాతృవ్యముపస్తిం కరోతి।

అర్థము : స్రువౌ =జుహూపభృత్తులను, సంస్రావయతి=స్రవింపఁజేయవలెను. తత్ర=అచట, యదేవ=ఏదియేని, క్రూరమ్=క్రూరమో, తత్=ఆ క్రూరమును, తేన=ఆ సంస్రావము చేత, శమయతి=శాంతిపఁజేసినవాఁడగును. జుహ్వామ్=జుహువునందు, ఉపభృతమ్=ఉపభృదాజ్యమును, సంస్రావయతి. జుహూః=జుహువు, యజమానదేవత్యా వై=యజమానుఁడు దేవతగాఁ గలదియే. ఉపభృత్=ఉపభృత్తు, భ్రాతృవ్యదేవత్యా=శత్రువు దేవతగా గలది. తదా=అప్పుడు, యజమానాయైవ=యజమానునికొఱకే, భ్రాతృవ్యమ్=శత్రువును, ఉపస్తిమ్=సేవకునిగా (విధేయునిగా), కరోతి=చేసినవాఁడగుచున్నాఁడు. సంస్రావము=జుహూపభృత్తులచే హోమము చేయఁబడఁగా శేషించిన ఆజ్యము.

తాత్పర్యము : అధ్వర్యుఁడు జుహువునందు ఉపభృదాజ్యమును స్రవింపఁజేయవలెను. ఇట్లు చేయుటచే నందుఁగల క్రూరభాగమును శమింపఁజేసినవాఁడగును. జుహువు యజమానదేవత్యము. ఉపభృత్తు శత్రుదేవత్యము. జుహువునందు ఉపభృత్తులోని ఆజ్యశేషమును క్షరింపఁజేయుటవలన యజమానునకీ శత్రువుని సేవకునిగాఁ జేసినవాఁడగును. ఇది సంస్రావక్షరణవిధి.

20. మంత్రము:**సగ్ంస్రావభాగాఃస్థేత్యాహ। వసవో వై రుద్రా ఆదిత్యాఃసగ్ంస్రావభాగాః ।తేషాం తద్భాగధేయమ్ (7)।**

తానేవ తేన ప్రీణాతి ।

అర్థము : ''సంస్రావభాగాఃస్థ'' ఇతి ఆహ='ఓ విశ్వేదేవతలారా! మీరు సంస్రావాజ్యము భాగముగాఁ గలవారై యుంటున్నారు' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. వసవఃవసువులు, రుద్రాఃరుద్రులు, ఆదిత్యాఃవై=ఆదిత్యులే, సంస్రావభాగాఃసంస్రావాజ్యము భాగముగాఁ గలవారు. తేషామ్=ఆ వసురుద్రాదిత్యులకు, తత్=ఆ సంస్రావాజ్యము, భాగధేయమ్=భాగము. తానేవ=ఆ వస్వాదులనే, తేన=ఆ సంస్రావముచే, ప్రీణాతి=తృప్తిపరచినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము : విశ్వేదేవతలు సంస్రావభాగము కలవారై యుంటున్నారని యధ్వర్యునివాక్యమునుగా మంత్రము చెప్పినది. వసురుద్రాదిత్యులకు సంస్రావాజ్యము భాగము. కనుక అధ్వర్యుఁడు ఆ సంస్రావభాగముచేత ఆ వసురుద్రాదిత్యులనే తృప్తిపఱచినవాఁడగును. ఈ బ్రాహ్మణము ''సంస్రావభాగాఃస్థ'' అను మంత్రమును వ్యాఖ్యానించినది.

21. మంత్రము :**వైశ్వదేవ్యర్చా । ఏతే హి విశ్వే దేవాః । త్రిష్టుగ్భవతి । ఇన్ద్రియం వై త్రిష్టుక్ । ఇన్ద్రియమేవ యజమానే**

దధాతి ।

అర్థము : వైశ్వదేవ్యా ఋచా =విశ్వేదేవదేవతాకమైన (''సగ్ంస్రావభాగాఃస్థ''త్యాది) ఋక్కుచే, సంస్రావయతి= సంస్రావాజ్యము నధ్వర్యుcడు స్రవింపజేయవలెను. ఏతే=ఈ వస్వాదిరూపులు, విశ్వేదేవాఃహి=విశ్వే దేవదేవతలు కదా! త్రిష్టుక్ భవతి=''సగ్ంస్రావభాగాఃస్థ''త్యాది ఋక్కు త్రిష్టుక్ఛందస్సు అగుచున్నది. త్రిష్టుక్=త్రిష్టుక్ఛందస్సు, ఇన్ద్రియంవై=ఇంద్రియసామర్థ్య రూపమే (హేతువే). (అతఃఈ కారణమువలన, అయమ్=ఈ యజమానుcడు,) ఇన్ద్రియమేవ=ఇంద్రియసామర్థ్యమునే, యజమానే=యజమానుని యందు, దధాతి=స్థాపించినవాc డగుచున్నాcడు.

తాత్పర్యము : అధ్వర్యుcడు విశ్వేదేవదేవతాకమైన ''సగ్ంస్రావభాగాఃస్థ'' అను ఋక్కును పఠించుచు సంస్రావాజ్యమును స్రవింపcజేయవలెను. ఈ వసురుద్రాదిత్యులు విశ్వేదేవదేవతలు కదా! ఈ వైశ్వదేవియైన ఋక్కు త్రిష్టుక్ఛందోబద్ధమైయున్నది. త్రిష్టుక్ఛందస్సు ఇంద్రియసామర్థ్యహేతువు. కనుక ఈ త్రిష్టుక్ఛందోఋక్కును పఠించుచు సంస్రావమును స్రవింపcజేసిన యధ్వర్యుcడు యజమానునియం దింద్రియసామర్థ్యమునే స్థాపించినవాc డగును. ''సగ్ంస్రావభాగాఃస్థ'' అను మంత్రమునందలి దేవతాసంబంధమును, ఋక్కును, ఛందోవిశేషము నీ బ్రాహ్మణము ప్రశంసించినది.

22. మంత్రము :**అగ్నేర్వామపన్నగృహస్య సదసి సాదయామీత్యాహ। ఇయం వా అగ్నిరపన్నగృహః। అస్యా ఏవైనే సదనే సాదయతి। సుమ్నాయ సుమ్నినీ సుమ్నే మా ధత్తమిత్యాహ (8)। ప్రజా వై పశవః సుమ్నమ్। ప్రజామేవ పశూనాత్మన్ధత్తే। ధురి ధుర్యౌ పాతమిత్యాహ। జాయాపత్యోర్గోపీథాయ।**

అర్థము : ''అగ్నేర్వామపన్నగృహస్య సదసి సాదయామి'' ఇతి ఆహ='ఓ జుహూపభృత్తులారా! మిమ్ము యజమాన సుఖమునకై నశించని గృహము కల (పృథివ్యభిమానియగు) వహ్ని యొక్క శకటరూప స్థానమునందు ఉంచుచున్నానని' యధ్వర్యుని మాటగా మంత్రము చెప్పినది. ఇయం వై=ఈ భూమియే, అగ్నేః= అగ్నియొక్క, అపన్నగృహఃఃఅవినశ్వర గృహము. అస్యాఃఏవ సదనే=ఈ భూమియొక్క స్థానమునందే, ఏనే=ఈ జుహూపభృత్తులను, సాదయతి=స్థాపించినవాc డగుచున్నాcడు. ''సుమ్నాయ సుమ్నినీ సుమ్నే మా ధత్తమ్'' ఇతి ఆహ='సుఖవంతములైన యో జుహూపభృత్తులారా! నన్ను సుఖమునందు స్థాపించుcడు' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ప్రజాఃపశవఃవై=ప్రజలు, పశువులే, సుమ్నమ్=సుఖము, (సుఖహేతువులు). (అతఃఈ కారణమువలన, అయమ్=తనను సుఖమునందు స్థాపించుcడని యడిగిన యధ్వర్యుcడు,) ప్రజామ్=ప్రజను, పశూనేవ=పశువులనే, ధత్తే=ధరించుచున్నాcడు (కలిగియున్నాcడు). ''ధురి ధుర్యౌ పాతమ్'' ఇతి ఆహ='బండియందు యజ్ఞభారమును వహించుచున్న యీ యజమాన దంపతులను రక్షింపుcడు' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ఏతత్=ఇది, జాయాపత్యోఃఃజాయాపతుల (యజమానదంపతుల) యొక్క, గోపీథాయ=రక్షణముకొరకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : స్పష్టము. ఈ బ్రాహ్మణము ''అగ్నేర్వామపన్నగృహస్యే'' త్యాది మంత్రముయొక్క అర్థమును చూపినది.

23. మంత్రము :**అగ్నే ఽదబ్ధాయో ఽశీతతనో ఇత్యాహ। యథాయజురేవైతత్ । పాహి మా ఽద్య దివః పాహి ప్రసిత్యై పాహి దురిష్ట్యై పాహి దురద్మన్యై పాహి దుశ్చరితాదిత్యాహ। ఆశిషమేవైతామాశాస్తే । అవిషం నః పితుం కృణు సుషదా యోనిగ్గ్ం స్వాహేతీధ్మసంవృశ్చనాన్యన్వాహార్యపచనే ఽభ్యాధాయ ఫలీకరణహోమం జుహోతి । అతిరిక్తాని వా ఇధ్మసంవృశ్చనాని (9) । అతిరిక్తాः ఫలీకరణాः । అతిరిక్తమాజ్యోచ్ఛేషణమ్ । అతిరిక్త ఏవాతిరిక్తం దధాతి । అథో అతిరిక్తేనైవాతిరిక్త మాప్త్వా ఽవరున్ధే ।**

అర్థము : ''అగ్నే ఽదబ్ధాయో ఽశీతతనో పాహి మా ఽద్య దివః పాహి ప్రసిత్యై పాహి దురిష్ట్యై పాహి దురద్మన్యై పాహి దుశ్చరితాదవిషం నః పితుం కృణు సుషదా యోనిగ్గ్ం స్వాహా'' ఇతి = 'ఓ యగ్నీ! స్వర్గవాసులు నా యపరాధమును గ్రహింపకుండునట్లు విఘ్నరూప బంధమునుండియు, శాస్త్రవిరుద్ధ దుష్టప్రవర్తనము నుండియు, యాగాధికారమునకు విరుద్ధమైన దుష్టభోజనమునుండియు, నిషిద్ధాచరణమునుండియు నన్ను రక్షించుము. మా యన్నము నమృతముగ జేయుము. నీవు హింసింపబడని జీవితము కలవాడవు. ఉష్ణశరీరుడవు. ఈ ఫలీకరణద్రవ్యము హుత మగుగాక' యని ''అగ్నే ఽదబ్ధాయో ఽశీతతనో'' ఇత్యాది మంత్రముయొక్క తాత్పర్యము. ఈ మంత్రమును పఠించుచు నధ్వర్యుడు ఫలీకరణద్రవ్యము నగ్నియందు హోమము చేయవలెను. గృహమునందు బియ్యమును బాగుచేయుచుండగా తీసివేయుదగిన మాలిన్యాంశములు ఫలీకరణద్రవ్యములు.

''అగ్నే ఽదబ్ధాయో ఽశీతతనో'' ఇతి ఆహ = 'హింసింపబడని జీవితము కలవాడవును, ఉష్ణశరీరము కలవాడవునగు ఓ యగ్నీ! అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. ఏతత్ = ఇది, యథాయజుः ఏవ = మంత్రోక్తము ననుసరించినదే. ''పాహి మా ఽద్య దివః పాహి ప్రసిత్యై పాహి దురిష్ట్యై పాహి దురద్మన్యై పాహి దుశ్చరితాత్'' ఇతి ఆహ = అని మంత్రము చెప్పినది. (అర్థము పైని చెప్పబడినది.) ఏతామ్ = ఈ ప్రార్థనను, ఆశిషమేవ = ఆశీస్సుగానే, ఆశాస్తే = తలచుచున్నాడు. ''అవిషం నః పితుం కృణు సుషదా యోనిగ్గ్ం స్వాహా'' ఇతి = ఈ మంత్రభాగముచే, (అర్థము పైని చెప్పబడినది.) ఇధ్మసంవృశ్చనాని = శాస్త్రోక్త ప్రమాణముగ ఇధ్మము ఛిన్నము కాగా మిగిలిన కాష్ఠములను, అన్వాహార్యపచనే = దక్షిణాగ్ని యందు, అభ్యాధాయ = ప్రక్షేపముచేసి, ఫలీకరణహోమం జుహోతి = ఫలీకరణములను హోమము చేయవలెను. ఇధ్మసంవృశ్చనాని = ఇధ్మసంవృశ్చనములు, అతిరిక్తాని వై = యజ్ఞోపయుక్త ద్రవ్యముకంటె నతిరిక్తములే. ఫలీకరణాः = ఫలీకరణములు, అతిరిక్తాः = యజ్ఞోపయుక్త ద్రవ్యాతిరిక్తములు. ఆజ్యోచ్ఛేషణమ్ = హోమము చేయగా శేషించిన యాజ్యము, అతిరిక్తమ్ = యజ్ఞోపయుక్త ద్రవ్యాతిరిక్తము. అతిరిక్తే ఏవ = అతిరిక్తమైన జుహూగతఘృతమునందే, అతిరిక్తమ్ = అతిరిక్తమైన ఇధ్మసంవృశ్చనాదికమును, దధాతి = స్థాపించవలెను. అథో = అప్పుడు,

అతిరిక్తైవ=అధికద్రవ్యముచేత, అతిరిక్తమ్=అధికఫలమును, ఆప్నో=పొందు, అవరున్ధే=ఆ ఫలమును స్వాధీనము చేసికొనుచున్నాఁడు.

తాత్పర్యము : తాత్పర్యమర్థమునందే వివరించఁబడినది. ఇచట మంత్ర వ్యాఖ్యానపూర్వకముగ హోమము విధించఁ బడినది.

24. మంత్రము:**వేదిర్దేవేభ్యో నిలాయత । తాం వేదేనాన్వవిన్దన్ । వేదేన వేదిం వివిదుఃపృథివీమ్ । సా పప్రథే పృథివీ పార్థివాని । గర్భం బిభర్తి భువనేష్వన్తఃతతో యజ్ఞో జాయతే విశ్వదానిరితి పురస్తాత్స్తమ్బయజుషో । వేదేన వేదిగ్ం సంమార్ష్టనువిత్త్యై(10) ।అథో యద్వేదశ్చ వేదిశ్చ భవతఃమిథునత్వాయ ప్రజాత్యై ।**

అర్థము : వేదిఃయజ్ఞవేది (తదభిమానిదేవత), దేవేభ్యఃదేవతలనుండి, నిలాయత=తొలఁగిపోయెను. తామ్=ఆ వేదిని, వేదేన=వేదముచేత (వేదిసమ్మార్జన సాధకమైన దర్భలకట్టచేత), అన్వవిన్దన్=దేవతలు పొందిరి. తాం పృథివీమ్=అసురులచే నొసఁగఁబడిన యా పృథివిని, వేదేన=సమ్మార్జనసాధనమైన వేదముచే, వివిదుఃవేదినిగాఁ జేసిరి. సా=ఆ వేది, పృథివీ=పృథివీరూప యగుచు, పార్థివాని=పృథివీగతములైన వ్రీహ్యాదులను, పప్రథే=విస్తరింపఁజేసెను. సా=ఆ పృథివి, భువనేషు=సర్వభువనలందు, అన్తఃఉదరమునందు, గర్భమ్=గర్భమును, బిభర్తి=భరించుచుండెను. తతఃఆ గర్భమునుండి, విశ్వదానిఃయజ్ఞఃసర్వఫలదాత యగు యజ్ఞపురుషుఁడు, జాయతే=ఉద్భవించెను. ఇతి=ఈ మంత్రముచేత, స్తమ్బయజుషఃపురస్తాత్=స్తంబయజుర్హరణముకంటె పూర్వము, వేదేన=దర్భమయ వేదముచేత, వేదిమ్=వేదిస్థానమును, సంమార్ష్టి=సమ్మార్జనము చేయవలెను. తత్=ఆ సమ్మార్జనము, అనువిత్త్యై=వేదిలాభముకొఱకు, భవతి=అగుచున్నది. అథో=మఱియు, వేదశ్చ వేదిశ్చ భవతఃయత్=వేదము, వేదియు ఉంటున్నవనుటయేది కలదో, తత్=ఆ వేదవేదిరూపము, మిథునత్వాయ=మిథునీభావముకొఱకు, ప్రజాత్యై=సంతానోత్పత్తికొఱకును, భవతి= అగుచున్నది.

తాత్పర్యము : ఏదియో యొకకారణముచేత దేవతలనుండి తిరోహితయైన వేద్యభిమానిదేవతను వేదాభిమానిదేవతద్వారా దేవతలు పొందిరి. అట్టి యీ దర్భమయ వేదమహిమను ‘వేదేన వేదిం వివిదుఃపృథివీమ్’’ ఇత్యాదికమైన మంత్రము తెలియఁజేయుచున్నది. ఆ మంత్రముయొక్క యర్థము:-

‘అసురులచే నొసఁగఁబడిన పృథివిని దేవతలు పూర్వోత్తరభాగములచే సంస్కరించి వేదినిచేసిరి. ఆ వేదిని (అనఁగా కారణాంతరముచే దేవతలనుండి తొలఁగిపోయిన వేదిని) దేవతలు మఱల దర్భమయవేదముచేత పొందిరి. ఆ వేది పృథివీరూపయై పార్థివములైన వ్రీహ్యాదులను విస్తరింపఁజేసెను. మరియు ఆ పృథివీదేవత సర్వభువనములందు ఉదరమునందు గర్భమును ధరించెను. ఆ గర్భమునుండి సర్వఫలదాతయైన యజ్ఞపురుషుఁడు పుట్టెను’ అను నర్థము కల ‘వేదేన వేదిం వివిదుఃపృథివీమ్’’ ఇత్యాది మంత్రమును పఠించుచు అష్టమానువాకోక్త పురోడాశనిష్పాదనమున కనంతరము, నవమానువాకమునందు

వక్ష్యమాణమైన స్తంబయజుర్హరణముకంటె పూర్వము దర్భమయ వేదముచేత వేదిస్థానమును సమ్మార్జనము చేయవలెను. ఆ సమ్మార్జనమువలన వేదిలాభము కలుగును. మఱియు వేదవేదిరూప మిథునము ప్రజోత్పత్తి కగును.

25. మంత్రము :**ప్రజాపతేర్వా ఏతాని శ్మశ్రూణి । యద్వేదః । పత్నీయా ఉపస్థ ఆస్యతి । మిథునమేవ కరోతి । విన్దతే ప్రజామ్ ।**

అర్థము : వేదః యత్=దర్భమయవేదమేది కలదో, ఏతాని=ఈ వేదములోని దర్భలు, ప్రజాపతేః=ప్రజాపతియొక్క, శ్మశ్రూణ్యేవ=శ్మశ్రువులే (గడ్డము, మీసము). పత్నీయాః ఉపస్థే=యజమానపత్నియొక్క సమీపమునందు, ఆస్యతి=దర్భమయవేదము నుంచవలెను. (తథా కృతవాన్=ఆ విధముగ జేసిన యధ్వర్యుడు,) మిథునమేవ=మిథునమునే, కరోతి=చేసినవాడగును. (తత్=ఆ మిథునీకరణమువలన, యజమానః=యజమానుడు,) ప్రజామ్=సంతానమును, విన్దతే=పొందును.

తాత్పర్యము : ప్రాసంగికమైన దర్భమయవేద మహత్వప్రతిపాదకమైన మంత్రము నుత్పాదించి యనంతరము శ్రుతి ప్రకృతము ననుసరించుచున్నది. పూర్వోక్తవేదగతములైన దర్భలు ప్రజాపతియొక్క శ్మశ్రువులే. అట్టి మహిమ కల దర్భమయవేదము నధ్వర్యుడు యజమానపత్నిసమీపమున నుంచవలెను. పత్నీశబ్దము స్త్రీలింగము. వేదశబ్దము పుంలింగము కనుక మిథునమునే చేసినవాడగును. ఆ మిథునమువలన యజమానుడు సంతానమును పొందును.

26. మంత్రము:**వేదగ్ం హోతా కహవనీయాత్స్రుణన్నేతి । యజ్ఞమేవ తత్సంతనోత్యుత్తరస్మా దర్ధమాసాత్ । తగ్ం సంతత ముత్తరేఽర్ధమాస ఆలభతే (11) । తం కాలే కాల ఆగతే యజతే ।**

అర్థము : హోతా=హోత, వేదమ్=దర్భమయవేదమును, ఆహవనీయాత్=గార్హపత్యమునుండి ఆహవనీయము వఱకు, స్రుణన్=(దర్భలకట్టముడి నూడదీసి) పఱచుచు, ఏతి=వెళ్లవలెను. తత్=ఆ దర్భలయాస్తరణము వలన, యజ్ఞమేవ=యజ్ఞమునే, ఉత్తరస్మాత్=ఉత్తరపుదైన (ఆగామియైన), ఆ అర్ధమాసాత్=అర్ధమాస పర్యంతరము, సంతనోతి=సంతతముగ (అవిచ్ఛిన్నముగ) జేసినవాడగును. సంతతమ్=సంతతమైన, తమ్=ఆ యజ్ఞమును, ఉత్తరే అర్ధమాసే=ఉత్తరపుదైన అర్ధమాసమునందు, ఆలభతే=చేయుటకై యారంభించును. కాలే కాలే ఆగతే=ఆ యా కాలము సమాగతము కాగా, తం యజతే=యజ్ఞమును చేయును.

తాత్పర్యము : అధ్వర్యుడు దర్భమయవేదముయొక్క బంధనము విడదీసి గార్హపత్యమునుండి ఆహవనీయపర్యంతము పఱచుటచేత ఆగామిపర్వపర్యంతము యజ్ఞము సంతత (అవిచ్ఛిన్న) మగును. మఱల పర్వమునందు ఆధానాదికమును చేసి ప్రతిపత్తునందు సంతతమైన యా యజ్ఞమును చేయుట కారంభించును. ఈ విధముగ మఱల మఱల ఆ యా కాలము సమాగతము కాగా యాగము చేయును కనుక యజ్ఞ మవిచ్ఛిన్న మగును. యజమానపత్నిసమీపమున ఉంచబడిన దర్భమయవేదమునకు పునరాస్తరణ మిచట విధించబడినది.

27. మంత్రము: **బ్రహ్మవాదినో వదన్తి । స త్వా అధ్వర్యుఃస్యాత్ । యో యతో యజ్ఞం ప్రయుజ్జే్క। తదేనం ప్రతిష్ఠాపయతీతి। వాతాద్వా అధ్వర్యుర్యజ్ఞం ప్రయుజ్జే్క। దేవా గాతువిదో గాతుం విత్వా గాతుమితేత్యాహ। యత ఏవ యజ్ఞం ప్రయుజ్జే్క। తదేనం ప్రతిష్ఠాపయతి । ప్రతితిష్ఠతి ప్రజయా పశుభిర్యజమానః (12) । తిష్ఠతీమే లోకా గమయతి ద్యౌర్వృష్టిమేవావరున్ధే పర్యధత్థ ఇత్యాహ సమిష్ట్యై భాగధేయం ధత్తమిత్యాహ వా ఇధ్మసంవృశ్చనాన్యనువిత్త్యై లభతే యజమానః ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే నవమోఽనువాకః ॥౯।

అర్థము : యః=ఏయధ్వర్యుఁడు,యతః=ఏ దేవతనుండి,యజ్ఞమ్=యజ్ఞమును, ప్రయుజ్జే్క=ప్రారంభించుచున్నాఁడో, తత్=ఆ దేవునియందు, ఏనమ్=ఈ యజ్ఞమును, ప్రతిష్ఠాపయతి=సమాప్తముచేయుచున్నాఁడో, సః=అతఁడు, అధ్వర్యుఃముఖ్యుఁడైన అధ్వర్యుఁడు, స్యాత్=అగును. ఇతి=అని, బ్రహ్మవాదినః=మంత్రజ్ఞులు, వదన్తి=చెప్పుచున్నారు. వాతాత్ వై= వాయువునుండియే, అధ్వర్యుఃఅధ్వర్యుఁడు, యజ్ఞమ్=యజ్ఞమును, ప్రయుజ్జే్క=ప్రారంభించుచున్నాఁడు. ''దేవాఃగాతువిదో గాతుం విత్వా గాతుమిత'' ఇతి ఆహ= 'ఓ మార్గవిదులైన దేవతలారా! పూర్వము ఏ మార్గమును తెలిసికొని వచ్చితిరో, మఱల తిరిగి యా మార్గమును పొందుఁడు (ఆ మార్గమున వెళ్ళుఁడు)' అని యధ్వర్యుని వాక్కుగా మంత్రము చెప్పినది. యతఃఏవ=ఏ దేవతనుండియే, యజ్ఞమ్=యజ్ఞమును, ప్రయుజ్జే్క=ప్రారంభించుచున్నాఁడో, తత్=ఆ దేవతయందు, ఏనమ్ =ఈ యజ్ఞమును, ప్రతిష్ఠాపయతి=సమాప్తిచేయుచున్నవాఁ డగుచున్నాఁడు. యజమానఃయజమానుఁడు, ప్రజయా=సంతానముతోను, పశుభిఃపశువులతోను, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము : ఏ యధ్వర్యుఁడు ఏ దేవునినుండి యజ్ఞము నారంభించి, ఆ దేవునియందే సమాప్తిచేయుచున్నాఁడో, ఆ యధ్వర్యుఁడే ముఖ్యాధ్వర్యుఁడని బ్రహ్మవాదుల యుక్తి. ఇచటఁ గూడ నధ్వర్యుఁడు సర్వక్రియా ప్రవర్తకుఁడైన వాయుదేవునినుండియే యజ్ఞము నుపక్రమించుచున్నాఁడు. ''దేవా గాతువిదో గాతుం యజ్ఞాయ విన్దత। మనస్పతినా దేవేన వాతాద్యజ్ఞఃప్రయుజ్యతామ్'' అనెడి అచ్ఛిద్రకాండగత మంత్రము ప్రథమమున జపించఁబడుటవలన, సమాప్తియందుఁ గూడ ''దేవా గాతువిదఃఅనెడి వాయువిషయ మంత్రము యుక్తము. వాయువిషయమైన యీ మంత్రముచేత యజ్ఞనమాప్తిని ఈ బ్రాహ్మణము ఉపపాదించినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు
నవమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే

దశమోఽనువాకః

1. మంత్రము : **యో వా అయథాదేవతం యజ్ఞముపచరతి । ఆ దేవతాభ్యో వృశ్చ్యతే । పాపీయాన్భవతి ।**

యో కయథాదేవతమ్ । న దేవతాభ్య ఆవృశ్చ్యతే । వసీయాన్భవతి । వారుణో వై పాశః । ఇమం

విష్యామి వరుణస్య పాశమిత్యాహ। వరుణపాశాదేవైనాం ముఞ్చతి । సవితృప్రసూతో యథాదేవతమ్

(1) । న దేవతాభ్య ఆవృశ్చ్యతే । వసీయాన్భవతి ।

వేదార్థదీపిక

అవతారిక: సంహితయందలి ప్రథమకాండగత ప్రథమ ప్రపాఠకములోని త్రయోదశానువాకోక్తమంత్రముల కన్నింటికి బ్రాహ్మణము వ్యాఖ్యానించుట పూర్తియైనది. కాని ఆ ప్రథమ ప్రపాఠకములోని దశమానువాకమునందు పత్నీసంనహన ప్రసంగముచే పత్నీవిషయములైన రెండు మంత్రము లామ్నాతము లైనవి. అప్పు డనుపయోగమువలన బ్రాహ్మణముచే ఆ మంత్రము లచట వ్యాఖ్యానించఁబడలేదు. ఉపవేషత్యాగమునకై మంత్రోత్పత్తి కూడ చేయవలసియున్నది. ఆ మంత్రద్వయ మిచట బ్రాహ్మణముచే వ్యాఖ్యానించఁ బడుచున్నది. ప్రథమమున నిచట యోక్త్రవిమోకమంత్రముయొక్క పూర్వార్ధము నీ బ్రాహ్మణము వ్యాఖ్యానించుచున్నది.

అర్థము : యః వై=ఏ యజమానుడైతే, అయథాదేవతమ్=అయథాదేవతముగ, యజ్ఞమ్=యజ్ఞమును, ఉపచరతి=అనుష్ఠించుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, దేవతాభ్యః=దేవతలనుండి, ఆ వృశ్చ్యతే=విచ్ఛిన్నుఁ డగుచున్నాఁడు. పాపీయాన్ భవతి=అతఁడు దరిద్రుఁ డగుచున్నాఁడు. యః=ఏ యజమానుఁడు, యథాదేవతమ్=యథాదేవతముగ, యజ్ఞమ్=యజ్ఞమును, ఉపచరతి=అనుష్ఠించుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, దేవతాభ్యః=దేవతలనుండి, న ఆవృశ్చ్యతే=విచ్ఛిన్నుఁ డగుటలేదు. వసీయాన్ భవతి=అతఁడు ధనవంతుఁ డగుచున్నాఁడు. పాశః=పాశము (యజమానపత్నినడుమునకు కట్టిన త్రాడు), వారుణః వై=వరుణసంబంధియే. ''ఇమం వి ష్యామి వరుణస్య పాశమ్'' ఇతి ఆహ='ఈ వరుణ పాశము నూడఁ దీయుచున్నాను' అని యధ్వర్యునివాక్కుగా మంత్రము చెప్పినది. వరుణపాశాదేవ=వరుణపాశము నుండియే, ఏనామ్=ఈ యజమానపత్నిని, ముఞ్చతి=విడిపించుచున్నవాఁ డగుచున్నాఁడు. సవితృ ప్రసూతః=యజమానుఁడు సవితృప్రేరితుఁడై, యథాదేవతమ్=యథాదేవతముగా, ఉపచరతి=యజ్ఞము ననుష్ఠించుచున్నవాఁ డగుచున్నాఁడు. సః=ఆ యజమానుఁడు, దేవతాభ్యః=దేవతల నుండి, న ఆవృశ్చ్యతే=విచ్ఛిన్నుఁ డగుటలేదు. వసీయాన్=ధనవంతుడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము : యోక్త్రపాశమునకు వరుణుcడు దేవత. ఆ పాశబంధమునకు సవిత దేవత. అందువలన ''వరుణస్య పాశం యమబధ్నీత సవితా'' అను పదములచే యథాదేవతముగ యజ్ఞోపచారమువలన యజమానుcడు దేవతలనుండి విచ్ఛిన్నుcడు కాcడు. దరిద్రుcడును కాcడు.

2. మంత్రము : **ధాతుశ్చ యోనౌ సుకృతస్య లోక ఇత్యాహ। అగ్నిర్వై ధాతా ।పుణ్యం కర్మ సుకృతస్య లోకః ।అగ్నిరేవైనాం ధాతా ।పుణ్యే కర్మణి సుకృతస్య లోకే దధాతి ।**

అర్థము : ''ధాతుశ్చ యోనౌ సుకృతస్య లోకే'' ఇతి ఆహ = 'బ్రహ్మకు స్థానమును, అనుష్ఠితకర్మకు ఫలభూతమునగు లోకమునందు పతితోcగూడ నాకు సుఖమును చేయుచున్నాను' అని సవితచే బద్ధమైన యీ యోక్త్రరూపపాశము విముక్తము కాcగా యజమానపత్నివాక్కుగా మంత్రము చెప్పినది. అగ్నిః వై=అగ్నియే, ధాతా=బ్రహ్మ. పుణ్యం కర్మ= పుణ్యమైన కర్మ, సుకృతస్య లోకః=సుకృతమునకు ఫలమైన లోకము. అతః=ఈ కారణమువలన, అగ్నిరేవ ధాతా=అగ్నిరూపుcడేయైన బ్రహ్మ, ఏనామ్=ఈ యోక్త్రపాశ విముక్తయైన యజమానపత్నిని, పుణ్యే కర్మణి= పుణ్యకర్మరూపమైన, సుకృతస్య లోకే=సుకృతఫలభూత లోకమునందు, దధాతి=స్థాపించుచున్నాcడు.

తాత్పర్యము : ''ఇమం వి ష్యామి వరుణస్య పాశం యమబధ్నీత సవితా సుకేతః। ధాతుశ్చ యోనౌ సుకృతస్య లోకే స్యోనం మే సహ పత్యా కరోమి'' అను యోక్త్రవిమోకమంత్రము సంహితయందు ప్రథమకాండములోని ప్రథమ ప్రపాఠకస్థ దశమానువాకములోనిది. ఈ మంత్రముయొక్క పూర్వార్థము ''యో వా అయథాదేవత'' మిత్యాది బ్రాహ్మణముచే వ్యాఖ్యానించcబడినది. ఆ యోక్త్రవిమోకమంత్రముయొక్క తృతీయపాదము నందు పదార్థ వాక్యార్థముల నీ బ్రాహ్మణము తెలియcజేసినది. ఇచట ధాత యనcగా నగ్నియే. సుకృతమునకు ఫలమైన లోకము పుణ్యకర్మ. కనుక అగ్నియే యీ యోక్త్రపాశవిముక్తయైన యజమానపత్నిని పతితోc గూడ పుణ్యకర్మరూపమైన సుకృతఫలభూతలోకమునందు స్థాపించునని పదార్థ వాక్యార్థములను తెలియcజేసినది.

3. మంత్రము : **స్యోనం మే సహ పత్యా కరోమీత్యాహ। ఆత్మనశ్చ యజమానస్య చానాత్యై సంత్వాయ ।**

అర్థము : ''స్యోనం మే సహ పత్యా కరోమి'' ఇతి ఆహ = 'పతితోcగూడ నాకు సుఖమును చేయుచున్నానని' యజమానపత్నివాక్కుగా నీ బ్రాహ్మణము చెప్పినది. ఏతత్=ఇది, ఆత్మనః=తనకు (యజమానపత్నికి), యజమానస్య చ=యజమానునకును, అనాత్యై=దుఃఖనాశముకొఱకు, సంత్వాయ చ=సుఖప్రాప్తి కొఱకును, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : స్పష్టము. దుఃఖనాశముకొఱకు, సుఖప్రాప్తికొఱకును చతుర్థపాదోక్తియని యీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. ''స్యోనంమే సహ పత్యా కరోమి'' అనునదిపైని చెప్పcబడిన యోక్త్రవిమోకమంత్రము యొక్క చతుర్థపాదము.

4. మంత్రము : **సమాయుషా సం ప్రజయేత్యాహ(2) । ఆశిషమేవైతామాశాస్తే పూర్ణపాత్రే ।**

అర్థము : ''సమాయుషా సం ప్రజయా'' ఇతి ఆహ='ఓ యగ్నీ! నేను ఆయువుతో కలసికొందును గాక. సంతానముతో కలసికొందును గాక' యని యజమానపత్నివాక్కుగా మంత్రము చెప్పినది. పూర్ణపాత్రే=ఉదకముతో పూర్ణమైన పాత్రము, సమానీయమానే సతి=తీసికొనిరాcబడుచుండcగా, ఏతామ్=ఈ 'సమాయుషా' ఇత్యాదికమును, ఆశిషమేవ=ఆశీస్సునుగానే, ఆశాస్తే=యజమానపత్ని కోరుచున్నది.

తాత్పర్యము : యజమానపత్నికి పూర్ణపాత్రవిమోకార్థమైన ''సమాయుషా'' ఇత్యాది మంత్రము నీ బ్రాహ్మణము వ్యాఖ్యానించినది. తాత్పర్యము స్పష్టము.

5. మంత్రము : **అన్తతో కనుష్టుభా । చతుష్పద్వా ఏతచ్ఛన్దః ప్రతిష్ఠితం పత్న్యై పూర్ణపాత్రే భవతి । అస్మింల్లోకే ।**

ప్రతితిష్ఠానీతి । అస్మిన్నేవ లోకే ప్రతితిష్ఠతి ।

అర్థము : అన్తతః=పత్నీకర్తవ్యము యొక్క అవసానమందు, విహితం యత్ పూర్ణపాత్రాభిమంత్రణమ్=విహితమైన యే పూర్ణపాత్రాభిమంత్రణము, అనుష్టుభా=అనుష్టుప్ఛందోమంత్రముచే, క్రియతే=చేయcబడుచున్నదో, ఏతత్ ఛన్దః=ఈ యనుష్టుప్ఛందస్సు, చతుష్పత్ వై=(గోవువలె) నాలుగు పాదములు కలదగుటవలన, పత్న్యై= యజమానపత్నియొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ.) పూర్ణపాత్రే=పూర్ణపాత్రమువిషయమున, ప్రతిష్ఠితం భవతి= ప్రతిష్ఠిత మగుచున్నది. 'అస్మిన్ లోకే=ఈ లోకమునందు, ప్రతితిష్ఠాని ఇతి=నేను (యజమాన పత్ని) ప్రతిష్ఠితురాల నగుదును గాక యని, అభిప్రాయః=మంత్రమును జపించుచున్న పత్నియొక్క యభిప్రాయము. (తత్=ఆ మంత్రసామర్థ్యమువలన, సా=ఆ యజమానపత్ని,) అస్మిన్ లోకే=ఈ లోకమునందు, ప్రతితిష్ఠత్యేవ=నిశ్చయముగ ప్రతిష్ఠితురా లగును.

తాత్పర్యము : యజమానపత్నిచేయవలసిన యజ్ఞాంగానుష్ఠానమున కవసానమున యజమానపత్ని ''సమాయుషా సంప్రజయా'' ఇత్యాది మంత్రముచే పూర్ణపాత్రము నభిమంత్రించును. ఆ మంత్రమునందలి ఛందస్సు అనుష్టుప్పు. ఆ యనుష్టుప్ఛందస్సు గోవువలె నాలుగు పాదములు కలదగుటవలన యజమానపత్ని సంబంధియైన పూర్ణపాత్రము విషయమున ప్రతిష్ఠిత మగును.' నేను ఈ లోకమునందు ప్రతిష్ఠితురాల నగుదును గాక' యని యా మంత్రమును జపించుచున్న యజమానపత్నియొక్క యభిప్రాయము. తన్మంత్రసామర్థ్యమువలన ఆమె యీ లోకమునందు నిశ్చయముగ ప్రతిష్ఠిత యగును. ఈ బ్రాహ్మణము మంత్రగత ఛ్ఛందస్సును ప్రశంసించినది.

6. మంత్రము : **అథో వాగ్వా అనుష్టుక్ । వాజ్మిథునమ్ । ఆపో రేతః ప్రజననమ్ । ఏతస్మాద్వై మిథునాద్విద్యోత**

మానస్తనయన్వర్షతి । రేతః సిఞ్చన్ (3) । ప్రజాః ప్రజనయన్ ।

అర్థము : అథో=మఱియు, అనుష్టుక్=అనుష్టుక్కు, వాక్ వై=వాగ్రూపమే. వాక్=ఆ వాగ్యోషిత్తు (స్త్రీ), మిథునమ్=ఛందోరూపపురుషునితోc గూడ మిథున మగుచున్నది. ఆపః=పూర్ణపాత్రగతములైన యుదక ములు, ప్రజననం రేతః=ప్రజోత్పత్తి సాధనమైన రేతోరూపములు. ఏతస్మాత్ మిథునాదేవ=ఈ యోగానుష్ఠానగత

మిథునమునుండియే, విద్యోతమానః=ఉత్పన్నమైన యాదిత్యప్రేరిత మేఘము, రేతః సిఞ్చన్=ఉదకరూప రేతస్సును సేచనము చేయుచు, ప్రజాః ప్రజనయన్=ప్రజలను పుట్టించుచు, వర్షతి=వర్షించుచున్నది.

తాత్పర్యము : పూర్ణ పాత్రాభిమంత్రణమంత్రమునందు కేవలము ఛందోరూపత్వమే కాక, వాగ్రూపత్వము కూడ కలదు. ఆ వాక్కు అనెడి స్త్రీ ఛందోరూప పురుషునితోc గూడ మిథునముగ సంపన్న మగుచున్నది. పూర్ణపాత్రగతములైన యుదకములు ప్రజోత్పత్తిసాధన రేతోరూపములు. ఈ యాగానుష్ఠాన గతమైన మిథునమునుండి పుట్టిన ఆదిత్యప్రేరిత మేఘము వృష్టిద్వారా ప్రజోత్పత్తియందు పర్యవసన్న మగుచున్నది. ఈ విషయమునే ''అగ్నౌ ప్రాస్తాఽఽహుతిః సమ్యగాదిత్యముపతిష్ఠతే। ఆదిత్యాజ్జాయతే వృష్టిర్వృష్టేరన్నం తతః ప్రజాఃll'' అను స్మృతి చెప్పుచున్నది.

7. మంత్రము : యద్వై యజ్ఞస్య బ్రహ్మణా యుజ్యతే। బ్రహ్మణా వై తస్య విమోకః। అద్భిః శాన్తిః। విముక్తం వా ఏతర్హి యోక్త్రం బ్రహ్మణా। ఆదాయైనత్పత్నీ్న సహాప ఉపగృహ్ణీతే శాన్త్యై।

అర్థము : యత్ వై=ఏదియైతే, బ్రహ్మణా=మంత్రముచే, యజ్ఞస్య=యజ్ఞమునకు, యుజ్యతే=సంయుక్తము చేయcబడు చున్నదో, బ్రహ్మణా వై=మంత్రముచేతనే, తస్య=ఆ సంయుక్తమైన వస్తువునకు, విమోకః=విమోచనము, కార్యః=చేయcదగినది. అద్భిః=ఉదకములచే, శాన్తిః=శాంతి, కర్తవ్యా=చేయcదగినది. ఏతర్హి=ఇప్పుడు, యోక్త్రమ్=పత్నికి కట్టcబడిన యోక్త్రము (త్రాడు), బ్రహ్మణా=మంత్రముచేత, విముక్తం హి= విమోచనము చేయcబడినది కదా! పత్నీ=యజమానపత్ని, ఏనత్=ఈ యోక్త్రమును, ఆదాయ=తీసికొని, సహ=యోక్త్ర ముతోcగూడ, శాన్త్యై=శాంతికై, అపః=ఉదకములను, ఉపగృహ్ణీతే=సమీపమున తీసికొనవలెను.

తాత్పర్యము : మంత్రముచే నుపహితములైన కపాలములకు మంత్రముచేతనే విమోకము చేయవలసినవిధముగ, యోక్త్రమునకుc గూడ యోగ (సంబంధ) విమోకమైన రజ్జువుచేc జేయcబడిన యుపద్రవమునకు ఉదకములచే శాంతి చేయుట యుక్తము. ఇప్పుడు యోక్త్రము మంత్రముచే విముక్తమైనది కనుక దోసిలిలోనికి ఆ యోక్త్రమును తీసికొని యా యోక్త్రముతోc గూడ నుదకములను గ్రహించవలెను. విముక్తమైన యోక్త్రమునకు, పూర్ణపాత్రోదకమునకును సహకారము యజమానపత్నిచేc జేయcదగినదని యీ బ్రాహ్మణము చెప్పినది.

8. మంత్రము : అఞ్జలౌ పూర్ణపాత్ర మానయతి। రేత ఏవాస్యాం ప్రజాం దధాతి। ప్రజయా హి మనుష్యః పూర్ణః।

అర్థము : అఞ్జలౌ=దోసిలియందు, పూర్ణపాత్రమ్=ఉదకపూర్ణపాత్రమును, ఆనయతి=తీసికొనవలెను. రేతః ఏవ=రేతస్సే, అస్యామ్=ఈ పత్నియందు, ప్రజామ్=ప్రజను (సంతానమును), దధాతి=స్థాపించును. ప్రజయా=సంతానముచే, మనుష్యః=మనుష్యcడు, పూర్ణః=పూర్ణcడుగా, శోభతే హి=ప్రకాశించు చున్నాcడు కదా!

తాత్పర్యము : యజమానపత్ని ఉదకపూర్ణపాత్రమును తీసికొనిరావలెను. అప్పు డీమెయందు రేతస్సు ప్రజను స్థాపించును. మనుష్యుడు సంతానముచేత పూర్ణుడుగా శోభించుచుండును కదా! ఇచట ఉదకగ్రహణమునకై ఉదకపూర్ణపాత్రానయనము విధించబడినది.

9. మంత్రము : **ముఖం విమృష్టే । అవభృథస్యైవ రూపం కృత్వోత్తిష్ఠతి (4) ।**

సవితృప్రసూతో యథాదేవతం ప్రజయేత్యాహ సిఞ్చన్ముష్ట ఏకం చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే దశమోఽనువాకః ॥౧౦॥

అర్థము : ముఖమ్=ముఖమును, విమృష్టే=కడుగుకొనవలెను. అవభృథస్యైవ=అవభృథకర్మకే, రూపమ్=రూపమును, కృత్వా=చేసి, ఉత్తిష్ఠతి (ఉత్తిష్ఠేత్ అని విధి) నిలుచుండవలెను.

తాత్పర్యము : యజమానపత్ని పూర్ణపాత్రోదకముచేత ముఖమును కడుగుకొనవలెను. అనంతర మవభృథకర్మకు స్వరూపమును చేసి నిలుచుండవలెను. అవభృథకర్మ స్వరూపమును సిద్ధము చేసి సిద్ధముగా నుండవలెనని యర్థము. ఇచట యజమానపత్నికి పూర్ణపాత్రోదకముచే ముఖప్రక్షాళనము విధించబడినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమునతృతీయ ప్రపాఠకమునందు
దశమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయ ప్రపాఠకే ఏకదశోఽనువాకః

1. మంత్రము : **పరివేషో వా ఏష వనస్పతీనామ్ । యదుపవేషః ।**

వేదార్థదీపిక

అర్థము : ఉపవేషః యత్=పలాశశాఖామూలభాగమేది కలదో, ఏషః=ఇది, వనస్పతీనామ్=వనస్పతులకు, పరివేషః వై=పరివేషమే.

తాత్పర్యము : వనస్పతులచే దుస్సాధ్యమైన అంగారవియోజనకృత కపాలోపధానాదికము దీనిచే చేయఁబడుటవలన పలాశశాఖామూలభాగము సర్వవనస్పతులలో నంతటను వ్యాపించుచున్నదే. ఇఁక ఉపవేషము మంత్రముచే పరిత్యక్తము కనుక ఇచట ప్రస్తుతించఁబడినది.

2. మంత్రము : **య ఏవం వేద । విన్దతే పరివేష్టారమ్ ।**

అర్థము : యః=ఏ పురుషుఁడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=అతఁడు, పరివేష్టారమ్=సేవక జనమును, విన్దతే=పొందుచున్నాఁడు.

తాత్పర్యము : (పైని చెప్పిన) విధముగ తెలిసికొనినయతఁడు సేవకజనమును పొందును. ఇచట వేదనము ప్రశంసించఁ బడినది.

3. మంత్రము : **తముత్కరే । యం దేవా మనుష్యేషు । ఉపవేషమధారయన్ । యే అస్మదపచేతసః । తానస్మభ్యమిహాకురు। ఉపవేషోపవిడ్ఢి నః (1) । ప్రజాం పుష్టిమథో ధనమ్ । ద్విపదో నశ్చతుష్పదః । ధ్రువానపగాన్కుర్వితి పురస్తాత్ప్రత్యఞ్చ ముపగూహతి । తస్మాత్పురస్తాత్ప్రత్యఞ్చ్ఃశూద్రా అవస్యన్తి ।**

అర్థము : 'యమ్=ఏ పలాశశాఖామూలభాగమును, దేవాః=దేవతలు, మనుష్యేషు=మనుష్యసంబంధియజ్ఞములందు, ఉపవేషమ్=కపాలోపధానాద్యుగ్రకర్మకారిణిగా, అధారయన్=కల్పించిరో, హే ఉపవేష!=ఓ ఉపవేషమా!, సః త్వమ్=అటువంటి నీవు, యే=ఏ పుత్రభార్యాదులు, అస్మత్=మానుండి, అపచేతసః=అపరక్తులో, తాన్=వారిని, అస్మభ్యమ్=మాకొరకు, ఇహ=ఇచ్చటకు, ఆకురు=తీసికొని యనురక్తులనుగాఁ జేయుము. హే ఉపవేష!=ఓ ఉపవేషమా!, ప్రజామ్=సంతానమును, పుష్టిమ్=పుష్టిని, అథో=మరియు, ధనమ్ సంపదను, నః ఉపవిడ్ఢి=మా సమీపమున వ్యాప్తమునుగాఁ జేయుము (వ్యాపింపఁజేయుము). ద్విపదః=మనుష్యులను, నః=మాయొక్క, చతుష్పదః=పశువులను, ధ్రువాన్=చిరకాలము జీవించువారినిగా, అనపగాన్=రోగ రహితులనుగా, కురు=చేయుము'. ఇతి=ఈ మంత్రముచే, తమ్=ఆ యుపవేషమును, ఉత్కరే=మృత్ఖననాదిరూపమైన తృణాదిత్యాగస్థానమునందు, పురస్తాత్=పూర్వభాగమునందు,

ప్రత్యఙ్ముఖమ్ = ప్రత్యఙ్ముఖముగా, ఉపగూహతి = గూఢముగా చేయవలెను. (ఉత్కరము = తృణాదికము నుంచునట్టి గుంట. కపాలోపధానము = మట్టిపాత్రములను కాల్చుట. ఉపగూహనము = కనబడనివిధముగ దాచుట.) తస్మాత్ = ఆ కారణమువలన, శూద్రాః = కర్మకరులైన శూద్రులు, ప్రత్యఙ్ముఖాః = స్వామ్యభిముఖులై, పురస్తాత్ = యజమానున కెదుట, అవస్యన్తి = నిలొంచినియుంటున్నారు.

తాత్పర్యము : ''యం దేవా మనుష్యేషు'' ఇత్యాదికము మంత్రభాగము. దేవతలు మనుష్యసంబంధియజ్ఞములందు పలాశశాఖామూలభాగమును కపాలోపధానాదిరూపమైన యుగ్రకర్మలందు సాధనముగా గల్పించిరి. అదియే యుపవేష మనబడుచున్నది. అది కపాలోపధానాది కర్మలం దంతటను వ్యాప్తమై యుండును కనుకపరివేష మనబడుచున్నది. అటువంటి 'ఓ యుపవేషమా! మానుండి అపరక్తులైన పుత్రభార్యాదులను మాకొఱకు ఇచటకుఁ దెచ్చి యనురక్తులనుగాఁ జేయుము. మాసమీపమున సంతతి, సమృద్ధి, సంపద వ్యాపించియుండునట్లు చేయుము. మనుష్యులను, మా పశువులను చిరంజీవులనుగాను, రోగరహితులను గాను చేయుము.' ఇది మంత్రార్థము. ఈ మంత్రమును పఠించుచు నధ్వర్యుఁడా యుపవేషము నుత్కర మందు పూర్వభాగమున ప్రత్యఙ్ముఖముగ నిగూఢము చేయవలెను. కనుకనే లోకమునందుఁ గూడ ఉపవేషమువలె కర్మకరులైన శూద్రులు స్వామ్యభిముఖులై స్వామికెదుట నిలొంచి యుందురు. ఈ బ్రాహ్మణము మంత్రోత్పాదన పూర్వకముగ ఉపవేషత్యాగమును విధించినది.

4. మంత్రము : **స్థవిమత ఉపగూహతి । అప్రతివాదిన ఏతాన్కురుతే ।**

అర్థము : స్థవిమతః = స్థూలమైన మూలభాగమునుండి, ఉపగూహతి = శేషభాగమునంతటిని నిగూఢము చేయవలెను. ఏతాన్ = ఈ భృత్యులను, అప్రతివాదినః = ఎదిరించనివారినిగా (చెప్పినమాటను వినువారినిగా), కురుతే = చేసికొనువాఁడగును.

తాత్పర్యము : అధ్వర్యుఁడు ఉపవేషముయొక్క యగ్రమును ఉత్కరమందు ప్రవేశపెట్టి మూలమును వెలుపల మిగులునట్లు చేయరాదు. మఱేమనగా స్థూలభాగముతో నారంభించి ఉపవేషమును సర్వమును గర్తమునందు ప్రవేశ పెట్టవలెను. అట్లు చేయుటవలన నితఁడు భృత్యులను ఉక్తకారులుగా (చెప్పినమాటను వినువారినిగా) చేసికొనువాఁడగును. ఇచట నిశ్శేషముగ గూహనము విధించఁబడినది.

5. మంత్రము : **ధృష్టిర్వా ఉపవేషః । శుచర్తో వజ్రో బ్రహ్మణా సగ్ంశితః ।**

అర్థము : ఉపవేషః = ఉపవేషము, ధృష్టిః వై = దార్ష్ట్యయుక్తమే. అపి చ = మఱియు, శుచర్తః = వహ్నిసంతాపయుక్తము. కించ = ఇంకను, బ్రహ్మణా = మంత్రముచేత, సంశితః = తీక్ష్ణీకృతమై, వజ్రః = వజ్రమువంటి దైనది.

తాత్పర్యము : ఈ యుపవేషము స్వయముగనే దిట్టతనము కలది. ఇందువలన ఊర్ధ్వభాగమున వహ్నిసంతాపముతోఁ గూడినది. మఱల మంత్రముచే తీక్ష్ణీకృత మగుటవలన వజ్రముగ సంపన్న మైనది. కనుక అభిచార యోగ్యము. అభిచారము = హింసార్థమైన హోమకర్మము. అభిచారమునకై మంత్రాంతరము నుత్పాదింపఁ జేయుటకై శ్రుతి యుపవేషమును ప్రస్తుతించినది.

6. మంత్రము : **యోపవేషే శుక్ । సా కముష్మిచ్ఛతు యం ద్విష్మ ఇతి (2) । అథైనామగృహ్య ప్రహరతి ।**

అర్థము : ఉపవేషే=ఉపవేషమునందు, యా శుక్=ఏ సంతాపము కలదో, యమ్=ఏ శత్రువును, ద్విష్మః=ద్వేషించు చున్నామో, సా=ఆ యుపవేషగత సంతాపము, అముమ్=ఈ ద్వేషించcబడుచున్న శత్రువును, ఋచ్ఛతు=పొందుcగాక. ఇతి=ఈ మంత్రముచే, అథ=అనంతరము, అస్మై=ఈ శత్రువు యొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ.) నామ=పేరును, గృహ్య=గ్రహించి (ఉచ్చరించి), ప్రహరేత్=ఉపవేషము నగ్నియందు పడవేయవలెను.

తాత్పర్యము : ఈ బ్రాహ్మణము అభిచారమునందు మంత్రము నుత్పాదించి వినియోగించుచున్నది. ఉపవేషమునందలి వహ్నిసంతాపము యజమానుcడు ద్వేషించుచున్న శత్రువును పొందుcగాక యని యా శత్రువుయొక్క పేరు నుచ్చరించి యధ్వర్యుc డగ్నియందు పడవేయవలెను.

7. మంత్రము : నిరముం నుద ఓకసః । సపత్నో యః పృతన్యతి । నిర్బాధ్యేన హవిషా । ఇన్ద్ర ఏనం పరాశరీత్ ।

ఇహి తిస్రః పరావతః । ఇహి పఞ్చజనాగ్ం అతి । ఇహి తిస్రో కతీరోచనాయావత్ । సూర్యో అసద్దివి ।

పరమాం త్వా పరావతమ్ (3) । ఇన్ద్రో నయతు వృత్రహా । యతో న పునరాయసి । శశ్వతీభ్యః

సమాభ్య ఇతి ।

అర్థము : హే ఉపవేష=ఓ ఉపవేషమా!, యః సపత్నః=ఏ శత్రువు, పృతన్యతి=యుద్ధముచేయ నిచ్ఛయించుచున్నాcడో, అముమ్=ఈ శత్రువును, ఓకసః=స్వగృహమునుండి, నిర్ణుద=తొలగించుము. నిర్బాధ్యేన=బాధ్యమైన నిశ్శేష జగత్తు గల, హవిషా=ఉపవేషరూప హవిస్సుచే, ఇన్ద్రః=ఇంద్రుcడు, ఏనమ్=ఈ శత్రువును, పరాశరీత్=పరాభవించి హింసించెను. హే శత్రో! =ఓ శత్రూ!, త్వమ్=నీవు, తిస్రః పరావతః=మూcడు దూరదేశములను గూర్చి, ఇహి=పొమ్ము. పఞ్చజనాన్=బ్రాహ్మణాది మనుష్యులను, అతి=అతిక్రమించి, ఇహి=పొమ్ము. యావత్=ఎంతకాలము, సూర్యః=సూర్యుcడు, దివి=ద్యులోకమునందు, అసత్ (అస్తి)=ఉంటున్నాcడో, తావత్=అంతకాలము, తిస్రః రోచనాః అతి=అగ్ని సూర్య చంద్రరూపములైన మూcడు దీప్తుల నతిక్రమించి, (మహతి అన్దకారే=మహాంధకారమునందు,)ఇహి=పొమ్ము. యతః=ఏ దూరదేశమునుండి, శశ్వతీభ్యః సమాభ్యః=అనేకసంవత్సరములకంటె, ఊర్ధ్వమపి=పైని (అనంతరము) కూడ, పునః=మఱల, న ఆయసి=రాలేవో, వృత్రహా=వృత్రహంతయైన, ఇన్ద్రః=ఇంద్రుడు, త్వా=నిన్ను, పరావతమ్=దూరదేశమును, నయతు=పొందించుcగాక.

తాత్పర్యము : ఓ ఉపవేషమా! యుద్ధము చేయcగోరుచున్న శత్రువును స్వగృహమునుండి పోదోలుము. సర్వజగత్తును బాధించునట్టి యీ యుపవేషరూప హవిస్సుచే నింద్రుc డీ శత్రువును పరాభవించి హింసించెను. ఓ శత్రూ! నీవు మూcడు లోకములను వెడలి మూcడు దూరదేశములను, బ్రాహ్మణాది మనుష్యులను, అతిక్రమించి చండాలాదులందు పొమ్ము. ఎంతకాలము సూర్యుcడు దివియందు ఉండునో, అంత కాలము అగ్ని సూర్య చంద్రరూపములైన దీప్తుల నతిక్రమించి మహాంధకారమునందు పొమ్ము. ఏ దూర దేశము నుండి యనేక సంవత్సరములకంటె పైనిగూడ రాలేనివిధముగ వృత్రహంతయైన యింద్రుcడు నిన్ను

అత్యంతదూరదేశమునకు పంపించుటగాక. అభిచారమునకై యిచట మూడు ముక్కులుత్పాదితము లైనవి.

8. మంత్రము : త్రివృద్వా ఏష వజ్రో బ్రహ్మణా సగ్ంశితః । శుచైవైనం విద్ధ్వా । ఏభ్యో లోకేభ్యో నిర్ణుద్య । వజ్రేణ బ్రహ్మణా స్తృణుతే ।

అర్థము : బ్రహ్మణా=మంత్రముచేత, సంశితః=తీక్ష్ణీకృతమైన, ఏషః వజ్రః=ఈ ఉపవేషరూపమైన వజ్రము, త్రివృత్ వై=త్రిగుణమే, భవతి=అగుచున్నది. శుచైవ=ఈ యుపవేషనిష్ఠమైన తాపముచేతనే, ఏనమ్=ఈ వైరిని, విద్ధ్వా=బాధించి, ఏభ్యః లోకేభ్యః=ఈ లోకములనుండి, నిర్ణుద్య=పోటగొట్టి, బ్రహ్మణా వజ్రేణ=మంత్రాత్మకమైన వజ్రముచేత, స్తృణుతే=అధ్వర్యుడు హింసించినవాడగుచున్నాడు.

తాత్పర్యము : మంత్రముచే తీక్ష్ణీకృతమైన యీ యుపవేషరూప వజ్రము త్రిగుణ మగుచున్నది. ఉపవేషగతమైన తాపముచే ఈ శత్రువును వేధించి యీ ముల్లోకములనుండి తొలగించి యధ్వర్యుడు మంత్రాత్మకమైన వజ్రముచే హింసించినవాడగును. పూర్వోక్తములైన మూడు ముక్కులచే ఉపవేషమును గృహమునుండి దూర ప్రదేశమున పడవేయవలె ననెడి విధి యీ స్తావకమైన యర్థవాదముచే సూచిత మైనది.

9. మంత్రము : హతో ఽసావవధిష్మాముమిత్యాహ స్తుత్యై ।

అర్థము : ''హతో ఽసావవధిష్మాముమ్'' ఇతి ఆహ='ఈ వైరి హతుడు. అముమ్=ఈ శత్రువును, అవధిష్మ=వధించితిమి' అని యధ్వర్యు డీ మంత్రమును పఠించవలెను. ఏతత్=ఈ మంత్రపఠనము, స్తుత్యై=హింసకొఱకు, భవతి=అగుచున్నది.

తాత్పర్యము : మూడు మాఱులు భూమిని త్రవ్వి యచట ఉపవేషము నుంచుటకై యజుర్ధ్వయరూప మంత్ర మిచట ఉత్పాదిత మైనది. ''హతో ఽసావవధిష్మాముమ్'' అనునదే యా మంత్రము. 'ఈ శత్రువు హతుడు. ఇతనిని వధించితిమి' అని యా మంత్ర తాత్పర్యము.

10. మంత్రము :యం ద్విష్యాత్తం ధ్యాయేత్ । శుచైవైనమర్పయతి (4) ।

నో ద్విష్మ ఇతి పరావత మర్పయతి ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయప్రపాఠకే ఏకాదశో ఽనువాకః ॥౧౧॥

అర్థము : యమ్=ఏ శత్రువును, ద్విష్యాత్=ద్వేషించునో, తమ్=ఆ శత్రువును, ధ్యాయేత్=ఉపవేషమును అగ్నియందు పడవేయునప్పుడును, దూరప్రదేశమునందు పడవేయునప్పుడును. భూమియందలి గుంటయందు పడవేయునప్పుడును అధ్వర్యుడు తలచవలెను. (తథా కృతవాన్=ఆ విధముగ జేసిన, అధ్వర్యుః=అధ్వర్యుడు,) ఏనమ్=ఈ శత్రువును, శుచైవ=తాపముచేతనే అర్పయతి=అర్పించినవాడగును.

తాత్పర్యము : ఉపవేషము నగ్నియందుంచునప్పుడును, దూరదేశమునందు పడవేయునప్పుడును, భూమియందలి గుంటయందుంచినప్పుడును ఇచట ధ్యానము విధించఁబడినది. తాత్పర్యము స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున తృతీయ ప్రపాఠకమునందు ఏకాదశానువాకము సమాప్తము.

ప్రత్యూష్టం దివః శిల్పమయజ్ఞో ఘృతం చ దేవాసురాః స ఏతమిన్ద్ర ఆపో దేవీరగ్నినా దిష్ణియా అథ స్రుచౌ యో వా అయథాదేవతం పరివేషో వా ఏకాదశ ।

ప్రత్యూష్టమయజ్ఞ ఏషా హి విశ్వేషాం దేవానామూర్జా పృథివీమథో రక్షసాం తాం ప్రజాతిం ద్వాభ్యాం తం కాలే కాలే నవసప్తతిః ॥ ప్రత్యూష్టమర్వయతి॥

హరిః ఓమ్ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే తృతీయః ప్రపాఠకః ॥3॥

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో తృతీయ ప్రపాఠకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే

ప్రథమోఽనువాకః

1. మంత్రము : **బ్రహ్మణే బ్రాహ్మణమాలభతే । క్షత్రాయ రాజన్యమ్ । మరుద్భ్యో వైశ్యమ్ । తపసే శూద్రమ్ । తమసే తస్కరమ్ । నారకాయ వీరహణమ్ । పాప్మనే క్లీబమ్ । ఆక్రయాయాయోగూమ్ । కామాయ పుగ్ంశ్చలూమ్। అతిక్రుష్టాయ మాగధమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే ప్రథమోఽనువాకః ॥౧॥

వేదార్థదీపిక

అవతారిక: ఈ చతుర్థప్రపాఠకమునందు పురుషమేధము చెప్పబడుచున్నది. ఇది పంచాహఃకర్మ. దీనిని బ్రాహ్మణుడు కాని, రాజు కాని చేయవలెను. దీని ననుష్ఠించుటవలన యజ్ఞకర్త ఓజస్సును, వీర్యమును పొందును. జ్యోతిష్టోమాదులందు పశువు ఆలంభనము చేయబడు విధముగనే యీ పురుషమేధమందు మనుష్యుడాలంభనము చేయబడును. మనుష్యరూపపశు విధాయకమైన యీ చతుర్థ ప్రపాఠకమునందు ఏకోనవింశత్యనువాకములు కలవు. వానిలో నిది ప్రథమానువాకము. ప్రతిమంత్రమునందు చతుర్థ్యంతములు దేవతలు. ద్వితీయాంతములు పశువులు (మనుష్యుడు కూడ పశువుగానే వ్యవహరించబడుచున్నాడు.) అన్నివాక్యములందు ఆలభతే అను క్రియాపద మనువర్తించును.

అర్థము : బ్రహ్మణే=బ్రాహ్మణజాత్యభిమానిదేవునికొఱకు, బ్రాహ్మణమ్=ఒకానొక బ్రహ్మవర్చసయుక్తుడైన బ్రాహ్మణుని, ఆలభతే=ఆలంభనము చేయవలెను. క్షత్రాయ=క్షత్రియజాత్యభిమానిదేవునికొఱకు, రాజన్యమ్=క్షత్రియ జాతీయుని, ఆలభతే. మరుద్భ్యః=దేవవైశ్యులైన మరుత్తులకొఱకు, వైశ్యమ్=వైశ్యజాతీయుని, ఆలభతే. తపసే=కృచ్ఛ్రచాంద్రాయణాది దుఃఖరూప తపోదేవునికొఱకు, శూద్రమ్=దుఃఖజాతుడైన శూద్రుని, ఆలభతే. తమసే=అంధకారదేవునికొఱకు, తస్కరమ్=తమఃప్రియుడైన చోరుని, ఆలభతే. నారకాయ=నరకస్వామికొఱకు, వీరహణమ్=అగ్న్యుద్వాసిని, ఆలభతే. పాప్మనే=పాపస్వామి కొఱకు, క్లీబమ్=నపుంసకుని, ఆలభతే. ఆక్రయాయ=సర్వద్రవ్యక్రయాభిమాని దేవునికొఱకు, అయోగూమ్=అశాస్త్రీయకర్తయగు పురుషుని, ఆలభతే. కామాయ=కామదేవునికొఱకు, పుంశ్చలూమ్= సాధారణస్త్రీని, ఆలభతే. అతిక్రుష్టాయ=అతినిందితదేవునికొఱకు, మాగధమ్=క్షత్రియస్త్రీయందు వైశ్యునిచే నుత్పాదితుడైనవానిని, ఆలభతే=ఆలంభనము చేయవలెను.

తాత్పర్యము : ఓజస్సును, వీర్యమును కోరునట్టి బ్రాహ్మణుడు కాని, క్షత్రియుడు కాని వరుసగా బ్రాహ్మణజాత్యభిదేవాదులకొఱకు బ్రాహ్మణజాతీయపురుషాదుల నాలంభనము చేయవలెను. ఈ పురుషమేధానుష్ఠాన విధానమును ఆపస్తంబసూత్రము విపులముగ తెలియజేసినది. ''పఞ్చాహః పురుషమేధో బ్రాహ్మణో రాజన్యో వా'' ఇత్యాదికము ఆపస్తంబకల్పసూత్రము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు ప్రథమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
ద్వితీయోఽనువాకః

1. మంత్రము : **గీతా॑య సూ॒తమ్ । నృత్తా॑య శైలూ॒షమ్ । ధర్మా॑య సభా॒చర॑మ్ । న॒ర్మా॑య రే॒భమ్ । నరిష్మా॑యై భీ॒మల॑మ్ । హసా॑య కా॒రిమ్ । ఆనన్దా॑య స్త్రీ॒షఖ॑మ్ । ప్ర॒ముదే॑ కుమారీపు॒త్రమ్ । మే॒ధా॑యై రథకా॒ర॑మ్ । ధైర్యా॑య త॒క్షాణ॑మ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే ద్వితీయోఽనువాకః ॥౨॥

వేదార్థదీపిక

అర్థము : గీతాయ = గీతాభిమానిదేవునికొఱకు, సూతమ్ = బ్రాహ్మణస్త్రీయందు క్షత్రియునిచే నుత్పాదితుఁడైన గాన జీవిని, ఆలభతే = ఆలంభనము చేయవలెను. నృత్తాయ = నృత్తాభిమానిదేవునికొఱకు, శైలూషమ్ = తనభార్య నితరుని కొసఁగి, ఆ యితరునిచే జీవించువానిని, ఆలభతే. ధర్మాయ = ధర్మాభిమానిదేవునికొఱకు, సభాచరమ్ = సభయందు నిత్యము ధర్మమును ప్రవచించువానిని, ఆలభతే. నర్మాయ = వినోదాభిమానిదేవునికొఱకు, రేభమ్ = చాటూక్తికుశలుఁడైన మేధావిని, ఆలభతే. నరిష్మాయై = పరతంత్రాభిమానినియైన దేవతకొఱకు, భీమలమ్ = భీరువును (చపలాత్మునిని), ఆలభతే. హసాయ = హాస్యాభిమానిదేవునికొఱకు, కారిమ్ = వికటగమనకారిని, ఆలభతే. ఆనన్దాయ = ఆనందాభిమానిదేవునికొఱకు, స్త్రీషఖమ్ = స్త్రీలకు ప్రియుడైనవానిని, ఆలభతే. ప్రముదే = ప్రకృష్టహర్షాభిమానిదేవునికొఱకు, కుమారీపుత్రమ్ = దుహితృపుత్రుని, ఆలభతే. మేధాయై = గ్రంథార్థధారణాభిమానినియైన దేవతకొఱకు, రథకారమ్ = రథకర్తను (నిపుణమతిని), ఆలభతే. ధైర్యాయ = ధైర్యాభిమానిదేవునికొఱకు, తక్షాణమ్ = వడ్లంగిని, ఆలభతే.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
ద్వితీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
తృతీయోఽనువాకః

1. మంత్రము : **శ్రమాయ కౌలాలమ్ మాయాయై కార్మారమ్ । రూపాయ మణికారమ్ । శుభే వపమ్ । శరవ్యాయా ఇషుకారమ్ । హేత్యై ధన్వకారమ్ । కర్మణే జ్యాకారమ్ । దిష్టాయ రజ్జూసర్గమ్ । మృత్యవే మృగయుమ్। అన్తకాయ శ్వనితమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే తృతీయోఽనువాకః ॥౩॥

వేదార్థదీపిక

అర్థము : శ్రమాయ=శ్రమాభిమానిదేవునికొఱకు, కౌలాలమ్=కుమ్మరవానికుమారుని, ఆలభతే. మాయాయై=విచిత్ర కరణశక్త్యభిమానిదేవునికొఱకు, కార్మారమ్=లోహకారుని, ఆలభతే. రూపాయ=శుక్లకృష్ణాది రూపాభిమానిదేవునికొఱకు, మణికారమ్=మణిముక్తాదిసంస్కర్తను, ఆలభతే. శుభే=శుభ్రాభిమానినియైన దేవతకొఱకు, వపమ్=విత్తనములను విత్తెడువానిని, ఆలభతే. శరవ్యాయై=బాణసమూహాభిమానినియగు దేవతకొఱకు, ఇషుకారమ్=బాణములను సంస్కరించువానిని, ఆలభతే, హేత్యై=ఆయుధాభిమానినియైన దేవతకొఱకు, ధన్వకారమ్=ధనుస్సంస్కర్తను,ఆలభతే. కర్మణే=వ్యాపారాభిమానిదేవునికొఱకు, జ్యాకారమ్=వింటినారులను సంస్కరించువానిని, ఆలభతే. దిష్టాయ=భవితవ్యాభిమానిదేవునికొఱకు, రజ్జుసర్గమ్=రజ్జుసృష్టను, ఆలభతే. మృత్యవే=మరణాభిమానిదేవునికొఱకు, మృగయుమ్=వేటకానిని, ఆలభతే. అన్తకాయ=ప్రాణాపహారిదేవునికొఱకు, శ్వనితమ్=కుక్కలతోఁ గూడ క్రీడించు జీవితము కలవానిని, ఆలభతే.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
తృతీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
చతుర్థోఽనువాకః

1. మంత్రము : సంధయే జారమ్ । గేహాయోపపతిమ్ । నిర్ఋత్యై పరివిత్తమ్ । ఆర్త్యై పరివివిదానమ్ । అరాధ్యై దిధిషూపతిమ్ । పవిత్రాయ భిషజమ్ । ప్రజ్ఞానాయ నక్షత్రదర్శమ్ । నిష్కృత్యై పేశస్కారీమ్ । బలాయోపదామ్ । వర్ణాయానూరుధమ్, ఇతి ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే చతుర్థోఽనువాకః ॥౪॥

వేదార్థదీపిక

అర్థము : సంధయే=సంఘటనాభిమానినియైన దేవతకొఱకు, జారమ్=జారుని(వ్యభిచరించెడు పురుషుని), ఆలభతే. గేహాయ=గృహాభిమానిదేవునికొఱకు, ప్రజ్ఞాతజారుని, ఆలభతే. నిర్ఋత్యై=నిర్ఋతి దేవతకొఱకు, పరివిత్తమ్=పరివిత్తుని (అన్నకంటె పూర్వమే వివాహము చేసికొనిన తమ్ముని), ఆలభతే. ఆర్త్యై=దుఃఖదేవతకొఱకు, పరివిదానమ్=అన్నకంటె ప్రథమమున వివాహము చేసికొనవలె ననెడి శీలముకలిగి తదాగ్రహ యుక్తుడైన కనిష్ఠుని, ఆలభతే. అరాధ్యై=కార్యసిద్ధి ప్రతిబంధానినియైన దేవతకొఱకు, దిధిషూపతిమ్=రెండు వివాహములు చేసికొనిన స్త్రీయొక్క భర్తను, ఆలభతే. పవిత్రాయ=శుద్ధాభిమానిదేవునికొఱకు, భిషజమ్=చికిత్సకుని, ఆలభతే. ప్రజ్ఞానాయ=కాలజ్ఞానాభిమానిదేవునికొఱకు, నక్షత్రదర్శమ్=జ్యోతిశ్శాస్త్రవిదుని, ఆలభతే. నిష్కృత్యై=కార్యనిష్పాదనాభిమానినియైన దేవతకొఱకు, పేశస్కారీమ్=సువర్ణకారునిభార్యను, ఆలభతే. బలాయ=బలాభిమానిదేవునికొఱకు, ఉపదామ్=ఉపదను, ఆలభతే. వర్ణాయ=శుక్లకృష్ణవర్ణాభిమానిదేవునికొఱకు, అనూరుధమ్=అనూరుధుని, ఆలభతే.

తాత్పర్యము : ఉపద=అన్నము నొసఁగినంతమాత్రమున గ్రహించఁబడిన కన్య. అనూరుధుఁడు=స్వకీయ ప్రయోజనము లేకయే పరానురోధము ననుసరించి ప్రవర్తించువాఁడు. తాత్పర్యము స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
చతుర్థానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే పఞ్చమోఽనువాకః

1. మంత్రము : **నదీభ్యః పౌఞ్జిష్టమ్ । ఋక్షకాభ్యో నైషాదమ్ । పురుషవ్యాఘ్రాయ దుర్మదమ్ । ప్రయుద్భ్య ఉన్మత్తమ్। గన్ధర్వాప్సరాభ్యో వ్రాత్యమ్ । సర్పదేవజనేభ్యోఽప్రతిపదమ్ ।అవేభ్యః కితవమ్ । ఇర్యతాయా అకితవమ్। పిశాచేభ్యో విదలకారమ్ । యాతుధానేభ్యః కణ్టకకారమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే పఞ్చమోఽనువాకః ॥౫॥

వేదార్థదీపిక

అర్థము : నదీభ్యః=నదీదేవతలకొఱకు, పౌఞ్జిష్టమ్=చేపలచబట్టువానిని. ఆలభేత. ఋక్షకాభ్యః=భూన్యస్థలీదేవతలకొఱకు, నైషాదమ్=(నిషాదః ఏవ నైషాదః)నిషాదుని(ఒకతెగబోయవానిని), ఆలభేత. పురుషవ్యాఘ్రాయ=పురుషశ్రేష్ఠాభిమానిదేవునికొఱకు, దుర్మదమ్=అత్యంతమదాంధుని, ఆలభేత. ప్రయుద్భ్యః=ప్రకర్షముగ యుద్ధము చేయునట్టి యోద్ధదేవతలకొఱకు, ఉన్మత్తమ్=ఉన్మాదుని, ఆలభేత. గన్ధర్వాప్సరాభ్యః=గంధర్వులకొఱకు, తదీయ భార్యలకొఱకును, వ్రాత్యమ్=శాస్త్రీయ సంస్కారహీనుడైన పురుషుని, ఆలభేత. సర్పదేవజనేభ్యః=సర్పదేవతకొఱకు, దేవజనశబ్ద వాచ్యులైన గారుడికాభిమానిదేవతలకొఱకును, అప్రతిపదమ్=సంస్కారాయోగ్యుని, ఆలభేత. అవేభ్యః=రక్షాభిమానిదేవతలకొఱకు, కితవమ్=ద్యూతాసక్తుని, (జూదమునం దాసక్తి కలవానిని), ఆలభేత. ఇర్యతాయై=అన్నసమృద్ధ్యభిమానిదేవతకొఱకు, అకితవమ్=ద్యూతాది వ్యసన రహితుని, ఆలభేత. పిశాచేభ్యః=దేవయోనివిశేషులకొఱకు, విదలకారమ్=విదలకారుని, ఆలభేత. యాతుధానేభ్యః=రక్షోవిశేషులకొరకు, కణ్టకకారమ్=ఆరామాదులందు కంటకావృత్తినిచేయువానిని, ఆలభేత. విదలకారః=వెదుళ్లను చీల్చి అయా వెదురుబద్దలతో చేటులను, గరిసెలను చేయువాడు.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయకాండమున చతుర్థప్రపాఠకమునందు పంచమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
షష్ఠోఽనువాకః

1. మంత్రము : **ఉత్సాదేభ్యః కుబ్జమ్ । ప్రముదే వామనమ్ । ద్వార్భ్యః స్రామమ్ । స్వప్నాయాన్ధమ్ । అధర్మాయ బధిరమ్ । సంజ్ఞానాయ స్మరకారీమ్ । ప్రకామోద్యాయోపసదమ్ । ఆశిక్షాయై ప్రశ్నినమ్ । ఉపశిక్షాయా అభిప్రశ్నినమ్ । మర్యాదాయై ప్రశ్నవివాకమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే షష్ఠోఽనువాకః ॥౬॥

వేదార్థదీపిక

అర్థము : ఉత్సాదేభ్యః=కార్యవినాశాభిమానిదేవతలకొఱకు, కుబ్జమ్=వంకరైన పృష్ఠభాగము కలవానిని, ఆలభేత. ప్రముదే=ప్రకృష్టహర్షాభిమానిదేవునికొఱకు, వామనమ్=పొట్టివానిని, ఆలభేత. ద్వార్భ్యః=ద్వారాభిమానిదేవతలకొఱకు, స్రామమ్=రోగిని, అలభేత. స్వప్నాయ= స్వప్నాభిమానిదేవునికొఱకు, అన్ధమ్=దృష్టిహీనుని, ఆలభేత. అధర్మాయ= పాపాభిమానిదేవుని కొఱకు, బధిరమ్=శ్రవణశక్తిహీనుని, ఆలభేత. సంజ్ఞానాయ=సమ్యగ్బోధాభిమానిదేవునికొఱకు, స్మరకారీమ్=మంత్రౌషధాదులచే భర్తకు కామమునుత్పాదింపcజేయునట్టి స్త్రీని, ఆలభేత. ప్రకామోద్యాయ= బహుప్రలాప్యభిమానిదేవునికొఱకు, ఉపసదమ్=ప్రయోజనము లేకయే బహుభాషిగా సభయందు కూర్చున్నవానిని, ఆలభేత. ఆశిక్షాయై= (వేదశాస్త్రములం దల్పపరిచయము ఆశిక్ష) ఆశిక్షాభిమానిదేవతకొఱకు, ప్రశ్నినమ్=శాస్త్రార్థములందు సందేహముచే ప్రశ్నించువానిని, ఆలభేత. ఉపశిక్షాయై=ఉపశిక్షాభిమానిదేవతకొఱకు, (వేదశాస్త్రవిషయపరిచయము ఉపశిక్ష.) అభిప్రశ్నినమ్=ఒక ప్రశ్నము నడిగినవానికి పిమ్మట ప్రశ్నము నడుగునట్టి యింకొక పురుషుని, (పూర్వప్రశ్ననిరాకర్త యని యర్థము.) ఆలభేత. మర్యాదాయై=శాస్త్రార్థ వ్యవస్థాభిమానిదేవతకొఱకు, ప్రశ్నవివాకమ్=పరకీయప్రశ్నమును బాగుగ విశ్లేషించి సమాధానము చెప్పునట్టి పురుషుని, ఆలభేత.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
షష్ఠానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
సప్తమోఽనువాకః

1. మంత్రము : **ఋత్యై స్తేనహృదయమ్ । వైరహత్యాయ పిశునమ్ । వివిత్యై క్షత్తారమ్ । ఔపద్రష్టాయ సంగ్రహీతారమ్।**

బలాయానుచరమ్ । భూమ్నే పరిష్కన్దమ్ । ప్రియాయ ప్రియవాదినమ్ । అరిష్ట్యా అశ్వసాదమ్ ।

మేధాయ వాసఃపల్పూలీమ్ । ప్రకామాయ రజయిత్రీమ్, ఇతి ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే సప్తమోఽనువాకః ॥౭॥

వేదార్థదీపిక

అర్థము : ఋత్యై=చౌర్యానంతరము చోరునియొక్క గమనభృతి నభిమానించు దేవతకొఱకు, స్తేనహృదయం=చౌర్యమునం దభిప్రాయము కలవానిని, ఆలభతే. వైరహత్యాయ=వీరహత్యాభిమాని దేవునికొఱకు, పిశునమ్=ప్రభువుయొక్క చెవియందు పరదోషమును సూచించువానిని, ఆలభతే. వివిత్యై=విశేషలాభాభిమానిదేవతకొఱకు, క్షత్తారమ్=సారథిని, ఆలభతే. ఔపద్రష్టాయ=ఉపద్రష్టృభిమాని దేవునికొఱకు, సంగ్రహీతారమ్= భాండాగారాధ్యక్షుని, (లేదా-కప్పమును తీసికొనువానిని,) ఆలభతే. బలాయ=బలాభిమానిదేవునికొఱకు, అనుచరమ్=సేవకుని, ఆలభతే. భూమ్నే=మహత్త్వాభిమాని దేవునికొఱకు, పరిష్కన్దమ్=పరిచారకుని, ఆలభతే. ప్రియాయ=ప్రియాభిమానిదేవునికొఱకు, ప్రియవాదినమ్=మృదుభాషిని, ఆలభతే. అరిష్ట్యై=అహింసాభిమానిదేవతకొఱకు, అశ్వసాదమ్=అశ్వము నారోహించువానిని, ఆలభతే. మేధాయ=యజ్ఞ బుద్ధ్యభిమానిదేవునికొఱకు, వాసఃపల్పూలీమ్=వస్త్రమును శుద్ధిచేయునట్టి రజకస్త్రీని, ఆలభతే. ప్రకామాయ= ప్రకృష్టకామాభిమానిదేవునికొఱకు, రజయిత్రీమ్=వస్త్రములందు రంజనము చేయు (రంగు వేయు) స్త్రీని, ఆలభతే.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
సప్తమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే అష్టమోఽనువాకః

1. మంత్రము : **భాయై దార్వాహారమ్ । ప్రభాయా ఆగ్నేన్ధమ్ । నాకస్య పృష్ఠాయాభిషేక్తారమ్ । బ్రధ్నస్య విష్టపాయ పాత్రనిర్ణేగమ్ । దేవలోకాయ పేశితారమ్ । మనుష్యలోకాయ ప్రకరితారమ్ । సర్వేభ్యో లోకేభ్య ఉపసేక్తారమ్। అవ్యై వధాయోపమన్థితారమ్ । సువర్గాయ లోకాయ భాగదుఘమ్ । వర్ష్మాయ నాకాయ పరివేష్టారమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే అష్టమోఽనువాకః ॥౮॥

వేదార్థదీపిక

అర్థము : భాయై = దీప్త్యభిమానిదేవతకొఱకు, దార్వాహారమ్ = ఇంధనములను తెచ్చువానిని, ఆలభతే. ప్రభాయై = ప్రకృష్ట దీప్త్యభిమాని దేవతకొఱకు, ఆగ్నేన్ధమ్ = ఆగ్నేన్ధమ్ = అగ్నిని ప్రజ్వలింపజేయువానిని, ఆలభతే. నాకస్య పృష్ఠాయ = స్వర్గోపరిభాగస్వామికొఱకు, అభిషేక్తారమ్ = రాజ్యాభిషేకకర్తను, ఆలభతే. బ్రధ్నస్య విష్టపాయ = ఆదిత్యునియొక్క లోకమును పాలించునట్టి దేవునికొఱకు, పాత్రనిర్ణేగమ్ = కాంస్య తామ్రాది పాత్రములను శుద్ధిచేయువానిని, ఆలభతే. దేవలోకాయ = దేవలోకాభిమానిదేవతకొఱకు, పేశితారమ్ = ప్రశాంత వైరము నుత్పాదింపజేయువానిని, ఆలభతే. మనుష్యలోకాయ = మనుష్యలోకాభిమానిదేవుని కొఱకు, ప్రకరితారమ్ = స్నేహితులకు వైరమును కల్పించి వారిని వేఱుచేయువానిని, ఆలభేత. సర్వేభ్యః లోకేభ్యః = సర్వలోకాభిమానులైన దేవతలకొఱకు, ఉపసేక్తారమ్ = వైరమును శమింపcజేయువానిని, ఆలభేత. అవ్యై వధాయ = కృచ్ఛ్రాపత్తిలక్షణవధాభిమానిదేవునికొఱకు, ఉపమన్థితారమ్ = స్వయముగ వెళ్లి వైరమును కల్పించువానిని, ఆలభేత. సువర్గాయ లోకాయ = స్వర్గలోకాభిమానిదేవునికొఱకు, భాగదుఘమ్ = ప్రజలకొఱకు రాజభాగమును సంపాదించువానిని, ఆలభేత. వర్ష్మాయ నాకాయ = అతిప్రవృద్ధ స్వర్గాభిమానిదేవునికొఱకు, పరివేష్టారమ్ = భోజనసమయమున పరివేషణము (అన్నమును వడ్డించుట) చేయువానిని, ఆలభతే.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునఁ తృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు అష్టమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
నవమోఽనువాకః

1. మంత్రము : **అర్మేభ్యో హస్తిపమ్ । జవాయాశ్వపమ్ । పుష్ట్యై గోపాలమ్ । తేజసే ఽజపాలమ్ । వీర్యాయావిపాలమ్ । ఇరాయై కీనాశమ్ । కీలాలాయ సురాకారమ్ । భద్రాయ గృహపమ్ । శ్రేయసే విత్తపమ్ । అధ్యక్షాయానుక్షత్తారమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే నవమోఽనువాకః ॥౯॥

వేదార్థదీపిక

అర్థము : అర్మేభ్యః=గతివిశేషాభిమానిదేవతలకొఱకు, హస్తిపమ్=గజపాలకుని, ఆలభేత. జవాయ=వేగాభిమానిదేవునికొఱకు, అశ్వపమ్=అశ్వపాలకుని, ఆలభేత. పుష్ట్యై = పుష్ట్యభిమాని దేవతకొఱకు, గోపాలమ్=గోపాలకుని, ఆలభేత. తేజసే=తేజోభిమానిదేవునికొఱకు, అజపాలమ్=అజపాలకుని, ఆలభేత. వీర్యాయ=వీర్యాభిమానిదేవునికొఱకు, అవిపాలమ్=అవిపాలకుని, ఆలభేత. ఇరాయై=అన్నాభిమానిదేవతకొఱకు, కీనాశమ్=కర్షకుని, ఆలభేత. కీలాలాయ=జలాభిమానిదేవునికొఱకు, సురాకారమ్=సుర నుత్పత్తిచేయువానిని, ఆలభేత. భద్రాయ=కల్యాణాభిమానిదేవునికొఱకు, గృహపమ్=గృహపాలకుని, ఆలభేత. శ్రేయసే=శ్రేయోభిమానిదేవునికొఱకు, విత్తపమ్=ధనపాలకుని, ఆలభేత. అధ్యక్షాయ=ప్రత్యక్షకారణాభిమానిదేవతకొఱకు, అనుక్షత్తారమ్=సారథియొక్క యనుచరుని, ఆలభేత.

తాత్పర్యము : అజపాలకుఁడు=మేఁకలను పాలించువాఁడు. అవిపాలకుఁడు=గొఱ్ఱెలను పాలించువాఁడు. గృహపుఁడు=గృహములకు పాలకుఁడు. గోపాలుఁడు=గోవులకు పాలకుఁడు. తాత్పర్యము స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు నవమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
దశమోఽనువాకః

1. మంత్రము : **మన్యవే కయస్తాపమ్ । క్రోధాయ నిసరమ్ । శోకాయాభిసరమ్ । ఉత్కూలవికూలాభ్యాం త్రిస్థినమ్ ।**

యోగాయ యోక్తారమ్ । క్షేమాయ విమోక్తారమ్ । వపుషే మానస్కృతమ్ । శీలాయాఞ్జనీకారమ్ ।

నిర్బుత్యై కోశకారీమ్ । యమాయాసూమ్, ఇతి ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే దశమోఽనువాకః ॥౧౦॥

వేదార్థదీపిక

అర్థము : మన్యవే=మానస కోపాభిమాని దేవునికొఱకు, అయస్తాపమ్=ఇనుమును కాల్చునట్టి లోహకారుని, ఆలభేత.క్రోధాయ=బాహ్యకోపాభిమాని దేవునికొఱకు, నిసరమ్=వధ్యులను వెలుపలకు తొలఁగించువానిని, ఆలభేత. శోకాయ=శోకాభిమానిదేవతకొఱకు, అభిసరమ్=రథమునకు ముందు పోవువానిని, ఆలభేత. ఉత్కూలవికూలాభ్యామ్=ఉత్కూలవికూలాభిమాని దేవతలకొఱకు, త్రిస్థినమ్=రెండు పాదములు, దండము అను మూడింటిచేతను పోవుట కశక్తుఁడైనవానిని ఆలభేత. యోగాయ=అలబ్ధలాభాభిమాని దేవునికొఱకు, యోక్తారమ్=రథమునం దశ్వములను పూన్చువానిని, ఆలభేత. క్షేమాయ=లబ్ధపాలనాభిమాని దేవునికొఱకు, విమోక్తారమ్=రథమునందు పూన్చబడిన యశ్వములను విడిపించువానిని, ఆలభేత. వపుషే= శరీరాభిమాని దేవునికొఱకు, మానస్కృతమ్=మనస్సుచేతనే లావణ్యమును విషయమునందు కలుగజేయువాని పుత్రుని ఆలభేత. శీలాయ=స్వభావవిశేషాభిమాని దేవునికొఱకు, అఞ్జనీకారమ్=నేత్రములందు అంజనముచే నలంకారమును చేయువానిని, ఆలభేత. నిర్బుత్యై=పాపదేవతకొఱకు, కోశకారీమ్=ఖడ్గాదులకు చర్మమయమైన తొడుగును చేయునట్టి స్త్రీని, ఆలభేత. యమాయ=ప్రాణాపహారి దేవునికొఱకు, అసూమ్=వంధ్యను (గొడ్రాలిని), ఆలభేత.

తాత్పర్యము : ఉత్కూలము=కాంక్షితముకంటె నధికలాభము. వికూలము= కాంక్షితముకంటె నల్పలాభము. తాత్పర్యము స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
దశమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే ఏకాదశోఽనువాకః

1. మంత్రము : **యమ్యై యమసూమ్ । అథర్వభ్యో కవతీకామ్ । సంవత్సరాయ పర్యారిణీమ్ ।**

పరివత్సరాయావిజాతామ్ । ఇదావత్సరాయాపస్కద్వరీమ్ । ఇద్వత్సరాయాతీత్వరీమ్ । వత్సరాయ

విజర్జరామ్ । సంవత్సరాయ పలిక్నీమ్ । వనాయ వనపమ్ । అన్యతోకరణ్యాయ దావపమ్, ఇతి ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే ఏకాదశోఽనువాకః ॥౧౧॥

వేదార్థదీపిక

అర్థము : యమ్యై=యమునియొక్క స్త్రీకొఱకు, యమసూమ్=పుత్రయుగళమును (కవలలను) ప్రసవించిన స్త్రీని, ఆలభేత. అథర్వభ్యః=అథర్వశాఖాగతమంత్రాభిమాని దేవతలకొఱకు, అవలోకామ్=గర్భస్రావము కలిగిన స్త్రీని, ఆలభేత. సంవత్సరాయ=ప్రభవాది సంవత్సరములోని ప్రథమ సంవత్సరాభిమాని దేవుని కొఱకు, పర్యారిణీమ్=ప్రసవకాల మతిక్రమించఁగా ప్రసవించిన స్త్రీని, ఆలభేత. పరివత్సరాయ=ప్రభవాదులలో ద్వితీయ సంవత్సరాభిమాని దేవునికొఱకు, అవిజాతామ్=ద్వితీయప్రసవ రహితమైన స్త్రీని, ఆలభేత. ఇదావత్సరాయ=ప్రభవాదులలోని తృతీయ సంవత్సరాభిమాని దేవతకొఱకు, అపస్కద్వరీమ్=గర్భపరిణామముకంటె పూర్వమే ప్రసవప్రతిబంధమునందు కుశలయైన స్త్రీని, ఆలభేత. ఇద్వత్సరాయ=చతుర్థ సంవత్సరాభిమానిదేవునికొఱకు, అతీత్వరీమ్=ప్రసవకాలాతిక్రమము చేయుటయందు కుశలయైన స్త్రీని, వత్సరాయ=పంచమ సంవత్సరాభిమాని దేవతకొఱకు, విజర్జరామ్=ప్రసూతి లేకనే జీర్ణయైన స్త్రీని, ఆలభేత. సంవత్సరాయ=సర్వజగత్తునకు ఛద్మకారియైన దేవునికొఱకు, పలిక్నీమ్=ప్రథమవయస్సునందే ముదిసిన స్త్రీని, ఆలభేత. వనాయ=వనాభిమాని దేవునికొఱకు, వనపమ్=వనపాలకుని, ఆలభేత. అన్యతోఽరణ్యాయ=ఏకపార్శ్వవర్తిఅరణ్యాభిమాని దేవునికొఱకు, దావపమ్=దావాగ్నిపాలకుని, ఆలభేత.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయకాండమున చతుర్థప్రపాఠకమునందు

ఏకాదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
ద్వాదశోఽనువాకః

1. మంత్రము : **సరోభ్యో ధైవరమ్ । వేశన్తాభ్యో దాశమ్ । ఉపస్థావరీభ్యో వైన్దమ్ । నడ్వలాభ్యః శౌష్కలమ్ । పార్యాయ కైవర్తమ్ । అవార్యాయ మార్గారమ్ । తీర్థేభ్య ఆన్దమ్ । విషమేభ్యో మైనాలమ్ । స్వనేభ్యః పర్ణకమ్ । గుహాభ్యః కిరాతమ్ । సానుభ్యో జమ్భకమ్ । పర్వతేభ్యః కింపూరుషమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే ద్వాదశోఽనువాకః ॥౧౨॥

వేదార్థదీపిక

అర్థము : సరోభ్యః=సరోభిమాని దేవతలకొఱకు, ధైవరమ్=ధైవరుని, ఆలభేత. వేదాన్తాభ్యః=పల్వలాభిమాని దేవతలకొఱకు, దాశమ్=బడిశముతో (చేఁపలను పట్టెడు గాలముతో) చేఁపలను పట్టువానిని, ఆలభేత. ఉపస్థావరీభ్యః=వృక్షముల సమీపలందు ప్రవాహము లేకుండ నుండునట్టి యుదకముల నభిమానించు దేవతలకొఱకు, వైన్దమ్=జాలముతో (వలతో) జీవించువానిని, ఆలభేత. నడ్వలాభ్యః=తృణసంయుక్త దేశవర్తి జలాభిమాని దేవతలకొఱకు, శౌష్కలమ్=బడిశముతో జీవించువానిని, ఆలభేత. పార్యాయ=పరతీరాభిమాని దేవునికొఱకు, కైవర్తమ్=కైవర్తుని ఆలభేత. అవార్యాయ=అవరతీరాభిమాని దేవునికొఱకు, మార్గారమ్=జలములోపల హస్తములచే మత్స్యముల నన్వేషించువానిని, ఆలభేత. తీర్థేభ్యః=తీర్థాభిమాని దేవతలకొఱకు, ఆన్దమ్=తీర్థమందు శంకుబంధముచే చేఁపలను పట్టుకొనువానిని, ఆలభేత. విషమేభ్యః=అతీర్థాభిమాని దేవతలకొఱకు, మైనాలమ్=జాలముచే జీవించువానిని, ఆలభేత. స్వనేభ్యః=ధ్వనిసహిత జలాభిమాని దేవతలకొఱకు, పర్ణకమ్=విషసహితపర్ణమును జలముపైని ఉంచి చేఁపలను పట్టువానిని, ఆలభేత. గుహాభ్యః=పర్వతగుహాభిమాని దేవతలకొఱకు, కిరాతమ్=మృగఘాతిని (అడవియందు తిరిగెడి బోయ), ఆలభేత. సానుభ్యః=పర్వతశిఖరాభిమాని దేవతలకొఱకు, జమ్భకమ్=ఒళ్ళువిఱుచుకొనువానిని, ఆలభేత. పర్వతేభ్యః=పర్వతాభిమాని దేవతలకొఱకు, కింపురుషమ్=వనవాసియైన గాయకుని, ఆలభేత.

తాత్పర్యము : దైవరుఁడు=తటముల జలమును రెండువైపులందు బంధించి చేఁపలను పట్టుకొనువాఁడు. కైవర్తుఁడు=ఒడ్డునందు చేఁపలను పోగులుగా పోసి చంపువాఁడు. తీర్థము=నదులందు దిగుటకు వీలైన స్థానము. అతీర్థము=తీర్థముకానిది. తాత్పర్యము స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునన తృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
ద్వాదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే త్రయోదశోఽనువాకః

1. మంత్రము : **ప్రతిశ్రుత్కాయా ఋతులమ్ । ఘోషాయ భషమ్ । అన్తాయ బహువాదినమ్ । అనన్తాయ మూకమ్ । మహసే వీణావాదమ్ । క్రోశాయ తూణవధ్మమ్ । ఆక్రన్దాయ దున్దుభ్యాఘాతమ్ । అవరస్పరాయ శఙ్ఖధ్మమ్ । ఋభుభ్యో కజినసన్ధాయమ్ । సాధ్యేభ్యశ్చర్మణమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే త్రయోదశోకనువాకః ॥౧౩॥

వేదార్థదీపిక

అర్థము : ప్రతిశుష్కాయ = ప్రతిధ్వన్యభిమాని దేవునికొఱకు, ఋతులమ్ = దేశరాజవార్తాకుశలుని, ఆలభేత. ఘోషాయ = ధ్వన్యభిమాని దేవునికొఱకు, భషమ్ = అసంబద్ధప్రలాపిని, ఆలభేత. అన్తాయ = అంతవచ్ఛబ్దాభిమాని దేవునికొఱకు, బహువాదినమ్ = అధిక భాషణ కుశలుని, ఆలభేత. అనన్తాయ = అపర్యవసితశబ్దాభిమాని దేవునికొఱకు, మూకమ్ = వాగ్వ్యవహార రహితుని, ఆలభేత. మహసే = కూజిత శబ్దాభిమాని దేవునికొఱకు, వీణావాదమ్ = వీణావాదనమందు కుశలుని, ఆలభేత. క్రోశాయ = మహాశబ్దాభిమాని దేవునికొఱకు, తూణవధ్వమ్ = వేణువును వాయించువానిని (మ్రోగించువానిని), ఆలభేత. ఆక్రన్దాయ = అంతటను ఘోషణాభిమాని దేవునికొఱకు, దున్దుభ్యాఘాతమ్ = భేరిని వాయించువానిని, ఆలభేత. అవరస్పరాయ = హీనోత్తమశబ్దాభిమానిదేవునికొఱకు, శఙ్ఖధ్మమ్ = శంఖమును ధ్వనింపcజేయువానిని, ఆలభేత. ఋభుభ్యః = కాలసంధాన హేతువులైన దేవవిశేషములకొఱకు, అజినసంధాయమ్ = నారచీరలను నిర్మాణముచేయుటచే జీవించువానిని, ఆలభేత. సాధ్యేభ్యః = కాలసాద్గుణ్యహేతువులైన దేవవిశేషములకొఱకు, చర్మణమ్ = వ్రణాదిప్రహారములను నివారించునట్టి చర్మమును నిర్మించువానిని, ఆలభేత.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు త్రయోదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
చతుర్దశోఽనువాకః

1. మంత్రము : **బీభత్సాయై పౌల్కసమ్ । భూత్యై జాగరణమ్ । అభూత్యై స్వపనమ్ । తులాయై వాణిజమ్ । వర్ణాయ హిరణ్యకారమ్ । విశ్వేభ్యో దేవేభ్యః సిధ్మలమ్ । పశ్చాద్దోషాయ గ్లావమ్ । ఋత్యై జనవాదినమ్ । వ్యృద్ధ్యా అపగల్భమ్ । సగ్ంశరాయ ప్రచ్ఛిదమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే చతుర్దశోఽనువాకః ॥౧౪॥

వేదార్థదీపిక

అర్థము : బీభత్సాయై = బీభత్సాభిమాని దేవతకొఱకు, పౌల్కసమ్ = అతినికృష్టజాతీయుని, ఆలభేత. భూత్యై = ఐశ్వర్యాభిమానినియైన దేవతకొఱకు, జాగరణమ్ = ప్రబోధశీలుని, ఆలభేత. అభూత్యై = దారిద్ర్యాభిమానియైన దేవతకొఱకు, స్వపనమ్ = నిద్రాలువుని, ఆలభేత. తులాయై = తులాభిమానినియైన దేవతకొఱకు, వాణిజమ్ = క్రయముచేయువానిని, ఆలభేత. వర్ణాయ = హిరణ్య మణిముక్తాదిగత భాస్వరత్వాభాస్వరత్వాభిమాని దేవునికొఱకు, హిరణ్యకారమ్ = కటక ముకుటాది నిష్పాదకుని, ఆలభేత. విశ్వేభ్యః దేవేభ్యః = విశ్వేదేవదేవతలకొఱకు, సిధ్మలమ్ = కుష్ఠరోగిని, ఆలభేత. పశ్చాద్దోషాయ = కుష్ఠవ్యతిరిక్తరోగాభిమాని దేవునికొఱకు, గ్లావమ్ = నిత్యకృశ శరీరము కలవానిని, ఆలభేత. ఋత్యై = గత్యభిమాని దేవతకొఱకు, జనవాదినమ్ = జనులను నిందించు స్వభావము కలవానిని, ఆలభేత. వ్యృద్ధ్యై = సమృద్ధ్యభావాభిమానినియైన దేవతకొఱకు, అపగల్భమ్ = దిట్టతనము లేనివానిని, ఆలభేత. సంశరాయ = సంశీర్ణత్వాభిమాని దేవునికొఱకు, ప్రచ్ఛిదమ్ = ప్రకర్షముగ ఛేదించువానిని, ఆలభేత.

తాత్పర్యము : స్పష్టము. బీభత్స = దుష్టవస్తువులందు హేయత్వబుద్ధి. నిద్రాలువు = సర్వదా ప్రమాదభూయుష్ఠుడని యర్థము. గ్లావః = నిత్యము కృశించు శరీరము కలవాఁడు.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునఁ తృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
చతుర్దశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే పఞ్చదశోఽనువాకః

1. మంత్రము : **హసాయ పుగ్ంశ్చలూమాలభతే । వీణావాదం గణకం గీతాయ । యాదసే శాబుల్యామ్ । నర్మాయ భద్రవతీమ్ । తూష్ణవధ్మం గ్రామణ్యం పాణిసంఘాతం నృత్తాయ । మోదాయానుక్రోశకమ్ । ఆనన్దాయ తలవమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే పఞ్చదశోఽనువాకః ॥౧౫॥

వేదార్థదీపిక

అర్థము : హసాయ=అపహాసాభిమాని దేవునికొఱకు, పుంశ్చలూమ్=స్వేచ్ఛాచారిణియైన స్త్రీని, ఆలభేత=ఆలంభనము చేయవలెను. గీతాయ=గీతాభిమాని దేవునికొఱకు, వీణావాదమ్=వీణను వాయించుటలో కుశలుని, గణకమ్= శ్రుతి జాతి మండలాది గణన కుశలుని, ఆలభేత. యాదసే=జలచారిప్రాణ్యభిమాని దేవునికొఱకు, శాబుల్యామ్=శబలవర్ణశరీరము కల స్త్రీని, ఆలభేత. నర్మాయ=ప్రియవచనాభిమాని దేవునికొఱకు, భద్రవతీమ్= భద్రలక్షణయుక్త శరీరము కల స్త్రీని, ఆలభేత. నృత్తాయ=నృత్తాభిమాని దేవునికొఱకు, తూణవధ్మమ్=వేణువును వాయించువానిని, గ్రామణ్యమ్=గ్రామనాయకుని, పాణిసంఘాతమ్=హస్తద్వయముతో తాళము వేయువానిని, ఆలభేత. మోదాయ=హర్షాభిమాని దేవునికొఱకు, అనుక్రోశకమ్=నృత్తసభయందు జనుల నాహ్వానించువానిని, ఆలభేత. ఆనన్దాయ=మానసతుష్ట్యభిమానిదేవునికొఱకు, తలవమ్=కాహళమనెడి వాద్యవిశేషమును వాయించువానిని, ఆలభేత.

తాత్పర్యము : ఈ మంత్రమునందు 'ఆలభేత' అను శబ్దము అంతట ననువృత్తివివక్షను చూపుటలో మఱల ప్రయోగము చేయcబడినది. గీతాభిమాని దేవునికొఱకు ఇద్దఱు పురుషులను, నృత్తాభిమాని దేవునికొఱకు ముగ్గురు పురుషులను ఆలంభనము చేయవలెనని చెప్పcబడినది. ఆనంద మనcగా మానసతుష్టి. ఇది అనుభవైక వేద్యము. హర్ష మనcగా బాహ్యచిహ్నములచే పరితోషము. తాత్పర్యము స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు పంచదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే
షోడశోఽనువాకః

1. మంత్రము : అక్షరాజాయ కితవమ్ । కృతాయ సభావినమ్ । త్రేతాయ ఆదినవదర్శమ్ । ద్వాపరాయ బహిఃసదమ్ । కలయే సభాస్థాణుమ్ । దుష్కృతాయ చరకాచార్యమ్ । అధ్వనే బ్రహ్మచారిణమ్ । పిశాచేభ్యః శైలగమ్ । పిపాసాయై గోవ్యచ్ఛమ్ । నిర్ఋత్యై గోఘాతమ్ । క్షుధే గోవికర్తమ్ । క్షుత్తృష్ణాభ్యాం తమ్ । యో గాం వికృన్తన్తం మాగ్ంసం భిక్షమాణ ఉపతిష్ఠతే, ఇతి ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే షోడశోఽనువాకః ॥౧౬॥

వేదార్థదీపిక

అర్థము : అక్షరాజాయ=పాచికలను (ద్యూతసాధనవిశేషములను) అభిమానించు దేవునికొఱకు, కితవమ్=ద్యూత కుశలుని, ఆలభేత. కృతాయ=కృతయుగాభిమాని దేవునికొఱకు, సభావినమ్=ద్యూతసభాధిష్ఠాతను, ఆలభేత. త్రేతాయై=త్రేతాయుగాభిమాని దేవునికొఱకు, ఆదినవదర్శమ్=జూదమునందు పాచికను పరీక్షించువానిని, ఆలభేత. ద్వాపరాయ=ద్వాపరయుగాభిమానిదేవునికొఱకు, బహిఃసదమ్=సదస్సునకు వెలుపల నుండునట్టి స్వభావము కల పురుషుని, ఆలభేత. కలయే=కలియుగాభిమాని దేవునికొఱకు, సభాస్థాణుమ్=ద్యూతసభయందలి స్థాణువువంటివానిని (ద్యూతము లేనిసమయమునఁగూడ ద్యూతసభయందే యుండువానిని), ఆలభేత. దుష్కృతాయ=దుర్ఘటనకార్యకరణాభిమాని దేవునికొఱకు, చరకాచార్యమ్=వంశాగ్రవర్తనమునకు శిక్షకుఁడైనవానిని, ఆలభేత. అధ్వనే=మార్గాభిమాని దేవునికొఱకు, బ్రహ్మచారిణమ్=ఉపనీతుని, ఆలభేత.

పిశాచేభ్యః=భూతావాంతరవిశేషములకొఱకు, శైలగమ్=పథికుల వస్త్రముల నపహరించి పర్వతమునకుఁ బోవువానిని, పిపాసాయై=పానేచ్ఛాభిమానియైన దేవతకొఱకు, గోవ్యచ్ఛమ్=గోవులను వేఱుచోటులకుఁ గొనిపోవువానిని, ఆలభేత. నిర్ఋత్యై=పాపదేవతకొఱకు, గోఘాతమ్=విష కంటకాదులచే గోవులను చంపువానిని, ఆలభేత. క్షుధే=క్షుదభిమాననియైన దేవతకొఱకు, (క్షుత్=ఆఁకలి.) గోవికర్తమ్=గోవులను విశసనము చేయువానిని, ఆలభేత. (విశసనము=చంపుట.) క్షుత్తృష్ణాభ్యామ్=క్షుత్పిపాసాభిమానులైన దేవతలకొఱకు, యః=ఏ నీచజాతీయుఁడైన దరిద్రుఁడు, (క్షుత్పీడితస్సన్=ఆఁకలిగొన్నవాఁడగుచు,) గాం వికృన్తన్తమ్=గోవును చంపుచున్న పురుషునిఁగూర్చి, మాంసమ్=తదీయ మాంసమును, భిక్షమాణః= యాచించుచున్న వాఁడై, ఉపతిష్ఠతే=ఆ గోహంతకుని సేవించుచున్నాఁడో, తమ్=ఆ నీచుని, ఆలభేత. క్షుత్=ఆఁకలి. తృష్ణ=దప్పి.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
షోడశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే సప్తదశోఽనువాకః

1. మంత్రము : **భూమ్యై పీఠసర్పిణమాలభతే । అగ్నయే కంసలమ్ । వాయవే చాణ్డాలమ్ । అన్తరిక్షాయ వగ్ంశనర్తినమ్। దివే ఖలతిమ్ । సూర్యాయ హర్యక్షమ్ । చన్ద్రమసే మిర్మిరమ్ । నక్షత్రేభ్యః కిలాసమ్ । అహ్నే శుక్లం పిఙ్గలమ్ । రాత్రియై కృష్ణం పిఙ్గాక్షమ్, ఇతి ।**

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే సప్తదశోఽనువాకః ॥౧౭॥

వేదార్థదీపిక

అర్థము : భూమ్యై=భూమిదేవతకొఱకు, పీఠసర్పిణమ్=దారుమయమైన పీటమీద కూర్చుండి భూమిమీcద పోవునట్టి భగ్నచరణుని (పంగువును), ఆలభతే. అగ్నయే=అగ్నిదేవతకొఱకు, అంసలమ్=బలవంతుని, ఆలభతే. వాయవే=వాయుదేవతకొఱకు, చాణ్డాలమ్=చండాలజాతీయుని, ఆలభతే. అన్తరిక్షాయ=అంతరిక్ష దేవతకొఱకు, వంశనర్తినమ్=వంశాగ్రనృత్తముచే జీవించువానిని, ఆలభతే. దివే= ద్యులోకదేవతకొఱకు, ఖలతిమ్=కేశహీనశిరస్సు కలవానిని, ఆలభతే. సూర్యాయ=సూర్యదేవతకొఱకు, హర్యక్షమ్=హరిత వర్ణము కల నేత్రములు కలవానిని, ఆలభతే. చన్ద్రమసే=చంద్రదేవతకొఱకు, మిర్మిరమ్= నిమిషదృష్టి కలవానిని, (కనుఱెప్పలాడు దృష్టి కలవానిని), ఆలభతే. నక్షత్రేభ్యః=తెల్లని చుక్కలతో సమానులైన నక్షత్రదేవతలకొఱకు, శుక్లం=శుక్లపర్ణదేహముకలవానిని, కిలాసమ్=కుష్ఠరోగసంబంధమైన మచ్చలతోc గూడినవానిని, ఆలభతే. అహ్నే=అహర్దేవతకొఱకు, శుక్లమ్=శుక్లవర్ణదేహము కలవానిని, పిఙ్గలమ్=గోరోచనమువంటి వర్ణము కలవానిని, ఆలభతే. రాత్రియై=రాత్రి దేవతకొఱకు, కృష్ణమ్=కృష్ణవర్ణదేహము కలవాcడును, పిఙ్గాక్షమ్= పింగళవర్ణాక్షియుక్తుcడునగువానిని, ఆలభతే.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు సప్తదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే అష్టాదశోఽనువాకః

1. మంత్రము : వాచే పురుషమాలభతే । ప్రాణమపానం వ్యానముదానగ్ం సమానం తాన్వాయవే ।సూర్యాయ చక్షురాలభతే । మనశ్చన్ద్రమసే । దిగ్భ్యః శ్రోత్రమ్ । ప్రజాపతయే పురుషమ్, ఇతి ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే అష్టాదశోఽనువాకః ॥౧౮॥

వేదార్థదీపిక

అర్థము : వాచే =వాగ్దేవతకొఱకు, పూరుషమ్ =పూరకమైన స్థూలశరీరమును, ఆలభతే. ప్రాణమ్ =ప్రాణమును, అపానమ్ =అపానమును, వ్యానమ్ =వ్యానమును, ఉదానమ్ =ఉదానమును, సమానమ్ =సమానమును, తాన్ =ఆ స్థూలశరీరమునందుండునట్టి ప్రాణాదులైన యైదు ప్రాణవృత్తివిశేషములను, వాయవే = వాయుదేవతకొఱకు, ఆలభతే. (సమర్పయేదిత్యర్థః =సమర్పించవలెనని యర్థము.) సూర్యాయ = సూర్యదేవతకొఱకు, చక్షుః =చక్షురింద్రియమును, ఆలభతే. చన్ద్రమసే =చంద్రదేవతకొఱకు, మనః = మనస్సును (అంతరింద్రియమును) ఆలభతే =సమర్పించవలెను. దిగ్భ్యః =దిగ్దేవతలకొఱకు, శ్రోత్రమ్ = శ్రోత్రేంద్రియమును, ఆలభతే. ప్రజాపతయే =ప్రజాపతికొఱకు, పురుషమ్ =ఆ స్థూలశరీరమునందలి జీవాత్మను, ఆలభతే =సమర్పించవలెను.

తాత్పర్యము : ఒక పురుషునకు స్థూలశరీరము, ఆ శరీరమునందు ప్రాణాదులైన యైదు వాయువృత్తి విశేషములు, చక్షురాది బాహ్యేంద్రియములు, మనస్సు అను నంతరింద్రియము, జీవాత్మ ఉండును. ప్రాణము ముఖనాసికావర్తి. అపానము అధోద్వారవర్తి. వ్యానము సర్వదేహవ్యాపి. ఉదానము ఉత్క్రాంతిహేతువు. సమానము సర్వశరీరసామ్యముచే అన్నరసప్రేరణహేతువు. ప్రాణాదులను ఆ పురుషశరీరమునుండి వేఱుచేయుట సాధ్యము కానిదైనను, ఆ శరీరమునందే ఉన్నటువంటివానిని వాయువునకు సమర్పించవలెను. ఈ విధముగ చక్షుర్మనశ్శ్రోత్రములను కూడ నచ్చట ఉన్నటువంటివానినే సూర్య చంద్రమా దిగ్దేవతలకొఱకు సమర్పించవలెను. ఆ విధముగనే జీవాత్మను ప్రజాపతికి సమర్పించవలెను.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు
అష్టాదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే ఏకోనవింశోఽనువాకః

1. మంత్రము : **అథైతానరూపేభ్య ఆలభతే । అతిహ్రస్వమతిదీర్ఘమ్ । అతికృశమత్యగ్ంసలమ్ ।**

అతిశుక్లమతికృష్ణమ్ । అతిశ్లక్ష్ణమతిలోమశమ్ । అతికిరిటమతిదన్తురమ్ ।

అతిమిర్మిరమతిమేమిషమ్ । ఆశాయై జామిమ్ । ప్రతీక్షాయై కుమారీమ్, ఇతి ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థప్రపాఠకే ఏకోనవింశోఽనువాకః ॥౧౯॥

వేదార్థదీపిక

అర్థము : అథ=పూర్వోక్తపురుషులకంటెను, తత్తద్దేవతలకంటెను విలక్షణముగ, ఏతాన్=ఈ వక్ష్యమాణులైన యతిహ్రస్వాదులైన పురుషులను, అరూపేభ్యః=సమీచీనరూప రహితులును, కుత్సితరూపాభిమానులునైన దేవతలకొఱకు, ఆలభతే=ఆలంభనము చేయవలెను. అతిహ్రస్వమ్=మిక్కిలి పొట్టివానిని, అతిదీర్ఘమ్=మిక్కిలి పొడుగువానిని, అతికృశమ్=మిక్కిలి బక్కవానిని, అత్యంసలమ్=మిక్కిలి బలిసినవానిని, అతిశుక్లమ్=మిక్కిలి తెల్లని వానిని, అతికృష్ణమ్=మిక్కిలి నల్లవానిని, అతిశ్లక్ష్ణమ్=మిక్కిలి అల్పుని, అతిలోమశమ్ (అతిరోమశమ్)= శరీరమునందు ఎలుగునకువలె నిండువెండ్రుకలు కలవానిని, అతికిరిటమ్=అత్యల్పదంతుని, అతిదన్తురమ్=అత్యున్నతదంతుని, అతిమిర్మిరమ్=అత్యంత నిమిషదృష్టి కలవానిని, అతిమేమిషమ్=సదా విస్ఫారితాక్షులు కలవానిని, (లేదా-స్తబ్ధదృష్టి కలవానిని,) ఏతాన్ సర్వాన్=వీరి నందరిని, అరూపేభ్యః, ఆలభతే, అని పూర్వమునందు అన్వయము. ఆశాయై=అలభ్యవస్తువిషయ తృష్ణాభిమానినియైన దేవతకొఱకు, జామిమ్=రజస్సు ఆగిపోయిన (భోగమున కయోగ్యయైన) స్త్రీని, ఆలభతే. ప్రతీక్షాయై=పొందదగిన వస్తువును ప్రతీక్షించుటయం దభిమానము కలదేవతకొఱకు, కుమారీమ్=అవివాహితను(కన్యను) ఆలభతే=ఆలంభనము చేయవలెను.

తాత్పర్యము : ఈ యనువాకమునందు చెప్పబడిన బ్రాహ్మణునినుండి కుమారివఱకుగల మనుష్యవిశేషరూప పశువులు ఈ పంచాహమైన పురుషమేధ మనెడి సోమయాగవిశేషమునందు మధ్యమాహస్సునందు సవనీయ పశువులతోఁ జేర్చి యాలభ్యములు. ఈ యర్థమును ''పఞ్చాహః పురుషమేధో బ్రాహ్మణో రాజన్యో వా యజేతాజో వీర్యమాప్నోతి'' ఇత్యాది కల్పసూత్రము విరించినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునకృతీయ కాండమున చతుర్థప్రపాఠకమునందు ఏకోనవింశానువాకము సమాప్తము.

బ్రహ్మణే గీతాయ శ్రమాయ సంధయే నదీభ్య ఉత్సాదేభ్య ఋత్వ్యే భాయా అర్మేభ్యో మన్యవే యమ్యై

దశ దశ సరోభ్యో ద్వాదశ ప్రతిశ్రుత్కాయై బీభత్సాయై దశ దశ హసాయ సప్తక్షరాజాయ త్రయోదశ

భూమ్యై దశ వాచే షడథ నవైకాన్నవిగ్ంశతిః ।

బ్రహ్మణే యమ్యై నవదశ । బ్రహ్మణే కుమారీమ్ ॥ ౧౯॥

హరిః ఓమ్ ।

*ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే చతుర్థః ప్రపాఠకః ॥ **4** ॥*

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములో చతుర్థ ప్రపాఠకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే
ప్రథమోఽనువాకః

1. మంత్రము : సత్యం ప్రపద్యే । ఋతం ప్రపద్యే । అమృతం ప్రపద్యే । ప్రజాపతేః ప్రియాం తనువమనార్తాం ప్రపద్యే।

ఇదమహం పఞ్చదశేన వజ్రేణ । ద్విషన్తం భ్రాతృవ్యం మవక్రామామి యోఽస్మాన్ద్వేష్టి । యం చ

వయం ద్విష్మః । భూర్భువః సువః హిమ్ (1) ।

సత్యం దశ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే ప్రథమోఽనువాకః ॥౧॥

వేదార్థదీపిక

అవతారిక: ఈ పంచమ ప్రపాఠకమునందు పదుమూఁడు అనువాకములు కలవు. హోతృజపమంత్రము, సామిధేనీమంత్రములు మున్నగునవి యీ ప్రపాఠకమునం దామ్నాతము లైనవి.

అర్థము : సత్యమ్=యథార్థభూతమైన యీ కర్మను, ప్రపద్యే=ప్రారంభించుచున్నాను. ఈ కర్మయందు వాచికమైన యపరాధము కలుగకుండుఁగాక. ఋతమ్=మనస్సుచే నాలోచించఁబడుచున్నదైనను ఋత మగునట్లుగా నీ కర్మను, ప్రపద్యే=ప్రారంభించుచున్నాను. మానసమైన యపరాధము కూడ కలుగకుండుఁగాక. అమృతం ప్రపద్యే=అమృతహేతుభూతమైన యీ కర్మను ప్రారంభించుచున్నాను. ఈ కర్మచే దేవత్వము ప్రాప్తించుఁగాక యని యర్థము. అనార్తామ్=దేవతలందుఁగూడ ఆర్తిరహితమైనదియు, ప్రజాపతేః ప్రియాం తనువం ప్రపద్యే=ప్రజాపతికి శరీరమైనదియునగు ఈ కర్మను ప్రారంభించుచున్నాను. యః=ఏ శత్రువు, అస్మాన్=మమ్ము, ద్వేష్టి=ద్వేషించుచున్నాఁడో, చ=మఱియు, వయమ్=మేము, యమ్=ఏ శత్రువును, ద్విష్మః=ద్వేషించుచున్నామో, అహమ్=(హోతనైన) నేను, పఞ్చదశేన పంచదశస్తోమ సదృశమును, వజ్రేణ=వజ్రరూపమునైన యీకర్మచేత, ద్విషన్తం భ్రాతృవ్యమ్=ద్వేషించుచున్న యా యుభయవిధ శత్రువును, ఇదమ్=ఇదిగో! అవక్రామామి=పట్టుకొని బాధింతును. భూః భువః సువః=భూరాది లోకములను, హిమ్(హినోమి)=సంతోషపఱచుచున్నాను.

తాత్పర్యము : సత్యము, ఋతము, అమృతహేతువును, దేవతలందుఁగూడ ఆర్తిరహితమును ప్రజాపతికి శరీరమునైన యీ కర్మను ప్రారంభించుచున్నాను. మనుస్సుచే మమ్ము ద్వేషించునట్టి శత్రువును, మేము ద్వేషించు శత్రువును, (ఉభయవిధశత్రువును) హోతనైన నేను పంచదశస్తోమ సదృశమును, వజ్రరూపమునైన యీ కర్మచే ఇదిగో పట్టుకొని బాధింతును. 'ఇదమ్' (ఇదిగో!) అను పదము హస్తాభినయ సూచకము. భూర్భువస్సువర్లోకములను సంతోషపఱచుచున్నాను. హోత యీ మంత్రమును జపించవలెను.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున పంచమ ప్రపాఠకమునందు
ప్రథమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే
ద్వితీయోఽనువాకః

1. మంత్రము : **ప్ర వో వాజా అభిద్యవః । హవిష్మన్తో ఘృతాచ్యా । దేవాఞ్జిగాతి సుమ్నయుః ।**

వేదార్థదీపిక

అర్థము : హే దేవాః!=ఓ దేవతలారా!, వః=యుష్మదీయులైన ఋత్విగ్యజమానులు, వాజాః=గమనశీలములైన మాసములు, అభిద్యవః =అంతటను (పూర్వపక్షరూపమునను, ఉత్తరపక్షరూపమునను)దీపించుచున్న అర్ధమాసములును, హవిష్మన్తః=హవిర్భాక్కులైన దేవతలును, ఘృతాచ్యా=యాగసాధనభూతఘృతము నొసఁగునట్టి గోవుతోఁ గూడ, అనుకూలాః ప్రవర్తన్తామ్=అనుకూలులుగా ప్రవర్తింతురు గాక. కించ=మఱియు, అయమ్=ఈ యజ్ఞము, దేవాన్=దేవతలను, జిగాతి=పొందుఁగాక. సుమ్నయుః=యజమానునకు సుఖమును కలుగఁజేయవలెనను నిచ్ఛ కలదగుఁగాక. (ఈ సామిధేనీమంత్రము లన్నియు తై. సం. కా. 2. ప్ర. 5. అ. 7, 8 భాగమున వ్యాఖ్యానించఁబడినవి.)

తాత్పర్యము : ఓ దేవతలారా! మీకు సంబంధించిన ఋత్విగ్యజమానులు, గమనశీలములైన మాసములు, పూర్వపక్షరూపమునను, ఉత్తరపక్షరూపమునను దీపించుచున్న యర్ధమాసములును, హవిర్భాక్కులైన దేవతలును యాగసాధనభూతఘృతము నొసఁగునట్టి గోవుతోఁ గూడ అనుకూలురై ప్రవర్తింతురు గాక. మఱియు ఈ యజ్ఞము దేవతలను పొందుఁగాక. యజమానునకు సుఖమును కలుగఁజేయవలెననెడి ఇచ్ఛ కలదగుఁగాక. సామిధేనీమంత్రములలో నిది ప్రథమము.

2. మంత్రము : **అగ్న ఆయాహి వీతయే । గృణానో హవ్యదాతయే । నిహోతా సత్సి బర్హిషి ।**

అర్థము : హే అగ్నే!=ఓ యగ్నీ! హవ్యదాతయే=యజమానునియొక్క హవిస్సు నిచ్చుటకొఱకు, వీతయే=దేవతల హవిస్సును భక్షించుటకొఱకును, గృణానః='యజమానుఁడు దేవతలకు హవిస్సు నీయఁగలఁడని, మీరు భక్షించవలెననియుఁ' జెప్పుచున్నవాఁడవై, ఆయాహి=రమ్ము. ఆగత్య చ=వచ్చియు, హోతా=ఆహ్వానించువాఁడ వగుచు, బర్హిషి=యజ్ఞమునందు, నిసత్సి=కూర్చుండుము.

తాత్పర్యము : ఓ యగ్నీ! యజమానునియొక్క హవిస్సును దేవతల కిచ్చుటకొఱకు, దేవతలహవిర్భక్షణముకొఱకు యజమానుఁడు దేవతలకు హవిస్సు నీయఁగలఁడనియు, ఆ దేవతలు హవిస్సును భక్షించవలె ననియుఁ జెప్పుచు రమ్ము. వచ్చియు ఆహ్వానించువాఁడ వగుచు యజ్ఞమునందు కూర్చుండుము. ఇది రెండవ సామిధేనీమంత్రములలో ద్వితీయము. ఇది మంత్రకాండమునందు పఠితము.

3. మంత్రము : **తం త్వా సమిద్భిరఙ్గిరః । ఘృతేన వర్ధయామసి । బృహచ్ఛోచా యవిష్ఠ్య ।**

అర్థము : హే అఙ్గిరః!=ఓ యగ్నీ! తం త్వా=అటువంటి దేవతల నాహ్వానించునట్టి నిన్ను, సమిద్భిః=సమిధలచేతను, ఘృతేన=ఆజ్యముచేతను, వర్ధయామసి=వృద్ధినొందించుచున్నాము. హే యవిష్ఠ్య!=ఓ యువతముcడవైన యగ్నీ! బృహత్=జ్వాల యధిక మగురీతిగ, శోచా(శోచ)=దీపించుము.

తాత్పర్యము : అంగసౌష్ఠవము గల ఓ యగ్నీ! దేవతల నాహ్వానించునట్టి అటువంటి నిన్ను సమిధలచేతను, ఘృతముచేతను వృద్ధి నొందించుచున్నాము. యువతముcడవైన ఓ యగ్నీ! జ్వాల యధికమగువిధముగ దీపించుము. ఇది సామిధేనీమంత్రములలో తృతీయము.

4. మంత్రము : **స నఃꣳ పృథుఃꣳ శ్రవాయ్యమ్ (1) । అచ్ఛా దేవ వివాససి । బృహదగ్నే సువీర్యమ్ ।**

అర్థము : హే అగ్నే దేవ!=ఓ యగ్నిదేవా! సః (త్వమ్)=అటువంటి నీవు, నః=మాకొఱకు, పృథు=విస్తీర్ణమును, శ్రవాయ్యమ్=దేవతలు వినుటకు యోగ్యమునైన యీ కర్మను, అచ్ఛా=అభిముఖముగాc జేసికొని, బృహత్=జ్వాలాధిక్యము కలుగునట్లుగాను, సువీర్యమ్=హూయమాన హవిస్సునకు బాగుగ దహన సామర్థ్యము కలుగునట్లుగాను, వివాససి=ప్రకాశింపcజేయుము.

తాత్పర్యము : ఓ యగ్నిదేవా! పూర్వోక్తవిశేష విశిష్టcడవైన నీవు మాకొఱకు విస్తీర్ణమును, దేవతలు వినుటకు యోగ్యమైనదియునగు ఈ కర్మనభిముఖముగcజేసికొని జ్వాలాధిక్యము కలుగునట్లుగాను, హూయమాన హవిస్సునకు దహనసామర్థ్యము కలుగువిధముగాను ప్రకాశింపcజేయుము. ఇది చతుర్థసామిధేనీమంత్రము.

5. మంత్రము : **ఈడేన్యో నమస్యస్తిరః । తమాగ్ంసి దర్శతః । సమగ్నిరిధ్యతే వృషా ।**

అర్థము : ఈడేన్యః=స్తుతింపయోగ్యcడును, నమస్యః=నమస్కారయోగ్యcడును, తమాంసి=చీcకట్లను, తిరః(కుర్వన్)=తిరస్కరించుచు, దర్శతః=పదార్థముల నంతటను కనcబఱచువాcడును, వృషా=కోరికలను వర్షించువాcడునగు, అగ్నిః=ఈ యగ్ని, సమిధ్యతే=బాగుగ జ్వలింపcజేయcబడుచున్నాcడు.

తాత్పర్యము : ఈడేన్యాది విశేషణ విశిష్టcడైన యీ యగ్ని బాగుగ దీపింపcజేయcబడుచున్నాcడు. ఇది పంచమ సామిధేనీమంత్రము.

6. మంత్రము : **వృషా అగ్నిః సమిధ్యతే । అశ్వో న దేవవాహనః । తగ్ం హవిష్మన్త ఈడతే ।**

అర్థము : వృషః=కామములను వర్షించువాcడును, అశ్వః న=అశ్వమువలె, దేవవాహనః=దేవార్థమైన హవిస్సును వహించువాcడునగు, అగ్నిః=ఈ యగ్ని, సమిధ్యతే=బాగుగ దీపించుచున్నాcడు. తమ్ (ఇమమ్)=ఆ యీ యగ్నిని, హవిష్మన్తః=హవిస్సును కలిగియున్న యజమానులు, ఈడతే=స్తుతించుచున్నారు.

తాత్పర్యము : ఈ యగ్ని బాగుగ దీపించుచున్నాcడు. ఈ యగ్ని కామములను వర్షించువాcడు. అశ్వమువలె దేవతలకొఱకైన హవిస్సును వహించువాcడు. అట్టి యీ యగ్నిని హవిస్సును కలిగియున్న యజమానులు స్తుతించుచున్నారు.

7. మంత్రము : **వృషణం త్వా వయం వృషన్ । వృషాణఃసమిధీమహి। అగ్నే దీద్యతం బృహత్ ।**

అర్థము : హే వృషన్ అగ్నే!=కామములను వర్షించునట్టి ఓ యగ్నీ!, వృషణమ్=కామములను వర్షించువాఁడవును, బృహత్ దీద్యతమ్=ప్రౌఢజ్వాలలు కలుగునట్లుగ దీపించుచున్నవాఁడవునగు, త్వా=నిన్ను, వృషాణఃఆహుతివృష్టిని చేయుచున్న, వయమ్=మేము, సమిధీమహి=బాగుగ ప్రకాశింపఁజేయుచున్నాము.

తాత్పర్యము : కామవర్షకుఁడవైన ఓ యగ్నీ! కామములను వర్షించువాఁడవును, ప్రౌఢజ్వాలలు కలుగునట్లుగ దీపించుచున్నవాఁడవునగు నిన్ను ఆహుతివృష్టినిఁ జేయుచున్న మేము బాగుగ ప్రకాశింపఁజేయుచున్నాము. ఇది సప్తమ సామిధేనీమంత్రము.

8. మంత్రము : **అగ్నిం దూతం వృణీమహే। హోతారం విశ్వవేదసమ్ అస్య యజ్ఞస్య సుక్రతుమ్ ।**

అర్థము : దూతమ్=దేవతలయొద్దకు దూతగా పంపుట కర్హుఁడును, హోతారమ్=ఆహ్వాతయు, విశ్వవేదసమ్ = సర్వదేవతలను తెలిసినవాఁడును, అస్య యజ్ఞస్య సుక్రతుమ్=ఈ యజ్ఞమునకు సంబంధించిన మంచికర్మ కలవాఁడునగు, అగ్నిమ్=ఈ యగ్నిని, వయమ్=మేము, వృణీమహే=ప్రార్థించుచున్నాము.

తాత్పర్యము : దూతేత్యాది విశేషణ విశిష్టఁడైన యీ యగ్నినిమేము ప్రార్థించుచున్నాము. ఇది యష్టమ సామిధేనీమంత్రము.

9. మంత్రము : **సమిధ్యమానో అధ్వరే । అగ్నిఃపావక ఈడ్యః । శోచిష్కేశస్తమీమహే।**

అర్థము : యఃఅగ్నిఃఏ యగ్ని, అధ్వరే=ఈ యజ్ఞకర్మయందు, సమిధ్యమానఃబాగుగ దీపించుచున్నవాఁడో, పావకఃశుద్ధిహేతువో, ఈడ్యఃస్తుతియోగ్యుఁడో, శోచిష్కేశఃదీప్తులు కేశస్థానీయములుగాఁ గలవాఁడునో, తమ్=ఆ యగ్నిని, ఈమహే=పొందుచున్నాము.

తాత్పర్యము : 'సమిధ్యమానఃఇత్యాది విశేషణ విశిష్టఁడైన యగ్నిని మేము పొందుచున్నాము. ఇది నవమ సామిధేనీమంత్రము.

10. మంత్రము :**సమిద్ధో అగ్న ఆహుత । దేవాన్యక్షి స్వధ్వర । త్వగ్ం హి హవ్యవాడసి ।**

అర్థము : హే ఆహుత! అగ్నే!=ఆహుతిచే నారాధించఁబడిన ఓ యగ్నీ!, హే స్వధ్వర!=బాగుగ నిష్పన్నము చేయఁబడిన యాగము కల యగ్నీ!, త్వమ్=నీవు, హి=ఏ కారణమువలన, హవ్యవాట్=హవిస్సును వహించువాఁడవు, అసి=అగుచున్నావో, తస్మాత్=ఆ కారణమువలన, దేవాన్=దేవతలను, యక్షి=యజించుము (పూజించుము).

తాత్పర్యము : ఓ యగ్నీ! నీవు ఆహుతిచే నారాధించఁబడినవాఁడవు. సుష్ఠుగ నిష్పన్నము చేయఁబడిన యాగము కలవాఁడవు. అట్టి నీవు హవిస్సును వహించువాఁడవు కావున దేవతలను పూజించుము. ఇది దశమ సామిధేనీమంత్రము.

11. మంత్రము :**ఆజుహోత దువస్యత । అగ్నిం ప్రయత్యధ్వరే । వృణీధ్వగ్ం హవ్యవాహనమ్ ।**

అర్థము : హే యజమానాః!=ఓ యజమానులారా!, అగ్నిమ్=ఈ యగ్నిని, ఆజుహోత=ఆహుతులచే సంతోష పఱుచుఁడు. దువస్యత=సేవించుఁడు. ప్రయతి=ప్రయత్నముచే ఉంటున్న, అధ్వరే=ఈ యాగమునందు, హవ్యవాహనమ్=అగ్నిని, వృణీధ్వమ్=ప్రార్థించుఁడు.

తాత్పర్యము : ఓ యజమానులారా! మీరు ఈ యగ్నిని ఆహుతులచే సంతోషింపఁజేయుఁడు. పరిచరించుఁడు. ప్రయత్నముచే వర్తమానమైన యీ యాగమునం దగ్నిని ప్రార్థించుఁడు. ఇది యేకాదశసామిధేనీమంత్రము.

12. మంత్రము :**త్వం వరుణ ఉత మిత్రో అగ్నే । త్వాం వర్ధన్తి మతిభిర్వసిష్ఠాः । త్వే వసు సుషణానీ సన్తు ।**

యూయం పాత స్వస్తిభిः సదా నः (3) ।

శ్రవాయ్యభిధీమహ్యసి సప్త చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమ ప్రపాఠకే ద్వితీయోఽనువాకः ॥౨॥

అర్థము : హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, వరుణః=అనిష్ట నివారకుఁడవు కావున వరుణుఁడవు. ఉత=మఱియు, మిత్రః=ఇష్టప్రాపకుఁడవు కావున మిత్రదేవుఁడవు. వసిష్ఠాः=వసిష్ఠగోత్రీయులు, మతిభిः=బుద్ధులచే (స్తుతులచే), త్వామ్=నిన్ను, వర్ధన్తి (వర్ధయన్తి)=వృద్ధినొందించుచున్నవారు. త్వే=నీయందు, వసు=ధనము, సుషణానీ=సుష్ఠగ, నీయఁదగిన హవిస్సులును, సన్తు=ఉండుఁగాక. యూయం చ=మీరును (నీవును), నः=మమ్ము, స్వస్తిభిः=శుభములచే, సదా=ఎల్లవేళలందు, పాత=రక్షించుఁడు. (యూయమితి పూజాయాం బహువచనమ్).

తాత్పర్యము : ఓ యగ్నీ! నీవు అనిష్టనివారకుఁడ వగుటవలన వరుణుఁడవు. ఇష్టప్రాపకుఁడ వగుటవలన మిత్రదేవుఁడవు. వసిష్ఠగోత్రీయులు నిన్ను మతులచే (స్తుతులచే) వృద్ధి నొందించుచున్నారు. నీయందు ధనము, సుష్ఠగ నీయఁదగిన హవిస్సులును ఉండుఁగాక. నీవును మమ్ము శుభములచే నెల్లవేళలందు రక్షించుము. ఇది వికల్పిత సామిధేనీమంత్రము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునఁ తృతీయ కాండమునఁ పంచమ ప్రపాఠకమునందు ద్వితీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే
తృతీయోఽనువాకః

1. మంత్రము : అగ్నే మహాగ్ం అసి బ్రాహ్మణభారత । అసావసౌ । దేవేద్ధో మన్విద్ధః । ఋషిష్టుతో విప్రానుమదితః ।
కవిశస్తో బ్రహ్మసగ్ంశితో ఘృతాహవనః ప్రణీర్యజ్ఞానామ్ । రథీరధ్వరాణామ్ । అతూర్తో హోతా ।
తూర్ణిర్వ్యవాట్ । ఆస్రాత్రం జుహూర్దేవానామ్ (1) । చమసో దేవపానః । అరాగ్ం ఇవాగ్నే
నేమిర్దేవాగ్ంస్త్వం పరిభూరసి । ఆవహ దేవాన్యజమానాయ ।

2. మంత్రము : అగ్నిమగ్న ఆవహ । సోమమావహ । అగ్నిమావహ । ప్రజాపతిమావహ । అగ్నీషోమావావహ ।
ఇన్ద్రాగ్నీ ఆవహ । ఇన్ద్రమావహ । మహేన్ద్రమావహ । దేవాగ్ం ఆజ్యపాగ్ం ఆవహ ।
అగ్నిగ్ం హోత్రాయా ऽऽవహ । స్వం మహిమాన మావహ । ఆ చాగ్నే దేవాన్వహ ।
సుయజా చ యజ జాతవేదః (2) ।
దేవానామిన్ద్రమావహ షట్ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే తృతీయోఽనువాకః ॥3॥

వేదార్థదీపిక

గమనిక: ఈ తృతీయానువాక మంతయు సంహితలోని ద్వితీయకాండమునఁగల పంచమ ప్రపాఠకమునందలి నవమానువాకమునందు (ప్రవరాదిమంత్రవ్యాఖ్యానమునందు) వ్యాఖ్యానించఁబడినది. ఇందుకై తై. సం. కా. 2. ప్ర. 5. అ. 9. భాగమును చూడుఁడు.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున పంచమ ప్రపాఠకమునందు
తృతీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే చతుర్థోఽనువాకః

1. మంత్రము : **అగ్నిర్హోతా వేత్త్వగ్నిః । హోత్రం వేత్తు ప్రావిత్రమ్ ।స్మో వయమ్ । సాధు తే యజమాన దేవతా।**

ఘృతవతీ మధ్వర్యో స్రుచమాస్యస్వ, దేవాయువం విశ్వవారామ్ ।ఈడామహై దేవాగ్ం

ఈడేన్యాన్ ।నమస్యామ నమస్యాన్ ।యజామ యజ్ఞియాన్ (1)

అగ్ని ర్హోతా నవ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే చతుర్థోఽనువాకః ॥౪॥

వేదార్థదీపిక

అవతారిక: ఈ చతుర్థానువాకము స్రుగాదాపనమంత్రాత్మకము. అనఁగా హోత ఘృతపూర్ణమైన జుహూపభృత్తులను స్వీకరించుమని అధ్వర్యునితోఁ జెప్పుట యిందలి విషయము. ఆదాపనార్థకమైన 'ఆచ్యస్వ' అను శబ్దముతోఁ గూడిన యీ యనువాకమును హోత పఠించును. ఆదాపనము=ఈయఁజేయుట. లేదా అందింపఁజేయుట.

అర్థము : అగ్నిః=ఈ యగ్ని, హోతా=హోమకర్త. (అతః=ఈ కారణమువలన,) అగ్నిః=ఈ యగ్ని, వేత్తు=హోమ క్రమమును తెలిసికొనుఁగాక. ప్రావిత్రమ్=ప్రకృష్ట ఫలదానరూపమైన అస్మద్రక్షణము కల, హోత్రమ్=హోమానుష్ఠానమును, వేత్తు=తెలిసికొనుఁగాక. వయమ్=మనుష్యహోతలమైన మేము, స్మః= ఇచట ఉంటున్నాము. హే యజమాన!=ఓ యజమానుడా! తే=నీయొక్క, దేవతా=హవిస్స్వీకర్తియైన దేవత, సాధు=ఫలమును, (దదాత=ఇచ్చుఁగాక) హే అధ్వర్యో!=ఓయధ్వర్యూ!, ఘృతవలీమ్=ఘృత పూర్ణమైనన దియు, దేవాయువమ్=దేవతలను కలుపున దియు, విశ్వవారామ్=రాక్షసకృతములైన సర్వవిఘ్నములను పోగొట్టున దియునగు, స్రుచమ్=జుహువును, ఆస్యస్వ=స్వీకరించుము. ఈడేన్యాన్=స్తుతిప్రియులైన, మనుష్యులను, ఈడామహై=స్తుతించుదుము. నమస్యాన్=నమస్కార ప్రియులైన పితృదేవతలను, నమస్యామ=నమస్కరింతుము. యజ్ఞియాన్ దేవాన్=యజ్ఞప్రియులైన దేవతలను, యజామ=యజింతుము.

తాత్పర్యము : ఈ యగ్ని హోమకర్త. ''అగ్నీ యష్టరిదం నమ ఇత్యాహ! అగ్నిర్వై దేవానాం యష్టా'' అను శ్రుతి అగ్నిని హోమకర్తనుగా పేర్కొన్నది. కనుక ఈ యగ్ని హోమక్రమమును తెలిసికొనుఁగాక. ఆ వేదనమే ఉత్తరవాక్యముచే స్పష్టీకరించఁబడినది. ప్రకృష్టమ్ అవిత్రం ఫలదానరూపమ్ అస్మద్రక్షణం యస్మిన్ హోమానుష్ఠానే తదిదం ప్రావిత్రమ్. ఫలదానరూపమైన అస్మద్రక్షణము కలదైన హోమానుష్ఠానమును (హోమక్రమమును) తెలిసికొనుఁగాక. కేవలము దేవహోతనైనే ఈ భారముంచఁబడలేదు. మఱేమనఁగా -

మనుష్యహోతలమైన మేము కూడ నిచట ఉంటున్నాము. కనుక మేము కూడ హోమక్రమజ్ఞానవంతులమై యుంటున్నాము. ఓ యజమానుఁడా! నీ హవిస్సును స్వీకరించునట్టి దేవత ఫలము నొసఁగుఁగాక. ఓ యధ్వర్యూ! ఘృతపూర్ణమైన జుహువును తీసికొనుము. ఆ జుహువు దేవతలను కలుపునట్టిది. మఱియు రాక్షసకృతములైన సర్వవిఘ్నములను తొలఁగించునట్టిది. మేము స్తుతిప్రియులైన మనుష్యులను స్తుతింతుము. నమస్కారప్రియులైన పితృదేవతలను నమస్కరింతుము. యజ్ఞప్రియులైన దేవతలను యజింతుము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున పంచమ ప్రపాఠకమునందు
చతుర్థానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే
పఞ్చమోఽనువాకః

1. మంత్రము : **సమిధో అగ్న ఆజ్యస్య వియన్తు । తనూనపాదగ్న ఆజ్యస్య వేతు । ఇడో అగ్న ఆజ్యస్య వియన్తు ।**

బర్హిరగ్న ఆజ్యస్య వేతు । స్వాహా కగ్నిమ్ । స్వాహా సోమమ్ । స్వాహా కగ్నిమ్ । స్వాహా ప్రజాపతిమ్ ।

స్వాహా కగ్నీషోమౌ । స్వాహేన్ద్రాగ్నీ । స్వాహేన్ద్రమ్ । స్వాహా మహేన్ద్రమ్ । స్వాహా దేవాగ్ం ఆజ్యపాన్ ।

స్వాహా కగ్నిగ్ం హోత్రాజ్జుషాణాః । అగ్న ఆజ్యస్య వియన్తు (1) ।

ఇన్ద్రాగ్నీ పఞ్చ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే పఞ్చమోఽనువాకః ॥౫॥

వేదార్థదీపిక

అవతారిక: ఈ పంచమానువాకమునందు ప్రయాజమంత్రము లామ్నాతము లైనవి. ఈ ప్రయాజ మంత్రములకు బ్రాహ్మణము సంహితలోని ద్వితీయకాండమునఁగల షష్ఠప్రపాఠకస్థ ప్రథమానువాకమునం దభిహిత మైనది. ఇవి ప్రయాజమంత్రములు.

అర్థము : హే అగ్నే!=ఓ యగ్నీ!, సమిధఃబాగుగ జ్వలింపఁజేయఁబడుచున్న నీ మూర్తులు, ఆజ్యస్య వియన్తు= హోమము చేయఁబడుచున్న యీ యాజ్యమును త్రాగుఁగాక. హే అగ్నే!, తనూనపాత్=తనూనపాన్నామకమైన నీ ద్వితీయమూర్తి, ఆజ్యస్య వేతు=ఆజ్యమును త్రాగుఁగాక. హే అగ్నే!, ఇడఃఈడ్యాఃస్తుతింపఁదగిన నీ మూర్తులు. ఆజ్యస్య వియన్తు=ఆజ్యమును త్రాగుఁగాక. హే అగ్నే!, బర్హిఃఫలమును గొప్పదిగాఁ జేయునట్టి నీ మూర్తి, ఆజ్యస్య వేతు=ఆజ్యమును త్రాగుఁగాక. అగ్నిమ్=ప్రథమాజ్యభాగదేవుఁడైన యగ్నినిఁగూర్చి, స్వాహా=ఆజ్యము హుతము కాఁగలదు. సోమమ్=సోమదేవునిఁగూర్చి, స్వాహా=అజ్యము హుత మగుఁగాక. అగ్నిమ్=ద్వితీయాజ్యభాగదేవుఁడైన యగ్నినిఁ గూర్చి, స్వాహా=ఆజ్యము హుతము కాఁగలదు. ప్రజాపతిమ్=ప్రజాపతినిఁ గూర్చి, స్వాహా. అగ్నీషోమౌ=అగ్నీషోమదేవతలను గూర్చి, స్వాహా. ఇన్ద్రాగ్నీ= ఇంద్రాగ్నిదేవతలను గూర్చి, స్వాహా. ఇన్ద్రమ్=ఇంద్రునిఁగూర్చి, స్వాహా. మహేన్ద్రమ్=మహేంద్రునిఁగూర్చి, స్వాహా. ఆజ్యపాన్ దేవాన్=ఆజ్యమును త్రాగునట్టి దేవతలను గూర్చి, స్వాహా. అగ్నిమ్=తృతీయాజ్య భాగదేవుఁడైన యగ్నినిఁగూర్చి, స్వాహా. హే అగ్నే!, హోత్రాత్=హోమనిమిత్తము, (ఏతే సర్వే దేవాఃఈ

సర్వదేవతలు,) జుషాణాాः=ప్రీతికలవారై, (ఇదానీమ్=ఇప్పుడు, త్వన్ముఖేన=త్వన్ముఖమున (నీద్వారా),) ఆజ్యస్య వియన్తు=ఆజ్యమును త్రాగుదురు గాక.

తాత్పర్యము : ఓ యగ్నీ! సమిధ్యమానులైన నీ మూర్తులు హూయమానమైన యీ యాజ్యమును త్రాగుదురు గాక. ఈ విధముగ తనూనపాన్నామకమైన నీ ద్వితీయమూర్తి, ఫలము నధికముగc జేయునట్టి బర్హిర్నామకమైన నీ మూర్తియు ఈ యాజ్యమును త్రాగుదురు గాక. స్తుత్యులైన నీ మూర్తు లాజ్యమును త్రాగుదురు గాక. ప్రథమాజ్యభాగాది దేవతలను గూర్చి, ప్రజాపత్యాది దేవతలను గూర్చియు ఈ యాజ్యము హుత మగుఁగాక. ఓ యగ్నీ హోమనిమిత్తము ఈ సర్వదేవతలు ప్రీతికలవారై త్వన్ముఖమున ఆజ్యమును త్రాగుదురు గాక.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున పంచమ ప్రపాఠకమునందు
పంచమానుకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే షష్ఠోఽనువాకః

1. మంత్రము : **అగ్నిర్వ్రత్రాణి జఙ్ఘనత్ । ద్రవిణస్యుర్విపన్యయా । సమిద్ధః శుక్ర ఆహుతః । జుషాణో అగ్నిరాజ్యస్య వేతు ।**

వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు ప్రయాజమంత్రము లామ్నాతము లైనవి. ఈ షష్ఠానువాకమునందు ఆజ్యభాగదేవతా మంత్రములు చెప్పఁబడుచున్నవి. ఈ మంత్రములకు బ్రాహ్మణము సంహితలోని ద్వితీయకాండస్థ పంచమ ప్రపాఠకగత ద్వితీయానువాకమునం దభిహితమైనది.

అర్థము : వ్రత్రాణి=కర్మానుష్ఠానములకు వారకములైన పాపములను, జఙ్ఘనత్=నశింపఁజేసినవాఁడును, విపన్యయా=విశేషముగ మేము చేసిన స్తుతిచే, ద్రవిణస్యుః=మాకొఱకు ద్రవిణేచ్ఛ కలవాఁడును, సమిద్ధః=బాగుగ జ్వలింపఁ జేయఁబడినవాఁడును, శుక్రః=ప్రకాశించుచున్నవాఁడును, ఆహుతః=అంతటను మాచే నాహ్వానించఁబడిన వాఁడును, జుషాణః=సంతోషించుచున్నవాఁడునగు, అగ్నిః=ఈ యగ్ని, ఆజ్యస్య వేతు=మే మొసఁగిన యాజ్యమును త్రాగుఁగాక. సః అగ్నిః=ఆ యగ్ని, అస్మాన్ అనుగృహ్ణాతు=మమ్ము అనుగ్రహించుఁగాక.

తాత్పర్యము : 'వ్రత్రాణి జఙ్ఘనత్' ఇత్యాది విశేషణ విశిష్టుఁడై యగ్ని మేమిచ్చిన యాజ్యమును త్రాగుఁగాక. అట్టి యగ్ని మమ్ము అనుగ్రహించుఁగాక. ఇది ప్రథమమైన ఆగ్నేయాజ్యభాగ మంత్రపాఠము.

2. మంత్రము : **త్వగ్ం సోమాసి సత్పతిః । త్వగ్ం రాజోత వృత్రహా । త్వం భద్రో అసిక్రతుః । జుషాణః సోమ ఆజ్యస్య హవిషో వేతు ।**

అర్థము : హే సోమ!=ఓ సోమదేవా!, త్వమ్=నీవు, సత్పతిః=సత్పురుషులచే ననుష్ఠించఁబడిన కర్మలకు పతివి, అసి=అగుచున్నావు. కించ=మఱియు, త్వమ్=నీవు, రాజా=దీప్తిమంతుఁడవు. ఉత=ఇంకను, వృత్రహా=పాప ఘాతివి. కించ=భద్రః=మంగళరూపుఁడవు, క్రతుః=క్రతుస్వరూపుఁడవును, అసి=అగుచున్నావు. సోమః=అటువంటి సోమదేవుఁడు, అజ్యస్య హవిషః వేతు=ఈ యాజ్యహవిస్సును త్రాగుఁగాక.

తాత్పర్యము : ఓ సోమదేవా! నీవు పురుషు లనుష్ఠించునట్టి కర్మలకు పతి వగుచున్నావు. మఱియుదీప్తిమంతుఁడవు, పాపఘాతివి కూడ. అంతియకాక ఫలప్రదుఁడ వగుటచే మంగళరూపుఁడవు. క్రతునిష్పాదకుఁడవగుట వలన క్రతు స్వరూపుడవు కూడ. అట్టి సోమదేవుఁ డీ యాజ్యహవిస్సును త్రాగుఁగాక. ఇది ప్రథమ సౌమ్యాజ్యభాగ మంత్రపాఠము.

3. మంత్రము : **అగ్నిః ప్రత్నేన జన్మనా । శుమ్భానస్తనువగ్ం స్వామ్ । కవిర్విప్రేణ వావృధే । జుషాణో అగ్నిరాజ్యస్య వేతు ।**

అర్థము : అగ్నిః=ఈ యగ్ని, ప్రత్నేన జన్మనా=తన వెనుకటి జన్మముచేత, స్వాం తనువమ్=తన శరీరమును, శుమ్భానః=శోధించుచు, కవిః=పండితుఁడై (పరాభిప్రాయజ్ఞుడై), విప్రేణ=ఋత్విజునిచే, (కృతాం స్తుతిం జ్ఞాత్వా=చేయఁబడిన స్తుతిని తెలిసికొని,) వావృధే=వృద్ధి నొందెను. అగ్నిః, జుషాణః, ఆజ్యస్య వేతు. (ఈ పదముల యర్థము మొదటి మంత్రవ్యాఖ్యానమున వ్రాయఁబడినది.)

తాత్పర్యము : ఈ యగ్ని పురాతనమైన స్వీయ జన్మముచే తన శరీరమును శోధించుచు పండితుఁడై (పరాభిప్రాయమును తెలిసికొనినవాఁడై) ఋత్విజుఁడు చేసిన స్తుతిని తెలిసికొని వృద్ధినొందెను. అట్టి యీ యగ్ని సంతోషించుచున్నవాఁడై మే మొసఁగిన యీ యాజ్యహవిస్సును గ్రాగుఁగాక. ఇది ద్వితీయాగ్నేయాజ్యభాగ మంత్రపాఠము.

4. మంత్రము : **సోమ గీర్భిష్ట్వా వయమ్ । వర్ధయామో వచోవిదః । సుమ్మడీకో న ఆవిశ । జుషాణః సోమ ఆజ్యస్య హవిషో వేతు (1)**

స్వాగ్ం షట్ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమ ప్రపాఠకే షష్ఠోఽనువాకః ॥౬॥

అర్థము : హే సోమ!=ఓ సోమదేవా!, వచోవిదః=వాక్యతాత్పర్యాభిజ్ఞులమైన, వయమ్=మేము, గీర్భిః=స్తుతిరూపములైన వాక్కులచే, త్వా=నిన్ను, వర్ధయామః=వృద్ధి నొందించుచున్నాము. త్వం తు=నీవైనచో, సుమ్మడీకః=బాగుగ సుఖంపఁజేయుచు, నః=మమ్ము, ఆవిశ=ఆవేశించుము. సోమః=అటువంటి సోమదేవుఁడు, జుషాణః=సంతోషించుచున్నవాఁడై, ఆజ్యస్య హవిషః=ఆజ్యహవిస్సును గ్రాగుఁగాక.

తాత్పర్యము : ఓ సోమదేవా! వాక్యతాత్పర్యమును తెలిసిన మేము స్తుతిరూపవాక్కులచే నిన్ను వృద్ధి నొందించుచున్నాము. నీవైనచో బాగుగ సుఖంపఁజేయుచు మమ్ము ఆవహించుము. అటువంటి సోమదేవుఁడు సంతోషించుచున్న వాఁడై యీ యాజ్యహవిస్సును గ్రాగుఁగాక. ఇది ద్వితీయ సౌమ్యాజ్యభాగ మంత్రపాఠము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునఁ తృతీయ కాండమునఁ పంచమ ప్రపాఠకమునందు షష్ఠానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే సప్తమోఽనువాకః

1. మంత్రము : **అగ్నిర్మూర్ధా దివః ककुత్ । పతీ॑ः పృథి॒వ్యా అయమ్ । అపాగ్ం రేతాగ్ం॑సి జిన్వతి ।**

వేదార్థదీపిక

అవతారిక: షష్ఠానువాకమునందు ఆజ్యభాగదేవతా మంత్రము లామ్నాతము లైనవి. ఈ సప్తమానువాకమునందు ఆజ్యభాగహవిస్సునకు యాజ్యాపురోనువాక్యా మంత్రము లామ్నాతము లైనవి. ఈ యాజ్యానువాక్యా మంత్రములకు బ్రాహ్మణము సంహితయందు ద్వితీయకాండమునలోని షష్ఠ ప్రపాఠకస్థ ద్వితీయానువాకమునందు చెప్పబడినది.

అర్థము : అయమ్ అగ్నిః=ఈ యగ్ని, దివః=ద్యులోకమునకు, ककుత్=ఉచ్ఛ్రితమైన (పెరిగిన, లేదా-పొడవైన), మూర్ధా=మూర్ధస్థానీయుడు. అయమ్=ఈ యగ్ని, పృథివ్యాఃభూమికి, పతిఃపాలకుడు. కించ=మఱియు, అపాం రేతాంసి=ఉదకకార్యములైన స్థావర జంగమాత్మక శరీరములను, జిన్వతి=సంతోషింపజేయుచున్నాడు.

తాత్పర్యము : ఈ యగ్ని యాదిత్యరూపమున ద్యులోకమునకు పెరిగిన మూర్ధస్థానీయుడు, పృథివికి దాహకారి యగుటచే పాలకుడు కూడ. ఇంకను ఉదకకార్యములైన స్థావర జంగమాత్మక శరీరములను జాఠరాగ్నిరూపమున సంతోషపఱుచుచున్నాడు. ఇది ఆజ్యభాగహవిస్సులలో ఆగ్నేయపురోడాశమునకు యాజ్య.

2. మంత్రము : **భువో॑ యజ్ఞస్య రజ॑సశ్చ నే॒తా । యత్రా॒నియు॒ద్భిः స చ॑సే శివా॒భిः । దివి॒ మూర్ధా॑నం దధిషే సువ॒ర్షామ్। జి॒హ్వామ॑గ్నే చకృషే హ॒వ్యవా॑హమ్ ।**

అర్థము : అయమ్ అగ్నిః=ఈ యగ్ని, భువఃభూలోకమునకు, యజ్ఞస్య=ఆ భూలోకమునందనుష్ఠించబడుచున్న యజ్ఞమునకు, రజసశ్చ=ఆ యజ్ఞమునందు ప్రవర్తకమైన రజోగుణమునకును, నేతా=ప్రవర్తకుడు (నిర్వాహకుడు). తాదృశ హే అగ్నే!=అటువంటి ఓ యగ్నీ!, యత్రా=ఏ ద్యులోకమునందు, (సూర్యరూపఃభూత్వా=సూర్యరూపుడవై,) నియుద్భిఃరథమునందు గట్టిగ సంధానము చేయబడుచున్నవియు, శివాభిఃఉత్తమములునైన యశ్వజాతులతో, సచసే=బాగుగ పోవుచున్నావో, దివి=ఆ ద్యులోకమునందు, సువర్షామ్=స్వర్గమున సర్వదా ఉంటున్నదగు, మూర్ధానమ్=శిరస్సువలె ఉన్నతస్థితిని, దధిషే=ధరించుచున్నావో, హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, హవ్యవాహమ్=ఈ యజ్ఞమునందు హవిస్సును పొందించునట్టి, జిహ్వామ్=జ్వాలను, చకృషే=చేయుచున్నావు.

తాత్పర్యము : ఈ యగ్ని భూలోకమునకు, అచట అనుష్ఠించcబడుచున్న యజ్ఞమునకు, ఆ యజ్ఞమునందు ప్రవర్తకమైన రజోగుణమునకును ప్రవర్తకుcడు (నిర్వాహకుcడు). అటువంటి ఓ యగ్నీ! నీవు ద్యులోకమునందు సూర్యరూపుcడవై రథమునందు గట్టిగా సంధానము చేయcబడుచున్న యుత్తమాశ్వజాతులతో పోవుచున్నావు. మఱియు ఆ దివియందు ఎల్లవేళలందు ఉండునట్టి శిరస్సువలె ఉన్నతస్థితిని ధరించుచున్నావు. ఓ యగ్నీ! ఈ యజ్ఞమునందు హవిస్సును పొందించునట్టి జ్వాలను చేయుచున్నావు. సువర్వా శబ్దము సోమపా శబ్దమువలె పుంలింగము. ఇది ఆజ్యభాగహవిస్సులలో ఆగ్నేయపురోడాశమునకు పురోనువాక్య.

3. మంత్రము : **ప్రజాపతే న త్వదేతాన్యన్యః । విశ్వా జాతాని పరి తా బభూవ । యత్కామాస్తే జుహుమస్తన్నో అస్తు (1)।**

వయగ్ం స్యామ పతయో రయీణామ్ । స వేద పుత్రః పితరగ్ం స మాతరమ్ । స సూనుర్భువత్స

భువత్పునర్మఘుః । స ద్యామౌర్ణోదన్తరిక్షగ్ం స సువః । స విశ్వా భువో అభవత్స ఆభవత్ ।

అర్థము : హే ప్రజాపతే!=ఓ ప్రజాపతీ!, త్వత్అన్యః=నీకంటె నితరుcడు, జాతాని=పుట్టిన, తా(ని) ఏతాని విశ్వా(ని) = ఆ యీ విశ్వములను, న పరిబభూవ=పరిభవించుటకై సమర్థcడు కాలేదు. సృష్టి సంహారములు చేయుటకుc గూడ సమర్థcడు కాలేదను నర్థమునకు పరిభవము ఉపలక్షణము. (అతః=ఈ కారణమువలన,) తే=నీకు, వయమ్=మేము, యత్కామాః=ఏ ఫలమును కోరినవారమై, జుహుమః=హోమము చేయుచున్నామో, తత్=ఆ ఫలము, నః=మాకు, అస్తు=కలుగుcగాక. వయమ్=మేము, రయీణామ్= ధనములకు, పతయః= స్వాములము, స్యామ=అగుదుము గాక. పుత్రః సః=పుత్రుcడైన యా ప్రజాపతి, పితరమ్=బ్రహ్మాండము యొక్క ఉపరితన కపాలమైన దివిని తండ్రినిగాను, మాతరమ్=ఆ బ్రహ్మాండమునకు అధస్తన కపాలరూప పృథివిని తల్లినిగాను, వేద=తెలిసికొనెను. సః=తెలిసికొనిన యా ప్రజాపతి, సూనుః భువత్=ఆ మాతాపితరులకు పుత్రుc డాయెను. పునర్మఘుః=మఱల మఱల యజమానునకై దాతవ్యమైన ధనము కల యతcడు, భువత్=ప్రజాపతి యాయెను. కించ=మఱియు, సః=ఆ ప్రజాపతి, (సర్వస్యాపి విరాడ్రూపం ధృత్వా=సమస్తమునకు విరాడ్రూపమును ధరించి,) ద్యామ్=ఉపరితన కపాలరూప దివిని, ఔర్ణోత్= ఆచ్ఛాదించెను. తథా=ఆ విధముగ, సః=అతcడు, అన్తరిక్షమ్=అంతరిక్షమును, సువః=స్వర్గమును, ఔర్ణోత్= ఆచ్ఛాదించెను. కించ=ఇంకను, సః ఏవ=అతcడే, విశ్వాః భువః=ఈ లోకము నారంభించి యధస్తనములైన పూర్వభూములను, అభవత్=పొందినవాcడాయెను (ఆచ్ఛాదించెను). సః=అతడు, ఆ (గత్య) =సత్యలోకమునందు వచ్చి, అభవత్=చతుర్ముఖత్వ మనెడి రూపాంతరముచే పరిమితుc డాయెను.

తాత్పర్యము : ఓ ప్రజాపతీ! నీకంటె నితరుc డొక్కcడును ఉత్పన్నములైన యీ విశ్వములను పరిభవించుటకై సమర్థcడు కాలేదు. సృష్టిసంహారముల విషయమునc గూడ నశక్తుడే. కనుకమేము ఏ ఫలము నపేక్షించి నీకు హోమము చేయుచున్నామో, ఆ ఫలము మాకు కలుగుcగాక. మేము ధనపతుల మగుదుము గాక. ''ద్యౌః పితా। పృథివీ మాతా। ప్రజాపతిర్బన్ధుః'' అను శ్రుతివలన బ్రహ్మాండమధ్యమున సత్యలోకమున ఉంటున్న

ప్రజాపతియొక్క యండమునకు ఉపరితన కపాలమైన దివి పిత యనియు, అధస్తన కపాలరూప పృథివి మాత యనియు, పుత్రుcడైన యా ప్రజాపతి తెలిసికొనెను. తెలిసికొనిన యతc డా మాతాపితరులకు పుత్రుc డాయెను. కనుకనే ఆతc డా మాతాపితరులను తెలిసికొనుట యుక్తమే. మాటిమాటికి యజమానునకు దాతవ్యమైన ధనము కలవాcడు ప్రజాపతి యగుచున్నాcడు. మఱియు ఆ ప్రజాపతి సర్వస్వమునకు విరాడ్రూపమును ధరించి ఉపరితన కపాలరూప దివి నాచ్ఛాదించెను. ఆ విధముగ నంతరిక్షమును, స్వర్గమును ఆచ్ఛాదించెను. అంతియ కాక అతcడే యీ లోకము నారంభించి యధస్తనములైన పూర్వభూముల నాచ్ఛాదించెను. మఱియు నతcడు సత్యలోకమునకు వచ్చి యచట చతుర్ముఖుc డనెడి రూపాంతరమునే పరిమితుcడై యుండెను. ఇది ప్రాజాపత్యోపాంశుయాజమునకు పురోనువాక్యామంత్రము.

4. మంత్రము : **అగ్నీ షోమా సవేదసా । స హూతీ వనతం గిరః । సం దేవత్రా బభూవథుః । యువమేతాని దివి రోచనాని । అగ్నిశ్చ సోమసక్రతూ అధత్తమ్ (2) । యువగ్ం సిన్ధూగ్ం రభిశస్తే రవద్యాత్ । అగ్నీషోమావముఞ్చతం గృభీతాన్ ।**

అర్థము : హే అగ్నీషోమౌ!=ఓ యగ్ని సోమదేవతలారా!, సవేదసా (సౌ)=సమానజ్ఞానయుక్తులును, సహూతీ=సమానాహ్వానయుక్తులునైన, యువామ్=మీరు, గిరః=స్తుతిరూపములైన మా వాక్కులను, వనతమ్=సేవించుcడు. యువామ్=మీరు, దేవత్రా=దేవతల మధ్యమున, సంబభూవథుః=కలసియుడిరి. హే సోమ!=ఓ సోమదేవా! త్వమ్=నీవు, అగ్నిశ్చ=అగ్నియు, ఇతి ఏతౌ యువామ్=అను ఈ మీరు, సక్రతూ=సమాన సంకల్పము కలవారగుచు, దివి=ద్యులోకమునందు, ఏతాని రోచనాని=ఈ నక్షత్రములను, అధత్తమ్=స్థాపించిరి. హే అగ్నీషోమౌ!=ఓ యగ్నిసోములారా !, యువమ్=మీరు, గృభీతాన్ (గృహీతాన్) సిన్ధూన్=రథ్యోదకనిమిత్తమైన ఆపృతత్వాపవాదముచేతను, పంకాదిరూప దోషముచేతను గ్రహించcబడిన సర్వనదులను, అభిశస్తేః=ఆ యపవాదమునుండియు, అవద్యాత్=పంకాది దోషమునుండియు, అముఞ్చతమ్=విడిపించిరి.

తాత్పర్యము : ఓ యగ్నీషోమదేవతలారా! మీరు స్తుతిరూపములైన మా వాక్కులను వినుcడు. మీరు సమానజ్ఞానయుక్తులు, సమానాహ్వాన యుక్తులునై దేవతల మధ్యమున కలసియే యుండిరి. ఒకప్పుడును విడివడియుండలేదు. ఓ సోమదేవతా! నీవు, అగ్నియు, మీ రుభయులును సమాన సంకల్పము కలవారగుచు దివియందు నక్షత్రములను స్థాపించిరి. ఓ యగ్నీషోములారా! మార్ద్గకాది నిమిత్తముగ నావరింపcబడినవను నిందచేతను, పంకాదిరూపమైన దోషముచేతను గ్రహించcబడిన (కూడియున్న) సర్వనదులను ఆ యపవాదమునుండియు, ఆ దోషమునుండియు విడిపింపcజేసిరి. ఇది యీశ్వరకృతమైనను ఆ విధముగ నీ యగ్నీషోమదేవతలు స్తుతింపcబడిరి. ఇది అగ్నిషోమీయ పురోడాశమునకు పురోనువాక్యామంత్రము.

5. మంత్రము : **ఇన్ద్రాగ్నీ రోచనా దివః । పరివాజేషు భూషథః । తద్వాఞ్ఛేతి ప్ర వీర్యమ్ । శ్రథద్వ్రత్రముత సనోతి**

వాజమ్ । ఇన్ద్రా యో అగ్నీ సహూరీ సపర్యాత్ । ఇరజ్యన్తావసవ్యస్య భూరేః ।

సహస్తమా సహసా వాజయన్తా।

అర్థము : హే ఇన్ద్రాగ్నీ !=ఓ యింద్రాగ్నులారా ! దివః పరి=స్వర్గమున కుపరిభాగమున, రోచనా=దీపించుచున్న, యువామ్=మీరు, వాజేషు=యజమాన సంబంధములైన యన్నముల నిమిత్తమున, భూషథః=దాతలుగా నగుటకై యిచ్ఛయించుచున్నారు. తత్=వారి ఋభూషత్వము, వామ్=మీయొక్క, వీర్యమ్=సామర్థ్యమును, ప్రచేతి=ప్రకర్షముగ జ్ఞాపకముచేయుచున్నది. హే ఇన్ద్రాగ్నీ !=ఓ యింద్రాగ్నులారా ! యః=ఏ యజమానుఁడు, వృత్రమ్=విరోధియైన పాపమును, శ్రథత్=నిరాకరించుచున్నాఁడో, ఉత=లేదా, వాజమ్=హవిర్లక్షణమైన యన్నమును, సనోతి=ఇచ్చుచున్నాఁడో, (అపి చ=మఱియు,) సహూరీ=యజమానునియొక్క శ్రద్ధారాహిత్యాది చ్ఛిద్రముల నన్వేషించుటచే మీరు కుటిలులైనను, యువామ్=మిమ్ము, సపర్యాత్=అప్రమత్తుఁడై యే యజమానుఁడు పరిచరించు (సేవించు)చున్నాఁడో, ఇరయ్యన్తా=అనుగ్రహముచే భక్తుననుగ్రహించువారును, భూరేః=బహుళమైన, వసవ్యస్య=ధనసమూహమునకు, (దాతారౌ=దాతలును,) సహస్తమా=అతిశయముగ సహనము కలవారును, సహనా=బలవంతులును, వాజయన్తా=హవిర్లక్షణమైన యన్నమును పొందువారునునగు, యువామేవ=మీరే, తాదృశం యజమానమ్=అటువంటి యజమానుని, అనుగృహ్ణీతమ్=అనుగ్రహించుఁడు.

తాత్పర్యము : ఓ యింద్రాగ్నులారా! స్వర్గోపరిభాగమున ప్రకాశించుచున్న మీరు యజమాన సంబంధములైన యన్నముల నిమిత్తమున దాత లగుటకై యిచ్ఛయించుచున్నారు. యజమానుని అన్నసమృద్ధినిగాఁ జేయవలెనని తలఁచుచున్నారని యర్థము. ఆ యజమానసంబంధియైన ఋభూషత్వము మీ సామర్థ్యమును జ్ఞాపకము చేయుచున్నది. యజమానుఁడు విరోధియైన పాపమును నిరాకరించినను, మీకు హవిస్సు నొసఁగినను, యజమానుఁడు శ్రద్ధావంతుఁడా? కాదా? అని యీ విధముగ యజమానునివిషయమున ఛిద్రాన్వేషణ రూపమైన కౌటిల్యము కలవారైనను మిమ్ము అప్రమత్తుఁడై సేవించునట్టి అటువంటి యజమానుని మీరే యనుగ్రహించవలెను. మీరు 'ఇరయ్యన్తా' ఇత్యాది విశేషణ విశిష్టులు. 'ఇరయ్యన్తా' ఇత్యాది పదములు లుప్తద్వివచనాంతములు. మంత్రమునందు 'ఇన్ద్రాయోఅగ్నీ' అను సమస్తపదమును విచ్ఛేదము చేసి మధ్యమున 'య'అనిపద మామ్నాతమైనది. ఆ విధముగఁ జేయుటవలన 'హే ఇన్ద్రాగ్నీ!' అని సంబోధన మేర్పడినది. ఇది ఐంద్రాగ్నపురోడాశమునకు పురోనుక్యామంత్రము.

6. మంత్రము : **ఐన్ద్రసానసిగ్ం రయిమ్ (3) । సజిత్వానగ్ం సదాసహమ్ । వర్షిష్ఠమూతయే భర । ప్రసాహిషే**

పురుహూత శత్రూన్ । జ్యేష్ఠస్తే శుష్మ ఇహ రాతిరస్తు । ఇన్ద్రా కభర దక్షిణేనావసూని ।

పతిః సిన్ధూనామసి రేవతీనామ్ ।

అర్థము : హే ఇన్ద్ర !=ఓ యింద్రుడా !, సానసిమ్=దానసంబంధియు, సజిత్వానమ్=జయశీలులైన పుత్రాదులతోc గూడినదియు, సదాసహమ్=సదా విరోధులను తిరస్కరింప సమర్థమైనదియు, వర్షిష్ఠమ్=అతిశయముగ ప్రవృద్ధమునగు, రయిమ్=ధనమును, ఊతయే=అస్మద్రక్షణమునకై, భర=తెమ్ము. హే పురుహూత = బహుయజ్ఞములం దాహ్వానించcబడుచున్న ఓ యింద్రా !, శత్రూన్=శత్రువులను, ప్రససాహిషే=సర్వదా ప్రకర్షముగ తిరస్కరించుచున్నాcవు. తే=నీయొక్క, శుష్మః=బలము, జ్యేష్ఠః=ప్రశస్తము. ఇహ=ఈ కర్మయందు, రాతిః=ఫలదానము, అస్తు=అగుcగాక. హే ఇన్ద్ర !=ఓ యింద్రా !, దక్షిణేన=దక్షిణహస్తముతో, వసూని=ధనములను, ఆభర=తెమ్ము. సిన్ధూనామ్=ధనవాహినులైన (సముద్రసమానులైన), రేవతీనామ్=ప్రజలకు, పతిః అసి=స్వామివగుచున్నావు.

తాత్పర్యము : ఓ యింద్రా! అనేకులకు దానము చేయుటకై పర్యాప్త మైనదియు, జయశీలులైన పుత్రాదులతోc గూడినదియు, ఎల్లవేళలందు విరోధులను తిరస్కరించుటకు సమర్థమైనదియునగు ధనమును మా రక్షణమునకై తెమ్ము. ఓ పురుహూతా! నీవు శత్రువులను ప్రకర్షముగ సదా తిరస్కరించుచున్నావు. నీ బలము ప్రశస్త మైనది. ఈ కర్మయందు ఫలదాన మగుcగాక. ఓ యింద్రా! కుడిచేతితో ధనమును తీసికొనిరమ్ము. ధనవాహినులైన (సముద్రసమానులైన) ప్రజలకు పతి వగుచున్నావు. ఇది ఐంద్రహవిస్సునకు పురోనువాక్య.

7. మంత్రము : మహాగ్ం ।ఇన్ద్రో య ఓజసా ।పర్జన్యో వృష్టిమాగ్ం ఇవ ।స్తోమైర్వత్సస్య వావృధే ।మహాగ్ం ఇన్ద్రో

న్నవదాచర్షణిప్రాः (4) ।ఉత ద్విబర్హా అమినः సహోభిः ।అస్మద్రియగ్వావృధే వీర్యాయ ।ఉరుः

పృథుः సుకృతः కర్తృభిర్భూత్ ।

అర్థము : వృష్టిమాన్=వర్షము కలిగియున్న, పర్జన్యః ఇవ=మేఘమువలె, యః=ఏ యింద్రుడు, ఓజసా=బలముచే, మహాన్=గొప్పవాcడో (మహనీయుcడో), సః=ఆ యింద్రుcడు, వత్సస్య=వత్సస్థానీయుడైన యజమానుని యొక్క, స్తోమైః=సోత్రములచే, వావృధే=వృద్ధి నొందుcగాక. అయం మహాన్ ఇన్ద్రః=ఈ మహనీయుcడైన యింద్రుcడు, నృపత్=మనుష్యునివలె, ఆచర్షణిప్రాః=మనుష్యులను తదభీష్టదానములచే (భోగములచే) పూరించువాcడు. ఉత=మఱియు, అయమ్=ఈ యింద్రుcడు, ద్విబర్హాః=ప్రకృతిరూపములైన రెండు యాగములందును వృద్ధి కలవాcడు, అమినః=అసదృశుcడు, సహోభిః యుక్తం=బలములతోc గూడినవాcడు (బలవంతుcడు), అస్మద్రియక్=అస్మత్సదృశుcడునై, వావృధే=వృద్ధి నొందెను. వీర్యాయ=సామర్థ్యసిద్ధికై, ఉరుః=యశస్సుచే విపులుcడును, పృథుః=బలముచే విస్తీర్ణcడునై, అయమ్=ఈ యింద్రుcడు, కర్తృభిః=యజమానులచే, సుకృతః అభూత్=సుష్ఠుగ వర్ధితుc డాయెను.

తాత్పర్యము : వృష్టిమంతమైన మేఘమువలె నింద్రుcడు బలముచే మహనీయుcడై వత్సస్థానీయుcడైన యజమానునియొక్క స్తోత్రములచే వృద్ధి నొందుcగాక. ఈ మహనీయుcడైన యింద్రుcడు మనుష్యులను తదభీష్టదానములచే (భోగములచే) పూరించువాcడు. రాజామాత్యాదులు సేవకుల నభీష్టభోగములచే పూరించువిధముగనని తాత్పర్యము. మఱియు నీ యింద్రుc డసదృశుcడు, బలవంతుcడు, ప్రకృతి వికృతి యాగములందు రెండింటి

యందును వృద్ధి కలవాఁడు, అస్మత్సదృశుఁడునై వృద్ధి నొందెను. ఈ యింద్రుని యనుగ్రహమువలనమేము వృద్ధి నొందినవిధముగ, మా హవిస్సులచే నితఁడు వృద్ధి నొందెనని యర్థము. ఈ విషయమే యీ విధముగ విపులీకరించఁబడినది:- సామర్థ్యసిద్ధికై యశస్సుచే విపులుఁడును, బలముచే విస్తీర్ణుఁడునైన యీ యింద్రుఁడు యజమానులచే సుష్ఠగ వర్ధితుఁ డాయెను. ఇది మాహేంద్రహవిస్సునకు పురోనువాక్య.

8. మంత్రము : **పిప్రీహి దేవాగ్ం ఉశతో యవిష్ఠ। విద్వాగ్ం ఋతూగ్ం ఋతుపతే యజేహ। యే దైవ్యా ఋత్విజస్తేభి రగ్నే। త్వగ్ం హోతౄణామస్యాయజిష్ఠః ।**

అర్థము : హే అగ్నే ! యవిష్ఠ !=యువతముఁడవైన ఓ యగ్నీ !, ఉశతః=కోరికలను కలిగియున్నట్టి, దేవాన్=దేవతలను, పిప్రీహి=అతిశయముగ సంతోషపఱుచుము. హే ఋతుపతే !=సూర్యరూపమున కాలపరిపాలకుఁడవైన ఓ యగ్నీ !, త్వమ్=నీవు, ఋతూన్=యాగకాలవిశేషములను, విద్వాన్=తెలిసికొనినవాఁడవై, ఇహ=ఇచట (ఉచితకాలమందు), యజ=యాగముచేయుము. యే దైవ్యాః ఋత్విజః=దేవసంబంధులైన యే ఋత్విజులు, సన్తి=కలరో, తేభిః=ఆ దైవ్యులైన ఋత్విజులతోఁ గూడ, త్వమ్=నీవు, అస్య=ఈ యజమానునియొక్క, హోతౄణామ్=ఋత్విజులలో, ఆయజిష్ఠః=అంతటను శ్రేష్ఠయష్ట వగుచున్నావు.

తాత్పర్యము : యువతముఁడవైన ఓ యగ్నీ! కోరుచున్నట్టి దేవతల నతిశయముగ సంతోషపఱుచుము. సూర్యరూపమున కాలపరిపాలకుఁడవైన ఓ యగ్నీ! నీవు యాగకాల విశేషములను తెలిసికొనుచు ఉంటున్నావు. కనుక ఇచట ఉచితకాలమందు యజ్ఞము చేయుము. దేవతలలో కొందఱు ఋత్విజులు కలరు. ''అగ్నిర్హోతా। అశ్వినాఽధ్వర్యూ। త్వష్టాఽగ్నీత్।'' అను శ్రుతి అగ్న్యాది దేవతలను ఋత్విజులనుగా పేర్కొన్నది. ఓ యగ్నీ! నీవు దైవ్యులైన ఋత్విజులతోఁ గూడ ఈ యజమాన సంబంధులైన ఋత్విజుల మధ్యమున అంతటను యష్టృషభుఁడ వగుచున్నావు. ఇది స్విష్టకృదగ్నికి పురోనువాక్య.

9. మంత్రము : **అగ్నిగ్ం స్విష్టకృతమ్। అయాడగ్నిరగ్నేః ప్రియా ధామాని। అయాట్సోమస్య ప్రియా ధామాని (5)। అయాడగ్నేః ప్రియా ధామాని। అయాత్ప్రజాపతేః ప్రియా ధామాని। అయాడగ్నీషోమయోః ప్రియా ధామాని। అయాడిన్ద్రాగ్నియోః ప్రియా ధామాని। అయాడిన్ద్రస్య ప్రియా ధామాని। అయాణ్మైత్రస్య ప్రియా ధామాని। అయాడ్దేవానా మాజ్యపానాం ప్రియా ధామాని। యక్షదగ్నిర్హోతుః ప్రియా ధామాని। యక్షత్స్వం మహిమానమ్। ఆయజతా మే జ్యా ఇషః। కృణోతు సో అధ్వరా జాతవేదాః। జుషతాగ్ం హవిః ।**

అర్థము : యే వయం హోతారః స్మః=హోతలమైన యే మేము ఉంటున్నామో, తే వయమ్=ఆ మేము, స్విష్టకృతమ్ అగ్నిమ్=స్విష్టకృదగ్నిని, యజామహే=యజించుచున్నాము. అగ్నేః=ప్రథమాజ్యభాగదేవుఁడైన యగ్నికి, యాని ప్రియా (ని) ధామాని సన్తి=ఏ ప్రియములైన స్థానములు కలవో, తేషు సర్వేషు=ఆ సర్వస్థానములందు, అగ్నిః=అగ్ని, అయాట్=యజించెను. సోమస్య=సోమదేవునకు, యా ప్రియా ధామాని సన్తి=ఏ ప్రియములైన స్థానములు కలవో, తేషు సర్వేషు=ఆ సర్వస్థానములందు, సోమః=సోముఁడు అయాట్=యజించెను. అగ్నేః=అగ్నికి, యా, ప్రియా, ధామాని, సన్తి, తేషు సర్వేషు, అగ్నిః, అయాట్. ప్రజాపతేః=ప్రజాపతికి, యా, ప్రియా, ధామాని, సన్తి, తేషు సర్వేషు, ప్రజాపతిః=ప్రజాపతి, అయాట్. అగ్నీషోమయోః=అగ్నీషోమదేవతలకు, యా, ప్రియా, ధామాని, సన్తి, తేషు సర్వేషు, అగ్నీషోమౌ=అగ్నీషోమదేవతలు, అయాట్తామ్=యజించిరి. ఈ విధముగనే 'ఇన్ద్రాగ్నియోః' ఇత్యాదులందు సమన్వయమును చేసికొనవలెను.

హోతుః అగ్నేః=హోమమునకు స్విష్టకృత్త్వసంపాదకుఁడైన యగ్నికి, యా ప్రియా ధామాని, సన్తి; తేషు సర్వేషు, దైవ్యః హోతా=దైవ్యహోత, యక్షతు=యజించుఁగాక. స్వం మహిమానమ్=ఉక్తసర్వదేవతలకుఁగల స్వీయ మహిమ నుద్దేశించి, దైవ్యః హోతా=దైవ్యహోత, యక్షత్=యజించుఁగాక. ఆయజతామ్=అభిముఖముగ యాగమును చేయుచున్న యజమానులకు, ఏజ్యాయ ఇషః=అభిముఖముగ యష్టవ్యులైన యభీష్టదేవతల నందఱిని, అధ్వరా=ఈ యజ్ఞమునందు, సః జాతవేదాః=ఆ స్విష్టకృదగ్ని, కృణోతు=స్విష్టులను చేయుఁగాక. తదర్థమ్=అందుకై, అయమ్=ఈ స్విష్టకృదగ్ని, ఇదం హవిః=ఈ హవిస్సును, జుషతామ్=సేవించుఁగాక.

తాత్పర్యము : 'స్విష్టకృతమగ్నిం యే యజామహే' అని శేషము పూరణీయము. ప్రథమాజ్యభాగదేవతయైన యగ్నికి, ద్వితీయాజ్యభాగదేవతకును, తదితరదేవతలకును గల ప్రియములైన స్థానములందు ఆ యగ్న్యాది దేవతలు యజించిరి. శేషము సుగమము. ఇది హోత పఠించవలసిన నిగదము.

10. మంత్రము :అగ్నే యదద్య విశో అధ్వరస్య హోతః । పావక శోచే వేష్టవగ్ం హి యజ్వా । ఋతా యజాసి మహినా

వియద్భ్యః । హవ్యా వహ యవిష్ఠయా తే అద్య (6)

అస్త్వధత్తగ్ం రయిం చర్షణిప్రాః సోమస్య ప్రియా ధామానీషః షట్ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమ ప్రపాఠకే సప్తమోఽనువాకః ॥౭॥

అర్థము : హోత !=హోమకర్తవును, పావక !=శోధకుఁడవును, శోచే !=దీప్యమానుఁడవునగు, హే అగ్నే!=ఓ స్విష్టకృదగ్నీ!, విశః=(అనుష్ఠితమైన) ప్రవిష్టమైన, అధ్వరస్య=యాగసంబంధియైన, యత్ హవిః=ఏ హవిస్సు, అస్తి=కలదో, తత్=ఆ హవిస్సును, అద్య=భక్షించుము. హి=ఏ కారణమువలన, త్వమ్=నీవు, యజ్వా=యాగకర్తవో, తస్మాత్=ఆ కారణమువలన, ఋతే=మా యజ్ఞమునందు, మహినా (మహిమ్నా)=మహిమచేత, దేవాన్=దేవతలను, యజాసి=సంతోషపఱుచుచున్నావు. యత్=ఏ కారణమువలన,

విభూఃవిశిష్టఁడ వగుచున్నాఁవో, తస్మాత్=ఆ కారణమువలన, హే యవిష్ఠ != యువత ముఁడవైన ఓ యగ్నీ!, అద్య=ఇప్పుడు, తే=నీకు, యా హవ్యా(ని)=ఏ హవిస్సులు, (అస్మాభిఃమాచే, దీయన్తే=ఈయఁబడుచున్నవో, తాని=ఆ హవిస్సులను,) వహ=వహించుము (స్వీకరించుము).

తాత్పర్యము : హోతరిత్యాది విశేషణ విశిష్టఁడవైన ఓ స్విష్టకృదగ్నీ! అనుష్ఠించఁబడిన యజ్ఞమునకు సంబంధించిన హవిస్సును భక్షించుము. నీవు యాగకర్తవు కనుక, మా యజ్ఞమునందు మహిమచేత దేవతలను సంతోషపఱచుచున్నావు. నీవు విశిష్టఁడ వగుచున్నావు కనుక, యువతముఁడవైన ఓ యగ్నీ! ఇప్పుడు నీకు మే మిచ్చుచున్న హవిస్సుల నన్నింటిని స్వీకరించుము. ఇది స్విష్టకృదగ్నిహవిస్సునకు యాజ్య.

కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమునపంచమప్రపాఠకమునందు
సప్తమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే అష్టమోఽనువాకః

1. మంత్రము : ఉపహూతగ్ం రథంతరగ్ం సహ పృథివ్యా । ఉప మా రథంతరగ్ం సహ పృథివ్యా హ్వయతామ్ । ఉపహూతం వామదేవ్యగ్ం సహాన్తరిక్షేణ । ఉప మా వామదేవ్యగ్ం సహాన్తరిక్షేణ హ్వయతామ్ । ఉపహూతం బృహత్సహ దివా । ఉప మా బృహత్సహ దివా హ్వయతామ్ । ఉపహూతాః సప్త హోత్రాః । ఉప మా సప్తహోత్రా హ్వయన్తామ్ । ఉపహూతా ధేనుః సహర్షభా । ఉప మా ధేనుః సహర్షభా హ్వయతామ్ (1) । ఉపహూతో భక్షః సఖా । ఉప మా భక్షః సఖా హ్వయతామ్ । ఉపహూతాగ్ం3 హో । ఇడోపహూతా । ఉపహూతేడా । ఉపో అస్మాగ్ం ఇడా హ్వయతామ్। ఇడోపహూతా । ఉపహూతేడా । మానవీ ఘృతపదీ మైత్రావరుణీ । బ్రహ్మదేవకృత ముపహూతమ్ (2) । దైవ్యా అధ్వర్యవ ఉపహూతాః । ఉపహూతాః మనుష్యాః । య ఇమం యజ్ఞమవాన్ । యే యజ్ఞపతిం వర్ధాన్ । ఉపహూతే ద్యావాపృథివీ। పూర్వజే ఋతావరీ । దేవీ దేవపుత్రే । ఉపహూతోఽయం యజమానః। ఉత్తరస్యాం దేవయజ్యాయా ముపహూతః । భూయసి హవిష్కరణ ఉపహూతః । దివ్యే ధామన్నుపహూతః। ఇదం మే దేవా హవిర్జుషన్తామితి తస్మిన్నుపహూతః । విశ్వమస్య ప్రియముపహూతమ్ । విశ్వస్య ప్రియస్యోపహూతస్యోపహూతః (3) ।

సహర్షభా హ్వయతాముపహూతగ్ం హవిష్కరణ ఉపహూతశ్చత్వారి చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే అష్టమోఽనువాకః ॥౮॥

వేదార్థదీపిక

అవతారిక: సప్తమానువాకమునందు ఆగ్నేయాదిహవిస్సులకు యాజ్యానువాక్యామంత్రము లామ్నాతము లైనవి. ఈ యష్టమానువాకమునందు ఇడోపాహ్వానమంత్రము లభిహితము లగుచున్నవి. ఈ మంత్రములకు బ్రాహ్మణము సంహితయందలి ద్వితీయకాండములోని షష్ఠప్రపాఠకమునందు చెప్పబడినది.

అర్థము : రథంతరమ్=రథంతరశబ్దోపలక్షితమైన పృథివి, పృథివ్యా సహ=పృథివీశబ్దోపలక్షితమైన అన్నాద్యముతోc గూడ, ఉపహూతమ్=సమీపమున కాహ్వానింపబడినది. రథంతరమ్=రథంతరశబ్దోపలక్షితమైన భూమి, పృథివ్యా సహ=పృథివీశబ్దోపలక్షితమైన అన్నాద్యముతోc గూడ, మా=నన్ను, ఉపహ్వయతామ్=సమీపమున కాహ్వానించుcగాక. వామదేవ్యమ్=సామవిశేషవాచితమైన వామదేవ్యశబ్దముచే నుపలక్షితములైన పశువులు, అన్తరిక్షేణ సహ=అంతరిక్షముతోc గూడ, ఉపహూతమ్=సమీపమున కాహ్వానింపబడినవి. వామదేవ్యమ్= వామదేవ్యశబ్దోపలక్షితములైన పశువులు, అన్తరిక్షేణ సహ=అతరిక్షముతోc గూడ, మా=నన్ను, ఉపహ్వయతామ్=సమీపమున కాహ్వానించుcగాక. బృహత్=బృహచ్ఛబ్దోపలక్షితమైన వృష్టి, దివా సహ=దివితోc గూడ, ఉపహూతమ్=సమీపమున కాహ్వానింపబడినది. బృహత్=బృహచ్ఛబ్దోప లక్షితమైన వృష్టి, దివా సహ=దివితోcగూడ, మా=నన్ను, ఉపహ్వయతామ్=సమీపమున కాహ్వానించుcగాక.

సప్త హోత్రాఃఆశ్వలాయనునిచేc జూపబడిన హోత, ప్రశస్త, బ్రాహ్మణాచ్ఛంసి, పోత, నేష్ట, ఆగ్నీధ్రుcడు, అచ్ఛావాకుcడు అను ఏడుగురు హోత్రకులు, ఉపహూతాఃసమీపమున కాహ్వానింపబడిరి. సప్త హోత్రాఃఆ సప్తసంఖ్యాకులైన హోత్రకులు, మా=నన్ను, ఉపహ్వయన్తామ్=సమీపమున కాహ్వానింతురు గాక. ధేనుఃధేనువు, సహర్షభా=ఋషభసహితయై, ఉపహూతా=సమీపమున కాహ్వానించబడినది. సహర్షభా ధేనుఃఋషభసహితధేనువు, మా=నన్ను, ఉపహ్వయతామ్=సమీపమున కాహ్వానించుcగాక. భక్షఃసఖా='భక్షఃసఖా' అను శబ్దములచే నుపలక్షితమైన సోపకారక సోమపానము, ఉపహూతఃసమీపమున కాహ్వానింపబడినది. భక్షఃసఖా=సోమపానము, మా=నన్ను, ఉపహ్వయతామ్= సమీపమున కాహ్వానించుcగాక. ఉపహూతాం3హోఆత్మ సమీపమున కాహ్వానింపబడినది. (ఇంతవఱకు ఉపహూతములైన రథంతరపృథివ్యాదులును, భక్షఃసఖేత్యంతములు నైనవాని నుపవసింపజేయునట్టిది ఆత్మ కనుకను, ఇతరోపాహ్వానము తదధీన మగుటవలనను ఆత్మకుc గూడ ఉపాహ్వానము కర్తవ్యము.)

ఇడా ఉపహూతా=గోశరీరధారిణియైన యిడాదేవత సమీపమున కాహ్వానింపబడినది. ఉపహూతా ఇడా= ఉపహూతయైనది యిడాదేవత. ఇడా=గోరూపధారిణియైన యిడాదేవత, అస్మాన్=మమ్ము, ఉపోసమీపమునకు, హ్వయతామ్=ఆహ్వానించుcగాక. ఇడా, ఉపహూతా. ఉపహూత ఇడా. (అర్థము పూర్వోక్తమే.) మానవీ=మనువు ఈ గోశరీరధారిణియైన యిడను ప్రథమమున చూచుటవలన ఈ యిడ మానవి యనబడుచున్నది. ఘృతపదీ=ఈ గోవుయొక్క పాదమునుండి ఘృతము స్రవించుటవలన ఈ గోశరీరధారిణియైన యిడ ఘృతపది యని వ్యవహరించబడుచున్నది. మైత్రావరుణీ=మిత్రావరుణదేవతలు గోవును యజ్ఞాంగమునుగాc జేయ సమర్థులమని చెప్పి యా గోవును

పిలుచుటవలన ఈ గోరూపయైన యిడ మైత్రావరుణి (మిత్రావరుణులచే నాహ్వానించబడినది) యని వ్యవహరించబడుచున్నది. దేవకృతమ్ ఉపహూతమ్=పూర్వము దేవతలచే జేయబడిన యుపాహ్వానము, బ్రహ్మ=పరివృఢమైన కర్మ, ఆసీత్=ఆయెను.

దైవ్యాఃఅధ్వర్యవః='అశ్వినౌ హి దేవానామధ్వర్యూ ఆస్తామ్' ఇత్యాది శ్రుతులందు చెప్పబడిన దేవతల యధ్వర్యులు, ఉపహూతాఃఉపహూతులైరి. మనుష్యాఃమనుష్యులైన యధ్వర్యులు, ఉపహూతాఃఉపహూతులైరి. యే=ఏ దైవ్య మనుష్యాధ్వర్యులు, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, అవాన్=రక్షించిరో యే=ఏ యధ్వర్యులు, యజ్ఞపతిమ్=యజ్ఞకర్తను, వర్ధాన్=వృద్ధి నొందించిరో, తే సర్వే ఉపహూతాఃఇత్యర్థఃవా రందఱు ఉపహూతలని యర్థము. ద్యావాపృథివీ=ద్యావాపృథువులు, ఉపహూతే=ఉపహూతము లైనవి. ఋతావరీ=ఋతశబ్దవాచ్యమైన యజ్ఞమును కలిగియున్న ద్యావాపృథువులు, పూర్వజే=దేవతిర్యఙ్మనుష్యాద్యుత్పత్తి కంటె పూర్వమే పుట్టినవి, దేవీ=దేవతారూపములు, దేవపుత్రే=దేవతలు పుత్రులుగాగలవియుగూడ. యజమానఃయజ్ఞకర్త, ఉపహూతఃఉపహూతుడు. ఉత్తరస్యాం దేవయజ్యాయామ్=సోమయాగరూప దేవయజ్యయందు, ఉపహూతఃయజమానుడు ఉపహూతుడు. భూయసి హవిష్కరణే=బహుహవిష్కరణమందు, ఉపహూతఃదివ్యే ధామన్=దివ్యధామమైన స్వర్గమునందు, ఉపహూతఃఇదమ్=ఈ ప్రవర్తించుచున్న, మే=నాయొక్క, హవిఃహవిస్సును, దేవాఃదేవతలు, జుషన్తామ్=సేవింతురు గాక ; ఇతి=అని, వక్తుమ్=చెప్పుటకై, తస్మిన్=ఆ దర్శపూర్ణమాసకర్మయందు, ఉపహూతఃఅస్య=ఈ యపేక్షితార్థమునకు, ప్రియమ్=ప్రియమైనది, విశ్వమ్=సర్వము, ఉపహూతమ్. ఉపహూతస్య=ఉపహూతమైన, విశ్వస్యప్రియస్య=సర్వప్రియమునకు, ఉపహూతఃఈ యజమానుడుపహూతుడు.

తాత్పర్యము : తాత్పర్యము స్పష్టము. ఈ మంత్రములకు బ్రాహ్మణము సంహితయందలి ద్వితీయకాండములోని షష్ఠప్రపాఠకస్థ సప్తమానువాకమునందు ఆమ్నాతమైనది. కనుక ఈ యిడావిధి, తద్వ్యాఖ్యానముల నచట చూడవలెను.

కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయకాండమునపంచమప్రపాఠకమునందు
అష్టమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే
నవమోఽనువాకః

1. మంత్రము : **దేవం బర్హిః । వసువనే వసుధేయస్య వేతు । దేవో నరాశగ్ంసః । వసువనే వసుధేయస్య వేతు ।**

దేవో అగ్నిః స్విష్టకృత్ । సుద్రవిణా మన్ద్రః కవిః । సత్యమన్మాకయజీ హోతా ।

హోతుర్హోతు రాయజీయాన్ । అగ్నేకయాన్దేవానయాట్ । యాగ్ం అపిప్రేః । యే తే హోత్రే

అమత్సత । తాగ్ం ససనుషీగ్ం హోత్రాం దేవంగమామ్ । దివి దేవేషు యజ్ఞమేరయేమమ్ ।

స్విష్టకృచ్చాగ్నే హోతా కభూః । వసువనే వసుధేయస్య నమోవాకే వీహి(1) ।

అపిప్రేః పఞ్చ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే నవమోకనువాకః ॥౯॥

వేదార్థదీపిక

అవతారిక: సంహితయందు (కా.2 ప్ర.6. అ. 9.) విహితములైన అనూయాజ హోమములకు సంబంధించిన మంత్రము లీ యనువాకమునం దామ్నాతము లైనవి. ఆ మంత్రము లిచట వ్యాఖ్యానించcబడుచున్నవి.

అర్థము : దేవమ్=ద్యోతనశీలమైన, బర్హిః=బర్హిర్నామకమైన అగ్నిస్వరూపము, వసువనే=యజమానునియొక్క ధనప్రాప్తి కొఱకు, వసుధేయస్య=అగ్నియం దాధేయమైన వసురూపమైన యాజ్యమును (ద్వితీయార్థే షష్ఠీ.) వేతు= భక్షించుcగాక. దేవః నరాశంసః=ద్యోతనశీలుడైన నరాశంస నామకాగ్ని, వసువనే, వసుధేయస్య, వేతు. దేవః=ద్యోతనశీలుడైన, స్విష్టకృత్ అగ్నిః=స్విష్టకృత్ అను పేరు కల యగ్ని, సుద్రవిణాః=శోభనమైన ధనము కలవాcడు. మన్ద్రః=హర్షణశీలుcడు. కవిః=విద్వాంసుcడు. సత్యమన్మా=సత్యమును మననము చేయువాcడు. ఆయజీ=శాస్త్రీయమైన మర్యాదచే యజించువాcడు. హోతా=దేవతల నాహ్వానించువాcడు. హోతుః హోతుః=లోకమునందలి ఆ యా హోతకంటె, ఆయజీయాన్=శాస్త్రీయమర్యాద నుల్లంఘించని యష్ట. హే అగ్నే!=ఓ స్విష్టకృదగ్ని!, ఈదృశః త్వమ్=ఇటువంటి నీవు, యాన్ దేవాన్=ఏ దేవతలను యజించితివో, యాన్=ఏ దేవతలను, అపిప్రేః=సంతోషపఱిచితివో, యే=ఏ దేవతలు, తే=నీయొక్క, హోత్రే=హోతృకృత్యమునందు, అమత్సత=హర్షించిరో, దివి (స్థితేషు)=దివి యందు ఉన్నటువంటి, దేవేషు=దేవతలందు, ససనుషీమ్=హవిస్సు నొసcగcబడినదియు, దేవంగమామ్=దేవతలను పొందుచున్నటువంటిదియునగు, తాం హోత్రామ్=ఆ హోతృక్రియను, ఇమం యజ్ఞమ్=ఈ నా యజ్ఞమును, ఏరయ=పొందించుము. (హోతగా నీవు నా యజ్ఞము ననుష్ఠించు మని యర్థము.)

హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, స్విష్టకృత్ హోతా చ అభూ:=స్విష్టకృత్తువు, హోమమునకు కర్తవు నైతివి. (అత:=ఈ కారణమువలన,) నమోవాకే సతి=యజమానునియొక్క నమస్కారోక్తి యుండగా, వసువనే=యజమానునకు ధనప్రాప్తికై, వసుధేయస్య=అగ్నియందుంచబడుచున్న ఆజ్యరూపమైన యీ ద్రవ్యమును, వీహి=భక్షించుము. స్విష్టకృత్=యజింపబడినదానిని శోభనముగ జేయునగ్ని.

తాత్పర్యము : ప్రకాశించునది, బర్హిర్నామకమునైన యగ్నిస్వరూపము (బర్హిర్నామకాగ్ని) యజమానునకు ధనము ప్రాప్తించుటకై యగ్నియందు ఉంచబడునట్టి యాజ్యమును భక్షించుగాక. నరాశంసనామకాగ్ని కూడ యజమానునకు ధనప్రాప్తికై అగ్నియం దాధేయమైన యాజ్యమును భక్షించుగాక. స్విష్టకృదగ్ని శోభనధనుడు. హర్షణశీలుడు. విద్వాంసుడు. సత్యమననుడు. శాస్త్రీయమర్యాదతో యజించువాడు. లోకమునందుగల ఆ యా హోతలకంటె నతిశయముగ శాస్త్రీయమర్యాద నతిక్రమించక యజించువాడు. ఓ స్విష్టకృదగ్ని! ఇటువంటి నీవు ఏ దేవతలను యజించితివో, ఏ దేవతలను సంతోషపఱచితివో, ఏ దేవతలు నీ హోతృకృత్యమందు సంతోషించిరో, స్వర్గమునందలి దేవతలందు హవిస్సు నిచ్చునదియు, దేవతలను పొందునదియునగు హోతృక్రియను ఈ మా యజ్ఞమున కభిముఖముగ పొందించుడు. మా యజ్ఞమునందు సర్వదేవతుష్టికరియైన హోతృక్రయను నీ వనుష్ఠించుమని యర్థము. ఓ యగ్నీ నీవు స్విష్ట కృద్ధోతవైతివి. కనుక యజమానుడు నమస్కారము చేయుచుండగా యజమానునకు ధనము లభించుటకై అగ్నియం దాధేయమైన యీ యాజ్యరూప ద్రవ్యమును భక్షించుము.

కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయకాండమునపంచమప్రపాఠకమునందు
నవమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే

దశమోఽనువాకః

1. మంత్రము : **ఇదం ద్యావాపృథివీ భద్రమభూత్ । ఆర్ధ్మ సూక్తవాకమ్ । ఉత నమోవాకమ్ । ఋధ్యాస్మ సూక్తోచ్యమగ్నే। త్వగ్ం సూక్తవాగసి । ఉపశ్రితో దివః పృథివ్యోః । ఓమన్వతీ తే కస్మిన్యజ్ఞే యజమాన ద్యావాపృథివీ స్తామ్ । శఙ్గయే జీరదానూ । అత్ర స్నా అప్రవేదే । ఉరుగవ్యూతీ అభయం కృతౌ (1) వృష్టిద్యావారీత్యాపా। శంభువౌ మయోభువౌ । ఊర్జస్వతీ చ పయస్వతీ చ । సూపచరణా చ స్వధిచరణా చ । తయోరావిది।**

వేదార్థదీపిక

అవతారిక: నవమానువాకమునం దామ్నాతములైన ''దేవం బర్హిర్వసువనే వసుధేయస్య,'' ''దేవో అగ్నిః స్విష్ట కృత్,'' ''అనవానమనూయాజాన్యజతి'' ఇత్యాది మంత్రములచే ప్రసిద్ధములైన అనూయాజములు ప్రపంచితము లైనవి. ఇక ప్రస్తరప్రహరణాంగమైన సూక్తవాక మీ దశమానువాకమునం దభిహిత మైనది.

అర్థము : హే ద్యావాపృథివీ !=ఓ ద్యావాపృథువులారా !, తే వయమ్=ఆ మేము, సూక్తవాకమ్='శ్రద్ధాళువైన యీ యజమానుఁడు బాగుగ హవిస్సు నొసఁగెను' అని దేవతలు కాని, మనుష్యులు కాని పలుకునట్లుగా, ఆర్ధ్మ= సమృద్ధిని పొందితిమి. (లేదా -అగ్నిరిదగ్ం హవిరజుషత, అవీవృధత మహోజ్యాయోఽకృత'' అను సూక్తముల వచనము కలుగునట్లుగా సమృద్ధిని పొందితిమి.) ఉత=మఱియు, నమోవాకమ్=''నమో దేవేభ్యః= దేవతలకొఱకు నమస్కారము'' అను ఉక్తి కలుగునట్లుగా, ఆర్ధ్మ=సమృద్ధిని పొందితిమి. హే అగ్నే!=ఓ యగ్నీ !, త్వయా=నీచే, సూక్తోచ్యమ్='ఈ యజమానుఁడు సమృద్ధముగ హవిస్సు నొసఁగెనను' సూక్తము వక్తవ్యము. తేన=ఆ సూక్తముచే, తే వయమ్=ఆ మేము, ఋధ్యాస్మ=సమృద్ధిని పొందినవారల మగుదుము. త్వమ్=నీవు, దివః పృథివ్యోః=ద్యావాభూములందు, ఉపశ్రితః=ఉన్నవాఁడవై, సూక్తవాక్=సూక్తమును పలుకుటకై సమర్థుఁడవు, అసి=అగుచున్నావు.

హే యజమాన!=ఓ యజమానుఁడా!, తే=నీయొక్క, అస్మిన్ యజ్ఞే=ఈ యజ్ఞమునందు, శంగయే=సుఖములను కలిగించునవియు, జీరదానూ=వృష్ట్యాదులమూలమున జీవనము నొసఁగునవియు, అత్రస్నా=భయరహితములును, అప్రవేదే=మా దోషములను చెప్పనివియు, ఉరుగవ్యూతీ అభయం కృతౌ= ప్రభూత తృణాదియుక్తము లగుటచేతను, విస్తీర్ణగో సంచారముచేతను మాయందు అభయమును కలుగఁజేయునవియు, వృష్టిద్యావా=వృష్టిని ప్రకాశింపఁజేయునవియు, రీత్యాపా=సన్మార్గవృత్తి ప్రకారమును పొందించునవియు , శంభువౌ=రోగాద్యనిష్టాంతిని కలుగఁజేయునవియు, మయోభువౌ=అన్నపానాది సుఖమును కలుగఁజేయునవియునగు, ద్యావాపృథివీ =ద్యావాభూములు, ఓమన్వతీ=రక్షణము కలవిగా, స్తామ్=ఉండుఁగాక.

(యువయోఃమధ్యే=మీ ద్యావాభూముల మధ్యమున, ద్యోఃదివి,) ఊర్జస్వతీ=వృష్టిరూపమైన రసము కలది. (ఇయం భూఃఈ భూమి,) పయస్వతీ=తృణాదికముద్వారా బహుళక్షీరాదులు కలది. ద్యోఃదివి, సూపచరణా=దేవతాధివాసస్థాన మగుటచే బాగుగ సేవింపఁదగినది. ఇయం పృథివీఈ పృథివి, స్వధిచరణా =సుఖముగ నాశ్రయించుటకై సాధ్యమైనది. హే ద్యావాపృథివీ !=ఓ ద్యావాభూములారా !, ఇదం భద్రమ్=ఈ చెప్పఁబడిన కల్యాణము, అభూత్=అయినది. తయోఃఆవిది సత్యామ్=ఆ ద్యావాభూముల యాజ్ఞ యుండఁగా-(''అగ్నిరిదగ్ం హవిరజుషత'' అను వక్ష్యమాణ మంత్రభాగముతో దీనికి అన్వయము.)

తాత్పర్యము : ఇది ప్రస్తర ప్రహరణాంగమైన సూక్తవాకముయొక్క ప్రథమ భాగము. తాత్పర్య మర్థమునందే వివరించఁబడినది.

2. మంత్రము : **అగ్నిరిదగ్ం హవిరజుషత । అవీవృధత మహోజ్యాయో కృత । సోమ ఇదగ్ం హవిరజుషత ।**

అవీవృధత మహోజ్యాయో కృత । అగ్నిరిదగ్ం హవిరజుషత (2) । అవీవృధత

మహోజ్యాయో కృత । ప్రజాపతిరిదగ్ం హవిరజుషత । అవీవృధత మహోజ్యాయో కృత ।

అగ్నీషోమావిదగ్ం హవిరజుషేతామ్ । అవీవృధేతాం మహోజ్యాయో క్రాతామ్ । ఇన్ద్రాగ్నీ

ఇదగ్ం హవిరజుషేతామ్ । అవీవృధేతాం మహోజ్యాయో క్రాతామ్ । ఇన్ద్ర ఇదగ్ం

హవిరజుషత । అవీవృధత మహోజ్యాయో కృత । మహేన్ద్ర ఇదగ్ం హవిరజుషత (3) ।

అవీవృధత మహోజ్యాయో కృత । దేవా ఆజ్యపా ఆజ్యమజుషన్త। అవీవృధన్త

మహోజ్యాయో క్రత। అగిర్త్రేణేదగ్ం హవిరజుషత । అవీవృధత మహోజ్యాయో కృత ।

అర్థము : అగ్నిఃఆజ్యభాగదేవతయైన యగ్ని, ఇదం హవిఃఈ దత్తమైన హవిస్సును, అజుషత=సేవించెను. (సేవిత్వా చ=సేవించియు, యజమానమ్=యజమానుని,) అవీవృధత=వృద్ధినొందించెను. (తస్య చ=యజమానునకును,) మహఃజ్యాయఃఅధికమైనతేజస్సును, అకృత=చేసెను. సోమఃసోమదేవుఁడు, ఇదం హవిఃఈ హవిస్సును, అజుషత=సేవించెను. అవీవృధత=యజమానుని వృద్ధినొందించెను. జ్యాయఃమహఃఅకృత=ఆ యజమానునకు అధికమైన తేజస్సును చేసెను. అగ్నిఃనరాశంసనామకుఁడైన యగ్ని, ఇదం హవిఃఅజుషత. అవీవృధత. జ్యాయఃమహఃఅకృత. (ఈ పదముల కన్నింటి కర్థము పూర్వవత్తు.)

ప్రజాపతిః=ప్రజాపతి, ఇదం హవిః, అజుషత. అవీవృధత. జ్యాయః మహః, అకృత. (అర్థము పూర్వవత్తు.) అగ్నిషోమౌ=అగ్నీషోమదేవతలు, ఇదం హవిః, అజుషేతామ్=సేవించిరి. అవీవృధేతామ్=యజమానుని వృద్ధినొందించిరి. జ్యాయః మహః అక్రాతామ్=యజమానునకు అధికమైన తేజస్సును చేసిరి.

ఇన్ద్రాగ్నీ=ఇంద్రాగ్నిదేవతలు, ఇదం హవిః, అజుషేతామ్. అవీవృధేతామ్. జ్యాయః మహః, అక్రాతామ్. (అర్థము పూర్వవత్తు.) ఇన్ద్రః=ఇంద్రుడు, ఇదం హవిః, అజుషత. అవీవృధత. జ్యాయః మహః అకృత. మహేన్ద్రః=మహేంద్రుడు, ఇదం హవిః, అజుషత. అవీవృధత. జ్యాయః మహః అకృత. ఆజ్యపాః=ఆజ్యమును త్రాగునట్టి, దేవాః=దేవతలు, ఆజ్యమ్=ఆజ్యమును (నేతిని), అజుషన్త=సేవించిరి. (త్రాగిరి). అవీవృధన్త= యజమానుని వృద్ధినొందించిరి. జ్యాయః మహః అక్రత=ఆ యజమానునకు అధికమైన తేజస్సును చేసిరి. అగ్నిః=స్విష్టకృదగ్ని, హోత్రేణ=హోమనిమిత్తముచే (హోమమునకు స్విష్టకృత్త్వమును చేయుటచే), ఇదం హవిః=ఈ హవిస్సును, అజుషత=సేవించెను. అవీవృధత= యజమానుని వృద్ధినొందించెను. జ్యాయః మహః, అకృత=ఆ యజమానన కధికమైన తేజస్సును చేసెను.

తాత్పర్యము : ఆజ్యభాగదేవతయగు నగ్ని,సోమదేత, నరాశంసనామకాగ్నిదేవత, ప్రజాపత్యాది స్విష్టకృదగ్న్యంతదేవతలు ఈదత్తమైన హవిస్సును సేవించి, యజమానుని వృద్ధినొందించి యా యజమానున కధికమైన తేజస్సును చేసిరని తాత్పర్యార్థము. ఇది సూక్తవాకముయొక్క ద్వితీయభాగము. ప్రథమభాగమునందలి 'ఆర్ధ్న సూక్తవాకమ్' అను దానిచే 'వయం వృద్ధిం ప్రాప్తాః=మేము వృద్ధినొందితిమని' స్వకీయాభివృద్ధి చెప్పబడినది. ఇపుడు ''అగ్నిరిదగ్ం హవిరజుషత'' ఇత్యాదులచే దేవతావిషయాభివృద్ధి చెప్పబడినది.

3. మంత్రము : **అస్యామృధద్ధోత్రాయా దేవంగమాయామ్ । ఆశాస్తేకయం యజమానోకసౌ । ఆయురాశాస్తే ।**

సుప్రజాస్త్వమాశాస్తే । సజాతవనస్యామాశాస్తే (4) । ఉత్తరాం దేవయజ్యామాశాస్తే । భూయో

హవిష్కరణమాశాస్తే । దివ్యం ధామాకాశాస్తే । విశ్వం ప్రియమాశాస్తే । యదనేన హవిషాకాశాస్తే ।

తదశ్యాత్తదృధ్యాత్ । తదస్మై దేవా రాసన్తామ్ । తదగ్నిర్దేవో దేవేభ్యో వనతే । వయమగ్నేర్మానుషాః ।

ఇష్టం చ వీతం చ । ఉభే చ నో ద్యావాపృథివీ అగ్ంహసః పాతామ్ । ఇహ గతిర్వామస్యేదం చ ।

నమో దేవేభ్యః (5) ।

అభయంకృతావకృతాగ్నిరిదగ్ం హవిరజుషత మహేన్ద్ర ఇదగ్ం హవిరజుషత సజాతవనస్యామాశాస్తే

వీతం చ త్రీణి చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే దశమోనువాకః ॥౧౦॥

అర్థము : అస్యాం హోత్రాయామ్=సూక్తవాకపాఠపూర్వకమైన యీ ప్రస్తరప్రహరణరూప హోమక్రియ, దేవంగమాయాం సత్యామ్=దేవతలను పొందుచున్నదగుచుండఁగా, యజమానఃయజమానుఁడు, ఋధత్=సమృద్ధిని పొందుఁగాక. అసౌ=విష్ణు, రుద్రాదిశర్మయైన, అయం యజమానఃఈ యజమానుఁడు, ఆశాస్తే=ప్రార్థించుచున్నాఁడు. ఆయుఃఆశాస్తే=తనకు ఆయువును ప్రార్థించుచున్నాఁడు. సుప్రజాస్త్వమ్=శోభన సంతానవత్త్వమును, ఆశాస్తే=ప్రార్థించుచున్నాఁడు. సజాతవనస్యామ్=సమాన జాతీయులచే తాను సేవించఁబడుటను, ఆశాస్తే. ఉత్తరాం దేవయజ్యామ్=కాలాంతరభావినియైన యిష్టిని, ఆశాస్తే. భూయఃహవిష్కరణమ్=ప్రభూత సోమయాగరూపమైన హవిష్క్రియను, ఆశాస్తే. దివ్యం ధామ=స్వర్గస్థానమును, ఆశాస్తే.

(కిం బహునా? వేయేల?) విశ్వం ప్రియమ్=సమస్తమైన ప్రియమును (ఇష్టమును), ఆశాస్తే. అనేన హవిషా=ఈ ప్రస్తరాఖ్యమైన హవిస్సుచే, యత్ ఆశాస్తే=ఏ ఫలమును యజమానుఁడు ప్రార్థించుచున్నాఁడో, తత్ అశ్యాత్=ఆ ఫలము భుజించుఁగాక. తత్=ఆ ఫలము. ఋధ్యాత్=సమృద్ధ మగుఁగాక. తత్=ఆ ఫలమును, అస్మై=ఈ యజమానునికొఱకు, దేవాఃఅగ్న్యాదిదేవతలు, రాసన్తామ్=సాధింతురు గాక. తత్=ఆ ఫలమును, అగ్నిఃదేవఃఅగ్నిదేవుఁడు, దేవేభ్యఃసర్వదేవతలనుండి, (ఆనీయ=తెచ్చి,) వనతే=యజమానుని తత్ఫలభాగునిగా చేయుచున్నాఁడు. వయమ్=హోత్రాదులమైన మేము, మానుషాఃసన్తఃమనుష్యసంబంధుల మగుచు, ఇష్టమ్=వాగనిమిత్తమును, స్వర్గసాధనమును, పుణ్యరూపమునైన దైవమును (యజ్ఞకర్మమును), చ=మఱియు, వీతమ్=అశన ఖాదిరూపమైన మానుషమును, (అగ్నేః=అగ్నియొక్క, ప్రసాదాత్=అనుగ్రహమువలన, మనుష్యేభ్యఃఆనయామఃమనుష్యులకొఱకు తెచ్చుచున్నాము.) ద్యావా పృథివీ ఉభే చ=ద్యావాభూము లుభయములు కూడ, నఃమమ్ము, అంహసఃఫలప్రతిబంధకమైన పాపమునుండి, పాతామ్=రక్షించుఁగాక. ఇహ=ఈ కర్మయందు, వామస్య=కమనీయమైన ధనముయొక్క, గతిఃప్రాప్తి, అస్తు=కలుగుఁగాక. ఇదం చ=ఈ హవిస్సు కూడ, (దేవైఃదేవతలచే, స్వీక్రియతామ్ =స్వీకరించఁబడుఁగాక.) నమఃనమస్కారము, దేవేభ్యఃదేవతలకొఱకు, అస్తు=అగుఁగాక.

తాత్పర్యము : సూక్తవాకపాఠముతో ఈ ప్రస్తరప్రహరణరూప హోమక్రియ దేవతలను పొందుచుండఁగా యజమానుఁడు వృద్ధినొందుఁగాక. విష్ణుశర్మ, లేదా- రుద్రశర్మ ఇత్యాదినామధేయుఁడైన యీ యజమానుఁడు ఆయురాదికమైన యాశీస్సును కోరుచున్నాఁడు. ఈ ప్రస్తరాఖ్యమైన హవిస్సుచే యజమానుఁడు తాను కోరిన ఫలము ననుభవించుఁగాక. ఆ ఫలము సమృద్ధ మగుఁగాక. దేవత లా ఫలమును యజమానునికై సాధింతురు గాక. అగ్నిదేవుఁడు సర్వదేవతలనుండి ఆ ఫలమును తెచ్చి యజమానుని తత్ఫలభాక్కుగాఁ జేయుచున్నాఁడు. అనఁగా అగ్నిదేవతలకై యాచించుచున్నాఁడనియు, మనుష్యహోత్రాదులమైన మేము మనుష్యులకొఱకు యాచించుచున్నా మనియు నర్థము. ద్యావాభూము లుభయములును మమ్ము ఫలప్రతిబంధకమైన పాపమునుండి రక్షించుఁగాక. ఈ కర్మయందు కమనీయమైన ధనము లభించుఁగాక. ఈ హవిస్సును దేవతలు స్వీకరింతురు గాక. ఇది సూక్తవాకముయొక్క చరమభాగము. ఈ సూక్తవాకమునకు బ్రాహ్మణము ద్వితీయకాండమునందలి షష్ఠప్రపాఠకగత నవమానువాకమునందు చెప్పఁబడినది. ఆ బ్రాహ్మణమచటనే సవిశేషముగ వ్యాఖ్యానించఁబడినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున పంచమ ప్రపాఠకమునందు
దశమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే ఏకాదశోఽనువాకః

1. మంత్రము : **తచ్ఛంయోరావృణీమహే। గాతుం యజ్ఞాయ । గాతుం యజ్ఞపతయే । దైవీ స్వస్తిరస్తు నః ।**

స్వస్తిర్మానుషేభ్యః । ఊర్ధ్వం జిగాతు భేషజమ్ । శం నో అస్తు ద్విపదే । శం చతుష్పదే (1) ।

తచ్ఛంయోరష్టౌ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే ఏకాదశోఽనువాకః ॥౧౧॥

వేదార్థదీపిక

అవతారిక: దశమానువాకమునందు అనూయాజసూక్తవాక మామ్నాత మైనది. ఈ యేకాదశానువాకమునందు శంయువాకమంత్రము చెప్పఁబడుచున్నది. ఈ శంయువాకమంత్రమునకు బ్రాహ్మణము సంహితయందలి ద్వితీయకాండమునఁ గల షష్ఠప్రపాఠకగత దశమానువాకమునం దభిహిత మైనది.

అర్థము : తత్=అటువంటి ప్రశస్తమైన ఫలమును, శంయోఃశంయు నామకుఁడైన బృహస్పతి కుమారునినుండి, ఆవృణీమహే=ప్రార్థించుచున్నాము. (కిం తత్ఫలమ్? ఇతి=ఆ ఫలమేది? అని అనఁగా-క్రమేణ ఉచ్యతే=క్రమముగఁ జెప్పఁబడుచున్నది.)-

యజ్ఞాయ గాతుమ్=దేవతలను గూర్చి యజ్ఞమునొయొక్క గమనమును, ఆవృణీమహే=ప్రార్థించుచున్నాము. యజ్ఞపతయే గాతుమ్=దేవతలను గూర్చి యజ్ఞపతియొక్క గమనమును, ఆవృణీమహే. నఃమాకు, దైవీ స్వస్తిఃదేవనిమిత్తమైన విఘ్నోపశమనము, అస్తు=అగుఁగాక. మానుషేభ్యఃమా పుత్ర పౌత్రాదిరూప మనుష్యులకొఱకు, స్వస్తిఃదేవనిమిత్తమైన విఘ్నోపశమనము, అస్తు=అగుఁగాక. భేషజమ్=సర్వపాపములకు ఔషధమైన యీ కర్మము, ఊర్ధ్వం జిగాతు=అవిఘ్నముగ సమాప్తి నొందుఁగాక. నఃమాయొక్క, ద్విపదే= మనుష్యునికొఱకు, శమ్=సుఖము, అస్తు=అగుఁగాక. చతుష్పదే=పశువుకొఱకును, శమ్=సుఖము, అస్తు=అగుఁగాక.

తాత్పర్యము : 'మేము చేయునట్టి యజ్ఞము దేవతలను పొందవలెను. యజ్ఞపతియు దేవతలను పొందవలెను. మాకు దేవనిమిత్తమైన విఘ్నోపశమనము కలుగుఁగాక. మా పుత్ర పౌత్రాది మనుష్యులకు విఘ్నోపశమనము కలుగుఁగాక. సర్వపాపములకు ఔషధమైన యీ కర్మము నిర్వఘ్నముగ సమాప్తి నొందుఁగాక. మా మనుష్యునకు, మా పశువునకును సుఖము కలుగుఁగాక' అనునట్టి యటువంటి ప్రశస్తమైన ఫలమును బృహస్పతికుమారుఁడైన శంయువాకునినుండి కోరుచున్నాము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున పంచమప్రపాఠకమునందు
ఏకాదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే
ద్వాదశోఽనువాకః

1. మంత్రము : **ఆప్యాయస్వ సం తే । ఇహ త్వష్టారమగ్రియం తన్నస్తురీపమ్ ।**

వేదార్థదీపిక

అవతారిక: ఏకాదశానువాకమునందు శంయువాకమంత్ర మామ్నాత మైనది. ఈ ద్వాదశానువాకమునందు పత్నీసంయాజులకు యాజ్యానువాక్య లామ్నాతము లైనవి.

వివరణము: ''ఆప్యాయస్వ సమేతు తే'' అను ఋక్కు సోమదేవునకు పురోనువాక్య. ''సం తే పయాగ్ంసి'' అను ఋక్కు సోమునకు యాజ్య. 'ఆప్యాయస్వ' 'సంతే' అనునట్టి యీ రెండు ఋగ్భాగములు ఆ ఋక్కులకు ప్రతీకములు. ఈ యుభయము చతుర్థకాండము యొక్క ద్వితీయ ప్రపాఠకమునందు వ్యాఖ్యానించబడినది. 'ఇహత్వష్టారమ్' అను ప్రతీకము కల ఋక్కు త్వష్టకు పురోనువాక్య. 'తన్నస్తురీపమ్' అను ప్రతీకము కల ఋక్కు త్వష్టకు యాజ్య. ఈ యుభయము తృతీయకాండము యొక్క ప్రథమప్రపాఠకము నందు వ్యాఖ్యానించబడినది.

2. మంత్రము : **దేవానాం పత్నీరుశతీరవన్తు నః । ప్రావన్తు నస్తుజయే వాజసాతయే । యాः పార్థివాసో యా అపామపివ్రతే।**

తా నో దేవీः సుహవాः శర్మ యచ్ఛత ।

అర్థము : దేవానాం పత్నీः (పత్న్యः)=ఇంద్రాణ్యాదులైన దేవపత్నులు, ఉశతీः=మా హితమును కోరుచున్నవారై, నः=మమ్ము, అవన్తు=రక్షింతురు గాక. (కించ=మఱియు,) తుజయే=అపత్యముకొఱకు, వాజసాతయే=ధనలాభముకొఱకును, నः=మమ్ము, ప్రావన్తు=ప్రకర్షముగ, రక్షింతురు గాక. యాः=ఎవరు, పార్థివాసः=పృథివి యందు ఉన్నటువంటి దేవపత్నులో, యాः అపి=ఇంకను ఇతరు లెవరు, అపాంవ్రతే=వృష్ట్యుదక స్థానముగ ఉపలక్షితమైన యంతరిక్షమునందు ఉంటున్నారో, తాः=అటువంటి, సుహవాः=సుఖముగ నాహ్వానింప శక్యులైన, దేవీः=దేవతలైన మీరు, నः=మాకు, శర్మ=సుఖమును, ప్రయచ్ఛత=ప్రకర్షముగ నొసఁగుఁడు.

తాత్పర్యము : ఇంద్రాణ్యాదులైన దేవపత్నులు మా హితమును కోరుచున్నవారై మమ్ము రక్షింతురు గాక. పరులచే నాపాదించబడిన యరిష్టమును వారింతురు గాక యని యర్థము. మఱియు సంతానముకొఱకు, ధనలాభముకొఱకును మమ్ము ప్రకర్షముగ రక్షింతురు గాక. కేవలము దివియందు ఉన్నట్టి యింద్రాణ్యాదులే కాదు. మఱేమనఁగా - భూమియందు ఉన్నటువంటి దేవపత్నులు, అంతరిక్షమునందుఁ గల దేవపత్నులునగు ఓ సర్వదేవపత్నులారా! సుఖముగ నాహ్వానింప శక్యులై మీరు మాకు సుఖమును ప్రకర్షముగ నొసఁగుఁడు. ఇది దేవపత్నీపురోనువాక్య.

3. మంత్రము : **ఉత గ్నా వియన్తు దేవపత్నీః । ఇన్ద్రాణ్యగ్నాయ్యశ్వినీ రాట్ । ఆ రోదసీ వరుణానీ శృణోతు । వియన్తు దేవీర్య ఋతుర్జనీనామ్ ।**

అర్థము : ఉత=మఱియు, గ్నాః దేవపత్నీః=ఛందోదేవతలైన గాయత్ర్యాదిదేవపత్నులు, (ఇదమ్=ఈ హవిస్సును,) వియన్తు=భక్షించుదురు గాక. ఇన్ద్రాణీ=ఇంద్రపత్ని, అగ్నాయీ=అగ్నియొక్క పత్ని, అశ్వినీ=అశ్వినులపత్ని, రాట్=సోమరాజుయొక్క పత్ని, రోదసీ=రుద్రపత్ని, వరుణానీ=వరుణపత్నియు, ఆశృణోతు=అంతటను ప్రతియొక్కరును వినుఁగాక. జనీనామ్=ఇంద్రాణ్యాదులకు, యః ఋతుః=ఏది భోజనమునకై యుచిత కాలమో, దేవీః=ఇంద్రాణ్యాది దేవతలు, తస్మిన్ కాలమునందు, వియన్తు=హవిస్సును భుజింతురు గాక. పురుషదేవతలైన సోమ త్వష్టలు భుజించినయనంతరము ఇంద్రాణాద్యులు భుజింతురు గాక యని యర్థము.

తాత్పర్యము : ఇంకను ఛందోదేవతలైన గాయత్ర్యాది దేవపత్ను లీహవిస్సును భుజింతురు గాక. ఇంద్రపత్ని, అగ్నిపత్ని, అశ్వినులపత్ని, సోమరాజుయొక్క పత్ని, రుద్రపత్ని, వరుణపత్ని అను వారిలో ప్రతియొకరును మా విజ్ఞాపనను వినుఁగాక. ఇంద్రాణ్యాదులకు భోజనమునకై యుచితమని నిర్దిష్టమైన కాలమందు ఇంద్రాణ్యాదులు హవిస్సును భుజింతురు గాక. అనఁగా పురుషదేవతలైన సోమ త్వష్టలు భుజించినయనంతరము ఇంద్రాణ్యాదులు భుజింతురు గాక యని యర్థము. ఇది దేవపత్నులకు యాజ్య.

4. మంత్రము : **అగ్నిర్హోతా గృహపతిః స రాజా । విశ్వా వేద జనిమా జాతవేదాః । దేవానాముత యో మర్త్యానామ్ । యజిష్ఠః స ప్రయజతా మృతావా ।**

అర్థము : (అయమ్) అగ్నిః=ఈ యగ్ని, హోతా=దేవతల, నాహ్వానించువాఁడు. గృహపతిః=గృహములకు పాలకుఁడు, సః=అతఁడు, రాజా=దీప్యమానుఁడు. (తాదృశః) జాతవేదాః=పుట్టుచునే సర్వమును తెలిసికొనిన యటువంటి యగ్ని, దేవానామ్=దేవతలయొక్క, విశ్వా జనిమా=సర్వజన్మములను, వేద=తెలిసికొనెను. అపి చ=మఱియు, యః జాతవేదాః=ఏ జాతవేదాగ్ని, మర్త్యానామ్=మనుష్యులయొక్క, జనిమా=జన్మములను, వేద=తెలిసికొనెనో, సః=ఆ జాతవేదాగ్ని, ప్రయజతామ్=ప్రకర్షముగ యాగమును చేయువారిలో, యజిష్ఠః=అతిశయముగ యష్టృతముఁడు. ఋతావా=సత్యమును వచించువాఁడు.

తాత్పర్యము : హోతృత్వాది విశేషణ విశిష్టుఁడైన గార్హపత్యాగ్ని అతిశయముగ యష్టృతముఁడు, సత్యవచనుఁడును. ఈ ఋక్కు గార్హపత్యాగ్నికి పురోనువాక్య.

5. మంత్రము : **వయము త్వా గృహపతే జనానామ్। అగ్నే అకర్మ సమిధా బృహన్తమ్ । అస్థూరిణో గార్హపత్యాని సన్తు । తిగ్మేన నస్తేజసా సగ్ంశిశాధి (1) ।**

జనీనామష్టా చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే ద్వాదశోఽనువాకః ॥౧౨॥

అర్థము : హే గృహపతే అగ్నే !=గృహపతివైన ఓ యగ్నీ ! జనానామ్=జనులలో, వయము=మేమే, త్వామ్=నిన్ను, సమిధా=బాగుగా జ్వలింపఁజేయుటచే, బృహన్తమ్=ప్రౌఢునిగ, అకర్మ=చేసితిమి. తస్మాత్=ఆ కారణమువలన, గార్హపత్యాని=గృహపతులకు సంయుక్తములైన కర్మలు, నః=మాకు, అస్థూరి సన్తు=అంతటను శ్లిష్టము లగుఁగాక. తిగ్మేన=తీక్ష్ణమైన, తేజసా=తేజస్సుచే, త్వమ్=నీవు, నః=మమ్ము, సంశిధి= తీక్ష్ణీకరించుము. భయరహితులనుగాఁ జేయుమని యర్థము.

తాత్పర్యము : ఓ గార్హపత్యాగ్నీ! జనులలో మేమే నిన్ను బాగుగ జ్వలింపఁజేయుటచే ప్రౌఢునిగఁ జేసితిమి. ఆ కారణమువలన గృహపతులకు సంబంధించిన కర్మలు మాకు అవిచ్ఛిన్నము లగుఁగాక. తీక్ష్ణమైన (శత్రువులచే తిరస్కరింప సాధ్యము కాని) తేజస్సుచే మమ్ము తీక్ష్ణీకరించుము. నిర్భయులనుగఁ జేయుమని యర్థము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున పంచమ ప్రపాఠకమునందు
ద్వాదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే త్రయోదశోఽనువాకః

1. మంత్రము : ఉప॑హూతగ్ం రథం॒తర॑గ్ం స॒హ పృ॒థి॒వ్యా । ఉప॑ మా రథం॒తర॑గ్ం స॒హ పృ॒థి॒వ్యా హ్వ॑యతామ్ ।

ఉప॑హూతం వామ॒దే॒వ్య॑గ్ం స॒హాన్త॑రిక్షేణ । ఉప॑ మా వామ॒దే॒వ్య॑గ్ం స॒హాన్త॑రిక్షేణ హ్వయతామ్ । ఉప॑హూతం

బృ॒హ॒త్స॒హ ది॒వా । ఉప॑ మా బృ॒హ॒త్స॒హ ది॒వా హ్వ॑యతామ్ ఉప॑హూతాః స॒ప్త॒హో॒త్రాః । ఉప॑ మా

స॒ప్త॒హో॒త్రా హ్వ॑యన్తామ్ । ఉప॑హూతా ధే॒నుః స॒హర్ష॑భా । ఉప॑ మా ధే॒నుః స॒హర్ష॑భా

హ్వ॑యతామ్ (1) । ఉప॑హూతో భ॒క్షః స॒ఖా । ఉప॑ మా భ॒క్షః స॒ఖా హ్వ॑యతామ్ ।

ఉప॑హూతాం 3 హో । ఇడోప॑హూతా । ఉప॑హూతేడా । ఉపో॑ అస్మాగ్ం ఇడా హ్వయతామ్ ।

ఇడోప॑హూతా । ఉప॑హూతేడా । మా॒నవీ ఘృ॒తప॑దీ మైత్రా॒వ॒రు॒ణీ । బ్రహ్మ॑ దే॒వ॒కృ॒తము॑పహూతమ్ (2) ।

దైవ్యా॑ అధ్వర్యవ॒ ఉప॑హూతాః । ఉప॑హూతా మనుష్యాః । య ఇమం॑ యజ్ఞమ॒వా॑న్ ।

యే యజ్ఞప॑తీగ్ం వ॒ర్ధాన్ । ఉప॑హూతే॒ ద్యావా॑పృథి॒వీ । పూ॒ర్వ॒జే ఋ॒తావ॑రీ । దే॒వీ దే॒వపు॑త్రే ।

ఉప॑హూతేయం యజ॑మానా । ఇన్ద్రా॑ణీవా॑ కవి॒ధవా । అ॒దితి॑రివ సుపు॒త్రా । ఉత్త॑రస్యాం

దేవ యజ్యా॑యా ము॒ప॑హూతా । భూ॒యసి॑ హవిష్కర॒ణ ఉప॑హూతా । దివ్యే ధా॒మన్నుప॑హూతా ।

ఇద॑ం మే దేవా హవి॒ర్జు॒ష॒న్తా॒మి॒తి తస్మి॑న్నుప॑హూతా । విశ్వ॑మస్యాః ప్రి॒య॒ము॒ప॑హూతమ్ ।

విశ్వ॑స్య ప్రి॒యస్యో॒ప॑హూత॒స్యో॒ప॑హూతా (3) ।

స॒హర్ష॑భా హ్వయతా॒ము॒ప॑హూతగ్ం సుపు॒త్రా షట్ చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమప్రపాఠకే త్రయోదశోఽనువాకః ॥౧౩॥

వేదార్థదీపిక

వివరణము: ఈ యనువాకము, అష్టమానువాక వ్యాఖ్యానముచే గతార్థ మైనది. దీనియర్థతాత్పర్యాదులను అష్టమానువాకవ్యాఖ్యానమునందు చూడవలెను. యజమానార్థ మచట ఉపాహ్వానము చేయఁబడినది. ఇచట పత్న్యర్థము ఉపాహ్వానము చేయఁబడినది. ఈ యుభయమునకు ఇదియే భేదము. కనుకనే యిందు అచటచట స్త్రీలింగప్రయోగము చేయఁబడినది.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమునపంచమప్రపాఠకమునందు త్రయోదశానువాకము సమాప్తము.

సత్యం ప్రవో కగ్నే మహానగ్నిర్హోతా సమిధో కగ్నిర్వ్రత్రాణ్యగ్నిర్మార్డోపహూతం దేవం బర్హిరిదం

ద్యావాపృథివీ తచ్ఛం యోరాప్యాయస్వోపహూతం త్రయోదశ ।

సత్యం వయగ్గ్ం స్యామ వృష్టి ద్యావా నవవిగ్ంశతిః। సత్యముపహూతా ॥

హరిః ఓమ్ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే పఞ్చమః ప్రపాఠకః ॥ 5 ॥

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయకాండములోపంచమప్రపాఠకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
ప్రథమోఽనువాకః

1. మంత్రము : **అఞ్జన్తి త్వామధ్వరే దేవయన్తః । వనస్పతే । మధునా దైవ్యేన । యదూర్ధ్వస్తిష్ఠాద్ద్రవిణేహ ధత్తాత్ ।**

యద్వా క్షయో మాతురస్యా ఉపస్థే, ఇతి ।

అవతారిక: ఈ షష్ఠప్రపాఠకమునందు హౌత్రమైన పాశుకము చెప్పఁబడును. ప్రథమమున యూపసంస్కృతి చెప్పఁబడుచున్నది.

అర్థము : హే వనస్పతే!=ఓ వనస్పతివికారమైన యూపమా! దేవయన్తః=దేవతల నిచ్ఛయించుచున్న ఋత్విజులు, దైవ్యేన=దేవయోగ్యమైన, మధునా=మధురమైన ఆజ్యముచే, త్వామ్=నిన్ను, అఞ్జన్తి=పూయుచున్నారు. యత్=ఏ కారణమువలన, ఊర్ధ్వః తిష్ఠాత్=ఊర్ధ్వమై యుండఁగలవో, ఇహ=ఈ కర్మయందు, ద్రవిణా=ధనములను, దత్తాత్=సంపాదించఁగలవో, యత్ వా=ఏ కారణమువలనఁగూడ, అస్యాః=శ్రేయోనిర్మితయైన యీ వేదియొక్క, ఉపస్థే=పార్శ్వస్థితమైన ప్రదేశమునందు, తవ క్షయః=నీకు నివాసము, భవిష్యతి=కాఁగలదో, తస్మాత్=ఆ కారణమువలన, తదోగ్యతాయై=ఆ యోగ్యతకొఱకు, త్వామ్=నిన్ను, అఞ్జన్తి=మధురాజ్యముచే పూయుచున్నారని పూర్వమునం దన్వయము.

తాత్పర్యము : వనస్పతివికారమైన ఓ యూపమా! నీవు ఊర్ధ్వముగ నుండఁగలవు కనుకను, ఈ కర్మయందు ధనములను సంపాదించఁగలవు కనుకను, శ్రేయోనిర్మితయైన యీ వేదియొక్క పార్శ్వప్రదేశమునందు నీకు నివాసము ఉండఁగలదు కనుకను, ఆ యోగ్యత నీకు సిద్ధించుటకై దేవతలను కోరుచున్న ఋత్విజులు దేవయోగ్యమును, మధురమునైన యాజ్యముచే నిన్ను పూయుచున్నారు. యూపమున కాజ్యమును పూయుచున్నారు. యూపమున కాజ్యమును పూయుటకై చెప్పుమని యధ్వర్యునిచే ప్రేషితుఁడైన హోత యీ ఋక్కును వెంటనే పలుకవలెను. ఇది అంజనార్థమైన ప్రథమ ఋక్కు. ఇచట యూపము నాజ్యముచే పూయునపుడు పఠించవలసిన మంత్ర మొకటి, ఉచ్ఛ్రయణార్థములైన మంత్రములు అయిదు, పరివ్యయణార్థమైన మంత్ర మొకటియుఁ గలవు. యూపాంజనార్థమంత్ర మొక్కటియైనను యూపాంజనము ప్రధానము కనుక ఛత్రిన్యాయముచే ఏడు మంత్రములును యూపాంజనీయములని చెప్పఁబడుచున్నవి.

2. మంత్రము : **ఉచ్ఛ్రయస్వ వనస్పతే । వర్ష్మన్పృథివ్యా అధి । సుమితీ మీయమానః । వర్చోధా యజ్ఞవాహసే, ఇతి ।**

అర్థము : హే వనస్పతే!=వనస్పతివికారమైన ఓ యూపమా! సుమితీ=శోభనమైన స్థాపనముచే స్థాపించఁబడుచున్నదానవును, యజ్ఞవాహసే=యజ్ఞనిర్వాహకుఁడైన యజమానునికొఱకు, వర్చోధాః=దీప్తి నొసఁగు దానవునగు, త్వమ్=నీవు, పృథివ్యాః=పృథివిసంబంధియైన, వర్ష్మన్=ప్రధానమైన యీ ప్రదేశమునందు, అధి=ఉపరిభాగమున, ఉచ్ఛ్రయస్వ=నిలుచుండుము.

తాత్పర్యము : వనస్పతివికారమైన ఓ యూపమా! సుమితీత్యాది విశేషణవిశిష్టమైన నీవు ప్రధానమైన యీ పృథివీప్రదేశమున ఉపరిభాగమునందు నిలుచుండుము. యూపమును భూమియందు నిలువఁబెట్టునపుడు ఋక్కులను

పఠించమని యధ్వర్యునిచే ప్రేషితుcడైన హోత వెంటనే పఠించవలసిన యైదుఋక్కులలో నిది ప్రథమఋక్కు.

3. మంత్రము : **సమిద్ధస్య శ్రయమాణః పురస్తాత్ । బ్రహ్మ వన్వానో అజరగ్ం సువీరమ్ (1) । ఆరే అస్మదమతిం బాధమానః । ఉచ్ఛ్రయస్వ మహతే సౌభగాయ, ఇతి ।**

అర్థము : హే యూప!=ఓ యూపమా! సమిద్ధస్య=బాగుగ జ్వలించిన ఆహవనీయాగ్నికి, పురస్తాత్=పూర్వదిక్కునందు, శ్రయమాణః=ఆశ్రయించి ఉంటున్నదానవును, అజరమ్=వినాశరహితమును, సువీరమ్=శోభనపుత్ర పౌత్రాది సమృద్ధి కారణమును, బ్రహ్మ=పరివృఢమునగు, ఇదమ్=ఈ కర్మను, వన్వానః=సేవించుచున్నదానవును, అమతిమ్=మా యజ్ఞానమును, అస్మత్=మానుండి, ఆరే=దూరమునందు, బాధమానః=నశింపcజేయుచున్నదానవునగు, త్వమ్=నీవు, మహతే సౌభగాయ=యజమానునియొక్క అధిక సౌభాగ్యముకొఱకు, ఉచ్ఛ్రయస్వ=ఉచ్ఛ్రిత మగుము.

తాత్పర్యము : ఓ యూపమా! నీవు యజమానునియొక్క అధిక సౌభాగ్యసిద్ధికొఱకు నిలుచుండుము. నీవు బాగుగ జ్వలించిన యాహవనీయాగ్నికి పూర్వదిక్కునం దాశ్రయించి యున్నదానవు, అవినాశమును, శోభన పుత్ర పౌత్రాదిసమృద్ధికారణమును. పరివృఢమునగు ఈ కర్మను సేవించుచున్నదానవు. మా యజ్ఞానమును మానుండి దూరమున నశింపcజేయుదానవు నగుచున్నావు. హోతచే అనువక్తవ్యములైన యైదుఋక్కులలో నిది ద్వితీయము.

4. మంత్రము : **ఊర్ధ్వ ఊషణ ఊతయే । తిష్ఠా దేవో న సవితా । ఊర్ధ్వో వాజస్య సనితా యదఞ్జిభిః । వాఘద్భిర్విహ్వయామహే, ఇతి ।**

అర్థము : హే యూప!=ఓ యూపమా! యత్=ఏ కారణమువలన, అఞ్జిభిః=క్రతువు నభివ్యక్తము చేయువారును, వాఘద్భిః=క్రత్వనుష్ఠానభారమును వహించుచున్నవారునగు, ఋత్విజులతోc గూడ, సహితాః=కూడినవారమగు, వయమ్=మేము, విహ్వయామహే=విశేషముగ నిన్ను ఆహ్వానించుచున్నామో, తత్=ఆ కారణమువలన, ఊర్ధ్వే=ఉపరిభాగమున, (వర్తమానః=ఉంటున్న,) సవితా దేవః న=సూర్యదేవునివలె, నః=మాయొక్క, ఊతయే=రక్షణముకొఱకు, ఊర్ధ్వః ఊ=ఊర్ధ్వాకారముగానే, సుతిష్ఠా=సుష్ఠుగ నుండుము.

తాత్పర్యము : ఓ యూపమా! క్రతువు నభివ్యక్తముచేయువారును, క్రత్వనుష్ఠానభారమును వహించుచున్నవారునునగు ఋత్విజులతోc గూడినవారమై మేము నిన్ను ఆహ్వానించుచున్నాము కనుక ఉపరిదేశమునందు ఉంటున్న సూర్యదేవునివలె మా రక్షణమునకై యూర్ధ్వాకారముగానే సుష్ఠుగ నుండుము. ఈ ఋక్కు హోతచే అనువక్తవ్యములైన ఋక్కులలో తృతీయము.

5. మంత్రము : **ఊర్ధ్వో నః పాహ్యగ్ంహసో ని కేతునా । విశ్వగ్ం సమత్రిణం దహ। కృధీ న ఊర్ధ్వాన్ చ రథాయ**

జీవసే । విదా దేవేషు నో దువః (2), ఇతి ।

అర్థము : హే యూప!=ఓ యూపమా!, త్వమ్=నీవు, ఊర్ధ్వ: సన్=ఊర్ధ్వమగుచు, కేతునా=ప్రజ్ఞచేత, నః=మమ్ము, అంహసః=పాపమునుండి, నిపాహి=గట్టిగా పాలింపుము. అత్రిణమ్=భక్షణశీలము కల రాక్షసాదికమును, విశ్వమ్=సమస్తమును, సందహ=సమూహముగ జేసి దగ్ధము చేయుము. కించ=మఱియు, రథాయ జీవసే=రథారోహణపూర్వకమైన జీవనముకొఱకు, నః=మమ్ము, ఊర్ధ్వాన్=ఉచ్ఛ్రితులనుగా, కృధీ=చేయుము. నః=మాయొక్క, దువః=పరిచర్యను, దేవేషు=దేవతలందు, విదా=చెప్పుము. (వేదయ, కథయ ఇతి విద్యారణ్యమ్.)

తాత్పర్యము : ఓ యూపమా! నీవు ఊర్ధ్వమగుచు ప్రజ్ఞచే మమ్ము పాపమునుండి మిక్కిలి రక్షించుము. భక్షించునట్టి స్వభావము కల రాక్షసాదికమును సర్వమును సమూహముగజేసి భస్మము చేయుము. ఇంకను రథారోహణ యోగము కల జీవనముకొఱకు మమ్ము ఉచ్ఛ్రితులనుగాc జేయుము. మా పరిచర్యను దేవతలందు చెప్పుము. ఇది హోతచే ననువక్తవ్యములైన ఋక్కులలో చతుర్థము.

6. మంత్రము : **జాతో జాయతే సుదినత్వే అహ్నామ్ । స మర్య ఆ విదథే వర్ధమానః । పునన్తి ధీరా అపసో మనీషా ।**

దేవయా విప్ర ఉదియర్తి వాచమ్, ఇతి ।

అర్థము : అయం యూపః=ఈ యూపము, జాతః అపి=నిత్యప్రాదుర్భూతమైనను, అహ్నామ్=అహస్సులలో, సుదినత్వే=యాగయుక్తమైన అహస్సునకు సుదినత్వమునకై (చతుర్థ్యర్థే సప్తమీ.), పునరపి=మఱల కూడ, ఆజాయతే=అభిముఖగ ప్రాదుర్భవించుచున్నది. సః=ఆ యూపము, మర్యైః=యజమానాదులైన మనుష్యులతో, యుక్తే=కూడిన, విదథే=యజ్ఞదేశమునందు, ఆ=అంతటను, వర్ధమానః= వృద్ధినొందుచున్నదై, అస్తే=ఉంటున్నది. ధీరాః=ధీమంతులైన యజమానాదులు, అపసః=నిమిత్తీభూతమైన కర్మవలన, మనీషా=స్వకీయబుద్ధిచే, పునన్తి=ఆ యూపమును శోధించుచున్నారు. విప్రః=ఋత్విక్సంఘము, దేవయా(మ్)=దేవతలను పొందునట్టి, వాచమ్=యూపస్తుతిరూప వాక్కును, ఉదియర్తి=బహిర్గతము చేయుచున్నది.

తాత్పర్యము : ఈ యూపము నిత్యప్రాదుర్భూతమైనను దినములలో యాగయుక్తమైన అహస్సునకు సుదినత్వము సిద్ధించుటకై మఱల మాకొఱకభిముఖముగ ప్రాదుర్భవించుచున్నది. అటువంటి యీ యూపము యజమానాదులతోc గూడియున్న యజ్ఞదేశమునం దంతటను వర్ధమానమై యుంటున్నది. ధీమంతులైన యజమానాదులు నిమిత్తభూతకర్మవలన స్వబుద్ధిచే ఈ యూపమును పవిత్రము చేయుచున్నారు. ఋత్విక్సంఘము దేవతలను పొందునట్టి యూపస్తుతిరూప వాక్కును బహిర్గతము చేయుచున్నది. ఇది హోతచే ననువక్తవ్యఋక్కులలో పంచమము.

7. మంత్రము : **యువా సువాసాః పరివీత ఆగాత్ । స ఉ శ్రేయాన్భవతి జాయమానః ।తం ధీరాసః కవయ ఉన్నయన్తి।**

స్వాధియో మనసా దేవయన్తః, ఇతి ।

అర్థము : (యథా=ఏ విధముగ, లోకే=లోకమునందు,) సువాసాః=శోభనవస్త్రోపేతుఁడైన, యువా=యువకుఁడు, ఆగాత్=ముందు వచ్చుచున్నాఁడో, (ఏవమ్=ఈ విధముగ, అయం యూపః=ఈ యూపము,) పరివీతః=రశనచే చుట్టఁబడినదై, ఆగాత్=ఈ కర్మయందు వచ్చినది. సః ఉ=ఆ యూపమే, జాయమానః=ఈ కర్మయందు నిష్పద్యమానమై, శ్రేయాన్ భవతి=ప్రతిదినమునందు ప్రశస్యతర మగుచున్నది. తమ్=ఆ యూపమును, స్వాధియః=స్వతంత్రబుద్ధికలవారును, మనసా దేవయన్తః=స్వీయమనస్సుచే దేవతలను కోరుచున్నవారును, ధీరాసః=బుద్ధిమంతులును, కవయః=విద్వాంసులునగు యజమానాదులు, ఉన్నయన్తి=స్తూయమానములైన గుణములచే ఉన్నతమును చేయుచున్నారు. రశన=పదియారు పేటలు కల ఆఁడుదానిమొలనూలు.

తాత్పర్యము : లోకమునందు శోభనవస్త్రోపేతుఁడైన యువకుఁడు అగ్రగామియై వచ్చుచున్నవిధముగ ఈ యూపము రశనాపరివేష్టితమై యీ కర్మయందు వచ్చినది. ఆ యూపకు యీ కర్మయందు నిష్పద్యమానమై, ప్రతిదినము ప్రశస్యతర మగుచున్నది. స్వతంత్రబుద్ధులును, స్వీయమనస్సుచే దేవతలను కోరుచున్నవారును, బుద్ధిమంతులును, విద్వాంసులునగు యజమానాదు లా యూపమును స్తూయమాన గుణములచే ఉన్నతము చేయుచున్నారు. పరివీయమాణ యూపమునకై ఋక్కును పఠించుమని యధ్వర్యునిచే ప్రేషితుఁడైన హోత పఠించవలసిన ఋక్కు ఇది.

8. మంత్రము : **పృథుపాజా అమర్త్యః । ఘృతనిర్ణిక్స్వాహుతః । అగ్నిర్యజ్ఞస్య హవ్యవాట్, ఇతి ।**

అర్థము : అయమ్ అగ్నిః=ఈ యగ్ని, పృథుపాజాః=విస్తీర్ణబలుఁడు. అమర్త్యః=మరణరహితుఁడు. ఘృతనిర్ణిక్=ఘృతశోధకుఁడు. స్వాహుతః=సుష్ఠుగ హోమముచే పూజితుఁడు. యజ్ఞస్య హవ్యవాట్=యజ్ఞ సంబంధియైన హవిస్సును వహించువాఁడు.

తాత్పర్యము : ఈ యగ్ని పృథుపాజత్వాది గుణయుక్తుఁడు. ఈ ఋక్కును, ''తగ్ం సబాధః'' అను వక్ష్యమాణ ఋక్కును పఠించుచు రెండు సమిధల నగ్నియందుంచవలెను. ఇది ప్రథమఋక్కు.

9. మంత్రము : **తగ్ం సబాధో యతస్రుచః । ఇత్థా ధియా యజ్ఞవన్తః । ఆచక్రుర్గ్నిమూతయే, ఇతి ।**

అర్థము : సబాధః (ధాః)=యజ్ఞవిఘ్నములను బాధించుచున్నవారును, యతస్రుచః=హోమమునకై స్రుక్కును నిరంతరము కదలించుచున్నవారును, ఇత్థా=ఈ ప్రకారముగ, ధియా=ప్రజ్ఞచే, యజ్ఞవన్తః=బాగుగ యాగములను చేయుచున్నవారునగు, ఋత్విజః=ఋత్విక్కులు, తమ్=పూర్వోక్తాగ్నిని, ఊతయే=రక్షణముకొఱకు, ఆచక్రుః=ఆహ్వానించుచున్నారు (ఆహ్వానము చేయుచున్నారు).

తాత్పర్యము : 'సబాధుః' ఇత్యాది విశేషణ విశిష్టులైన ఋత్విజులు పూర్వోక్తాగ్నినే రక్షణముకొఱకాహ్వానించుచున్నారు. హోత పఠించు ఋక్కులలో నిది ద్వితీయము.

10. మంత్రము :**త్వం వరుణ ఉత మిత్రో అగ్నే । త్వాం వర్ధన్తి మతిభిర్వసిష్ఠాः । త్వే వసు సుషణానాని సన్తు ।**

యూయం పాత స్వస్తిభిः సదా నः (3), ఇతి ।

సువీరం దువः స్వాహాతోకష్టా చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే ప్రథమోఽనువాకः ॥౧॥

అర్థము : హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, వరుణः=అనిష్టనివారకుఁడ వగుటవలన వరుణుఁడవు, అసి=అగుచున్నాఁవు. ఉత=మఱియు, మిత్రः=ఇష్టప్రాపకుఁడ వగుటవలన మిత్రుఁడవు, అసి=అగుచున్నావు. వసిష్ఠాः=వసిష్ఠగోత్రోత్పన్నులైన పురుషులు, త్వామ్=నిన్ను, మతిభిः=మననీయములైన స్తుతులచే, వర్ధన్తి=పోషించుచున్నారు. సుషణానిని=సుష్ఠగ దానము చేయుటకు యోగ్యములైన, వసు (వసూని) ధనములు, త్వే=నీయందు, సన్తు=ఉండుగాఁక. యూయమ్=మీరు, (సపరివారాः=పరివారసహితులై,) స్వస్తిభిः=క్షేమములచే, నः=మమ్ము, సదా=ఎల్లవేళలందు, పాత=రక్షించుఁడు.

తాత్పర్యము : స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
ప్రథమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
ద్వితీయోఽనువాకః

1. మంత్రము : **హోతా యక్షదగ్నిగ్ం సమిధా సుషమిధా సమిద్ధన్నాభా పృథివ్యాః సంగథే వామస్య । వర్ష్మన్దివ ఇడస్పదే వేత్వాజ్యస్య హోతర్యజ, ఇతి ।**

అవతారిక: ప్రథమానువాకమునందు యూపసంస్కారములు చెప్పcబడినవి. ఇcక ఈ ద్వితీయానువాకమునందు ప్రయాజవిషయములైన ప్రైషమంత్రములు చెప్పcబడుచున్నవి.

అర్థము : హోతా=దేవతలసంబంధియైన హోత, వామస్య=కోరcదగిన ధనమునకు, సంగథే=సమ్యక్ప్రాప్తి నిమిత్తమైనదియు, దివః=ద్యులోకమునకు (ద్యులోకవాసులకు), వర్ష్మన్=ఉచ్ఛ్రయకారియు, ఇడస్పదే=అన్నమును ప్రాపింపcజేయునదియునగు, పృథివ్యాః=వేదిరూపపృథివికి సంబంధించిన, నాభా(భౌ)=ఉత్తరవేదిమధ్యగతమైన యుత్తరనాభియందు, సుషమిధా=శోభనసమింధనముచేత, సమిద్ధమ్=బాగుగ జ్వలించినవాcడును, సమిధా=సమిధనామక ప్రథమ ప్రయాజదేవతతో, సహితమ్=కూడినవాcడునగు, అగ్నిమ్=అగ్నిని, యక్షత్=పూజించుcగాక. అగ్నిః=సమిద్దేవతాయుక్తుcడైన యగ్ని, ఆజ్యస్య వేతు=ఈ యాజ్యమును త్రాగుcగాక. హే హోతః!=ఓ మానుషహోతా! యజ=యాజ్యను పఠించుము.

తాత్పర్యము : దైవ్యహోత సమిధనామక ప్రథమ ప్రయాజదేవతతోcగూడియుండిన యగ్నిని పూజించుcగాక. ఆ యగ్ని ఉత్తరవేదిమధ్యమునc గల ఉత్తరనాభియందు శోభనమైన సమింధనముచే బాగుగ జ్వలించినవాcడు. ఆ నాభిస్థానము సేవింపcదగిన ధనమును లభింపcజేయునది. ద్యులోకవాసులకు ఔన్నత్యమును కలుగcజేయునది. అన్నప్రాపకము కూడ. ఆ సమిద్దేవతాయుక్తుcడైన యగ్ని ఈ యాజ్యమును త్రాగుcగాక. ఓ మానుషహోతా! యాజ్యను పఠించుము. మైత్రావరుణుcడును ఋత్విజుcడు యాజ్యను పఠించుమని హోతను ప్రేషణము చేయు ప్రైషమంత్రములలో నిది ప్రథమ మంత్రము.

2. మంత్రము : **హోతా యక్షత్తనూనపాతమదితేర్గర్భం భువనస్య గోపామ్ ।మధ్వాద్య దేవో దేవేభ్యో దేవయానాన్పథో అనక్తు వేత్వాజ్యస్య హోతర్యజ, ఇతి ।**

అర్థము : హోతా=దైవ్యహోత, అదితేః గర్భమ్=భూమికిపుత్రుcడును, భువనస్య=భూతజాతమునకు, గోపామ్=పాలకుcడునగు, తనూనపాతమ్='తనూనపాత్' అను పేరు కల ద్వితీయ ప్రయాజదేవుని, యక్షత్=పూజించుcగాక. సః దేవః=ఆ తనూనపాన్నామకుcడైన యగ్నిదేవుcడు, అద్య=ఈ కర్మయందు, దేవయానాన్ పథః=దేవతలకు ఆగమనమార్గములను, దేవేభ్యః=దేవతలకొఱకు, మధ్వా=మధురమైన ఆజ్యముతో, అనక్తు=కూడిన వానినిగాc జేయుcగాక. తనూనపాదగ్నిః, ఆజ్యస్య, వేతు, హే హోతః!, యజ. (ఈ పదములకు 1వ మంత్రార్థమునందు అర్థము వ్రాయcబడినది.)

తాత్పర్యము : దేవహోత అదితిగర్భోత్పాది విశేషణ విశిష్టుఁడైన తనూనపాన్నామక ద్వితీయ ప్రయాజాగ్నిదేవుని పూజించుఁగాక. ఆ తనూనపాదగ్ని యీ కర్మయందు దేవతలకు ఆగమనమార్గములను మధ్వక్తములనుగాఁ జేయుఁగాక. శేషము పూర్వవత్తు. ఇది ద్వితీయ ప్రైషమంత్రము.

3. మంత్రము : **హోతా యక్షన్నరాశగ్ంసం నృశస్త్రం న్యగ్ంప్రణేత్రమ్ । గోభిర్వపావాన్త్స్యద్వీరైః శక్తీవాన్రథైః ప్రథమయావా**

హిరణ్యైశ్చన్ద్రీ వేత్వాజ్యస్య హోతర్యజ, ఇతి ।

అర్థము : హోతా=దైవ్యహోత, నృశస్త్రమ్=నరులచే (యజమానాదులచే) స్తుతింపఁబడినవాఁడును, న్యగ్ంప్రణేత్రమ్=మనుష్యులకు ప్రకర్షముగనేతయునగు, నరాశంసమ్=నరాశంస నామకుఁడైన వికల్పిత ద్వితీయ ప్రజాయాగ్నిదేవుని, యక్షత్=పూజించుఁగాక. సః=ఆ నరాశంసనామకాగ్ని, గోభిః వపావాన్ స్యాత్=గోవులచే సమృద్ధిమంతుఁ డగుఁగాక. గోసమృద్ధిహేతు వగుఁగాక యని యర్థము. వీరైః శక్తవాన్ స్యాత్=పుత్రాదులచే సర్వకార్యసాధనసమర్థుఁ డగుఁగాక. రథైః=నానావిధములైన రథములచే, ప్రథమయావా=అందఱికంటె ప్రథమమున వెళ్ళువాఁడు, స్యాత్=అగుఁగాక. హిరణ్యైః=బహుహిరణ్యములచే, చన్ద్రీ=ఆహ్లాదవంతుఁడు, స్యాత్=అగుఁగాక. యజమానునికొఱకు గో పుత్ర రథ హిరణ్యముల నొసఁగుగాక యని యర్థము. సః నరాశంసనామకాగ్నిః, ఆజ్యస్య, వేతు. హే హోతః!, యజ. (ఈ పదముల కర్థము పూర్వవత్తు.)

తాత్పర్యము : తాత్పర్య మర్థమందే వివరించఁబడినది. ఇది తృతీయ ప్రైషమంత్రము.

4. మంత్రము : **హోతా యక్షదగ్నిమిడ ఈడితో దేవో దేవాగ్ం ఆవక్షద్దూతో హవ్యవాడమూరః । ఉపేమం యజ్ఞముపేమాం**

దేవో దేవహూతి మవతు వేత్వాజ్యస్య హోతర్యజ, ఇతి ।

అర్థము : హోతా=దైవ్యహోత, ఇడ ఇతి=ఇడ అను పేరు కల, అగ్నిమ్=తృతీయ ప్రయాజదేవుఁడైన యగ్నిని, యక్షత్=పూజించుఁగాక. సః దేవః=ఆ యిడ నామక తృతీయప్రయాజాగ్నిదేవుఁడు, ఈడితః=యజమానాదులచే స్తుతించఁబడినవాఁడై, దేవాన్=సర్వదేవతలను, ఆవక్షత్=ఈ కర్మయం దాహ్వానించుఁగాక. దూతః= దూతవలె హితకారియు, హవ్యవాట్=హవిస్సును వహించువాఁడును, అమూరః=అమూఢుఁడుడునగు, సః దేవః=ఆ యిడనామకుఁడైన యగ్నిదేవుఁడు, ఇమమ్=ఈ యజ్ఞమును, ఉపావతు=వచ్చి రక్షించుఁగాక. ఇమాం దేవహూతిమ్=ఈ నా దేవాహ్వానమును, అవతు=రక్షించుఁగాక. సః ఇడనామకః అగ్నిః, ఆజ్యస్య, వేతు. హే హోతః!, యజ. (అర్థము పూర్వవత్తు.)

తాత్పర్యము : ఇడనామకుఁడైన యగ్ని తృతీయ ప్రయాజదేవుఁడు. దైవ్యహోత యా తృతీయ ప్రయాజదేవుఁడైన యిడాగ్ని పూజించుఁగాక. శేషము సుగమము. ఇది చతుర్థ ప్రైషమంత్రము.

5. మంత్రము : **హోతా యక్షద్బర్హిః సుష్టరీమోర్ణమ్రదా అస్మిన్యజ్ఞే వి చ ప్ర చ ప్రథతాగ్ం స్వాసస్థం దేవేభ్యః ।ఏమేనదద్య వసవో రుద్రా ఆదిత్యాః సదన్తు ప్రియమిన్ద్రస్యాస్తు వేత్వాజ్యస్య హోతర్యజ, ఇతి ।**

అర్థము : సుష్టరీమ=శోభనమైన వేద్యాస్తరణముతో, యుక్తమ్=కూడిన, బర్హిః=బర్హిర్నామకుఁడైన చతుర్థ ప్రయాజాగ్ని దేవుని, హోతా=దైవ్యహోత, యక్షత్=పూజించుఁగాక.ఊర్ణమ్రదాః=కంబళివలె మృదుమూర్తియైన, సః=ఆ బర్హిర్నామకుఁడైన యగ్ని, అస్మిన్ యజ్ఞే=ఈ యజ్ఞమునందు, విప్రథతామ్=వివిధముగను ప్రసరించుఁగాక. చ=మఱియు, ప్రప్రథతామ్=ప్రకర్షముగ ప్రసరించుఁగాక. దేవేభ్యః=దేవతలకొఱకు, స్వాసస్థమ్=సుఖాసీనముగ నుండుటకు యోగ్యమును, ఈమ్=ఇటువంటి మృదుత్వాది గుణయుక్తము నగు, ఏనత్=ఈ బర్హిస్సును, అద్య=ఈ యజ్ఞమునందు, వసవః=అష్టవసుదేవతలు, రుద్రాః=ఏకాదశ రుద్రదేవతలు, ఆదిత్యాః=ద్వాదశాదిత్యదేవతలును, ఆసదన్తు=ఆసీను లగుదురు గాక. తత్=ఆ బర్హిస్సు, ఇన్ద్రస్య=ఇంద్రునకు, ప్రియమ్ అస్తు=ఇంద్రున కిష్టమగుఁగాక. సః బర్హినామకః అగ్నిః, ఆజ్యస్య, వేతు. హే హోతః!, యజ. (అర్థము పూర్వవత్తు.)

తాత్పర్యము : బర్హిర్నామకుఁడైన అగ్ని చతుర్థప్రయాజదేవుఁడు. అతఁడు కంబళివలె మృదుమూర్తి. ఆ బర్హిర్నామకాగ్నిని దైవ్యహోతపూజించుఁగాక. ఆ బర్హిరగ్ని యీ యజ్ఞమునందు వివిధముగను, ప్రకర్షముగను ప్రసరించుఁగాక (సంచరించుఁగాక). దేవతలు సుఖముగ నుండుటకు యోగ్యమును, ఇటువంటి మృదుత్వాది గుణయుక్తమునగు ఈ బర్హిస్సునందు వసురుద్రాదిత్యు లాసీను లగుదురు గాక. అదియు ఇంద్రునకుఁగూడ నిష్ట మగుఁగాక. శేషము పూర్వవత్తు.

6. మంత్రము : **హోతా యక్షద్దురో ఋష్వాః కవష్యో కకోషధావనీరుదాతాభిర్జిహతాం వి పక్షోభిః శ్రయన్తామ్ । సుప్రాయణా అస్మిన్యజ్ఞే విశ్రయన్తా మృతావృధో వియన్త్వాజ్యస్య హోతర్యజ, ఇతి ।**

అర్థము : హోతా=దేవహోత, దురః=ద్వారసంజ్ఞక పంచమ ప్రయాజదేవతలను, యక్షత్=పూజించుఁగాక. ఋష్వాః=పెద్దవియు (లేదా హ్రస్వములును), కవష్యః=కవాటములు కలవియు, అకోషధావనీః=సుచ్ఛిద్రములచే పరుగిడనివియునగు, దురః=ద్వారముల నభిమానించియుండునట్టి దేవతలు, ఆతాభిః=దీప్తులచే, ఉజ్జిహతామ్=పై ఉద్గమించుఁగాక. పక్షోభిః=పార్శ్వములచే, విశ్రయన్తామ్=వివిధముగ నాశ్రయించుఁగాక. అస్మిన్ యజ్ఞే=ఈ యజ్ఞమునందు, సుప్రాయణాః=సుఖముగ ప్రాపణీయములును, ఋతావృధః=సత్యమును గాని, యజ్ఞమును గాని వృద్ధినొందించునవియునై, విశ్రయన్తామ్=వివిధముగ నాశ్రయించుఁగాక. తాః ద్వారదేవతాః, ఆజ్యస్య, వియన్తు=ఆ దేవత లాజ్యమును త్రాగుదురు గాక. హే హోతః!, యజ. అర్థము పూర్వవత్తు.

తాత్పర్యము : ద్వారము నధిష్ఠించియుండు దేవతలు ద్వారదేవతలు. వారు పంచమ ప్రయాజదేవతలు. దైవ్యహోత యా పంచమ ప్రయాజదేవతలైన ద్వారదేవతలను పూజించుఁగాక. శేషము స్పష్టము. వేతు, వీతాత్-వీతామ్-వియన్తు. ఇది షష్ఠ ప్రైషమంత్రము.

7. మంత్రము : **హోతా యక్షదుషాసానక్తా బృహతీ సుపేశసా నృగ్ఃపతిభ్యో యోనిం కృణ్వానే । సగ్గ్ంస్మయమానే ఇన్ద్రేణ దేవైరేదం బర్హిః సీదతాం వీతామాజ్యస్య హోతర్యజ, ఇతి ।**

అర్థము : హోతా=దైవ్యహోత, ఉషాసానక్తా=అహస్సు, రాత్రియు అను షష్ఠప్రయాజదేవతారూపుఁడైన యగ్నిని, యక్షత్=పూజించుఁగాక. బృహతీ=గుణములచే గొప్పవియు, సుపేశసా=శోభనమైన రూపముతోఁ గూడినవియు, నృగ్ఃపతిభ్యః=మనుష్యులకు ప్రభువులైన రాజులకొఱకు, యోనిమ్=స్థానమును, కృణ్వానే = చేయునవియు, ఇన్ద్రేణ=ఇంద్రునితోను, దేవైఃదేవతలతోను, (సహ=కూడ,) సంస్మయమానే=బాగుగహర్షముచే చిఱునగవును చేయునవియునగు అహోరాత్రదేవతలు, ఇదం బర్హిః=ఈ యజ్ఞమును, ఆసీదతామ్=సేవింతురు గాక. తే=ఆ యహోరాత్రదేవతలు, ఆజ్యస్య వీతామ్=ఈ యాజ్యమును త్రాగుదురు గాక. హే హోతఃఓ మానుషహోతా!, యజ=యాజ్యను పఠించుము.

తాత్పర్యము : ఉషాసానక్తా-అహశ్చ రాత్రిశ్చేతి షష్ఠప్రయాజదేవత. తద్దేవతారూపుఁడైన యగ్నిని దైవ్యహోత పూజించుఁగాక. బృహతీత్యాది విశేషణయుక్తులైన యా యహోరాత్రదేవత లీ యజ్ఞమును సేవింతురు గాక. ఇది సప్తమ ప్రైషమంత్రము.

8. మంత్రము : **హోతా యక్షద్దైవ్యా హోతారా మన్ద్రా పోతారా కవీ ప్రచేతసా ।స్విష్టమద్యాన్యఃకరదిషా స్వభిగూర్తమన్య ఊర్జా సతవసేమం యజ్ఞం దివి దేవేషు ధత్తాం వీతామాజ్యస్య హోతర్యజ, ఇతి ।**

అర్థము : హోతా=దైవ్యహోత, మన్ద్రా=హర్షయుక్తులును, పోతారా=శోధించువారును, కవీ=విద్వాంసులును, ప్రచేతసా=ప్రకృష్టజ్ఞానులునగు, దైవ్యాహోతారా=దైవ్యహోతృనామకులైన సప్తమప్రయాజదేవతలను (తద్రూపాగ్నిని), యక్షత్=పూజించుఁగాక. అన్యఃవారిలో నితరుఁడైన యొకదేవుఁడు, అద్య=ఈ కర్మయందు, ఇషా=హవీరూపమైన యన్నముచేత, స్విష్టం కరత్=యాగమును సుష్ఠగ అనుష్ఠితముగఁ జేయుఁగాక. అన్యఃవారిలో మఱియొకదేవుఁడు, సతవసా=బలసహితమైన, ఊర్జా=రసముచే, అభిప్రేతమైన శోభనఫలసంబంధమును, కరత్=చేయుఁగాక. తౌ, ఆజ్యస్య, వీతామ్. హే హోతఃఓ, యజ. పదముల కర్థము పూర్వవత్తు.

తాత్పర్యము : సప్తమప్రయాజదేవతలు దైవ్యహోతృనామకులు. ఆ దైవ్యహోతృనామక సప్తమప్రయాజదేవరూపాగ్నిని దైవ్యహోత పూజించుఁగాక. ఆ దేవతలు మంద్రేత్యాది గుణవిశిష్టులు. ఆ దేవతలలో ఒకదేవుఁడు ఈ కర్మయందు హవీరూపమైన అన్నముచే యజ్ఞమును సుష్ఠగ అనుష్ఠితముగఁ జేయుఁగాక. వారిలో మఱియొకదేవుఁడు బలసహితమైన రసముచే అభీష్టమైన శోభనఫలసంబంధమును చేయుఁగాక. ఆ యుభయదేవతలు ద్యులోకమునందలి దేవతలం దీ యజ్ఞమును స్థాపింతురు గాక. శేషము పూర్వవత్తు.

9. మంత్రము : **హోతా యక్షత్త్రిరో దేవీరపసామపస్తమా అచ్ఛిద్ర మద్యేదమపస్తన్వతామ్ ।దేవేభ్యో దేవీర్దేవమపో వియన్వాజ్యస్య హోతర్యజ, ఇతి ।**

అర్థము : హోతా =దైవ్యహోత, అపసామపస్తమాः=కర్మవతులలో నతిశయముగ కర్మవతులైన, తిస్రः దేవీः=ఇడ, సరస్వతి, భారతి యనెడి మువ్వురు అష్టమప్రయాజదేవతలను (తద్దేవీరూపుఁడైన యగ్నిని), యక్షత్=పూజించుఁగాక. తాः=ఆ యిడాదిదేవతలు, అద్య=ఈ దినమునందు, ఇదమ్ అపः=ఈ మా కర్మను, అచ్ఛిద్రమ్=వైకల్యరహిత మగునట్లుగా, తన్వతామ్=సంపాదింతురు గాక. కించ=మఱియు, తాः దేవీः (దేవ్యः)=ఆ దేవతలు, దేవేభ్యः=దేవతలకొఱకు, అపः=మా కర్మను, దేవమ్=దేవనశీలమునుగా (అభిమత ఫల ప్రదాన సమర్థమునుగా), కుర్వతామ్=చేయుదురు గాక. తాः, ఆజ్యస్య వియన్తు. హే హోతः!, యజ. ఈ పదముల కర్థము పూర్వవత్తు.

తాత్పర్యము : ఇడ, సరస్వతి, భారతి అనువారు అష్టమప్రయాజదేవతలు. దైవ్యహోత కర్మవతులైన దేవతలలో నతిశయముగ కర్మవతులైన ఆ యష్టమప్రయాజదేవతల రూపుఁడైన యగ్నిని పూజించుఁగాక. ఆ మువ్వురు దేవతలు మా కర్మను వైకల్యరహితమునుగా సంపాదింతురు గాక. మఱియు వారు మా యీ కర్మ నభిమతఫల ప్రదాన సమర్థమునుగాఁ జేయుదురు గాక. శేషము పూర్వవత్తు. ఇది నవమ ప్రైషమంత్రము.

10. మంత్రము :హోతా యక్షత్త్వష్టార మచిష్టు మపాకగ్ం రేతోధాం విశ్రవసం యశోధామ్ ।పురురూప మకామకర్శనగ్ం

సుపోషः పోష్యైः స్యాత్సువీరో వీరైర్వేత్వాజ్యస్య హోతర్యజ, ఇతి ।

అర్థము : హోతా =దైవ్యహోత, అచిష్టమ్=చేష్టనరహితుఁడును, (చాంచల్యరహితుఁడని యర్థము.) అపాకమ్=ప్రాజ్ఞుఁడును, రేతోధామ్=పుత్రాదిబీజమును యజమానునియందు ధరింపఁజేయువాఁడును, విశ్రవసమ్=వివిధకీర్తియుక్తుఁడును, యశోధామ్=యజమానునియందు యశస్సును ధరింపఁజేయువాఁడును, పురురూపమ్=బహురూపుఁడును, అకామకర్శనమ్=కామములను (కోరికలను) నశింపఁజేయువాఁడునగు, త్వష్టారమ్=త్వష్టనామక నవమప్రయాజదేవరూపుఁడైన యగ్నిని, యక్షత్=పూజించుఁగాక. సः=ఆ త్వష్టదేవుఁడు, (అస్మిన్ యజమానే=ఈ యజమానునియందు,) పోష్యైः=ధనాదిసమృద్ధులచేత, సుపోషः=సుష్టుగ పోషకుఁడు, స్యాత్=అగుఁగాక. వీరైः=పుత్రాదివీరులచే, సువీరः=శోభనాపత్యప్రదుఁడు, స్యాత్=అగుఁగాక. సः త్వష్టా, ఆజ్యస్య వేతు. హే హోతः!, యజ. అపత్యము=సంతానము.

తాత్పర్యము : దైవ్యహోత అచిష్ట్వాది గుణయుక్తుఁడైన త్వష్టరూప నవమప్రయాజదేవుని (తద్రూపాగ్నిని) పూజించుఁగాక. ఆ త్వష్ట యీ యజమానునివిషయమున ధనాదిసమృద్ధులచే సుష్ఠుగ పోషకుఁడును, పుత్రాదివీరులచే సువీరుఁడు నగుఁగాక. శేషము పూర్వవత్తు. ఇది దశమ ప్రైషమంత్రము.

11. మంత్రము :హోతా యక్షద్వనస్పతి ముపావస్రక్షద్ధియో జోష్టారగ్ం శశమన్నరः ।స్వదాత్స్వధితిరృతుథా కద్య

దేవో దేవేభ్యో హవ్యా వాడ్వేత్వాజ్యస్య హోతర్యజ

అర్థము : హోతా =దైవ్యహోత, వనస్పతిమ్=యూపాధారభూత దశమప్రయాజదేవతాత్మకుఁడైన యగ్నిని, యక్షత్=పూజించుఁగాక. ధియः=బుద్ధులను, జోష్టారమ్=తృప్తిఁబొందించునట్టి త్వష్టదేవుని, శశమత్=పశుశమిత

యైన, నరః=పురుషుఁడు, ఉపావస్రక్షత్=పశువునకై యూపమునుగా కలుపుఁగాక (సంయోజనము చేయుఁగాక). కించ=మఱియు, సః వనస్పతిః దేవః=ఆ వనస్పతిదేవుఁడు, స్వధితిః=యూపమును చెక్కునట్టి సాధనముచే సంస్కృతుఁడై, ఋతుథా=విహితమైన కాలవిశేషమునందు, అద్య=ఈ కర్మయందు, స్వదాత్=మేమొసఁగుచున్న హవిస్సును స్వాదువుగాఁ జేయుఁగాక. కించ=మఱియు, సః దేవః=ఆ వనస్పతిదేవుఁడు, దేవేభ్యః=దేవతలకొఱకు, హవ్యా (ని)=హవిస్సులను, అవాట్=వహించుఁగాక. సః వనస్పతిః దేవః, ఆజ్యస్య వేతు. హే హోతః!, యజ. అర్థము పూర్వవత్తు.

తాత్పర్యము : యూపాధారమైన వనస్పతి దశమప్రయాజదేవుఁడు. దైవ్యహోత అట్టి దశమప్రయాజదేవుఁడైన వనస్పతిరూపాగ్నిని పూజించుఁగాక. ఋద్ధులను సంతోషపఱుచునట్టి త్వష్టృదేవుని పశుశమితయైన పురుషుఁడు పశువుకొఱకు యూపమునుగా సంయోజనము చేయుఁగాక. మఱియు వనస్పతిదేవుఁడు యూపమును చెక్కునట్టి సాధనముచే (స్వధితిచే) సంస్కృతుఁడై విహితమైన కాలవిశేషమున ఈ కర్మయందు మేమొసఁగుచున్న హవిస్సును స్వాదువుగాఁ జేయుఁగాక. ఇంకను ఆ వనస్పతిదేవుఁడు దేవతలకై హవిస్సులను వహించుఁగాక. శేషము పూర్వవత్తు. ఇది యేకాదశ ప్రైషమంత్రము.

12. మంత్రము :హోతా యక్షదగ్నిగ్ం స్వాహా కꣳజ్యస్య స్వాహా మేదసꣳ స్వాహా స్తోకానాగ్ం స్వాహా స్వాహాకృతీనాగ్ం స్వాహా హవ్యసూక్తీనామ్ । స్వాహా దేవాగ్ం ఆజ్యపాన్స్వాహా కగ్నిగ్ం హోత్రాజ్జుషాణా అగ్న ఆజ్యస్య వియన్తు హోతర్యజ (2), ఇతి ।

ప్రియమిన్ద్రస్యాస్తు వేత్వాజ్యస్య హోతర్యజ సువీరో వీరైర్వేత్వాజ్యస్య హోతర్యజ చత్వారి చ ।

అగ్నిం తనూనపాతం నరాశగ్ంసమగ్నిమిడ ఈడితో బర్హిర్దర ఉషాసానక్తా దైవ్యా తిస్రస్త్వష్టారం వనస్పతిమగ్నిమ్ । పఞ్చవేత్వేకో వియన్తుద్విర్వీతామేకో వియన్తుద్విర్వేత్వేకో వియన్తు హోతర్యజ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే ద్వితీయోఽనువాకః ॥౨॥

అర్థము : హోతా=దైవ్యహోత, స్వాహా అగ్నిమ్=స్వాహాశబ్దోదితుఁడైన ఉత్తమప్రయాజదేవరూపాగ్నిని, యక్షత్=పూజించుఁగాక. ఆజ్యస్య స్వాహా=తదగ్నిప్రీతికై ఆ యాజ్యమునకు స్వాహుతి, అస్తు=అగుఁగాక. మేదసః స్వాహా=మేదోరూప మాంసవిశేషమునకు స్వాహుతి, అస్తు=అగుఁగాక. స్తోకానాం స్వాహా అస్తు=అంశములకు స్వాహుతి, యగుఁగాక. స్వాహాకృతీయానాం అస్తు=స్వాహాకారముచే నీయఁబడుచున్న సర్వద్రవ్యములకు స్వాహుతి యగుఁగాక. హవ్యసూక్తానామ్=హవిస్తావక మంత్రాభిమానిదేవతల నిమిత్తము. స్వాహా అస్తు. ఆజ్యపాన్ దేవాన్=ఆజ్యమును త్రాగునట్టి సర్వదేవతల నుద్దేశించి, స్వాహా అస్తు. హోత్రాత్=హోమనిమిత్తమువలన, అగ్నిమ్=అగ్నిని, జుషాణాః=సేవించుచున్న, యే దేవాః

సన్తి=ఏ దేవతలు కలరో, తేషామ్=ఆ దేవతలకు, స్వాహుతిః అస్తు. హే అగ్నే!=ఓ యగ్నీ, భవాన్=నీవు, అన్యే సర్వే దేవాః=ఇతరులైన సర్వదేవతలు, ఆజ్యస్య వియన్తు=ఆజ్యమును త్రాగుదురు గాక. హే హోతః! యజ=ఓ మానుషహోతా! యాజ్యను పఠించుము.

తాత్పర్యము : ఉత్తమప్రయాజదేవుc డనcగా- ప్రయాజదేవతలలో అంతిమ (కడపటి) ప్రయాజదేవుcడని యర్థము. ఆ యంతిమప్రయాజదేవుcడు స్వాహాశబ్దోదితుcడు. తద్రూపాగ్నిని దైవ్యహోత పూజించుcగాక. శేషము స్పష్టము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
ద్వితీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
తృతీయోఽనువాకః

1. మంత్రము : **సమిద్ధో అద్య మనుషో దురోణే । దేవో దేవాన్యజసి జాతవేదః । ఆ చ వహ మిత్రమహశ్చికిత్వాన్ ।**

త్వం దూతః కవిరసి ప్రచేతాః, ఇతి ।

అవతారిక: ద్వితీయానువాకమునందు ప్రయాజవిషయ ప్రైషమంత్రము లభిహితము లైనవి. ఈ తృతీయానువాకము నందు ఆప్రీసంజ్ఞకములు, హోతచే పఠింపదగినవియునగు యాజ్యలు చెప్పబడుచున్నవి. ఆ యాజ్యలలో నిది ప్రథమయాజ్య.

అర్థము : హే జాతవేదః!=ఓ జాతవేదాగ్నీ!, దేవః=దీపించున్నవాడవైన, త్వమ్=నీవు, మనుషః=మనుష్యుడైన యజమానునియొక్క, దురోణే=గృహమునందు, అద్య=ఈ కర్మయందు, సమిద్ధః=ప్రజ్వలితుడవగుచు, దేవాన్=దేవతలను, యజసి (యజ)=హవిస్సుచే పూజించుము. హే మిత్రమహః!=మిత్రులకు పూజయితుడవైన ఓ యగ్నీ!, చికిత్వాన్=అభిజ్ఞుడవునగు, త్వమ్=నీవు, ఆవహ చ=దేవతాహ్వానము కూడ జేయుము. త్వమ్=నీవు, దూతః=దేవతలకు హితకారివియు, కవిః=శాస్త్రాభిజ్ఞుడవును, (అతః ఏవ=కనుకనే), ప్రచేతాః=ప్రకృష్టజ్ఞానము కలవాడవును, అసి=అగుచున్నావు.

తాత్పర్యము : ఓ జాతవేదాగ్నీ! దీపించుచున్న నీవు యజమానగృహమునందు ఈ కర్మయందు ప్రజ్వలితుడవగుచు దేవతలను హవిస్సుచే పూజించుము. మిత్రులకు దేవతాహ్వానము కూడ జేయుము. నీవు దేవతలకు హితకారివి, శాస్త్రాభిజ్ఞుడవును, (అతః ఏవ=కనుకనే), ప్రచేతాః=ప్రకృష్టజ్ఞానవంతుడవు నగుచున్నావు. ఇది ప్రథమ యాజ్య.

2. మంత్రము : **తనూనపాత్పథ ఋతస్య యానాన్ । మధ్వా సమఞ్జన్త్స్వదయా సుజిహ్వా । మన్మాని ధీభిరుత యజ్ఞమృన్ధన్ । దేవత్రా చ కృణుహ్యధ్వరం నః, ఇతి ।**

అర్థము : హే తనూనపాత్!=తనూనపాత్ అనుపేరు కల ఓ యగ్నీ!, హే సుజిహ్వా!=శోభనజ్వాలలు కల ఓ యగ్నీ!, ఋతస్య=యజ్ఞముయొక్క, యానాన్=ఫలప్రాప్తిహేతువులైన, పథః=హవిర్లక్షణమున మార్గములను, మధ్వా=మధురసముచే, సమఞ్జన్=బాగుగ తడుపుచు, స్వదయా (య)=స్వాదువులనుగా జేయుము. కించ=మఱియు, మన్మాని=మననీయములైన అస్మదభిప్రేతములను, ధీభిః=మా బుద్ధులచే, ఋన్ధన్=సమృద్ధములనుగా జేయుచు, ఉత=మఱియు, యజ్ఞం చ=యజ్ఞమును కూడ, ఋన్ధన్=సమృద్ధమునుగా జేయుచు, నః=మాయొక్క, అధ్వరం చ=యజ్ఞమును కూడ, దేవత్రా=దేవతలయందు, కృణుహి=చేయుము.

తాత్పర్యము : సుజిహ్వుడవైన యో తనూనపాన్నామకాగ్నీ! యజ్ఞఫలప్రాప్తిహేతువులైన హవిర్లక్షణములైన హవిస్సులను మధురసముచే తడుపుచు స్వాదువులనుగా జేయుము. మఱియు మా యభిలషితములను మా బుద్ధులచే

సమృద్ధములనుగాc జేయుచు, నింకను మా యజ్ఞమును గూడ సమృద్ధమునుగాc జేయుచు, మా యజ్ఞమును కూడ దేవతలయందుc జేయుము. ఇది ద్వితీయ యాజ్య.

3. మంత్రము : **నరాశగ్ంసస్య మహిమానమేషామ్ । ఉపస్తోషామ యజతస్య యజ్ఞైః (1) । తే సుక్రతవః శుచయో ధియంధాః । స్వదన్తు దేవా ఉభయాని హవ్యాః, ఇతి ।**

అర్థము : ఏషామ్=ఈ ఋత్విగ్యజమానులయొక్క, యజ్ఞైః=యజ్ఞములచే, యజతస్య=పూజనీయుcడైన, నరాశంసస్య=నరాశంసనామకాగ్నియొక్క, మహిమానమ్=మాహాత్మ్యమును, ఉపస్తోషామ=సమీపించి స్తుతించుదుము (స్తుతించుచున్నాము). ఏవం నరాశంసే స్తుతే సతి= ఈ విధముగ నరాశంసాగ్ని స్తుతింపcబడcగా,) సుక్రతవః=శోభనయజ్ఞములు కలవారును, శుచయః= శుద్ధులను, ధియంధాః=జ్ఞానములను ధరింపcజేయువారునగు, దేవాః=దేవతలు, ఉభయాని హవ్యాః (ని)=ఆజ్య పురోడాశ లక్షణములైన ద్వివిధ హవిస్సులను, స్వదన్తు=ఆస్వాదింతురు గాక.

తాత్పర్యము : మేము నరాశంసనామకుcడైన యగ్నిని సమీపమున స్తుతించుచున్నాము. ఆ నరాశంసాగ్ని యీ ఋత్విగ్యజమానసంబంధులైన యజ్ఞములచేc బూజనీయుcడు. సుక్రతుత్వాది గుణ యుక్తులైన దేవతలు ఆజ్య పురోడాశ లక్షణములైన ద్వివిధ హవిస్సుల నాస్వాదింతురు గాక. ఈ ద్వితీయ తృతీయ మంత్రములకు అధికారభేదముచే వ్యవస్థితవికల్పమును చూడవలసినది. నరాశంసాగ్ని వసిష్ఠగోత్రజులకు ద్వితీయ ప్రయాజదేవుcడు. తదితరులకు తనూనపాదగ్ని ద్వితీయ ప్రయాజదేవుcడు. ఇది తృతీయ యాజ్య.

4. మంత్రము : **ఆజుహ్వాన ఈడ్యో వన్ద్యశ్చ । ఆయాహ్యగ్నే వసుభిః సజోషాః । త్వం దేవానామసి యహ్వ హోతా ।**

స ఏనాన్యక్షీషితో యజీయాన్, ఇతి ।

అర్థము : హే అగ్నే !=ఓ యగ్నీ !, ఆజుహ్వానః=దేవతల నాహ్వానించువాcడవును, ఈడ్యః=స్తుతింపc దగినవాcడవును, వన్ద్యః=నమస్కరింపcదగినవాcడవును, వసుభిః=దేవతలతో, సజోషాః=సమానప్రీతి కలవాcడవునగు, త్వమ్ ఆయాహి=నీవు ఈ కర్మయందు రమ్ము. హే యహ్వ!=ప్రభూతసత్త్వcడవైన ఓ యగ్నీ!, త్వమ్=నీవు, దేవానామ్= దేవతలకు, హోతా=ఆహ్వాతవు, అసి=అగుచున్నాcవు. సః=అటు వంటి నీవు, ఏనాన్=ఈ దేవతలను, యజ=పూజించుము. ఈషితః=మాచే ప్రార్థించcబడిన వాcడవు, యజీయాన్=మనుష్యునికంటె కూడ నతిశయముగ యష్టవును. ఈడ్యః అను గుణముచే ఇడనామక తృతీయ ప్రయాజాగ్నిదేవుcడు తెలియబడుcచున్నాcడు.

తాత్పర్యము : ఓ యగ్నీ! ఈడ్యేత్యాది గుణ విశిష్టcడవైన నీవు ఈ కర్మయందు రమ్ము. ప్రభూతసత్త్వcడవైన ఓ యగ్నీ! నీవు దేవతల నాహ్వానించువాcడ వగుచున్నావు. మాచే పూజింపcబడినవాcడవును, మనుష్యునికంటెcగూడ నతిశయముగ యష్టవునగు అటువంటి నీవు ఈ దేవతలను పూజించుము. ఇతి చతుర్థ యాజ్య.

5. మంత్రము : **ప్రాచీనం బర్హిః ప్రదిశా పృథివ్యాః । వస్తోరస్యా వృజ్యతే అగ్రే అహ్నామ్ । వ్యుప్రథతే వితరం వరీయః**

దేవేభ్యో అదితయే స్యోనమ్, ఇతి ।

అర్థము : ప్రాచీనమ్=ప్రాగగ్రముగ నాస్తీర్ణమైన, బర్హిః=ఈ బర్హిస్సు, ప్రదిశా=ప్రకర్షముగ, దీపించుచున్న మంత్రముచేత, అహ్నామ్ అగ్రే=ప్రాతఃకాలమందు, అస్యాః=ఈ ప్రాగ్దిక్కునుండి, ఆవృజ్యతే=తీసికొనిరాcబడుచున్నది. తత్=ఆ యాహృతమైన బర్హిస్సు, దేవేభ్యః=దేవతలకొఱకు, అదితయే=భూమికొఱకు, వితరమ్=మిక్కిలి విస్తీర్ణముగాను, వరీయః=అత్యంతశ్రేష్ఠముగాను, స్యోనమ్=సుఖమగునట్లుగాను, వ్యుప్రథతే=వేదియందు పఱచcబడినదగుచున్నది.

తాత్పర్యము : ప్రాచీనాగ్రముగ పఱచcబడిన యీ బర్హిస్సు ప్రకర్షముగ దీపించుచున్న మంత్రముచే వేదిరూప పృథివి నాచ్ఛాదించుటకై ప్రాతఃకాలమునందు తీసికొనిరాcబడుచున్నది. తీసికొనిరాcబడిన యీ బర్హిస్సు విస్తీర్ణతరముగాను, అత్యంతశ్రేష్ఠముగాను, సుఖమగునట్లుగాను వేదియందు పఱచcబడిన దగుచున్నది. ఇది పంచమ యాజ్య. ఇచట బర్హిశ్శబ్దముచే బర్హిర్నామక చతుర్థప్రయాజాగ్నిదేవుcడు సూచింపcబడుచున్నాcడు.

6. మంత్రము : **వ్యచస్వతీరుర్వియా విశ్రయన్తామ్ । పతిభ్యో న జనయః శుమ్భమానాః । దేవీర్ద్వారో బృహతీర్విశ్వమిన్వాః।**

దేవేభ్యో భవథ సుప్రాయణాః, ఇతి ।

అర్థము : ద్వారః=ద్వారనామక పంచమ ప్రయాజదేవతలు, వ్యచస్వతీః=వ్యాప్తికలవారును, ఉర్వియాః=అత్యంత విస్తృతికలవారునై, పతిభ్యః నః=పతులకొఱకువలె, శుమ్భమానాః జనయః=శోభమానులుగా అయినవారై, విశ్రయన్తామ్=ఈ కర్మయందు విశేషముగ నుందురు గాక. బృహతీః=గుణములచే గొప్పవారును, విశ్వమిన్వాః=విశ్వమును సంతోషపఱచువారును, హే ద్వారః దేవీః = ద్వారాభిమానినులైన యో పంచమ ప్రయాజదేవతలారా ! దేవేభ్యః=దేవతలకొఱకు, సుప్రాయణాః=సుష్ఠగ గమనక్షములై, భవథ=కండు.

తాత్పర్యము : ద్వారదేవత లీ కర్మయందు విశేషముగ స్థితికలవా రగుదురు గాక. ఆ ద్వారదేవతలు వ్యాప్తిమతులు. కనుకనే యత్యంతవిస్తృతులు. పతులకొఱకు సంభోగకాలమందు శోభమాను లగువిధము శోభమానులు. బృహతీత్యాది గుణ యుక్తులైన యో ద్వారాభిమానినులైన దేవతలారా! మీరు దేవతలకొఱకు సుష్ఠగ గమనక్షములు కండు. ఇది షష్ఠయాజ్య.

7. మంత్రము : **ఆ సుష్వయన్తీ యజతే ఉపాకే । ఉషాసానక్తా సదతాం ని యోనౌ । దివ్యే యోషణే బృహతీ సురుక్మే ।**

అధి శ్రియగ్ం శుక్రపిశం దధానే, ఇతి ।

అర్థము : సుష్వయన్తీ సుష్ఠగ వచ్చుచున్నవారును, యజతే=పూజనీయులును, ఉపాకే=మనుజులను రక్షించుటకై ఉపక్రమించినవారును, దివ్యే=దివియందు ఉన్నవారును, యోషణే=స్త్రీలవలె సంతోషపఱచువారును,

బృహతీ=గుణములచే గొప్పవారును, సురుక్మే=సుష్ఠుగ దీపించుచున్నవారునునగు,శుక్రశోచిషమ్=నిర్మలరూపమైన, శ్రియమ్=కాంతిని, దధానే=ధరించినవారునునగు, ఉషాసానక్తా=అహోరాత్రదేవతలు, యోనౌ=యజ్ఞస్థానమునందు, నిషదతామ్=నియమముగ నాసీను లగుదురు గాక.

తాత్పర్యము : సుష్వయన్తీత్యాది విశేషణ విశిష్టులైన అహోరాత్రదేవత లీ యజ్ఞస్థానమునందు నియమముగ నాసీను లగుదురు గాక. ఈ యహోరాత్రదేవతలు షష్ఠప్రయాజదేవతలు. ఇది సప్తమ యాజ్య.

8. మంత్రము : **దైవ్యా హోతారా ప్రథమా సువాచా । మిమానా యజ్ఞం మనుషో యజధ్యై (3) । ప్రచోదయన్తా విదథేషు కారూ । ప్రాచీనం జ్యోతిః ప్రదిశా దిశన్తా, ఇతి ।**

అర్థము : ప్రథమా=మనుష్యహోతకంటె పూర్వము ఉన్నవారును, సువాచా=శోభనస్తోత్రములు కలవారును, మనుషః=యజమానునకు, యజధ్యై=యాగము చేయుటకై, యజ్ఞమ్=యాగమును, మిమానా=ఉత్పాదింపచేయువారును, విదథేషు=యజ్ఞములందు, ప్రచోదయన్తా=ఋత్విజుల నందఱిని ప్రేరణ చేయువారును, కారూ=స్వయముగ యాగకర్తలును, ప్రాచీనం జ్యోతిః=ప్రాగ్దిక్కునందు ప్రణీతమైన యాహవనీయాగ్నిని, ప్రదిశా=ప్రకృష్టమైన ఉపదిష్టమార్గముచేత, దిశన్తా=నిర్వాహకులునగు, దైవ్యా హోతారా=దేవసంబంధులైన హోత్రనామకదేవతలు (సప్తమ ప్రయాజదేవతలు), అత్ర ఆసీదతామ్=ఈ యజ్ఞమునం దాసీను లగుదురు గాక. (ఇది అధ్యాహృతము.)

తాత్పర్యము : ప్రథమేత్యాది విశేషణ విశిష్టులైన దేవసంబంధులైన హోత్రనామకదేవత లీ యజ్ఞమునం దాసీను లగుదురు గాక. దైవ్యా-దైవ్యౌ. హోతారా-హోతారౌ. ప్రథమేత్యాదులు కూడ ప్రథమౌ ఇత్యాదులుగా నుండవలెనని గ్రహింపఁదగినది. ఇవి ఛాందస ప్రయోగము. లుప్తప్రథమా ద్వివచనాంతములు. ఇది అష్టమ యాజ్య.

9. మంత్రము : **ఆ నో యజ్ఞం భారతీ తూయమేతు । ఇడా మనుష్వదిహచేతయన్తీ । తిస్రో దేవీర్బర్హిరేదగ్గ్ం స్యోనమ్। సరస్వతీ స్వపసః సదన్తు, ఇతి ।**

అర్థము : భారతీ=భారతీదేవి, నః=మాయొక్క, యజ్ఞమ్=యజ్ఞమును గూర్చి, తూయమ్=శీఘ్రముగా, ఆ ఏతు=వచ్చుఁగాక. మనుష్వత్=మనుష్యునివలె, చేతయన్తీ=కర్తవ్యమును తెలిసికొనుచున్నదై, ఇడా=ఇడాదేవి, నః, యజ్ఞమ్, ఆ ఏతు (ఐతు). తథా=ఆ విధముగ, సరస్వతీ చ=సరస్వతీదేవియు, ఆ ఏతు. ఏవమ్=ఈ విధముగ, ఏతాః తిస్రః దేవీః=ఈ యిడా భారతీ సరస్వతు లనెడి ముగ్గురు దేవతలు (అష్టమ ప్రయాజ దేవతలు), స్వపసః=శోభనకర్మకలవారై, స్యోనమ్=సుఖకరమైన, ఇదం బర్హిః=ఈ యజ్ఞమును, ఆసదన్తు=పొందుదురు గాక.

తాత్పర్యము : మనుష్యుఁడు 'నేను ఉపకారము చేయవలెను' అని తెలిసికొనువిధముగ ఇడాఖ్య దేవి తెలిసికొనినదై మా యజ్ఞమును గూర్చి వచ్చుఁగాక. భారత్యాఖ్యదేవియు మా యజ్ఞమును గూర్చి శీఘ్రముగ వచ్చుఁగాక. ఆ

విధముగనే సరస్వత్యాఖ్యదేవి కూడ మా యజ్ఞమును గూర్చి వచ్చుcగాక. ఈ విధముగ ఈ ముప్పురు దేవతలు శోభనకర్మ కలవారై సుఖకరమైన యీ యజ్ఞమును పొందుదురు గాక. ఇది నవమ యాజ్య.

10. మంత్రము :**య ఇమే ద్యావాపృథివీ జనిత్రీ । రూపైరపిగ్ంశద్ భువనాని విశ్వా । తమద్య హోతరిషితో యజీయాన్।**

దేవం త్వష్టారమిహయక్షి విద్వాన్, ఇతి ।

అర్థము : యః=ఏ త్వష్టృదేవుcడు, జనిత్రీ=విశ్వమును పుట్టించునట్టి, ఇమే ద్యావాపృథివీ= ఈ ద్యావాభూములను, రూపైః అపింశత్=దేవ తిర్యఙ్మనుష్యాద్యాకారములచే రూపవత్తులుగాc జేసెనో, తథా=ఆ విధముగ, విశ్వా భువనాని= సమస్త భూతజాతములను, అపింశత్=రూపవంతములుగాc జేసెనో, హే హోతః!=ఓ హోతా!, యజీయాన్=యష్టృతముcడవైన, త్వమ్=నీవు, విద్వాన్=అభిజ్ఞుcడ వగుచు, ఇషితః=మాచే ప్రార్థింపcబడిన వాcడవై, అద్య=ఈ దినమునందు, ఇహ=ఈ కర్మయందు, తం త్వష్టారం దేవమ్=ఆ త్వష్టృదేవుని, యక్షి= యజించుము (పూజించుము).

తాత్పర్యము : ఓ హోతా! యష్టృతముcడవైన నీవు అభిజ్ఞుcడ వగుచు, మాచే ప్రార్థితుcడవై త్వష్టృదేవుని యజించుము. ఆ త్వష్ట విశ్వమును పుట్టించునట్టి ద్యావాభూములను దేవతిర్యఙ్మనుష్యాద్యాకారములచే రూపవత్తులనుగాc జేసెను. ఆ విధముగ సమస్తభూతజాతములను రూపయుక్తములనుగాc జేసెను. యష్టృతముcడు నవమ ప్రయాజదేవత. ఇది దశమ యాజ్య.

11. మంత్రము :**ఉపావసృజత్మన్యా సమఞ్జన్ । దేవానాం పాథ ఋతుథా హవీగ్ంషి । వనస్పతిః శమితా దేవో అగ్నిః ।**

స్వదన్తు హవ్యం మధునా ఘృతేన, ఇతి ।

అర్థము : వనస్పతిః=వనస్పతి (యూప) దేవుcడు (దశమప్రయాజదేవుcడు), త్మన్యా=స్వయముగనే (పరాపేక్ష లేకుండనే) ఋతుథా=ఆ యా ఋతువులయందు, దేవానామ్=దేవతలకు, పాథః=పశులక్షణమైన యన్నమును, హవీంషి= ఇతరములైన హవిస్సులను, సమఞ్జన్=బాగుగ ప్రకాశింపcజేయుచు, ఉపావసృజత్=దేవతలకొఱ కిచ్చెను. కించ=మఱియు, వనస్పతిః దేవః=వనస్పతిదేవుcడును, శమితా దేవః=శమిత్రు దేవుcడును, అగ్నిః దేవః=అగ్నిదేవుcడును, మధునా=మధురమైన, ఘృతేన=ఆజ్యముచే, హవ్యమ్= హవిస్సును, స్వదన్తు= స్వాదువుగాc జేయుదురు గాక.

తాత్పర్యము : వనస్పతిదేవుcడు (యూపదేవుcడు) పరాపేక్ష లేకుండనే ఆ యా ఋతువులందు పశులక్షణమైన యన్నమును, ఇతరహవిస్సులను బాగుగ ప్రకాశింపcజేయుచు దేవతల కొసఁగెను. మఱియు యూపదేవుcడు, శమిత్రు దేవుcడు, అగ్నిదేవుcడు వీ రందఱు మధురమైన ఘృతముచే హవిస్సును స్వాదువుగాc జేయుదురు గాక. ఇది యేకాదశ యాజ్య.

12. మంత్రము :**సద్యోజాతో వ్యమిమీత యజ్ఞమ్ । అగ్నిర్దేవానా మభవత్పురోగాః । అస్య హోతుః ప్రదిశ్యృతస్య వాచి ।**

స్వాహాకృతగ్ం హవిరదన్తు దేవాః, ఇతి ।

యజ్ఞైః స్యోనం యజధ్యై విద్వానష్టా చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే తృతీయోఽనువాకః ॥౩॥

అర్థము : సద్యోజాతః=జాతమాత్రుఁడేయై, అయమ్ అగ్నిః=ఈ యగ్ని, యజ్ఞమ్=యజ్ఞమును, వ్యమిమీత=విశేషముగ నుత్పాదింపఁజేయుచున్నవాఁడు. అతః ఏవ=కనుకనే, అయమ్ అగ్నిః=ఈ యగ్ని, దేవానామ్=దేవతలలో, పురోగాః=ప్రథమగామి (ముఖ్యుఁడు), అభవత్=ఆయెను. ప్రదిశి=ప్రకృష్టమైన తూర్పుదిక్కునందు, స్థితస్య=ఉన్నట్టి, ఋతస్య=యజ్ఞనిష్పాదకుఁడైన, అస్య హోతుః= ఆహవనీయాఖ్యాగ్నియొక్క, వాచి=వాగుపలక్షితమైన ముఖమునందు, స్వాహాకృతమ్=స్వాహాకారముచే ప్రక్షిప్తమైన, హవిః=హవిస్సును, దేవాః=సర్వదేవతలు, అదన్తు=భక్షింతురు గాక.

తాత్పర్యము : ఈ యగ్ని పుట్టుచునే యజ్ఞము నుత్పాదింపఁజేయుచున్నాఁడు. కనుకనే యీ యగ్ని దేవతలలో పురోగామి (ముఖ్యుఁడు) గా నాయెను. ప్రకృష్టమైన తూర్పుదిక్కునందు ఉన్నటువంటి యజ్ఞనిష్పాదకుఁడైన ఆహవనీయాఖ్యుఁడైన అగ్నియొక్క ముఖమునందు 'స్వాహా'అనుచు ప్రక్షేపించఁబడిన హవిస్సును సర్వదేవతలు భక్షింతురు గాక. ఇచట 'వాచి' అను పదముచే ముఖము ఉపలక్షిత మైనది. ఇది ద్వాదశ యాజ్య.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
తృతీయానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
చతుర్థోఽనువాకః

1. మంత్రము : **అగ్నిర్హోతా నో అధ్వరే । వాజీ సన్పరిణీయతే । దేవో దేవేషు యజ్ఞియః, ఇతి ।**

అవతారిక: తృతీయానువాకమునందు ఆప్రీసంజ్ఞకములైన ప్రయాజయాజ్య లభిహితము లైనవి. ఈ చతుర్థానువాకము నందు పర్యగ్నికరణీయము లైన ఋక్కులు చెప్పబడుచున్నవి.

అర్థము : దేవేషు=దేవతలలో, యజ్ఞియః=యజ్ఞార్హుడైన, దేవః అగ్నిః=దీపించుచున్న యగ్ని, నః=మాయొక్క, అధ్వరే= యజ్ఞమునందు, హోతా=హోమనిష్పాదకుడును, వాజీ=హవిర్లక్షణమైన అన్నము కలవాడు నగుచు, పరిణీయతే=అంతటను పొందించబడుచున్నాడు (కొనిపోబడుచున్నాడు).

తాత్పర్యము : దేవతలలో యజ్ఞార్హుడైన యగ్నిదేవుడు మా యధ్వరమునందు హోమనిష్పాదకుడును, హవిర్లక్షణమైన అన్నము కలవాడు నగుచు నంతటను తీసికొనిపోబడుచున్నాడు. మైత్రావరుణుడు పఠించవలసిన మూడు ఋక్కులలో నిది ప్రథమ ఋక్కు.

2. మంత్రము : **పరి త్రివిష్ట్యధ్వరమ్ । యాత్యగ్నీ రథీరివ । ఆ దేవేషు ప్రయో దధత్, ఇతి ।**

అర్థము : రథీరివ=రథము కలవానివలె, అయమ్ అగ్నిః=పర్యగ్నికరణార్థమైన ఉల్మకరూపాగ్ని, అధ్వరమ్= యాగసాధనమైన పశువును, త్రివిష్టి=వేష్టనత్రయము కలుగునట్లుగ, ప్రయః=ప్రాపణీయమైన హవిస్సును, దేవేషు=దేవతల యందు, ఆదధత్=స్థాపించుటకాక అని యిందుకై, పరియాతి=అంతటను పోవుచున్నాడు.

తాత్పర్యము : రథివలెకొఱివిరూపమైన యగ్ని యాగపశువునకు మూడువేష్టనము లగునట్లుగదేవతలకు పొందించవలసిన హవిస్సును దేవతలందు స్థాపించుటకై యంతటను పోవుచున్నాడు. యాగపశువునకు చుట్టు కొఱవిని త్రిప్పుటవలన ఈ విధముగ నున్నదని యర్థము. ఈ కొఱవిరూపమైన యగ్ని పర్యగ్నికరణార్థ మైనది. ఇది ద్వితీయ ఋక్కు.

3. మంత్రము : **పరి వాజపతిః కవిః । అగ్నిర్హవ్యాన్యక్రమీత్ । దధద్రత్నాని దాశుషే, ఇతి ।**
అగ్నిర్హోతా నో నవ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే చతుర్థోఽనువాకః ॥౪॥

అర్థము : వాజపతిః=అన్నపాలకుడును, కవిః=విద్వాంసుడునగు, అయమ్ అగ్నిః=ఈ యగ్ని, హవ్యాని=పురు రూపములైన హవిస్సులను, దాశుషే=హవిస్సునొసగు యజమానునికొఱకు, రత్నాని=రత్నములను, దధత్= సంపాదించుచు, పర్యక్రమీత్=పరిక్రమించెను.

తాత్పర్యము : వాజపతిత్వాది గుణయుక్తుడైన యీ యగ్ని హవిస్సునొసగు యజమానునికొఱకు రత్నములను సంపాదించుచు పురోడాశరూపములైన హవిస్సులను పరిక్రమించెను. కొఱవిని పురోడాశహవిస్సులకు

చుట్టు మూఁడు మారులు త్రిప్పుటవలన పైవిధముగ నగ్ని వర్ణించఁబడెనని యర్థము. ఇది తృతీయ ఋక్కు. ఈ యనువాకమునందు హవీరూపమైన యన్నము, పశువు, పురోడాశాదులకు చుట్టు కొఱవి (అగ్ని) మూఁడేసి మారులు త్రిప్పఁబడెను. ఆ పర్యగ్నికరణ సమయమున మైత్రావరుణుఁడు పఠించవలసిన మూఁడు ఋక్కులు చెప్పఁబడినవి. ఆ ఋక్కులు పర్యగ్నికరణీయము లనఁబడుచున్నవి.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున షష్ఠ ప్రపాఠకమునందు
చతుర్థానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
పఞ్చమోఽనువాకః

1. మంత్రము : **అజైదగ్నిః । అసనద్వాజం ని । దేవో దేవేభ్యో హవ్యవాట్ । ప్రాఞ్జోభిర్ఘృన్వానః । ధేనాభిః కల్పమానః ।**

యజ్ఞస్యాయుః ప్రతిరన్ । ఉపప్రేష్య హోతః । హవ్యా దేవేభ్యః (1), ఇతి ।

అజైదష్టౌ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకేపంచమోఽనువాకః ॥౫॥

అవతారిక: చతుర్థానువాకమునందు పర్యగ్నికరణీయఋక్కు లభిహితము లైనవి. ఈ పఞ్చమానువాకమునందు అధ్వర్యుప్రైషమంత్రమును పఠించునటువంటి హోతను గూర్చి మైత్రావరుణ ప్రైషమంత్రము చెప్పఁబడు చున్నది.

అర్థము : అగ్నిః=కొఱవి యను నగ్ని, అజైత్=జయించుఁగాక. వాజమ్=హవిర్లక్షణమైన యన్నమును, నసన్=సేవించుఁ గాక. దేవః=ద్యోతనాత్మకుఁడైన యగ్ని, దేవేభ్యః=దేవతలకొఱకు, హవ్యా (ని)=హవిస్సులను, అఞ్జోభిః=ఋత్విజులతో నడకలచే, ప్రహీన్వానః=అగ్రభాగమున వెళ్లుచును, ధేనాభిః=సంతోషపరచునట్టి దీప్తులచే, కల్పమానః=సామర్థ్యమును సంపాదించుచును, యజ్ఞస్య=యజ్ఞవంతుఁడైన యజమానునకు, ఆయుః= ఆయువును, ప్రతిరన్=వృద్ధినొందింపఁజేయుచును, అవాట్=వహించుఁగాక. హే హోతః !=ఓ హోతా!, దేవేభ్యః హవ్యా జ్ఞాపయ=దేవతలకొఱకు హవిస్సులను తెలియఁజేయుమని, ఉపప్రేష్య=మైత్రావరుణునిచే, ప్రేషితుఁడ వగుచు తెలియఁజేయుము.

తాత్పర్యము : అనంతరము సంజ్ఞపనమునకు తీసికొనిపోఁబడుచున్న పశువుయొక్క పురోభాగమున ఉన్నట్టి ఉల్ముకాఖ్యాగ్ని జయించుఁగాక. హవిస్సంపాదనసామర్థ్యమే జయము. హవిర్లక్షణమైన అన్నమును సేవించుఁగాక. ద్యోతనాత్మకుఁడైన యీ యగ్ని ఋత్విక్కులతో ముందు పోవుచును, సంతోషపఱుచునట్టి దీప్తులచే సామర్థ్యమును సంపాదించుచును, యజ్ఞకర్తయైన యజమానున కాయువును వృద్ధిచేయుచును దేవతలకొఱకు హవిస్సులను వహించుఁగాక. ఓ హోతా! మైత్రావరుణునిచే ప్రేషితుఁడ వగుచు దేవతలకు హవిస్సులను తెలియఁ జేయుమని యీ విధముగ తెలియఁజేయుము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
పంచమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
షష్ఠోఽనువాకః

1. మంత్రము : **దైవ్యాఃశమితార ఉత మనుష్యా ఆరభధ్వమ్। ఉపనయత మేధ్యా దురః ।ఆశాసానా మేధపతిభ్యాం మేధమ్ ।ప్రాస్మా అగ్నిం భరత । స్తృణీత బర్హిః ।అన్వేనం మాతా మన్యతామ్ । అను పితా । అను భ్రాతా సగర్భ్యః ।అను సఖా సయూథ్యః । ఉదీచీనాగ్ం అస్య పదో నిధత్తాత్ (1) । సూర్యం చక్షుర్గమయతాత్ । వాతం ప్రాణమన్వవసృజతాత్ ।దిశః శ్రోత్రమ్ ।అన్తరిక్షమసుమ్ । పృథివీగ్ం శరీరమ్ । ఏకధాకస్య త్వచమాచ్ఛ్యతాత్ ।పురా నాభ్యా అపిశసో వపాముత్ఖిదతాత్ । అన్తరేవోష్మాణం వారయతాత్ । శ్యేనమస్య వక్షః కృణుతాత్ ।ప్రశసా బాహూ (2) ।శలా దోషణీ ।కశ్యపేవాగ్ంసా । అచ్ఛిద్రే శ్రోణీ ।కవషోరూ ప్రేకపర్ణా కష్మీవన్తౌ ।షడ్విగ్ంశతిరస్య వఙ్క్రయః ।తా అనుష్ఠ్యాచ్యావయతాత్ । గాత్రం గాత్రమస్యాసూనం కృణుతాత్ ।ఊవధ్యగోహం పార్థివం ఖనతాత్ ।అస్నా రక్షః సగ్ంసృజతాత్ । వనిష్ఠుమస్య మా రావిష్ట (3) ।ఉరూకం మన్యమానాః ।నేద్వస్తోకే తనయే । రవితా రవచ్ఛమితారః । అధ్రిగో శమీధ్వమ్ । సుశమి శమీధ్వమ్ । శమీధ్వమధ్రిగో, ఇతి ।**

అవతారిక: పంచమానువాకమునందు మైత్రావరుణ ప్రైషమంత్ర మభిహిత మైనది. ఈ షష్ఠానువాకమున మైత్రావరుణ ప్రేషితుcడైన హోత పఠించవలసిన అధ్రిగు ప్రైషమంత్రము చెప్పcబడుచున్నది.

అర్థము : హే దైవ్యా శమితారః !=ఓ దైవ్య విశసనకర్తలారా !, ఉత=మఱియు, హే మనుష్యాఃశమితారఃఓ మనుష్య శమితలారా !, (యూయమ్ ఉభయేఽపి=మీ రుభయులును, వక్ష్యమాణం కర్మ=చెప్పబడcబోవు కర్మను,) ఆరభధ్వమ్=ప్రారంభించుcడు. కిం తత్ కర్మ ఇతి చేత్? =ఆ కర్మ యేది ? అనcగా -మేధ్యాఃదురఃయజ్ఞార్హములైన హవిర్భాగములను (విశసనహేతులను గాని), ఉపనయత=సన్నిధినిcజేర్చుcడు. మేధపతిభ్యామ్=యజ్ఞస్వాము లైన పత్నీయజమానులకొఱకు (అగ్నిషోమదేవతలకొఱకుcగాని), మేధమ్=యజ్ఞమును, ఆశాసానాఃప్రార్థించుచున్నవారై, యూయమ్=మీరు, అస్మై=సంజ్ఞపనస్థానమునకు తీసికొనిరాcబడు

చున్న యీ పశువుకొఱకు, అగ్నిమ్=ఉల్ముకాఖ్యమైన యగ్నిని, ప్రభరత=ప్రకర్షముగ శ్రపణమునకై తీసికొనుఁడు. (అథ=అనంతరము, సంజ్ఞపనస్థానం నీతస్య పశోఃసంజ్ఞపనస్థానమునకు తీసికొని రాఁబడిన పశువుయొక్క, అధస్తాత్=అధోభాగమునందు,) బర్హిఃబర్హిస్సును, స్తృణీత=పఱచుఁడు (ఉపాకరణములైన బర్హిస్సులలో నొకదాని నుంచుఁడు).

అథ=పిమ్మట, ఏనమ్=సంజ్ఞపనము చేయఁబడుచున్న యీ పశువును, మాతా=పశువుయొక్క తల్లి, అనుమన్యతామ్=అనుమతించుఁగాక. పితా=తండ్రి, అనుమన్యతామ్. సగర్భ్యఃసమానగర్భమునందు పుట్టిన, భ్రాతా=సోదరుఁడు, అనుమన్యతామ్. సయూథ్యఃసజాతీయపశు సమూహమునందు పుట్టిన, సఖా=మిత్రుఁడు, అనుమన్యతామ్. అస్యసంజ్ఞప్యమానమైన యీ పశువుయొక్క, పదఃపాదములను, ఉదీచీనాన్=ఉత్తరదిగ్గతములనుగా, నిధత్తాత్=స్థాపించుము. చక్షుఃఈ పశువుయొక్క చక్షువు, సూర్యమ్=సూర్యదేవతను, గమయతాత్=పొందించుఁడు. ప్రాణమ్=ప్రాణమును, వాతమ్=వాయుదేవతను గూర్చి, అన్వవసృజతాత్=అనుసరించి పొందించుఁడు. శ్రోత్రమ్=శ్రోత్రమును, దిశఃదిగ్దేవతలను గూర్చి, ప్రాపయత=పొందించుఁడు. అసుమ్=జీవమును, అన్తరిక్షమ్=అంతరిక్షమును, ప్రాపయత. శరీరమ్=శరీరమును, పృథివీమ్=పృథివీదేవతను, ప్రాపయత.

ఏకధా=ఒకవిధముగ, అస్యఈ పశువుయొక్క, త్వచమ్=చర్మమును, ఆచ్ఛ్యతాత్=విచ్ఛేద రాహిత్యముచే అచ్ఛినముగ చేయుఁడు. నాభ్యాఃఅపిశసఃనాభిని ఛేదించుటకంటె, పురా=పూర్వము, వపామ్=వపను (కడుపులో బొడ్డుక్రిందనుండెడి యుల్లిపొరవంటి క్రొవ్వును), ఉత్ఖిదతాత్=వెల్లగించుఁడు. ఊష్మాణమ్ అన్తరేవ=ఉచ్ఛ్వాసము లేకుండనే, వారయతాత్=పిహితాస్యమైన పశువును సంజ్ఞపనము చేయుఁడు. అస్యఈ పశువుయొక్క, వక్షఃఱొమ్మును, శ్యేనమ్=శ్యేనాకారముగ, కృణుతాత్=చేయుఁడు. బాహూబాహువులను, ప్రశసాప్రకర్షముగ ఛేదనము కలవిగ, కృణుతాత్. దోషణీప్రకోష్ఠములను (ముంజేతులను), శలాశలాకాకారములుగ, కృణుతాత్. అంసాఁరెండు అంసములను, కశ్యపేవకచ్ఛపాకారములుగ, కురుత. (కచ్ఛపముతాఁబేలు.) శ్రోణీరెండు పిఱుదులను, అచ్ఛిద్రేఅన్యూనములుగ (తక్కువకానివిగ), కురుత. కవషాకవాటాకారములును, శ్రీతపర్ణాకరవీరపత్రాకారములునైన, ఊరూతొడలను, అష్ఠీవన్తామూలయుక్తములనుగ, కురుత. అస్యఈ పశువుయొక్క, వఙ్క్యఃపార్శ్వములందలి అస్థులు (ఎముకలు), షడ్వింశతిఃఇరువదియాఱు. తా (ని)=ఆ యస్థులను, అనుష్ఠ్యా చ్యావయతాత్=స్వస్థానగతములనుగా నుద్ధరించుఁడు.

అస్యఈ పశువు యొక్క, గాత్రం గాత్రమ్=అవధానీయమైన సర్వాంగము, అనూనమ్=అవికలముగ, కృణుతాత్. ఊవధ్యగోహమ్=పురీషగూహనస్థానమును, పార్థివమ్=పృథివీసంబంధమైన అవటమునుగా, ఖనతాత్=ఖననము చేయుఁడు. అస్రాఁరక్తముచే, రక్షఃపిశితలోలుపమైన రాక్షసాదికమును, సంసృజతాత్=కలుపుఁడు. అస్యఈ పశువుయొక్క, వనిష్ఠమ్=గుదసదృశమాత్రమైన మాంసమును, మా రావిష్ట=ఛిన్నముగఁ జేయకుఁడు. ఉరూకం మన్వమానాఃపక్షివిశేషాకారమునుగా తెలిసికొనుచున్నవారై, ఉరూకమ్=ఉలూకసదృశమైన, వనిష్ఠమ్=గుదసదృశమాత్రమాంసమును, తథైవ=ఆ విధముగనే, ఉద్ధరత=ఉద్ధరించుఁడు (పెల్లగించుఁడు). (మధ్యమున ఛేదించవద్దని యర్థము.)

వః=ఈ విధముగ జేయుచున్న మీయొక్క, తోకే=కుమారునివిషయమునందును, తనయే=ఆ కుమారుని యొక్క పుత్రునివిషయమునందును, రవితా=శమయిత, నేత్=రవత్=రోదనము చేయనే చేయఁడు. హే శమితారః!=ఓ దైవ్య మనుష్య శమితలారా!, హే అధ్రిగో!=వారిలో ముఖ్యదేవా!, (యూయం సర్వేఽపి=మీ రందఱును,) శమీధ్వమ్=విశసనాదికముచే పశువును సంస్కరించుఁడు. సుశమి=సుష్ఠుగ శాస్త్రీయశమనము కలుగునట్లుగ, శమీధ్వమ్=పశువును సంజ్ఞపనము చేయుఁడు. కేవలము లాంఛనమైన శమనమును చేయవలదు. ఇది క్రూరకర్మయని తలఁచి తదుపేక్షణము చేయరాదని తెలియుటకై పునఃపునర్వచనము.

తాత్పర్యము : శమిత యనఁగా యజ్ఞమునందు పశువును చంపునతఁడు. దైవ్యశమితలు, మనుష్యశమితలు అని శమితలు రెండు విధములుగ నున్నారు. సంజ్ఞపనము=చంపుట. తాత్పర్య మర్థమందే వివరించఁబడినది.

2. మంత్రము : **అధ్రిగుశ్చాపాపశ్చ । ఉభౌ దేవానాగ్ం శమితారౌ । తావిమం పశుగ్ం శ్రపయతాం ప్రవిద్వాగ్ంసౌ ।**

యథా యథా కస్య శ్రపణం తథా తథా, ఇతి ।

ధత్తాద్బాహూ మా రావిష్ట తథా తథా ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే షష్ఠోఽనువాకః ॥౬॥

అర్థము : అధ్రిగుః చ=అధ్రిగునామకుఁడును, అపాపః చ=అపాపనామఁకుఁడునగు, ఉభౌ=ఇద్దఱు, దేవానామ్=దేవతలలో, శమితారౌ=విశసన (సంజ్ఞపన) కర్తలు. యథా యథా=ఏ యే ప్రకారముగ, అస్య శ్రపణమ్=ఈ పశువునకు పాకము, భవతి=అగుచున్నదో, తథా తథా=ఆ యా విధముగ, ప్రవిద్వాంసౌ=ప్రకర్షముగ తెలిసినవారైన, తౌ=ఆ యుభయ శమితలు, ఇమం పశుమ్=ఈ పశువును, శ్రపయతామ్=పాకము చేయుదురుగాక.

తాత్పర్యము : అధ్రిగుఁడు, అపాపుఁడు అను నుభయులు దేవతలలో శమితలు. వారు పశువు పాకమగు విధమును బాగుగ తెలిసినవారు. అట్టి వా రుభయు లీ పశువును పాకము చేయుదురుగాక.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
షష్ఠానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
సప్తమోఽనువాకః

1. మంత్రము : **జుషస్వ సప్రథస్తమమ్ । వచో దేవప్సరస్తమమ్ । హవ్యా జుహ్వాన ఆసని, ఇతి ।**

అవతారిక: షష్ఠానువాకమునందు అధ్వరప్రైషమంత్ర మభిహిత మైనది. ఈ సప్తమానువాకమునందు స్తోకవిషయమైన మైత్రావరుణానువచనము చెప్పఁబడుచున్నది. స్తోకములు=బిందువులు.

అర్థము : హే అగ్నే !=ఓ యగ్నీ ! త్వమ్=నీవు, హవ్యా (ని)=మా హవిస్సులను, ఆసని=ముఖమునందు, జుహ్వానః= ఉంచుచున్నవాఁడవై, సప్రథస్తమమ్=మిక్కిలి విస్తృతమును, దేవప్సరస్తమమ్=దేవతల నతిశయముగ సంతోషపఱుచునదియునగు, వచః=అస్మదీయ స్తోత్రమును, జుషస్వ=సేవించుము.

తాత్పర్యము : ఓయగ్నీ! నీవు మా హవిస్సులను ముఖమునందు ఉంచుచు నస్మదీయ స్తోత్రమును సేవించుము. ఆ స్తోత్రము మిక్కిలి విస్తృతమైనది. మఱియు దేవతల నతిశయముగ సంతోషపఱుచునట్టిది. ఇది మైత్రావరుణాను వచనీయములైన ఋక్కులలో ప్రథమ ఋక్కు.

2. మంత్రము : **ఇమం నో యజ్ఞమమృతేషు ధేహి। ఇమా హవ్యా జాతవేదో జుషస్వ । స్తోకానామగ్నే మేదసో ఘృతస్య ।**

హోతః ప్రాశాన ప్రథమో నిషద్య, ఇతి ।

అర్థము : హే జాతవేదః !=ఓ జాతవేదాగ్నే ! నః=మా యొక్క, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, అమృతేషు=దేవతలందు, ధేహి=స్థాపించుము. ఇమా (ని) హవ్యా(ని)=ఈ మా హవిస్సులను, జుషస్వ=సేవించుము. హే హోతః అగ్నే!=హోమనిష్పాదకుఁడవైన ఓ యగ్నీ!, మేదసః=వపాసంబంధియైన, ఘృతస్య=నేతియొక్క, స్తోకానామ్=బిందువులలో, (స్వాదూన్ బిన్దూన్=స్వాదువులైన బిందువులను,) ప్రథమః సన్=నీవే ముఖ్యుఁడ వగుచు, నిషద్య=ఇచట కూర్చుండి, ప్రాశాన=ప్రకర్షముగ భక్షించుము.

తాత్పర్యము : ఓ జాతవేదాగ్నీ! నీవు మాయొక్క యీ యజ్ఞమును దేవతలందు స్థాపించుము. ఈ మా హవిస్సులను సేవించుము. హోమనిష్పాదకుఁడవైన ఓ యగ్నీ! వపాసంబంధియైన ఘృతముయొక్క బిందువులలో స్వాదుబిందువులను నీవే ముఖ్యుఁడ వగుచు నిచట కూర్చుండి భక్షించుము. ఇది ద్వితీయ ఋక్కు.

3. మంత్రము : **ఘృతవన్తః పావక తే । స్తోకాః శ్చోతన్తి మేదసః ।స్వధర్మం దేవవీతయే (1) । శ్రేష్ఠం నో ధేహి వార్యమ్,**

ఇతి ।

అర్థము : హే పావక!=శోధకుఁడవైన ఓ యగ్నీ!, తే=నీకొఱకు, మేదసః=వపాసంబంధులును, ఘృతవన్తః=ఘృత సహిత ములునగు, స్తోకాః=బిందువులు, దేవవీతయే=దేవతల భక్షణమునకై, శ్చోతన్తి=స్రవించుచున్నవి.

నః=మాయొక్క, శ్రేష్ఠమ్=అతిప్రశస్తమును, వార్యమ్=అందఱిచే వరణీయమునగు, స్వధర్మమ్=కులోచితమైన యాగాద్యనుష్ఠానరూప ధర్మమును, ధేహి=సంపాదించుము.

తాత్పర్యము : శోధకుఁడవైన ఓ యగ్నీ! నీకొఱకు వపాసంబంధులైన ఘృతసహిత బిందువులు దేవతలు భక్షించుటకై స్రవించుచున్నవి. మాయొక్క కులోచితమైన యాగాద్యనుష్ఠాన రూప ధర్మమును సంపాదించుము. ఆ స్వధర్మ మతిప్రశస్తము. కనుకనే అందఱిచే వరింపఁదగినది. ఇది తృతీయ ఋక్కు.

4. మంత్రము : **తుభ్యగ్ం స్తోకా ఘృతశ్చుతః అగ్నే విప్రాయ సన్త్య । ఋషిః శ్రేష్ఠః సమిధ్యసే । యజ్ఞస్య ప్రావితా భవ,**

ఇతి ।

అర్థము : హే సన్త్య!=ఫలదానకుశలుఁడవైన ఓ యగ్నీ !, విప్రాయ=మేధావియైన, తుభ్యమ్=నీకొఱకు, స్తోకాః=బిందువులు, ఘృతశ్చుతః=ఘృతమును స్రవించుచున్నవై, వర్తన్తే=ఉంటున్నవి. త్వమపి=నీవు కూడ, ఋషిః=మంత్రద్రష్టవు, శ్రేష్ఠః=ప్రశస్తతముఁడవునై, సమిధ్యసే=మాచే ప్రజ్వలింపఁజేయఁబడుచున్నావు. అతః=ఈ కారణమువలన, యజ్ఞస్య=మా యజ్ఞమునకు, ప్రావితా=ప్రకర్షముగ రక్షకుఁడవు, భవ=కమ్ము.

తాత్పర్యము : ఫలదానకుశలుఁడవైన ఓ యగ్నీ! మేధావియైన నీకొఱకు బిందువులు ఘృతసహితములై స్రవించుచున్నవై యుంటున్నవి. నీవు మంత్రద్రష్టవు. ప్రశస్తతముఁడవు. అట్టి నీవు మాచే ప్రజ్వలింపఁజేయఁబడుచున్నావు. కనుక మా యజ్ఞమునకు ప్రకర్షముగ రక్షకుఁడ వగుము. సన్తిః-దానమ్, సన్తిమ్ అర్హతీతి సన్త్యః. తస్య సంబుద్ధిః హే సన్త్య. ఇది చతుర్థ ఋక్కు.

5. మంత్రము : **తుభ్యగ్ం శ్చోతన్త్యధ్రిగో శచీవః । స్తోకాసో అగ్నే మేదసో ఘృతస్య । కవిశస్తో బృహతా భానునా ऽऽగాः ।**

హవ్యా జుషస్వ మేధిర, ఇతి ।

అర్థము : హే అధ్రిగో! అగ్నే!=అధృతరశ్మివైన ఓ యగ్నీ!, హే శచీవః!=శక్తిమంతుఁడవైన యగ్నీ!, మేదసః=వపాసంబంధియైన, ఘృతస్య=నేతియొక్క, స్తోకాసః=బిందువులు, తుభ్యమ్=నీకొఱకు, శ్చోతన్తి=స్రవించుచున్నవి. త్వం చ=నీవును, కవిశస్తః=విద్వాంసులైన ఋత్విజులచే స్తుతింపఁబడినవాఁడ వగుచు, బృహతా భానునా=మహాతేజస్సుచేత, యుక్తః=కూడినవాఁడవై, ఆగాః=రమ్ము. హే మేధిర!=యజ్ఞయోగ్యుఁడవైన ఓ యగ్నీ!, హవ్యా(ని)=మా హవిస్సులను, జుషస్వ=సేవించుము.

తాత్పర్యము : ఓ యగ్నీ! నీవు రశ్మిలను ధరించనివాఁడవు. శక్తిమంతుఁడవు. అట్టి నీకొఱకు వపాఘృతంయొక్క బిందువులు స్రవించుచున్నవి. నీవు విద్వాంసులైన ఋత్విజులచే స్తుతించ బడినవాఁడ వగుచు మహాతేజస్సుతోఁ గూడినవాఁడవై రమ్ము. యజ్ఞయోగ్యుఁడవైన ఓ యగ్నీ! మా హవిస్సులను సేవించుము. ఇది పంచమ ఋక్కు.

6. మంత్రము : **ఓజిష్ఠం తే మధ్యతో మేద ఉద్భృతమ్ । ప్ర తే వయం దదామహే। శ్చోతన్తి తే వసో స్తోకా అధిత్వచి ।**

ప్రతి తాం దేవశో విహి(2), ఇతి ।

దేవవీతయ ఉద్భృతం త్రీణి చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే సప్తమోఽనువాకః ॥౭॥

అర్థము : హే అగ్నే ! = ఓ యగ్నీ !, తే = నీకొఱకు, ఓజిష్ఠమ్ = బలవత్తమమైన, మేదః = వపారూప మేదస్సును, మధ్యతః = పశుమధ్యభాగమునుండి, ఉద్భృతమ్ = ఉద్ధరించి సంపాదించఁబడిన దానిని, వయమ్ = మేము (యజమానులము), తే = నీకొఱకు, దదామహే = ఇచ్చుచున్నాము. హే వసో ! = సర్వులకు నివాసహేతువైన ఓ యగ్నీ ! అధిత్వచి = వపయందు అధిశ్రితములైన, స్తోకాః = బిందువులు, తే = నీకొఱకు, శ్చోతన్తి = స్రవించుచున్నవి. దేవశః = ఆ యా దేవతల తుష్టికై, తాః = ఆ బిందువులను, ప్రవిహి = ప్రత్యేకముగ త్రాగుము.

తాత్పర్యము : ఓ యగ్నీ! నీకొఱకు పశువుయొక్క మధ్యభాగమునుండి ఉద్ధరించి సంపాదించఁబడిన వపారూప మేదస్సును మేము (యజమానులము) నీ కొసఁగుచున్నాము. సర్వులకు నివాసహేతువైన ఓ యగ్నీ! వపయం దాశ్రయించియున్న బిందువులు నీకై స్రవించుచున్నవి. ఆ యా దేవతల తుష్టికై బిందువులను ప్రత్యేకముగ త్రాగుము. ఇది షష్ఠ ఋక్కు.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునఁ తృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
సప్తమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
అష్టమోఽనువాకః

1. మంత్రము : **ఆ వృత్రహణా వృత్రహభిః శుష్మైః । ఇన్ద్ర యాతం నమోభిరగ్నే అర్వాక్ । యువగ్ం రాధోభిరకవేభిరిన్ద్ర। అగ్నే అస్మే భవత ముత్తమేభిః, ఇతి ।**

అవతారిక: సప్తమానుకమునందు స్తోకవిషయమైన మైత్రావరుణానువచనము చెప్పఁబడినది. ఈ యష్టమానువాకమునందు వపా పురోడాశస్విష్టకృత్తులకు మైత్రావరుణవక్ష్యకములైన పురోనువాక్యా ప్రైషమంత్రములు చెప్పఁబడుచున్నవి.

అర్థము : హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా! హే అగ్నే !=ఓ యగ్నీ !, యువమ్ (వామ్) ఉభౌ =మీ రుభయులు, వృత్ర హభిః= పాపఘాతులైన, శుష్మైఃబలములచేత, వృత్రహణా (ణౌ)=పాపఘాతు లగుచు, నమోభిఃమా నమస్కారములచే, అర్వాక్=మా కభిముఖముగ, ఆయాతమ్=రండు. హే ఇన్ద్ర!, హే అగ్నే!, యువమ్ ఉభౌ =మీ రుభయులు, అకవేభిఃకుత్సితములు కానివియు, ఉత్తమేభిఃశ్రేష్ఠములునగు, రాధోభిఃధనములతో, అస్మేమాయందు, భవతమ్=ఉండుఁడు.

తాత్పర్యము : ఓ యింద్రాగ్నులారా! మీ రుభయులు పాపమును చంపునటువంటి బలములచే పాపమును పోఁగొట్టినవారై మా నమస్కారముల నందుకొని మా కభిముఖముగ రండు. ఓ యింద్రాగ్నులారా! మీ రుభయులు ధనములతో మాయం దుండుఁడు. ఆ ధనములు కుత్సితములు కానివి, శ్రేష్ఠము లైనవియు. ఇది వపకు పురోనువాక్య.

2. మంత్రము : **హోతా యక్షదిన్ద్రాగ్నీ । ఛాగస్య వపాయా మేదసః । జుషేతాగ్ం హవిః । హోతర్యజ, ఇతి ।**

అర్థము : ఇన్ద్రాగ్నీ=ఇంద్రాగ్నుల నుభయులను, హోతా=దైవ్యహోత, యక్షత్=పూజించుఁగాక. తౌ=ఆ యింద్రాగ్నులు, ఛాగస్య=మేఁకపోతుయొక్క (యజ్ఞపశువుయొక్క), మేదసఃవపాసంబంధియగు, హవిఃహవిస్సును, జుషేతామ్=భక్షింతురు గాక. తదర్థమ్=అందుకై, హే హోతఃఓ మానుషహోతా!= యాజ్యను పఠించుము.

తాత్పర్యము : ఇంద్రాగ్నులైన యుభయదేవతలను దైవ్యహోత పూజించుఁగాక. ఆ యింద్రాగ్నులు ఛాగముయొక్క వపారూప హవిస్సును భక్షింతురు గాక. ఓ మానుషహోతా! అందుకై నీవు యాజ్యను పఠించుము. ఇది మైత్రావరుణవక్ష్యకమైన ప్రైషమంత్రము.

3. మంత్రము : **వి హ్యాఖ్యన్మనసా వస్య ఇచ్ఛన్ । ఇన్ద్రాగ్నీ జ్ఞాస ఉత వా సజాతాన్ (1) । నాన్యా యువత్ప్రమతిరస్తి మహ్యామ్ । స వాం ధియం వాజయన్తీమతక్షమ్, ఇతి ।**

అర్థము : యః=ఏ యజమానుఁడు, మనసా=మనస్సుచే, వస్యః=శ్రేష్ఠమైన ధనమును, ఇచ్ఛన్=కోరుచు, వర్తతే=ఉంటున్నాఁడో, ఉత వా=లేదా, సజాతాన్=బంధువులను, ఇచ్ఛన్ వర్తతే=కోరుచు నుంటున్నాఁడో, హే ఇన్ద్రాగ్నీ!=ఓ యింద్రాగ్నులారా !, సః=ఆ యజమానుఁడు, యువామేవ=మిమ్మే, వ్యఖ్యత్ ఇతి=విశేషముగ ప్రకాశింపఁ జేయుచున్నాఁడని, ఏవమ్=ఈ విధముగ, అహమ్=నేను, జ్ఞాసే=తెలిసికొను చున్నాను. మహ్యమ్=నాకొఱకు, యువత్ అన్యా ప్రమతిః=మీకంటె నితరుఁడొక్కఁడు కూడ ప్రకర్షముగ మంతవ్యుఁడు, నాస్తి= లేఁడు. సః అహమ్=ఆ నేను, వామ్=మీయొక్క, ధియమ్=బుద్ధిని, వాజయన్తీమ్= మాకొఱకు అన్నమును కోరుచున్నదానినిగా, అతక్షమ్=సేవించుచున్నాను (సంస్కరించి యుత్పాదింపఁ జేయుచున్నాను).

తాత్పర్యము : ఓ యింద్రాగ్నులారా! శ్రేష్ఠమైన ధనమును గాని, లేదా, బంధువులను గాని కోరుచున్న యజమానుఁడు మిమ్మే విశేషముగ ప్రకాశింపఁజేయుచున్నాఁ డనెడి ఈ వృత్తాంతమును నేను తెలిసికొనుచున్నాను. నాకై మీకంటె నితరుఁ డొక్కఁడును ప్రకర్షముగ మంతవ్యుఁడు లేఁడు. అటువంటి నేను మీ బుద్ధిని నాకొఱకు అన్నమును కోరుచున్నదానినిగా సంస్కరించి యుత్పాదింపఁజేయుచున్నాను. ఇది పురోడాశమునకు పురోనువాక్య.

4. మంత్రము : **హోతా యక్షదిన్ద్రాగ్నీ । పురోడాశస్య జుషేతాగ్ం హవిః । హోతర్యజ, ఇతి ।**

వివరణము: ఇన్ద్రాగ్నీ, హోతా, యక్షత్. ఇన్ద్రాగ్నీ, పురోడాశస్య=పురోడాశముయొక్క, హవిః, జుషేతామ్. హే హోతః!, యజ. దీని యర్థతాత్పర్యములకు రెండవ మంత్రవ్యాఖ్యానమును చూడుఁడు. ఇది మైత్రావరుణవత్స్యక ప్రైషమంత్రము.

5. మంత్రము : **త్వామీడతే అజిరం దూత్యాయ । హవిష్మన్తః సదమిన్మానుషాసః । యస్య దేవైరాసదో బర్హిరగ్నే ।**

అహాన్యస్మై సుదినా భవన్తు, ఇతి ।

అర్థము : హవిష్మన్తః=హవిర్యుక్తులైన, మానుషాసః=మనుష్యులు (యజమానులు) సదమిత్=ఎల్లప్పుడును, దూత్యాయ=దేవతలను గూర్చి ఆహ్వానాది దూతకర్మకొఱకు, హే అగ్నే!=ఓ యగ్నీ!, అజిరమ్=గమనాగమన సమర్థుఁడవైన, త్వామ్=నిన్ను, ఈడతే=స్తుతించుచున్నారు. హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, దేవైః సహ=దేవతలతోఁ గూడ, యస్య=ఏ యజమానునియొక్క, బర్హిః=యజ్ఞమును, ఆసదః=అధిష్ఠించితివో, అస్మై=ఈ యజమానునికొఱకు, అహాని=అన్ని యహస్సులు, సుదినా (ని)=సుదినములుగా, భవన్తు=అగుఁగాక.

తాత్పర్యము : ఓ యగ్నీ! హవిష్మంతులైన యజమానులు సర్వదా దేవతలను గూర్చి ఆహ్వానాది దూతకర్మకొఱకు గమనాగమనసమర్థుఁడవైన నిన్ను స్తుతించుచున్నారు. ఓ యగ్నీ! ఏ యజమానునియొక్క యజ్ఞము నధిష్ఠించితివో, ఆ యీ యజమానునకు సర్వదినములు సుదినము లగుఁగాక. ఇది స్విష్టకృత్తునకు పురోనువాక్య.

6. మంత్రము : **హోతా॑ యక్ష॒దగ్నిమ్॑ । పు॒రో॒డా॒శస్య॑ జు॒షతా॒గ్ం హ॒విః । హోత॒ర్య॑జ, (2), ఇతి ।**

స॒జా॒తా॒న॒గ్నిం ద్వే చ॑ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే అష్టమోఽనువాకః ॥౮॥

అర్థము : హోతా=దైవ్యహోత, అగ్నిమ్=అగ్నిని, యక్షత్=పూజించుఁగాక. అయమ్ అగ్నిః=ఈ యగ్ని, పురోడాశస్య=స్విష్టకృత్పురోడాశమునకు సంబంధించిన, హవిః=హవిస్సును, జుషతామ్=భక్షించుఁగాక. హే హోతః !=ఓ మానుషహోతా !, తదర్థమ్=అందుకై, యజ=యాజ్యను పఠించుము.

తాత్పర్యము : దైవ్యహోత అగ్నిని పూజించుఁగాక. ఈ యగ్ని స్విష్టకృత్పురోడాశరూప హవిస్సును భక్షించుఁగాక. ఓ మానుషహోతా! అందుకై నీవు యాజ్యను పఠించుము. ఇది మైత్రావరుణ వక్ష్యక ప్రైషమంత్రము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
అష్టమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
నవమోఽనువాకః

1. మంత్రము : **గీర్భిర్విప్రః ప్రమతిమిచ్ఛమానః । ఈట్టే రయిం యశసం పూర్వభాజమ్ । ఇన్ద్రాగ్నీ వృత్రహణా సువజ్రా ।**

ప్ర ణో నవ్యేభిస్తిరతం దేష్ణైః, ఇతి ।

అవతారిక: సప్తమానువాకమునందు వపా పురోడాశ స్విష్టకృత్తులకు పురోనువాక్యా ప్రైషమంత్రములు చెప్పఁబడినవి. ఈ నవమానువాకమునందు ఆ వపా పురోడాశ స్విష్టకృత్తులకే యాజ్యలు చెప్పఁబడుచున్నవి.

అర్థము : ప్రమతిమ్ = ప్రకర్షముగ మాననీయమును, యశసమ్ = యశోహేతువును, పూర్వభాజమ్ = పూర్వులైన పితృాదుల ధనమునకు సదృశమునగు, రయిమ్ = ధనమును, ఇచ్ఛమానః = కోరుచున్న, విప్రః = (బ్రాహ్మణుఁడు) యజమానుఁడు, గీర్భిః = స్తుతులచే, ఇన్ద్రాగ్నీ = ఇంద్రాగ్నులను, ఈట్టే = స్తుతించుచున్నాఁడు. వృత్రహణా = పాపఘాతులును, సువజ్రా = శోభనవజ్రయుక్తులునగు, ఇన్ద్రాగ్నీ = ఇంద్రాగ్నులు, నవ్యేభిః = నూతనములైన, దేష్ణైః = ధనదానములచే, నః = మమ్ము, ప్రతిరతమ్ = ప్రకర్షముగ వృద్ధినొందింతురు గాక.

తాత్పర్యము : ధనమును కోరుచున్న యజమానుఁడు స్తుతులచే నింద్రాగ్నులను స్తుతించుచున్నాఁడు. ఆ ధనము ప్రమతిత్వాది విశేషణ విశిష్ట మైనది. ఆ యింద్రాగ్నులు నూతనములైన ధనదానములచే మమ్ము వృద్ధినొందింతురు గాక. ఆ యింద్రాగ్నులు పాపఘాతులు, శోభనవజ్ర యుక్తులును. ఇది వపకు యాజ్య.

2. మంత్రము : **మా చ్ఛేద్మ రశ్మీన్రితి నాధమానాః । పితృణాగ్ం శక్తీరనుయచ్ఛమానాః । ఇన్ద్రాగ్నిభ్యాం కం వృషణో మదన్తి । తా హ్యద్రీ ధిషణాయా ఉపస్థే, ఇతి ।**

అర్థము : హి = ఏ కారణమువలన, తా (తౌ) = ఆ యింద్రాగ్నులు, ధిషణాయాః = యజమానుల బుద్ధియొక్క, ఉపస్థే = ఉపరిభాగమున, అద్రీ = ఆదరణీయులై, వర్తేతే = ఉంటున్నారో, తస్మాత్ = ఆ కారణమువలన, పితృణామ్ = పితృపితామహాదులైనపితృదేవతలయొక్క, శక్తీః = కర్మానుష్ఠానశక్తులను, అనుయచ్ఛమానాః = అనువర్తించుచున్నవారును, రశ్మీన్ = రశ్ములవలె సంతతములైన కర్మవిశేషములను, మా చ్ఛేద్మ ఇతి = ఛేదింపవలదని, నాధమానాః = ప్రార్థించుచున్నవారునగు, వృషణా (ణః) = విద్యద్వృషభులైన యజమానులు, ఇన్ద్రాగ్నిభ్యామ్ = ఇంద్రాగ్నులకంటె, అన్యం కమ్ = ఇతరుఁడైన యే దేవుని, మదన్తి = సంతోషపెట్టుచున్నారు?

తాత్పర్యము : విద్వచ్ఛ్రేష్ఠులైన యజమాను లింద్రాగ్నులకంటె నితరుఁడైన యే దేవుని సంతోషపఱుచుచున్నారు? ఇంద్రాగ్నులనే సంతోషపెట్టుచున్నారని యర్థము. అందువలననే ఇంద్రాగ్నులు యజమానులబుద్ధియం దాదరణీయులై యుంటున్నారు. విద్వచ్ఛ్రేష్ఠులైన ఆ యజమానులు పితృపితామహాదుల కర్మానుష్ఠానశక్తుల ననువర్తించుచున్నవారు. తదనువృత్తికొఱకే రశ్ములవలె సంతతములైన కర్మవిశేషములకు విచ్ఛేదము

చేయవలదనెడి అభిప్రాయముతో ఇంద్రాగ్నులను ప్రార్థించుచున్నవారు కూడ. ఇది పురోడాశమునకు యాజ్య.

3. మంత్రము : **అగ్నిగ్ం సుదీతిగ్ం సుదృశం గృణన్తః । నమస్యామస్త్వేడ్యం జాతవేదః । త్వాం దూతమరతిగ్ం హవ్యవాహమ్ । దేవా అకృణ్వన్నమృతస్య నాభిమ్ (1), ఇతి ।**

జాతవేదో ద్వే చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే నవమోఽనువాకః ॥౯॥

అర్థము : హే జాతవేదః! = ఓ జాతవేదాగ్ని! అరతిమ్ = ఆలస్యరహితుఁడవును, హవ్యవాహమ్ = హవిస్సును వహించువాఁడవును, అమృతస్య నాభిమ్ = కర్మఫలమునకు నాభిస్థానీయుఁడవును (సంపాదకుఁడవును), ఈడ్యమ్ = స్తుతింపఁదగినవాఁడవునగు, త్వా = నిన్ను, సుదీతిమ్ = శోభనదాన యుక్తుఁడును, సుదృశమ్ = సుష్ఠుగఁ జూచుటకు శక్యుఁడునగు, అగ్నిమ్ = స్విష్టకృద్రూపాగ్నిని, గృణన్తః = స్తుతించుచున్న, వయమ్ = మేము, నమస్యామః = నమస్కరించుచున్నాము. దేవాః = దేవత లందఱు, త్వామ్ = స్విష్టకృదగ్నివైన నిన్ను, దూతమ్ = దేవతలను గూర్చి దూతకర్మయోగ్యునిగా, అకృణ్వన్ = చేసిరి.

తాత్పర్యము : ఓ జాతవేదాగ్ని అరతిత్వాదిగుణ యుక్తుడవైన నిన్ను మేము నమస్కరించుచున్నాము. మేము సుదీతిత్వాది గుణయుక్తుఁడవైన నిన్ను స్తుతించుచున్నవారము. దేవత లందఱు స్విష్టకృదగ్నివైన నిన్ను దేవతలకు దూతనుగాఁ జేసిరి. ఇది స్విష్టకృత్తునకు యాజ్య.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు నవమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
దశమోఽనువాకః

1. మంత్రము : **త్వగ్ం హ్యగ్నే ప్రథమో మనోతా అస్యా ధియో అభవో దస్మ హోతా । త్వగ్ం సీం వృషన్నకృణోర్దుష్టరీతు।**

సహో విశ్వస్మై సహసే సహధ్యై, ఇతి ।

అవతారిక : నవమానువాకమునందు వపా పురోడాశస్విష్టకృత్తులకు యాజ్యలు చెప్పఁబడినవి. ఇఁక ఈ దశమానువాకము నందు మనోతాసూక్త మభిహిత మగుచున్నది. ఈ మనోతా ఋక్కులు మైత్రావరుణుఁడు పఠించునట్టివి.

అర్థము : హే అగ్నే!=ఓ యగ్నీ! ప్రథమఃముఖ్యుఁడవైన, త్వం హి=నీవే, మనోతా=మనస్సుచే (సర్వదేవతలచే ప్రార్థించఁబడిన) రక్షింపఁబడిన దేవతవు. హే దస్మ!=కర్మకుశలుఁడవైన ఓ యగ్నీ!, అస్యాఃధియఃకర్మానుష్ఠాన విషయమైన యీ మా బుద్ధియొక్క యనుసారముచే, త్వం హి=నీవే, హోతా అభవఃహోతవైతివి. హే వృషన్!=కామములను వర్షించునట్టి ఓ యగ్నీ!, త్వం సీమ్=నీవే, దుష్టరీతు=దుస్తరమైన యీ జగత్తును, అకృణోఃయాగముద్వారా చేయుచున్నావు. సహధ్యై=శత్రువుల నభిభవించుటకై, విశ్వస్మై సహసేసర్వబలముకంటె, సహఃఅధికబలము, త్వమేవ=నీవే, అసి=అగుచున్నావు.

తాత్పర్యము : ఓ యగ్నీ! ముఖ్యుఁడవైన నీవే (సర్వదేవతలచే ప్రార్థించఁబడిన) మనస్సుచే రక్షించఁబడినదేవతవు. కర్మకుశలుఁడవైన ఓ యగ్నీ! మా యీ కర్మవిషయ బుద్ధి ననుసరించి నీవే హోతవైతివి. కోరికలను వర్షించునట్టి ఓ యగ్నీ! నీవే దుస్తరమైన యీ జగత్తును యాగముద్వారా చేయుచున్నావు. శత్రువుల ననుభవించుటకై సర్వబలముకంటె నధిక బలము నీవే అయితివి. ఈ మనోతాసూక్తములో నిది ప్రథమ ఋక్కు.

2. మంత్రము : **అధా హోతా న్యసీదో యజీయాన్ । ఇడస్పద ఇషయన్నీడ్యఃసన్ ।తం త్వా నరఃప్రథమం దేవయన్తఃమహో రాయే చితయన్తో అనుగ్మన్, ఇతి ।**

అర్థము : అధా=అనంతరము, హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమేవ=నీవే, ఇషయన్=సర్వలోకమునకు అన్నమును చేయుచు, ఈడ్యఃసన్=స్తుతింపఁబడినవాడవగుచును, యజీయాన్=యష్టృతముఁడవైన హోతవగుచును, ఇడస్పదే=అన్నమును పొందించునట్టి యాగస్థానమునందు, న్యసీదఃనియమముగ కూర్చుండినవాఁడవగుచున్నావు. నరఃమనుష్యులైన ఋత్విగ్యజమానులు, దేవయన్తఃదేవతలను కోరుచున్నవారై, మహారాయే=గొప్పధనముకొఱకు, చితయన్తఃఆలోచించుచున్నవారై, ప్రథమమ్=ముఖ్యుఁడవైన, తం త్వా=ఆ నిన్ను, అనుగ్మన్=సేవించుచున్నారు (సేవించిరి).

తాత్పర్యము : ఓ యగ్నీ! నీవే సర్వలోకమునకు అన్నమును చేయుచున్నావు. అందఱిచే స్తుతించఁబడుచున్నావు. అట్టి నీవు యష్టులలో శ్రేష్ఠహోతవై అన్నమును పొందించునట్టి యాగస్థానమునందు నియమముగ నుపవిష్టుఁడ

వగుచున్నావు. మనుష్యులైన ఋత్విగ్యజమానులు దేవతలను కోరుచున్నావారై గొప్ప ధనమునకై యాలోచించుచు ముఖ్యుఁడవైన నిన్నే సేవించుచున్నారు. మనోతాసూక్తములో నిది ద్వితీయ ఋక్కు.

3. మంత్రము : **వృతేవ యన్తం బహుభిర్వసవ్యైः ।త్వే రయిం జాగృవాగ్ంసో అనుగ్మన్ (1) । రుశన్తమగ్నిం దర్శతం బృహన్తమ్ । వపావన్తం విశ్వహా దీదివాగ్ంసమ్, ఇతి ।**

అర్థము : జాగృవాంసः = ప్రబుద్ధులైన యజమానులు, రుశన్తమ్ = శత్రువులను హింసించుచున్నవాఁడవును, అగ్నిమ్ = ముందునడిపించువాఁడవును (నేతవును), దర్శతమ్ = దర్శనీయుఁడవును, బృహన్తమ్ = మహనీయుఁడవును, వపావన్తమ్ = వపారూపములైన హవిస్సులతోఁ గూడినవాఁడవును, విశ్వహా = సర్వదినములందు, దీదివాంసమ్ = దీపించుచున్నవాఁడవును, రయిమ్ (రయిమన్తమ్) = ధనవంతుఁడవునగు, త్వే (త్వామ్) = నిన్ను (అగ్నిని), బహుభిः వసవ్యైः యుక్తమ్ = బహుధనములతోఁ గూడినవాఁడును, వృతా యన్తమివ = సన్మార్గమున పోవుచున్న రాజునువలె, అనుగ్మన్ = అనుసరించుచున్నారు.

తాత్పర్యము : ప్రబుద్ధులైన యజమానులు రుశన్త మిత్యాది విశేషణ విశిష్టుఁడైన యగ్నిని బహుధన సమూహములతోఁ గూడినవాఁడును, సన్మార్గవర్తియునగు రాజునువలె ననుసరించుచున్నారు. ధనవంతుఁడును, దానశీలుఁడునగు రాజును ధనార్థు లనుసరించుచున్నవిధముగ ప్రబుద్ధులైన యజమానులు ధనవంతుఁడైన యగ్ని ననుసరించుచున్నారని యర్థము. మనోతాసూక్తములో నిది తృతీయ ఋక్కు.

4. మంత్రము : **పదం దేవస్య నమసా వియన్తः । శ్రవస్యవः శ్రవ ఆపన్నమృక్తమ్ । నామాని చిద్దధిరే యజ్ఞియాని । భద్రాయాం తే రణయన్త సందృష్టౌ, ఇతి ।**

అర్థము : హే అగ్నే! = ఓ యగ్నీ!, దేవస్య తే = దేవుఁడవైన నీయొక్క, పదమ్ = పదమును, నమసా = నమస్కారముచే, వియన్తः = విశేషముగ పొందుచున్నవారును, శ్రవస్యవः = అన్నమును కోరుచున్నవారునగు యజమానులు, అమృక్తమ్ = వినశ్వరముకానట్టి, శ్రవः = అన్నమును, ఆపన్ = పొందిరి. యజ్ఞియాని = యజ్ఞార్హములైన, నామాని = నీ నామములను, యజమానాः = యజమానులు, చిద్దధిరే = ధరించిరి. తే = ఆ యజమానులు, తే = నీయొక్క, భద్రాయామ్ = మంగళకరమైన, సందృష్టౌ = అనుగ్రహబుద్ధియందు, రణయన్తः = రమించుచున్నవారై, వర్తన్తే = ఉంటున్నారు. (అనుష్ఠాతారः = యజ్ఞము ననుష్ఠించువారు, రమన్తే ఇతి = రమించుచున్నారని, కిము వక్తవ్యమ్? = చెప్పవలసిది ఏమున్నది?)

తాత్పర్యము : ఓ యగ్నీ! యజ్ఞకర్త లన్నమును కోరుచున్నవారై నమస్కారముచే దేవుఁడవైన నిన్ను పొంది అవినశ్వరమైన యన్నమును పొందిరి. యజ్ఞార్హములైన నీ నామములను యజమానులు ధరించుచున్నారు. ఆ యజమానులు కళ్యాణకరమైన నీ యనుగ్రహబుద్ధియందు రమించుచున్నారు. నీ యనుగ్రహమును పొందుచున్నారని యర్థము. యజ్ఞార్హములైన నీ నామములను ధరించినవారే నీ యనుగ్రహమును పొందుచుండఁగా యజ్ఞము

ననుష్ఠించువారు నీ యనుగ్రహమును పొందుచున్నారని చెప్పవలసిన పని యేమున్నది? మనోతాసూక్తములో నిది చతుర్థ ఋక్కు.

5. మంత్రము : త్వాం వర్ధన్తి క్షితయః పృథివ్యామ్ । త్వగ్ం రాయ ఉభయాసో జనానామ్ । త్వం త్రాతా తరణే చేత్యో ఽభూః। పితా మాతా సదమిన్మానుషాణామ్ (2), ఇతి ।

అర్థము : హే అగ్నే!=ఓ యగ్నీ!, పృథివ్యామ్=భూమియందు, క్షితయః=నివసించుచున్న యజమానులు, త్వామ్=నిన్ను, వర్ధన్తి=స్తుతులచేఁగాని, హవిస్సులచేఁగాని సంతోషపఱుచుచున్నారు. జనానామ్=సర్వజనులకు, త్వమ్=నీవు, ఉభయాసః రాయః=దివ్యములు, పార్థివములునైన ద్వివిధధనములను సంపాదించువాఁడవు. హేతరణే!=దురితములను తొలఁగించుటలో కుశలుఁడవైన ఓ యగ్నీ!, త్వమేవ=నీవే, అస్మాకమ్=మాకు, త్రాతా=రక్షకుఁడవు, చేత్యః=స్మర్తవ్యుఁడవును, అభూః=అగుచున్నావు.(వర్తమానార్థమున భూతకాలిక ప్రయోగము ఛాందసము.)తథా=ఆ విధముగ, మానుషాణామ్=సర్వమనుష్యులకు, సదమిత్=ఎల్లకాలములందును, పితా=తండ్రివలె పాలకుఁడవు, మాతా=తల్లివలెను పాలకుఁడవును, త్వమేవ అసి=నీవే యగుచున్నావు.

తాత్పర్యము : ఓ యగ్నీ! భూమియందు నివసించుచున్న యజ్ఞకర్తలు నిన్ను స్తుతులచేఁగాని, హవిస్సులచేఁగాని సంతోషపఱుచుచున్నారు. సర్వజనులకు ఉభయవిధ ధన సంపాదకుఁడవు నీవే. దురితములను తొలఁగించుటలో కుశలుఁడవైన ఓ యగ్నీ! నీవే మాకు రక్షకుఁడవు, స్మర్తవ్యుఁడవు నగుచున్నావు. ఆ విధముగ మనుష్యుల కందఱికి ఎల్లకాలములందును తండ్రివలెను, తల్లివలెను పాలకుఁడవు నీవే యగుచున్నావు. మనోతాసూక్తములో నిది పంచమ ఋక్కు.

6. మంత్రము : స పర్యేణ్యః స ప్రియో విక్ష్వగ్నిః । హోతా మన్ద్రో నిషసాదా యజీయాన్ । తం త్వా వయం దమ ఆ దీదివాగ్ంసమ్ । ఉపజ్ఞుబాధో నమసా సదేమ, ఇతి ।

అర్థము : సః అగ్నిః=ఆ యగ్ని, పర్యేణ్యః=అంతటను మంతవ్యుఁడు. సః ఏవ=ఆ యగ్నియే, విక్షు=సర్వప్రజలయందు, ప్రియః=ఇష్టుఁడు, హోతా=దేవతల నాహ్వానించువాఁడును, మన్ద్రః=హర్షహేతువును, యజీయాన్=యష్టృతముఁడు నగుచు, నిషసాద=నియమముగ కూర్చుండెను. దమే=యజ్ఞగృహమునందు, దీదివాంసమ్=దీప్యమానుఁడవును, ఉపజ్ఞు=సుప్రసిద్ధుఁడవునగు, తం త్వా=అటువంటి యగ్నివైన నిన్ను, బాధః=సంసారముచే బాధించఁబడుచున్న, వయమ్=మేము, నమసా=నమస్కారముచే, ఆసదేమ=సేవింతుము (సేవించుచున్నాము).

తాత్పర్యము : ఆ యగ్ని అంతటను మంతవ్యుఁడు. ఆ యగ్నియే ప్రజలందు ప్రియుఁడు, దేవతల నాహ్వానించువాఁడు, హర్షహేతువు, యష్టృతముఁడు నగుచు నియమముగ కూర్చుండెను. యజ్ఞ గృహమునందు దీప్యమానుఁడవును, సుప్రసిద్ధుఁడవునగు నటువంటి యగ్నివైన నిన్ను సంసారముచే బాధింపఁబడుచున్న మేము సేవించుచున్నాము. ఇది మనోతాసూక్తములో షష్ఠ ఋక్కు.

7. మంత్రము : **తం త్వా వయగ్ం సుధియో నవ్యమగ్నే। సుమ్నాయవ ఈమహే దేవయన్తః। త్వం విశో అనయో దీద్యానః। దివో అగ్నే బృహతా రోచనేన, ఇతి।**

అర్థము : హే అగ్నే!=ఓ యగ్నీ!, సుధియః=శోభనబుద్ధియుక్తులము, సుమ్నాయవః=సుఖమును కోరుచున్న వారమును, దేవయన్తః=దేవతలను కోరుచున్నవారము నగు, వయమ్=మేము, నవ్యమ్=సర్వదా నూతనుcడవును, తం త్వామ్=అటువంటి అగ్నివినగు నిన్ను, ఈమహే=పొందుచున్నాము (సేవించుచున్నాము). హే అగ్నే!=ఓ యగ్నీ!, బృహతా రోచనేన=మహాప్రకాశముచే, దీద్యానః=ప్రకాశించుచున్న, త్వమ్=నీవు, విశః=సర్వప్రజలను, దివః=ద్యోతమానములైన స్వర్గాదిలోకములను, అనయః(నయసి)=పొందించుచున్నావు.

తాత్పర్యము : ఓ యగ్నీ! 'సుధియః' ఇత్యాది విశేషణ విశిష్టులమైన మేము సర్వదా నూతనుcడవును, అటువంటి యగ్నివియునైన నిన్ను సేవించుచున్నాము. ఓ యగ్నీ! మహాప్రకాశముచే ప్రకాశించుచున్న నీవు ప్రజల నందఱిని స్వర్గాదిలోకములకు పంపుచున్నావు. ఇది మనోతాసూక్తములో సప్తమ ఋక్కు.

8. మంత్రము : **విశాం కవిం విశ్పతిగ్ం శశ్వతీనామ్। నితోశనం వృషభం చర్షణీనామ్ (3)। ప్రేతీషణిమిషయన్తం పావకమ్। రాజన్తమగ్నిం యజతగ్ం రయీణామ్, ఇతి।**

అర్థము : శశ్వతీనామ్=నిరంతరప్రవృత్తి కల, విశామ్=ప్రజలకు, పాలకమ్=పాలకుcడును, (అతః ఏవ=కనుకనే,) విశ్పతిమ్=ప్రజాస్వామియు, కవిమ్=విద్వాంసుcడును, నితోశనమ్=శత్రువులను మిక్కిలి వధించువాcడును, చర్షణీనామ్=మనుష్యులకు, వృషభమ్=కోరికల నభివర్షించువాcడును, ప్రేతీషణిమ్=ప్రకృష్టమైన గతి నొసcగువాcడును, ఇషయన్తమ్=అన్నమును చేయువాcడును, పావకమ్=శోధకుcడును, రాజన్తమ్=దీప్యమానుcడును, యజతమ్=యజనీయుcడును, రయీణాం దాతారమ్=ధనముల నొసcగువాcడునగు, అగ్నిమ్=అగ్నిని ఈమహే=పొందుచున్నాము.

తాత్పర్యము : విశ్పతిత్వాది గుణ యుక్తుcడైన యగ్నిని మేము పొందుచున్నాము. ఇందు 'ఈమహే' అను క్రియాపదము పూర్వమంత్రమునుండి అనువృత్తమైనది. ఇది మనోతాసూక్తములో సప్తమ ఋక్కు.

9. మంత్రము : **సో అగ్న ఈజే శశమే చ మర్తః। యస్త ఆనట్ సమిధా హవ్యదాతిమ్। య ఆహుతిం పరివేదా నమోభిః। విశ్వేత్స వామా దధతే త్వోతః, ఇతి।**

అర్థము : యం మర్తః=ఏ మనుష్యుcడు (యజమానుcడు), సమిధా సహ=సమిధతోc గూడ, హవ్యదాతిమ్=హవిర్దానమును, ఆనట్=వ్యాపించుచున్నాcడో (హవిస్సు నిచ్చుచున్నాcడో), సః=ఆ యజమానుcడు, ఈజే=యాగము చేయుచున్నాcడు. శశమే చ=యాగఫలమైన శాంతిని (సుఖమును) కూడ పొందుచున్నాcడు. యః=ఏ యజమానుcడు, నమోభిః సహ=నమస్కారములతోc గూడ, ఆహుతిమ్=ఆహుతిని, పరివేదా=

ఇచ్చుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, త్వోతః=నీచే రక్షితుఁడై, విశ్వేత్=సమస్తములునైన, వామా(ని)=వననీయములైనధనములను, దధతే(ధత్తే)=ధరించుచున్నాఁడు(పొందుచున్నాఁడు).

తాత్పర్యము : ఓ యగ్నీ! సమిధతోఁ గూడ హవిర్దానము చేయుచున్న యజమానుఁడు యాగము చేయుచున్నాఁడని యర్థము. యాగఫలమైన సుఖమును గూడ పొందుచున్నాఁడు. నమస్కారములతోఁ గూడ నాహుతి నొసఁగుచున్న యజమానుఁడే నీచే రక్షింపఁబడినవాఁడై సమస్తములునైన భజనీయములైన ధనములను పొందుచున్నాఁడని యర్థము. ఇది మనోతాసూక్తమున నవమ ఋక్కు.

10. మంత్రము :**అస్మా ఉ తే మహిమహే విధేమ। నమోభిరగ్నే సమిధోత హవ్యైః। వేదీ సూనో సహసో గీర్భిరుక్థైః।**

ఆ తే భద్రాయాగ్ం సుమతౌ యతేమ (4), ఇతి।

అర్థము : హే అగ్నే!=ఓ యగ్నీ!, మహే=మహనీయుఁడవైన, అస్మై ఉ=ఇట్టివాఁడవేయైన, తే=నీకొఱకు, నమోభిః=నమస్కారములచేతను, ఉత=మఱియు, సమిధా=సమిధచేతను, హవ్యైః=హవిస్సులచేతను, మహి=పూజను, విధేమ=చేయుదుము. హే సహసః సూనో!=బలమునకు పుత్రుఁడవైన ఓ యగ్నీ!, వేదీ(ద్యామ్)=ఈ వేదియందు, గీర్భిః=స్తోత్రరూపములును, ఉక్థైః=శస్త్రరూపములునైన వాక్సమూహములచే, భద్రాయామ్=మంగళకరమైన, తే=నీయొక్క, సుమతౌ=అనుగ్రహరూప బుద్ధియందు, ఆయతేమ=అంతటను ప్రయత్నింతుము(ప్రయత్నించుచున్నాము).

తాత్పర్యము : ఓ యగ్నీ! నిన్ను నమస్కారాదులచే పూజింతుము. అరణిని మథించుటవలన పుట్టిన యగ్ని బలమునకు పుత్రుఁడని యర్థము. అటువంటి ఓ యగ్నీ! ఈ వేదియందు స్తోత్రరూపములును, శస్త్రరూపములునగు వాక్సమూహములచే మంగళకరమైన నీ యనుగ్రహబుద్ధియం దంతటను ప్రయత్నించుచున్నాము. నీ యనుగ్రహము నిమిత్తము ప్రయత్నించుచున్నామని యర్థము. ఇది మనోతాసూక్తమున దశమ ఋక్కు.

11. మంత్రము :**ఆ యస్తతన్థ రోదసీ వి భాసా। శ్రవోభిశ్చ శ్రవస్యైస్తురుత్రైః। బృహద్భిర్వాజైః స్థవిరేభిరస్మే। రేవద్భిరగ్నే**

వితరం విభాహి, ఇతి।

అర్థము : హే అగ్నే!=ఓ యగ్నీ!, యః త్వమ్=ఏ నీవు, భాసా=స్వకీయ దీప్తిచే, రోదసీ=ద్యావాభూములను, వ్యాతతన్థ=వ్యాపించుచున్నావో, (వ్యాపించితివో), తథా=ఆ విధముగ, శ్రవోభిశ్చ=అన్నములచేతను, వ్యాపోషి=వ్యాపించుచున్నావో, సః త్వమ్=ఆ నీవు, శ్రవస్యైః=ప్రజలకై యన్నము నిచ్చయించుచున్న వాడవును, తరుత్రైః=దుఃఖములనుండి తరింపఁజేయువాఁడవును, అసి=అగుచున్నావు. తాదృశః త్వమ్=అటువంటి నీవు, రేవద్భిః=ధనయుక్తములును, స్థవిరేభిః=చిరంతనములును, బృహద్భిః=గొప్పవియునగు, వాజైః=అన్నములతో, యుక్తైః=కూడినవాఁడవై, అస్తే=మాయందు, వితరమ్=అత్యంత విశిష్టమైన యనుగ్రహమును, కుర్వన్=చేయుచు, విభాహి=విశేషముగ భాసించుము.

తాత్పర్యము : ఓ యగ్నీ! నీవు స్వీయదీప్తిచే ద్యావాభూములను వ్యాపించుచున్నావు. అన్నములచేతఁగూడ వ్యాపించుచున్నావు. అట్టి నీవు ప్రజలకై అన్నము నిచ్చయించువాఁడవు, దుఃఖములనుండి తరింపఁజేయువాఁడవు నగుచున్నావు. అటువంటి నీవు అన్నయుక్తుఁడవై విశేషముగ దీపించుము. ఆ యన్నములు ధనయుక్తములు, చిరంతనములు, గొప్పవియు నైనవి. ఇది మనోతాసూక్తమునందు ఏకాదశ ఋక్కు.

12. మంత్రము :**నృవద్వసో సదమిద్ధే హ్యస్మే । భూరి తోకాయ తనయాయ పశ్వః । పూర్వీరిషో బృహతీరారే అఘూః ।**

అస్మే భద్రా సౌశ్రవసాని సన్తు, ఇతి ।

అర్థము : హే వసో!=జగన్నివాసహేతువైన ఓ యగ్నీ!, నృవన్=భృత్యుల(నరుల)తోఁ గూడిన, భూరి=గొప్ప ధనమును, సదమిత్=ఎల్లవేళలందును, అస్మే=మాయందు, ధేహి=సంపాదించుము. తోకాయ=మా పుత్రుని కొఱకు, తనయాయ=తదీయపుత్రునికొఱకును, పశ్వః(పశూన్)=పశువులను, ధేహి=సంపాదించుము. కించ=మఱియు, పూర్వీః=చింతనములైన, పూర్వపురుషోచితములైన, బృహతీః=ప్రభూతములైన, ఇషః=అన్నములను, ఆరే=మా సమీపమునందు, అఘూః=ప్రవహింపఁజేయుము(సంపాదించుము). అస్మే=మాయందు, భద్రా(ని)=కల్యాణరూపములైన, సౌశ్రవసాని=అతిశోభనములైన కీర్త్యాదులు, సన్తు=ఉండుఁగాక.

తాత్పర్యము : జగన్నివాసహేతువైన ఓ యగ్నీ! భృత్యులతోఁ గూడిన ధనముల నెల్లవేళలందు మాకై సంపాదించుము. మా పుత్ర పౌత్రులకై పశువులను సంపాదించుము. ఇంకను మాకై అన్నములను సంపాదించుము. ఆ యన్నములు పూర్వపురుషోచితములు, గొప్పవియుఁగూడ. కల్యాణరూపములు, అతిశోభనములునైన కీర్త్యాదులు మాయం దుండుఁగాక. ఇది మనోతాసూక్తమునందలి ద్వాదశ ఋక్కు.

13. మంత్రము :**పురూణ్యగ్నే పురుధా త్వాయా । వసూని రాజన్వసుతాతే అశ్యామ్ । పురూణి హి త్వే పురువార సన్తి ।**

అగ్నే వసు విధత్తే రాజని త్వే (5), ఇతి ।

జాగృవాగ్ంసో అనుగ్మన్మనుషాణాం చర్షణీనాం యతేమాశ్యామ్ ద్యే చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే దశమోఽనువాకః ॥౧౦॥

అర్థము : వసుతాతే!=ధనమును విస్తరింపఁజేయువాఁడవును, రాజన్!=దీప్యమానుఁడవునగు, హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వాయా (త్వయా)=నీచేత, పురుధా=బహుప్రకారములును, పురూణి=గొప్పవియునగు, వసూని=ధనములను, అశ్యామ్=పొందెదను. హే పురువార!=అనేకులచే వరణీయుఁడవైన ఓ యగ్నీ!, త్వే=నీయందు, హి=ఏ కారణమువలన, పురూణి=బహుధనములు, సన్తి=కలవో, తస్మాత్=ఆ

కారణమువలన, విధత్తే=పరిచరించుచున్న యజమానునికొఱకు, వసు=ధనమును, రాజని=దీపించుచున్న, త్వే=నీయందు, ప్రాప్నుయామ్=పొందుదును గాక.

తాత్పర్యము : ఓ యగ్నీ! నీవు ధనమును విస్తరింపcజేసినవాcడవు, దీపించుచున్నవాcడవును. అట్టి నీవు నిమిత్తమాత్రుcడవు కాcగా బహుప్రకారములైన గొప్ప ధనములను పొందెదను. అనేకులచే పరణీయుcడవైన ఓ యగ్నీ! నీయందు బహుధనము లున్నవి కనుక పరిచర్యచేయుచున్న యజమానునికొఱకు ధనమును దీపించుచున్న నీనుండి పొందుదును గాక. ఇది మనోతాసూక్తమునందలి త్రయోదశ ఋక్కు.

కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
దశమానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే ఏకాదశోఽనువాకః

1. మంత్రము : **ఆభరతగ్ం శిక్షతం వజ్రబాహూ। అస్మాగ్ం ఇన్ద్రాగ్నీ అవతగ్ం శచీభిః । ఇమే ను తే రశ్మయః సూర్యస్య । యేభిః సపిత్వం పితరో న ఆయన్, ఇతి ।**

వేదార్థదీపిక

అవతారిక: దశమానువాకమునందు మనోతాసూక్తమభిహితమైనది. ఏకాదశానువాకములో హవిర్వనస్పతి స్విష్ట కృత్తులకు మైత్రావరుణుడు పఠించే పురోనువాక్యలు, ప్రైషమంత్రములు చెప్పబడుచున్నవి. 'యదా జానాతీన్ద్రాగ్నిభ్యాం ఛాగస్య హవిషోఽవదీయమానస్యానుబ్రూహీతి తదా మైత్రావరుణః పురోనువాక్యా మన్వాహ, ఆభరతగ్ం శిక్షతమ్' అని కల్పసూత్రం.

అర్థము : హే వజ్రబాహూ=వజ్రాయుధమును హస్తమునందు ధరించిన ఓ ఇంద్రాగ్నులారా! ఆభరతమ్=మీరు ధనమును సంపాదించండి. శిక్షతమ్=దానిని సంస్కరించండి. శచీభిః=మీ శక్తులచే, అవతమ్ =మమ్ములను రక్షించండి. నః పితరః=మా పితరులు, యేభిః=ఏ సూర్యకిరణములతో, సపిత్వమ్=సంబంధమును, ఆయన్= పొందినారో, తే సూర్యస్య రశ్మయః=ఆ సూర్యుని కిరణములు, ఇమే ను=ఇవియే.

తాత్పర్యము : వజ్రాయుధము హస్తమునందు గల ఓ ఇంద్రాగ్నులారా! మీరు ధనమును సంపాదించి, దానిని సంస్కరించండి. మీ శక్తులతో మమ్ములను రక్షించండి. ఈ సూర్యకిరణములతోనే మా పితరులు సంబంధమును పొందినారు. అవి మీ అధీనములోనే ఉన్నవి. అందువలన మా పితరులను వలె మమ్ములను పాలించండి.

2. మంత్రము : **హోతా యక్షదిన్ద్రాగ్నీ । ఛాగస్య హవిష ఆత్తామద్య । మధ్యతో మేద ఉద్భృతమ్ ।**

పురా ద్వేషోభ్యః । పురా పౌరుషేయ్యా గృభః । ఘుస్తాం నూనమ్ (1) ।

ఘూసే అజ్రాణాం యవసప్రథమానామ్ । సుమత్క్షరాణాగ్ం శతరుద్రియాణామ్।

అగ్నిష్వాత్తానాం పీవోపవసనానామ్ । పార్శ్వతః శ్రోణితః శితామత ఉత్సాదతః ।

అజ్గదజ్గదవత్తానామ్ । కరత ఏవేన్ద్రాగ్నీ । జుషేతాగ్ం హవిః । హోతర్యజ, ఇతి ।

అర్థము : హోతా=దేవహోత, యక్షత్ =పూజించబడుగాక. హే ఇన్ద్రాగ్నీ=ఓ ఇంద్రాగ్నులారా! మీరిరువురు, హవిషః=హవిర్భూతమగు, ఛాగస్య=మేకపోతుయొక్క, మధ్యతః=మధ్యదేశమునుండి, ఉద్భృతమ్=

ఉద్ధరించి సంపాదించబడిన, మేదః=మేదస్సు మొదలగు సారమును, అద్య=ఈ యజ్ఞకర్మయందు, ఆత్తామ్=భక్షించెదరుగాక. ద్వేషోభ్యః=మమ్ములను ద్వేషించే వారికంటె, పురా=ముందు, అట్లే, పౌరుషేయ్యా=మా విరోధులగు పురుషులు, గృభః=గ్రహించుటకు, పురా=పూర్వమే, నూనమ్= నిశ్చయముగ, ఘస్తామ్=భుజించెదరుగాక. ఘాసే=యాగమునందు, అజ్రాణామ్=ఉంచబడిన, సంస్కరించబడిన, యవసప్రథమానామ్=అన్నము ముఖ్యంగా ఉండే హవిస్సులలో, సుమత్తరాణామ్=సులభముగ ముఖము నుండి ఉదరములోనికి ప్రవేశించు అన్నాదులలో, శతరుద్రియాణామ్=నూరుమంది రుద్రులు అధిష్ఠాన భూతులుగ ఉన్న, అగ్నిష్వాత్తానామ్=జఠరాగ్ని లేదా ఆహవనీయాగ్ని చేత స్వీకరించబడిన, పీవోపవసనానామ్=స్థూలమైన చర్మము ఆచ్ఛాదనస్థానముగాగల హవిస్సులలో, పార్శ్వతః= పార్శ్వ భాగములనుండి, అవత్తానామ్=కోసి తీయబడిన హవిస్సులలో, శ్రోణితః పిఱుఁదులనుండి, శితామతః=బాహువులనుండి లేదా కాలేయము నుండి, ఉత్సాదతః =గుదకాండమునుండి, అఙ్గాదఙ్గాత్=మిగిలిన శరీరభాగములన్నిటినుండి, అవత్తానామ్=కోసితీయబడిన (స్వీకరించబడిన) హవిస్సులలో ఎన్ని హవిర్భాగములు కలవో వాటినన్నిటిని, ఇన్ద్రాగ్నీ ఏవ=ఇంద్రాగ్నులే, కరతః =చేయుదురుగాక. హవిః=ఈ హవిస్సును, జుషేతామ్=స్వీకరించెదరుగాక. హోతః=ఓ మనుష్యహోతా! యజ=యాజ్యానువాకమును పఠించుము.

తాత్పర్యము : దేవహోత పూజించబడుగాక! ఇంద్రాగ్నులు హవిర్భూతమైన మేకపోతు మధ్యదేశమునుండి ఉద్ధరించి సంపాదించబడిన మేదస్సు మొదలగు సారమును యాగమునందు భక్షించెదరుగాక. మా విరోధులైన రాక్షసులు దీనిని గ్రహించి వెళ్ళుటకు పూర్వమే తప్పక భక్షించెదరుగాక. ఈ యాగంలో బాగుగ సంస్కరించి ఉంచబడిన అన్నము ప్రధానంగా ఉండే హవిస్సులలో, సులభముగ ముఖమునుండి ఉదరములోనికి ప్రవేశించు అన్నాదులలో, నూరుమంది రుద్రులు అధిష్ఠానభూతులుగ ఉన్న, జఠరాగ్ని లేదా ఆహవనీయాగ్నిచే స్వీకరించబడిన, స్థూలమైన చర్మము ఆచ్ఛాదనముగాగల హవిస్సులలో, అట్లే పార్శ్వ భాగములనుండి మొదట స్వీకరించబడిన హవిస్సులలో, పిఱుఁదులనుండి, బాహువుల నుండి లేదా కాలేయము నుండి, గుదప్రదేశమునుండి, ఆ పైనున్న ఇతర శరీర భాగములన్నిటినుండి స్వీకరించబడిన హవిస్సులలోని హవిర్భాగములన్నింటిని ఇంద్రాగ్నులే చేయుదురుగాక. ఆ తరువాత ఈ హవిస్సును స్వీకరించెదరుగాక. అందుకొఱకు ఓ మనుష్యహోతా! యాజ్యానువాకమును పఠించుము. ఇది ప్రైష మంత్రము.

3. మంత్రము : **దేవేభ్యో వనస్పతే హవీగ్ంషి । హిరణ్యపర్ణ ప్రదివస్తే అర్థమ్ । ప్రదక్షిణిద్రశనయా నియూయ ।**

ఋతస్య వక్షి పథిభీ రజిష్ఠైః, ఇతి ।

అర్థము : హే వనస్పతే=యూపాత్మకుడవగు ఓ అగ్నీ! హిరణ్యపర్ణ=సువర్ణమువంటి రంగుగల పత్రములతో కూడిన లేదా సువర్ణముతో సమానమగు జ్వాలలతో కూడిన నీవు, దేవేభ్యో=దేవతలకొఱకు, హవీంషి = హవిర్భవ్యములను, వక్షి=అందజేయుచున్నావు. ఆ హవిస్సులు తే అర్థం=నీకు ప్రయోజనమును కలుగ జేయునవి, ప్రదివః=ప్రవరములు, రశనయా=యూప (స్తంభ)మును చుట్టుటకు కారణభూతమగు త్రాడుచే,

ప్రదక్షిణిత్ =ప్రదక్షిణాకారముగ, నియూయ=బాగుగా నిన్ను బంధించుకొని, ఋతస్య=యజ్ఞమునకు సంబంధించిన హవిస్సులను, రజిష్ఠైః=ఋజువగు, ఉత్తమమగు, పథిభిః=మార్గములచే తీసుకొని వెళ్ళుచున్నావు.

తాత్పర్యము : యూపాత్మకుడవగు ఓ అగ్నీ! సువర్ణమువంటి వర్ణముగల పత్రములతో కూడిన లేదా సువర్ణముతో సమానమగు జ్వాలలతో కూడిన నీవు దేవతలకు హవిర్భవ్యములను అందజేయుచున్నావు. ఆ హవిస్సులు నీకు ప్రయోజనమును కలుగజేయునవి, ప్రవరములు అనగా పూర్వము వలె ప్రవృత్తములైనవని అర్థము. నీవు యూపమును (స్తంభమును) చుట్టే త్రాడుతో ప్రదక్షిణగా బాగుగా నిన్ను బంధించుకొని ఆ తరువాత యజ్ఞమునకు సంబంధించిన హవిస్సులను ఋజువైన, ఉత్తమమార్గములచే తీసుకొని వెళ్ళుచున్నావు. ఇది వనస్పతికి పురోనువాక్య.

4. మంత్రము : **హోతా యక్షద్వనస్పతిమభి హి। పిష్టతమయా రభిష్టయా రశనయా కధిత। యత్రేన్ద్రాగ్నియోశ్ఛాగస్య హవిషః ప్రియా ధామాని। యత్ర వనస్పతేః ప్రియా పాథాగ్ంసి। యత్ర దేవానామాజ్యపానాం ప్రియా ధామాని । యత్రాగ్నేర్హోతుః ప్రియా ధామాని। తత్రైతం ప్రస్తుత్యేవోపస్తుత్యేవోపావస్రక్షత్ ।**

రభీయాగ్ంసమివ కృత్వీ (3) కరదేవం దేవో వనస్పతిః । జుషతాగ్ం హవిః హోతర్యజ, ఇతి।

అర్థము : దైవ్యోహోతా =దేవసంబంధమగు హోతయను ఋత్విక్కు, వనస్పతిం=వనస్పతిరూపుడగు దేవుని, యక్షత్ =పూజించుగాక. హి ఎందువలననగా, పిష్టతమయా =మృదువుగనున్న, రభిష్టయా =మిక్కిలి శీఘ్రముగా ప్రవృత్తమైన, రశనయా =త్రాడుచే, అభ్యధిత=వనస్పతి నామాత్మకుని బంధించెను. ఆ కారణమువలన అటువంటి ఈ యూపము, ఏతం పశుమ్=ఈ పశువును, తత్ర=ఆ స్థానమునకు ఉపావస్రక్షత్=సమీపమును పొందునట్లు చేయుగాక. ఇన్ద్రాగ్నియోః=ఇంద్రాగ్ని దేవతలకు సంబంధించిన, ఛాగస్య=ఛాగరూపమగు, హవిషః=హవిస్సునకు, ప్రియా ధామాని=ప్రియమగు స్థానములు ఎచ్చట ఉన్నవో, వనస్పతేః=వనస్పతి దేవునికి, ప్రియా పాథాంసి=ప్రియకరములగు ఉదకములు ఎచ్చట కలవో, ఆజ్యపానాం దేవానామ్= ప్రయాజాది దేవతలకు, ప్రియా ధామాని=ప్రియమగు స్థానములు ఎచ్చట ఉన్నవో, హోతుః= హోమ నిష్పాదకుడగు, అగ్నేః=అగ్నికి, ప్రియా ధామాని=ప్రీతికరమగు స్థానములు ఎచ్చట కలవో, తత్ర ఏతం పశుం ఉపావస్రక్షత్. ప్రస్తుత్యేవ=మొదటనే ప్రస్తావించి, ఉపస్తుత్యేవ=సన్నిధియందే ప్రశంసించి, రభీయాంసమివ కృత్వా=దేవతలకు ప్రీతిని కలుగజేయుట ద్వారా శీఘ్రముగ ప్రవర్తించునట్లు చేసి, ఉపావస్రక్షత్. వనస్పతిః=వనస్పతి దేవుడు, ఏవం కరత్=ఈ ప్రకారము చేయుగాక. హవిః=ఈ హవిర్భవ్యమును, జుషతామ్=సేవించుగాక. హోతః=ఓ మనుష్య హోతా! యజ=యాజ్యను పఠించుము.

తాత్పర్యము : దేవహోత వనస్పతిరూపుడైన దేవుని పూజించుగాక. ఎందువలననగా మృదువుగానున్న, శీఘ్రముగా ప్రవృత్తమైన త్రాడుచే వనస్పతినామాత్మకుని బంధించెను. ఆ కారణము వలన అటువంటి ఈ యూపము ఈ పశువును ఆ స్థానము సమీపమును పొందునట్లు చేయుగాక. ఎక్కడ ఇంద్రాగ్నీ దేవతలకు సంబంధించిన భాగరూపమైన హవిస్సునకు ప్రియమగు స్థానములు కలవో, వనస్పతి దేవునికి ప్రియకరములగు ఉదకములు ఎచ్చట కలవో, ప్రయాజాది దేవతలకు ప్రియమగు స్థానములు ఎచ్చట నున్నవో, హోమనిష్పాదకుడగు అగ్నికి ప్రీతికరమగు స్థానములు ఎచ్చట కలవో ఆ స్థానసమీపమును పొందునట్లు చేయుగాక. ఏమిచేసి అనగా మొదటనే ప్రస్తావించి, ఇంకను సన్నిధియందే ప్రశంసించి దేవతలకు ప్రీతిని కలుగజేయుట ద్వారా శీఘ్రముగ ప్రవర్తించునట్లు చేసి ఆస్థాన సమీపమును పొందునట్లు చేయుగాక. వనస్పతి దేవుడు ఈ ప్రకారము చేయుగాక. ఈ హవిర్ద్రవ్యమును సేవించుగాక. ఓ మనుష్యహోతా! దాని కొఱకు యాజ్యను పఠించుము. ఇది ప్రైషమంత్రము.

5. మంత్రము : **పిప్రీహి దేవాగ్ం ఉశతో యవిష్ఠ । విద్వాగ్ం ఋతూగ్ంర్ ఋతుపతే యజేహ । యే దైవ్యా**

ఋత్విజస్తేభిరగ్నే । త్వగ్ం హోతౄణామస్యాకయజిష్ఠః, ఇతి ।

అర్థము : హే యవిష్ఠ!=యువకుడవగు ఓ అగ్నీ! ఉశతః=కోరికలతో ఉన్న దేవతలను గూర్చి, పిప్రీహి=మిక్కిలి ప్రీతిని కలుగజేయుము. హే ఋతుపతే!=సూర్యాత్మకుడుగ కాలమును పరిపాలించువాడా!, నీవు, ఋతూన్=కాలవిశేషములను, విద్వాన్=తెలుసుకొనుచూ ఉన్నావు. అందువలన, ఇహ=ఉచిత కాలమున, యజ=దేవతలను పూజించుము. యే దైవ్యా ఋత్విజః=ఏ దేవసంబంధమగు ఋత్విక్కులు కలరో, తేభిః=వారితో కూడ, అగ్నే!=ఓ అగ్నీ!, త్వమ్=నీవు, అస్య=ఈ యజమానికి సంబంధించిన, హోతౄణామ్=హోతలగు ఋత్విక్కుల మధ్యలో, ఆయజిష్ఠః=అన్ని విధములుగ పూజనీయుడవు అయినావు.

తాత్పర్యము : యువకుడవగు ఓ అగ్నీ! నీవు కోరికలతో ఉన్న దేవతలకు మిక్కిలి ప్రీతిని కలుగజేయుము. సూర్యాత్మకుడుగ కాలమును పాలించే నీవు కాలవిశేషములను తెలుసుకొనుచున్నావు. అందువలన ఉచిత కాలమున దేవతలను పూజించుము. ‘‘ అగ్నిర్హోతాకశ్వినాకధ్వర్యూ త్వష్టాకగ్నేత్ ’’ ఇత్యాది మంత్రములచే గ్రహించబడిన ఏ దేవలకు సంబంధించిన ఋత్విక్కులు కలరో, వారితో కూడ ఓ అగ్నీ! నీవు ఈ యజమానునికి సంబంధించిన హోతలగు ఋత్విక్కుల మధ్యలో అన్ని విధములుగ పూజనీయుడవైనావు. ఇది స్విష్ట కృత్తుకు పురోనువాక్య.

6. మంత్రము : **హోతా యక్షదగ్నిగ్ం స్విష్టకృతమ్। అయాడగ్నిరిన్ద్రాగ్నియోశ్ఛగస్య హవిషః ప్రియా ధామాని।**

అయాడ్వనస్పతేః ప్రియా పాథాగ్ంసి। అయాడ్దేవానామాజ్యపానాం ప్రియా ధామాని।

యక్ష॒దగ్నే॒ర్హోతుः प्रि॒या धా॒మాని ।యక్ష॒త్స్వం మ॑హి॒మాన॑మ్।ఆ॑యజ॒తామే॒జ్యా ఇష॑ः।

కృ॒ణో॒తు సో అ॑ధ్వ॒రా జా॒తవే॑దాः। జు॒ష॒తాగ్॑o హ॒విः । హో॒తర్య॑జ (4), ఇతి ।

నూ॒నమ॑ర్థం కృ॒త్వీ పా॑థా॒గ్॑oసి స॒ప్త చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే ఏకాదశోఽనువాకः ॥౧౧॥

అర్థము : హోతా =దేవసంబంధమగు హోత అను ఋత్విక్కు, స్విష్టకృతం అగ్నిమ్=స్విష్టకృత్ అనుబడు అగ్నిని, యక్షత్ =పూజించుగాక. ఇంద్రాగ్నియోः=ఇంద్రాగ్నులకు సంబంధించిన, ఛాగస్య హవిషः= ఛాగరూపమగు హవిస్సునకు, ప్రియా ధామాని=ఎన్ని ప్రియమగు స్థానములో వాటిని, అగ్నిः=ఈ అగ్నిదేవుడు, అయాట్=పూజించెను. అట్లే, వనస్పతేः=వనస్పతికి, ప్రియా=ప్రియములైన, పాథాంసి= జలములను లేదా హవిస్సులను, అయాట్=పూజించెను. ఆజ్యపానాం దేవానామ్=ప్రయాజాది దేవతలకు, ప్రియా=ప్రియములైన, ధామాని=స్థానములను, అయాట్ =పూజించెను. హోతుः అగ్నేः= హోమనిష్పాదకుడగు అగ్నికి, ప్రియా ధామాని ప్రియములగు స్థానములను స్విష్టకృత్ అగ్నిः అయాట్. స్వం మహిమానమ్=ఇచ్చట చెప్పబడిన దేవతలందరి మహిమావిశేషమును, యక్షత్=దేవసంబంధమగు హోత అను ఋత్విక్కు పూజించుగాక. ఆయజతామ్=అభిముఖముగ యాగమును చేయు యజమానులకు, ఏజ్యా=ముఖ్యముగపూజించవలసిన, ఇషः=ఇష్టులైన దేవతలందరిని గూర్చి, అధ్వరా= ఈ యజ్ఞమునందు, సः జాతవేదాः=స్విష్టకృద్రూపుడైన ఆ అగ్ని, కృణోతు=బాగుగ ఆహుతులగునట్లు చేయుగాక. హవిः=ఈ హవిస్సును, జుషతామ్= సేవించుగాక. హోతः=ఓ మనుష్యహోతా! యజ= యాజ్యను పఠించుము.

తాత్పర్యము : దేవహోత స్విష్టకృదగ్నిని పూజించుగాక. ఇంద్రాగ్నులకు సంబంధించిన ఛాగరూప హవిస్సునకు ప్రియములైన స్థానములను ఈ అగ్నిదేవుడు పూజించెను. అట్లే వనస్పతికి ప్రియములగు జలములు లేదా హవిస్సులను పూజించెను. ప్రయాజాది దేవతలకు ప్రియములగు స్థానములను పూజించెను. హోమనిష్పాదకుడగు అగ్నికి ప్రియములగు స్థానములను స్విష్టకృదగ్ని పూజించెను. ఇచ్చట చెప్పబడిన దేవతలందరి మహిమను దేవహోత పూజించుగాక. అభిముఖముగ యాగమును చేయు యజమానులకు ముఖ్యముగ పూజించవలసిన ఇష్టదేవతలందరిని గూర్చి ఈ యజ్ఞమునందు స్విష్టకృద్రూపుడైన ఆ అగ్ని బాగుగ ఆహుతులగునట్లు చేయుగాక. అందుకొఱకు ఈ స్విష్టకృదగ్ని ఈ హవిస్సును సేవించుగాక. ఓ మనుష్యహోతా! అందులకై యాజ్యను పఠించుము. ఇది ప్రైషమంత్రము.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు ఏకాదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
ద్వాదశోఽనువాకః

1. మంత్రము : **ఉపోహ యద్విదథం వాజినో గూఃగీర్భిర్విప్రాః ప్రమతిమిచ్ఛమానాఃఅర్వన్తో న కాష్ఠాం నక్షమాణాఃఇన్ద్రాగ్నీ జోహవతో నరస్తే, ఇతి ।**

వేదార్థదీపిక

అవతారిక: ఏకాదశానువాకమునందు హవిస్సులకు, వనస్పతికి, స్విష్టకృత్తుకు పురోనువాక్యలు, ప్రైషమంత్రము లభిహితములైనవి. పిమ్మట ద్వాదశానువాకములో వాటికి యాజ్యలు చెప్పబడుచున్నవి. ''అథ హోతా యజతు, ఉపోహ యత్'' అని కల్ప సూత్రము.

అర్థము : యత్=ఏ విప్రులగు ఋత్విక్కులు, ఉపోహ=సమీపమునందే, విదథం గూఃయజ్ఞమును గూర్చి వెళ్ళుచున్నారో, విప్రాఃఆ విప్రులగు ఋత్విక్కులు, వాజినఃఅన్నముతో, హవిర్భక్షణముతో కూడిన వారు, గీర్భిఃస్తుతులచే, ప్రమతిమ్దేవతాహ్వానవిషయకమగు గొప్పబుద్ధిని, ఇచ్ఛమానాఃకోరువారు, కాష్ఠామ్కర్మసమాప్తిని, నక్షమాణాఃపొందువారు, అర్వన్తో నఅశ్వములు ఎట్లైతే తమ గమన సమాప్తిని పొందుచున్నావో, అట్లు, తే నరఃఅటువంటి ఋత్విక్కులు, ఇన్ద్రాగ్నీఇన్ద్రాగ్నీ దేవతలను, జోహవతఃహోమముచే ఆరాధిస్తూ ఉన్నారు.

తాత్పర్యము : విప్రులగుఋత్విక్కులు సమీపమునందే యజ్ఞమును గూర్చి ప్రవర్తించుచున్నారు. వారు అన్నముతో, హవిర్భక్షణముతో కూడినవారు, స్తుతులచేత దేవతాహ్వాన విషయకమగు గొప్పబుద్ధిని కోరువారు, కర్మ సమాప్తిని పొందువారు. అశ్వములు ఎట్లైతే తమ గమన సమాప్తిని పొందుచున్నవో, అట్లే ఆ ఋత్విక్కులు ఇన్ద్రాగ్ని దేవతలను హోమముచే ఆరాధిస్తూ ఉన్నారని ఇచ్చట దృష్టాంతము చెప్పబడినది.

2. మంత్రము : **వనస్పతే రశనయాఽభిధాయపిష్టతమయా వయునాని విద్వాన్ ।వహ దేవత్రా దిధిషో హవీగ్ంషిప్ర చ దాతారమమృతేషు వోచఃఇతి ।**

అర్థము : హే వనస్పతే!=ఓ యూపమా! (స్తంభమా!), పిష్టతమయా=మృదువుగనున్న, రశనయా=త్రాడుచే, అభిధాయ=నిన్ను బంధించుకొని, వయునాని=మా దేవతల జ్ఞానములను లేదా అభిప్రాయములను, విద్వాన్=తెలుసుకొనుచూ, దేవత్రా=దేవతలకు, హవీంషి=హవిస్సులను, వహ=అందజేయుము. చ=ఇంకను, హే దిధిషఃధారణలో కుశలుడవగు ఓ వనస్పతి!, దాతారం=హవిస్సులను సమర్పించుటలో ఉద్యుక్తుడగు యజమానిని గూర్చి, అమృతేషు=దేవతల వద్ద, ప్రవోచఃఈ యజమానునిచే హవిర్ద్రవ్యములు సమర్పించబడినవని గొప్పగా చెప్పుము.

తాత్పర్యము : ఓ యూపమా! (స్తంభమా!) మృదువుగనున్న క్రాడుచే నిన్ను బంధించుకొని మా దేవతల జ్ఞానములను లేదా అభిప్రాయములను తెలుసుకొనుచూ దేవతలకు హవిస్సులను అందజేయుము. ఇంకను ధారణవిషయములో కుశలుడవైన ఓ వనస్పతీ! హవిస్సులను సమర్పించుటలో ఉద్యుక్తుడగు యజమానిని గూర్చి దేవతల వద్ద ''ఈ యజమానిచే హవిర్భవ్యములు సమర్పించబడినవి'' అని గొప్పగా చెప్పుము. ఇది వనస్పతికి యాజ్య.

3. మంత్రము : **అగ్నిగ్గ్ం స్విష్టకృతమ్ । అయాడగ్నిరిన్ద్రాగ్నియోశ్ఛాగస్య హవిషః ప్రియా ధామాని (1) ।**

అయాడ్వనస్పతేః ప్రియా పాథాగ్ంసి । అయాడ్దేవానామాజ్యపానాం ప్రియా ధామాని । యక్షదగ్నేర్హోతుః

ప్రియా ధామాని యక్షత్స్వం మహిమానమ్ । ఆయజతామేజ్యా ఇషః । కృణోతు సో అధ్వరా జాతవేదాః ।

జుషతాగ్ం హవిః । అగ్నే యదద్య విశో అధ్వరస్య హోతః । పావక శోచే వేష్ట్వగ్ం హి యజ్యా ।

ఋతా యజాసి మహినా వి యదృభ్వః । హవ్యా వహ యవిష్ఠ యా తే అద్య (2), ఇతి ।

ధామాని భూరేకం చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే ద్వాదశోనువాకః ॥౧౨॥

అర్థము : స్విష్టకృతం అగ్నిమ్=స్విష్టకృత్తు అనబడు అగ్నినిమేము పూజించుచున్నాము. 'అయాడగ్నిరిన్ద్రాగ్నియోః' మొదలు 'జుషతాం హవిః' వరకు పూర్వానువాకములో వలె వ్యాఖ్యానమును గ్రహించవలెను. హే అగ్నే!=స్విష్టకృద్రూపుడవగు ఓ అగ్నీ! విశః = అనుష్ఠించబడిన, అధ్వరస్య=యజ్ఞమునకు సంబంధించిన, యత్=ఏ హవిర్భవ్యము కలదో, తదద్య= దానినిప్పుడు, వేః=భక్షించుము. హే హోతః!=ఓ హోమకర్తా!, పావక!=పరిశుద్ధుడా!, శోచే= ప్రకాశించువాడవగు ఓ అగ్నీ!, హి=ఎందువలననగా, త్వమ్=నీవు, యజ్వా=యాగమునకు కర్తవు. అందువలన, ఋతా=మా యజ్ఞమునందు, మహినా=నీ మహిమచేత, యజాసి=దేవతలను తృప్తిపరచుచున్నావు. యద్ =ఏ కారణమువలన, విభూః=విశిష్టుడవు అయినావో, ఆ కారణముచే, హే యవిష్ఠ!= ఓ యువకుడా!, అద్య=ఈ రోజు, తే=నీకు, యా హవ్యా=ఏ హవిస్సులు మాచే సమర్పించ బడుచున్నవో, వాటినన్నింటిని, వహ=స్వీకరించుము.

తాత్పర్యము : స్విష్టకృత్తనబడు అగ్నిని మేము పూజించుచున్నాము. 'అయాడగ్నిరిన్ద్రాగ్నియోః' మొదలు 'జుషతాం హవిః' వరకు పూర్వానువాకములో వలె భాష్యమును స్వీకరించవలెను. స్విష్టకృద్రూపుడవగు ఓ అగ్నీ!

నీవు మాచే అనుష్ఠించబడిన యజ్ఞమునకు సంబంధించిన హవిర్ద్రవ్యమును భక్షించుము. హోమకర్తవు, పరిశుద్ధుడవు, ప్రకాశించువాడవునగు ఓ అగ్నీ! నీవు యాగకర్తవు కావున మా యజ్ఞమునందు నీ మహిమచే దేవతలను తృప్తిపరచుచున్నావు. యువకుడవైన ఓ అగ్నీ! ఏ కారణమువలన నీవు విశిష్టుడవైనావో, ఆ కారణముచే ఈ రోజు మేము నీకు సమర్పిస్తున్న హవిస్సులనన్నింటిని స్వీకరించుము. ఇది స్విష్టకృత్తుకు యాజ్య.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమున తృతీయ కాండమున షష్ఠ ప్రపాఠకమునందు
ద్వాదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే త్రయోదశోఽనువాకః

1. మంత్రము : **దేవం బర్హిః సుదేవం దేవైః స్యాత్సువీరం వీరైర్వస్తోర్వృజ్యేతాక్తోః ప్రభ్రియేతాత్యన్యాన్రాయా బర్హిష్మతో మదేమ వసువనే వసుధేయస్య వేతు యజ, ఇతి ।**

వేదార్థదీపిక

అవతారిక: ద్వాదశానువాకమునందు హవిర్వనస్పతి స్విష్టకృత్తులకు యాజ్యలభిహితములైనవి. త్రయోదశానువాకము నందు అనూయాజలకు మైత్రావరుణప్రైషలు చెప్పబడుచున్నవి. ''యదా జానాతి దేవేభ్యః ప్రేష్యేతి తన్మైత్రావరుణః ప్రేష్యతి దేవం బర్హి సుదేవమితి. అథ హోతా యజతి - 'దేవం బర్హిః. వసువనే వసుధేయస్య వేతు' ఇతి, తమేవ వ్యతిషఙ్గముత్తరేణోత్తరేణ మైత్రావరుణః ప్రేష్యత్యుత్తరేణోత్తరేణ హోతా యజతి'' ఇతి. అందు ఈ అనువాకములో ప్రైషమంత్రములు, తరువాతి అనువాకములో యాజ్యలు చెప్పబడుచున్నవి.

అర్థము : దేవం=ప్రకాశించు స్వభావము కల, బర్హిః=ప్రథమానూయాజ దేవస్వరూపమగు బర్హిస్సు అను పేరుతో ఏది కలదో అది, దేవైః=ఇతరదేవతలతో పాటు, సుదేవం స్యాత్=శుభప్రదమైన ప్రకాశము కలదిగ అగుగాక. వీరైః=మాయొక్క పుత్రులతోపాటు, సువీరం స్యాత్ =శుభకరులగు వీరులతో కూడినది అగుగాక. వస్తోః= దేవతలవాసము కొఱకు, వేదియందు కప్పుటకును, వృజ్యేత=బర్హిస్సులు ఉండుగాక. అక్తోః=స్రుక్కులను లేదా హవిస్సులను అభివ్యక్తముచేయుటకు, ప్రభ్రియేత గొప్పగా ధరించవలెను. ఈ బర్హిస్సు అభిమానియగు అనూయాజ దేవుని అనుగ్రహమువలన, అన్యాన్ బర్హిష్మతః=యాగమునకు సంబంధించిన ఇతర పురుషులను, రాయా=ధనముచే, అతి =అతిక్రమించి, మదేమ=సంతోషించెదము, లేదా తృప్తిని పొందెదము. వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమును ఇచ్చుటకు, వేతు=ఆజ్యమును త్రాగుగాక. యజ=ఓ హోతా! దాని కొరకు యాజ్యను పఠించుము.

తాత్పర్యము : ప్రకాశించు స్వభావముగల ప్రథమానూయాజ దేవ స్వరూపమైన బర్హిస్సు ఇతర దేవతలతోపాటు శుభప్రదమైన ప్రకాశము కలదిగ అగుగాక. మా పుత్రులతోపాటు శుభకరులగు వీరులతో కూడినది అగుగాక. దేవతలు వసించుటకును, వేదియందు కప్పుటకును బర్హిస్సులు, దర్భలు ఉండుగాక. స్రుక్కులను లేదా హవిస్సులను ప్రదర్శించుటకు వాటిని గట్టిగా పట్టుకొనవలెను. వేదియందు పరచబడు బర్హిస్సు దాని యభిమానియగు 'బర్హిస్సు' అను పేరుగల అనూయాజదేవుడు. అందువలన దేవప్రసంగమువలన దర్భవర్ణనము యుక్తము. ఈ బర్హిదేవుని అనుగ్రహము వలన యాగమునకు సంబంధించిన ఇతరపురుషులను ధనముచే అతిక్రమించి సంతోషించెదము, తృప్తిని పొందెదము. ధనప్రదాత అయిన దేవునికి ధనమునిచ్చుటకు ఆజ్యమును త్రాగుగాక. దాని కొఱకు ఓ హోతా! యాజ్యను పఠించుము. ఇది ప్రథమ ప్రైషమంత్రము.

2. మంత్రము : **దేవీర్ద్వారః సంఘాతే విడ్వీర్యామచ్ఛిథిరా ధ్రువా దేవహూతౌ వత్స ఈమేనాస్తరుణ**

ఆమిమీయాత్కుమారో వా నవజాతో మైనా అర్వా రేణుకకాటః పృణగ్వసువనే వసుధేయస్య

వియన్తు యజ, ఇతి ।

అర్థము : దేవీర్ద్వారః=ద్వారశబ్దముచే చెప్పబడు స్త్రీమూర్తులగు ద్వితీయానూయాజ దేవతలు, సంఘాతే విడ్వీః= రెండు కవాటములు (తలుపులు) కలుసుకున్నప్పుడు దృఢశక్తులై, యామన్ =బయటకు వెళ్ళు సమయమున, శిథిరాః=ద్వారములను తెఱచుటచే శైథిల్యమును పొందినవారై, దేవహూతౌ =దేవతల ఆహ్వానమున లేదా ప్రవేశమున, ధ్రువా =నిత్యము ప్రవర్తిస్తూ ఉన్నారు. ఏనా ద్వారః=ఈ ద్వారములను వత్సాదులు, అమిమీయాత్=వచ్చి ప్రవేశింతురుగాక. వత్స ఈమ్=బిడ్డ కూడ, పశుపక్ష్యాదులు కూడ ప్రవేశించగలవు. తరుణః=యువకుడు, కుమారః=బాలుడు, నవజాతః=అప్పుడే జన్మించినవాడు, వీరందరు కూడ ఆ ద్వారములను ప్రవేశించగలరు. రేణుకకాటః=భూమిని రేణువులుగచేసి సంచరించునటువంటి, అర్వా= ధూర్తమగు అశ్వము, ఏనా=ఈ ద్వారములను, మా పృణక్=కూడి ఉండకుండు గాక. వసుధేయస్య= ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమును ఇచ్చుటకు, వియన్తు= ఆజ్యమును త్రాగుదురుగాక. యజ=ఓ హోతా! దానికొఱకు యాజ్యను (మంత్రమును) పఠించుము.

తాత్పర్యము : ద్వారాభిమానులు, స్త్రీమూర్తులైన ద్వితీయానూయాజ దేవతలు రెండు తలుపులు కలుసుకున్నప్పుడు దృఢశక్తులై బయటకు వెళ్ళు సమయమున ద్వారములను తెఱచుటచే శైథిల్యమును పొందినవారై దేవతల ఆహ్వానమున, లేదా ప్రవేశమున నిత్యము ప్రవర్తిస్తూ ఉన్నారు. ఈ ద్వారములను వత్సాదులు వచ్చి ప్రవేశింతురుగాక. గొప్ప అవకాశము గనుక అందఱి ప్రవేశమును ద్వారదేవతలు అంగీకరించుచున్నారు. ఏ ఒక్కరు కూడ అడ్డగించబడుటలేదని అర్థము. బిడ్డ, పశుపక్ష్యాదులు కూడ ప్రవేశించగలవు. ఇక మనుష్యుని విషయము ప్రత్యేకముగ చెప్పవలెనా? (తప్పక ప్రవేశిస్తాడని అర్థము.) ఆ మనుష్యుడు యువకుడైనా, బాలుడైనా, అప్పుడే జన్మించినవాడైనా, వీరందరు ఆ ద్వారములను ప్రవేశించగలరు. భూమిని రేణువులుగచేసి సంచరించే ధూర్తమగు అశ్వము ద్వారములను భేదించగలదైనను ఈ ద్వారములను కూడి ఉండకుండుగాక. ధనప్రదాత అయిన దేవునికి ధనమును ఇచ్చుటకు ద్వారాభిమాని దేవతలు ఆజ్యమును త్రాగుదురుగాక. దాని కొఱకు ఓ హోతా! యాజ్యను పఠించుము. ఇది ద్వితీయ ప్రైషమంత్రము.

3. మంత్రము : **దేవీ ఉషాసానక్తా కద్యాస్మిన్యజ్ఞే ప్రయత్యే హ్వేతామపి నూనం దైవీర్విశః ప్రాయాశిష్టాగ్ం సుప్రీతే**

సుధితే వసువనే వసుధేయస్య వీతాం యజ, ఇతి ।

అర్థము : ఉషాసానక్తా=ఉషాసానక్త శబ్దవాచ్యలగు అహోరాత్రాభిమానులైన తృతీయానూయాజ దేవతలు ఉభయులును, అద్య=ఈ రోజు, అస్మిన్ యజ్ఞే=ఈ పశుయాగము, ప్రయతి సతి=ప్రవర్తించుచుండగా,

అహ్వాతామ్=దేవతలు మొదలగువారిని ఆహ్వానింతురుగాక. అపి దైవీర్విశః=దైవసంబంధమగు ప్రజలందరిని గూర్చి, నూనమ్=నిశ్చయముగ, ప్రాయాశిష్టామ్=గొప్పగవెళ్ళుదురుగాక. వారు, సుప్రీతే=స్వయముగ చక్కటి ప్రీతిగలవారు, విముఖత లేనివారు, సుధితే=చక్కగ ప్రారంభించి నిర్వహించగలవారు. వసుధేయస్య ధనప్రదాత అయిన దేవునికి, వసువనే ధనమును ఇచ్చుటకు, వీతామ్=ఆజ్యమును త్రాగుదురుగాక. యజ=ఓ హోతా! దాని కొఱకు యాజ్యను పఠించుము.

తాత్పర్యము : ఉషాసానక్తశబ్దవాచ్యులైన అహోరాత్రాభిమానులగు తృతీయానూయాజదేవతలు ఇరువురును ఈ రోజు ఈ పశుయాగము ప్రవర్తించుచుండగా దేవతలు మొదలగు వారిని ఆహ్వానింతురుగాక. దైవసంబంధమగు ప్రజలందరిని ఆహ్వానించుటకు తప్పకుండా వారి సమీపమునకు గొప్పగా వెళ్ళెదరుగాక. వారు స్వయముగ చక్కటి ప్రీతిగలవారు, విముఖత లేనివారు, చక్కగ ప్రారంభించి నిర్వహించగలవారు. ధనప్రదాత అయిన దేవునికి ధనమునిచ్చుటకు ఆజ్యమును త్రాగుదురుగాక. దానికొఱకు ఓ హోతా! యాజ్యను పఠించుము. ఇది తృతీయ ప్రైషమంత్రము.

4. మంత్రము : **దేవీ జోష్ట్రీ వసుధితీ యయోరన్యా కఘా ద్వేషాగ్ంసి యూయవదన్యావక్షద్వసు వార్యాణి**

యజమానాయ వసువనే వసుధేయస్య వీతాం యజ, ఇతి ।

అర్థము : జోష్ట్రీ=జోష్ట్రీశబ్దవాచ్యులగు చతుర్థానూయాజదేవమూర్తులు, దేవీ=ఇరువురు దేవతలు, వసుధితీ=సుఖప్రాప్తికలవారు. యయోః=ఆ ఇద్దరు జోష్ట్రీదేవతలలో, అన్యా=ఒక దేవత, అఘా=పాపములను, ద్వేషాంసి=ద్వేషించవలసిన రక్షోగ్రహాదులను, యూయవత్=వేఱు చేయుగాక, నాశనము చేయుగాక. అన్యా=మఱియొక జోష్ట్రీదేవత, యజమానాయ=యజమాని కొఱకు, వార్యాణి= వరించదగిన, వసు=ధనములను, ఆవక్షత్=అన్ని వైపుల అందజేస్తుంది.

తాత్పర్యము : జోష్ట్రీశబ్దవాచ్యులైన చతుర్థానూయాజ దేవమూర్తులు ఇరువురు దేవతలు సుఖప్రాప్తికలవారు. ఆ ఇరువురిలో ఒక దేవత పాపములను, ద్వేషించ వలసిన రక్షోగ్రహాదులను వేఱుచేయుగాక, నాశనము చేయుగాక అని అర్థము. మఱియొక జోష్ట్రీదేవత యజమాని కొఱకు వరించవలసిన ధనములను అన్నివైపుల అందజేస్తుంది. ఇది చతుర్థ ప్రైషమంత్రము.

5. మంత్రము : **దేవీ ఊర్జాహుతీ ఇషమూర్జమన్యా కవక్షత్సగ్ధిగ్ం సపీతిమన్యా నవేన పూర్వం దయమానా స్యామ**

పురాణేన నవం తామూర్జమూర్జాహుతీ ఊర్జయమానే అధాతాం వసువనే వసుధేయస్య వీతాం

యజ, ఇతి ।

అర్థము : ఊర్జాహుతీ=ఊర్జాహుతీశబ్దవాచ్యలగు పంచమానూయాజదేవతలు, దేవీ=ఇరువురు స్త్రీమూర్తులు కలరు. వారిలో, అన్యా=ఒక దేవత, ఇషమ్=అన్నమును, ఊర్జమ్=క్షీరాది రసమును కూడ, ఆవక్షత్=తీసుకొని వస్తుంది. అన్యా=మఱియొక దేవత, సర్పిమ్=సహభోజనమును, సపీతిమ్=సహపానమును, రెండింటిని కూడ, ఆవక్షత్=అందజేస్తుంది. వారి అనుగ్రహము వలన మేము, నవేన=క్రొత్తధాన్యముతో కూడ, పూర్వం=పాతధాన్యమును, దయమానాః=రక్షిస్తూ, స్యామ=ఉండెదముగాక. అట్లే, పురాణేన=పాతధాన్యముతో పాటు, నవమ్=క్రొత్త ధాన్యమును, దయమానాః=రక్షిస్తూ, స్యామ=ఉండెదము గాక. ఊర్జాహుతీ= ఊర్జాహుతీ అనుపేరుగల దేవతలు, తామ్=కొత్త, పాత ధాన్యజాతిని వృద్ధి చెందించుచూ, బహుప్రకారముల పూర్ణముగ, ఊర్జమ్=అన్నసమృద్ధిని, ఊర్జయమానే=సమస్తలోకమునకు సంపాదించి పెట్టుచు, మాకు కూడ, అధాతామ్=సంపాదించి పెట్టెదరుగాక.

తాత్పర్యము : ఊర్జాహుతీ శబ్దవాచ్యులైన పంచమానూయాజ దేవతలిద్దరు స్త్రీమూర్తులున్నారు. వారిరువురిలో ఒక దేవత అన్నమును, క్షీరాది రసమును కూడ తీసుకొని వస్తుంది. మఱియొక దేవత సహభోజనమును, సహపానమును రెండింటిని కూడ అందజేస్తుంది. వారిరువురి స్త్రీ దేవతల అనుగ్రహమువలన మేము క్రొత్త ధాన్యముతో కూడ పాత ధాన్యమును రక్షిస్తూ, ధాన్యపుగాదెలలో నిల్వచేస్తూ ఉండెదము గాక. అట్లే పాత ధాన్యముతోపాటు క్రొత్త ధాన్యమును రక్షిస్తూ ఉండెదము గాక. ఊర్జాహుతీ అను పేరుగల స్త్రీ దేవతలు క్రొత్త, పాత ధాన్యజాతిని వృద్ధిచెందిస్తూ, బహుప్రకారముల క్రొత్త, పాతధాన్యములతో పూర్ణముగ అన్న సమృద్ధిని సమస్త లోకమునకు సంపాదించి పెట్టుచూ మాకు కూడ సంపాదించి పెట్టెదరుగాక. ఇది పంచమ ప్రైషమంత్రము.

6. మంత్రము : దేవా దైవ్యాహోతారా నేష్టారా పోతారా హతాఘశగ్ంసావాభరద్వసూ వసువనే వసుధేయస్య వీతాం యజ, ఇతి ।

అర్థము : దైవ్యాహోతారా=దైవ్యహోతృశబ్దవాచ్యుడైన షష్ఠానూయాజ దేవునికి రెండు దేహములు కలవు. దేవా=ఆ దేహములను ధరించు దేవులు ఇరువురు, నేష్టారా=యజ్ఞమును నిర్వహించువారు, పోతారా=శుద్ధిచేయువారు, హతాఘశంసా=పాపబుద్ధులను నాశనము చేసినవారు, ఆభరద్వసూ=ధనమును సంపాదించినవారూ, వీతామ్=హోమద్రవ్యమును (ఆజ్యము మొదలగువానిని) స్వీకరించెదరుగాక. వసుధేయస్య, వసువనే, వీతామ్, యజ.

తాత్పర్యము : దైవ్యహోతృశబ్దవాచ్యుడైన షష్ఠానూయాజ దేవునికి రెండు దేహములున్నవి. ఆ దేహములను ధరించు దేవులిరువురు యజ్ఞమును నిర్వహించువారు, శుద్ధిచేయువారు, పాపబుద్ధులను నాశనము చేసినవారు, ధనమును సంపాదించినవారు. వారిరువురు ధనప్రదాత అయిన దేవునికి ధనము నిచ్చుటకు ఆజ్యమును త్రాగుదురు గాక. దానికొఱకు ఓ హోతా! యాజ్యను పఠించుము. ఇది షష్ఠమ ప్రైషమంత్రము.

7. మంత్రము : దేవీస్తిస్రస్తిస్రో దేవీరిడా సరస్వతీ భారతీ ద్యాం భారత్యాదిత్యైరస్ప్రుక్షత్సరస్వతీమగ్ం రుద్రైర్యజ్ఞ మావీదిహైవేడయా వసుమత్యా సధమాదం మదేమ వసువనే వసుధేయస్య వియన్తు యజ, ఇతి ।

అర్థము : దేవీస్తిస్రః=ఇడ, సరస్వతి, భారతి పేర్లతో కూడిన ముగ్గురు స్త్రీ దేవతలు సప్తమానూయాజ దేవతలు. భారతీ= వారిలో భారతీదేవి, ఆదిత్యైః=ఆదిత్యులతోపాటు, ద్యామ్=స్వర్గలోకమును, అస్ప్రుక్షత్ =స్పృశించు గాక. సరస్వతీ=సరస్వతీదేవి, రుద్రైః=రుద్రులతోపాటు, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, ఆవీత్ =రక్షించు గాక. మేము, ఇహైవ= ఇచ్చటనే, వసుమత్యా=ధనముతో కూడిన, ఇడయా=ఇడాదేవితో, సధమాదమ్ =ఒకేచోట హర్షము కలుగునట్లు, మదేమ=తృప్తులుగా ఉండెదము. వసుధేయస్య, వసువనే, వియన్తు, యజ.

తాత్పర్యము : ఇడ, సరస్వతి, భారతి అను పేర్లుగల ముగ్గురు స్త్రీ దేవతలు సప్తమానూయాజ దేవతలు. వారిలో ఒక్కొక్క దేవత ముగ్గురు మూర్తులను కలిగి ఉండుటవలన మరల 'తిస్రో దేవీః' అని పేర్కొనబడుచున్నారు. వారిలో భారతీదేవి ఆదిత్యులతో పాటు స్వర్గలోకమును స్పృశించుగాక. హవిర్భవ్యముతో దేవతలను తృప్తి పరచుటకు అచ్చటికి వెళ్ళుగాక. సరస్వతీదేవి రుద్రులతో కలసి ఈ యజ్ఞమును రక్షించుగాక. ఇచ్చటనే ఉండి ఈ యజ్ఞమును నిర్వర్తించుగాక. మేము ఇచ్చటనే ధనముతో కూడిన ఇడాదేవితో పాటు ఒకే చోట హర్షము కలుగునట్లు తృప్తులుగా ఉండెదము. ఇచ్చటనే మమ్ములను యజ్ఞఫలముతో కూడిన వారుగ చేయుగాక అని అర్థము. ఇది సప్తమ ప్రైషమంత్రము.

8 మంత్రము : దేవో నరాశగ్ంస్త్రిశీర్షా షడక్షిః శతమిదేనగ్ం శితిపృష్ఠా ఆదధతి సహస్రమీం ప్రవహన్తి మిత్రావరుణేదస్య హోత్రమర్షతో బృహస్పతిః స్తోత్రమశ్వినా ऽऽధ్వర్యవం వసువనే వసుధేయస్య వేతు యజ, ఇతి ।

అర్థము : దేవో నరాశంసః=నరాశంసుడను పేరుగల అష్టమానూయాజదేవుడు, త్రిశీర్షా=మూడు శిరస్సులు, షడక్షిః= ఆరు నేత్రములతో కూడి ఉన్నాడు. ఈ నరాశంసుని, శతమిత్=నూరుసంఖ్యలతో కూడిన, శితిపృష్ఠాః= తెల్లని పృష్ఠభాగములు గల గోవులు, ఆదధతి=అభిముఖముగ ధరించుచున్నవి. సహస్రమీమ్= వెయ్యి సంఖ్యతో కూడిన తెల్లని పృష్ఠభాగములుగల గోవులు, ప్రవహన్తి =యజ్ఞాత్మకుడైన ఈ నరాశంసుని ఫలసాధన సమర్థునిగ చేయుచున్నవి. మిత్రావరుణేత్ =మిత్రావరుణులే, అస్య=ఈ నరాశంసునికి, హోత్రమ్=హోమమును చేయుటకు, అర్షతః=అర్హులైయున్నారు. బృహస్పతిః=బృహస్పతియే, స్తోత్రమ్= స్తోత్రము చేయుటకు అర్హుడు. అశ్వినౌ=అశ్వినీదేవతలే, ఆధ్వర్యవమ్= ఆధ్వర్యవము చేయుటకు అర్హులై ఉన్నారు వసుధేయస్య, వసువనే, వేతు, యజ.

తాత్పర్యము : నరాశంసుడనే అష్టమానూయాజదేవుడు మూడు శిరస్సులు, ఆరు నేత్రములు కలవాడు. తెల్లని పృష్ఠ భాగములుగలవి, యజ్ఞమునందు దక్షిణలకు యోగ్యమైన నూరు గోవులు ఈ నరాశంసుని అభిముఖముగ ధరించుచున్నవి. తెల్లనిపృష్ఠభాగములుగల వెయ్యి గోవులు యజ్ఞాత్మకుడగు ఈ నరాశంసుని ఫలసాధన

సమర్థనిగ చేయుచున్నవి. మిత్రావరుణులే ఈ నరాశంసునికి హోమము చేయుటకు అర్హులు, వేఱొకరు కాదు. బృహస్పతియే స్తోత్రము చేయుటకు అర్హుడు. అశ్వినీ దేవతలే ఆధ్వర్యవము చేయుటకు అర్హులు. ఇది అష్టమ ప్రైషమంత్రము.

9. మంత్రము : **దేవో వనస్పతిర్వర్షప్రావా ఘృతనిర్ణిగ్భ్యామగ్రేణాస్పృక్షదాన్తరిక్షం మధ్యేనా ऽऽప్రాः**

పృథివీముపరేణాదృగ్ంహీద్వసువనే వసుధేయస్య వేతు యజ, ఇతి ।

అర్థము : దేవో వనస్పతిः=వనస్పతియను పేరుగల నవమానూయాజ దేవుడు, వర్షప్రావా =యజ్ఞముద్వారా వర్షమును పూరించును, కురిపించును. ఈతడు, ఘృతనిర్ణిక్=ఆజ్యమును శుద్ధిచేయువాడు. యూపస్వరూపుడగు ఈ దేవుడు, ద్యామ్ = స్వర్గలోకమును, అగ్రేణ = తన అగ్రభాగముచే, అస్పృక్షత్ =స్పృశించుగాక. మధ్యేన= మధ్యభాగముచే, అన్తరిక్షమ్ =ఆకాశమును, ఆప్రాः =పూరించుగాక. పృథివీమ్ =భూమిని, ఉపరేణ= తక్షణరహితమగు మూలప్రదేశముచే, అదృంహీత్=దృఢముగ చేయుగాక. వసుధేయస్య, వసువనే, వేతు, యజ.

తాత్పర్యము : వనస్పతి అను పేరుగల నవమానూయాజ దేవుడు యజ్ఞయు ద్వారా వర్షమును కురిపించును. ఆజ్యమును శుద్ధి చేయును. యూప స్వరూపుడైన ఈ దేవుడు తన అగ్రభాగముచే స్వర్గమును స్పృశించుగాక. మధ్య భాగముచే ఆకాశమును పూరించుగాక. తక్షణరహితమగు మూలప్రదేశముచే భూమిని దృఢముగచేయుగాక. ఇది నవమ ప్రైషమంత్రము.

10. మంత్రము :**దేవం బర్హిర్వారితీనాం నిధే ధాసి ప్రచ్యంతీనామప్రచ్యుతం నికామధరణం పురుస్పార్హం యశస్వదేనా**

బర్హిష్మా ऽన్యా బర్హీగ్ంష్యభిష్యామ వసువనే వసుధేయస్య వేతు యజ, ఇతి ।

అర్థము : బర్హిः=బర్హి అను పేరుగల దశమానూయాజ దేవతారూపము, దేవమ్ =ప్రకాశించుచూ, వారితీనామ్ = జలముల గమనములను, నిధే= సంపాదించుటకొఱకు, ధాసి= తన మనస్సును ధరింపజేయుచున్నది. ఆ బర్హిస్సు (దర్భ), ప్రచ్యుతీనామ్ =వినాశకరవస్తువులలో, అప్రచ్యుతమ్=అవినాశకారణము. నికామధరణమ్=స్వేచ్ఛగ అన్ని వస్తువులను ధరించుటకు సమర్థమైనది. పురుస్పార్హమ్=అనేకమందిచే కోరదగినది. యశస్వత్ =యశస్సును కలుగజేయునది. ఏనా బర్హిషా= ఈ బర్హిస్సుకు అభిమాని దేవునిచే, అన్యా బర్హీంషి=ఇతర యజమానులకు సంబంధించిన యజ్ఞనిష్ఠములగు బర్హిస్సులను, అభిష్యామ= తిరస్కరించుటకు మేము సమర్థులము అగుదుము గాక. వసుధేయస్య, వసువనే, వేతు, యజ.

తాత్పర్యము : బర్హి అను పేరుగల దశమానూయాజదేవతారూపము ప్రకాశిస్తూ నీటిగమనములను సంపాదించుటకై తన మనస్సును ధరింపజేయుచున్నది. ఆ బర్హిస్సు ఎటువంటిదనగా, వినాశకర వస్తువులలో వినాశము లేకుండుటకు కారణమైనది, స్వేచ్ఛగ అన్ని వస్తువులను ధరించుటకు సమర్థమైనది, అనేకమందిచే

కోరదగినది, యశస్సును కలుగజేయునది. ఈ బర్హిరభిమాని దేవునిచే ఇతర యజమానులకు సంబంధించిన యజ్ఞనిష్ఠములగు బర్హిస్సులను తిరస్కరించుటకు మేము సమర్థులమగుదుము గాక. ఇది దశమ ప్రైషమంత్రము.

11. మంత్రము : **దేవో అగ్నిః స్విష్టకృత్సుద్రవిణా మన్ద్రః కవిః సత్యమన్మా కయజీ హోతా హేతుర్హోతురాయజీయాన గ్నే యాన్దేవానయాడ్యాగ్ం అపిప్రేర్యే తే హోత్రే అమత్సత తాగ్ం ససనుషీగ్ం హోత్రాం దేవంగమాం దివి దేవేషు యజ్ఞమేరయేమగ్ం స్విష్టకృచ్చాగ్నే హోతా కభూర్వసువనే వసుధేయస్య నమోవాకే వీహియజ (1), ఇతి ।**

యజైకం చ ।

దేవం బర్హిర్దేవీర్ద్వారో దేవీ ఉషాసానక్తా దేవీ జోష్ట్రీ దేవీ ఊర్జాహుతీ దేవా దైవ్యాహోతారా దేవీస్తిస్రస్తిస్రో దేవీర్దేవో నరాశగ్ంసో దేవో వనస్పతిర్దేవం బర్హిర్వారితీనాం దేవో అగ్నిః స్విష్టకృత్సుద్రవిణా వీహియజ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే త్రయోదశోకనువాకః ॥౧౩॥

అర్థము : దేవో అగ్నిః స్విష్టకృత్=స్విష్టకృత్ అను పేరుగల అగ్నిదేవుడు, సుద్రవిణా=శుభప్రదమైన ధనము కలవాడు. మన్ద్రః=హర్షించు స్వభావము కలవాడు, కవిః=విద్వాంసుడు, సత్యమన్మా= సత్యమునే పలుకువాడు, ఆయజీ=శాస్త్రమర్యాదచే హోమద్రవ్యమును సమర్పించువాడు, హోతా=దేవతలను ఆహ్వానించువాడు, హోతుర్హోతురాయజీయాన్=లోకమునందలి హోతలందఱికంటె గొప్పగ శాస్త్రీయ మర్యాదను ఉల్లంఘించని హోమకర్త. హే అగ్నే!=ఓ అగ్నీ! ఇటువంటి నీవు, యాన్ దేవాన్=ఏ దేవతలను గూర్చి, అయాట్ =హోమద్రవ్యమును సమర్పించితివో, యాన్ దేవాన్ =ఏ దేవతలను, అపిప్రేః= సంతుష్టులను చేసితివో, యే=ఏ దేవతలు, తే=నీ యొక్క, హోత్రే=హోమకృత్యమునందు, అమత్సత=హర్షమును పొందిరో, దివి=స్వర్గలోకమునందుగల, దేవేషు=దేవతల మధ్యన, ససనుషీమ్=హవిర్ద్రవ్యములను సమర్పించు, దేవంగమామ్=దేవతలను గూర్చి ప్రవర్తించు, తాం హోత్రామ్=హోతృక్రియయగు, ఇమం యజ్ఞమ్=మా ఈ యజ్ఞమును గూర్చి, ఏరయ=అభిముఖముగ పొందునట్లు చేయుము. హే అగ్నే! ఓ అగ్నీ! నీవు, స్విష్టకృత్ =స్విష్టకృత్ అను పేరుగల, హోతా చ= హోమకర్తవును, అభూః= అయి ఉన్నావు.

అందువలన, నమోవాకే= యజమాని నమస్కారవచనము పలుకుచుండగా, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమును ఇచ్చుట కొఱకు, వీహి=అగ్నియందు సమర్పించబడు ఆజ్య రూపమగు ఈ ద్రవ్యమును భక్షించుము. యజ =ఓ మనుష్యహోతా! దానికొఱకు నీవు యాజ్యమంత్రమును పఠించుము.

తాత్పర్యము : స్విష్టకృత్తనే పేరుగల అగ్నిదేవుడు శుభప్రదమైన ధనము కలవాడు, హర్షించు స్వభావము కలవాడు, విద్వాంసుడు, సత్యమునే పలుకువాడు, శాస్త్రమర్యాదతో హోమద్రవ్యమును సమర్పించువాడు, దేవతల నాహ్వానించువాడు, లోకంలోని హోతలందఱికంటె గొప్పగ శాస్త్రీయ మర్యాదను ఉల్లంఘించని హోమకర్త, ఓ అగ్నీ! ఇటువంటి నీవు ఏ దేవతలను గూర్చి హోమద్రవ్యమును సమర్పించినావో, ఏ దేవతలను సంతుష్టులను చేసినావో, ఏ దేవతలు నీ హోమకృత్యమునందు హర్షమును పొందినారో, స్వర్గలోకంలోని దేవతల మధ్య హవిర్ద్రవ్యమును సమర్పించు, దేవతలను గూర్చి ప్రవర్తించు, హోతృ క్రియయగు ఈ మా యజ్ఞమునుగూర్చి అభిముఖముగ పొందునట్లు చేయుము. మా యజ్ఞమునందు ఎల్లప్పుడు సంతోషకరమగు హోతృక్రియను నీవు అనుష్ఠించెదవు అని యర్థము. ఓ అగ్నీ! నీవు స్విష్టకృత్తనుపేరుగల హోమకర్తవై ఉన్నావు. ఎట్లనగా, మా కిష్టమైనది, శుభకరమైనది, నీ చేత చేయబడినది, అటువంటి హోమమునకు కర్తవైనావు. అందువలన యజమాని నమస్కార వచనము పలుకుచుండగా, ధనప్రదాత అయినదేవునికి ధనమునిచ్చుటకై అగ్నియందు సమర్పించబడు ఆజ్యరూపమగు ఈ ద్రవ్యమును భక్షించుము. (ఆజ్యమును త్రాగుము). ఓ మనుష్యహోతా! దాని కొఱకు నీవు యాజ్యమంత్రమును పఠించుము. ఇది ఏకాదశ ప్రైషమంత్రము.

కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
త్రయోదశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
చతుర్దశోఽనువాకః

1. మంత్రము : **దేవం బర్హిః । వసువనే వసుధేయస్య వేతు । దేవీర్ద్వారః । వసువనే వసుధేయస్య వియన్తు ।**

దేవీ ఉషాసానక్తా । వసువనే వసుధేయస్య వీతామ్ । దేవీ జోష్ట్రీ వసువనే వసుధేయస్య వీతామ్ ।

దేవీ ఊర్జాహుతీ । వసువనే వసుధేయస్య వీతామ్ (1) । దేవా దైవ్యా హోతారా । వసువనే వసుధేయస్య

వీతామ్ । దేవీస్తిస్రస్తిస్రో దేవీః । వసువనే వసుధేయస్య వియన్తు । దేవో నరాశగ్ంసః । వసువనే

వసుధేయస్య వేతు । దేవో వనస్పతిః । వసువనే వసుధేయస్య వేతు । దేవం బర్హిర్వారితీనామ్ ।

వసువనే వసుధేయస్య వేతు (2) । దేవో అగ్నిః స్విష్టకృత్ । సుద్రవిణా మన్ద్రః కవిః ।

సత్యమన్మాకయజీ హోతా । హోతుర్హోతురాయజీయాన్ । అగ్నేయాన్దేవానయాట్ ।

యాగ్ం అపిప్రేః । యో తే హోత్రే అమత్సత । తాగ్ం ససనుషిగ్ం హోత్రాం దేవంగమామ్ ।

దివి దేవేషు యజ్ఞమేరయేమమ్ । స్విష్టకృచ్ఛగ్నే హోతాకభూః । వసువనే వసుధేయస్య

నమోవాకే వీహి (3), ఇతి ।

వీతాం వేత్వభూరేకం చ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే చతుర్దశోఽనువాకః ॥౧౪॥

వేదార్థదీపిక

అవతారిక: త్రయోదశానువాకమునందు మైత్రావరుణ ప్రైషమంత్రములు, అనూయాజ విషయములు చెప్పబడినవి. చతుర్దశానువాకమునందు హోత పఠించవలసిన యాజ్యలు, అనూయాజవిషయములు చెప్పబడుచున్నవి. ఇవి మొత్తము ఏకాదశ యాజ్యలు.

అర్థము : 1. దేవం బర్హిః=ప్రకాశించు స్వభావము కల ప్రథమానూయాజ స్వరూపము బర్హిస్సును పేరు గలది, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమును ఇచ్చుటకు, వేతు=ఆజ్యమును త్రాగుగాక. ఇది ప్రథమ యాజ్య.

2. దేవీర్ద్వారః=ద్వారశబ్దముచే చెప్పబడు స్త్రీమూర్తులైన ద్వితీయానూయాజదేవతలు, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమును ఇచ్చుటకు, వియన్తు=ఆజ్యమును త్రాగుదురుగాక. ఇది ద్వితీయ యాజ్య.

3. దేవీ ఉషాసానక్తా=ఉషాసానక్తశబ్దవాచ్యలగు అహోరాత్రాభిమానులగు తృతీయానూయాజ దేవతలు ఇరువురును, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనము నిచ్చుటకు, వీతామ్ = ఆజ్యమును త్రాగుదురుగాక. ఇది తృతీయ యాజ్య.

4. దేవీజోష్ట్రీ=జోష్ట్రీశబ్దవాచ్యలగు చతుర్థానూయాజ దేవమూర్తులైన ఇరువురు దేవతలు, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమును ఇచ్చుటకు, వీతామ్=ఆజ్యమును త్రాగుదురుగాక. ఇది చతుర్థయాజ్య.

5. దేవీ ఊర్జాహుతీ=ఊర్జాహుతీ శబ్దవాచ్యలగు పంచమానూయాజ దేవతలు ఇరువురు స్త్రీమూర్తులు, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమును ఇచ్చుటకు, వీతామ్=ఆజ్యమును త్రాగుదురు గాక. ఇది పంచమయాజ్య.

6. దేవా దైవ్యా హోతారా=దైవ్యహోతృశబ్దవాచ్యులగు దేవులు ఇరువురు, షష్ఠానూయాజ దేవుని యొక్క రెండు దేహములను ధరించువారు, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమునిచ్చుటకు, వీతామ్=ఆజ్యమును త్రాగుదురుగాక. ఇది షష్ఠమ యాజ్య.

7. దేవీస్తిస్రఃస=ఇడ, సరస్వతి, భారతి అను పేర్లు గల ముగ్గురు స్త్రీ దేవతలు, సప్తమానూయాజ దేవతలు. వారిలో ఒక్కొక్క దేవత ముగ్గురు మూర్తులను కలిగి ఉండుటవలన మరల 'తిస్రో దేవీః' అని పేర్కొనబడుచున్నారు. వారు, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనము నిచ్చుటకు, వియన్తు=ఆజ్యమును త్రాగుదురుగాక. ఇది సప్తమ యాజ్య.

8. దేవోనరాశంసః=నరాశంసుడను పేరుగల అష్టమానూయాజ దేవుడు, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమునిచ్చుటకు, వేతు=ఆజ్యమును త్రాగుగాక. ఇది అష్టమ యాజ్య.

9. దేవో వనస్పతిః=వనస్పతి అను పేరుగల నవమానూయాజ దేవుడు, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమునిచ్చుటకు, వేతు=ఆజ్యమును త్రాగుగాక. ఇది నవమ యాజ్య.

10. బర్హిః=బర్హి అను పేరుగల దశమానూయాజ దేవతారూపము, దేవమ్=ప్రకాశించుచూ, వారితీనామ్=జలముల గమనములను, విధే=సంపాదించుటకొఱకు, ధాసి =తన మనస్సును ధరింపజేయుచున్నది. ఆ దేవతారూపము, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమునిచ్చుటకు, వేతు=ఆజ్యమును త్రాగుగాక. ఇది దశమ యాజ్య.

11. దేవో అగ్నిః స్విష్టకృత్ = స్విష్టకృత్అను పేరుగల అగ్నిదేవుడు, సుద్రవిణా=శుభప్రదమైన ధనము కలవాడు, మన్ద్రః=హర్షించు స్వభావము కలవాడు, కవిః విద్వాంసుడు, సత్యమన్మా=సత్యమునే పలుకువాడు. ఆయజీ=శాస్త్రమర్యాదచే హోమద్రవ్యమును సమర్పించువాడు, హోతా=దేవతలను ఆహ్వానించువాడు, హోతుర్హోతురాయజీయాన్=లోకమునందలి హోతలందరికంటె గొప్పగ శాస్త్రీయ మర్యాదను ఉల్లంఘించని హోమకర్త. హే అగ్నే!=ఓ అగ్నీ! ఇటువంటి నీవు, యాన్ దేవాన్=ఏ దేవతలను గూర్చి, అయాట్=హోమద్రవ్యమును సమర్పించితివో, యాన్ దేవాన్ =ఏ దేవతలను అపిప్రేః= సంతుష్టులను చేసితివో, యే=ఏ దేవతలు, తే=నీ యొక్క, హోత్రే= హోమ కృత్యమునందు, అమత్సత=హర్షమును పొందిరో, దివి=స్వర్గలోకమునందుగల, దేవేషు=దేవతల మధ్యన, ససనుషీమ్= హవిర్ద్రవ్యములను సమర్పించు, దేవంగమామ్= దేవతలను గూర్చి ప్రవర్తించు, తాం హోత్రామ్= హోతృక్రియయగు, ఇమం యజ్ఞమ్=మా ఈ యజ్ఞమును గూర్చి, ఏరయ=అభిముఖముగ పొందునట్లు చేయుము. హే అగ్నే! =ఓ అగ్నీ! నీవు, స్విష్టకృత్ =స్విష్టకృత్ అను పేరుగల, హోతా చ= హోమకర్తవును, అభూః=అయి ఉన్నావు. అందువలన, నమోవాకే=యజమాని నమస్కారవచనము పలుకుచుండగా, వసుధేయస్య=ధనప్రదాత అయిన దేవునికి, వసువనే=ధనమును ఇచ్చుట కొఱకు, వీహి=అగ్నియందు సమర్పించబడు ఆజ్యరూపమగు ఈ ద్రవ్యమును భక్షించుము. ఇది ఏకాదశ యాజ్య.

తాత్పర్యము : పూర్వానువాకములోని ప్రైష మంత్రములకు వలెనే ఈ అనువాకములోని యాజ్య మంత్రములకు తాత్పర్యములను అన్వయించుకొనవలెను. ప్రైషరూపము లేకపోవుటవలన ఇక్కడ 'యజ' అనే పదము ప్రయోగించబడలేదు.

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున షష్ఠ ప్రపాఠకమునందు
చతుర్దశానువాకము సమాప్తము.

అథ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే
పఞ్చదశోఽనువాకః

1. మంత్రము : **అగ్నిమద్య హోతారమవృణీతాయం యజమానః పచన్పక్తీః పచన్పురోడాశం బధ్నన్నిన్ద్రాగ్నిభ్యాం ఛాగగ్ం సూపస్థా అద్య దేవో వనస్పతిరభవదిన్ద్రాగ్నిభ్యాం ఛాగేనాఘుస్తాం తం మేదస్తః ప్రతి పచతా కగ్రభీష్టామవీవృధేతాం పురోడాశేన త్వామద్యర్ష ఆర్షేయర్షీణాం నపాదవృణీతాయం యజమానో బహూభ్య ఆసంగతేభ్య ఏష మే దేవేషు వసు వార్యాయక్ష్యత ఇతి తా యా దేవా దేవదానాన్యదుస్తాన్యస్మా ఆ చ శాస్యా కచ గురస్వేషితశ్చ హోతరసి భద్రవాచ్యాయ ప్రేషితో మానుషః సూక్తవాకాయ సూక్తా బ్రూహి (1), ఇతి ।**

అగ్నిమద్యైకమ్ ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠప్రపాఠకే పఞ్చదశోనువాకః ॥౧౫॥

వేదార్థదీపిక

అవతారిక : చతుర్దశానువాకమునందు అనూయాజలకు యాజ్యలు అభిహితములైనవి. పంచదశానువాకమునందు సూక్తవాకవిషయమైన మైత్రావరుణ ప్రైష చెప్పబడుచున్నది. 'యదా జానాతి సూక్తవాకాయ సూక్తా ప్రేష్యేతి తన్మైత్రావరుణః ప్రేష్యతి ''అగ్నిమద్య' ఇతి'' అని కల్పసూత్రము.

అర్థము : అద్య=ఈ రోజు, అయం యజమానః=ఈ యజమానుడు, అగ్నిమ్=అగ్నినే, హోతారమ్=హోమనిష్పాదకునిగ, అవృణీత=వరించెను. పక్తీః=పచనము చేయవలసిన హవిస్సులను పచనము చేయుచు, పురోడాశమ్=పురోడాశమును విశేషముగ పచనము చేయుచు, ఇన్ద్రాగ్నిభ్యామ్=ఇంద్రాగ్నుల కొఱకు, ఛాగమ్=మేకపోతును యూపము (స్తంభము) నందు, బధ్నన్ =బంధించుచు, అద్య=ఈ రోజు, వనస్పతిర్దేవః=యూపరూపుడగు వనస్పతి దేవుడు, ఇన్ద్రాగ్నిభ్యామ్=ఇంద్రాగ్నుల కొఱకు, ఛాగేన=మేకపోతు నిమిత్తముగ, దాని వధ కొఱకు, సూపస్థా=సుస్థిరమగు స్థితిని, అభవత్=పొందెను. తమ్=ఆ పశువును, మేదస్తః=వపతో ఆరంభించి, ఆ ఇంద్రాగ్నులు, అఘుస్తామ్=భక్షించిరి, పచతా=పక్వములగు అన్ని హవిస్సులను, ప్రత్యగ్రభీష్టామ్=ఇంద్రాగ్నులు ప్రతిగ్రహించిరి, స్వీకరించిరి. ఇంకను వారు,

పురోడాశేన=పురోడాశముచేత, తమను, అవీవృధేతామ్=వృద్ధిపఱుచుకొనిరి. అద్య=ఈ కర్మయందు, హే ఋషే!=అతీంద్రియద్రష్టవగు ఓ హోతా!, త్వామ్=నిన్ను, అయం యజమానః=ఈ యజమాని, అవృణీత=వరించెను. ఆర్షేయ!=ఓ ఋషికులోద్భవా!, ఋషీణాం నపాత్=ఋషులకు మునిమనుమడా!, ఆసంగతేభ్యః=వచ్చి ఈ కర్మయందు సంబంధము కలిగిన, బహుభ్యః=బహుసంఖ్యాకులగు దేవతలను అర్చించవలెనను అభిప్రాయముతో వరించెను. ఏషః=ఈ హోత, మే=నా యొక్క, వసు=పశురూపమగు ధనమును, వారి=పృషదాజ్యరూపమగు జలమును, దేవేషు=దేవతలయందు, ఆయక్ష్యతే=సమర్పించును. తా యా దేవదానాని=దేవతలకు సమర్పించవలసిన హవిస్సులేవికలవో వాటిని, దేవాః=ఋత్విక్కులు, అదుః= సమర్పించిరి. తాని=ఆ అన్ని హవిస్సుల ఫలములు, అస్మై=ఈ యజమానునికి, ఆచశాస్వ సులభముగ సిద్ధించుగాక అని ఆశీస్సుని అందజేయుము. ఆగురస్వ చ=వాటి సిద్ధి కొఱకు ప్రయత్నము కూడ చేయుము. హే హోతః!=ఓ హోతా!, నీవు నాచే, ఇషితః=కోఱబడితివి, ప్రేరితశ్చాసి=ప్రేరేపించబడితివి. భద్రవాచ్యాయ=శుభకరమైన వచనము కొఱకు, ప్రేషితః=ప్రేరేపించబడిన, మానుషః=మనుష్య సంబంధహోతవగు నీవు, సూక్తవాకాయ=సూక్తముచే వచింపబడు దేవునికి, సూక్తా=''ఇదం ద్యావాపృథివీ'' అను అనువాకములో చెప్పబడిన శుభకరములైన వచనములను, బ్రూహి=చెప్పుము.

తాత్పర్యము : ఈ రోజు ఈ యజమానుడు అగ్నినే హోమ నిష్పాదకునిగ వరించెను. ఆయన పచనము చేయవలసిన హవిస్సులను పచనము చేయుచు, పురోడాశమును విశేషముగ పచనము చేయుచు, ఇంద్రాగ్నుల కొఱకు మేకపోతును యూపము (స్తంభము) నందు బంధించుచు అగ్నిని హోతగా వరించెను. ఈ రోజు యూపరూపుడైన వనస్పతిదేవుడు ఇంద్రాగ్నుల కొఱకు మేకపోతు నిమిత్తముగ దాని వధ కొఱకు సుస్థిరమగు స్థితిని పొందెను. ఆ పశువును ఇంద్రాగ్నులు వపతో ఆరంభించి భక్షించిరి. వారు పక్వములైన హవిస్సుల నన్నింటిని స్వీకరించిరి. ఇంకను వారు పురోడాశముచే తమను వృద్ధిపఱుచుకొనిరి. అతీంద్రియ ద్రష్టవగు ఓ హోతా! ఈ యజమాని ఈ కర్మయందు నిన్ను వరించెను. ఓ ఋషికులోద్భవా! ఋషులకు మునిమనుమడా! (గోత్రప్రవర్తకుడైన ఋషినుండి నాల్గవవాడని అర్థము.) ఎందులకు వరించెననగా, వచ్చి ఈ కర్మయందు సంబంధము కలిగిన బహుసంఖ్యాకులైన దేవతలను అర్చించవలెనను అభిప్రాయముతో వరించెను. ఈ హోత నా పశురూపమైన ధనమును, పృషదాజ్యరూపమైన జలమును దేవతలయందు సమర్పించును. దేవతలకు సమర్పించవలసిన హవిస్సులను ఋత్విక్కులు సమర్పించినారు. ఆ హవిస్సులన్నింటి ఫలములు ఈ యజమానునికి సులభముగ సిద్ధించుగాక అని ఆశీర్వదించుము. వాటి సిద్ధికొఱకు ప్రయత్నము కూడ చేయుము. ఓ హోతా! నీవు నాచే కోఱబడినావు, ప్రేరేపించబడినావు. శుభకరమైన వచనముకొఱకు ప్రేరేపించబడిన మనుష్యహోతవైన నీవు సూక్తముచే వచింపబడు దేవునికి 'ఇదం ద్యావాపృథివీ' అను అనువాకములో చెప్పబడిన శుభకరములైన వచనములను చెప్పుము. ఇది మైత్రావరుణ ప్రైషమంత్రము.

కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ బ్రాహ్మణమునతృతీయ కాండమున షష్ఠప్రపాఠకమునందు
పంచదశానువాకము సమాప్తము.

అ॒ఞ్జ॒న్తి హో॑తా॒ యక్ష॒త్సమి॑ద్ధో అ॒ద్యాగ్నిర॒జైర్ద్దే॒వ్యా జు॒ష॒స్వా క॑వృ॒త్రహ॑ణా గీ॒ర్భిస్త్వ॒గ్ం

హ్యా॑భ॒ర॒త॒ము॒పో॒హ॒య॒ద్దే॒వం బ॒ర్హిః సు॑దే॒వం దే॒వం బ॒ర్హి॒ర॒గ్నిమ॒ద్య ప॑ఞ్చ॒దశ ॥౧౫॥

అ॒ఞ్జ॒న్త్యు॒పా॒వ॒సృ॒జ॒న్వా॒న్యా యు॒వ॒త్కర॑ దే॒వ॒మ॒ష్టా॒త్రి॒గ్ం॒శత్ ।

అ॒ఞ్జ॒న్తి సూ॒క్తా బ్రూ॑హి ।

హరిః॑ ఓమ్ ॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణే తృతీయకాణ్డే షష్ఠః ప్రపాఠకః ॥ 6 ॥

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ బ్రాహ్మణమునందలి తృతీయ కాండములో షష్ఠప్రపాఠకము సమాప్తము.